విజ్ఞాన చంద్రికా మండలి, బెజవాడ

నియమములు.

1 దేశాభివృద్ధి కావశ్యకములైన గ్రంథముల
టించి భాషాభివృద్ధి చేయుటయే యీగ్రంథమాలయొ
యుద్దేశ్యము. ఇందు సంవత్సరమునకు రమారమి 1600
గల గ్రంథములు ప్రకటింపఁబడును.

2 ఇందు దేశముల చరిత్రములును, పదార్థ
రసాయన, జీవ, వృక్ష.. ఆదిగాగల శాస్త్రములు, మహ
ముల జీవచరిత్రములు, సద్గ్రంథముల భాషాంతరీకరణ
[illegible] వలయుఁ బ్రకటింపఁబడును.

3 ఈ గ్రంథమాలలో నిదివఱకు ప్రచురింపఁ
గ్రంథముల నన్నిటిని గొనుట నిశ్చయించి ప్రకటించ
గ్రంథము లన్నిటిని గొనుటకు నొప్పుకొనువారు శా
చందాదారులు.

4 శాశ్వత చందాదారులకు ఈ గ్రంథమాల
గ్రంథములన్నియు చౌకగ నమ్మఁబడును.

5 శాశ్వత చందాదారులు సంవత్సరపు చ
మొదట నీయనక్కఱలేదు. ఒక్కొక్క పుస్తక మచ్చు
గానే అది వాల్యూపేబిల్ పోస్టుద్వారా పంపఁబ
పోస్టేజి చందాదారులే భరింపవలయును.

6. వెనుకటి పుస్తకము లన్నిటిని గొనుచందాదా
ప్రవేశరుసుము నియ్యనక్కఱలేదు. వెనుకటి పుస్త
లక్కఱలేనివారు ప్రవేశరుసుముక్రింద రు 0-8-0 లు చె
వలెను. వెనుకటి పుస్తకములన్నిటి నొక్కసారి కొనలేని



శ్రీ

విజ్ఞానచంద్రికా గ్రంథమాల : ౩౮

వైదిక నిలయము

(ఆర్యుల ఉత్తరధ్రువనివాసము)

ద్వితీయ ముద్రణము.

లోకమాన్య బాలగంగాధరతిలక్

ఆంగ్లేయమున రచించిన "ఆర్కిటిక్ హోం ఇన్ ది వేదాస్"

అను గ్రంథమునకు

సంగ్రహాంధ్రానువాదము.

అనువాదకుడు :

మానికొండ సత్యనారాయణశాస్త్రి బి. ఏ.

విజ్ఞాన చంద్రికా మండలి

వారిచే ప్రకటితము.

బెజవాడ

౧౯[illegible].

వెల చందాదారులకు రు. ౧-౦-౦
" ఇతరులకు ౧-౮-౦

1929

గుంటూరు

చంద్రికాముద్రాక్షరశాలయందు

[illegible] శ్రీని[illegible]గారిచే

ముద్రింపబడెను.

ప్రథమముద్ర[illegible]ము ౧,౦౦౦ ప్రతులు.

విజ్ఞాన చంద్రికా మండలి

(The Telugu Athenæum)

(1860 వ సంవత్సరపు 21 వ నెంబరు శాసనము ప్రకారము
రిజిష్టరు చేయఁబడినది.)

సభా నిర్మాణము

అధ్యక్షుడు :

ఆచంట లక్ష్మీపతి, బి. ఏ., ఎం. బి., సి. ఎం.

కార్యదర్శి :

అయ్యంకి వేంకటరమణయ్య

సభాసదులు :

అయ్యదేవర కాళేశ్వరరావు, బి. ఏ., బి. ఎల్.

శ్రీ రాజా వి. దుర్గాసదాశివేశ్వర ప్రసాద బహద్దరు
జమీందారు

సూరి వేంకట నరసింహశాస్త్రి

[illegible] రామచంద్రరావు

మాడపాటి హనుమంతరావు

కార్యస్థానము :

బెజవాడ.

రాజపోషకులు

శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజాగారు
కే. సి. ఐ. ఇ.

శ్రీ శ్రీ శ్రీ పిఠాపురం మహారాజాగారు

శ్రీ శ్రీ శ్రీ మునగాల రాజాగారు

తొలి పలుకు

ఆర్యుల ఉత్తరధ్రువనివాసమునుగూర్చి విపులముగ లోకమాన్య బాలగంగాధరతిలకుమహాశయులు "ఆర్కిటిక్ హోం ఇన్ ది వేదాస్" అను మహాగ్రంథమును రచియించి యున్నారు. ఆగ్రంథము ననుసరించి, శ్రీ మానవల్లి? సత్యనారాయణశాస్త్రిగారు "వైదికనిలయ" మను గ్రంథమును రచించిరి. దానిని విజ్ఞానచంద్రికాగ్రంథమాలికయం దొక కుసుమముగ ప్రకాశింపజేయుటకు దయతో నంగీకరించి యున్నారు. ఈగ్రంథమునందలి విషయము అగాధమగు వేదవాఙ్మయమునకేగాక, కఠినములగు అనేకభాషల, ఆధునిక శాస్త్రములను సంబంధించియున్నవి. గ్రంథమునందలి [illegible] నానార్థకములు [illegible] పారిభాషికపదములతో నిండియున్నది. ఈగ్రంథము నెల్లరకు సుబోధకముగనుండునట్లు మిక్కిలి సులభశైలితో రచియించినందుకు గ్రంథకర్తకు ఆంధ్రదేశమునకు కృతజ్ఞతాపూర్వకముగ [illegible] [illegible].

[illegible] విషయములు [illegible] మాగ్రంథమాల [illegible] గ్రంథములు [illegible] [illegible]. [illegible] [illegible] కుసుమమును "[illegible]" అను గ్రంథమును [illegible]. [illegible] [illegible] గ్రంథమును [illegible] [illegible] గ్రంథమాల [illegible] కుసుమములు [illegible].

విజ్ఞానచంద్రికామండలి,		ఇట్లు [illegible],
[illegible]		[illegible]
		కార్యదర్శి.

విషయసూచిక

పటముల పట్టిక

* ప్లేటు 8 రెండవ సంపుటములో చూడదగు.

ప్రస్తావన

భారతవర్షము “ బ్రిటిషు ఇండియా ” గాక భారత వర్షముగను, భారతీయులు “ బ్రిటిషు సబ్జక్ట్సు ” గాక భారతీయులుగను నుండియుండినయెడల యీ భూభాగమునెల్ల నేకచ్ఛత్రాధిపతిగ నేలు మహారాజుగనో, ప్రపంచరాజ్యాంగములనెల్ల [illegible] నాట్యమాడించు మహామంత్రిగనో — [illegible] సైన్యాధ్యక్షుడుగనో వేద[illegible] పోషించు [illegible] తన [illegible] — విద్యాసంపద[illegible] విధ శాస్త్రములనెల్ల [illegible] సుధాసముద్రుడై పరి[illegible] [illegible] — [illegible] శ్రీలోకమాన్య తిలక మహారాజువలెనో, [illegible] శ్రీమహారాష్ట్ర [illegible] శ్రీ[illegible] [illegible], [illegible] ప్రభావశాలియగు [illegible] శ్రీబాలగంగాధరునివలెనో, విరాజిల్లుచుండు నాడు [illegible] సంవత్సరముల క్రిందట — 1916 సంవత్సరములో — [illegible]మున

గలిగిన [illegible]

మును [illegible]

ముల [illegible]

నాగరి [illegible]

[illegible] "స్వరాజ్య" [illegible] "[illegible]"

మునకుగూడ [illegible] నిచ్చినను. [illegible]

గ్రంథము [illegible] యుక్తిగను, [illegible]

నిజభావములును, సర్వకాల సర్వావస్థలయందు సమ[illegible]

దేశములవారికి, సమస్త వర్ణములవారికి, సమస్త [illegible]

వారికి వ్యవహారములందు సుగమమును లోకకల్యా[illegible]

ప్రదమును నగు మార్గమును జూపించునట్టి గ్రంథ [illegible]

యుక్తియుక్తియు ననుసరించి [illegible]

శ్రీతిలక్ మహారాజుగారి రాజకీయోపన్యాసములు [illegible]

గించిన మీఁదటనే గలిగినది. ఈగ్రంథరాజమును [illegible]

కొన్నినాళ్లు జూచి యుండకపోయినను, శ్రీతిలక్ మహారాజుగా[illegible]

తమ రాజకీయోపన్యాసములందెల్ల గీతావాక్యములను [illegible]

తిప్పలుగ నుప్పైచి యుండుటచే నేను దాని చదివి మ[illegible]

పరవశుడనై యుంటిని. ఇట్టిస్థితిలో శ్రీవ్యాకరణా[illegible]

బ్రహ్మశ్రీ నోరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే తిలక్ గారి "గీతా[illegible]

రహస్యము" తెలిగింపబడి హావిళ్ళవారిచే ముద్రింపబడి[illegible]

దన్నవార్త పత్రికలో జూచిన మొదటిదినమునుండే నేనాగ్రంథమును తెప్పించుకొని చదువఁబూనితిని. అప్పటినుండియు తిలక్ గారియెడ నాకు గలిగిన పిచ్చ మరింత హెచ్చయ్యెను. ధ్యానము పొంగి పొంగిన మనుష్యునకు ఉన్మాదావస్థ గలుగుట సహజముగాదే. ఉత్కృష్టభక్తిచే గ్రస్తుఁడున్నారు చెప్పినట్లు “స్వరాజ్యవిషయమైకూడ మీరు నిరంతరము – నిలుచున్నను కూర్చున్నను, మేల్కొన్నను నిద్రించుచున్నను, తినుచున్నను త్రాగుచున్నను, సదా యేకధోరణిని స్మరింపుచు మీరు కేవలము వెఱ్ఱివారై పోవలెను; దానియందు మీరు తాదాత్మ్యమును పొందవలె” నని శ్రీతిలక్ గారొకచోట చెప్పియుండిరి. కావున, మూర్తీభవించిన స్వరాజ్యభావమగు శ్రీతిలక్ మహాశయునియందు నాకిట్టి వెఱ్ఱియున్మాదము పుట్టినదన్నచో ఆశ్చర్యపడ నక్కఱ లేదు.

ఇట్టి యపూర్వమగు పరివర్తనము నామనఃక్షేత్రమందు గలిగినప్పటినుండియు వారి గ్రంథముల తెలిగింప బూనితిని. 1916 సం॥ లో మదరాసునందు బి. ఏ. తరగతిలో నుండగ నింటివద్ద తీరికగలిగినప్పుడెల్ల వారి యుపన్యాసముల తెలిగించుచుంటిని. ఇదియైన పిమ్మట విజయవాడయందలికొందరు మిత్రుల ప్రోత్సాహముచే వారిజీవిత చరిత్రను కూడ వ్రాసితిని. పిమ్మట అది 1921 సంవత్సరమందు నేను

'గీతా' రహస్యము మొదలగు మహత్తరగ్రంథరాజములు ప్రచురితమైనవి.

కేవలము రాజకీయములందేగాక సమస్తశాస్త్రములందు తిలకుని యపారప్రతిభ వ్యాపించియుండెను. తిలకు రచించిన యితరగ్రంథములను తెలిసికొనవలెనను నభిలాష నాకు జనించెను. వానిలో పాశ్చాత్యవిద్వాంసుల పండితు లందరిచే కొనియాడఁబడినవి "Arctic Home in the Vedas," and "Orion" అను రెండు గ్రంథరాజములు గలవు. వీనిలో మొదటిదగు Arctic Home (ఉత్తరధ్రువ నిలయము) అను గ్రంథము 1918 సం॥ ప్రాంతమున నాలో [illegible] ఉత్సాహము పుట్టించె [illegible] యందలి అధ్యాయములను [illegible] మొదలిడితిని. అప్పుడప్పుడు కొద్దికొద్దిగ వ్రాయుచు వచ్చుచుంటిని, మొదటి, 4, 5 అధ్యాయములు సాంకేతిక పరిభాషాపదములతో నిండి యుండుట తెలుగునందు తెలుపుట కష్టముగా నుండుటచేతను, నేను యితర వ్యాపారములందు మునిగియుండుటచే తీరిక గలుగమిచేతను, 1922 సంవత్సరము నాటికి 4, 5 అధ్యాయములుమాత్రము పూర్తియయ్యెను. కాని, ఆ సంవత్సరమందు నేనువచ్చిన కొలదిపాటి రాజకీయప్రవృత్తి ఫలితముగ నాకు గలిగిన నవమాసముల కారాగారస్థ బలాత్కార[illegible]

విశ్రాంతి మూలమున నేనీగ్రంథమును సాంతముగ తెలిగించుటకు చక్కని యవకాశము చిక్కినది. ఈగ్రంథమును తిలక్ గారును కారాగారమం దున్నకాలములోనే వ్రాయుటయు, దానిని నేనును కారాగారవాసమందే తెలిగించుటయు జూడ విచిత్రసంఘటనముగ గన్పట్టకమానదు. నిజముగ, నాకీకారాగారవాసమే తటస్థించి యుండనియెడల నేనీగ్రంథమును దీనితోపాటు " Orion " " వేదకాలనిర్ణయ " గ్రంథమును తెలిగింప గలిగెడివాడనో లేదో చెప్పజాలను.

ఈ రెండుగ్రంథముల భాషాంతరీకరణపద్ధతినిగూర్చి నేనిచట కొంత ముచ్చటింపవలసి యున్నది. ఇది కేవలము భాషాంతరీకరణముగాదు-అనుసరణమని చెప్పిన చెప్పవచ్చును. మాతృకలోని భావముల తెలిగించితినిగాని, పదముల తెలిగింప లేదు. గ్రంథమందలి విషయము కట్టుకథవలెనో, లేక నవలవలెనో తేలికగ నెల్లరు చదివి గ్రహించి అవలపారవేయునది గాక, సాంకేతికపరిభాషాపదభూయిష్ఠమై కఠినములగు అనేక భౌతికఆధిభౌతిక శాస్త్రములకును, అగాధమగు వేదవాఙ్మయమునకును సంబంధించినదగుటచే సామాన్యజనులెల్లరికి సులభముగ ఒక్కసారి చదివినంతమాత్రముననే బోధపడి ఆనందమును గలిగించునదిగ నుండజాలదు; యిది నాలుకపై వేసికొనినంతమాత్రముననే రసముప్పతిల్లు ద్రాక్షపండువంటిది కాదు.

బాగుగనే నూతనప్రకారము ప్రకటింపబడెను, ప్రకటనల్పముగను ముద్రించబడిన మొదటి గ్రంథమును నిమిత్తము చేసికొని వ్రాసినపుడు విషయము విస్తారముగ ఉన్నందున పూర్వ గ్రంథము లోని ముఖ్యభాగములను పరిశీలించి, మూల భావములను మాత్రము గ్రహించి, వానికి స్వతంత్రమైన, నా యూహలను చేర్చి నేను యీ గ్రంథమును వ్రాసినాను. ముఖ్యముగ ఉదాహరించిన వ్యాసములను సంక్షిప్తము చేసితిని. భావములు వికాసముగ నుండుటకై పునరుక్తి మానిన పిదప వ్రాసితిని. వ్యాసములయందు సంస్కృతవాక్యములకు భాషాంతరీకరణములతో, నాయీ గ్రంథములందు చెప్పబడిన మాత్రుకలను భాషాంతరీకరణములచే చెప్పవచ్చును.

కారాగారవాసమునుండి బయటికి వచ్చినపిమ్మట కొలది కాలమునకే దానియొద్దృష్టవశమున ప్రకటింపబడిన నా యీ యుపోద్ఘాతముచే "వేదకాలనిర్ణయము" (Orion) గ్రంథము అచ్చుపడినది. కాని, నాయొక్క చాల ముందుగా ప్రారంభించిన యీ "వైదికనిలయము" మాత్రము నేటి వరకు ప్రజలముఖము చూచుట కవకాశము చిక్కినదిగాదు. నేను దీనిని కారాగారవాసమున అస్పష్టముగ చిత్తుకాగితముల మీద పెన్సిలుతో, చాల కొట్టివేతలతో వ్రాసియుంచుటచే

దీనికి నా స్వహస్తముతోనే చాలకాలము పట్టినది. దీని నిమిత్తమైన ద్రవ్యము ముద్రించి ప్రకటించుటకు నాకు లేదే, నేను రాచకీయ ప్రయాణములన్నిటిలో పోయినగ్రామములకెల్ల నావెంట, నా చాలం టీనుసంచిలో వేసికొని, దీనిని తీసికొనిపోయి విశ్రాంతికాలమునకు సత్యాగ్రహ జైళ్లయందును, ప్లాట్‌ఫారములమీదను కూర్చుండి వ్రాతప్రతి వ్రాయుచుండెడివాడను. ఈరీతిగ వ్రాతప్రతి ముగించి యిప్పటికి నాలుగేండ్లయినది. ఈగ్రంథమును ముద్రింపించుటకై యూనివర్సిటీలో నేనుపడినప్రయాస చెప్పనలవిగాదు. నావద్ద తగినధనము లేనందున, – ధనమునకు గొప్ప సాధనములు లేనందున – అనేకమంది స్నేహితులను, ధనాఢ్యులను ఆశ్రయించితిని; కాని, ఫలితము లేకపోయెను. తుదకు, శ్రీజయంతిపురం రాజావారే తిరిగి యూనివర్సిటీవారిని తమ ధనాపేక్షముద్రాశాలయందు నా ముద్రింపించెదమని సెలవిచ్చిరి. ఒక ప్రతిముద్రుచును సాగించుచుండెను. యూనివర్సిటీయందు దర్బు ప్రారంభమయ్యెను. కాని, కొంతకాలమునకు అప్పులగుటచే, వారి ముద్రాశాల కారణాంతరములచే చాలకాలము మూసివేయబడవలసివచ్చెను. అందుచే నా గ్రంథము తిరిగి రెండు సంవత్సరములు మూలబడెను.

తుదకు వ్రాతప్రతి వృథాగా చెడలునదు స్థితికి రావాలెను. గ్రంథమును ప్రారంభించిన యీ పదేండ్లమునందియు

రాపాడిన యీగ్రంథమును [illegible] నా [illegible] గలుగుచున్నప్పుడు "తమంతగను [illegible] లింకెంతగాఁ గుందుదానఁగదా ? "

నా ప్రస్తుతవి[illegible], [illegible] న్నిప్పు డీయవస్థకే [illegible]. [illegible] క్రిందట నెత్తిన[illegible] కాలక్రమమున [illegible]. [illegible] యుత్సాహశక్తులు [illegible]చెను. ఆ [illegible] సోదరులు ఒక్కొక్కరే [illegible]పోయిరి. [illegible] వచ్చెను. నేనును సర్వవిధముల [illegible]. "[illegible] భోగార్థ మర్థలాభేచ్ఛ నా [illegible] లేక" [illegible], "నాయురయు [illegible]లను [illegible] గావున," "యాత్మా[illegible] కంటుదనై దేహాయుం చడిగి" [illegible]. ఇంక యీగూటినుండి స్వేచ్ఛయును నిర్మల[illegible] కెగిరి, స్వాతంత్ర్యగేయముల నాలపించు భాగ్య [illegible] కలదో లేదో ! ఇంతవరకు చేసిన జీవయాత్రయు, [illegible] బాధితమయ్యె, నిరుత్సమును, మధురమును స్వేచ్ఛా[illegible] మునునై యుండెను. [illegible]

పొంది యుండెడువాఁడనో మద్గ్రాహ్యము. మహనీయులచే ప్రసాదింపఁబడిన యట్టి యుత్కృష్టగ్రంథరాజముల తెలిగించి గాని, సొంతగ్రంథముల రచించిగాని ఆంధ్రలోకమునకు ప్రసాదించుభాగ్యము నాకిఁకమీఁద గలుగునో కలుగదో! ప్రస్తుతావస్థ నా కట్టియవకాశముల నొసఁగునని ధైర్యముగ చెప్పఁజాలను.

ఈ గ్రంథరచనము నాజీవితము యొక్క సువర్ణదశ (Golden age) లో ప్రారంభమై, తద్వశాంతమునతోపాటు యిదియు ముగింపునకువచ్చి, ఇప్పుడు అయోమయదశ (Iron age) యందు విడిచిపెట్టఁబడుచున్నది. పురాతన యుత్కృష్టతను ప్రస్తుతదుస్స్థితిని తలంచుకొని కుందుచు భావిసుభోదయమునకై యెదురుచూచుచు కాలముగడుపుచున్న మా యనుంగుతల్లి భారతమాతవలెనే నేనుకూడ యుత్సాహోద్దీపకములను ప్రస్తుతమాంద్యస్థితిని తలపోయుచుండ భావిసుభోదయమునకై నేనును నొకభిక్షువువలె కాలకర్మములకు కట్టువడి యుండెదను.

ఉ॥ " కాఁపులపాలు సేసితివి గర్వమునొందకుమీ సుయోధనా!
యీనెలపట్టులో గడచి యెన్నఁటికైనను వత్తుమే జుమీ
నెనను నీవు ప్రవ్యాప్త మహావిపదబ్ధిని మున్గియుంటచే
నేనును నొక్కభిక్షువున నీకు భయంపడి యుట్టులేఁగెదన్ "


(పాండవాజ్ఞాతవాసము)

నే నిట్టులైతి. పదేండ్లనుండియు అల్లారుముద్దుగ పెంచిన యీబిడ్డను ఆంధ్రమహాజనుల చేతులలో చేయివేసి యప్పగించుచున్నాను. వారును దీనిని తమ పుత్రికవలెనే దిద్దుకొని పాలించుకొందురుగాక!

(తవ పుత్రీవ పాలయ!)

మచిలీపట్టణము,
విభవ సం॥ భాద్రపద బ ౩౦
స్థిరవారము.
13-10-'28.

మానికొండ
సత్యనారాయణశాస్త్రి.



శ్రీ

గ్రంథకర్తృ వంశావళి

సీ॥ మాని వశిష్ఠుండు మైత్రావరుణియుఁ గౌం
డిన్యుఁడు నను మహాధన్య ఋషులు
శోభితాపస్తంబసూత్రిఁ బు నొకి యా
శాఖ నొప్పుమను వాశిమున గలరు
ఆ బ్రాలసద్భిహార్యాస్వయంబాదమః
బుట్టిన శేముర్యావరా త్రి గాంచె
దెల మాంక్కోండవా సామాన్తి సిమహి
తాత్మ్య కొండ విఖ్యాతకీర్తిఁ

తే॥ సీ॥ దాను మహ్సతిటామహుండు
విద్వలయౌసుండు సహ్యావనీయగుణుండు
ఘ్నావధవహూపుఁ దనవాంస బలుండు
లలితధన్వాంత్రి వేంకటరామమంత్రి ॥

కం॥ ఆ వేంకటరామాంకగ
ఘ్నావగర్భంబునందుఁ బ్రిథవిందినోగి
శ్రీ పిర రాఘవార్యసు
వరుఁడును నేశవార్య కోవిదవరుఁడున్ ॥

కం॥ ఆసీరరాఘవాహ్వయ
పావనగర్భంబునఁ గాఁ బ్రభవించి
ధాప్రులు వేంకటరాముఁడు
శ్రీవరలక్ష్మీనృసింహశేఖరు లరసెన్

శా॥ శ్రీలక్ష్మీతనసత్కటాక్ష సిరిగా
లక్ష్మైన భాగ్యంబునన్
నాలక్ష్మీనరసింహమూర్తి కిని వి
య్యమ్మాంబకున్ బుత్రుఁడై
భూలోకంబున జన్మ మొందితిమి న
త్పుత్రత్రయం బై మిగన్
నాళీకాసనువంశమం దలపిత్రా
గాంబున్ దగన్ దీర్చఁగన్ ॥

తే॥ పుత్రసంతతియైన మాయందుఁ బ్రథము
శ్రీమత జ్యేష్ఠుండు వేంకటరామమంత్రి
అలకుటుంబరాయుండు రెండవసుతుండు
సంజ్ఞ సత్యనారాయణశాస్త్రి నాదు ॥

తే॥ గీ॥ నాదునైదవయేట నా మాదు తండ్రి
యకట ! పరలోకమున కేగ నంతనుండి
' పితృసమో జ్యేష్ఠ ' యను నీతి పెంపుగాంచఁ
జేసి నను బెంచె మాయన్న రామమంత్రి ।

శా॥ భారద్వాజపవిత్రగోత్రమున నా
పస్తంబసూత్రమునా
దాసక్తులనియోగిశాఖను హనూ
మాఖ్యన్ దగన్ దాల్చి యా
మాంగా మాంబకు తుర్లపాటికులుఁడు మ
న్మాతామహుం డొక్కఁడా
శ్రీరామావనిజానిపాదయుగళీ
సేవాపరాయణుఁడై ॥


కం॥ ధృతి మన్మాతృపితామహుఁ
డతులితలక్ష్మనమేతుఁ డాద్యుఁడు లక్ష్మీ
పతినామధేయుఁ డనఘుఁడు
వితరణఖని యనఁగఁ బరఁగె విభవము లలర్పన్ ॥

కం॥ మాతృపితామహునిన్
శ్రీకా ముద మొదవ భక్తి సేవింతు మదిన్
శ్రీతనయుఁ బోలుఘనునిన్
ఖ్యాతిగఁ బరదేశిసంజ్ఞ నలరెడువానిన్ ॥

కం॥ హనుమార్యుఁడు మాతాతయు
తనయులఁ గాంచంగ లేమి దౌహిత్త్రులచే
తన యూర్ధ్వలోకమందునఁ
బొనుపడఁగా నార్పనెంచెఁ బున్నరకాగ్నిన్ ॥

ఆ॥ వె॥ తుర్లపాటివారి స్వర్లోకగతి కైన
నృహరి యిల్లటంబు నెరపె గరిగా
పాలసంద్రిమీఁదు లీలతో శ్రీవిష్ణుఁ
డిల్లటంబునుండఁ డెట్లు నాఁడు ॥

ఉ॥ శ్రేణులుగట్టి యుద్యవనముల్ చెలఁగెను ముద్దులపుత్రి [illegible]
రాణదలిర్చు కన్నియల రమ్యవివాహము [illegible]
శ్రీనిభరాఘ్యలౌ సుతల శోభనకేళి కరంగ [illegible]
జాణలునైన నకూతులకు సారకుఁ బోయుపు [illegible]
వాణియు లక్ష్మి పార్వతియు వారిలఁ [illegible]
పీఠనమీయ శోభనము మీఁదను శోభనమైన [illegible]
న్నాణె మొనర్ప వృద్ధిఁగను నాదగు శ్రీసుగ్రహ [illegible]
ల్యాణము పచ్చతోరణమునై
వెలుఁగొందుచు నుండుఁ గావుత [illegible] !



వేదభూమి
భరతఖండమా? ధ్రువఖండమా?

(విమర్శము)

ఈ భరతఖండమే ఆర్యులకు జన్మస్థానమనియు, వారితర దేశములనుండి యిచ్చటికి వచ్చిన ఆగంతుకులు కారనియు 'స్వధర్మప్రకాశిని' వారిచే ప్రకటింపబడిన 'వేదభూమి' యను గ్రంథము చెప్పుచున్నది. శ్రీలోకమాన్య తిలక్ గారిచే ప్రతిపాదింపబడిన ధ్రువఖండసిద్ధాంతము సరిగాదని యా గ్రంథకర్తలు చెప్పుచున్నారు, కాని నాకు జూడగ ధ్రువఖండ సిద్ధాంతమే యుక్తమైన సబబుగ నున్నట్లు తోచుచున్నది. ఏలనగ, ఈ భరతఖండవాదులు ధ్రువసిద్ధాంతములోని చాల సారాంశములలో శోధించిరి; వ్యతిరేకించినచోట్ల భరతఖండ సిద్ధాంతమున కంత పుష్టికరములుగ లేవని నా నిశ్చయము.

ఈ క్రింది సారాంశములపై ఉభయపక్షములు
శోధించినవి.

(1) ఇప్పుడు మంచుతో గప్పబడి పోయిన ఉత్తర ధ్రువఖండము పూర్వమొకప్పుడు సమశీతోష్ణముగ నుండి మానవ నివాసమునకు యోగ్యముగ నుండెను.

(2) అప్పుడు ఆర్యులక్కడ కాపురముండిరి. (అందరో, కొందరో.)

(3) ఏ కారణములచే నయిననేమి, తరువాత కొంతకాలమునకు హిమప్రళయము రాగా, అది మానవ నివాసమునకు అనుపయోగమయ్యెను.

(4) అందుచే చలికి తాళజాలక ఆర్యులు ఇతరస్థలములకు బోయిరి. వారిలో కొందరు ఇండియాకు వచ్చిరి.

ఇక భరతఖండవాదులు చెప్పునది ఏమనగా.

అసలు ఆర్యజాతి (Original Stock) పుట్టినచోటు భరతభూమియనియు, అందులో కొందరు మొదట్లో ఉత్తర ధ్రువఖండమునకు వలసపోయి యుండిరనియు, తరువాత హిమ ప్రళయానంతరము అక్కడనుండి కొందరు తిరిగి తమ స్వదేశమగు జన్మస్థానమగు ఇండియాకు వచ్చిరనియు చెప్పుదురు. ఈ వాదన చాల 'అసాధారణమైన ఊహ'గా కనబడుచున్నది. ఇండియానుండి ధ్రువఖండమునకు చేసిన ప్రయాణమును గూర్చి వీరేమియు సాక్ష్యము చూపలేదు. ఏలనగా ప్రపంచమున మొదలుపెట్టిన ప్రయాణమేది? ఉత్తర ధ్రువఖండమునుండి ఇండియాకు చేసిన ప్రయాణమునకు సాక్ష్యమున్నదని వీరొప్పుకొన్నారు.

ఇక ఆర్యుల—వేయేల మానవుని—పుట్టుక ఈ భరతఖండమందు జరిగినదని వీరు చెప్పుచున్నారు. అసలు యావత్సృష్టియొక్క ఉత్పత్తిని యీ భరతఖండమందే చేసినది వీరు

చెప్పినవాన్నారు. మన జన్మభూమి యొక్క గొప్పతనమును గూర్చి మన కింతటి అభిమాన ముండుట సంతోషమే. మన భరతఖండమునే యీశ్వరుడు తన ప్రథమ సృష్టిరంగముగ వరించవలెనను ‘ మనోరథము ’ మనకుండుట సహజమే. అది మెచ్చుకొనదగిన విషయమే. కాని కేవలము సత్యమునే అన్వేషింప బూనినప్పుడు మాత్ర మిట్టి యభిమానములను మనోరథములను దూరముగ నుంచుట అవసరము.

భరతఖండమే ప్రథమ సృష్టిరంగ మనుటకు వీరు చూపిన సాక్ష్యము చాల హీనముగ నున్నదని నా యభిప్రాయము. ఇందుకు నిదర్శనముగ వీరు ఉదహరించిన వేదవాక్యములలోని భావము నిర్వివాదముగ లేదు. అనేకార్థములకు తావిచ్చుచున్నది. “ఓ సరస్వతీ! సర్వజీవము నీయందున్నది” అను వేదవాక్యమును దప్పుకొని, ఉదకము సరస్వతీ నదిలో ప్రప్రథమమున నివసించిన ప్రాణులను సృజించుచున్నద”ని వీరు వ్రాసిరి. ఈ వాదన యెంతవరకు హీనముగ నున్నదో చూడుడు! ఇట్టి, జలసృష్టి, ప్రథమ సూర్యోదయ దర్శనము మున్నగునవి బహుహీనముగ నిరూపింపబడినవి.

ఈ ధ్రువఖండవాదమును గూర్చి
తిలకుగారు చెప్పిన దేమనగా,

ఆర్యులు హిమప్రళయమునకు పూర్వము ధ్రువఖండమున నివసించియుండి, ప్రళయానంతరము నానాదేశములకు పోయిరి. కొందరు ఇండియాకు వచ్చిరి. వా రానాడు ధ్రువ

ఖండములో చూచిన దీర్ఘఉషస్సు, దీర్ఘదినము, దీర్ఘరాత్రు ములు మున్నగు సృష్టివైచిత్ర్యముల నన్నింటిని మానవజాతి వే వాక్పేటికలయందు అవిచ్ఛిన్నపారంపర్యముగ భద్రపరచి యుంచి, స్థిరనివాసము ఏర్పరచుకొన్న [illegible] సూక్త (సు-ఉక్త) రూపములుగ పొందుపరచిరి. అవే మన కీనాడు గన్పించుచున్న వేదములు.

పినిని ఇండియాలోనే సూక్తరూపములుగ పొందుపరచి
చిరిగాన ఇండియాయే వేదభూమియని చెప్పుకొన్నచో
తిలకుగారి కంత ఆక్షేపణ యుండక పోవచ్చును.

కాని ఆ సూక్తములందు పొందుపరుపబడిన విషయ ములు మాత్రము ప్రళయానికి పూర్వపు ధ్రువనివాసము నాటి వని మరువకూడదు. ముప్పదిదినము [illegible] ఉషస్సులనుగూర్చి చెప్పునపుడు పూర్వకాలమునాటిది (పురా, ప్రథమ) అని వేదములే వర్ణించినవి. "ప్రథమా" అనగా సృష్టి ప్రథమకాలమని [illegible], 30 దినముల ఉషస్సు ధ్రువఖండములోనిది కాబట్టి, ప్రథమ ఉషస్సృష్టి ధ్రువఖండములోనే జరుగవలెనుగదా! ఇండియాలో జరిగియున్నచో, 30 దినముల ఉషస్సు ఇండియాలో ఎక్కడ? నిజ మేమనగ, యీ వేదవాక్యములు వ్రాసిన కాలమునాటికే యీ 30 దినముల దీర్ఘఅఖండఉషస్సు "పురా" (పురాతనము) అయిపోయినది. తాను కూర్చుండి యీవాక్యములను వ్రాసిన భారతభూమిలో తన కంటియెదుట ప్రత్యక్షముగ ఒకేఉషస్సు

కనిపించుచుండగా, యజ్ఞవేదికపై 30 ఉషస్సులను సూచించుటకు 30 ఇటుకలను (వ్యుష్టి-యిష్టకా) మేల పెట్టవలెనను సందేహము తోచి, దానిని సమర్థించు టెట్లని యూహించి, మార్గము గానక, యిది "పురాతనాచారమ"ని యీ ఋషి సరిపెట్టుకొనెను.

ఇట్లే ధ్రువఖండమందలి 7 నెలల సూర్యరశ్మిని మాత్రమే సూచించు అదితిగాథ (పూర్వ్యంయుగం) పూర్వయుగము నాటిదని వేదమే స్పష్టముగ వక్కాణించుచున్నది. మరియు, పదినెలలపరిమితిని సూచించు "గవాం అయనం" మున్నగు యజ్ఞములు కూడ పూర్వకాలమునాటివే యని వేదములే చెప్పుచున్నవి. 7,9,10 నెలలు యజ్ఞములు చేయు సప్తగ్వులు, నవగ్వులు, దశగ్వులు—వీరందరు "నః పూర్వే పితరః" మన పూర్వపితరులని వేదఋషులే ఖండితముగ చెప్పుకొనిరి. వేదము లిట్లు స్పష్టముగ చెప్పుచుండ పంచఋతు-పదినెలల-సాంప్రదాయము క్రొత్తదని భరతఖండవాసు లూహించుటకు కారణము గన్పట్టదు. వీరిది కేవలము ఊహించి చెప్పినమాట. స్పష్టమగు నిదర్శనము గాన్పించుచున్నప్పుడు నట్టి ఊహాను ప్రమాణముగ నెవ రంగీకరింతురు ?

"రాత్రికాలము అంతమొందదనియు, సూర్యోదయము గాదనియు, పూర్వకాలమందు ఋషులు భయపడెడివారు" అను ధ్రువఖండ దీర్ఘరాత్రిని సూచించు వేదవాక్యము "పురా కల్ప" ము తోసిదని సాయనాచార్యుల

వారే యొప్పుకొనిరి. కావున, యీ వేదవాక్యము వ్రాసిన నాటికే ధ్రువఖండ దీర్ఘరాత్రి పురాతనమై పోయినది.

వృత్రగాథ, సప్తసింధువుల నిజస్వభావము.

ఇక యింద్రుడు వృత్రుని వధించి సప్తసింధువులను ప్రవహింపజేసినను మాటను పట్టుకొని, యీ సప్తసింధువులు మన పంజాబులోని యేడునదులేయని భరతఖండవాదు లను చున్నారు. దీనికి ఉపబలముగ పారసీకుల "హప్తహిందు" శబ్దమును చూపుచున్నారు. వృత్రగాథనుగూర్చి యింతదనుక ఖండవాదులు చేసినంత సులభముగ ఒక్కదెబ్బతో పరిష్క రించి సారాంశమును తేల్చివేయుటకు వీలులేదు. నిజమునకు దీనియంతరార్థమును చెప్పు విషయమై భారతీయ పాశ్చాత్య పండితులే భిన్నాభిప్రాయులై యున్నారు. కొందరు పండితు లీవృత్రగాథను మేఘసిద్ధాంతము చేతను, మరికొందరు ఉష స్సిద్ధాంతముచేతను సమర్థింపజూచిరి. వృత్రవధవలన వచ్చు జలమే కాదు. యింక మరిమూడు వస్తువులు ఆవులు (కిరణ ములు) ఉషస్సు, సూర్యుడు-మొదలగు యీనాలుగు యొకే కాలమందే విడిపింపబడినవి. మేఘసిద్ధాంతము నీటిని, సూర్య కిరణములను సమర్థించుచున్నది. ఉషస్సిద్ధాంతము ఉషస్సును సూర్యుని సమర్థించుచున్నది. కాని, యీనాలిగింటిని యొకే కాలమందు సమర్థించుసిద్ధాంత మింతవరకు లేదు. తిలక్ గారి ధ్రువసిద్ధాంత మొక్కటే యీనాల్గింటిని యొకకాలమందు సమర్థించుచున్నది. వృత్రవధ ధ్రువఖండములోని యుషఃకాలదీర్ఘ

రాత్రిని సూచించుచున్నది. అందు విడిపింపబడినట్లు చెప్పబడిన జలము మన మామూలు నీరుకాదనియు, అది 'దివ్యాః ఆపః' దివ్యజలమనియు (ఇదే సృష్టికిపూర్వము క్రింద, పైన, లోకుల, యావత్తు యీవిశ్వమునంతను ఆవరించినట్లు చెప్పబడిన జలమనియు, దీనినే యిప్పటివారు 'ఈథర్' Ether అనుచున్నారనియు) అది ఆకాశమునుండి పాతాళములోనికి పాతాళమునుండి ఆకాశముపైకి నిలువు చక్రాకారముగ నెక్కి దిగుచు ప్రవహించుచుండుననియు, యీప్రవాహముల గతివల్లనే సూర్యచంద్రాదులు కూడ నడుచుచున్నారనియు, యీప్రవాహములు ఆగిపోయినచో సూర్యచంద్రాదుల చలనములుకూడ ఆగిపోవుననియు నెలల తరబడియున్న ధ్రువ ప్రాంత దీర్ఘరాత్రిలో వృత్రుడీదివ్యజలమును అధోలోకమునందు బంధించివేయుటచే (నిరుద్ధ ఆపః) దానితోపాటు సూర్యచంద్రాదులుకూడ అధోలోకమునందు నెలల తరబడి బంధింపబడిపోయిరనియు, అట్టి దీర్ఘ్యాలు నెలల తరబడి రాత్రి [illegible], సోమరసమిచ్చి యింద్రుని ప్రోత్సహింపగ యింద్రుడు వృత్రుని వధించి అధోలోకమునందు బంధింపబడిపోయిన దివ్యజలమును పైకి (ఉదంచ) ప్రవహింపజేసెననియు, అట్టి దివ్యజలప్రవాహముల వెంట (యిదే సప్తసింధువులు) సూర్యచంద్రాదులుకూడ ఆకాశముపైకెక్కి వచ్చిరనియు మున్నగు విషయములను తిలక్ గారు 62 పేజిలో [illegible] మగు [illegible] చెప్పిరి. అభిప్రాయములు [illegible]

యీ చిన్న వ్యాసము నుదహరించుటకు వీలులేదు. కావలసిన వారు మూలమును చూడనగును.

ఈ సప్తవిధవిభాగము ధ్రువఖండమునందలి ఆరు మాసముల సూర్యరశ్మినుండి యేర్పడినది. ఈ విభాగమును సూచించు వృత్రగాథ ఒక్క మన వేదములందేగాక ఇరానువారికే కాదు పాశ్చాత్య ఆర్యసాంప్రదాయములలో కూడ గలదు. కావున, యింత విరివిగనున్న సప్తవిధవిభాగము (సప్తనదీదేశ మని వాజసనేయసంహితలో కూడ విభాగించిన పంజాబును యింక యేవో రెండు పిల్లనదులను చేర్చి సప్తపదదేశము జేసినను)-ఒక్క పంజాబులో నదులను చూచి చేసినది గాదని స్పష్టమగుచున్నది. పైపెచ్చు ఆర్యులందరు ధ్రువఖండమునందు నివసించిననాటి యీ సప్తవిధవిభాగమును తరువాత పంజాబునకు వచ్చిన తరువాత యీ యేడునదులకు గిరికొని వానికన్వయించిరి యనుట యెక్కువ సమంజసముగ నున్నది. ఆకాశమునందు దివ్యజలప్రవాహముగ (దివ్యగంగా) నున్న గంగానది యే భూమిమీది కవతరించినప్పుడు, ఆకాశమునందు సూర్యుని మోచికొనిపోవు సప్తదివ్యసింధువులు పంజాబునందు అవతరించుటలో ఆశ్చర్యమేమున్నది? పారసీకుల హప్తహిందు కూడ మున కిదియే అర్థము. సేతుబద్ధమును సామ్యమే ప్రధానము. పేర్లు అప్రధానమైనవి. బంకోబస్తుగనున్న తదితరసామ్యముచే ఒక సిద్ధాంతమును స్థాపించిన పిమ్మట, దానికి యనుకూలముగ పేర్లయొక్క సామ్యమును తీసికొనరావచ్చును. పేర్లయొక్క

విలువ లేకపోలేదు. అంతేగాని, ఒక్క పేర్ల సామ్యమునే ఆధారముగ పట్టుకొని, మొగామొకని ఒక సిద్ధాంతమును నెలకొల్ప దలచినచో, అది చాల అపాయకరము. దానికి తలతోక యుండక, మనల నేగోతిలోనికో తీసికొనిపోయి దింపును. భారతీయ నిరుక్త పండితప్రకాండులయందే ఇంతటి వాదప్రతివాదములకు కారణమైన వృత్రవధగాధలోని ఒక్క సప్తసింధు శబ్దమును పట్టుకొని, అవి పంజాబులోని యేడునదులే యని మొగామొకని నిర్ధారణచేసివైచుట సిద్ధాంత ప్రతిపాదనమునకు లక్షణము కాదు.

వృత్రగాధ హిమయుగమునకు పూర్వమునాటిది.

వేదవాఙ్మయమునకు ప్రధానదేవత యింద్రుడు. అతడొనర్చిన మాహాత్మ్యవిశిష్ట కార్యములలోని కెల్ల యీ వృత్రవధయే ప్రధానమైనది. వేదవాఙ్మయము యితని ఘనకార్యవర్ణనల తోడనే నిండిపోయియున్నది. మనపూర్వులు మెదడును చీల్చి వర్ణించినయట్టి మహోన్నత కార్యమని మనయార్యులు ఉబ్బితబ్బిబ్బైరి, దానికొరకు నానారాత్రులు లెడతెగకుండ క్రతువులు చేసి, నానావిధ స్తంభపడి, మహావేదగ్రంథమునంతను దీనితోనే నింపివేసియున్నచో, వారు వట్టి పిచ్చివారనియే చెప్పవలసి వచ్చును! ఇంతటి ఆదుర్దాపడినది వట్టివర్షముకోసమా? క్షణమాత్రమునకేపోవు మన యీ దేశపు ఉషస్సును గూర్చియా ఇంతటి భయసందేహముల నింపినది? 12 గంటలలో మరలివచ్చు సూర్యునికోసమా ఇంతంత గాబరాపడినది? ఏనిలో వేసవికాలమును మనమిప్పుడింత ఆదుర్దాపడుచున్నామా?

ఈ ఋక్కును రచించిన ఋషియైనను యుగ [illegible] పడినాడా? లేదే! తానుగాని తనపూర్వులు పూర్వకాలములో తెల్లవారదేమో అని ఆందోళనపడేవారు. ఈ ఋషికి లేని ఆదుర్దా ఆయనపూర్వుల కేలగలిగెను? కారణము స్పష్టమే. ఈ ఋషి ఇండియాలో నున్నాడు. ఈయనపూర్వులు ధ్రువఖండములో నుండేవారు. కాబట్టి ధ్రువఖండ దీర్ఘరాత్రిని చూచి యీయనపూర్వీకులు భయపడుచుండేవారు. 12 గంటలు మాత్రమే రాత్రిగల ఇండియాలో యీ ఋషి యుండుటచే, యీతని కంతమాత్రము భయము లేదు. కావున, సప్తసింధువులు దివ్యజల సింధువు లనుకొనుటవల్లను, సప్తరాత్రి ధ్రువఖండ దీర్ఘరాత్రి యనుకొనుట వల్లను వేదములు తెల్ల ప్రధానమైనయీవృత్రగాధకు [illegible] సమన్వయము కుదురుచున్నది. [illegible] యీ గాధను [illegible] ఆమూలాగ్రముగ సమర్థించుటకు వీలుగనున్నది.

ధ్రువఖండ నివాసమే ప్రాచీనము.

భరతఖండ నివాసము అర్వాచీనము.

అంతమాత్రముచే యీ వేదఋక్కులు [illegible] ఆర్యులు పంజాబులో లేరని తిలకుగారు చెప్పరు. ఏలనగా:— వేదములందు ధ్రువఖండ లక్షణములతో పాటు భరతఖండ లక్షణములుకూడ వివరింపబడి యున్నవి. కాని, ధ్రువఖండ లక్షణములన్నియు పూర్వకాలమునాటివనియు వానిని యీ ఉత్తరయుగమందు తపస్సుచే తాము చూచుచున్నామనియు (యః పశ్యాత్ ఉత్తరే యుగే) యీ ఋక్కులను రచించి

ఋషులే స్పష్టముగ చెప్పుకొనియున్నారు. ఇంద్రుడు, అశ్వినిలు మున్నగు దేవతలే గాక వారొనర్చిన ఘనకార్యములుకూడ, "పూర్వ్యాన్యసి, పూర్వ్యే, ప్రథమాని" అని స్పష్టముగ చెప్పబడినవి. ఇదిగాక, తాను రచించిన ఋక్కు క్రొత్తది (నవ్యసీ) అయినను, అందు వర్ణింపబడిన దేవతయు అతని కార్యములును పురాతనమైనవి (ప్రత్న) యని VI, 22, 7, 62, 4 ఋక్కును రచించిన ఋషియే స్పష్టముగ చెప్పుకొనుచున్నాడు. ప్రాత అభిప్రాయములను (ప్రత్నాధీః) క్రొత్తమాటలలో (నవీయసీ గీః) చెప్పుచున్నానని VIII, 95, 4-5 ఋక్కును రచించిన (అజీజనం) ఋషి చెప్పుకొనుచున్నాడు. కావున, ధ్రువఖాండ నివాసమునాటి విషయములే చాలవరకు భారతదేశమున నివసించినను తెల్పుకొన్న పిమ్మట వేదసూక్తములుగ రచింపబడినవి.

ఉత్తరగిరి.

భారతదేశములో కూర్చుండి యీఋక్కును వ్రాయుటచేత నర్వాచీనులు మనువుయొక్క ఓడనుగూర్చి చెప్పుచు "ఏతం ఉత్తరం గిరిం" - (యీ ఉత్తరగిరి అని చేతితో చూపించుచున్నట్లు) ఉత్తరశబ్దమును ప్రయోగించినాడు. కావున, ఈ ఉత్తరగిరి ధ్రువసిద్ధాంతమునకు ప్రతిబంధకము కాజాలదు.

పారశీక వేదప్రమాణము, జలప్రళయము.

ఇండియాకు రానున్న అయ్యలలో కొందరు విడిపోయి అర్యానా వైజో (అర్యవీజ) దేశములోనికి పోయియుండినను అదే

యిప్పటి పరిషియా దేశమనియు, వానికే పారశీకమనియు భరత
ఖండవాదులు చెప్పుచున్నారు. పార్సీదేశము గూడ వర్ణింపబడిన
ఆర్యన్ వైజో లక్షణములను మీరు ఒక్కసారి పరిశీలించి
మాత్రముండియున్నచో మీరింత పొరబడి యుండియుండరని
నానమ్మకము. ఆర్యన్ వైజో లక్షణములన్నియు ధ్రువప్రదేశ
మునే చెప్పక చెప్పుచున్నవి. కావున, ఆర్యన్ వైజో యనుస్థా
నము పారశీక దేశము కాజాలదు. ఇక ఆర్యన్ వైజో మొదలు
హప్త-హిందూవరకు పేర్కొనబడిన 16 దేశములు పూర్వో
త్తర సందర్భములనుబట్టి చూచినచో అవి క్రమముగ ఉత్తర
ధ్రువమునుండి యిండియావరకు వచ్చిన ఆర్యుల వలసక్రమ
మును తెలుపుచున్నవని స్పష్టము కాగలదు.

మనోరథమా ? సత్యమా ?

భారతవర్షమే ప్రథమసృష్టి స్థానమనియు, ఆర్యుల జన్మ
స్థానమను కావలయునని తిలక్ గారికంటె మొదటివారి మనో
రథమున్నను, పైన వివరించిన రీతిగ బలవత్తరమగు ప్రమాణ
ములు గాన్పించుటచే వారు తమ మనోరథమును వదలిపెట్టి,
కన్నెదుట గాన్పించుచున్న సత్యమును అంగీకరింపక తప్పినది
కాదని వారే వ్రాసికొని యున్నారు. ఏమి ? భరతఖండమునకం
టెం ధ్రువఖండమందు వారికి యెక్కువ ప్రీతి యున్నదను
మా ? అట్లుండుటకు యేమాత్రము కారణము గన్పట్టదే !
పైపెచ్చు, భరతఖండముందే వారికి యెక్కువ ప్రీతియున్నట్లు
వారిజీవితమే చెప్పక చెప్పుచున్నది. అదియట్లుండ మొదటను

పొరపాటులకు వీలులేదు. భరతఖండమందింతటి అనురాగమున్న తిలక్ గారికి యేమాత్రము సందు దొరికినను వారు దీనిని ఆర్యస్థానముగ చేయక పోయెడివారా? కాని, యథార్థస్థితి అన్యథాయున్నప్పుడు - ప్రబలమగు సాక్ష్యమువలన కథ అడ్డముగ తిరిగినప్పుడు — వారేమి చేయగలరు? కావున తమకున్న అభిమానమును దూరముగపెట్టి ఆర్యస్థానము ధ్రువఖండమేయని ఒప్పుకొనక తప్పినది కాదు.

ఇక సోమపానమునుగూర్చియు ఆర్యస్పర్ధనుగూర్చియు వ్రాసిన భాగములలోని హేతువాదము లంతదృఢముగ లేవు. చదువుట కెంతయు నింపుగనున్నను సిద్ధాంత ప్రతిపాదనమున కవి యుపయోగపడజాలవని నా నమ్మకము. అట్లే ఆర్యసామ్రాజ్య స్థాపనము, విదేశ బాంధవ్యము, ఆర్యులవలసలు, ఆర్యుల విస్తరణములు మున్నగు భాగములు చదువుటకు చాలమనోహరములుగను, ఉత్తేజనకరములుగను, దేశాభిమానమును పురికొల్పునవిగను నున్నవి. కాని, భరతఖండ సిద్ధాంతమును స్థాపించుటకవి చాలవని నానమ్మకము.

వేదాంత భౌతిక శాస్త్రసారాంశముల యేకీభావము.

వేదములయొక్క అనాదిత్వ, అపౌరుషేయత్వ, పునరుద్ధరణాది విషయములగూర్చి మనవారును, యిప్పటి పాశ్చాత్యభౌతిక శాస్త్రవేత్తలును చెప్పుదానిలో భేదమేమియు గాన్పించదు. ఎట్లన:—

మన వేదాంతుల అభిప్రాయములు.

1. వేదములు: అనాదులు. అపౌరుషేయములు.

2. గతకల్పాంతమందు గలిగిన ప్రళయములో వేదములు నశించెను.

3. ప్రళయానంతర మందు ఋషులు తపశ్శక్తిచే తాము జ్ఞాపక ముంచుకొన్న వెనుకటి వేదములను కేవల మవే మాటలతో కాకపోయినను అవే అర్థములతో తిరిగి నిర్మించిరి.

ఆధునిక భౌతికశాస్త్రవేత్తల అభిప్రాయములు.

1. హిమప్రళయాత్పూర్వము ధ్రువఖండమం దార్య సభ్యత యే నాటినుండి ప్రబలి యుండెనో నిర్ణయింపజాలము. దీని 'ఆది' కాలగర్భమం దెచ్చటనో లీనమై పోయినది.

2. ధ్రువఖండమునందు గలిగిన హిమప్రళయమువల్ల ఆర్య సభ్యత చాలవరకు చెడి పోయెను.

3. ప్రళయాత్పూర్వపు ధ్రువ సాంప్రదాయములను పారంపర్యముగ వాక్యోక్తికలయందు భద్రపరచి యుంచుకొని, ప్రళయానంతర యుగమందు ఆర్యులు వానిని వేదసూక్తములుగ రచించిరి.

ఈరీతిగ ధ్రువసిద్ధాంతమువల్ల రెంటికి చక్కని సమన్వయ మేర్పడుచున్నది.

ధ్రువనివాసకాలము, దేవమానము.

ఇక యీ హిమప్రళయ మెప్పుడు జరిగినదను విషయ

మునుగూర్చి చర్చించుచు అమెరికా భూగర్భశాస్త్రవేత్తలు కనిపెట్టిన 10 వేల సంవత్సరములను తిలకుగా రంగీకరించిరి. ప్రళయానంతర మేర్పడిన కృత, త్రేత, ద్వాపర, కలియుగ ముల పరిమితి 4, 3, 2, 1– వరకు పదివేలసంవత్సరములతో ముగిసిపోవుచున్నది. ఈ లెక్క-ప్రకారము మన మిప్పుడు కలిని దాటి తిరిగి కృతయుగములో నున్నామని యేర్పడు చున్నది! మన మిప్పుడు కృతయుగములో నున్నామను మాటను ఒప్పుకొనుటకు మనవారికి సరిపడక యీ చతుర్యుగ ములకు చెప్పబడిన సంవత్సరములు దేవమానమునకు సంబం ధించినవని చెప్పి వానిని 360 రెట్లు పెంచినవనియు, ఇట్లు పెంచు టకు ఆధారము కానరాదనియు, యీసంఖ్య లేర్పరచిన వ్యాస, మనువు, లిరువురు యీ దేవమానమునుగూర్చి చెప్పనే లేద నియు తిలకుగారు వ్రాసియున్నారు. దీనికి బలముగ, పండిత రంగాచార్య, అయ్యరుగార్ల అభిప్రాయములనుకూడ తిలకు గారు ఉదహరించిరి. దీనికి మన పూర్వాచారపరాయణులంత వేలికగ సమ్మతింప రేమో! ఇది చాల వివాదగ్రస్తవిషయ ముగ నగుపించుటచే దీని వివరములను తిలకుగారి మూల గ్రంథమందే చూచి పండితులు నిర్ణయించుకొందురుగాక. ఇప్పటికే యీ వ్యాసము నే ననుకొన్నదానికంటె విపరీతముగ పెరిగిపోవుటచే, నింక విస్తరించి వ్రాయజాలను.

ఈ వేదరచనకంటె ధ్రువనివాసమే ప్రాచీనము.

ఈ కాలనిర్ణయము మాట యెట్లున్నను, స్థలనిర్ణయమును గూర్చి మాత్రము భేదాభిప్రాయమునకు తావు గన్పట్టదు. వేద ములందు ధ్రువనివాసము వర్ణింపబడియున్నదను మాటను

ఉభయపక్షములు ఒప్పుకొనుచున్నవి! కాని, ధ్రువనివాసము యిటీవలిదనియు, భరతఖండనివాసమే ప్రాచీనమైనదనియు ఈ "వేదభూమి" గ్రంథకర్తల యభిప్రాయము. కాని, దీర్ఘరాత్రి, దీర్ఘఉషస్సు మున్నగు ధ్రువనివాస లక్షణములను గూర్చి చెప్పుచు, యివి పురాతనయుగమునాటివని ఆ ఋక్కులను రచించిన ఋషులే చెప్పుకొనుచుండగ దానిని కాదనుట యెట్లు? కావున, యీవేదరచనకంటె ధ్రువనివాసమే ప్రాచీనమైనదని సిద్ధించుచున్నది. ఒకవేళ యీ వేదరచన, ధ్రువనివాసములకంటెకూడ పూర్వమెప్పుడో ఆర్యులు భరతఖండమునందు ఉండిరేమో చెప్పజాలము. దానికి సాక్ష్యమేమియు కన్పట్టదు. కావున, యీ సాక్ష్యము కన్పట్టువరకు ధ్రువనివాసమే ప్రాచీనమనక తప్పదు.

సంస్కృతభాషయందును, వేదవాఙ్మయమునందును నాకెంతమాత్రము పరిచయము లేకపోయినను, భ్రమప్రమాదములున్నచో ప్రాజ్ఞులు మన్నింపకపోరను ధైర్యముతో నుభయపక్షములందలి వాదప్రతివాదములను మాత్రమే యాధారముగగొని నిష్పాక్షికముగ పరిశీలించి చూచి నాకు సత్యమని తోచిన తీర్పును చెప్పితిని. కాని, అసలు సత్యము సత్యస్వరూపుడగు నీశ్వరునకే యెరుక. అవ్యక్తమును, అగాధమునునగు యీసత్యసముద్రమును — ప్రహ్లాదుడు వచించినట్లు — ఎంతటి పండితప్రకాండులకైనను తమ "దుర్మేధ దాటగరాదు" గద.

మానికొండ సత్యనారాయణశాస్త్రి,

అనువాదకుడు.



వైదిక నిలయము

(ఆర్యుల ఉత్తర ధ్రువ నివాసము)

మొదటి అధ్యాయము.

ప్రాగ్చారిత్రిక యుగము.

మన మొక దేశపు చరిత్రనైనను తెలిసికొనగోరినయెడల మన కాధారము లేవి? ఆయా దేశములవారిచే వ్రాయబడిన చరిత్రగ్రంథములే ముఖ్యాధారములు. ఈ గ్రంథములు మనకుఁ గొంతవఱకు సహాయము చేయగలవు. కాని యంతకంటెను ఇంకా పూర్వకాలపు చరిత్ర తెలిసికొనగోరిన యెడల మనకే గ్రంథము లేవియును తోడ్పడజాలవు. ఈ చరిత్రగ్రంథముల మూలమున మన మెంతకాలమువఱకు తెలిసికొనగలమో ఆ కాలమునకు "చారిత్రకయుగము" అని పేరు పెట్టెదము. ఈ చారిత్రకయుగమును దాటిపోయిన పిమ్మట, మన మీ ప్రపంచస్థితి నెట్లు తెలిసికొనగలము? అప్పటి ప్రజ లెట్లుండెడివారు? ఏవిధముగ వర్తింపుచుండెడివారు? వారి యాచారవ్యవహారము లెట్లుండెడివి? వీని నన్నిటిని తెలిసికొనుటకు మన కాధారము లేమైన గలవా?

ఆయా దేశములవా రనాదినుండియు బహుభక్తిశ్రద్ధలతో గౌరవింపుచు బూజింపుచుండిన మతగ్రంథములవలన కొంతవఱకు మనకు దోఁపఁగలవు. వారి యాచారవ్యవహారములను, వారు చెప్పుకొనుచుండు పూర్వగాథలను (Mythologies) కొంత వఱకు మనకు త్రోవ జూపును. ప్రాచీనములో నున్న వివిధభాషలను పరీక్షించి చూచి, యేయే భాషలకును మఱి యొక భాషకును గల సామాన్యములను, భేదములను, పోలికలను, సంబంధ బాంధవ్యములను బాగుగ పరిశీలించు (Comparative Philology) మూలమునగూడ పూర్వచరిత్రము కొంత తేటపడఁగలదు.

మన మింకను వీని నన్నిటిని గడచి యింకొక మెట్టుపైకి పోదము. ఈపైనచెప్పిన సాధనములద్వారా కొన్ని కాలములవఱకే ప్రపంచస్థితి మనకు తెలియఁగలదు. అంతకంటె మిక్కిలి పూర్వకాలపు చరిత్రను తెలిసికొనుట కేమైన సాధనములు గలవా? మన మెప్పుడైనను భూమిని త్రవ్వుచుండఁగ పూర్వులచే బహుకాలము క్రిందట నుపయోగింపఁబడిన కొన్ని కొన్ని చిత్రమైన వస్తువులు దొరకుచుండును. ఈవిధముగ భూమిలో నణగియున్న యనేకమైన వస్తువులను త్రవ్వి యెత్తి వానిని పరీక్షించుటవలన కూడ మనకు మన పూర్వుల చారిత్ర మొక్కింత బోధపడఁగలదు. ఇట్లు "భూమిలోనుండు వస్తువులను త్రవ్వి యెత్తి, వానిని పరిశోధించి, తన్మూలమున పూర్వకాలపు చరిత్రను తెలిసికొనఁగలుగుట" యనునది ప్రస్తుత మొక గొప్పశాస్త్రముగఁ బరిగణింపఁబడుచున్నది. దీనికే

“ భూనిక్షేపపరిశోధకశాస్త్రము (Archaeology) ” అని పేరు. ఈ శాస్త్రపరిశోధనలవలన బూర్వచారిత్రము మనము కొంతవఱకు దెలిసికొనగలము. కాని యంతకంటెను యొక్క బూర్వయుగములనాటి చరిత్రను దెలిసికొనుట కాధారము లేమైనగలవా? దీనిని తెలిసికొనుటకు “ భూగర్భశాస్త్రము (Geology) ” కొంతవఱకు సహాయము చేయగలదు. భూమిపై మనము త్రవ్వి చూచిన యెడల నానావిధములగు రాళ్ళు, రప్పలు, యిసుక, మన్ను, బురద, లోహములు, ఖనిజములు, చీకిపోయిన కొయ్యలు, బొగ్గులు మొదలగు నవి పొరలు పొరలుగ గాన్పించును. వీనిని బరీక్షించి చూచి కూడ పూర్వభూగోళ మెస్థితిలో నున్నదో తెలిసికొనవచ్చును. దీనిని వాడిపోయిన పిమ్మట మన కింక నేమియు నాధారములు లేవు. ఈపైన చెప్పిన వివిధశాస్త్రపరిశోధనల వలన చారిత్రకయుగమునకు బూర్వ మీభూగోళ మెస్థితిలో నుండె [illegible]ధునికులు సిద్ధాంతీకరించిరో కొంచెము విచారించి చూచెదము.

భూగర్భశాస్త్రవేత్తలు భూమిలోనుండు వివిధమైన పొరలను బరీక్షించిచూచి, యీభూగోళము పుట్టినది మొదలు యీ ప్రస్తుతకాలమును ధరించువఱకు గడచిన కాలమును (అతిసూక్ష్మముగా గాక) 4 మహాయుగములుగ భాగించిరి. భూమియొక్క పైభాగమునుండి త్రవ్వుకొనుచు లోపలికి పోవుచున్నా మనుకొనుడు. అప్పుడు మన కీవిధముగ నీమహాయుగములనాటి పొరలును వరుసగ గాన్పించును.

భూగర్భ విభాగము	భూవిదిత విభాగము.
చతుర్థ యుగము ప్రస్తుత రూపము ......క్రీ॥ పూ॥ 10 వేలు...... మంచుయుగము, శీత * గత హిమప్రళయము	ఇనుప యుగము కాంస్య యుగము నూతనశిలా యుగము ప్రాచీనశిలా యుగము.
తృతీయ యుగము (స్తనంధయయుగము) (1) సరికొత్త పొర (2) తక్కువ కొత్త పొర (3) మరితక్కువ కొత్త పొర (4) అట్టడుగు పొర	
ద్వితీయ యుగము (1) సీమసున్నపు రాతి పొర (2) గులకసున్నపు రాతి పొర (3) ఇంకొక గరపు రాతి పొర	
ప్రథమ యుగము (1) ఎర్రయిసుక రాయి + మగ్నీషియం సున్నపు రాయి పొర (2) రాక్షసిబొగ్గు పొర [పొర (3) పాతయెర్రయిసుక రాతి (4) పర్వతములు అణగి మణగిన పొర [పొర (5) పర్వతములు అణగి మణగిన	
ఆదిమపదార్థము (జీవోత్పత్తి)	

* ఇట్టిప్రళయము లనేకములు వచ్చెననియు ఒక్క ప్రళయమునకు యింకొక ప్రళయమునకు మధ్య సమశీతోష్ణస్థితి యుండెననియు కొందరభిమతము.

భూగర్భశాస్త్రప్రకారము గావింపబడిన కాలవిభాగము ప్రక్కపట్టి చూచినయెడల తెలియగలదు. ఇక చతుర్థయుగపునాటి మట్టిపొరలలో గాన్పించిన వివిధములగు వస్తుసామగ్రినిబట్టి భూనిక్షేపపరిశోధకశాస్త్రజ్ఞు లెట్లు కాలవిభాగమును చేసిరో చూచెదముగాక. మంచుయుగపు పొరలలోను, తత్పూర్వయుగపు పొరలలోను యిప్పుడు ప్రస్తుతము మనకు తెలిసియున్నట్టి జంతువులయెముకలు మొదలగునవి మట్టితో గలిసి యున్నట్లు భూగర్భశాస్త్రపరిశోధనలవలననే తెలియ వచ్చినది. అదిగాక ఈ చతుర్థయుగములోను తత్పూర్వయుగములలోనుగూడ ఈ భూమిపై మనుష్యులు నివసించినట్లు నైజమగు సూచనలు గలవు. ఈ యుగములనాటి మట్టిపొరలలో దొరకిన వస్తుసామగ్రీ నిక్షేపములనుబట్టి భూనిక్షేపపరిశోధకశాస్త్రజ్ఞులు, ఆదిమమానవుల కాలమును మూడు తెగలుగ భాగించియుండిరి. (1) శిలాయుగము. (2) కంచు (కాంస్య) యుగము. (3) ఇనుపయుగము. శిలాయుగములోని మనుష్యులకు లోహపుపనిముట్లు చేసికొనుట తెలియనందున, వారు రాతితోడను, కొమ్ములతోడను, కొయ్యలతోడను, తమ పనిముట్లను చేసికొనుచుండిరి. ఈ పనిముట్లు చాల మోటుగనుండెను. ఈ కాలమునాటి మట్టిపొరలలో కొయ్యతోడను రాతితోడను, చేయబడిన మోటుకత్తులు, అంబులు మొదలైనపనిముట్లు దొరకినవేగాని లోహసామగ్రి దొరకలేదు. అంతకంటె పైపొరలలో లోహసామగ్రి దొరకినది.

ఆ యా పొరలలో దొరకిన వస్తువులనుబట్టియే యీ విభజన గావింపబడినది.

ఈ శిలాయుగమును తిరిగి పూర్వశిలాయుగము, ఉత్తరశిలాయుగము అని రెండువిధములుగ భాగించిరి. (Palaeolithic) పూర్వశిలాయుగపు రాతిపనిముట్లు (Neolithic) ఉత్తరశిలాయుగపు పనిముట్లకంటె ఎక్కువ మొరటుగనున్నవి. పూర్వశిలాయుగపు పనిముట్లు, ఉత్తరశిలాయుగపు పనిముట్లకంటె క్రింది (ప్రాత) పొరలలో గనుపించినవి. పూర్వశిలాయుగపునాటి జంతువులు ఉత్తరశిలాయుగములో గానుపించుటలేదు. ఉత్తరశిలాయుగమునాటికి ఆపెద్దజంతువులన్నియు పూర్తిగ నశించినట్లు కనబడుచున్నది. ఈ రెండుయుగములకును మధ్య నొకగొప్పమార్పు యీ భూగోళముమీద సాధించినట్లు సూచనలు గలవు. అప్పటి శీతోష్ణస్థితి వేరు. అప్పటి యీ గోళముమీది భూ, జలభాగము లీవిధముగ లేవు. అప్పటి సముద్రములు వేరు. అప్పటి దేశములు వేరు. ఇవన్నియు ఉత్తరశిలాయుగములో మారిపోయి నేటివఱకును ఒకేవిధముగ తిరిగి మార్పులేమియు లేక నిలిచియున్నవి. భూగర్భశాస్త్రపరిశోధనలకును, భూనిక్షేపశాస్త్రపరిశోధనలకును గల సంబంధమును కొంచె మిప్పుడు విచారించి చూచెదము. పూర్వశిలాయుగములోని మానవులు మంచుయుగములోను, తత్పూర్వయుగములోను నివసించినట్లు గానబడుచున్నది. తత్పూర్వయుగములో దేశములోని శీతోష్ణ

పూర్వచారిత్రిక యుగము.

స్థితి మిక్కిలి యనుకూలముగ నుండి మంచుయుగము వచ్చుట
చేత, ఖండమే ఉత్తర దేశమంతయు మంచుతో కప్పబడిపోవుటచేత,
నచ్చటివారు బహు యిక్కట్టులపాలైనట్లు తోచుచున్నది. ఈ
మంచుయుగములోనే దేశములోని జంతువులన్నియు నశించి
నశించవలెను.

పూర్వశిలాయుగపు మనుష్యులలో కొందరు మంచుయుగ
మును గడచి బ్రదికినట్లు కనబడుచున్నది. ఉత్తరశిలాయుగము,
కాంశ్యయుగము, ఇనుపయుగము యీ మూడును మంచు
యుగానంతర యుగములో ప్రవేశించినవి. కనుకనే చతుర్థయుగ
మునకు ద్వారము మానవ్యసంబంధ ముఖ్యాంశము నిదర్శనములు
గలవు. అదిగాక తృతీయ యుగములో సైతము మనుష్య
సంచారము యున్నట్లు నిదర్శనము నూతనపరిశోధనలవలన తేటపడు
చున్నది.

ఈ మంచుయుగ మెన్ని సంవత్సరముల క్రిందట ప్రబలి
నది? ఉత్తరశిలాయుగ మెప్పుడు ప్రబలినది? ఈ కాలనిర్ణ
యమును గూర్చి యనేకు లనేక యభిప్రాయములను
వెలిబుచ్చి యున్నారు. ఉత్తరశిలాయుగపు ముఖ్యస్థలములో నక్క
డక్కడ దొరికిన ఫలక, ఏకీ మొదలగు వీరుల కర్రలనుబట్టి
కొందరు యీ యుగము క్రీ. పూ. 5 వేల సంవత్సరముల
క్రిందట ప్రబలినట్లు గ్రహించిరి. ఇక పూర్వశిలాయుగ
మెప్పుడు ప్రబలినదో విచారించవలెను. అనగా మంచు
యుగము గతించి తదనంతరయుగ మెప్పుడు ప్రారంభమైనదో
విచారించవలెను.

మంచుయుగమునకు పూర్వము మానుష్యు లీభూగోళముపై ఉత్తరదేశములలో సంచరించుచుండిరి, మంచుయుగము రాగనే, అతిచలిచేతను, అనేకవందల అంగుళముల యెత్తువఱకును దేశమంతటను మంచుగడ్డలతో నిండియుండుటచేతను, నివాసయోగ్యము కాని యాయుత్తరభాగములను వదలి దక్షిణముగా భూమధ్యరేఖ వైపునకు వచ్చిచేరినట్లు తెల్లమగుచున్నది. మొదట నివాసయోగ్యముగనుండి, పిమ్మట మంచుయుగము రాగానే దేశము పైని ప్రజలు నివసించుటకు దుస్సాధ్యమయ్యెను. దేశమంతయు మంచుతో గప్పబడుటకు కారణమేమి? మంచుయుగము తటస్థించుటకు కారణమేమి? ఆ మంచుయుగము తటస్థించినందువలన దేశముయొక్క రూపము మారిపోవుటకుగల కారణమేమి? ఈ విషయములన్నిటిని ప్రత్యేకాధ్యాయములో జర్చించెదము. ప్రస్తుతము మనము విచారించవలసిన యంశమేమనగా, ఈ మంచుయుగ మెప్పుడంతమొందినది? ఈ మంచుయుగము తటస్థించుటవలన భూగోళము యొక్క పైభాగమంతయు మారిపోయినదని చెప్పియుంటిమి. విస్తారమైన పర్వతములవంటి మంచుగడ్డల బరువుచేత నదివఱకు ఎత్తుగనున్న భూభాగములు పల్లములైనవి. పల్లముగనున్న భూభాగము లెత్తైనవి. ఈ పెద్దపెద్ద మంచుగడ్డలు పర్వతశిఖరములనుండి క్రింది లోయలలోనికి పర్వతపార్శ్వముల వెంబడి జారుటవలన పర్వతపార్శ్వము లన్నియు కోతపడినవి. ఇట్లు కోతపడుట కెంతకాలము పట్టును? ఈ విధముగ కొండ

...లో బడిన మంచుగడ్డలపై తిరిగి కాలక్రమమున
...ట్టి మొదలైన మట్టిపొరలు పేరుకొనుట కెంతకాలము
...? వీని నన్నిటిని విచారించి లెక్కవేసి చూచి,
...యు జరుగుటకు షుమారు 7, 8 వేల సంవత్సరములు
... అమెరికాదేశపు భూగర్భశాస్త్రవేత్తలు నిర్ణయించిరి.
...డు దేశపు సరస్సులలో బేరుకొనిన వండుమట్టి పొర
... చూడఁగా పూర్వశిలాయుగ మంతమొంది (అనగా
...యుగ మంతమొంది), ఉత్తరశిలాయుగము ప్రారం
...షుమారు 7, 8 వేల సంవత్సరములైనదని నిర్ణయించిరి.
...ంశములు నొకేకాలమును సూచింపుచున్నవి.
... ఆర్యులు ఉత్తరధ్రువమండలమందు ప్రళయోత్పా
... మహోన్నత నాగరికతయుండగ, ఐరోపాలో
... ఇతరులు పూర్వశిలాయుగమునాటి మోటుతనము
...యుండిరి. ప్రళయానంతర మార్యులు ధ్రువమండల
...విడచి, అనేక శాఖలుగ చీలి నూతన నివేశనములకై
...ట్లు తిరుగాడుచుండిరి. ఈ ప్రళయముచేతను, యిండ్లు
... లేక తిరుగాడుటచేతను, వీరు తమ పూర్వపు
...హోన్నత నాగరికతను చాలవరకు గోల్పోయిరి. వీరిలో
...శాఖలవారు మొక్కవగ బోగొట్టుకొనిరి. మరికొందరు
...గ బోగొట్టుకొనిరి. ఆశియాఖండములో క్రీ. పూ.
... సం॥ ల నాడు ఆస్సను జగ్నార్టిసు (మధ్యాసియా)
...తముల నిలిచిన ఆర్యశాఖ, ఆకాలమందే ఐరోపా

ఖండములోనికి దిగిన ఆర్యశాఖకంటె నెక్కువయో మి
తక్కువ నాగరికస్థితియం గాంచెను. యూరోపాఖండములో
దిగిన ఆర్యశాఖ అప్పుడు అప్పటికి కాపురమున్న పూర్వ
యుగపు మానవ ఆర్యేతరశాఖలకంటె కొంచె మెక్కు
నాగరికములో నుండెను. అనగా ఉత్తరశిలాయుగపు నా
కములో నుండెను. పిమ్మట యీ రెండుశాఖలవారును
గలసి వృద్ధినొందజొచ్చెను. అనగా యూరోపులో ఉత్తరశిలాయు
ములో 1 ఆర్యజాతియు, 2 ఆర్యేతరజాతులు ఉన్నవన్నమా
వీరికంటె ఎక్కువ నాగరికమున్న దేశములనుండి యిప్పు
కంచు వగైరా లోహసామగ్రి వచ్చుచుండుటచే, యిప్పు
కంచుయుగమును, తరువాత యినుపయుగమును యేర్పడె
యూరోపుఖండమునందు ఉత్తరశిలాయుగపు మనుష్యుల
దొరికిన పుర్రెలనుబట్టి చూడగా, ఎముకలను బట్టి, ఆ
మం దప్పుడు నాలుగు తరగతుల మనుష్యులుండి
పండితులు సిద్ధాంతీకరించిరి. వీరిలో ఒక్కటే మాత్ర
ఆర్యులు తక్కినవారు ఆర్యేతరులు. ఇప్పుడు యూరోపులోను
యీ నాలుగుతరగతుల మనుష్యులును ఆ నాల్గుతరగతుల
మనుష్యులనుండియే పుట్టిరి. అయితే ప్రస్తుతకాలమం
నాల్గుతరగతులవారును ఆర్యభాషలను మాట్లాడుచున్నా
కావున యీ నలుగురిలో అసలు ఆర్యులనుండి పుట్టిన
రెవరు? ఇది వివాదాంశముగ నున్నది. మేమే, మే
యార్యులనుండి వచ్చితిమని జర్మనులును, ఫ్రెంచివారును

స్విస్సు వారును తగాదాపడుచున్నారు. ఈ యంశముల బరీక్షించుటకు పుర్రెల పరిశోధన చాలదు. ఇక యీవిషయము నటుంచి, మన ప్రస్తుతాంశమునకు వత్తము.

పూర్వ మొకప్పుడు ఉత్తరధ్రువప్రాంతదేశమంతయు తృణకాష్ఠజలసమృద్ధిగనుండి ప్రజలునివసించుటకు శీతోష్ణస్థితి బహు అనుకూలముగ నుండియుండుటవలన మన పూర్వులా కాలములో నచ్చట నివసించియున్నట్లును, పిమ్మట కొంత కాలమునకు మంచుయుగము వచ్చి దేశమంతయు మంచుతో ఘనీభవించుకొని పోగా వారచ్చట నివసించుట కనుకూలముగా లేనందున దక్షిణదేశములకువచ్చి చేరినట్లును భూగర్భశాస్త్ర, భూసంక్షేప పరిశోధక శాస్త్రసంబంధమైన నూతన పరిశోధనలవలన స్థిరీకరణచేయబడినది. అదిగాక, మన పూర్వులొకప్పుడు ఉత్తర ధ్రువప్రాంతదేశములలో నివసించినట్లు వేదములలో స్పష్టముగ గానబడుచున్నది. కాని, వేదభాష్యకారులకు యీ విషయములు తెలియనందువలనను, యీభూగోళమునందంతట శీతోష్ణాది స్థితు లెప్పుడును యిప్పుడున్నవిధముననే యుండి యున్నవని వారభిప్రాయపడినందునను, వేదములలోని కొన్ని కొన్ని ఋక్కులకు అర్థము తేటతెల్లముగ నగపడుచున్నను వానిని విరిచి పదార్థములను లాగి యనేక విధముగ అతుకులు పెట్టిరి. ఈ విషయముల నన్నిటిని ముందధ్యాయములో విపులముగ చర్చించెదను.



వైదిక నిలయము

రెండవ అధ్యాయము.

హిమయుగము, హిమప్రళయము.

ప్రస్తుతకాలమున యీభూగోళముపై వసంతగ్రీష్మాది ఋతువులుగలుగుచున్నవి. ఈ ఋతుభేదములు గలుగుటకు అనేకకారణము లున్నవి. వానిలో (1) భూమియొక్క యిరుసు రాసిచక్రమునకు సరిగ నిలువుగనుండక వాలుగ నుండుట ముఖ్యకారణమైయున్నది. భూమి సూర్యునిచుట్టు చేయువార్షిక ప్రదక్షిణములో యీభూమియొక్క ఉత్తరధ్రువము సూర్యునకు వెడమొగముగ నున్నప్పుడు ఉత్తరార్ధగోళమందు చలికాలము గలుగును. దక్షిణార్ధగోళమందు వేసవిగలుగును. ఇట్లే ఉత్తరధ్రువము సూర్యునకు అభిముఖముగ నున్నప్పుడు ఉత్తరార్ధమందు వేసవియు దక్షిణార్ధమందు చలియు తటస్థించును. ఋతుభేదముల కిది యొక్కటే కారణమై యున్నచో మనపని బహుసులభముగ నుండెడిది. భూగోళముపై ఋతువులనడక సదాయీరీతిగనే యుండితీరవలెనని మనము నిర్ధారణచేసియుందుము. కాని మనదురదృష్టవశాత్తు యీఋతువులనడకను నిర్ణయించుటకింక అనేకమైన కారణము

లున్నవి. ఎట్లనగా (2) భూమియొక్క నిమ్నోన్నతములును సముద్రమునందును వాతావరణమందును బుట్టు మహాప్రవాహములును వివిధములగు శీతోష్ణభేదములను గలిగించుటకు కారణభూతములగుచున్నవి. ఉదాహరణము — "గల్ఫుస్ట్రీము" అను ఉష్ణజలప్రవాహమే లేకుండినచో ఐరోపాఖండపు ఎగువభాగమంతయు యిప్పుడు మంచుతో నిండుకొనిపోయుండెడి. మరియు (3) మన గోళముపైనున్న భూ జల భాగముల విస్తీర్ణతనుబట్టికూడ శీతోష్ణస్థితులందు భేద మేర్పడును. పూర్వ మొకప్పుడు "ఆల్ప్సు" పర్వతములు యిప్పటివలె చిన్నగుట్టలుగా నుండెను. హిమాలయ పర్వతములును ప్రకృతిలో భూగర్భమందే యణగియుండెను. ఆసియా, ఆఫ్రికా, ఖండములు నేటి పెద్దవిగ లేవు. అవి కేవలము సముద్రములో నడుమ గుంపులైయున్న చిన్నచిన్న లంకల సమూహములుగా మాత్రము నుండెను. ఈ కారణములచే ఆకాలమందు (ప్రథమయుగమునందు) యీ గోళమంతటిపైనను సరిసమానముగ నొకటే సమశీతోష్ణస్థితియుండెను. కాని, ద్వితీయ తృతీయ యుగములలో పరిస్థితి క్రమముగ మారజొచ్చినట్లు గాన్పించుచున్నది. ఈ రెండుయుగములలోని శీతోష్ణస్థితి మునేటి యుగమందున్నంత సమానముగ లేదు. కొన్నిచోట్ల వేడిగను మరికొన్నిచోట్ల చల్లగను నుండుట తటస్థించెను. ఎవను యిప్పుడున్నంత ఖండితమైన యుత్తరభాగము లప్పటికింకను యేర్పడలేదు. ఇప్పుడున్నట్లు విపరీతపు చలిగాని,

విపరీతపు వేడిగాని లేదు. కాని, త్రేతాయుగము మధ్యము పోగానే యీ గోళముపై మహావిపరీతపు శీతోష్ణస్థితి యేర్పడెను. అనేక హిమప్రళయములు తటస్థించెను. ఒక ప్రళయమునకును రెండవ ప్రళయమునకును మధ్యకాలమందు సమశీతోష్ణస్థితియుండెను. కాని యీ హిమప్రళయములు రాక పూర్వ మీ గోళమునందు—నవంబరు మొదలు మార్చివరకు సూర్యుడు క్షితిజముక్రిందనుండు గ్రీన్‌లాండు "స్పిట్సుబర్గెన్" మొదలగు ధ్రువప్రాంత దేశములలో కూడ—సమశీతోష్ణస్థితియుండెననియు, యిప్పుడు ఉష్ణమండలములలోను, సమశీతోష్ణ ప్రదేశములలోను మాత్రమే గాన్పించు నానావిధ తరు సంతానములుకూడ ఆ కాలమున దట్టముగ బహుళముగను నుండెననియు భూగర్భశాస్త్రవేత్తలు సర్వవాదముగ సిద్ధాంతీకరించినారు.

చతుర్థయుగమందీ చక్రస్థితి నాశనమాయెను, ఆకస్మికముగ హిమప్రళయమువచ్చి దేశమంతయు భగ్నమాయెను. అంతటితో మంచుయుగము ప్రారంభమాయెను. ఈ భూగోళమం దట్టి హిమప్రళయములు తటస్థించినవా యను ప్రస్తావనమే యని బుజువుచేయుటకు కావలసిన సాక్ష్యములన్నియు యీ చిన్ని యధ్యాయమందు క్లుప్తముగ నైన వివరించుటకు సాధ్యపడదు. ఈ ప్రళయములయొక్క స్వభావమును మాత్రమిచ్చట సూక్ష్మముగ సూచింతుము, ఇవి యట్లు సంభవించుటకు గల కారణములను గూర్చి భూగర్భాది శాస్త్రవేత్త

పూర్వము కనీసము రెండు ప్రళయములు తటస్థించి యుండవలెను. ఇట్టి ప్రళయములు నాలుగు వచ్చెననియు, మధ్యమధ్య చక్కని సమ శీతోష్ణస్థితి యుండెననియు "గెయికీ" పండితుడు చెప్పుచున్నాడు. కాని, తక్కిన పండితు లీ యభిప్రాయము నంగీకరింపలేదు. ఏది యెట్లున్నను కనీసము హిమప్రళయములు రెండైనను వచ్చెననియు, యీ రెంటికిని మధ్య చక్కని శీతోష్ణస్థితి యుండెననియు, పండితు లెల్ల రంగీకరించుచున్నారు. ఈ విషయములో అభిప్రాయభేదము లేదు.

మంచుయుగములో ఉత్తరమంతయు (మంచుచే) మొత్తును [illegible] చలిగను ఉండును. మధ్యయుగములో మంచు కరిగిపోగాన్ అదివరకు మంచుయొక్క బరువువల్ల పడిన గోతులు కనుపించును. సమశీతోష్ణము లుండును. ప్రస్రవాతములుకూడ మానవ నివాసమున కనుకూలముగ నుండును. పైనచెప్పిన రెండు ప్రళయములవల్ల కలిగిన రెండు పూడికల పొరల మధ్యభాగమందు పూర్వ శిలాయుగ మానవుల [illegible]ములు కాన్పించెను. కాబట్టి చతుర్థ యుగమందు తప్పక రెండు ప్రళయములు వచ్చెనని సిద్ధించుచున్నది. ఈ రెండు ప్రళయములకు మధ్యకాలములో నులి వెచ్చని శీతకాలమును, హాయియైన వేసవియు నుండెను. అందుచే వసంతసమారాధితములగు వృక్షాదులు, ఏనుగులు, ఖడ్గమృగములు, [illegible]ములు మొదలగు క్రూరమృగములును

ఉత్తరధ్రువ మండలమం దంతటను స్వేచ్ఛగ చరించుచుం డెను. నరమాంసభోజులగు యిన్ని క్రూరజంతువు లున్నప్పటికిని బూర్వశిలాయుగ మానవుని కెట్టి యిబ్బందియు లేకుండెను"—అని "గెయికీ" పండితుడు చెప్పుచున్నాడు.

హిమప్రళయము వచ్చినదని పండితులెల్ల రంగీకరించినను యిది వచ్చుటకుగల కారణమును గూర్చి వారిలో వారికేకాభిప్రాయము కుదురలేదు. అనేకు లనేక సిద్ధాంతములను జేసియుండిరి. ఎవ రెన్ని సిద్ధాంతముల జేసినను రెండు ప్రధానాంశములను మాత్రము గమనించితీరవలెను. ఉత్తర ఐరోపా, అమెరికాఖండములను ముంచివేయగలిగినంత మంచు ఊరక — అకారణముగ — పుట్టియుండదుగద. మొట్టమొదట, దీనికి కావలసిన నీటియావిరిని కల్పించుటకు తగినంత వేడి యాగోళమం దెచ్చటనో యుండితీరవలెను. అచ్చటనుండి ఈ యావిరిని శీతలప్రదేశములకు గొంపోయి అచ్చటనది మంచుగ వర్షింపజేయగలిగినన్ని వాయుతరంగము లుండితీరవలెను. హిమప్రళయము సంభవించుట కివిరెండును ప్రధానకారణములు. ఈ ప్రధానకారణముల రెంటిని గుర్తింపకుండ చేసిన సిద్ధాంతము లెందునకును పనికిరావు. అదిగాక, ఒక్కప్రళయమేగాక, అనేక ప్రళయములేల వచ్చెనో కూడ చెప్పవలెను.

హిమప్రళయము లేలవచ్చెనో దెలుపు సిద్ధాంతము లిప్పుడు షుమారు 7 గలవు. వాని నిట క్లుప్తముగ వివరించెదను.

1. బహుశః పనామాభూసంధియొకప్పుడు సముద్రములో మునిగియుండి యుండవచ్చును. అందువలన "గల్ఫుస్ట్రీము" అని యిప్పుడు చెప్పబడు ఉష్ణసముద్ర జలప్రవాహము ఉత్తరదేశములవైపునకు బోక దక్షిణముగ ప్రవహించుచుండెడిదిగాబోలు. ఆ కారణముచేత ఉత్తరధ్రువప్రాంతదేశములు మంచుతో ఘనీభవించుకొనిపోయి యుండవచ్చును. అనికొందరు చెప్పిరి. కాని పనామాభూసంధి సముద్రములో పూర్వమొకప్పుడు మునిగియున్నట్లు నిదర్శనము లెంతమాత్రమును లేవు. కాన యీ సిద్ధాంతమును త్రోసివేసిరి. (2) మరియొక రెండవసిద్ధాంతమును బయలుదేర దీసిరి. ఈ భూగోళము యీ బ్రహ్మాండగోళములో తిరుగుచున్న సమయము లొకప్పుడు బహుశీతల ప్రదేశములగుండను మరియొకప్పుడు ఉష్ణప్రదేశములగుండను సంచారముచేసి యుండవచ్చును. అందువలన ఒకప్పుడు మంచుయుగము, మరియొకప్పుడు సమశీతోష్ణస్థితియు తటస్థించి యుండవచ్చును. కాని, భూగోళ మీవిధముగ తిరిగెనని చెప్పుట కెంతమాత్రమును నిదర్శనములు లేవు. కాన యీసిద్ధాంతమును గూడ త్రోసివేయవలసినదే. (3) ఇక మూడవసిద్ధాంతమును విచారించెదము. భూగోళమునకు కావలసిన ఉష్ణము సూర్యమండలము నుండి వచ్చుచున్నది. ఇది అందరికిని తెలిసిన విషయమే. ఇట్లు సూర్యమండలమునుండి వచ్చు ఉష్ణములో హెచ్చుతగ్గులుండి యుండవచ్చును. ఒకప్పుడు ఉష్ణ మధికముగను, మరి

యొకప్పుడు తక్కువగను నష్టయిఅయిన కారణమున మంచు యుగములును సమశీతోష్ణయుగములును తటస్థించి యుండ వచ్చును. కాని యీసిద్ధాంతమును బుజువుపరచుటకు తగి యును ఆధారములు లేవు. కాబట్టి దీనినికూడ త్రోసిరాజన వలసినదే. (4) ఇంకొక సిద్ధాంతమును విచారించెదము. ఈ భూగోళ మొక ఇరుసుమీద తిరుగుచున్నట్లు తిరుగుచున్నదని అందరికిని తెలియును. మొదటనున్న యిరుసు అకస్మాత్తుగ మారిపోయి మధ్య మరియొక యిరుసుమీద భూమి తిరుగ నారంభించినయెడల, శీతోష్ణస్థితియం దిట్టి మార్పులు కలుగ వచ్చును. కాని మొదటి ఇరుసు మారిపోయి, రెండవ ఇరుసు వచ్చినయెడల యీ రెండవ ఇరుసుతో బాటు, రెండవ భూ మధ్యరేఖయు, యీ రేఖచుట్టును భూమి యుబ్బినట్లు ఉబ్బు ఆకారమును కూడ తటస్థింపవలెను. కాని అట్టి రెండవ యుబ్బుడు ఆకారమేమియు కానబడదు. కాన దీనిని నమ్ము టకు వీలులేదు. (5) ఈ భూగోళము మొదట (సూర్యమండ లమువలె) మంటలు మండుచున్న అగ్నిగోళమువలె నుండె ననియు, పిమ్మట క్రమక్రమముగ చల్లబడి ఇప్పు డీస్థితికి వచ్చె ననియు ప్రకృతిశాస్త్రవేత్తలు తలంచుచున్నారు. ఇట్లీభూమి కాలక్రమమున చల్లబడుటలో తక్కినప్రదేశము లన్నిటికంటె ఉత్తరధ్రువప్రాంతభాగములు ముందు చల్లారెననియు, అట్లు చల్లారుటవలన వృక్షములు, మృగములు, మనుష్యులు మొద లగు ప్రాణికోట్లుద్భవించి యచ్చట వాసయోగ్యముగ


నుండుటవలన నచ్చట నివసింపసాగె ననియు మరి కొందరు చెప్పిరి. ఇది నిజమని మన మొప్పుకొన్నను, 4, 5 మంచు యుగములు వరుసగ నెట్లు తటస్థింపగలవు? కొంతకాలము మంచు యుగములును, మధ్యమధ్య మరి కొంతకాలము సమశీతోష్ణయుగములును, తటస్థించుటెట్లు? కనుక, ఈ సిద్ధాంతమునుకూడ మన మొప్పుకొనజాలము. ఇట్టి సిద్ధాంతముల నన్నిటిని త్రోసివేయగ, నింకను మిగిలినవి రెండు గలవు. ప్రస్తుత మొకవిధముగ నిలిచియున్న వీ రెండు సిద్ధాంతములే. (6) వీనిలో "లయల్" పండితుని సిద్ధాంత మొకటి. "భూగోళముపైనున్న భూ, జల భాగములయొక్క విస్తీర్ణతయందు మార్పులు గలుగు చుండును. పెద్దపెద్ద భూ భాగములు కొంతకాలమునకు సముద్రములోనికి క్రుంగిపోవుచుండును. క్రొత్తక్రొత్త భూ భాగములు సముద్రగర్భమునుండి పైకి లేచుచుండును. హిమప్రళయములు సంభవించుటకు కావలసిన శీతోష్ణములు పుట్టుటకిట్టి మార్పు లొక్కటే చాలు" నని "వాలెస్" పండితుడు చెప్పుచున్నాడు. కాని, యింతపెద్ద భూ భాగములు సముద్రములోనికి క్రుంగిపోవుటకును, క్రొత్తవి లేచుటకును ఎన్నియో లెక్కలేనన్ని వేలసంవత్సరములు పట్టును. సుమారు రెండులక్షల సంవత్సరములకు తక్కువ పట్టదని యీ సిద్ధాంతవాదులలో కొందరు తలంచుచున్నారు. అయిన, [illegible] రెండు లక్షలని చెప్పుచున్నారు. వీరిలోనే మరికొందరు 20, 25 వేల సంవత్స

రములకంటె యెక్కువ యుండదని చెప్పుచున్నారు. ఈ రెండంటెలకును చాల భేద మున్నది. ఏది సరియైనదో చెప్పజాలము. కాని మన మింతవరకు మాత్రము చెప్పగలము. ప్రళయానంతర మిప్పటివరకు గడచిన కాలమునకం యెన్నియో రెట్లు యెక్కువ కాలమని మాత్రము చెప్పగలము.


ఇక చిట్టచివరది (7) క్రోలుగారి సిద్ధాంతము. ఈ సిద్ధాంతము ఖగోళాంశములమీద నాధారపడి యున్నది. ఒకటికంటె యెక్కువ ప్రళయము లేలవచ్చునో చెప్పుచున్నది.

PQ' AQ [Block No. 1] అను నది భూమి సూర్యుని చుట్టు వార్షిక ప్రదక్షిణముచేయు బాట. ఈ బాట వృత్తముగ లేదు. అండాకారముగ అనగ, (కోడిగ్రుడ్డు ఆకారముగ) నున్నది. సూర్యుడీ అండమునకు మధ్య బిందువైన C యందుండక, కేంద్రస్థానములైన S, ౧ ల రెంటిలో నేదేని యొకటి దానివద్దమాత్రమే యుండును. కనుక సూర్యుడు S వద్ద నున్నాడనుకొందము. అప్పుడు భూమి P వద్ద నున్నచో రవి భూములకుగల దూరము హ్రస్వతమముగ నుండును. A వద్దనున్నచో దీర్ఘతమముగ నుండును. (కావున యీ P,A యను రెండు బిందువులకును హ్రస్వాంతరము, దీర్ఘాంతరము అని పేర్లు పెట్టుదము) భూమియొక్క యిరుసు తన బాటయొక్క వలయతలమునకు (plane కు) నిలువుగ నుండక వంపుగ నుండును. మరియు, భూమి సూర్యునకు ప్రదక్షిణ మొనర్చు

[illegible] 1.



బొమ్మ 2.



టలో దాని యిరుసు సదా ఒకే దిక్కున కుండునుగాని యొకొక ప్రక్కకు మారదు. ఈ రెండు కారణముల చేత ఋతుభేదములు కలుగుచున్నవి. ఎట్లనగ, భూమి P వద్ద, యిరుసు సూర్యునకు విముఖముగ నిలుచున్నప్పుడు ఉత్తరార్థగోళమందు చలికాలము వచ్చును. అట్లేభూమి A వద్ద, యిరుసు సూర్యునకు అభిముఖముగ నిలుచున్నప్పుడు ఉత్తరార్థగోళమందు వేసవికాలము వచ్చును. భూమియొక్క యిరుసునకు చలనము లేకుండ స్థిరముగనున్నచో, ఉత్తరార్థగోళమందు హేమంత గ్రీష్మఋతువులు సదా క్రమముగ P, A ల వద్దనే తటస్థించుచుండెడివి. కాని, ప్రకృతిశాస్త్రము, యిరుసు స్థిరమైనది కాదు. దానికిగూడ బహుసూక్ష్మమైన చలనముగలదు. అది రాశిచక్రధ్వజముచుట్టు 25 వేల 8 వందల 68 సంవత్సరములకొక * ప్రదక్షిణము చేయును. కావున, భూమియొక్క యిరుసునకును దానిబాటయొక్క † (లేక రాశిచక్రము యొక్క) వలయతలమునకునుగల వంపు యీ 25,868 సంవత్సరముల యవధిలో సర్వదా సమానముగనుండక మారుచుండును. (పటముచూడుడు) అందుచేత యీమహాయవధిలో ఋతువులు భూప్రదక్షిణములో సదా ఒకేనిర్దిష్ట ప్రదేశమందురాక, వేర్వేరుస్థలములందు వచ్చుచుండును. ఉదాహరణ - ఈమహాయవధిలో ఒకానొకకాలమందు భూమి P

* ఇదిగాక విషువత్ బిందుచలనమునకు కూడ కారణమగుచున్నది.

† భూమియొక్కబాటయు, రాశిచక్రమును ఒక్కటేయని గ్రహించునది.

వద్దనుండగ ఉత్తరార్ధగోళమందు శీతకాలము తటస్థించినచో, మరియింకొకకాలమం దది p వద్దనుండగ రావచ్చును. మరి యింకొకకాలమునకు A వద్దనుండగ రావచ్చును. ఇట్లు పోగా పోగా 25868 సం॥ పూర్తియగునప్పటికి తిరిగి P వద్దనుండగ రావచ్చును. ఈక్రమముననే ఉత్తరార్ధగోళమందు వేసవిభూమి A వద్దనుండగ రావచ్చును. ఇంకొక కొంతకాలమునకు a వద్దనుండగ రావచ్చును, లేదా P వద్దనుండగ రావచ్చును. ఇట్లుపోగాపోగా 25,868 సం॥ పూర్తికాగానే తిరిగి A వద్దనుండగ రావచ్చును. (ఈక్రమమే విషువద్బిందువులకుగూడ వర్తించును.)

ఇక ప్రస్తుతాంశమునకు వత్తము. భూమి p వద్దనుండగ ఉత్తరార్ధగోళమందు శీతకాలము వచ్చిన దనుకొందము. భూమి P వద్ద నున్నప్పటికంటె యిప్పు డది సూర్యునకు నెక్కువ దూరములోనున్నదని మనము తప్పక గ్రహించవలెను. ఇట్లుపోగాపోగా, ఒకానొకసమయమందు భూమి A వద్దనుండగ ఉత్తరార్ధగోళమందు శీతకాలమువచ్చును. అప్పుడు భూమికిని సూర్యునకును మధ్యదూరము దీర్ఘతమమగును. భూమి P వద్దనుండగ శీతకాలము వచ్చుటకును, A వద్దనుండగ వచ్చుటకును నెంతో భేదమున్నది. P వద్దనుండగ భూమి సూర్యునకు బహు సమీపమం దుండుటచే శీతకాల మంత తీవ్రముగనుండదు. కాని, A వద్దనుండగ శీతకాలమువచ్చినచో భూమి సూర్యునకు బహుదూరమందుండుటచే శీతకాలము

భరింప శక్యముగానిదిగ నుండును. ఎట్లయినను, యీ 25868 సంవత్సరములలో ఒక్కమారైనను శీతకాల మీభూమి A వద్దనుండగ వచ్చితీరవలెను. కాబట్టి శీతకాలము P వద్దనుండి A వద్దకు నడచుటకు సాధారణముగ 25868/2=12934 సం॥రములు పట్టును. కాని, హ్రస్వాంత దీర్ఘాంత బిందువులు (P, A లు) మాత్రము స్థిరమైనవా? వానికికూడ బహుసూక్ష్మమైన వెనుకనడక గలదు. కాబట్టి, మనము పైనచెప్పిన 25868 సం॥ల యవధిని 20,984 సంవత్సరములకు (అనగ షుమారు 21,000 సం॥లకు) తగ్గించుకొనవలెను. అనగ, భూమిహ్రస్వాంతరమగు P వద్దనుండగ యిప్పు డొకప్రదేశమందు శీతకాలము వచ్చిన చో యింక 10,500సం॥ లకు ఆప్రదేశమందే శీతకాలము భూమి దీర్ఘాంతరమగు A వద్దనుండగ వచ్చును. మనమిచ్చట నొక సంగతి తెలిసికొనవలెను. ఆన 1250 సం॥లో భూమి P వద్ద నుండగ ఉత్తరార్ధగోళమందు శీతకాలము వచ్చెను. కాబట్టి (1250 + 10500)= ఆన 11750వ సం॥లో భూమి A వద్దనుండగ భరింపశక్యముగాని శీతకాలము ఉత్తరార్ధగోళమందు రాబోవుచున్నది. ఈప్రకారమే, వెనుకకు లెక్కవేసికొని వెళ్ళగ (1250-10500=-9250) క్రీ॥పూ॥ 9250 సం॥ల నాడు భూమి A వద్దనున్నప్పుడు భరింపశక్యముగాని శీతకాలము వచ్చెను.

సూర్యుడు అండాకారమునకు సరిగ మధ్యనుండక ఒక ప్రక్క నుండును. మరియు యీయండాకారమైనను సదా

యేకరూపముగనే యుండక, ఒక్కొక్కప్పుడు లావుగా ఉబ్బ చుండును, మరియొకప్పుడు సన్నగిలుచుండును. ఈ రెండు కారణములచే వేసవి శీతకాలముల యవధులలో భేదములు గలుగును. ఈ అండము బాగుగ సన్నగిల్లినప్పుడు భూమి P వద్దనుండగ శీతకాలము వచ్చినచో అది ఆ సంవత్సరమువచ్చు వేసవికంటె 33 దినములు తక్కువగ నుండును. కాని, 10500 సం॥ లు దాటినపిమ్మట శీతకాలము భూమి A వద్దనుండగ వచ్చును. అప్పుడు శీతకాలము ఆ సంవత్సరమందు వచ్చు వేసవికంటె 33 దినము లెక్కువగ నుండును. ఇది కూడ శీతకాలమును దుర్భరముచేయుటకు తోడ్పడును. ఈ ప్రకారము వేసవి, శీతకాలములకుగల భేదము-అండాకారము యొక్క కొలతనుబట్టి- 7½ మొదలు 33 రోజులవరకు మారుచుండును. 33 రోజులు మించదు.

శీతకాలమును దుర్భరముచేయు పరిస్థితి యింకొకటి గలదు. ఇరుసుయొక్క వంపు షుమారు 23°-27' లుగ గ్రహించి సర్ రాబర్టుబాల్ గారు లెక్కవేసి చూచి తెల్పిన సారాంశమేమనగ - సూర్యునివల్ల యీ భూమిమీదికి సంవత్సరమునకు సగటున 365 మాత్రల వేడి వచ్చుననుకొందము. దీనిలో ప్రతి అర్థగోళమునకు వేసవిలో 269 మాత్రలును, శీతకాలములో 136 మాత్రలును మాత్రమే లభించును. దీనినిబట్టి ఉత్తరార్థగోళమందు అతిదీర్ఘమైన శీతకాలమునకు 136 మాత్రల వేడిని మాత్రమే పంచిపెట్టవలసి వచ్చినప్పుడు అచ్చటవేడి

యెంత కరుపువచ్చునో గ్రహింపుము. ఇట్టిస్థితిలో కొద్దికాలము నులివెచ్చని వేసవియు, దీర్ఘకాలము అతిచలితోఁగూడిన శీతకాలమును తటస్థించును.

ఈ శీతకాలములో పేరుకొన్న మంచును కరగించుటకు కొద్దిపాటి నులివెచ్చని వేసవి యెంతమాత్రమును చాలదు. కావున సంవత్సరములు గడచినకొలది మంచుగుట్టలు పేరుకొనుచుండును. ఇదియే మంచుప్రళయము. ఈరీతిగనే మంచుయుగము వచ్చును.

పైన చెప్పినప్రకారము 21000 సం॥ ల కొకపర్యాయము భూమి A వద్దనున్నప్పుడు ఉత్తరార్ధగోళమందు శీతకాలము వచ్చుచుండును. అప్పుడే మంచుయుగము తటస్థించును. ఈరీతిగ షుమారు 21000 సం॥ ల కొకపర్యాయము హిమప్రళయము వచ్చుచుండును.

క్రోలుగారి సిద్ధాంత మింతవరకు బాగుగనే యున్నది. దీనిని అంగీకరించిరనియే చెప్పవచ్చును. కాని, వారేవో కొన్ని లెక్కలను వేసిమొదటి క్రిందటి హిమప్రళయము గతించి యిప్పటికి 80 లేక 100 వేల సంవత్సరములైనదని చెప్పిరి. ఈ లెక్కలు సరియైనవి కావని తక్కిన పండితులు చెప్పుచున్నారు. అదిగాక, మొదటి అధ్యాయములో అమెరికను భూగర్భశాస్త్రవేత్తలు తేల్చిన 8 లేక 10 వేల సంవత్సరముల కంటె యిది చాల యెక్కువగ నున్నది.

క్రోలుగారి అంకెలెట్లున్నను మనమింతవరకు మాత్రము గ్రహించవచ్చును. A వద్ద శీతకాలము వచ్చుటయు, లయల్ మొదలగు వారు చెప్పిన భూ, జలవిభాగము లనుకూలముగ నుండుటయు—ఈ రెండును హిమప్రళయముల గల్పించుటకు చాలును. 21000 సం॥ల కొకపర్యాయము A వద్ద శీత కాలము వచ్చును.

ఈ లెక్కల నింతటితో నిలుపుదము. ఆర్యులు ఐరోపా యందును, ఆక్సను జక్సార్టీసు, సింధునదీ ప్రాంతములందును నివసించుటకు పూర్వము దెచ్చటనుండిరో వేదప్రమాణ సహితముగ కనుగొనుటయే నాకీగ్రంథమందు కర్తవ్యమైయున్నది. కావున, యీ కర్తవ్యమునకు సంబంధించినంతవరకు, యీ రెండధ్యాయములలో చర్చించిన సారాంశమిట స్పష్టముగ వివరించెదను.

(1) ఆర్యభాషల మాట్లాడు నిప్పటి యూరోపియన జాతుల పూర్వజులచేత ఉత్తరశిలాయుగారంభమందే ఐరోపా ఖండము నిండియుండెను.

(2) ఉత్తరశిలా యుగారంభమందే ఐరోపాలో ఆర్య జాతి యొకటియుండెను. గావున వీరు ప్రళయానంతరమందు ఆశియానుండి యూరోపుకు వచ్చినవారు కారు. అయినను, వీరేదేశమునుండియు రాక అగడ్డలోనే పుట్టినారని చెప్పుట

కును వీలు లేదు. ఇంతమాత్రముచే వీరిమూలస్థాన మెద్దియో నిర్ణయము కాలేదు.

(3) లోహయుగము యూరోపులోనికి పరదేశస్థుల వలన తీసికొనిరాబడినట్లు తెలియుచున్నది.

(4) ఇనుప, కంచు, శిలాయుగములు అన్నిదేశముల లోను సమకాలికములుగావు. ఈజిప్టులో మహోన్నత నాగరిక మున్న సమయమందే యూరపులో ఉత్తరశిలా యుగపు మోటతనముండుట అసంభవముకాదు.

(5) ఆధునిక భౌతిక శాస్త్రప్రమాణరీత్యా క్రిందటి హిమప్రళయమువచ్చి యిప్పటికి పదివేలసంవత్సరములు(లేక క్రీ॥పూ॥8000ల) కంటె యెక్కువకాలేదని సిద్ధించుచున్నది.

(6) మనుష్యుఁడు హిమప్రళయానంతరమే పుట్టెనని యిదివరకు పండితులు తలంచిరి. కాని, యిదిసరికాదనియు, మానవుడు చతుర్థయుగమందుండెననియు, తృతీయయుగములో కూడ నుండెనని తెలియుచున్నది.

(7) కనీసము హిమప్రళయములు రెండైనను వచ్చెను. ఈ రెంటికినిమధ్య చక్కని సమశీతోష్ణస్థితి యుండెను. ఆ కాలమున నీ గోళములోనున్న భూజలభాగములు యిప్పటి కంటె చాల వేరుగనుండెను.

(8) ఈ మంచుయుగములలో శీతోష్ణస్థితులు చాల హెచ్చుతగ్గులుగ నుండెను. హిమప్రళయములలో అతి చలిగ నుండెను. మధ్యకాలములో సమశీతోష్ణముగ నుండెను.

(9) ఆశియా యిరోపా, ఖండములలోనున్న ఉత్తర ధ్రువ మండలములలో క్రిందటి ప్రళయోత్పూర్వము హాయి యైన వేసవియు నులివెచ్చని శీతకాలమునుండెను. అది యే విధముగ "సంతత వసంతసమయము" గ నుండెనని హార్నెల్ పండితుడు చెప్పుచున్నాడు. నవంబరు మొదలు మార్చి వరకు సూర్యుడు క్షితిజము క్రిందికి గ్రుంకియుండు స్పిట్సు బర్గెన్ మొదలగు ధ్రువప్రాంతములలో సైతము యిప్పుడు ఉష్ణమండలములలో మాత్రమే పెరుగు తమాలశాఖలు దట్టముగ పెరిగియుండెను.

(10) హిమప్రళయము వచ్చుటచేతనే యీ చక్కని దేశము పాడైపోయెను. ఉష్ణమండలములలో పెరుగు చెట్లు గాని, మృగములుగాని నివసించుటకు వీలులేకపోయెను.

(11) ఈ హిమప్రళయ మేలవచ్చెనో తెలిసికొనుటకు మనకు ఖగోళశాస్త్రప్రమాణములే యెక్కువ విశ్వసనీయములుగ నున్నవి. కాని, దీని కాలనిర్ణయ మొనర్చుటకు మాత్రము భూగర్భశాస్త్రప్రమాణముల నాధారముగ గొనుట యెక్కువ శ్రేయస్కరము.

(12) "గెయికీ" గారి సిద్ధాంతమునుబట్టి రెండు గాక 4, 5, ప్రళయములుగూడ వచ్చినట్లు తెలియుచున్నది.

(13) ఒక్క ఆర్యులేగాక, తక్కిన మానవకోటి కంతకును ఉత్తరధ్రువమండలమే పుట్టినయిల్లు (శైశవ

ష్ణోలిక) యయ్యెనని చాలమంది పండితులు చెప్పుచున్నారు. వృక్షములు, జంతువులును ఆదియందచ్చటనే పుట్టుకగాంచె నని చాలమంది శాస్త్రవేత్తలు చెప్పుచున్నారు.

వేదములందు ఉత్తరధ్రువనివాసమును సూచించుటకు ప్రమాణము లేమైన గాన్పించినచో, అవి యిప్పటి భౌతిక శాస్త్రప్రమాణములకు విరోధముకాజాలవని తెలిసికొనవలెను. విరోధముకాకపోవుటయే గాక అవి యీసిద్ధాంతమునకు చాల అనుకూలముగకూడ నున్నవి.



వైదిక నిలయము

మూడవ అధ్యాయము.

ధ్రువప్రాంత లక్షణములు.

హిమయుగమునకు పూర్వయుగములలో యీ భూమి యొక్క పైయాకారము యిప్పటివలె లేక వేరుగ నుండె ననియు, అప్పటి భూజలభాగములు వేరుగనుండెననియు, చెప్పియున్నాము. ఈ సిద్ధాంతము భూగర్భశాస్త్రపరిశోధనల వలన ధ్రువపరుపబడినది. దీనిని త్రోసివేయుటకిక వీలు లేదు. కనుక పూర్వయుగములలో నుత్తరధ్రువమునుచుట్టి కొంత భూభాగముండెనని మనముతలంపవచ్చును. ఈ విషయమును కూడ భూగర్భశాస్త్రమే ఋజువుపరుచుచున్నది. ఇప్పుడు ఉత్తర ధ్రువముచుట్టునున్న "నోవాజంబ్లా" "స్పిట్సుబర్గ" మొదలగు లంకలన్నియు, పూర్వము సముద్రముపైకి కనబడు చుండిన భూభాగముమీది పర్వతశిఖరములనియు, ఆ భాగము నీటిలో మునిగిపోగా యీపర్వత శిఖరములు మాత్రము పైకి కనబడుచు సముద్రము మధ్య లంకలవలె నిలిచియున్న వనియు భూగర్భశాస్త్రవేత్తలు నిర్ధారణచేసిరి. మరియు చతుర్థయుగమందంతటను యీయుత్తరధ్రువప్రాంత భూభాగములపై పశుపక్ష్యాదులును, నరులును నివసించుచుండినట్లు

కూడ భూగర్భశాస్త్రపరిశోధనలవలన ఋజువైనది. ఇకనిచ్చటి శీతోష్ణస్థితి విషయమై ప్రజలు నివసించుట కనుకూలముగనే యుండెనని రెండవ అధ్యాయములో చెప్పియుంటిమి. అచ్చట శీతోష్ణస్థితి "సంతతవసంతసమయ" (Perpetual Spring) మన్నట్లుండెనని కొందరు శాస్త్రవేత్తలు పలికియున్నారు.

ఉత్తరధ్రువముచుట్టును పూర్వమొకప్పుడు ప్రజలు నివసించుటకనుకూలమైన శీతోష్ణాది స్థితులుగల భూభాగముండెనని మన మొప్పుకొంటిమి. అంతమాత్రముచేత ఆర్యసంతతి వారా కాలములో నాదేశములలో నివసించుచుండిరని మన మెట్లు చెప్పగలము? దీనికై మనవేదములను పరీక్షించి చూడవలెను. ఉత్తర ధ్రువప్రాంతదేశలక్షణము లేవైన యీ పూర్వగ్రంథములలోను, వారి యాచారములలోను వారి గాథలలోను కనుపించినయెడల మనవారొకప్పు డచ్చట నివసించియుండి యుండవలెనని మనము నిర్ధారణ పరుపవచ్చును. ఋగ్వేదమునందు కొన్నికొన్ని చిత్రమైన అంశములును, గాథలునుగలవు. వీనికన్నిటికిని చాలభాగ మేదోవిధముగ అతుకులుపెట్టి ప్రాచీన భాష్యకారులు అర్థమును చెప్పిరి. ఈయర్థము లంతమాత్రమును తృప్తికరముగ లేవు. అదిగాక, యేవిధముగ విరిచి అతుకులుపెట్టి అర్థము చెప్పుదమన్నను సాధ్యపడని కొన్ని కొన్నియంశము లింకను ఋగాదివేదములందు మిగిలియే యున్నవి. పోనీ యీఋక్కులయందేమైన పదకాఠిన్యముగాని, అర్థకాఠిన్యముగాని యున్నదేమోయనిన అది

యును లేదు. పైకి చూడబోయిన అన్నియును తెలిసిన మాటలే, అన్నియు తేలికమాటలే కాని వాని నిజభావ మేవిధముగ జూచినను మన యీదేశకాల పాత్రములతో సమన్వయింపజాలము. కాని యీబుక్కులలోని యంశములనే ఉత్తరధ్రువప్రాంతదేశములతో పోల్చిచూచినప్పుడు మాత్రము సర్వమును సంపూర్ణముగ సమన్వయమగును. ఆవర్ణనలు ఆ దేశకాలాదివ్యవహారములు, ఆ చిత్రవిచిత్రములగు రాత్రింబవళ్ళ తారతమ్యములు అన్నియును ఉత్తరధ్రువదేశములకే సరిపోవును గాని, మన హిందూదేశము మొదలగు దక్షిణ భూభాగముల కెంతమాత్రమును సరిపోవు. పూర్వ మెకప్పుడు మనయార్యులీ ఉత్తరధ్రువప్రాంతదేశములలో నుండిరను అనుమానము మన భాష్యకారుల మనస్సునకు తట్టనందున, పైకి బహు తేలికగ గనుపడుచున్న కొన్నికొన్ని వేద వాక్యములకు నిజార్థమును చెప్పలేక వారు ఉక్కిరిబిక్కిరియైరి. ఈకీలకము నెరిగినయెడల వీనికన్నిటికిని అర్థము కరతలామలకమగును. కనుక యీ వేదవాక్యము లన్నిటినిగూర్చి విచారించుటకు ముందు ఉత్తరధ్రువలక్షణము లేవియో, దాని చుట్టునుండు భూభాగముయొక్క లక్షణము లేవియో, వీనికిని దక్షిణవానికిని భేదములేవియో కొంచెము దిఙ్మాత్రముగ నీయధ్యాయములో సూచించెదను.

ఈభూమి గుండ్రని మట్టిముద్దవలెనున్నది. ఈమట్టి ముద్దమధ్య నొకపుల్లను గ్రుచ్చినట్లైన నది రెండువైపులకును

పొడుచుకొనివచ్చునుగద. ఈపుల్లయే యిరుసు. ఉత్తరదక్షిణములుగ నున్నది. ఈయిరుసు నాధారముచేసికొని ఈభూగోళము పడమరనుండి తూర్పునకు 24 గంటల కొక చుట్టు చొప్పున సంవత్సరమునకు 360 చుట్లు తిరుగుచున్నది. ఈయిరుసు భూమియొక్క పైభాగమునకు పొడుచుకొని వచ్చు రెండుచోటులకు ధ్రువములని పేరు. ఉత్తరపువైపున నున్నది ఉత్తరధ్రువము, దక్షిణమున నున్నది దక్షిణధ్రువము. ప్రస్తుతము మనము ఉత్తరధ్రువలక్షణములను గూర్చియే విచారింపవలసి యున్నది. ఈ భూగోళ మెప్పుడును ఒక ఇరుసుమీదనే తిరుగుచున్నదిగాని, యీ ఇరుసు మారిపోలేదని ఇదివరకే చెప్పియుంటిమి. మన యీ చిన్నిభూగోళము అనంతమైన యీ బ్రహ్మాండగోళములో కొన్నికొన్ని నియమముల ననుసరించి తిరుగుచున్నది. ఈ భూభ్రమణమువలన బ్రహ్మాండగోళములోని సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు మొదలగునవన్నియు తూర్పునుండి పడమరకు నడుచుచున్నట్లు మన కండ్లకు కనుపించుచున్నవి. కాని, యీ ఇరుసునకు సూటిగ నుత్తరదిశనున్న నొకానొక నక్షత్రముమాత్రము కదలక ఒకేచోట నిలిచియున్నట్లు కనిపించును. దీనికే ధ్రువనక్షత్రమని పేరు. ఈ ధ్రువనక్షత్రము నాధారముచేసికొని తక్కిన నక్షత్రాదులన్నియు దానిచుట్టును తిరుగుచున్నట్లు కనుపించును.

మన మెవరమైనను భూమిపైనున్న ఉత్తరధ్రువము వద్దకు పోయి, అచ్చట నిలువబడి చూచినట్లయిన మన కేమి

గాన్పించును ? ఉత్తరధ్రువనక్షత్రము సూటిగ మన నెత్తి మీద గాన్పించును. తక్కిన నక్షత్రాదు లన్నియు యీ దేశములోవలె తూర్పున నుదయింపక ఆ ధ్రువనక్షత్రముచుట్టును అడ్డముగ కుమ్మరిసారెవలె గిరగిర తిరుగుచుండును. ఖగోళములో ఉత్తరార్ధగోళముమాత్రమే కాన్పించును. దక్షిణార్ధగోళమంతయు సదా పూర్తిగ మరుగుపడి యుండును. అనగ మనకు సూటిగ నెత్తిమీద నున్నదే ఉత్తరదిశయగును. మనకు అధోభాగమందు భూమిక్రింద నున్నదే దక్షిణదిశయగును. అచ్చట సూర్యుడు దినదినమును నుదయింపడు. ఒకసారి యుదయించిన పిమ్మట ఆరునెలలవరకును అస్తమింపడు; అస్తమించిన తిరిగి ఆరునెలలవరకును ఉదయింపడు. అనగ, ఆరునెల లెడ తెగని పగలును, దానివెంట యెడతెగని రాత్రియు నుండును. ఆరునెలల దీర్ఘరాత్రి యనంతరము సూర్యుడు దక్షిణార్ధగోళములోనుండి పైకి ఉత్తరార్ధగోళములోనికి వచ్చుచుండగ సూర్యుడు "దక్షిణమునుండి యుదయించుచున్నట్లు" చెప్పవలసి వచ్చును ! ఇది ఉత్తరధ్రువమువద్దనున్న గొప్ప వింత.

సూర్యోదయమునకు పూర్వము ఉషఃకాల ముండును గద. అనగ, వెలుతురు కొద్ది కొద్దిగ వచ్చుటకు ప్రారంభించినది మొదలుకొని పూర్తిగ సూర్యబింబము పైకివచ్చువరకును గల కాలము ఉషఃకాల మనబడును. ఈ యుషఃకాలము సుమారు ముప్పదిదినము లెడతెగక యుండును. మొదట నీ వెలుతురు భూమియు ఆకాశమును కలిసినట్లు కనబడుచోట

కాన్పించి, ఆ యంచుచుట్టును దినమున కొకసారి గిఱ్ఱున తిరుగుచుండును. ఈ వెలుతురిట్లు దినమున కొకసారి యొక చుట్టు చొప్పున తిరుగుచు, దినములవరుసను పైకి వచ్చుచుండును. ఇట్లు క్రమక్రమముగ ఉషస్సులు పైకి వచ్చుచుండగ, 30 దినములైన పిమ్మట సూర్యబింబము పైకి గాన్పించును. ఈ సూర్యబింబముకూడ నిదేవిధముగ అంచుచుట్టును తిరుగుచు క్రమముగ దినములవరుసను పైకి వచ్చుచుండును. ఇట్లు క్రమముగ 23½ డిగ్రీలయెత్తువరకు పైకిపోయి, తిరిగి క్రమముగ క్రిందికి దిగి, ఆఱునెలలైన పిమ్మట బింబము క్రుంకును. బింబము క్రుంకినను సాయంకాలపు "యీరెండ" (సంధ్యారాగము) యుండునుగద. ఉదయకాలపు ఉషస్సువలెనే యీ "యీరెండ" కూడ సుమారు ముప్పదిదినము లుండును.

మన యీదేశములోని ఉషఃకాలము కొన్ని నిమిషములు మాత్రమే యుండును. కాని, ధ్రువమువద్ద అది షుమారు 30 దినము లెడతెగక యుండును. దీర్ఘ నిశాంతరమువచ్చు యీదీర్ఘ ఉషస్సు అచ్చటి ప్రజల కెంత ఆనందసంధాయకముగ నుండునో వేరుగ చెప్పవలెనా ? "స్వర్గము దారికి" అను పుస్తకములో డాక్టరు రెగాగారీ ధ్రువ ఉషస్సును గూర్చి యిట్లు వర్ణించియున్నారు:—

"మొట్టమొదట క్షితిజమువద్ద తమసావృతమగు ఆకాశభాగమందు క్రిందుగ కొంచెము వెలుగు కనుపడీ కనుపడనట్లుగతోచును. ఈ వెలుగువలన యేవో కొన్నిచిన్ని

నక్షత్రముల కాంతిమాత్రమే కొంచెము కనుమాయును. కాని, కొంచెముసేపటికే యీ వెలుగు క్రమముగ వృద్ధి యగుచు అప్పటి కింకను చీకటిగ నున్న క్షితిజపు అంచుచుట్టు మెల్లగ తారుచు ప్రాకిపోవుచున్నట్లు గాన్పించును. 24 గంట లగునప్పటి కీవెలుగు మనచుట్టు పూర్తిగ ఒకప్రదక్షిణము చేసి యథాస్థానమునకు చేరుకొనును. ఇప్పటి కీవెలుగు యెక్కువై, యింకచాల నక్షత్రముల కాంతిని మాపివేయును. ఈ వెలుగు క్రమముగ వృద్ధియగుచు, ముత్యపుకాంతులను ఆకాశమందంతటను వెదజల్లుచు క్షితిజపు అంచుచుట్టు గిరగిర తిరుగుచు పోవుచుండును. ఈరీతిని మహావైభవముతో క్షితి జమునకు ప్రదక్షిణముచేయుచు పోవుచుండు యీ జ్యోతి రానురాను ఎర్రని రోజారంగులోనికి మారును. ఈరోజా రంగుచుట్టు ఊదా, బంగారు రంగులు అందముగ అంచులు దీరియుండును. ఈప్రకారము రోజులు గడచినకొలది చిత్ర విచిత్రవర్ణములతో మహావైభవముగ ప్రదక్షిణముచేసెడు యీయుషఃకాంతి వాతావరణ పరిస్థితుల ననుసరించి హెచ్చుచు, తగ్గుచు, అంచుక్రింద దాగియున్న సూర్యబింబము అంచును సమీపించుచున్నకొలది మరింత హెచ్చుచు పోవు చుండును. ఈరీతిని రెండుమాసములవరకు తననెచ్చెలియగు ఉషాకన్యకను చిత్రవిచిత్రవర్ణములతో పలుకాంతులతో శోభా యమానముగ గిరగిర క్షితిజముచుట్టు నాట్యమాడించి యా డించి, మానవలోకమును ఊరించి ఊరించి, తుట్టతుదకు సూర్యు

భగవానుడు తనదీర్ఘవిశ్రాంతినుండి మేల్కొని, తనకొరకై పరితపించుచున్న నరులకంటియెదుట బింబరూపముతో ప్రత్యక్షమగును. ఒకటిరెండుచుట్లు తిరుగగనే, మిరుమిట్లుగొల్పు సూర్యబింబపు అంచు క్రమముగ పెద్దదియై తుదకు పూర్ణబింబము—సిందురకాంతులతో పైకివచ్చును. అంతట, దూరమందున్న పర్వతశిఖరములన్నియు తమస్సును వీడి, నిజకాంతులతో ప్రత్యక్షమగును. అప్పటినుండి సూర్యబింబము పూర్తిగ ఆరుమాసములవరకు మానవుల కండ్లయెదుట ప్రత్యక్షముగ గాన్పించుచు, గిరగిర గుండ్రముగ కుమ్మరిసారెవలె తిరుగుచు పోవుచుండును; ఈ ఆరుమాసములలో అంధకారరాక్షసిని ఒక్కనిమిషమైనను తనప్రియభూమియగు మేరుభూమిపై పడకుండ చేయును. ఆరుమాసములయనంతరము సూర్యుడు క్షితిజమునకు పోవునప్పుడు సైతము యుదేతిసి తాను ఉదయించునప్పటి చిత్రవిచిత్రకాంతులను చూపినో అట్టి కాంతులనే నానారీతుల ప్రదర్శించుచు, తానిప్పుడీలోకమును వదలిపోవుచున్నను తిరిగిమరలవచ్చెదనని లోకుల కభయమిచ్చుచున్నాడో యన్నట్లు మిగులు మిణుకుమను కాంతులతో సూర్యభగవానుడు క్రుంకును. ”

ధ్రువమువద్ద సంవత్సరలక్షణము లెట్లుండునో కెప్టె పిమ్ అను నతడు వర్ణించియున్నాడు:—

జనేవరి 29 వ తేదీన మొట్టమొదట వెలుగు గాన్పించును. ఈ వెలుగే ఉషఃకాంతి. ఈ ఉషస్సు 47 దినము

లుండును. అనంతరము అనగ మార్చి 16 వ తేదీన సూర్య బింబోదయమగును. సెప్టెంబరు 25 వ తేదీన సూర్యబింబము గ్రుంకును. కాని, తరువాత 48 రోజులవరకు “యూరోండ” యుండును. 48 వ నాడు అనగ నవంబరు 13 వ తేదీన లోక మంతయు గాఢాంధకారమందు మునిగిపోవును. 76 రోజుల వరకు సూర్యుడు కనుపింపడు. ఈ దీర్ఘరాత్రి ముగియగానే, దీర్ఘదివసము వచ్చును. సూర్యుడు 194 రోజులు క్షితిజముపై నుండును. కాబట్టి ధ్రువమువద్ద సంవత్సరము యీరీతిగ నుండును.

(1) 29 జనేవరి మొ॥ మార్చి 16 వరకు ఉషస్సు 47 రోజులు.
(2) 16 మార్చి మొ॥ సెప్టెంబరు 25 వరకు (సూర్యుడు క్షితిజముపై నుండుకాలము) } దీర్ఘదివసము 194 రో.
(3) సెప్టెంబరు 25 మొ॥ నవంబరు 13 వరకు యూరోండ. 48 రో.
(4) నవంబరు 13 మొ॥ 29 జనేవరివరకు దీర్ఘరాత్రి 76 రో.
మొత్తం సం॥ 365 రోజులు.

దీనినిబట్టి సూర్యుడు 194 రోజులు క్షితిజముపైనను, మిగత 171 రోజులు క్షితిజముక్రిందను నుండును. అయినను, ఇందులో సూర్యసంబాధమగు వెలుగులేని చీకటి 76 రోజులు మాత్రమే. ఈ చీకటిలో కూడ చంద్రకాంతి, నక్షత్రకాంతి “అరోరాబోరియాలిస్” (Aurora Borealis) అను జ్యోతి యొక్క కాంతి యుండుటచే దీర్ఘనిశి మన మనుకున్నంత దుర్భరముగ నుండనక్కరలేదు. మన పూర్వులు 4 మాసముల

కటికిచీకటిలో నెట్లు బ్రతుక గలిగిరని మన మాశ్చర్యపడ నక్కరలేదు. ఉత్తరధ్రువమువద్ద (మేరువువద్ద) సూటిగ నెత్తి మీద బంగారు కాంతులను విరివిగ వెదజల్లు పెద్ద జ్యోతి యొక్కటి గలదు. దీనినే ("Aurora Borealis") అందురు. (ఈ జ్యోతి యొక్క బంగారు కాంతులతో వెలుగొందుచుండుట చేతనే, మేరుపర్వతము బంగారుకొండ యైనది)

కేవలము ధ్రువమువద్దనున్న స్థితిగతు లివి. ధ్రువ మనునది కేవల మొక్కబిందువే (Point) అను సంగతిని మరువ కూడదు. ఆర్యులు ధ్రువప్రదేశము నున్నారనుచో, అందరు గుమిగూడి ఆ బిందువుమీదనే నివసించిరని అర్థము కాదు. ఈ ధ్రువబిందువును చుట్టియున్న భూభాగమును నాక్రమించు కొనియుండిరని భావము. కాన, కేవల ధ్రువబిందువువద్ది లక్షణములను, ధ్రువమును చుట్టియున్న భూభాగలక్షణము లకును కొంత భేదముండును. ధ్రువమునకును, దిగువనున్న ధ్రువరేఖకును మధ్యగల భూభాగమునకు ధ్రువమండల మని పేరిడుదము. ఆర్యులీ ధ్రువమండలమునందే నుండిరని మా సిద్ధాంతము.

ధ్రువబిందు లక్షణములను బట్టియే ధ్రువమండల లక్షణములుగూడ, కొన్నిమార్పులతో, సంపాదితము లగుచున్నవి. కావున, వాని నిట స్పష్టముగ వివరించెదము.

ధ్రువమువద్దనున్న మనుష్యులకు ధ్రువనక్షత్రము సూటిగ నెత్తిమీదనే గాన్పించుననియు, తక్కిన నక్షత్రము

లన్నియు దాని నాధారముచేసికొని, కుమ్మరిసారెవలె, అడ్డ వలయములు తిరుగుననియు చెప్పియుంటిమి. కాని, ధ్రువమును వదలి దిగువకు వచ్చినచో ధ్రువనక్షత్రము మన నెత్తిమీదనుండక, ప్రక్కకు దిగును. దాని ననుసరించియే నక్షత్రాదులు తిరుగు వలయములుకూడ సరిగ అడ్డముగ నుండక, ఒక ప్రక్కకు ఒరుగును. ఈ ఒరుగుటచేత, ఇదివరకు క్షితిజముతో సమముగ అడ్డముగ నున్న వలయములిప్పుడు కొంత భాగము క్షితిజముపైకిని, మరి కొంత భాగము క్షితిజము క్రిందకును ఒరిగి యుండుట తటస్థించును. అందుచే, సూర్యుని ప్రాక్షగమనములో కొన్ని మార్పులు గాన్పించును. ధ్రువమువద్ద ఆరు నెలలుగనున్న దీర్ఘరాత్రియు, దీర్ఘదినసమును మార్పుచెంది, క్రిందికి వచ్చినకొలది 5, 4, 3, 2, 1, నెలలువరుసను క్రమముగ తగ్గిపోవును. ధ్రువరేఖనుదాటి, సమశీతోష్ణమండలములోనికి రాగానే, దీర్ఘరాత్రియు, దీర్ఘదినసమును పూర్తిగ మాయమైపోయి, అన్నియు 24 గంటల పరిమితిగల మన మామూలు అహోరాత్రములే యేర్పడును.

కేవలము ధ్రువబిందువుమీదనే గాక ధ్రువమండలములో నివసించు మానవునకు సంవత్సరము మూడు ముఖ్యభాగములుగ విభజింపబడియుండును. (1) దీర్ఘరాత్రి (2) దీర్ఘదినసము. (3) వివిధపొడవులు గలిగి మొత్తము 24 గంటలకు మించని అహోరాత్రములు. దీర్ఘరాత్రి ఆరునెలలకంటె

తక్కువగను, 24 గంటలకంటె యెక్కువగను ఉండును. దీర్ఘదివసముకూడ నట్లే ఆరునెలలకు తక్కువగను 24 గంటలకు యెక్కువగను ఉండును. సంవత్సరమునకు ఒకకొసయందు దీర్ఘరాత్రియు, రెండవకొసయందు దీర్ఘదివసమును ఉండును. మధ్యభాగమందు మొత్తము 24 గంటలకుమించని అహోరాత్రము లుండును. గ్రీష్మసంక్రమణము దీర్ఘదివసమునకు సరిగ మధ్యబిందు వగును. అట్లే హిమసంక్రమణము దీర్ఘరాత్రికి సరిగ మధ్యబిందు వగును. సంవత్సరమం దేర్పడిన యీరాత్రివిధవిభాగము బహుచమత్కారముగ నున్నది. కావున దీనిని తెలిసికొనుటకొరకు ఉదాహరణ మిచ్చెదను.

ధ్రువమండలమును దాటి దక్షిణముగ కొంతదూరము వచ్చితి మనుకొనుము. అప్పుడు ధ్రువమువద్దనున్న ఆరునెలల దీర్ఘరాత్రియు క్రమముగతగ్గి అక్కడ రెండు నెలల దీర్ఘరాత్రి యై యున్నదని యనుకొనుము. హిమసంక్రమణము దీర్ఘరాత్రికి మధ్యబిందు వని చెప్పితిమిగాన యీ రెండు నెలల దీర్ఘరాత్రిని రెండుసమభాగములుగ చీల్చినచో ఒకనెల హిమసంక్రమణమునకు ముందుగను, మరి యొకనెల హిమసంక్రమణమునకు వెనుకను దీర్ఘరాత్రి వ్యాపించి యుండును. హిమసంక్రమణము డిసెంబరు 21 వ తేదిన వచ్చును. కావున, డిసెంబరు 21 వ తేదికి ఒకనెల ముందుగను, ఒక నెల వెనుకను, దీర్ఘరాత్రి యుండును. ఇట్లే దీని కనుగుణ్యముగ జూన్ 21 వ తేదికి (అనగ, గ్రీష్మసంక్రమణమునకు) ఒకనెల ముందును,

ఒకనెల వెనుకను దీర్ఘదివస ముండును. ఈ రీతిగ దీర్ఘరాత్రి, దీర్ఘదివసముల పరిమితి నాలుగునెలలుపోగా, యింక సంవత్సరములో 8 నెలలే మిగులును. ఈ 8 నెలలలో ఒక్కొక్కటి 24 గంటలకు మించని అహోరాత్రము లుండును. దీర్ఘరాత్రి అంతమొందగనే (జనేవరి 22 వ తేదీన) యీ 24 గంటల అహోరాత్రముల వరుస ప్రారంభ మగును. ఈ 24 గంటల అహోరాత్రములలో మొట్టమొదట రాత్రిభాగమే బహు యెక్కువగ నుండును. క్రమముగ సూర్యు డుత్తరమునకు పోయినకొలది రాత్రిభాగము క్రమముగ తగ్గిపోవుచు పగటి భాగ మెక్కు వగుచు వచ్చును. (కాని యీ రాత్రింబవళ్ళు రెండు కలిసి మొత్తముమీాద 24 గంటలకు మించవు.) ఈ రీతిగ, పగటిభాగ మెక్కువగుచు వచ్చి వచ్చి, నాలుగుమాసము లగునప్పటికిని 24 గంటలును పగలే యగును. రాత్రి భాగము పూర్తిగ మాయ మగును. అనగ, దీర్ఘదివస మేర్పడును. ఈ దీర్ఘదివసము రెండు నెల లుండును.

ఈ దీర్ఘదివసానంతరము (అనగ జూలై 22 వ తేదీ నుండి) తిరిగి 24 గంటలకుమించని అహోరాత్రము లేర్పడును. మొట్టమొదట యీ 24 గంటలలో పగటి భాగము బహుయెక్కువగనుండి రాత్రిభాగము కొద్దికొద్దిగనుండును. క్రమముగసూర్యుడు దక్షిణమునకు పోయినకొలది అంతకంతకు రాత్రిభాగమెక్కువగుచువచ్చి నాలుగు మాసము లగునప్పటికి

పగటిభాగమును పూర్తిగ ముంచివేయును. అనగ, దీర్ఘరాత్రి యేర్పడును. ఈ దీర్ఘరాత్రి హిమసంక్రమణమువద్ద రెండు నెల లుండునని చెప్పియుంటిమి.

ఇదేవిధముగ ధ్రువబిందువును చేరబోయినకొలది దీర్ఘరాత్రి 3, 4, 5, మాసములగుచువచ్చును. తదనుగుణముగనే దీర్ఘదివసమును 3, 4, 5, మాసములగును. ఈరీతిగ దీర్ఘదివస దీర్ఘరాత్రములు వృద్ధిజెందినకొలది పాపము మధ్యనున్న యీ 24 గంటల అహోరాత్రములకు చోటుతగ్గుచు వచ్చును. కొసలయందున్న యీ దీర్ఘదివసదీర్ఘరాత్రముల మధ్యపడి యీ 24 గంటల అహోరాత్రములు నలిగి సన్నగిలి పోవుచు వచ్చును. తుట్టతుదకు ధ్రువబిందువు మీదికిచేరినప్పుడు దీర్ఘరాత్రివచ్చి ఆరుమాసములకు దీర్ఘదివసమువచ్చి మిగత ఆరుమాసములను వెరశి పన్నెండుమాసములను ఆక్రమించుకొనుటచే మన 24 గంటల అహోరాత్రములకు —పాపము—తావేలేకపోవును. అవి పూర్తిగ మాయమై పోవును. అనగ ధ్రువమువద్ద 6 నెల లెడతెగని రాత్రియు, 6 నెల లెడతెగని పగలును ఉండును. ఈ సంగతిని మొదటనే వివరించి యుంటిమిగద.

ధ్రువమునకు దక్షిణముగ దూరముపోయినకొలది దీర్ఘరాత్రిసన్నగిల్లును. ధ్రువమువద్ద 6 నెలలుగనున్న దీర్ఘరాత్రి దక్షిణమునకువచ్చినకొలది 5, 4, 3, 2, 1 నెలలుగ తగ్గుచువచ్చును. అనగ మధ్యనున్న 24 గంటల అహోరాత్రము లెక్కువగుచువచ్చును. తుదకు ధ్రువరేఖను దాట

గనే సమశీతోష్ణమండలము (Temperate zone) లోనికి రాగానే - దీర్ఘ రాత్రియు, దాని ననుసరించి దీర్ఘదినసమును పూర్తిగ మాయమైపోయి సంవత్సరము పొడవునను మన మామూలు 24 గంటల అహోరాత్రములే యేర్పడును.

మనకు యీ దేశములో సంవత్సరమాపొడపునను ప్రతి దినము కొద్దిగనో గొప్పగనో సూర్యుడు కనుపించును. కాని ధ్రువమండలములో సంవత్సరములో కొన్ని రోజులవరకు యెడతెగకుండ సూర్యుడు క్షితిజముక్రింద గ్రుంకియుండి పైకి కనిపించనే కనిపించడు. దీనినే దీర్ఘరాత్రియంటిమి. కన్నులేనిది కలియుగమే లేదన్నట్లు సూర్యరశ్మిలేనిరోజులు రోజులే కావని లెక్కవేసికొన్నచో ధ్రువమండల సంవత్సరపరిమితి ఆరు మొదలు పదకొండుమాసములే యని చెప్పవచ్చును. అనగ ధ్రువమండలసంవత్సరములో మనకువలె 12 నెలలుగాక, 6 మొదలు 11 నెలలేయున్నవని చెప్పవచ్చును. (వరా:- ఆరవఅధ్యాయములోని పటములను చూడుడు) ఇక ఉషస్సును గూర్చి-ధ్రువమువద్ద ఉషస్సు రెండు నెల లుండునని చెప్పితిమి. క్రిందికి దిగినకొలది దీర్ఘరాత్రితోపాటు యీ దీర్ఘ ఉషస్సు కూడ తగ్గిపోవును. ధ్రువరేఖనుదాటి మన సమశీతోష్ణమండలములోనికి రాగానే, ఉషస్సుకూడ బహుస్వల్పకాలమేయుండును. ధ్రువమువద్ద రోజులుతరబడి యెడతెగకయున్న ఉషస్సు దక్షిణమునకు వచ్చినకొలది కొన్నిగంటలో, లేక కొన్ని నిమిషములోమాత్ర ముండును.

ధ్రువమువద్ద గ్రీష్మఋతువు దీర్ఘదివసమప్పుడును, హేమంత ఋతువు దీర్ఘరాత్రమప్పుడును సంభవించును.

ఇంతవరకు చెప్పినదానినిబట్టి కేవలము ధ్రువబిందువు వద్దిలక్షణములకును, ధ్రువమండలలక్షణములకును భేద మున్నట్లు స్పష్టపడగలదు. కావున యీ రెండులక్షణములను యిచట వేర్వేరుగ వివరించెదము.

ధ్రువబిందువువద్ది లక్షణములు.

(1) సూర్యుడు దక్షిణమున ఉదయించును.

(2) నక్షత్రములు యీ మనదేశములోవలె ఉదయించి అస్తమింపవు. అవి అడ్డముగ కుమ్మరిసారెవలె 24 గంటల కొక చుట్టువొప్పున గిరగిర (మన నెత్తిమీదటోపీవలె) తిరుగును. బ్రహ్మాండగోళములోని పై ఉత్తరార్ధగోళముమాత్రమే గాన్పించును క్రిందనున్న దక్షిణార్ధగోళము యెన్నడును గాన్పించనే గాన్పించదు.

(3) సంవత్సరమంతయు ఆరునెలలు యెడతెగని దీర్ఘరాత్రిచేతను, ఆరునెల లెడతెగని దీర్ఘదివసముచేతను ఆక్రమింపబడును.

(4) సంవత్సర మంతటిలో ఒక్క ఉదయము, ఒక్క సాయంకాలముమాత్రమే యుండును. అనగ, సూర్యుడు సంవత్సరమున కొకసారియే ఉదయించును. ఒకసారియే అస్తమించును. కాని, యీ ఉదయాస్తమయములందున్న ఉషస్సు యెడతెగకుండ షుమారు రెండునెల లుండును. సాయంకాల

మందుగాని, ఉదయమందుగాని, ఉన్న యీ యెఱ్ఱని ఉషః కాంతి మన యీ దేశములోవలె ఒక్కతూర్పుననో, ఒక్క పడమరనో, మాత్రమే అంటియుండదు. అక్కడనున్న తక్కిన నక్షత్రములతో పాటు క్షితిజపుఅంచుచుట్టు 24 గంటల కొక చుట్టుచొప్పున అడ్డముగ కుమ్మరిసారెవలె గిరగిర తిరుగును. ఉషస్సుయొక్క యీ యెఱ్ఱనికాంతి యిట్లు అడ్డవలయములు తిరుగుచు రోజులు గడచినకొలది క్రమముగ ఆకాశముపై కెక్కుచువచ్చి 2 నెల లగునప్పటికి రక్తారుణమైన యెఱ్ఱని గుండ్రని సూర్యబింబమును క్షితిజముపైకి తెచ్చును. ఈ సూర్యబింబముకూడ యిదేగతిని అడ్డముగ తిరుగుచు ఆరు నెలలులోపుగ యెన్నడు అస్తమింపదు.

11 ధ్రువమండల లక్షణములు.

(1) సూర్యుడు సదా నడినెత్తికిదిగువను దక్షిణభాగ మందు గాన్పించును. కాని, ధ్రువమండలమునుదాటి మన సమశీతోష్ణమండలములలోకూడ సూర్యు డదేవిధముగ గాన్పించుటచే దీనినొక ప్రత్యేకధ్రువమండల లక్షణముగ చెప్పుటకు వీలులేదు.

(2) చాలనక్షత్రములు యెన్నడును క్రుంకక, పైకి గాన్పించుచునే ధ్రువనక్షత్రముచుట్టుచు గిరగిర తిరుగుచుండును. కొద్దినక్షత్రములు మాత్రము మన యీ దేశములో వలెనే ప్రతిదినము ఉదయించుచు క్రుంకుచు నుండును. కాని, మనదేశములో నక్షత్రములకంటె యివి చాల ఒరుగుడుగ తిరుగుచుండును.

(3) సంవత్సరమును మూడు భాగములుగ విభజింప వచ్చును.

(i) దీర్ఘరాత్రము-ఇది ఆయా ప్రదేశములకును ధ్రువ బిందువునకును గల దూరమునుబట్టి 24 గంటలకంటె యెక్కువగను 6 నెలలకంటె తక్కువగను ఉండు యెడతెగని-సూర్యుడు లేని-చీకటికాలము. ఇది హిమసంక్రమణమువద్ద తటస్థించును.

(ii) దీర్ఘదివసము— పైనచెప్పిన దీర్ఘరాత్రి కది ప్రతి. ఇదియు 24 గంటల కెక్కువగను, 6 నెలలకు తక్కువగను గల యెడతెగని-సూర్యుడుగల-పగటికాలము. ఇది గ్రీష్మ సంక్రమణమువద్ద తటస్థించును.

(iii) సంవత్సరములో యీ దీర్ఘరాత్రి, దీర్ఘదివసముల కాలము పోగా మిగిలినకాలములో ఒక్కొక్కటి మొత్తము 24 గంటలను మించని వివిధపొడవులుగల మన మామూలు అహోరాత్రముల వరుస. దీర్ఘరాత్రి ముగియగనే మామూలు అహోరాత్రములు ప్రారంభమగును. కాని, వీనిలో మొట్ట మొదట రాత్రికాల మెక్కువగను పగటికాలము బహు కొద్దిగను ఉండును. రోజులు గడచినకొలది యీ 24 గంటలలో పగటికాల మెక్కువగుచు వచ్చి తుదకు 24 గంటలును పగలే యగును. అనగ దీర్ఘదివస మేర్పడును. దీర్ఘదివసానంతరము తిరిగి 24 గంటల అహోరాత్రములు ప్రారంభమగును. మొట్టమొదట పగటికాలమే యెక్కువగ నుండి రాత్రికాలము చాల తక్కువగ నుండును. రానురాను రాత్రి భాగ మెక్కువై తుదకు 24 గంటలును రాత్రియే యగును.

అనగ, దీర్ఘరాత్ర మేర్పడును. దీర్ఘనిశాంతమునకు వత్స రాంత మగును. ఈరీతిని చర్విత చర్వణముగా వార్షిక చక్రము తిరుగును.

(4) దీర్ఘరాత్రి దీర్ఘదివసాంతమం దేర్పడు ఉషఃకాంతి కొన్నిరోజులవర కుండును. కాని, ధ్రువబిందువువద్ద ఉషః కాలమునకంటె తక్కువగనే యుండును. ధ్రువబిందువువద్ద నున్నంత దీర్ఘకాలముకాని, అంత అద్భుతప్రదర్శనములుగాని యుండదు. అఖండమగు యీ దీర్ఘదివసమందు సూర్యుడు సదా క్షితిజము పైననేయుండును. అస్తమింపడు. కాని, ధ్రువ బిందువువద్దవలె సరిగ అడ్డవలయములు తిరుగక కొంచెము ఒరు గుడువలయములుగ తిరుగును. అట్లే అఖండమగు యీ దీర్ఘ రాత్రమందు సూర్యుడు సదా క్షితిజము క్రిందనే క్రుంకి యుండి కనిపింపడు. దీర్ఘదివస, దీర్ఘరాత్రములు మినహాయిం పగా మిగత కాలములో సూర్యుడు ప్రతిదినము ఉదయాస్త మయముల పొందును. 24 గంటలలో ఎప్పుడో ఒకప్పుడు— కొంతకాలము సూర్యుడు క్షితిజముపైన నుండును.

పైన రెండుతరగతులుగ వర్ణించిన ధ్రువ, ధ్రువమండల లక్షణములు ఆ ప్రదేశములకే ప్రత్యేకముగ చెల్లుబడియగును గాని అట్టివి ప్రపంచములో మరియెచ్చటను లేవు. మరియు, ధ్రువమండల శీతోష్ణస్థితులు కాలగతినిబట్టి మారినను, యీ భూగోళముపైననున్న ధ్రువబిందువుమాత్రము మారలేదు. కావున, పైనవర్ణించిన ఖగోళసంబంధమగు ధ్రువలక్షణములు శాశ్వతప్రదమైనవి. ఎన్నడును మారనివి. కావున, యిట్టిలక్ష

ణము లేసైన వేదఋక్కులందు గానిపించినచో అవితప్పక ధ్రువప్రదేశమునే సూచించుచున్న వని మనము సిద్ధాంతపరుప వచ్చును. అదృష్టవశమున యీ లక్షణములను సూచించు ఋక్కులు వేదములందు చాలగలవు. అట్లే, వీనికి సంబంధించిన వైదికగాథలును గలవు. నేరుగ యీ లక్షణములను ఉదాహరించు ఋక్కులు చాలప్రధానమైన వగుటచే, రాబోవు అధ్యాయములో వీనినిగూర్చి వివరించెదము. తక్కినగాథలనుగూర్చి పిమ్మట అధ్యాయములలో విచారించెదము.



వైదిక నిలయము

నాలుగవ అధ్యాయము.

వేదగత ధ్రువప్రాంత లక్షణములు.

తృతీయాధ్యాయములో ఉత్తరధ్రువప్రాంతదేశముల యొక్క లక్షణములను చెప్పియుంటిమి. ఇట్టిలక్షణము లేవైన వేదములయందు వర్ణింపబడియున్న వేమో విచారింపుదము.

ధ్రువనక్షత్రము సూటిగ నెత్తిమీద నుండుననియు, ఆ నక్షత్రముచుట్టును యీ బ్రహ్మాండగోళములోని నక్షత్రములు, గ్రహములు, మొదలగున వన్నియు మన నెత్తిమీద [illegible] తిరిగినట్లుగ గిరగిర కుమ్మరసారెవలె తిరుగుచుండు ననియు చెప్పియుంటిమి. మన యార్యు [illegible] డచ్చట నివసించి యుండియుండినయెడల వారి కీ విషయము తెలిసియుండవలెను గద. వారి కావిషయము పూర్తిగ తెలిసియున్నట్లు ఋగ్వేదము పదియవమండలము 89 అనువాకములో, 4 వ సూక్తములో ప్రమాణముగలదు. " రథచక్రములు రెండును యిరుసుచే నేవిధముగ నటునిటు చెదరకుండ పట్టుకొని యుంచబడినవో, ఆ విధముగనే యింద్రుడు భూమ్యాకాశముల రెంటిని తనబలముచేత వేర్వేరుగ నిలిపియున్నాడు " (ఋగ్ అక్షేణేవ చక్రియాశచీభి ర్విష్వక్త స్తంభపృథివీ ముత ద్యాం)

ఈ భావమే మరికొన్నిచోట్ల తెలియపరుపబడియున్నది. "సవిధమైన స్తంభముయొక్క ఆధారము లేకుండగనే యింద్రుఁ డీయాకాశమును నిలువబెట్టె" నట్లు వర్ణింపబడియున్నది. ఇంద్రునియొక్క యపారబలమున కిది యొకనిదర్శనముగనున్నది. (అవంశే ద్యామస్తాభయత్ ॥ IV 56 3 య ఇమే ద్యావాపృథివీ జజాన ఉర్వీగభీరే రజసీసుమేకే అవంశే ధీరః శచ్యా సమైరత్)


[X 89. 2] (స సూర్యః పర్యురూవరాం స్యేంద్రో వవృత్యాద్రథ్యేవచక్రా) లో నింద్రుఁడు సూర్యునితో పోల్పబడియెను. ఇంద్రుఁడు "యనంతమైన ఆకాశమును రథచక్రములవలె త్రిప్పుచున్నట్లు" వర్ణించియున్నారు. ఈ సూక్తములో నుండు "వరాంసి" యను పదమునకు "నక్షత్రములు" లేక "వెలుతురులు" అని శాయనులవా రర్థమును చెప్పిరి. మన మేయర్థమును చెప్పినను దీనిలో భావ మొక్కటే. ఆకాశము రథచక్రములవలె తిరుగుచున్న దనుమాట స్పష్టము. మన యీ దేశములలోగూడ నక్షత్రము లన్నియును తూర్పున నుదయించి, చక్రమునవలె తిరుగుచు, పశ్చిమమున నస్తమింపుచున్న వనుమాట సత్యమేకాని ఆకాశ మంతయు నొక స్తంభము నాధారము చేసికొని పైన నిలచియున్న దని యీ దేశములలోని యీయాకాశమును చూచి చెప్పుటకు వీలులేదు. ఆ వర్ణన యిచ్చట వర్తింపదు. ఆకాశ మంతయు నొక స్తంభము నాధారము చేసుకొని నిలచియున్న దని మనము చెప్పినప్పుడు, ఆ స్తంభము పైకొన ధ్రువనక్షత్రమై యుండవలెను. మరియు

ఆ ధ్రువనక్షత్రము సూటిగ మన నెత్తిమీద నెత్తుగ—కనిపించు చుండవలెను. కాని మన యీ దేశములలో ధ్రువనక్షత్రము ఉత్తరపువైపుగ కనిపించునుగాని సూటిగ మన నెత్తిమీదికి కనుపింపదు. ధ్రువనక్షత్ర మిట్లు సూటిగ నెత్తిమీద కనుపించుదేశము ఉత్తరధ్రువప్రాంతదేశమేగాన, యీ వర్ణన ఆ దేశమునకే వర్తించును. ఆకాశ మంతయు నొక స్తంభము నాధారము చేసికొని నిలచియున్న దనియును, చక్రము తిరుగు నట్లు తిరుగుచున్న దనియును వర్ణింపబడిన యీ రెండంశములను కలిపిచూచినయెడల తప్పక యీ వర్ణన ఉత్తరధ్రువప్రాంతదేశలక్షణములను చూచిగాని, యెరింగిగాని, పెద్దలచే వినిగాని, చేసినదే యని స్పష్ట మగుచున్నది. (ఋ 1-24-10. అమీయ ఋక్షా నిహితాస ఉచ్చా నక్తం దదృశ్రే కుహచిద్ది వేయుః) లో సప్తర్షిమండలము చాల ఎత్తుగ (ఉచ్చగ) నున్న దని వర్ణించియున్నారు. అదిగాక, యీ మండల ముదయించు ననిగాని, అస్తమించు ననిగాని, వర్ణింపక, పగలు కాన్పింప దనియు, రాత్రియందు గాన్పించు ననియును మాత్రము చెప్పియున్నారు. కాని యీ మండల మెల్లప్పుడును ధ్రువనక్షత్రము చుట్టును, తిరుగుచుండుటయేగాని, ఉదయాస్తమయము లెరుంగ దనియును తెల్ల మగుచున్నది. ఇది కేవల ముత్తరధ్రువప్రాంత లక్షణమేగద! అదిగాక మన ముత్తరధ్రువప్రాంతములకు బోయి చూచిననేగాని సప్తర్షిమండలము మనకు నెత్తిమీదుగ గాన్పింపదు. కాన నిది యొకబలవత్తరమైనదృష్టాంతము.

ఉత్తరధ్రువమువద్ద ఆరునెల లెడతెగని పగలును, మిగిలిన ఆరునెల లెడతెగని రాత్రియు నుండు నని చెప్పియుంటిమి. ఈ లక్షణ మ్మొకటి వేదములయందుగాన్పించుచున్నదా విచారింపుదము. దేవతలకు పగటికాల మారునెల లనియును, రాత్రికాల మారునెల లనియును, మన పూర్వగ్రంథములయందు చెప్పుట జూచినను గాన్పించును. దీనికై వెదుక పనిలేదు. కాని నియమేమియో కొంచెము జాగరూకతతో పరీక్షింపుదము. వేదములయందును, వేదకాలమున కీవలి వ్రాయబడిన పురాణాదులయందును, ఖగోళ, జ్యోతిశ్శాస్త్రగ్రంథములయందును యీ విషయము స్పష్టముగ వివరింపబడియున్నది. ఇట్టి విషయములను విచారింపవలసవచ్చినపుడు పురాణాదులకంటె ఖగోళశాస్త్రగ్రంథములే యెక్కువ ప్రమాణములుగాన నీ ఖగోళశాస్త్రములో మనవా రేమి చెప్పియున్నారో ముందు విచారింపుదము. ఈ భూగోళమునకు ఉత్తరధ్రువము మేరుపర్వత మని మనవారు తెలిపియున్నారు. మరియు "సూర్యసిద్ధాంతము" 12 వ యధ్యాయము, 67 వ శ్లోకములో నీవిధముగ వర్ణింపబడియున్నది. "మేరుపర్వతమువద్ద దేవతలకు మేషసంక్రమణమునాటి సూర్యోదయమొక్కటియే సూర్యోదయము. ఆ దినము మొదలుకొని "సూర్యుని యొక్క దక్షిణావృత్తమువరకు అనగా (ఆరునెలల వరకును) వారు సూర్యుని చూచుచునే యుందురు." మేరుపర్వతము దేవతలకు నివాసస్థానముగాన, పై దానినిబట్టి వారికి ఆరునెలలు పగలును, ఆరునెలల రాత్రియు కలదని చెప్పినదాని

కర్థము తెల్ల మగుచునే యున్నది. మనవా రందరును దీని సమ్మతించియే యున్నారు. మేరుపర్వతమువద్ద మేషసంక్రమణమునాడు సూర్యోదయ మగును. తిరిగి పిమ్మట ఆరు నెలల వరకును అనగ తులాసంక్రమణమునాటివరకును సూర్యు డాకాశమున వెలుంగుచునే యుండును. తులాసంక్రమణమునా నస్తమయ మగును. ఇదియే మేరువువద్దనుండు దేవతల కొక పగ లగును. తిరిగి తులాసంక్రమణము మొదలుకొని మేష సంక్రమణమువరకు సూర్యు డమగునకు క్రమముగనవలన చీకటి వ్యాపించును. ఈ యారు నెలలును మేరువువద్ద రాత్రికాలము. ఇదియే దేవతలకు రాత్రికాలము. మేషసంక్రమణము మొదలు తులాసంక్రమణమువరకును ఉత్తరాయణము. తుల మొదలు తిరిగి మేషమువరకును దక్షిణాయనము. అందువలననే " ఉత్తరాయణకాలము దేవతలకు పగ లగుచున్నది " అని చెప్పబడి యున్నది. కాని భాస్కరాచార్యులగారికాలములో ఉత్తరాయణ దక్షిణాయన సంజ్ఞలను మార్చిరి. మకరసంక్రమణము మొదలు, కర్కాటకసంక్రమణమువరకుగల కాలమును ఉత్తరాయణ మని యిటీవలివారు మార్పుచేసికొనిరి. ఉత్తరాయణ మనగ పూర్వకాలములో మేషము మొదలు తులవరకునుగల కాల మని భాస్కరాచార్యులగారికి తెలియనందున "ఉత్తరాయణకాలము మేరువువద్ద నుండు దేవతలకు పగ లెట్లగును?" అని శంకించిరి. ఉత్తరాయణ మను మాటకు పూర్వకాలమునం దుండు అర్థము వీరికి తెలియని కారణముచే తమకాలమునాటి యర్థమునుబట్టి జూచుకొనగ వీరి కీశంక గలిగెను. " ఉత్తరా

బొమ్మ 3.



యణము దేవతలకు పగలు " అను పూర్వగ్రంథములలోని " ఉత్తరాయణ " శబ్దమున కర్థ మేమి ? సూర్యుడు " ఉత్తర దిక్కునకు నడచునపక " అని వాక్యార్థము. సూర్యుడు రాశి చక్రమున, ఉత్తరార్ధగోళములో మేషసంక్రమణము మొదలు, తులాసంక్రమణమువరకును నడచుకాలము ఉత్తరాయణకాల మగుచున్నది. " ఉత్తరాయణము దేవతలకు పగ లగును " అనువాక్యము పూర్వకాలపు ఖగోళశాస్త్ర, సంహితగ్రంథ ములలో కల దని భాస్కరాచార్యులవారు చెప్పియున్నారు. అంతకుపూర్వము వేదకాలమునాటి ప్రజలకు తెలిసినయంశము లే ఈ సంహితాకాలములలో సైతము, అనుస్రుతముగ, వచ్చియుండవచ్చును.

దీని కింకను మనుధర్మశాస్త్రము (1. 67. లో " దైవే రాత్ర్యహనీ వర్షం ప్రవిభాగ స్తయోః పునః అహ స్తత్రోదగయనం రాత్రిః స్యా ద్దక్షిణాయనం) అని ప్రమాణ మున్నది. " ఒక (మనుష్య) సంవత్సరము దేవతల కొక రాత్రింబగ లగుచున్నది. అది యీ రెండు నీ విధముగ విభజింపబడి యున్నవి. ఉత్తరాయనకాలము పగ లగును, దక్షిణాయనము రాత్రికాల మగును. కల్పములవంటి పెద్దకాలములను లెక్క వేయవలసివచ్చినపుడు దేవతలయొక్క రాత్రింబవళ్లను కాలమానము (లేక మూలము) గ దీసికొనెదరు. ఈ యంశము సర్వసాధారణముగ పూర్వకాలపు గ్రంథములయం దన్నిటను ఎక్కడబడిన నచ్చట గాన్పించుచున్నందున మనవారు పూర్వ మొకప్పుడీ యంశమును కండ్లార చూచియుండి

యుండవలె నని స్పష్టముగ తేలుచున్నది. ఇక మహాభారతము వనపర్వము 163, 164 అధ్యాయములలో అర్జునుడు మేరు పర్వతమువద్దకుబోయియుండిన సందర్భములో ఆ పర్వతరాజ మునుగూర్చి యీ విధముగ వర్ణింపబడియున్నది. (ఏనం త్వహరహ శ్మేరుం సూర్యాచంద్రమసౌ ధ్రువం ప్రదక్షిణ ముపావృత్య కురుతః కురునందన జ్యోతీంషిచా ప్యశేషేణ సర్వాణ్యనఘ సర్వతః పరియాంతి మహారాజ గిరిరాజం ప్రదక్షిణం. (163 37. 38. శ్లో॥ స్వతేజసాతస్యనగోత్తమస్య మహౌషధీనాంచతథాప్రభావాత్ విభక్తభావో న బభూవ కశ్చి దహర్నిశానాం పురుషప్రవీర॥ బభూవ రాత్రి ర్దివసశ్చ తేషాం సంవత్సరేణైవ సమానరూపః) అర్థము " మేరుపర్వతమువద్ద సూర్యచంద్రులును, నక్షత్రములును, ప్రతిదినమును ప్రదక్షిణము చేయుచుండును. ఆ పర్వతము తనయొక్క కాంతిచేత చీకటిని పారదోలి రాత్రింబవళ్ళకు భేదము లేకసేయును. మేరుపర్వతనివాసులకు ఒకపగలును, రాత్రియును కలిసి సంవత్సర మగుచున్నది. " వీనినిబట్టి మహాభారతకాలమునాటికి మనవారికి ఉత్తరధ్రువప్రాంతదేశములయొక్క లక్షణములు వివరముగ తెలియు నని తేటపడుచున్నది. ఆ పర్వతమునకు విశేషమైనకాంతి గలదనియు అచ్చట నొక " జ్యోతి " వెలుంగుచుండు ననియు సూచింపుటవలన మూడవయధ్యాయములో చెప్పిన అరోరాబోరియాలిస్ అను పెద్దవెలుతురునకును యీ " జ్యోతి " వర్ణనకును సరిపోవుచున్నది. ఈ విషయము లన్నియును మన సిద్ధాంతమును బలపరచుచునే యున్నవి.

ఇక వేదగ్రంథములను విచారింపుదము. తైత్తిరీయ ఆరణ్యకము. I. 7. 1 లో మేరుపర్వతశిఖరమువద్ద యేడుగురు ఆదిత్యులు కలరనియు, కశ్యపు డనబడు ఎనిమిదవఆదిత్యుడు మహామేరువు నెన్నడును వదలక యుండు ననియు చెప్పియున్నారు. ఈ కశ్యపుడు తక్కిన 7 గురు ఆదిత్యులకును కాంతి నిచ్చుచుండును. మహామేరుపర్వతము నెప్పుడును ప్రకాశమానముగ వెలుగునట్లు చేయుచుండును. మన సంవత్సర కాలము దేవతలకు ఒకరాత్రియు, ఒకపగలును అగుచున్నది. అను వాక్యముమాత్రము తైత్తిరీయబ్రాహ్మణము III .9.22.I (ఏకంవా ఏత ద్దేవానా మహః యత్సంవత్సరః) లో కనబడుచున్నది. ఈ వాక్యము బాగుస్పష్టముగ నున్నందున దీని నర్థము చెప్పుట కేమాత్రమును కష్టములేదు. ఇట్టి యర్థము గల యిచ్చువాక్యములు మొదట నాకు మరియెచ్చటను కాన్పింపలేదు. ముఖ్యముగ ఋగ్వేదసంహితయందు గాన్పించలేదు. పైన చెప్పిన తై. బ్రా. లోని యీ ముక్కవాక్యమునే ఆధారముచేసికొని, "పూర్వము మనవారు ఉత్తరధ్రువమువద్ద నున్నారు" అని సిద్ధాంతీకరించుట బహుసాహసమని తలంచితిని. అందువలన అప్పటికి ఉత్తరాయణ దక్షిణాయనసంజ్ఞల యొక్క నిజార్థమును పూర్ణముగ కనుగొనలేకపోతిని. కాని కొన్నిగ్రంథములను తరచిమాపగ చూడగ మనవారొకప్పు డుత్తరధ్రువమువద్ద నివసించియుండి రను సిద్ధాంతమును ఒప్పుకొనక తీరనదికాదు. ఈ పైవాక్య మిటీవలి పురాణాదులలోను ఖగోళశాస్త్రగ్రంథములలోనుమాత్రమే గాక తైత్తిరీయబ్రాహ్మ

ణములో సైత ముండుటవలన, ఆకాలములో మనవారీయంశ ముసు కండ్లార చూచియైన నుండవలెను, లేదా తమపూర్వులు చెప్పుకొనుచుండగ వినియైన నుండవలెను. ఖగోళశాస్త్ర ప్రకార మప్పటివారు లెక్కవేసి చూచి యీ విషయమును (తమ కండ్లార చూడకయే, వినకయే) కేవలము బుద్ధిశక్తి వలన కనుగొని రని కొందరూహింపవచ్చును. కాని దీనిని నమ్ముటకు వీలులేదు. ఏలననగ, ఖగోళశాస్త్రమును, తత్సంబంధమగు గణితమును సంహితాబ్రాహ్మణకాలముల కిటీ వలనే వృద్ధినొందినవి. బ్రాహ్మణకాలమునాటివారి కీగణితము తెలియు నని నమ్ముటకు వీలులేదు. కాన నీవిషయమును వారు కండ్లార చూచియైన నుండవలెను. లేదా తమతాతముత్తాతలు చెప్పుకొనుచుండగ వినియైన నుండవలెను.

మన మతగ్రంథములలోనేగాక పారశీకుల గ్రంథములలో సైతము కేవల మీ యర్థమునే యిచ్చువాక్యములు గలవు. " వెండిడాడ్ " అను పార్శీగ్రంథము 2 వ అధ్యాయములో నీ విధముగ నున్నది. " మనకు సంవత్సరమైన దానిని వారు ఒక దినముగ భావింతురు " తైత్తిరీయబ్రాహ్మణములోని దాని కిది సరియైన యర్థ మగుచున్నది. రెంటికిని ఒకే అర్థము. అదిగాక పార్శీగ్రంథములోని యీ పైవాక్యము యొక్క పూర్వోత్తరసందర్భములను విచారించినయెడల యీ వర్ణన తప్పక ఉత్తరధ్రువప్రాంతదేశమునకే వర్తించు నని తెల్లముగాగలదు. పార్శీమతస్థులకు పరమదైవము " అహురమజ్దా. " " ఇమ " యను నాతడు మనుష్యలోకమునకు

మొదటిరాజు. ఈ రాజు " ఐర్యానావెయూజో " యను పారసీకుల స్వర్గలోకమునందు నివసింపుచుండును. ఒకానొకప్పుడు " అహురామజ్దా " అను దైవము " ఇమ " రాజుదగ్గరకు వచ్చి, ముందుగ గొప్పశీతకాలము రాబోవుచున్న దనియు, ప్రపంచ మంతయు ననేక వేలయడుగులయెత్తువరకు మంచుతో ఘనీభవించుకొని పోవుననియు, ఆ కారణముచే భూమిపై సంచరించు జంతుజాలము లన్నియు, నశించు ననియు, భవిష్యత్తు సంతను తెలియజెప్పెను. మరియు యీ మంచుయుగము (హిమవత్ప్రళయము) రాకముందే పెద్దభవనము నొకదానిని నిర్మించి సకలజంతువులను సకలబీజములను సంగ్రహించి యుంచవలసిన దనియు రాజున కా దేవుడు సలహా జెప్పెను. ఆప్రకారము ఆ రాజొకభవనమును నిర్మించి "ఓ జగత్కారణా! ఓ మహానుభావా! నేను నిర్మించిన యీ భవనమును వెలిగించుట కేమిదీపములు గలవు?" అని యడిగెను. దేవు డీ విధముగ ప్రత్యుత్తర మిచ్చెను. "చేతనము లనియు అచేతనము లనియు రెండువిధము లైన దీపములు గలవు. సూర్యచంద్రులు (సంవత్సరమున) కొకసారియే యుదయించి, యొకసారియే యస్తమించుచున్నట్లు కనిపింతురు. మరియు ఒకసంవత్సర మొకదినముగ గాన్పించును." ఈ వాక్యము లన్నియు మన యనేకభావములను వెల్లడింపుచున్నవి. (1) పారశీకులు పూర్వకాలమున నివసించిన " ఐర్యానావెయూజో " యను ప్రదేశము కొంతకాలమునకు మంచుతో ఘనీభవించుకొని పోయినందున ప్రజలు నివసించుట కనుపయోగ మయ్యెను.

(2) ఆ దేశములో సూర్యుడు సంవత్సరమున కొకసారియే యుదయించుననియు, ఒకసారియే యస్తమించుననియు, అప్పటివారికి ఒకసంవత్సర మొకదినముగ నుండె ననియు తెలియుచున్నది. మంచుయుగము సంభవించుటనుగురించి పైన చెప్పిన వాక్యములను తరువాత నెమ్మదిగ విచారించుదము. ప్రస్తుతము రాత్రింబవళ్ళనుగూర్చి యీ పార్శీగ్రంథములో చెప్పిన యంశము తైత్తిరీయబ్రాహ్మణములో చెప్పినయంశముతో పూర్తిగసమన్వయ మగుచున్నది. సూర్యుడు సంవత్సరమున కొకసారియే యుదయించి యొకసారియే యస్తమించుట యనునది కేవలము ఉత్తరధ్రువప్రాంతదేశ లక్షణమే. కనుక పార్శీగ్రంథములో చెప్పిన "ఐర్యానావెయాజో" యను ప్రదేశమును దానిలోని భవనమును కేవలము ఉత్తరధ్రువదేశములోనివైయె యుండితీరవలెను. అవిధమునసే తైత్తిరీయబ్రాహ్మణములోని వాక్యములు కేవల ముత్తరధ్రువ ప్రాంతదేశవాసుల సంవత్సరమునే సూచింపుచున్నవి. ఆర్యసంతతులవారైన హిందూ, పారశీ, దేశస్థుల యుభయులగ్రంథములలో నీ విషయ ముండుటవలన వీరు కేవలము గణితమువేసి చూచి యీ విషయమును వ్రాసిరని చెప్పుసిద్ధాంతమును త్రోసి వేసితీరవలెను. కనుక వీరు "తమ కండ్లార నీసృష్టివైచిత్ర్యమును చూచియేయుండవలె" నని సిద్ధించుచున్నది.

ఈపైన మనము చర్చించినవాక్యములుగాని, యీయర్థము నేయిచ్చు మరి యితర వాక్యములుగాని ఋగ్వేదములో నెచ్చటను గాన్పింపవనుమాట సత్యమే. కాని ఉత్తరధ్రువప్రాంత

దేశముల యొక్క యితరలక్షణములను స్పష్టముగ వివరించిన వాక్యము లనేకములు ఋగ్వేదములో గలవు. ఇట్లు ఋగ్వేదములో వర్ణింపబడిన వర్ణనలన్నియు పైవాక్యములను బలపరుచుచున్నవి. మన మిచ్చట నొక ముఖ్యవిషయమును విచారింపుదము. బహుపురాతన వేదగ్రంథములలో చూచినయెడల సంవత్సరమును "దేవయానమని" యును "పితృయానమని" యును రెండు భాగములుగనే విభజించినట్లు కన్పట్టుచున్నది. ఈరెండును దేవతలకు పగలును రాత్రియు ననబరగు ఉత్తరాయణ దక్షిణాయనములతో సరిపోవుచున్నవి. దేవయానపదము ఋగ్వేదసంహితలో ననేకచోట్ల కనుపించుచున్నది. దీనికి "దేవతల త్రోవ లేక మార్గము" అని అర్థము. ఋ 1. 72-7 లలో అగ్నికి దేవయానమార్గము తెలియునని చెప్పబడియున్నది. మరియు ఋ 1. 183-6, 184-6 లో నీ విధముగనున్నది. "ఓ అశ్వినీదేవతలారా! మేమిప్పుడు "చీకటియొక్క అంతము" వద్దకు వచ్చినాము; దేవయానమార్గము వెంబడి మీరు మావద్దకు రావలసినది" (అతారిష్మ తమసస్పార మస్యప్రతివాం స్తోమో అశ్వినావధాయి ఏహయాతం పథిభి ర్దేవయానైః)

ఋ. VII 76,2 లో మరియు నిట్లువర్ణించియున్నారు. "దేవయానమార్గము నాకు దృగ్గోచరమగుచున్నది.... ఉషఃకాలముయొక్క కేతువు (లేక పతాకము, లేక జెండా) తూర్పు దిక్కున కనబడుచున్నది" (ప్రమేపంథా దేవయానా అదృశ్రన్ .... అభూదు కేతు రుషసః పురస్తాత్.)

ఈవాక్యము లన్నియు నొకేయర్థమును సూచించుచున్నవి. చీకటియంతయు పోయి ఉషఃకాల ముదయముకాగానే దేవయానమార్గము ప్రారంభమగుచున్నదని తేలుచున్నది. మరియు అగ్ని, అశ్వినీదేవతలు, ఉషస్సు, సూర్యుడు మరియితర ఉదయకాలపు దేవతలందరును యీ దేవయానమార్గముగుండనే యాకాశముమీాద ప్రయాణము చేయుచున్నట్లును కూడ స్పష్టమగుచున్నది. ఇక X, 18-1 లో, పితృయానము దేవయానమునకు వ్యతిరేకముగ నుండుననియు, నిది "మరణమార్గమని"యు వర్ణించియున్నారు. ఋ. X, 88-15 ను వ్రాసిన ఋషి దేవపితృయానములనుగూర్చి చెప్పుచు, "దేవతల లోకమార్గమును, పితరులలోకమార్గమును రెండుమార్గములు కలవ"ని తాను "విన్నాన"ని చెప్పియున్నాడు. ఉషఃకాలముతో దేవయానమార్గము ప్రారంభమైనయెడల చీకటి గ్రమ్మగనే పితృయానమార్గము ప్రారంభమగునని మనము తలంపవలెను. ఒకవేళ ఇకనీ దేవపితృయాన మార్గములు మనముజూచు పగటికిని రాత్రికిని యర్థమిచ్చునని తలంచితిమేని మనపూర్వఋషుల కీరెండుమార్గములే తప్ప నితరములు తెలియవని చెప్పుటలో నేమి విశేషమున్నది. ఈపైనచెప్పిన రెండుమార్గములలో నొక్కొక్కదానిలో మూడుఋతువులు కలవనియు, వానిలో మొదటిఋతువు వసంతఋతువనియు (శతపథబ్రాహ్మణము. 11, 1. 3) వర్ణించియున్నారు. ఈపితృదేవయాన మార్గములు రెండును మనము ప్రతిదినమును జూచు రాత్రింబవళ్లకర్థమని మనముచెప్పినయెడల శతపథబ్రాహ్మణములోని

యీ పైవాక్యముల కర్థమేమి చెప్పగలము? వానిప్రయోజన మేమి? వానినెట్లు సమర్థింతుము? కనుక యీదేవపితృయాన మార్గములు రెండును ఉత్తరధ్రువప్రాంతదేశ లక్షణములను జూచి వర్ణించిన వర్ణనలై యుండవలెను. వానిలో నెడతెగని యారు నెలల వెలుతురును దేవయానమనియు; మిగిలిన ఆరు నెలల చీకటిని పితృయానమనియు వర్ణించిరి. ఉత్తరధ్రువప్రాంతదేశములను వదలి దక్షిణప్రదేశములకు వచ్చిచేరిన పిదప నీవర్ణన యిచ్చట పరిస్థితులకు సరిపోకపోయినను పూర్వమునుండియు గ్రంథస్థములై యున్న యీ విషయమును త్రోసివేయలేమని వారు దానిని వాడుకొనుచుండిరి. ఋగ్వేదములో చెప్పబడిన యీ దేవపితృయానముల యర్థమును విచారించి చూచిన "మనకు సంవత్సరమున కాలము దేవతల కొక దినమగుచున్నది" అను తైత్తిరీయ బ్రాహ్మణవాక్యముతో సరిపోవుచున్నది. ఈ రెండును నొకే భావమును దెలుపుచున్నవి.

"దేవతలమార్గము" (దేవయానము) అను నీ పదము పార్సీగ్రంథములలో నైతము గానవగును. వారి పితృదేవతలు సూర్యచంద్రాదులకు "దేవనిర్మితమార్గము"ను చూపించినట్లు వారి గ్రంథములలో చెప్పబడి యున్నది. నీ దేవయాన మార్గమును చూపక పూర్వము, సూర్యచంద్రాదులు రాక్షసులచే బంధింపబడి, అటు నిటు కదలజాలక యొకచోటనే నిలచియుండిరని వర్ణింపబడియున్నది. ఈ రెండు వర్ణనలను బట్టి చూడగ, మన శాస్త్రగ్రంథములలో వర్ణింపబడిన దేవయాన

మును పార్సీగ్రంథములలో వర్ణింపబడిన దేవయానమును రెండు నొకటే యని సిద్ధించుచున్నది. ఈ రెండు మార్గములును చీకటి యంతమైన పిమ్మటను, ఉషఃకాలము ప్రారంభించుటతోడను ప్రారంభమగునని స్థిరపడుచున్నది. హిందూ పారశీవంశస్థుల పూర్వులు నివసించిన ప్రదేశములలో సూర్యుడు ఆరునెల లాకాశమున వెలుంగుచున్నట్లును తక్కిన ఆరునెలలును సూర్యుడు క్షితిజముక్రిందికి అస్తమించిన కారణమున చీకట్లు క్రమ్మికొని యుండినట్లును స్పష్టమగుచున్నది.

హిందూ, పారశీగ్రంథములలోని పోలిక లింతటితో నాగలేదు. ఎవరైనను దక్షిణాయన అనగ పితృయానకాలములో చనిపోవుట అశుభసూచకమని మన హిందువు లెన్నుదురుగద. మహాభారత యోధవీరుడైన భీష్ములవారు దక్షిణాయనకాల మంతయుండి, ఉత్తరాయనపుణ్యకాలము వచ్చు వరకును, ప్రాణములను విడువక అంపశయ్యమీద నిరీక్షించుచుండెనని మన కందరకును తెలిసిన విషయమే.

(మహాభారతకాలమునాటికి ఉత్తరాయణసంజ్ఞ యొక్క యర్థము మారిపోయి, ఉత్తరాయణ మనగ మకర, కర్కాటక సంక్రమణముల మధ్యనుండు కాలమను అర్థము వచ్చినది. కాని అంతకుపూర్వ మీ యర్థము లేదనియు, మేష తులా సంక్రమణముల మధ్యకాలమే ఉత్తరాయణమనియు నిదివరకే చెప్పియున్నాము.) ఏది యెట్లున్నను దక్షిణాయన మనగ పితృయానకాలములో చనిపోవుట యశుభసూచక మనుమాట

స్పష్టము. ఈభావమునే ఉపనిషత్తులలోకూడ కానవగును. దేవయానకాలములో చనిపోయినయెడల ఆత్మకు మంచిగతి గలదని యుపనిషత్తులలో చెప్పియున్నారు. ఈ వాక్యముల న్నియు మనకు కావలయుననిన బ్రహ్మసూత్రములపైన శ్రీ శంకరాచార్యులవారు వ్రాసిన భాష్యములో కానవగును. (బ్ర. సూ. IV. 2 18-21) (౧౮) రశ్మ్యనుసారీ, (౧౯) నిశి నేతిచేన్న, సంబంధస్యయావద్దేహ భావిత్వాద్దర్శయతిచ (౨౦) అతశ్చాయనేపి దక్షిణే (౨౧) యోగినః ప్రతిచస్మర్యతే స్మార్తేచైతే.) పితృయానమనగ ఆరునెలలెడ నగని చీకటియును పూర్వగ్రంథములలోని భావమునుబట్టి విచారించి చూచిన యెడల, పితృయానములో చనిపోవుట యెంత యశుభ సూచకమో తేటపడగలదు. చీకటికాలములో (పితృయానములో) చనిపోయినయెడల, తిరిగి దేవయానము అనగా వెలుతురు వచ్చువరకును అపరకర్మలను చేయుటకు వీలుండదు. అంత కాల మీకర్మలను చేయకుండ నిలిపియుంచుటయే చనిపోయిన వానియాత్మకు యశుభదాయకము. ఎప్పటిమాటలోయేల, యీ కాలములోసైత మెవరైన రాత్రికాలములో చనిపోయిన యెడల నది యశుభమనియే మనమెంచుదుముగద. దహనాది క్రియలన్నియును సూర్యోదయ కాలమువరకు నాపియుంచు దుముగద. ఇట్టిసందర్భములో పితృయానకాలములో చనిపో వుట యశుభసూచకమని మనపూర్వులు తలంచుటలో నేమి యును వింతలేదు.

ఈ విషయమే పార్శీగ్రంథములలో మరింతస్పష్టముగ వర్ణింపబడియున్నది. "ఎవరైనను శీతకాలములో చనిపోయిన యెడల భగవద్భక్తుడైనవా డేమి చేయవలయును?" అను ప్రశ్నకు భగవంతు డీవిధముగ ప్రత్యుత్తరమిచ్చుచున్నాడు. "అట్లు సంభవించినయెడల, ఇంటిలో నొక గోయ్యి త్రవ్వి, ఆశవమును ఆగోతిలోనుంచి పక్షులు లటుసిటు ఎగుర నారంభించువరకు, చెట్లు పెరుగ నారంభించువరకు, నీటిప్రవాహములు పార నారంభించువరకు, గాలివచ్చి భూమిమీదనుండు నీటిని తను పీల్చుకొనువరకు, రెండురాత్రులుగాని, మూడురాత్రులుగాని లేక ఒకనెలగాని, ఎంతకాలముపట్టునో అంతకాలము వరకు దాసినట్లే గోతిలో నుంచవలెను." ఈసందర్భములో పార్శీమతస్థుల యాచారమునుగూర్చి చెప్పవలెను. వారు తమ శవములను పాతిపెట్టరు. దహనముచేయరు. మొదట శవమును సూర్యరశ్మిలోనుంచి పిమ్మట గాలిగోపురమువంటి యెత్తైన ప్రదేశములోనుంచి, పక్షుల కాహారముగ వదలివేయుదురు. దీనినిబట్టి విచారింపగ శవమును నెలదినములవరకును గోతిలో నేలయుంచవలెనో తెలియగలదు. ఆ నెలదినములును యెడతెగని చీకటియే యుండుటవలన శవమును సూర్యరశ్మిలోనుంచుట యెట్లు తటస్థింపగలదు? ఆకారణముచేతనే సూర్యరశ్మి వచ్చువరకును యెన్నిదినములైనను సరే శవమును గోతిలోనే యుంచవలెను. సూర్యోదయమైన పిమ్మట శవమును బయటికిదీసి కొంతసేపువరకు సూర్యరశ్మి శవము

నకు తగులునట్లుచేసి, పిమ్మట పైనచెప్పినవిధముగ దానిని పక్షులకాహారముగ వదలివేయుదురు. అదిగాక, "పశువులెగురుట" "నీటిప్రవాహములు పారుట" మొదలగు నీవర్ణనలన్నియు ఋగ్వేదములో వర్ణింపబడిన ఉషఃకాలవర్ణనలను పోలియున్నవి. ఈరెండు నొకేవిధమైన ప్రకృతిచిత్రములను వర్ణింపుచున్నవి. పైదానినిబట్టి దేవతలయొక్క రాత్రింబవళ్లను గూర్చిన వర్ణనలు పార్సీ హిందూగ్రంథములలో నొకవిధముననే యున్నవనియు నీయుభయగ్రంథములలోని వర్ణనలు ఉత్తరధ్రువప్రాంతదేశలక్షణములనే తెలుపుచున్నవనియు స్పష్టమగుచున్నది.


ఉత్తరధ్రువప్రాంతలక్షణము హిందూపార్సీగ్రంథములలోనే గాక గ్రీకు, నార్వేదేశపు పూర్వగ్రంథములలో సైతము కానవచ్చును. "పూర్వకాలములో ఆకాశమంతయు ఒకమనుష్యుని నెత్తిమీద టోపీ తిరిగినట్లుగ తిరుగుచుండెడిది"యు, "ఆదికాలమునందు ధ్రువనక్షత్రము సదా సూటిగ నెత్తిమీద గనిపించెడిదని"యు గ్రీకుగ్రంథకారులు వర్ణించియున్నారు. "ఇలియడ్" "ఒడస్సే" యను గ్రీకు పురాణములలోకూడ రెండురకముల "దినము" లనుగూర్చి వర్ణించియున్నారు. దేవతలచర్యలనుగూర్చి చెప్పినప్పుడు సంవత్సరపరిమితిగల రాత్రింబవళ్లనుగూర్చియు, మనుష్యుల చర్యలనుగూర్చి చెప్పినప్పుడు ౨౪ గంటల పరిమితిగల రాత్రింబవళ్లను గూర్చియు గ్రీకుపురాణములలో వర్ణించియున్నారు. ఉత్త

గనే, నార్వేదేశపు పురాణగాథలలోఁ గూడ దీర్ఘములగు ఉషఃకాల రాత్రములను గూర్చిన వర్ణనలు గలవు. ఆరునెలలరాత్రినిని ఆరు నెలలపగటినిగూర్చిన వర్ణనలు "ఇండో ఐరేనియను" లలోనే గాక, "ఇండో జర్మను" లలోఁ గూడ గలవు. కనుక మొట్టమొదట ఆర్యులందరును కలిసి నివసించుచున్నప్పుడే యీవర్ణనలు బయలుదేరియుండవలెను. ఈవర్ణనలు ఉత్తరధ్రువప్రాంతమునే సూచించును గనుక మనయార్యులచ్చట నివసించిరని చెప్పుట కొక్క యీవర్ణనలే చాలును. కాని క్రిందటి యధ్యాయములో సూచించిన ధ్రువలక్షణము లన్నిటిని ఋజువు పరచుటకును మనకు వేదాదులలోఁ గావలసినంత సాక్ష్యమున్నది. ఉషస్సులు దీర్ఘకాలము ప్రకాశించుచున్నను తిరుగుచుండు లక్షణమును గూర్చి వేదప్రమాణ సహితముగ రాబోవు అధ్యాయములో చర్చించెదము.



బ్లాకు 4.

వైదిక ఉషా.



సూర్యుడు క్షితిజముక్రింద షుమారు 16 డిగ్రీల దూరములో నున్నాడు. ప్రాతఃకాలమందు గాన్పించు వెలుతురులు క్షితిజముయొక్క అంచుచుట్టు 24 గం॥ ల కొకసారి, బాణము చూపినవైపుగ, గిరగిర తిరుగును. తదుపరి సూర్యబింబము క్షితిజముపైకి వచ్చును.

వైదిక నిలయము

ఐదవ అధ్యాయము.

వైదిక ఉష.

ఆరు నెలల పగలును ఆరు నెలల రాత్రిని గూర్చిన స్పష్టమైన వర్ణనలు ఋగ్వేదమునం దంతగ గాన్పింపకున్నను ఉత్తరధ్రువనివాసమును దెలుపుటకు తగినంత యుక్తమైన యితరలక్షణములను గూర్చిన వర్ణన లనేకములు గలవు. వానిలో ముఖ్యమైనది ఉషఃకాల వర్ణన. ఉత్తరధ్రువమువద్ద ఉషఃకాలము సుమారు నెలదినము లుండుననియు యీ యుషఃకాలము చక్కనిదియును నేత్రపర్వదాయకముగ నుండి దిక్చక్రముచుట్టు అంచుమట్టమున దినమునకొకచుట్టు చొప్పున గిరగిర తిరుగుచు క్రమముగ పైకివచ్చుననియు పిమ్మట—నెలదినములైన పిమ్మట—సూర్యబింబము పైకి గాన్పించుననియు మూడవ యధ్యాయములో చెప్పియున్నాము. కాని, భూమధ్యరేఖ వద్దనున్న మనదేశములలో ఉషస్సు యింతదీర్ఘకాలముండదు. ఇంత చిత్రవిచిత్రములుగ నుండదు. వేదములలో ఉషఃకాలమును గూర్చిన వర్ణన లనేకములు గలవు. ఇది యొక ముఖ్యమైన దేవత. ఇట్టి హృదయాహ్లాదకరములగు వర్ణనలు, సృష్టిసౌందర్య మహిమలను గానముచేయు

గీతములు, ఒక వేదములలోనే తప్ప ప్రపంచములో మరియే యితరదేశపు గ్రంథములలోను వాఙ్మయములలోను గానరావు. ఒక్క మనభారతీయులనే గాక ప్రపంచములోనున్న ఖండఖండాంతరములనుండు సమస్తజాతులవారిని మోహింపఁ జేసిన యిట్టి సృష్టిగీతములను వేదగానములను మనవారెట్లు వ్రాయగలిగిరి? ముహూర్తమాత్రము మాత్రమే దిక్కునఁ గనుపించి అంతలో మాయమైపోవు మనదేశపు ఉషఃకాలమును చూచియా మనవారిట్టి వర్ణనలను గావించినది? ఇదెంత మాత్రమును సంభవముకాఁజాలదు. అంతగా వర్ణింపుటకు మనమిక్కడ ప్రతిదినముఁ జూచు ముహూర్తమాత్ర జీవనము గల యీ యుషఃకాలములో నేమివిశేషమున్నది? ఏమి చిత్రములున్నవి? ఈ వేదగానమునకు సరిపోవు చిత్రవిచిత్రములు ప్రకృతి సౌందర్యములన్నియును ఉత్తరధ్రువప్రాంత దేశములోని దీర్ఘ ఉషఃకాలమునకే సరిపోవును గాని మన ఉషఃకాలమునకు సరిపోవు. (అదిగాక, కొన్నిచోట్ల ఉషఃకాలమును యేకవచనముగను, కొన్నిచోట్ల బహువచనముగను వర్ణించియున్నారు. దీని ప్రయోజనమును పిమ్మట విచారింతము.)

ఉషఃకాలము బహుదీర్ఘకాలమనుటకు మొదటి నిదర్శనము ఐతరేయ బ్రాహ్మణము IV. 7 లో కలదు. "గవాం అయనమ్" అను క్రతువును ప్రారంభించుటకు పూర్వము ఒక వెయ్యి శ్లోకములను హోత్రియగు బ్రాహ్మణుడు పఠింప

వలెను. ఇట్లు పఠించుటకు దీర్ఘకాలము పట్టునుగద. ఈ శ్లోకములకు "అశ్వినశాస్త్ర" మని పేరు. రాత్రి యంత మొదలి పగలు ప్రారంభమగు సంధికాలమున కధిష్ఠానదేవతలుగనుండు అగ్ని, ఉషస్సు, అశ్వినులు మొదలగు దేవతలనుగూర్చి యీ శ్లోకములు పఠింపబడును. హోత్రి పఠింపవలసిన పఠనలన్నిటిలోను యీ యశ్వినశాస్త్రపఠనమే యతిదీర్ఘమైనది. సగమురాత్రి గడచిపోయి "ఉషఃకాలపు వెలుగురు కొద్దికొద్దిగ కనుపడ ప్రారంభించుచున్నప్పుడు" హోత్రి యీ పఠనమును ప్రారంభించవలెను [అ. శా. సూత్ర VI. 5, 8. తమసః కాల ఊర్ధ్వమర్ధరాత్రాత్ప్రాతః భావస్యాను విష్టంభమ్॥] ఈకాలమే ఋ VII. 62. 2,3 లో సూచింపబడినది. పఠింపవలసిన శాస్త్రము బహుదీర్ఘకాలము పట్టును గాన దానివలన కలుగు అలసటను తీర్చుకొనుటకై హోత్రి యీ శ్లోకములను పఠించుటకు పూర్వము వెన్నను బాగుగ కాచి, మూడుపాళ్ళలను ముందగ్గిలోనుంచి, తక్కినదానిని తాను త్రాగవలెను. [ఐ. బ్రా. IV. 7. అ. శా. సూత్ర VI. 5, 8.] ఐతరేయ బ్రాహ్మణములో నీవిధముగ నున్నది:— "హోత్రి తాను పఠనము మొదలిడుటకు పూర్వము బాగుగ నేయి త్రాగవలెను. బండికి తాను వేసినయెడల నది యేవిధముగ సుళువుగ బోవునో అట్లే నేయి త్రాగినయెడల హోత్రియొక్క పఠనము బహు తేలికగ సాగిపోవును" ఈ పఠనము సూర్యోదయము కాకపూర్వమే ముగియవలెననిన రాత్రి రెండుజా

ములుదాటి యింకను చీకటి యుండగనే ప్రారంభింపనైన ప్రారంభింపవలెను, లేదా, యుషఃకాల పరిమితి బహుదీర్ఘముగనైన నుండవలెను. ఈరెంటిలో మొదటిదానిని ఒప్పుకొనుటకు వీలులేదు. ఏలయనగ, చీకటిపోయి క్రమక్రమముగ వెలుతురు రా ప్రారంభమగునరకును యీ శాస్త్రపఠనమును మొదలు పెట్టకూడదని స్పష్టముగ నిషేధించియున్నారు. కనుక మొదట కనువెలుగు కనుపడుటకును, పిమ్మట సూర్యోదయమగుటకును మధ్య తగినంత దీర్ఘకాలము- సహస్రశ్లోకములు పఠించుటకు తగినంత దీర్ఘకాలము- అనఃకాలముండియుండవలెనని స్థిరపడుచున్నది. అదిగాక, ఒకొక్కసారి సరియైనవేళకు పఠన మొదలిడినను సూర్యోదయమగుటకు చాలకాలము ముందుగనే పఠనము ముగిసిపోవునని తైత్తిరీయసంహిత II. I, 10, 3 లో చెప్పియున్నారు. అట్టి సమయములో సూర్యోదయమగువరకు పశుబలి నర్పింపవలసినదనికూడ సంహితలో చెప్పబడి యున్నది; మరియు, అట్టి సమయములో సూర్యోదయ మగునరకును యేవియో యితరములగు వేదఋక్కులను పఠింపవలసినదని అశ్వలాయనసూత్రములు చెప్పుచున్నవి. [అశ్వ. సూ. VI, 5, 8 పారితరనువాకన్యాయేన తస్యైవ సమామ్నాయస్య సహస్రావ మమోదేతేః శంసేత్ ॥] అవసరమైనయెడల నట్టి సమయములో పశుబలి నర్పించుటయేగాక ఋగ్వేదములోని పది మండలములను సైతము పఠింపవలసిన

దని ఆపస్తంబసూత్రములు పలుకుచున్నవి. ఆప. సూ. XIV. 1. 2. యస్యాశ్వినే శస్యమానే సూర్యో నావిర్భవతి సౌర్యం బహురూప మాలభేత్. సర్వా అపి దాశతయీ రనుబ్రూయాత్.] పై ప్రమాణములనుబట్టి ఆదినములలో కను వెలుతురు కనిపించిన పిమ్మట చాలకాలమునకుగాని సూర్యు డుదయ మయ్యెడివాడు కాడనియు, సూర్యోదయ మెప్పుడగునాయని యప్పటివారందరు నిరీక్షించుచుండెడివారనియు, వారనుకొన్న కాలముకంటె నింకను విశేషకాలము గడచిపోయినగాని సూర్యోదయమగుచుండెడిది గాదనియు తేటపడుచున్నది. వారనుకొన్న సమయమునకు సూర్యోదయము కాలేదు గనుక వారందరును దానికై "ప్రాయశ్చిత్తము" కూడ చేసికొనెడివారనియు తైత్తిరీయ సంహితలో ననేకచోట్ల చెప్పబడియున్నది. (తై. సం. II. 1, 94. అసావాదిత్యో నవ్యారోచత తస్మై దేవాః ప్రాయశ్చిత్తి మైచ్ఛన్.)

(2) దీర్ఘ ఉషఃకాలమును సూచించు నిదర్శనమింకొకటి [తై. సం. VII. 2. 20– ఉషసే స్వాహా వ్యుష్ట్యై స్వాహోదిష్యతే స్వాహా ద్యతే స్వాహోదితాయ స్వాహా సువర్గాయ స్వాహా లోకాయ స్వాహా.]–లో కలదు. దానిలో యేడు బలు లర్పింపవలసినదని చెప్పియున్నారు.

(1) ఒకబలి "ఉషస్సు" నకును (2) ఒకటి "వ్యుష్టి" కిని (3) ఒకటి "ఉదేష్యత్" నకును (4) ఒకటి "ఉద్యత్" నకును (5) ఒకటి "ఉదితా" కును (6) ఒకటి "సువర్గ"

కును (7) మరియొకటి "లోక" కును — యీ విధముగ యేడు బలులనుగూర్చి చెప్పియున్నారు. వీనిలో అయిదు బలులు కేవలము అయిదు రూపాంతరములను ధరించిన ఉషః కాలమునకే వర్తించును. మొదటి రెండు బలులనుగూర్చి [తై, బ్రా. III. 8,16, 4 లో యీ రీతిగవర్ణించియున్నారు. ఉషసేస్వాహా వ్యుష్ట్యైస్వాహేత్యాహ రాత్రిర్వా ఉషాః అహర్వ్యుష్టిః అహోరాత్రే ఏవావరున్ధే అథో అహోరాత్రయోరేవ ప్రతితిష్ఠతి తావుదుభయీర్హవిః నాన్తరేణ జుహుయాత్ అహోరాత్రే మోహయేత్ ఉషసే స్వాహా వ్యుష్ట్యై స్వాహేత్యనుదితే జుహోతి. ఉదితాయ స్వాహా సువర్గాయ స్వాహా లోకాయ స్వాహేత్యుదితే జుహోతి॥]. "ఉషస్సు" అనగ రాత్రి యొక్క చివరభాగమనియు, "వ్యుష్టి" అనగ పగటియొక్క మొదటిభాగమనియు చెప్పియున్నారు. దీనికి మనము సమ్మతించినను ఉషఃకాలమును గూర్చి చెప్పిన మిగిలిన మూడు బలులను యెట్లు సమర్థింపనగును? ఒక బలి "ఉదేష్యత్" అనగ ఉదయింపబోవుచున్న ఉషఃకాలమునకును, రెండవబలి "ఉద్యత్" అనగ ఉదయించుచున్న ఉషస్సునకును, మూడవబలి "ఉదితా" అనగ ఉదయించిన ఉషస్సునకును అర్పించవలసినదని చెప్పియున్నారుగద. ఈ మూడింటిలోను మొదటి రెంటిని సూర్యోదయముకాల పూర్వమే యర్పింపవలయునని తైత్తిరీయ

బ్రాహ్మణము చెప్పుచున్నది. భూమధ్య రేఖవద్దనున్న మన దేశములో ఉషఃకాలము బహుకొలదికాలమే యాకాశమున గాన్పించు ననుమాట మన కందరకు తెలిసియేయున్నది. ముహూర్తమాత్రముండిపోవు నీ ఉషఃకాలములో—ఉదయింపబోవుచున్న, ఉదయించుచున్న ఉదయించిన — అని మూడు భాగములుగ విడదీసి ఒక్కొక్కదాని కొక్కొక్క-బలి నర్పించుట యెట్లు సాధ్యమగును ? అంతస్పష్టముగ, మూడు భాగములుగ, విభజించుట కవకాశమేది ? మన మిక్కడ ప్రతిదినముజూచు ఉషఃకాలములో నిన్ని వివరములను గుర్తించుట కంత సాధ్యముగాదు. అయినను భాగములుగ విడదీసి యొక్కొక్కదానికి ప్రత్యేక ప్రత్యేకముగ బలుల నర్పింపగలుగుటకును అప్పటి యుషస్సు బహుదీర్ఘకాలము మాకాశమున గాన్పించుచున్నదై యుండియుండవలె ననుమాట స్పష్టము.

ఉషఃకాలమును గూర్చిన యీ మూడు భేదములును ఋగ్వేదఋషులకు స్పష్టముగ తెలిసినవియేయగును. [ఋ vii 41, 3. [illegible]......తస్య [illegible] ప్రకాశయతు.] లో వసిష్ఠ ఋషుక్క "ప్రియులు తనకు గాను మూడు ఉషస్సులను స్తుతించెదను" నట్లు చెప్పబడియున్నది. i 174—7 లో "తిస్రః దశమ చిత్రాః" అను పదములవలన "మూడుమార్గములు" గల ఉషస్సును సూచించి నట్లు కనబడుచున్నది. [ఋ v. 79—9 లో—వ్యుచ్ఛా దుహితర్దివో మాచిరం తనుథా అపః నేత్వా స్తేనం యథా రిపుం

తపాతి సూరో అర్చిషా.] " ఓ ఉషస్సా ! నీవు ఆకాశము మీఁద విశేషకాల ముండవద్దు. నీ వచ్చుటనే విశేషకాల మున్నచో సూర్యుడు వచ్చి దొంగనుకాల్చినట్లు నిన్నుకాల్చి వేయును." ii. 15–6 లో ఉషస్సుయొక్క గుఱ్ఱములు బహు నెమ్మదిగ నడచుచున్నవి (అజవసః) అని చెప్పి యున్నారు. ఈవాక్యములనన్నిటినిబట్టి చూచిన ఉషఃకాలము ఆకాశము మీఁద విశేషకాలముండెడిదనియు, ఆకారణముచేత అప్పటివారి కది బహువిసుగు బుట్టించుచుండెడిదనియు స్పష్ట మగుచున్నది. వీని యన్నిటికంటె బలవత్తరమైన ప్రమాణ మింకొకటి గలదు. [ఋ i. 113, 137. శశ్వత్పురోషా వ్యువాసదేవీ.] " ఉషాదేవత పూర్వకాలములో (పురా) యెల్లప్పుడును యెడతెగక (శశ్వత్) ప్రకాశింపుచునే యుండెడిది " అని స్పష్టముగ కనబడుచున్నది. i. 118–11 లో – " శశ్వత్–తమా " అనగ " అన్నిటికంటె విశేషకాల ముండెడిది " యను విశేషణమును ఉషస్సునుగూర్చి చెప్పి యున్నారు. అదిగాక, " ఉషస్సు " అనియు " వి + ఉష్టి " అనియు రెండు పదములుండుటయే దీర్ఘమైన ఉషఃకాలమును సూచింపుచున్నది. ఉషస్సు ముహూర్తకాలము మాత్రమే యుండి మాయమైపోయిన యెడల " వి + ఉష్టి " లేక " బాగుగ వికసించిన " యను విశేషస్థితిని సూచింపవలసిన యవసరమేయుండదు. ఇట్టివిశేషస్థితిని ఋగ్వేదములో ననేక తావులలో సూచించియున్నారు. " ఉషసాఃవి—ఉష్టౌ " అను

పదము ఋగ్వేదములో ననేక పర్యాయములు ప్రయోగింప బడి యున్నది. దానికి మనవారు "ఉషస్సు ప్రకాశింపగనే" యను అర్థమును జెప్పిరి. కాని, కేవల మొక భావమునే తెలుపుటకై రెండుపదముల నేల ప్రయోగించి రనుసంశయము మనవారి కెవరికి గలుగలేదు. అదిగాక, మొదటి పదము "ఉషస్సు." దీనికి—"వి" యను ప్రత్యయము జేర్పగ వచ్చినమాట "వి-ఉష్టి." ఇది రెండవ పదము. రెండుభావములను దెలుపుటకై యీ రెండుమాటలను ప్రయోగింపని యెడల వీని ప్రయోజన మేమి? అందుముఖ్యముగ ఆదినములలో మాటలను నిష్ప్రయోజనముగ వాడిరని యూహించుటకు వీలులేదు. ఒకభావమును దెలుపుటకే యీ రెండు పదములను పునరుక్తిగ వాడిరని చెప్పుటకు వీలులేదు.

ఇంకను కొన్ని ఋక్కులను విచారించి చూచెదము. [ఋ I. 113-10 : కియాత్యాయత్సమయాభవాతి యావ్యూషుర్యాశ్చనూనమ్వ్యుచ్ఛాన్ అనుపూర్వాః కృపతేవావశానా పాదీధ్యానాజోషమన్యాభిరేతి॥] దీనిలో మొదటిపాదమున కర్థము చెప్పుట బహుకష్టమైనపని. అనేకు లనేకవిధములుగ దీని కర్థమును జెప్పియుండిరి.

(1) సాయనాచార్యులవారి ననుసరించి చెప్పబడిన యర్థము:—ఉషస్సు లుదయించి యిప్పటి కెంతకాలమైనది? అవి యింక నెంతకాలమువరకు నుదయించుచుండును? మనకింకను వెలుతురు నొసంగవలెనను కోరికతో నిదివర కుదయిం

చిన యుషస్సులవెంట నంటిపోవుచు, తనవెనుక నిక నుదయింపబోవు ఉషస్సులతోఁగూడ ప్రకాశమానముగ ముందునకు సాగిపోవుచున్నవి.

(2) మాక్సిముల్లరు ననుసరించి చెప్పినయర్థము:—ఇదివరకు వెలిగిన ఉషస్సులును, ఇకముందు వెలుగబోవు ఉషస్సులును—ఇవి యెంతకాలము—ఎంతకాల మివి కలిసియుండును? ఇదివరకు వెలింగిన యుషస్సులకొరకు కాంక్షించుచు, మిగిలిన (వెనుకవచ్చు) వానితో నీ యుషఃకాలము సంతోషముగ ముందునకు సాగిపోవుచున్నది.

(3) మూడవయర్థము:—ఇదివర కుదయించిన యుషస్సులకును, యిక నుదయింపబోవు ఉషస్సులకును మధ్యకాల మెంతదీర్ఘముగనున్నది? ఈ యుషఃకాలము యిదివరకే నుదయించిన యుషస్సులకై యాశించి (వానివెంట) బోవుచున్నది. మరియు, తనవెనుక నుదయింపబోవు యుషస్సులతో సహా సంతోషముతో ముందునకు సాగిపోవుచున్నది.

ఈ మూడర్థములలో మన మేయర్థము నంగీకరించినను భావ మొక్కటే తేలుచున్నది. రెండురకముల ఉషస్సులు—ఇదివర కుదయించినవి, యికముం దుదయింపబోవునవి—కలవనుట స్పష్టము. మొదటి రెండర్థములను మనము ఒప్పుకొన్నచో, యీ రెండుతరగతుల యుషఃకాలములును కలిసి విశేషకాల మాకాశమున వెలుంగుచుండుటచేత, వీనితో విసుగుబుట్టి—

"ఇవి యింకను యెంతకాల మిట్లు కలిసి యుండును"— అను శంకను పుట్టించుచున్నవి. అనగ దీర్ఘమైన యుషఃకాలమును సూచింపుచున్నది. ఇట్టి వర్ణన ఉత్తరధ్రువప్రాంతదేశపు ఉషఃకాలమునకే వర్తించునుగాని, మనదేశపు ఉషఃకాలమునకు వర్తింపదు. ఇక మూడవ యర్థమును విచారించుదము. దీనిని బట్టి మొదట నుదయించిన యుషస్సులకును, ఇకముందు నుదయింపబోవు నుషస్సులకును మధ్య చాల విరామ మున్నట్లు స్పష్టముగ జెప్పబడియున్నది. ఇట్టి సృష్టివైచిత్ర్యము ఉత్తరధ్రువమువద్ద తప్ప ఇతరచోట్ల సాధ్యముకాదు. కనుక మనమేయర్థమును ఒప్పుకొన్నను మన సిద్ధాంతమునకు సరిపోవు చునే యున్నది. పూర్వోత్తరసందర్భముల నన్నిటిని విచారించి చూడగ శాయనాచార్యులవారును, మాక్సిముల్లరు ననుసరించి చెప్పిన యర్థములే సరియైన వని తేలుచున్నది. కొన్ని ఉషస్సులు గలవు. అవి రెండు తరగతులుగ విభజింపబడి యున్నవి. ఇదివర కుదయించినవి, ఇకముం దుదయింపబోవునవి. ఈ రెండు తరగతుల యుషస్సులును కలిసి విశేషకాలము ఆకాశమున వెలుంగుచుండును. — ఈ ఋక్కులలో నున్న సారాంశ మిది. మన మిప్పుడు చర్చించిన ఋక్కు పదియవది. ఇక 13 వ ఋక్కును విచారించినచో "పూర్వకాలమునందే ఉషాదేవత సంతతమును వెలుగుచు నున్నది" అని చెప్పబడియున్నది. దీనిని బట్టి ఉషఃకాలము బహు దీర్ఘకాలముగ నుండెడిదని స్పష్టముగ తెలుపబడినది.

ఋగ్వేదము 7 వ మండలములో ననేక ఉషఃకాల గీతములు గలవు. [VII, 76–1,2] లో ఉషస్సులు యెప్పటి వలెనే అనేక సౌందర్యవిశేషములతో తమ ధ్వజమును దిక్చక్రముపై కెత్తినవని చెప్పుచు, VII 76, 3 లో మొదట ఉషస్సుకనుబడి తిరిగి సూర్యోదయమగులోపల ననేకదినములు గడచెనని స్పష్టముగ వక్కాణించి యున్నారు. ఈ VII 76–3 మిక్కిలి ముఖ్యమైనదిగాన నీక్రింద వివరించెదము.

" తానీ దహాని బహులాన్యాసన్, యాప్రాచీనముదితా సూర్యస్య । యతఃపరిజారఇ వాచరం త్యుషో దదృక్షే న పునర్యతీవ ॥

తాని	ఇత్	అహాని	బహులాని	ఆసన్
(ఆ)	(నిజముగ)	(దినములు)	(అనేక)	(ఉండెను)
యా	ప్రాచీనమ్	ఉద్-ఇతా		సూర్యస్య
(యే)	(పూర్వము)	(ఉదయమునకు)		(సూర్యుని యొక్క)
యతః	పరి	జార-ఇవ		ఆ-చరంతి
(దేని)	(వెంబడి)	(ప్రియునివైపునకు వలె)		(కదలిపోవుచున్నది)
ఉషసః	దదృక్షే	న	పునః	యతీ-ఇవ
(ఓ ఉషస్సా !)	(కనుబడుచున్నది)	(కాదు)	(తిరిగి)	(వదలుచున్న స్త్రీ వలె)

దీనికర్థమిది :– " నిజముగ సూర్యోదయమునకు పూర్వము అనేక దినము లుండెను. ఓ ఉషస్సా ! నీవాదిన

ముల వెంబడి (నీ) ప్రియునివైపునకు సాగిపోవుచున్నట్లు కన బడుచున్నావు; గాని, ప్రియునివదలి వెళ్ళిపోవు స్త్రీవలె కనిపించుటలేదు" దీనిలో నుండు ఒక్కొక్క వాక్యమును విడదీసి చూచెదము. "ఆదినములు చాలదినములు" అను నది ప్రధాన వాక్యము. (తాని లేక) ఆదినము లనగ యేదినములు? దీనికి రెండు విశేషణములు గలవు. "యా ప్రాచీనమ్..." అనునది యొకటి. "యతః పరి..." అనునది మరియొకటి. ఆదినములు "సూర్యోదయాత్పూర్వకాల మును సూచింపుచున్నవని" మొదటి విశేషణమువల్ల స్పష్టమగుచున్నది. సూర్యోదయాత్పూర్వమైన నాగ నవి చీకటిదినములు కాకూడదా యని కొందరికి సందియము తోపవచ్చును. కాని, "యతఃపరి..." యను రెండవ విశే షణమువల్ల నీ సందేహము తీరగలదు. ఏలననగ: ఈదినములు సూర్యోదయాత్పూర్వదినములైనను, "ఉషస్సు ఆ దినముల వెంట తన ప్రియునివద్దకువలె సాగిపోవుచున్నవిగాని ప్రియుని వద్దనుండి మరలిపోవుట లేద"ని స్పష్టముగ సూచింపుటవలన, ఆదినములలో ఉషఃకాలపు వెలుతురు కలదనియు, ఆ యుషః కాలము బహుదినము లుండెడిదనియు సిద్ధించుచున్నది. దీని వలన రెండంశములు స్థిరపడుచున్నవి. (1) మొదట ఉషః కాలపు కను వెలుగు కనుబడుటకును తదుపరి సూర్యోదయ మగుటకును మధ్య ననేకదినములు (బహులాని అహాని) గడచె ననియు (2) ఈ దినము లన్నిటియందును ఉషస్సను స్త్రీ తన

ప్రియుని (సూర్యుని) కలిసికొనుటకుగాను బహుభక్తిశ్రద్ధలతో కనిపెట్టుకొని యుండి యాదినములవెంబడి క్రమముగ తన ప్రియుని చేరుచుండెననియు, అనగా ఆదినములలో మొక తెగని ఉషస్సు వెలుగుచుండెననియు స్పష్టమగుచున్నది.

ఈ ఋక్కున కర్థము జెప్పుటలో భాష్యకారు లందరును ఉక్కిరిబిక్కిరి యైరి. ఇక్కడ వచ్చిన గొప్ప చిక్కేమి యనగా:- సూర్యోదయమునకు పూర్వము అనేకదినములు గడచు టెట్లు? మనదేశములలో నిది సంభవము కానేరదు. శాయనులవారికిని తదితర భాష్యకారులకును ఉత్తరధ్రువ సిద్ధాంతమను యీకీలకము తెలియనందున వారేదోవిధముగ మనదేశపు స్థితిగతులకు ముడివెట్టజూచిరి. పైకి బహుతేలికగ గన్పట్టుచున్న వాక్యములకు స్వభావసిద్ధమైన యర్థములను వదలివైచి, యేవియో మూలమూల నున్నట్టియు, పూర్వోత్తర సందర్భములకు అతుకనట్టియు, మొంతదూరమో త్రవ్వినగాని యచ్చటి భావమునకు సరిపోనట్టియు పెడార్థములను జెప్పి అతుకులు బెట్టవలసినవారైరి. కాని మన మొక్కసారి, యీ కీలకమును మనస్సునందుంచుకొన్నచో యీ వాక్యములన్నియును సులభముగ బోధపడగలవు. పై ఋక్కులలో సమర్థింపవలసిన మాట "అహాని" అనగ దినములు. ఇది బహువచనము. దీనిని సమర్థించు టెట్లు? సూర్యోదయమునకు పూర్వము అనేక దినము లెట్లు గడువగలవు? కాన దీని కర్థమును చెప్పుటకై యీ మాటయొక్క మూలములోనికి

దిగిరి. "అహర్" అనునది "అహ" అను మూలములో నుండి పుట్టినది. "అహ" అనగ "మండుట," "వెలుగుట" అని అర్థము. కనుక "అహర్" అనగ "కాంతి," "వెలుతురు," "ప్రకాశము" అను అర్థము వచ్చినది. దీనినిబట్టి "అహాని" అనగ "కాంతులు" అను నర్థము చెప్పవచ్చును. కాని యీ యర్థములో యీ మాట నెచ్చటను ఋగ్వేదములో ప్రయోగింపలేదు. "అహాని" అనగ దినములని యేఋగ్వేదములోని సాధారణార్థము. "అహాని" అనగ "కాంతుల" ని యిచ్చట చెప్పుట కేవలము స్వభావ విరుద్ధము. అదిగాక, "అహర్" అను పదము కేవలము వెలుతురుగ నున్నకాలమునకే వర్తించునని శాయనులవారి మతము. కాని ఋగ్వేదములో నట్లెచ్చటను చెప్పియుండ లేదు. మరియు, "నల్లని" దినము (అహః) అనియు, "తెల్లని" దినము (అహః) అనియు రెండు విధములైన (అహః) దినములు గలవని ఋ. VI. 9–1 లో స్పష్టముగ జెప్పియున్నారు. [అహశ్చకృష్ణ మహరర్జునమ్ చ వివర్తేతే రజసీ వేద్యాభిః] ఈ విషయమంతయు శాయనులవారికి పూర్తిగ తెలియును. "అహః" అను పదము రాత్రికాలము నకుగూడ వర్తించునని తామే I. 185–4 లో స్పష్టముగ వ్యాఖ్యానము చేసియున్నారు. కాని వారికి తటస్థించిన కష్టము వేరు. సూర్యోదయమునకు పూర్వ మనేక దినము లెట్లు గనుపడగలవు? ఈ బాధనుండి తప్పించుకొనుటకై

యేదియో యతుకుపెట్టజూచిరి. పాశ్చాత్య భాష్యకారు లకుకూడ యీ చిక్కే తటస్థించినది. కాని యీ వర్ణనను ఉత్తర ధ్రువప్రాంతదేశములకు వర్తింప జేసినయెడల యీ చిక్కులన్నియు మాయమగును. ఏలననగ, అచ్చట ఉషః కాలము బహుదినములు, కొన్నిసమయములలో నెలదిన ములునైత ముండునని యిదివరకే చెప్పియుంటిమి. ఇది కేవల మచ్చటి ఉషఃకాలమును గూర్చియే చెప్పబడినది. కావలయు ననిన మనముకూడ యిప్పు డుత్తరధ్రువము వద్దకుపోయి యీ సృష్టివైచిత్ర్యమును కండ్లార గాంచవచ్చును.

సూర్యుడే లేనప్పుడు దినములు లెక్కపెట్టు ట్లని కొందరు శంకింపవచ్చును. కాని సూర్యుడు లేనిసమయము లలో సప్తర్షిమండలము మొదలగు నక్షత్రములు తిరుగు చుండును. అదిగాక, యీ యుషస్సుయొక్క కాంతియే దిక్చక్రముయొక్క అంచువెంబడి తిరుగుచుండును. పూర్తిగ నొక చుట్టు తిరిగిన యెడల నది యొకదిన మగుచున్నది. ఇట్లెన్నియావృతములు తిరిగిన నన్నిదినములు గడచెనని లెక్క వేయ వచ్చును. ఉషస్సు ఉదయించి యిన్ని దినము లైనదనియు, మరి యింక కొన్నిదినములు గడచిన గాని యీ యుషస్సు పూర్తిగ సూర్యోదయముగ వికసింప దనియు లెక్కవేయ వచ్చును. II. 28-9 లో చెప్పి నట్లుగ నిన్నిదినముల పరిమితిగల యుషఃకాలము గడచినను యింకను సూర్యోదయము కాలేదని లెక్కవేయవచ్చును.

[పరఋణాసా వీర ధమత్కృతాని మాహంరాజ న్నన్యకృతేన భోజం । అవ్యుష్టాఇన్ను భూయసీ రుషాస ఆనో జీవా న్వరుణ తాను శాధి] దీనియర్థము:— "నాచేత చేయబడినట్టువంటి ఋణములను (అనగ పాపములను) అన్నిటిని తొలగింపుము. ఓ రాజా! ఇతరులక్రియలవలన నేను అంటబడకుండునట్లు చేయుము. నిజముగ అనేకఉషస్సులు వికసింపలేదు. ఓవరుణా! మే మాఉషస్సులలో జీవించియుండునట్లనుగ్రహింపుము." మొదటిరెండుపాదములలోను అన్వయముగాని వ్యమేమియును లేదు. మూడవపాదమే వివాదాంశము. "భూయాసీః ఉషాసః అవ్యుష్టాః" అనుపదముల కర్థమేమి? మొదటి రెండుపదములకును అర్థము "భూయాసీః ఉషాసః" (అనగ) "అనేకఉషస్సులు" అని తెలుపుచున్నది. ఇకమిగిలినది "అవ్యుష్టాః" అనుపదము. "అవ్యుష్టాః" అనునది "వ్యుష్టాః" అనుదానికి వ్యతిరేకార్థమును తెలుపుపదము. "వ్యుష్టాః" అనునది "ఉష్టాః" అనుదానికి — "వి" — యను ప్రత్యయము చేర్చగవచ్చిన పదము. "ఉషస్", "వ్యుష్టి" యను రెండు పదములకు గల భేదమును ఉషఃకాలము యొక్క- 3. 5 మాసాంతరములనుగూర్చి చర్చించిన సందర్భములో నిదివరకే చెప్పియుంటిమి. తై. బ్రా. లో "వ్యుష్టి" యనగ "దినము" అనియు లేక "ఉషస్సు పూర్తిగ వికసించి సూర్యోదయమగుట" యనియు అర్థము చెప్పియున్నారు. కనుక "అవ్యుష్టాః" అనగ "అ + వి + ఉష్ట" అనుదానికి "పూర్తిగ సూర్యోదయమానము

లోనికి వికసింపని, ప్రజ్వలింపని" యని తాత్పర్యము కాని "ఉషస్సు," "వ్యుష్టి"-యీ రెండు మాటలకును గల తారతమ్యమును శాయనులవారును తదితరవ్యాఖ్యాతలును గమనించినట్లు కన్పించదు. ఒకవేళ వారు దీనిని గమనించినను సూర్యబింబము పైకి కనబడులోపల నిన్నిదినముల యుషఃకాల ముండుననుయనుమానము వారి మనస్సునకు తట్టియుండదు. ఆకారణముచేత, "భూయసీః ఉషాసః అవ్యుష్టాః" = అనేక ఉషస్సులు పూర్తిగ సూర్యోదయరూపములోనికి వికసింపలేదు, "ప్రజ్వలింపలేదు" అను భావము వారికి యసందర్భముగ గాన్పించెను. ఏలననగ :— ప్రతిదినమును ఉషఃకాలము వెంటనంటి పూర్తిగ సూర్యోదయమగుట వారు తమ కం డ్లార చూచుచునే యుండిరి. అట్టి సందర్భములలో "అనేక ఉషస్సులు పూర్తిగ సూర్యోదయరూపము లోనికి వికసింప లేదు, ప్రజ్వలింపలేదు" అనిచెప్పుమాటలు వారికిమిక్కిలి యసందర్భముగ గాన్పించెను. కనుక దీని నేదో విధముగ సమర్థింపజూచిరి. కండ్లకెదురుగ గనుపడు నంశములను గూర్చి వర్ణింపుచున్న "అవ్యుష్టః" యనుపదమునకు భవిష్యదర్థమును కల్పించిరి. "ఇంకను ఉదయింపని ఉషస్సు లలో" అనగ "ముందురాబోవుదినములలో" ననియర్థమును చెప్పిరి. ఈయతుకు యతుకుగనే గాన్పించుచున్నది. ఏలననగ యీఋక్కునువ్రాసిన ఋషి తానప్పుడు కండ్లారచూచుచున్న విషయములను వర్ణింపుచున్నాడేగాని ముందురాబోవువానిని

గూర్చి చెప్పుటలేదు. దీనినిజార్థమిది. " అనేక ఉషస్సులు,అనగ దినములపరిమితిగల యనేక ఉషస్సులు గడచినను యింకను "వ్యుష్టి" కాలేదు. అనగ, పూర్తిగ సూర్యోదయము కాలేదు. అనగ సూర్యబింబము పైకి రాలేదు. కాన యీసమయములో వరుణుడు భక్తుని రక్షించుగాకయని ప్రార్థన. ఈభావమునే బలపరుచుట కింకను ఋగ్వేదములో ప్రమాణములుగలవు. పైఋక్కులోని " భూయసీః" యనుపదమునకు సమానార్థముగల " పూర్వీః " (అనేకను) అనుపదము IV. 19, 8; VI. 28, 1 లోను కలదు. ఒక్కఉషస్సేగాక అనేక ఉషస్సులు గలవని సూచింపఁబడినది. అదిగాక ఋగ్వేదములో ఉషస్సును తరుచుగ బహువచనముగ గ్రహించిరి. I. 92 లో ఉషఃకాలమునుగూర్చినగీతమును ప్రారంభించుచు, " ఇవిగో ! దిక్ప్రక్రముపైనగాన్పించు యీ (ఏతాః) ఉషస్సులే ఆ (త్యాః) ఉషస్సులు (ఉషసాః) ! " అని ఋగ్గరగ తన హృదయాహ్లాదమును వెలిబుచ్చెను. ఈవాక్యమే VII. 78–3 లో కూడగలదు. ఈబహువచనమును గౌరవచిహ్నముగ ప్రయోగించిరని యాస్కాచార్యులవారు సమర్థింపజూచిరి. ఉదయకాలమునకు అధిష్ఠాన దేవతలుగనున్న యనేక దేవతలనుగూర్చి యీ బహువచనము ప్రయోగింపబడినదని శాయనులవారు సమర్థింపజూచిరి. పాశ్చాత్యభాష్యకారు లేమియు నింతకంటె యెక్కువ చెప్ప లేకపోయిరి. గౌరవచిహ్నముగ బహువచనము నుపయోగించిరని మన మొకవేళ నొప్పుకొన్నను,

పిమ్మట తిరిగి యేకవచన మేల ప్రయోగింపవలెను ? ఉషస్సు లుదయించుటను గూర్చి వర్ణింపుచు ననేక ఉపమానములను చెప్పిరి. కొన్నిచోట్ల వీనిని "యోధ వీరుల"కు (ధ్రుష్ణవః) పోల్చి యున్నారు. కొన్ని చోట్ల తమ తమ పనుల నన్నిటిని బహు చాకచక్యముతో నిర్వర్తించుకొను స్త్రీలతో (నారీః) పోల్చిరి. "నీటితరంగ ములవలె (అపాం న ఉర్మయః) దిక్చక్రముపై గాన్పించు" నని వర్ణించిరి. యజ్ఞములో పాతిన స్తంభమువలె (అధ్వరేషు స్వరవః) నున్నవని వర్ణించిరి. ఇవన్నియును, "వరుసగ నిలువబెట్టిన మనుష్యుల" వలె (విశోన యుక్తాః) నున్నవి. పశువులమందవలె (గవాం న సర్గాః) పోవుచున్నవి. అవన్నియు నొకటే మాదిరిగ (సదృశీః) నున్నవట. ఒక్కటే మనస్సుతో (సజ్ఞానన్తే) కలసిమెలసి యుండి పనిచేయుచున్నవట. అవ న్నియు నొకే ఆవరణలో (సమానే ఉర్వే) నున్నప్పటికిని ఒక దానిమీదికి మరియొకటి కలహించి పోవట. (మినన్తి యతంతే.) X. 88–18 లో స్పష్టముగ మూడు ప్రశ్నలు గలవు. "ఎన్ని అగ్నులు, ఎంతమంది సూర్యులు, ఎన్ని ఉష స్సులు (ఉషాసః) కలవు ?" ఈపై వాక్యములనుబట్టి చూచి నచో యాస్కాచార్యులవారియర్థము సరియైనదికాదని తేలు చున్నది. ఇదిగాక, శాయనాచార్యులవారు చెప్పిన దానిని విచారించి చూచుదము. ఉషఃకాలమున కధిష్ఠానదేవతలు పెక్కుమందియుండనేల ? కాన యిదియును సరియైనదికాదు.

ఈ బహువచనప్రయోగమును మఱికొంద ఱిట్లు సమర్థింప జూచిరి. సంవత్సరము పొడుగుననువచ్చు, ఉషస్సులనుగూర్చి చెప్పినందున నీ బహువచనమును ప్రయోగించిరట. ఈసిద్ధాంతము ప్రకారము సంవత్సరములో 360 ఉషస్సులుండవలెను. ప్రతియుషఃకాలానంతరమును సూర్యోదయ ముండవలెనుగద. కాని యీ విషయమును కొంచెము విచారించిన యెడల యీ సిద్ధాంతము నిలువజాలదని తేటపడగలదు. ఒక్కొక్క ఉషస్సునకు మధ్య 24 గంటల విరామముతో గూడుకొనిన 360 ఉషస్సులనుగూర్చి వర్ణింపుచున్నప్పుడు I. 92-1 లో "ఇవి గో! యీ (ఏతాః) ఉషస్సులే, ఆ (త్యాః) ఉషస్సులు" అని తనకండ్లార తనయెదుట కాన్పించుచున్న వస్తువులను చూపించి మాట్లాడుచున్న శ్లోల వర్ణించును. ఇచ్చట బహువచనప్రయోగ మేలయుండవలెను. ఈబహువచనము సంవత్సరముపొడుగునను దినములవరుసను, వచ్చుఉషస్సులైనయెడల "వరుసగ నిలువబెట్టబడిన మనుష్యులు" అనువర్ణన కెట్లు సరిపోవును? ఇవన్నియు నొకయావరణలోనే యున్నప్పటికిని ఒకటితో మఱియొకటి తగవులాడుకొనకుండ నున్నవ" ను వర్ణన కెట్లు సరిపోవును? కనుక యీయర్థము లేమియు సరిపోవు. ఉషస్సులన్నియు నొకటితరువాత మఱియొకటి యెడ తెగక, సూర్యోదయముచే భగ్నముగాకుండ వరుసగనన్నియు నొకచోటనే నిలచియున్నవని తేలుచున్నది. కనుక వీనినన్ని టిని కలిపి ఒకదీర్ఘమైన పెద్దయుషఃకాలముగ గ్రహింపనగును.

అనగ అచ్చట యుషఃకాలము బహుదీర్ఘమైనదని సిద్ధించు చున్నది. "ఉషఃకాలపు వెలుతురు కనుబడుటకును తదుపరి సూర్యోదయమగుటకును మధ్య ననేకదినములు గడచునను VII. 76–3 లోని భావమునకును యీభావమునకును సరి పోవుచున్నది. రెంటియర్థమొకటే. కనుక యాస్కాచార్యుల వారు, శాయనాచార్యులవారు, తదితరులు చెప్పిన సిద్ధాంత ములను త్రోసివేయవలసినదే. అప్పటికాలములో ఉషః కాలము బహుదీర్ఘకాలముగ నుండెడిదనియు, ఆయుషస్సు అనేకదినములవరకు వ్యాపించియున్నకారణమున దినమున కొక్కొక్క ఉషస్సుగ నీదీర్ఘయుషస్సును విభజించినయెడల, యీభాగములను బహువచనముతో సంబోధింపవచ్చుననియు తేలుచున్నది. దీనినిబట్టి ఉషఃకాలమునుగూర్చి చెప్పుచున్న ప్పుడు కొన్నిసమయములలో నేకవచనమును, మఱికొన్ని సమ యములలో బహువచనము నేలప్రయోగించిరో తేటబడ గలదు.

తై. సం. IV, 3–11 లో ఉషస్సులన్నియు కలిసి "ముప్పది యప్పచెల్లెండ్ర"ని చెప్పబడియున్నది. వీరంద రును అయిదు జట్టులుగజేరి, గిరగిర తిరుగుచు, మొదట తాము బయలుదేరిన చోటికివచ్చి చేరుదురట. ఆ యనువాక మంతటిలోను 15 ఋక్కులు గలవు. కొన్ని యజ్ఞములలో బలిపీఠముపై "ఉషస్సు యిటుకలు" "వ్యుష్టి – ఇష్టకాః" పేర్చునప్పుడు యీ ఋక్కులనే మంత్రములుగ పఠంతురు.

ఇటుకలన్నియు కలిసి మొత్తము 16 గలవు. వీనిలో 15 టిని పేర్చుట కీమంత్రములు పనికివచ్చును. మిగిలిన 16 వది మరి యొకచోట గలదు. ఈ యనువాకములో మొదటి మంత్ర మును పఠించుచు మొదటి యిటుకను పెట్టుదురు. ఈ మంత్ర ములో మొట్టమొదటగ నాకాశముమీద గాన్పించు ఉషస్సు నుగూర్చి వర్ణింపబడియున్నది. రెండవమంత్రములో రెండు ఉషస్సులుకలిసి జంటగనొకచోటనే నివసించియున్నట్లు వర్ణింప బడియున్నది. మూడవమంత్రములో మూడవఉషస్సు సూచిం పబడినది. ఇట్లే 4, 5 మంత్రములలో నాల్గవ, ఐదవ ఉషస్సు లనుగూర్చి చెప్పబడియున్నది. ఈయైదు ఉషస్సులను తా మైదుగురుమాత్రమేగాక తమలో నొక్కొక్కరికి అయిదేసి చొప్పున 25 గురు చెల్లెండ్రు కలరట. కనుక మొదటి అయి దుగురు కూడ కలుపుకొని మొత్తము 30 ఉషస్సు లగుచున్నవి. ఈముప్పది యక్క చెల్లెండ్రను [త్రింశత్ స్వసారః] కలిసి అయిదుజట్లుగ, గుండ్రగ, పోవుచున్నట్లును (పరీయంతి) తిరిగి యెప్పటిచోటునకే వచ్చి చేరుచున్నట్లును (నిష్కృతం) వర్ణించియున్నారు. రెండవమంత్రమునందు నప్పిన్నట ఉషస్సులలో నున్నట్టి యేకమత్యము తమలోకూడ నుండునట్లనుగ్రహింప వలసినదని ప్రార్థన యొకటిగలదు. మొదట చెప్పిన 5 ఉషస్సు లలో నొకఉషస్సు "ఋత" యొక్క కుమార్తెయట. రెండవది జలముయొక్క మాహాత్మ్యమును దెలుపునట. మూడవది సూర్యమండలములో నివసించు నట. నాల్గవది యగ్నిమండల

ములో నుండునట. ఏనది “ సవిత్ర ” నిచే పాలింపబడుచున్న దట. పైవర్ణనను బట్టి యీ మైదు ఉషస్సులును మన మీదేశ ములో ప్రతిదినమును జూచు ఉషస్సులు కావనియు ఇవన్నియు నొక్క దీర్ఘ ఉషస్సులోని అంతర్భాగము లేయనియు, స్పష్టమగు చున్నది. “ఈయుషస్సు అనేకరూపములను ధరించి వెలుగు చున్నను, నిజమున కిది యంతయు నొకటేయుషస్సని” యీ యనువాకములోని చివరమంత్రములో నిస్సందేహముగ, ఖండితముగ, వివరించియున్నారు. ఈయనువాక మంత్రములో నెచ్చటను సూర్యోదయమైనట్లు చెప్పియుండలేదు. సూర్యోదయపు ప్రశంసయే రాలేదు. అదిగాక “బ్రాహ్మణము” లో దీనిని స్పష్టపరచినారు. “ పగలును, రాత్రియు గానికాలము కొంతయుండెను. ఏదైనదియు చెప్పుటకు వీలులేనికాలముగ ఉండెను. అప్పుడు దేవతలందరును యీయుషస్సులను జూచి వానిని క్రిందికిదించిరి. అంతట వెలుతురు వచ్చెను. కనుక యీ “ఉషస్సు ఇటికరాళ్లను పేర్చిన వానికి వానిలోనుండు చీకటి పోయి వెలుతురు వచ్చును.” ఈమంత్రములను చదువుచు బలిపీఠముమీద నేల “ ఉషస్సు ఇటుకల ” ను పేర్చవలెనో యీపై దానిని బట్టి స్పష్టమగుచున్నది. ఇది పూర్వగాధను తెలుపుచున్నది. పూర్వము దేవతలు రాత్రియు పగలుగాని సమయములో నున్న ఉషస్సులను ముప్పదింటిని చూచుచుండెడివారనియు, ఒకదానిపై నొక ఉషస్సును పెట్టుకొనుచు పోగా 30 ఉషస్సులను లెక్కపెట్టి పేర్చిన తరువాత

వెలుతురు (సూర్యకాంతి) వచ్చి సూర్యోదయ మాయెననియు స్పష్టమగుచున్నది. ఆవిధముననే బలిపీఠముమీద ఈమంత్రముల నుచ్చరించుచు యిటుకరాళ్ళను పేర్చిన యెడల వాని పాపము లన్నియు పోయి, పుణ్యమువచ్చునని దీని భావము. కనుక ముప్పది దినములు, లేక ముప్పది ఉషస్సులకాలము గడచిన గాని సూర్యోదయమయ్యెడిది కాదని దీనివలన స్పష్టమగు చున్నది. అదిగాక, యీ 30 ఉషస్సులును మనము మనదేశ ములో ప్రతిదినము జూచుచుండు ఉషస్సులు కావనియు స్పష్టమగుచున్నది. కనుక యీ వర్ణన తప్పక ఉత్తరధ్రువ ప్రాంతదేశములకే వర్తించును. ఈ 30 యుషస్సులును దిన దినమును కల్పించు సామాన్యమాత్రపు ఉషస్సులు కావనియు ఇవన్నియు నొక దీర్ఘయుషస్సులోని భాగములే యనియు చెప్పుటకింకను నిదర్శనములు గలవు. తై. బ్రా. II. 5, 6, 5 " ఈ యుషస్సులే ఆ మొదట ప్రకాశించిన యుషస్సులు. ఈదేవతలు 5 రూపములను ధరింతురు. శాశ్వతమైనవి (శశ్వతీః) విడిపోనివి (నఅవపృజ్యంతి) అంతములేనివి (నగమంతిఅంతం) [ఇమా ఏవ తా ఉషసో యాః ప్రథమా వ్యుచ్ఛన్ । తా దేవ్యః కుర్వతే పంచరూపాః। శశ్వతీర్నావపృజ్యంతి నగమన్త్యన్తమ్॥] దీనిలో చెప్పబడిన 5 రూపములును ఋ. సం. లో చెప్ప బడిన 5 జట్లులకును సరిపోవుచున్నవి. ఈ యుషస్సు లన్నియు కలిసి యొకటిగనే యుండుననియు, విడిపోవనియు, వీనిలో నొకదానికిని మరియొకదానికిని మధ్య సూర్యోదయము రాదు

నియు స్పష్టమగుచున్నది. ఋ. I. 152_4 లో ఉషఃకన్యల (కానీనాంజారం) ప్రియుడైన సూర్యునియొక్క మేలిముసుగు (అనగ ఉషస్సు) విడిపోనిదనియు, మిక్కిలి వెడల్పుగల దనియు (అ౯-అవపృగ్ణ; వితత) వర్ణించి యున్నారు. ఇది పై వర్ణనలతో నేకీభవించుచునే యున్నది. అధర్వవేదము VII. 22_2 లో ఉషస్సులు "సచేతసః" అనియు, "సమీచీః" అనియు (అనగ అన్యోన్యమైత్రితో మెలగుచు కలిసిపోవుననియు, యెప్పుడును విడిపోవనియు) వర్ణించి యున్నారు. ఈ సందర్భములో 30 ఉషస్సులను గూర్చి శాయనాచార్యులవా రెట్లు సమర్థించిరో విచారించెదను. ఆయనువాకముయొక్క మొదటిమంత్రములో మొదటి యుష స్సును గూర్చిన ప్రశంసకలదు. ఈ మొదటి యుషస్సు సృష్ట్యా దిని కనుబడిన "ప్రథమఉషస్సు"ను సూచింపునని శాయ నులవారు వ్యాఖ్యానముచేసిరి. రెండవమంత్రములో చెప్ప బడిన "ఉషస్సు" మనము ప్రతినిత్యమును జూచు ఉషస్సును సూచింపునట. కాని మిగిలిన 28 ఉషస్సుల నేమిచేయవలెను? శాయనుల వారికి యీరెండు ఉషస్సులేతప్ప ఇంకొక మూడవరకపు ఉషస్సు తెలియదాయెను. అందువలన ఉషస్సంతయు నొకటియైనను, ఆయుషాదేవత తన యోగ బలముచే ననేకరూపములను ధరింపగలైనని శాయనుల వారు మిగిలిన 28 ఉషస్సులను సమర్థించిరి! ఇదిగాక తుదకు వీరొక యర్థమును సాధించిరి. ఈ 30 ఉషస్సులును దినమున

కాక ఉషస్సుచే వ్యాప్తమైన నెలదినములలోను కనబడు మొత్తపు ఉషస్సుల సంఖ్యయని చెప్పిరి. కాని వీరిలెక్క ప్రకారము సం॥ లో 360 ఉషస్సు లుండగ వానిలో యీ 30 ఉషస్సులను గూర్చిమాత్రమే యీ మంత్రిములలో నేల ప్రశంసించిరో వీ రెచ్చటను తెలియబరచియుండలేదు. ఈ యర్థములన్నియు పరస్పర విరుద్ధములేగాక, తైత్తిరీయ బ్రాహ్మణ॥; తై॥ సం॥ లలో చెప్పిన వాక్యములకుకూడ విరుద్ధముగ నున్నవి. పూర్వము మన యార్యు లుత్తరధ్రువమువద్దనుండగ అచ్చటిసృష్టివైచిత్ర్యములను వారు కన్నారచూచి యీవిధముగ వర్ణించిరను యనుమానము శాయనాచార్యులవారి మనస్సునకు తోచనందున వారిట్టిపరస్పరవిరుద్ధములగు వ్యాఖ్యానములను చెప్పవలసినవారైరి. ఈసంగతి మునే వారెరింగి యుండినయెడల వారిట్టి పెడార్థములను చెప్పెడివారు కారు.

ముప్పదియుషస్సులుగల వనుమాట తై॥ సం॥ బ్రా॥ లలో కలదేగాని, ఋగ్వేదములో నెచ్చటనులేదని కొందరు వాదింప సాహసించెదరేమో. అట్టింతమాత్రము గాదు. ఋ VI 59–6 లో ఉషస్సు "ముప్పదియడుగులు" (త్రింశత్పదాని అక్రమీత్) నడచిపోయినది, అని చెప్పబడియున్నది. [ఇంద్రాగ్నీ అపాదియం పూర్వాగాత్పద్వతీభ్యః హిత్వీశిరో జిహ్వయా వావదచ్చరత్త్రింశత్పదా న్యక్రమీత్]. దీని కింక నెవరును పూర్తిగ అర్థము చెప్ప సాహసింపలేదు. 'ఈ ఉషస్సు ముప్పదిఅడుగులు నడచినది' అననను 'ఉషస్సులు ముప్పది

30 అక్కచెల్లెండ్రు: వారందరు కలిసి ఒకచోటికే వచ్చి చేరునట్లు గుండ్రముగ తిరుగుదురు ’ అనినను — ఈరెండు వాక్యములకు నొకటేయర్థమని వేరుగ చెప్పనక్కరలేకయే తెలియుచున్నది. ఇదిగాక ఋ I. 123–8 [సదృశీరద్య సదృశీరిదు శ్వోదీర్ఘంసచాంతే వరుణస్యధామ్ అనవద్యాస్త్రింశతం యోజనాన్యేకైకా క్రతుం పరియంతి సద్యః] “ ఉషస్సులు యీదినముననున్నట్లే రేపటిదినముకూడనుండి, వరుణుని మందిరములో చాలకాలమువరకు నివసించును. అవి కల్మషరహితమైనవి. అవి గుండ్రముగ ముప్పది యోజనములు తిరుగును (పరియంతి). ఇట్లు తిరుగుటలో ప్రతియుషస్సును మొప్పటిచోటికి వచ్చి చేరును (క్రతుం). ” మొదటి రెండు వాక్యములలోను కష్టమేమియు లేదు. పిమ్మట “ ఉషస్సులు గుండ్రముగ ముప్పదియోజనములు తిరుగుచు మొప్పటిచోటికి వచ్చిచేరుచుండును ” అని చెప్పబడియున్నది. * దీనియొక్క నిజార్థము నింతవర కెవరును విప్పిచెప్పలేకపోయిరి. ఇది కేవలము ఉ. ధ్రు. ప్రాంతదేశములోని ఉషస్సులయొక్క లక్షణము. 30 ఉషస్సులు (30 దినములు) గడచినగాని

---

* యోజనము అనగ “ ఒక్కదినములో తిరుగగలదూరము ” ఈ మాటను యీ గ్రంథములోనే V–54–3 లో ప్రయోగించియున్నారు కనుక ముప్పది యోజనము లనగ ముప్పదిదినములలో తిరుగుదూరము. అనగ దినమున కొకచుట్టుచొప్పున యీ యుషస్సులు 30 దినములలో 30 చుట్లు తిరిగినపిమ్మట సూర్యోదయమగును — అని భావము.

సూర్యోదయముకాదని చెప్పియుంటిమి. ప్రతియుషస్సును దిక్చక్రముయొక్క అంచువెంబడితిరుగుచు క్రమముగ పైకి వచ్చుచుండుననికూడ చెప్పియుంటిమి. కనుక యీ వర్ణనను ఉ. ధ్రు. ప్రాంతదేశపు ఉషస్సులకు వర్తింపజేసినచో, వీని యర్థము చక్కగ బోధపడగలదు. ఈ వర్ణన మనదేశపు ఉషః కాలవర్ణన కెంతమాత్రమును సరిపోదు. ఈ యుషస్సులు గుండ్రముగ తిరుగుచున్నవనుటకు నిదర్శనములు చాలగలవు. "ఓ ఉషస్సా! తిరిగియెప్పటిచోటికేవచ్చి చేరునట్లు (సమానం అర్థమ్) నీవు చక్రముతిరిగినట్లు తిరుగుము (చక్రం ఇవ ఆవవృత్స్వ) అని ఋ III. 61—3 [ఉషః ప్రతీచీభువనాని విశ్వోర్ధ్వాతిష్ఠస్య మృతస్య కేతుః సమాన మర్థం చరణీయమానా చక్రమివనవ్యస్యావవృత్స్వ॥] లో చెప్పియున్నారు. "చక్రముతిరిగినట్లు" అనగ నిలువుగ రథచక్రము తిరిగినట్లు తిరుగకూడదా యని కొందర భ్యంతరము చెప్పవచ్చును. కాని ప్రపంచములో నెచ్చటను యీవిచిత్రము కాన్పింపదు. ఉత్తర ధ్రువమువద్దనైతము అడ్డముగ, దిక్చక్రపు అంచువెంబడి, కుమ్మరివానిసారె తిరిగినట్లు తిరుగునే కాని, నిలువుగ తిరుగదు. ఉషఃకాలపు వెలుతురెప్పుడును దిక్చక్రపు అంచుననేయుండును గాని, ఆకాశముమీన మననెత్తిమీది కెత్తుగ రాజాలదు. కనుక, కుమ్మరిసారె తిరిగినట్లే తిరుగుచున్నదని చెప్పుట కేమియు అభ్యంతరము లేదు. ఇట్లు తిరుగుట కేవల ముత్తరధ్రువప్రాంతలక్షణమే యనుట నిర్వివాదము. మనదేశములలో ఉషఃకాలపు వెలుతురు పూర్వన

కొద్దిగ గాన్పించి పిమ్మట సూర్యోదయ మగుటంతో డనే దాని లో కలిసిపోవును. కనుక యిక్కడి యుషస్సు గుండ్రముగ తిరుగుచున్న దని చెప్పుట కెంతమాత్రమును వీలులేదు. కనుక పై వేదవాక్యము తప్పక ఉ. ధ్రువప్రాంతఉషస్సునే సూచింపు చున్నదనుట స్పష్టము.

ఋగ్వేదములో మన యుషఃకాలములనుగూర్చికూడ అచ్చటచ్చట సూచనలు గలవు. కాని చాలభాగమువరకు ఉ. ధ్రువపు దీర్ఘఉషఃకాలమే యిన్ని యుషాగీతములను వ్రాయుటకు కారణ మైనదని మాత్రము చెప్పకతప్పదు. లేదా, ఉ. ధ్రు. వదలివచ్చిన పిమ్మటకూడ ఆకాలమువారు తమ తాత ముత్తాతలు చెప్పుకొనుచుండగ యీాలక్షణములను వారివల్ల వినియైన నుండవలెను.

—♦ సింహావలోకనము. ♦—

(1) ఋగ్వేదములో వర్ణించిన ఉషఃకాలము బహు దీర్ఘమైనది. ఉషఃకాలపు కనువెలుతురు కనుబడుటను లెదు పరి సూర్యోదయ మగుటకును మధ్య అనేకదినములు గడచు చుండెను. దీనికి ప్రమాణము. [ఋ VII–76–3]

(2) పూర్తిగ సూర్యోదయము స్వస్వరూపములోనికి వికసించుటకుపూర్వము అనేకఉషస్సులు ఒకటితరువాత ఒకటి క్రమముగ పైకివచ్చుచుండెను. దీనికి ప్రమాణము. [ఋ. II. 28–9]

(3) ఉషస్సును బహువచనముగ సంబోధించిరి. 30 దిన ములవ్యాప్తిగల దీర్ఘఉషస్సులోని 30 దినభాగములకు యీా

బహువచనము వర్తించును. దీనికి ప్రమాణము [ఋ 1. 123–8: VI. 59–6 తై ॥సం॥ IV 3, 11, 6.]

(4) అనేకఉషస్సు లొకచోటనే నివసించి, తమలో తాము కలహించుకొనక అన్యోన్యస్నేహభావముతో వర్తింపుచున్నవి. దీనికి ప్రమాణము [ఋ. IV 51–7–9; VII 76–5; అధ. వేద. VII 22–2]

(5) ఉషస్సులోని 30 భాగములును మొదలెగనివి; విడిపోనివి. [1. 152–4; తై. బ్రా. II. 5, 6, 5; అధ. వేద. VII. 22–2]

(6) 30 ఉషస్సులును కుమ్మరిసారెవలె గిరగిర తిరుగును; ఎప్పటిచోటికేవచ్చి చేరును. [1. 123–8–9: 111.–61–3 తై సం॥ IV 3, 11, 6.]

ఈపై లక్షణములన్నియు ఉ. ధ్రు. ప్రాంతదేశముననే వర్తించునుగాని యికనేదేశమునకును వర్తింపవు.

వేదములను వ్యాపింపజేసిన ఋషులీసృష్టివైచిత్ర్యములను కన్నార చూచినయెడల మంచుయుగము రాకపూర్వమే, వారచ్చట నివసించియున్న కాలములోనే చూచియుండవలెను గద. అట్లయినచో, యీ మంచుయుగమునకు పూర్వయుగమును సూచింపు నిదర్శనము లేమైన వేదములయందు గలవా? కలవనియే చెప్పగలము. I. 113–13 లో " పూర్వదినములలో (పుగా) ఉషాదేవత ఆకాశములో సంతతము వెలుగు

చుండెడిది " అని కలదు. ఇచ్చట " పురా " అనుపదము హిమద్యుగము (మంచుయుగము) నకు పూర్వయుగమును సూచింపుచున్నదనుట స్పష్టము. ఉ. ధు). ను వదలివచ్చిన పిమ్మట—అనగ మంచుయుగానంతరయుగములో—మాట్లాడుచు, " పూర్వయుగములో యీ విధముగనుండెడిది " అని మంచుయుగమునకు పూర్వపుయుగమును సూచింపుచున్నారు.

మరియు బలిపీఠముపై ఉషఃకాలపు మంత్రములను పఠింపుచు " ఉషస్సు-ఇటుకలను " పేర్చునప్పుడు ఆమంత్రములలో సూచింపబడిన ముప్పదిఉషస్సులకును తామీదక్షిణదేశములలో ప్రత్యక్షముగ తమకండ్లారచూచు నిమిషమాత్రజీవనముగల ఉషఃకాలమునకును యెచ్చటను సంబంధము లేకున్నదే యని వారి మనస్సులకు తప్పక సందేహము తోచును. మంత్రముల యర్థమును చూచెదమాయనిన వానిలో 30 ఉషస్సులు కలవని యున్నది. కాని ప్రతిదినమును తాను కండ్లారచూచునది నిమిషమాత్రపు ఉషఃకాలమేగద. ఈ రెంటికిని యేకోశమునను సంబంధము కనిపింపలేదు. కాన వారు దీనినెట్లు సమన్వయించుకొనిరి ? దీనికి సమాధానము తై॥ సం॥ V. 3, 4, 7 లో కలదు. " ఈముప్పదియుషస్సు లేమియో మనకు తెలియదు. దీనియొక్క నిజార్థ మేమియో మనకు తెలియదు. ఇదిపూర్వకాలమునుండియు అనుశ్రుతముగ వచ్చుచున్నది. దీనిని మనము వదలిపెట్టనేల ? దీనియర్థ మేమైనను మన కేల ? పూర్వమునుండియు మనవారు దీనిని వాడుచు

న్నారుగాన మనముకూడ ఆప్రకారమే చేయుదము. బహుశః పూర్వము దేవతలకు 30 ఉషస్సులు కనుబడెడివికాబోలు " అని యీ విధముగ మనస్సును సమాధానపరచుకొనినట్లు తై॥సం॥ V. 3, 4, 7 లో స్పష్టముగ చెప్పబడియున్నది. దీనినిబట్టి యివి తప్పక మంచుయుగమురాకపూర్వము మన పూర్వులు తమ కండ్లారచూచిన యంశములనియు, తదుపరి దక్షిణదేశములకు వచ్చినపిమ్మటకూడ యీ యంశములను మనవారు మరచిపోక, పూర్వాచారములుగ నెంచి, వాని ప్రకారమే యజ్ఞయాగాదులను జరుపుచుండెడి వారనియు స్పష్టమగుచున్నది.

పూర్వగ్రంథములలోని యుషఃకాల వర్ణన లన్నియు మన యుత్తరధ్రువసిద్ధాంతములను బలపరచుచున్న వని ఋజువుచేసితిమి. మిగిలిన లక్షణములను ముందుఅధ్యాయములలో విచారించెదము.



అనుబంధము.

ముప్పది ఉషస్సులు.

తైత్తిరీయ సంహితా, ౪-వ. కాండ,
3-వ. ప్రపాఠకము, ౧౧-వ అనువాకము.

ఇయమేవ సా యా ప్రథమా వ్యౌచ్ఛదన్త రస్యాం చరతి ప్రవిష్టా। వధూర్జజాన నవగజ్జ నిత్రీత్రియ ఏనాం మహిమానః సచన్తే ॥ ౧ ॥

ఛన్దస్వతీ ఉషసా పేపి శానే సమానం యోని మనుసంచరన్తీ। సూర్యపత్నీ విచరతః ప్రజానతీ కేతుం కృణ్వానే అజరే భూరి-రేతసా ॥ ౨ ॥

ఋతస్య పన్థామను తిస్ర ఆగుస్త్రయో ఘర్మాసో అను జ్యోతి షాఽఽగుః। ప్రజామేకా రక్షత్యూర్జ మేకా వ్రతమేకా రక్షతి దేవయూనామ్ ॥ 3 ॥

చతుష్టోమో అభవద్యా తురీయా యజ్ఞస్య పక్షావృషయో భవన్తీ। గాయత్రీంత్రిష్టుభం జగతీ మనుష్టుభం బృహదర్కం యుఞ్జానాః సువరాభర న్నిదమ్ ॥ ౪ ॥

పఞ్చభిర్ధాతా విదధావిదంయత్తాసా స్వసౄరజనయత్ పఞ్చ పఞ్చ। తాసాముయన్తి ప్రయవేణ పఞ్చ నానారూపాణి కృతవోవసానాః ॥ ౫ ॥

త్రి శత్స్వసారం ఉపయన్తి నిష్కృత సమానం కేతుం ప్రతి ముఞ్చమానాః । ఋతూ స్తన్వతే కవయః ప్రజానతీ ర్మధ్యే ఛన్దసః పరియన్తి భాస్వతీః ॥౬॥
జ్యోతిష్మతీ ప్రతి ముఞ్చతే నభో రాత్రీ దేవీ సూర్యస్య వ్రతాని । వి పశ్యన్తి పశవో జాయమానా నానారూపా మాతురస్యా ఉపస్థే ॥౭॥
ఏకాష్టకా తపసా తప్యమానా జజానగర్భం మహిమాన మింద్రమ్ । తేన దస్యూ న్వ్యసహన్త దేవా హన్తాఽ సురాణా మభవ చ్ఛచీభిః ॥౮॥
అనానుజామనుజాం మామక ర్త సత్యం వద న్త్య న్విచ్ఛ ఏతత్ । భూయాసమస్య సుమతౌ యథా యూయమన్యా వో అన్యా మతి మా ప్రయుక్త ॥౯॥
అభూన్మమ సుమతౌ విశ్వవేదా ఆష్ట ప్రతిష్ఠా మవిదద్ధిగాధమ్ । భూయాసమస్య సుమతౌ యథా యూయమన్యా వో అన్యా మతి మా ప్రయుక్త ॥౧౦॥
పఞ్చ వ్యుష్టీ రనుపఞ్చ దోహాగాం పఞ్చనామ్నీ మృతవోఽను పఞ్చ । పఞ్చదిశః పఞ్చ దశేన క్లృప్తాః సమానమూర్ధ్ని రభిలోకమేకమ్ ॥౧౧॥
ఋతస్య గర్భః ప్రథమా వ్యూషుష్య పామేకా మహిమానం బిభర్తి । సూర్య స్యైకా చరతి నిష్కృతేషు ఘర్మస్యైకా సవి తైకాం నియచ్ఛతి ॥౧౨॥

యా ప్రథమా వ్యౌచ్ఛత్ సా ధేను రభవద్యమే । సానః పయ
స్వతీ ధుక్ష్వోత్తరాముత్తరా సమామ్ ॥౧౩॥
శుక్రర్షభా నభసా జ్యోతిషాఽఽగాద్
విశ్వరూపా శబలీ రగ్నికేతుః ।
సమానమర్థ స్వపస్యమానా బిభ్రతీజరా
మజర ఉషఆగాః ॥ ౧౪ ॥
ఋతూనాం పత్నీ ప్రథమేయమాగా ద
హ్నాంనేత్రీ జనిత్రీ ప్రజానాం ।
ఏకాసతీ బహుధోషో వ్యుచ్ఛస్య జీర్ణా
త్వం జరయసి సర్వమన్యత్ ॥ ౧౫ ॥

తైత్తిరీయ సంహితా : ౫-వ కాండ; ౩-వ ప్రపాఠకం;
౪-వ. అనువాకము; ౭-వ. భాగము.

నవా ఇదం దివాన నక్తమాసీదవ్యావృత్తం తే దేవా ఏతా
వ్యుష్టీరపశ్యన్ తా ఉపాదధత తతోవా ఇదం వ్యౌచ్ఛ ద్య
స్యైతా ఉపధీయన్తే వ్యేవాస్మా ఉచ్ఛత్యథోతమ ఏవా
పహతే ॥



వైదిక నిలయము

ఆరవ అధ్యాయము.

—। దీర్ఘదివసము, దీర్ఘరాత్రము ।—

ముప్పదిదినముల యవధిగల దీర్ఘయఖండయుషస్సును గూర్చి ఋగ్వేదము ఖండితముగ వక్కాణించి చెప్పుచున్నప్పుడు, తత్పూర్వ ముండితీరవలసిన దీర్ఘరాత్రిగూడ వేరుగ ఋజువుచేయ నక్కరలేకుండగనే సిద్ధించుచున్నది. మరియు దీర్ఘరాత్రి యున్నప్పుడు దానికి ప్రతిగ దీర్ఘదివసముకూడ నుండియే తీరవలెనుగద. దీర్ఘదివసమును, దీర్ఘరాత్రములును ఉభయదీర్ఘసంధ్యలును — యీ మూడునుపోగా సంవత్సరములో కొంతకాల మింకను మిగులును. ఈమిగిలినకాల మెట్లుండును ? ఈకాలములో మనమామూలు అహోరాత్రములు (రాత్రింబవళ్లు) ఉండును. ఒక్కొక్క అహోరాత్రము మొత్తము 24 గంట లుండును. దీర్ఘరాత్రమును, దీర్ఘ ఉషస్సును గతించగనే అహోరాత్రములవరుస ప్రారంభమగును. మొట్టమొదట అహస్సు (అనగ పగటిప్రొద్దు) బహుతక్కువగ నుండును. కాని రోజులుగడచినకొలది పగటి ప్రొద్దు యెక్కువగుచుండును. ఈవిధముగ పగటివేళ ప్రొద్దు పెరిగినకొలదియు రాత్రివేళప్రొద్దు తగ్గుచుండును. ఇట్లుకొంత

కాలముపోగా, ఇరువదినాలుగుగంటలును పగలుగనే యుండు
ను. ఇకకొంతకాల మగుసరికి మరల రాత్రులు పొడుగగుచు,
తుదకు యిరువదినాలుగుగంటలకాలమును రాత్రిగనే యుండు
ను. ఇదియే దీర్ఘరాత్రి. ఇట్లు కొంతకాలమున్న తరువాత,
మరల యుషఃకాలమును దానిననుసరించి సూర్యోదయమును,
దానివెంబడి అహస్సులు (పగటిపొద్దులు) హెచ్చగుటయు
సంభవించును. ఇట్లే, చర్వితచర్వణముగ కాలచక్రము తిరుగు
చుండును.

ఈపై యంశములన్నియును అన్యోన్యాశ్రయములు,
దీపముతోబాటు నీడ యెట్లుండితీరునో, అదేవిధముగ దీర్ఘ
యుషఃకాలమొకటి యున్నయెడల, దానివెంట యీ దీర్ఘనిశ
లును, దీర్ఘదివసములును ఉండితీరును. దీనికై ప్రత్యేకముగ
మనము ఋగ్వేదమును శోధింపనవసరములేదు. అయినను
మనమిప్పుడెన్నియో వేల సంవత్సరములనాటి విషయములను
గూర్చి చర్చించుచున్నాము గనుక, మన మిప్పుడు పైన
పేర్కొనినఖగోళాంశముల నన్నిటిని వేర్వేరుగనే భావించి,
వానిలో నొక్కొక్క దానికి ప్రత్యేకముగ వేదవాఙ్మయము
నుండి ప్రమాణములను జూపవలసినబాధ్యత మనదైయున్నది.
ఇది శాస్త్రచర్చకులక్షణము; అవసరము. ఈ దీర్ఘదివసము
లకును, దీర్ఘరాత్రములకును వేదములయందు దెచ్చటనైన
ప్రత్యక్షప్రమాణములు గలవా? ఎడతెగక నెలలకొలది
సూర్యకాంతియు, నెలలకొలది చీకటి రాత్రులును గలవని

జెప్పుటకు వేదములయం దెచ్చటనైన ప్రమాణములు గలవా? వేదములయందు చెప్పబడియుండు సంవత్సరము యొక్క లక్షణములేమి? ఇవన్నియును, ఉత్తరధ్రువ ప్రాంత దేశలక్షణములేగాని, ఇట్టివి మరియిం కెచ్చటనులేవని ధ్రువ పరుచుటకేమైన ప్రమాణములు వేదాదుల యందు గలవా? ఈ యంశములనెల్ల నీ యధ్యాయమునందును, సప్తమాధ్యాయమందును విచారించిచూచెదము.

ప్రప్రథమమున దీర్ఘనిశనుగూర్చి విచారింతము. మన మిప్పుడు ఉత్తరధ్రువమువద్దకు పోయి చూచినయెడల అచ్చట సంవత్సరములో కొన్నిదినము లెడతెగక యెల్లప్పుడును చీకటిగనే యుండును. సూర్యకాంతి కనుపించనే కనుపించదు. దీర్ఘనిశ కిది ప్రత్యక్షప్రమాణము. కాని, ప్రస్తుత మాప్రదేశ మంతయు మంచుచే కప్పబడి ప్రాణికోటి నివసించుట కెంత మాత్రమును యోగ్యముగ లేదు. ఈ శీతలమునకు తోడు యీ దీర్ఘరాత్రికూడ తోడ్పడుటవలన జనసంచార మచ్చట పూర్తిగ నణగిపోయినది. కాని, ప్రథమాధ్యాయములో సూచించినట్లు కొన్ని వేల సంవత్సరములకు పూర్వము (పూర్వహిమనద్యాగములో) అచ్చట శీతోష్ణస్థితి మిక్కిలి యనుకూలముగ నుండెననియు, జను లచ్చట యథేచ్ఛగ విహరింపుచుండిరనియు మనము గ్రహింపవలెను. అయినను పూర్వ మచ్చట నివసింపుచుండిన జనులకు బాధాకరముగ నున్నదేమైనకలదా యని యడిగినచో — అట్టిది యీ దీర్ఘనిశ

యొక్కటియే యని మనము నొక్కి వక్కాణింపవచ్చును. ఇప్పటివలె నింత మంచును, అతి చలియు లేకపోయి వను దినములకొలది సూర్యరశ్మి లేక చీకటిలో సంచరింపవలసిన వారగుటచే సూర్యోదయ మెప్పు డగునా, తా మెప్పు డీయంధకారములోనుండి విముక్తుల మగుదుమా యని ప్రజలు భగవంతుని సదా ప్రార్థించుచున్నట్లు దృష్టాంతరము లనేకములు వేదములందు గలవు. భయంకరములగు నీదీర్ఘ నిశలనుగూర్చి ఋగ్వేదములో ననేకచోట్ల ననేకవిధములుగ వర్ణించియున్నారు. ఈయంధకారము ఇంద్రుని శత్రువులగు రాక్షసుల కందరకును శరణ్యముగ నుండెనట. ఇంద్రశత్రువులందరీ చీకటిలో దాగుకొనెడివారట. అందువలన ఇంద్రు డీరాక్షసులతో (యీదస్యులతో) యుద్ధము చేసి, వారి నోడించి, వారి దుర్గములగు యీయంధకారములను భేదించెడివాడట. ఇంద్రశత్రువగు వృత్రాసురుడు దీర్ఘమగునంధకారములో దాగుకొని యుండెనట — దీనికి ప్రమాణము:— ఋ. 1. 32–10. [దీర్ఘంతమః ఆశయత్ ఇంద్రశత్రుః] తనతో పోరాడుటకై వచ్చిన "శుష్ణ" యనువాని నింద్రుడు చీకటి గోతిలో (తమసిహార్మ్యే) పడవేసెనని ఋ V. 32,5 చెల్పుచున్నది. తరువాతి శ్లోకములో "సూర్యుడులేని చీకటి" (అసూర్యేతమసి)ని గూర్చి వర్ణించియున్నారు. దీనినే జర్మను పండితుడగు "మ్యాక్సిముల్లరు" గారు "భయంకరమగు చీకటి" యని వ్యాఖ్యానము చేసి

యున్నారు. దీని విషయమై ఋగ్వేదమునం దిన్ని ప్రమాణములు గాన్పించుచున్నను, మనవారింకను ఇంద్రవృత్రాసురుల పోరాటము కేవలము ప్రతిదినమును సూర్యోదయమునకు పూర్వము సూర్యునకును చీకటికిని జరుగు పోరాటమేగాని సంవత్సరములో నొక్కసారియే దీర్ఘనిశను భేదించుకొని వచ్చు సూర్యునకును తత్పూర్వమున్న దీర్ఘభయంకరాంధకారమునకును జరుగు పోరాటము గాదని మనవారింకను వాదింపుచుండుట మహాశ్చర్యముగ నున్నది. అనగ ఇంద్రవృత్రాసురుల పోరాటము దైనికమే గాని సాంవత్సరికము గాదని మనవారింకను వాదింపుచున్నారు. దీని విషయమయిన పూర్ణచర్చను ముందు గావించెము. మన మిప్పుడు ప్రతిదినమునుజూచు అంధకారము (ఎంతయెక్కువగ జూచుకొన్నను)—౨౪ గంటల కంటె యెక్కువకాలముండుట కవకాశమే లేదు. ఈకొద్దికాలము మాత్రమే యుండు నంధకారములో ఇంద్రశత్రులగు రాక్షసులందరును దాగుకొనియున్నారని చెప్పిన హాస్యాస్పదముగ నుండగలదు. ఋగ్వేదమునందు వర్ణింపబడిన అంధకార మెట్టిది ? అతిదీర్ఘమైనదియు, అతిభయంకరాకారము గలదియు, సూర్యరశ్మి యెచ్చటను సోకనిదియు, ఇంద్రాదిదేవతలకు సైతము దుర్భేద్యమైనదియు—నని వర్ణించియున్నారు. మనము ప్రతిదినముచూచుచున్న చీకటిరాత్రు లిట్టిభయంకరాకారమునకును, యిట్టి వర్ణనములకును సరిపోవునా ?

ఇంద్రవృత్రాసురుల పోరాటమువంటి యీప్రాచీనగాథ లేగాక, దీర్ఘనిశనుగూర్చి చెప్పు ఘట్టము లనేకములు ఋగ్వేదమునందు గానగును. వేదములం దనేకచోట్ల తరుచుగ తమ్మను యీయంధకారమునుండి విముక్తులగావించి రక్షింపవలసినదని ఋషీశ్వరులు తమయిష్టదైవములను ప్రార్థించుచున్నట్లు నిదర్శనములు గలవు. దీనికి ప్రమాణము:— ఋ. II. 27, 14. [అదితే మిత్రవరుణో తమృళయ న్వోనయం చకృమా కచ్చిదాగః । ఉర్వశ్యామభయం జ్యోతి రింద్రమానో దీర్ఘా అభినశంతమిస్రః] — ఓ అదితీ ! ఓ మిత్రావరుణులారా ! మేము మీయెడలగావించిన యపచారములనెల్ల మన్నించి మమ్ములను బ్రోవుడీ ! ఓ ఇంద్రా ! అతివిశాలమైనట్టియు, నిర్భయమైనట్టియు వెలుతురును మేము పొందెదముగాక ! ఈ దీర్ఘమైన యంధకారము (బహుళాంధకారము) మమ్ముల నావరింపకుండుగాక ! ఈ దీర్ఘమైనఅంధకారమును సూచింపుటకు "దీర్ఘాఃతమిస్రాః" అను పద మచ్చట నున్నది. ఈపదమున కర్థము కేవలము దీర్ఘమైనఅంధకారము అని చెప్పుటకంటె "ఎడతెగని చీకటిరాత్రుల వరుస" యని చెప్పినచో దీని నిజార్థ మెక్కువగ తేటపడగలదు. ఈ బహుళాంధకార మెప్పుడంతమొందునా యని పూర్వము మనవారు పడిన యీ మనోవేదనకు — యీ యాతురతకు, హేతువేమి ? మన మిప్పుడు నిత్యమును జూచు యీక్షణకాలపు చీకటిరాత్రులను జూచియేనా వారిట్లు భయపడినది ? ఈ కొద్దికాలపు చీకటిని

జూచియే మనవా రింతవేదనను పొందిరని చెప్పుట కేవలము హాస్యాస్పదము. అట్లయినయెడల వారుబొందిన యీ వేదనకు గల నిజమైనకారణమేమి ? దీనినెట్లుమనము సమర్థింపగలము? కేవలము మనము ప్రతిదినమునుజూచు చీకటి రాత్రులను చూచియే వా రట్లు భయపడిరని చెప్పుటలో నర్థ మేమియు లేదు. ఋ 1. 46, 6, లో [యా నః పీవరదశ్వినా జ్యోతిష్మతీ తమ స్తిరః తామస్మే రాసాథామిషమ్] "ఈయంధకారమును గడచివచ్చుటకు తగినబలమును తన కనుగ్రహింపవలసిన"దని ఒకభక్తుడు అశ్వినీదేవతలనుగూర్చి ప్రార్థించుచున్నాడు. మరియు ఋ VII 67, 2 లో [అశోచ్యగ్నిః సమిధానో అస్మే. ఉపో అదృశ్ర న్తమసశ్చి దన్తాః] = అగ్ని రగుల్కొన మొదలిడినది; అంధకారముయొక్క కొనలు గాన్పించుచున్నవి. ఉషస్సుయొక్క ధ్వజము తూర్పుదిక్కున గాన్పించుచున్నది. "తమసః అంతాః" అనుపదము మిక్కిలి చిత్రముగనున్నది. ఈ పదమునకును, దీర్ఘనిశను సూచించు యింక ననేకవాక్యములకును నిజార్థమును పూర్తిగగ్రహింపక మనదేశములోజూచు మామూలు శీతకాలపుచీకటి రాత్రులే నని యర్థముజెప్పుట యెంతమాత్రమును సరియైనవ్యాఖ్యానము గాదు. ఈరాత్రులను జూచి మనపూర్వజు లింతదిగులొంది తమ్మును రక్షించుటకు—యీమాత్రపుభాగ్యమునకు — దేవతలనుగూడ ఆహ్వానింపవలసినవారై రని చెప్పుటకంటె వింత వే రెద్దియును లేదు.

చీకటులిప్పుడు పోవునా యని మనోవేదనను జూపించు ఘట్టము లనేకము లింకను గలవు. ప్రస్తుతకాలపు కిరస నాయలు దీపములు, క్రొవ్వువత్తులు, మెరుపుదీపములు మొద లగు కృత్రిమపు టుపకరణము లెవ్వియు నాకాలమున లేనందు చేత పూర్వము మన యార్యులు యీతుణకాలపు చీకట్లను జూచియే యింత దిగులొందిరని సమర్థింప జూచుట వెర్రి తలంపు. ఇప్పటికాలపు అడవిజాతి మనుష్యులుసైతము చీక ట్లను జూచి యింత మనోవేదనను బొందరే! అట్టిచో, యీ యడవిజాతి వారికంటె యెన్నియో రెట్లు యెక్కువ నాగరకులైన మన యార్యులు రాత్రివేళ చీకటిని జూచి యింత దిగులొందుటకుగల గారణము గాన్పించదు. ఒక్క మనుష్యులు మాత్రమే గాక, దేవతలుసైతము యీ బహు ళాంధకారములో చాలకాలము మునిగియుండవలసిన వారైరని కూడ వేదములు చెప్పుచున్నవి. దీనికి ప్రమాణము:— ఋ X. 124, 1— [జ్యోక్ ఏవ దీర్ఘంతమ ఆశయిష్ఠాః] అగ్ని దేవుడుసైతము "అతిదీర్ఘకాలము యీదీర్ఘాంధకారములో మునిగియుండె"నట. దీర్ఘకాలమును సూచించుటకు "జ్యోక్" అనియు, "దీర్ఘం" అనియు రెండు పదములను ప్రయోగింప వలసిన అవసరమేమి వచ్చినది? ఒకే భావమును దెలియ పరుచుటకు రెండు పదములను ప్రయోగింపనేల? వేద ప్రవర్తకులకు అత్యుక్తిదోషము నంటగట్టుదమా? ఉత్తర ధ్రువమండలమునకు దక్షిణమునగల దేశములలో రాత్రి

కాలము—మన మెంత యెక్కువగ జూచుకొన్నను — 24 గంటలకు మించనేరదు. మన యార్యుల కనుభవసిద్ధమైన నిశలు యీ 24 గంటలకంటె మించియుండనియెడల యిట్టి వర్ణనలును, అవసరము లేనిచోట్ల రెండు పదముల నుపయోగించుటలును — మొదలుగా గలవానిని మన మెట్లు సమర్థింపగలము ఆ యగ్నిదేవుడే "యెడలేని రాత్రు"లందు (క్షపః) ప్రకాశించుచున్నాడని ఋ 11, 2, 2, చెప్పుచున్నది. "ఎడలేనిరాత్రు"లన నర్థమేమి? మధ్య నెచ్చటను సూర్యోదయముగాని, సూర్యరశ్మియొక్క స్పర్శగాని లేకుండ — ఎడలేని— రాత్రులనియా? లేక మధ్యమధ్యకొంతకాలము సూర్యరశ్మితో కూడుకొనియున్న అనేకరాత్రులనియా? "క్షపః" అనగ "ఎడలేనిరాత్రు"లని యర్థము జెప్పిన ఆ వ్యాఖ్యాతముల్లరు వంటి పండితుడే దీని నిజార్థమును పూర్తిగ గమనింపజాలనివాడాయెను.

పూర్వకాలములో మనవారికి దీర్ఘరాత్రులను గూర్చి పూర్తిగ తెలియునని సూచించుట కింతకంటె బలవత్తరమైన నిదర్శనములను జూపింపవచ్చును. ఋగ్వేదము పదియవ మండలము ౧౨౭-వ ఋక్కులో, నిశాదేవతను గూర్చి సంబోధించి యున్నారు. "ఓ నిశాదేవతా! (భక్తులమగు) మమ్ములను సులభముగ తరింపజేయుదానవు గమ్ము. (నః సుతరా భవ) దీని తరువాత "రాత్రిసూక్తం" లేక "దురాస్తనమ్" అనుపరి

శిష్టములో రాత్రిదేవత తన కనుకూలించును గాక యని భక్తుడు ప్రార్థించుచున్నాడు. "మేము భద్రముగ ఆవలి దరికి చేరుకొందుము గాక" "మేము భద్రముగ ఆవలి దరికి చేరుకొందుముగాక" యని వేడుకొను చున్నాడు. [ప్రపన్నోహం శివాం రాత్రీం భద్రే పార మశీమహి భద్రే పారమశీమహి] అధర్వవేదము XIX. 47, 2, [నయస్యాః పారం దదృశే న యో యువద్విశ్వ మస్యాం నివిశతే యదేజతి । అరిష్టాస స్త ఉర్వితమస్వతి రాత్రిపారమశీమహి భద్రే పారమశీమహి] అధర్వవేదము XIX. 50, 3 లో [రాత్రిం రాత్రిమరిష్యన్త స్తరేమ తన్వా వయమ్] జంగమపదార్థము లన్నియును నిశలో (నిశాసమయములో) విశ్రమించును. నిశాంతమును, నిశాపారమును (రాత్రియొక్క ఆవలిదరిని) జూచినవా రెవరునులేరు. ఈ నిశను భేదించున దేదియును కూడ గాన్పింపలేదు. విశాలాంధకారపరివృతమగు నో నిశా దేవతా! మేము భద్రముగ నిన్ను తరించుదుము గాక! ఓనిశాదేవతా! మేము నిన్ను తరించుదుముగాక! (నీపారమును జేరుదుముగాక!) అధ. వే. XIX 50, 3-లో "మాశరీరముల కెట్టిహానియు లేకుండ మేము రాత్రిరాత్రియును (రాత్రిం రాత్రిం) (అనగ ప్రతిరాత్రియు) గడచిపోవు చుండెదముగాక!" అనియున్నది. ఏమి! ఇంతభయము! ఇంత దిగులు! ఇంత ఆతురత! ఈ రాత్రి గడచి యెట్లుబ్రతుకుదుమా యని ఇంత మనోవేదన బొందవలసిన అవసరమేమి?

" ఈ నిశాంతమును జూచినవా రెవరును లేరే! ఈ నిశను భేదింపగలవా రెవరును గాన్పింపరే ! " యని మనయార్యులు ఆర్తనాదమును గావింపవలసినంతగతి యేమిపట్టినది? మన మిప్పుడు ప్రతిరాత్రియు యీ విధముగ దిగులొందుచున్నా మా ? మన కిప్పుడు లేనిభయము మనపూర్వికుల నేలబాధింప వలెను ? దీనికి ప్రత్యుత్తరము తై ॥సం॥ 1, 5-5, 4 లో గాననగును. " ఓ చిత్రావసూ ! నన్ను భద్రముగ నీ యావలి దరికి చేరనిమ్ము. 1, 5, 7, 5 లో దీనిని వివరముగ తెలియ జెప్పియున్నాడు. చిత్రావసు అనగ రాత్రి "ఇక తెల్లవారద" ని పూర్వకాలమందు బ్రాహ్మణులు భయపడెడివారు. [1,5,5,4- చిత్రావసోస్వస్తితే పారమశీయ] I. 5,7,5- చిత్రావసోస్వస్తి తే పారమశీయేత్యాహ । రాత్రి ర్వైచిత్రావసు రవ్యుష్టైర్వా ఏతస్యైపురా బ్రాహ్మణా అభైషుః॥—రాత్రిగడచి యెప్పుడు తెల్లవారునాయని మనయార్యులు దిగులొంది, ఇక అసలు తెల్లవారనే తెల్లవారదని భయపడుచుండిరని వేదములో స్పష్టముగ నొక్కివక్కాణించియున్నారు. దీనియర్థమేమి ? రాత్రి కాల మతిదీర్ఘమై యుండనియెడల ఇట్టిభయమున కవకాశమే లేదుగద. శాయనాచార్యులవారు దీనివిషయమై గట్టిగపట్టుబట్టి విచారింపకుండ ఊరక తేలికగ త్రోసివేసిరి ! శీతకాలములో రాత్రిప్రొద్దు ఎక్కువగనున్నందుచేత మనవారు శీతకాలములో నీవిధముగ — యెప్పుడు తెల్లవారునాయని — విసుగుకొనెడివారని మాత్రము చెప్పి సులభముగ యీ భాగమును సమర్థింప

జూచిరి. కాని, శాయనాచార్యులవారు చెప్పిన యంశము లను బట్టియే, వారు చెప్పినయర్థము సరిగాదని ఋజువుపరచెదము. తైత్తిరీయ సంహితలో కొంత భాగము మంత్రార్థము లను విపులముగ బోధించు భాగమైయున్నది ఈయర్థమును విపులముగ జెప్పు భాగమునకు "బ్రాహ్మణము" అని పేరు. కనుక తైత్తిరీయ సంహితను "మంత్రము" లనియు "బ్రాహ్మణము" లనియు — రెండు భాగములుగ విభజింపవచ్చును. దీనినిబట్టిచూడగ పైన "పూర్వకాలమందు ఇకతెల్లవారదని బ్రాహ్మణులు భయపడెడివార"ని చెప్పువాక్యము బ్రాహ్మణములోచేరిన భాగమని స్పష్టమగుచున్నది. ఇక "బ్రాహ్మణము" యొక్క లక్షణములేమియో కొంచెము జూచెదము. "బ్రాహ్మణము" ను మన వేదాంతులు పదిభాగములుగ విభజించిరి. [శ్లో॥ హేతుర్నిర్వచనం నిందా ప్రశంసా సంశయో విధిః । పరక్రియా పురాకల్పో వ్యవధారణకల్పనా ॥ ఉపమానం దశైవైతే విధయో బ్రాహ్మణస్యతు ఏతద్వై సర్వ వేదేషు నియతం విధిలక్షణమ్ ॥

(౧) హేతువు—అనగ మంత్రములో చెప్పినయంశములకు కారణమేమియో తెలుపుట. (౨) నిర్వచనం—అనగ, మంత్రములో యేపదమును యే యర్థములో ప్రయోగించినారో తెలుపుట. (౩) నిందా—అనగ, మంత్రములో నిందార్హములైన భాగములను నిందించుట. (౪) ప్రశంసా—అనగ, మంత్రములో మెచ్చుకొనదగిన యంశములేమైన

నున్నచో వానినెత్తిజూపి ప్రశంసించుట. (౭) సంశయమ్—అనగ, మంత్రార్థముపూర్తిగ బోధపడనిచోట్ల నెత్తిచెప్పుట. (౬) విధి—అనగ, యీవిషయ మిట్లుండి తీరవలెనని సిద్ధాంతీకరించుట. (౭) పరక్రియా—అనగ, ఇతరులుచేసిన కార్యములు—ఏదేని విషయమయి యితరభాష్యకారులు గాని, యితరఋషులుగాని యేమిచెప్పిరో దానినిచెప్పుట (౮) పురాకల్ప–అనగ, పూర్వకాలపు టాచారములనుదెలుపు సంగతుల నెత్తిజూపుట. (౯) వ్యవధారణకల్పనా—అనగ, మంత్రములోని ఒకవిషయమై "యిదియైన కావలెను, లేదా అదియైన కావలెను; గాని వేరొండు కాజాలదు" అని హద్దుల నేర్పరుచుట. (౧౦) ఉపమానం–అనగ, పోలికలను జూపుట. వ్యాఖ్యానభాగమైన బ్రాహ్మణమును యిట్లు పదిభాగములుగ మనవారు విభజించిరి.

"పూర్వకాలము మనవారు సూర్యోదయము కాదనియే భయపడెడివారు"— అనువాక్యమును శాయనాచార్యులవారు యెనిమిదవ భాగముగు "పురాకల్ప" ము క్రిందికి తీసికొనివచ్చినారు. ఇది అర్థవాదముగాదనియు, ఇది కేవలము పూర్వకాలమునాటి యంశమును సూచింపుచున్నదనియు శాయనులవారే ఒప్పుకొనియున్నారు. అట్లయినప్పుడు, "సూర్యోదయము కాదని" భయపడెడివారని చెప్పువాక్యము కేవలము శీతకాలపు దీర్ఘరాత్రులను జూచి అతిశయోక్తిగ జెప్పినమాటయేగాని వేరొండుగాదని యర్థవాదము

జేయుట శాయనాచార్యులవారు గావించిన స్వవచన వ్యాఘా తమును సూచించుచున్నది ! కనుక యీ వాక్యము కేవలము పూర్వకాలము మనవా రనుభవించిన యశుభమును సూచిం చుచున్నది. ఈవిషయమునుండి యింకొక ముఖ్యాంశము బయలు దేరుచున్నది. తెల్లవారదనే భయము ఒక్క మన పూర్వులకు మాత్రమే యుండనేల ? మనకిప్పుడేల యట్టి భయములేదు. శీతకాలముగో రాత్రులందు మనమీవిధముగ భయపడుచున్నామా ? అప్పటిరాత్రియు, యిప్పటిరాత్రియు సమానమే యైనయెడల మనపూర్వులకు భీతావహమును గలిగించిన ఆరాత్రి మనకిప్పుడేల యీ భీతావహమును గల్పిం చుటలేదు ? మనలోనెట్టిమూఢునకైనను అట్టిభయమున్నదా ? సూర్యోదయమెప్పుడగునో నిశ్చయముగ జెప్పగల జ్యోతిష జ్ఞానము మన పూర్వపు టార్యులకు లేదని చెప్పుటకంటె పరిహాసాస్పదమగు విషయ మింకొకటి యుండబోదు. ఈ విషయమునుబట్టి చూడగ శాయనులవారు చెప్పిన సమా ధానము సరియైనది గాదని ఋజువగుచున్నది. ఈ శీతకాలపు రాత్రులను జూచి కాదు మన యార్యులు భయపడినది. అది మన శీతకాలపు రాత్రికంటె అతిదీర్ఘమైనదై యుండితీరవలెను. “ఎప్పుడు సూర్యోదయ మగునో, ఎప్పుడు సూర్యోదయ మగునో ?” యని ప్రజల మనంబులను తల్లడింపజేయజాలి నంత దీర్ఘనిశయై యుండితీరవలెను. ఇట్టి దీర్ఘనిశ ఉత్తరధ్రువ ప్రాంతదేశములలో నుండునుగాని మరి యెచ్చట నుండదు.

మరియు నిది వేదకాలమునాటికికూడ పూర్వకాలమం దుండె నని తేలుచున్నది. వేదకాలమువారికే యిది పెద్దలవలన వినుచువచ్చిన పూర్వకాలపు పుక్కిటిపురాణమై యున్నది. తైత్తిరీయసంహితాకాల మిప్పటికి షుమారు 4500 సంవత్సరములైనది. అప్పటికే యీదీర్ఘనిశ పుక్కిటిపురాణమైనది.

దీర్ఘనిశను దీర్ఘదివసమును సూచించుట కింక నేమైన ప్రమాణములు ఋగ్వేదమునందు గలవేమో చూచెదము. ఋగ్వేదములో దివారాత్రములనుగూర్చి చెప్పిన సూక్తములను పరీక్షించి చూచెదము. రాత్రింబవళ్ళనుగూర్చి ఋగ్వేదములో ననేకచోట్ల ద్వివచనప్రయోగములు గలవు. ఋ. I. 122 లో ఉషాసా-నక్తా (ఉషస్సును రాత్రియు) అనియు, I. 142,7 లో "నక్తోషాసా" (రాత్రియు, ఉషస్సును) అనియు, I. 188, 6 లో, "ఉషాసా" (రెండు ఉషస్సులు) అనియు వర్ణించియున్నారు. వీనికన్నిటికిని అర్థ మొక్కటియే. వీనికి రాత్రింబవళ్ళయొక్క జంట యని భావము. "అహోరాత్రే" యను పదము ఋగ్వేదమునందు లేకపోయినను దానికికూడ నిదియే యర్థము. ఇది "ఉషాసా నక్తా" యను పదమునకు పర్యాయపద మని ఐతరేయబ్రాహ్మణము చెప్పుచున్నది. ఒక్కొక్కచోట యీ యహోరాత్రముల జంటను అప్ప చెల్లెండ్రనియు, కవలపిల్లలనియు వర్ణించియున్నారు. ఋ III 55,11 ను పరీక్షించి చూచెదము. ఈ ఋక్కునకు దేవత "అహోరాత్రము". ఈ ఋక్కు "అహోరాత్రము" ను

గూర్చి వర్ణించుచున్నదని వ్యాఖ్యాతలందరును ఒప్పుకొనియే యున్నారు.

నానా చక్రాతే యమ్యా వపూంషి
తయో రన్య ద్రోచతే కృష్ణ మన్యత్ ।
శ్యావీచ య దరుషీచ స్వసారౌ
మహ ద్దేవానా మసురత్వ మేకమ్ ॥
ఋ. III, 55, II

అర్థము :– "ఆ కవలపిల్లలు (యమ్యా–స్త్రీలింగం) అనేక రూపములను ధరింతురు. ఆ రెంటిలో నొకటి ప్రకాశింపు చుండును (రోచతే). రెండవది నల్లగ (కృష్ణమ్) నుండును. వారు ఇద్దరు అప్పచెల్లెండ్రు (స్వసారౌ). ఒకటి చీకటిగను (శ్యావీ) రెండవది ప్రకాశమానముగను (అరుషీ) ఉండును. దేవతలయొక్క మహాదంశము అద్వితీయ మైనది "——ఈఋక్కు చూచుటకు బహు తేలికగ గాన్పించును. కాని దీనిలోని రెండు ప్రధానాంశములను మనవారు సరిగ గ్రహింపలేదు. ముందు దీనిలో మొదటిరెండు చరణములను గూర్చి చర్చించుదము. " ఆకవలపిల్ల లనేకరూపములను ధరింతురు, వానిలోనొకటి ప్రకాశించును, మరియొకటి చీకటిగ నుండును. కవలపిల్లలనగ రాత్రిం బవళ్ళు. పగలు వెలుతురుగ నుండును; రాత్రి చీకటిగనుండును". ఇంతవర కర్థము తేట తెల్లముగనే యున్నది. కాని యీ కవలపిల్లలు " అనేకరూప ములను ధరింతురు", అనగ అర్థమేమి ? అనేకరూపములను

ధరించుటయననేమి ? ఈవాక్యము విషయమై మనవారంత శ్రద్ధవహించినట్లు గాన్పించదు. "నానాచక్రాతే—వపూంషి" అనగ "అనేకరూపములుగ, అనేకశరీరములుగ, అగుచున్నవి." ఈ వర్ణనలో మనము రెండు ముఖ్యాంశములను గుర్తింపవలెను. (౧) ఆ కవలపిల్లలలో నొకటి ప్రకాశమానముగను మరియొకటి చీకటిగనుండును. (౨) ఆ కవలపిల్లలనేకరూపములుగ మారుచుందురు. ఇంకొకచోట (I. 123,7) యీ దివారాత్రముల జంటనే "విషురూపే" యనియు, మరియింకొకచోట "విరూపే" యనియు ఒకేయర్థములో వర్ణించియున్నారు. పైజెప్పిన రెండు వర్ణనలుగాక— "విషురూపే" "విరూపే"—యనునది యింకొక మూడవయంశమని గ్రహించవలెను. కనుక దివారాత్రముల వర్ణనలో మూడు ముఖ్యాంశములను ప్రత్యేకప్రత్యేకముగ గ్రహింపవలెను.

(౧) కవలపిల్లలలో ఒకటి ప్రకాశమానముగను (రోచతే) రెండవది నల్లగను (కృష్ణమ్) ఉండును.

(౨) కవలపిల్లలు అనేకరూపములుగ మారుచుందురు.

(3) "విషురూపే" "విరూపే" — యను వర్ణనను గమనింపవలెను.

ఈ మూడువర్ణనలను ఒకదానితో నొకటి కలుపకుండ విడిగ నుంచుదము. ఈమూడింటికిని అర్థమొక్కటియే కాదు. వీనికన్నిటికిని అర్థ మొక్కటియే యైనయెడల అత్యుక్తిదోష మాపాదించును. కనుక యీ మూడింటికిని మూడు వేర్వేరు

అర్థములుండి తీరవలెను. "విషురూపే, విరూపే"— యను పదములలోని "రూప" శబ్దమునకు—నలుపు, తెలుపు, ఎరుపువంటి — వివిధరంగులని శాయనాచార్యులవా రర్థము జెప్పియున్నారు. దివారాత్రిముల కీయనేకరంగులను బూయుట కెట్లు సంభవమగునో మనము గ్రహింపజాలము. మనకెక్కడెక్కడప్పుడు రాత్రిం బవళ్లు పచ్చగను, ఎర్రగను, నీలముగను, ఊదారంగుగను గాన్పించునా? పోనీ, "రూప" శబ్దమునకు "రంగు" అని అర్థము చెప్పుటకు సాధ్యమైనను "వపూంషి" యనుపదమున కాయర్థ మెట్లు చెల్లును? దీని విషయమై భాష్యకారు లెవరును శ్రద్ధబూని విచారించినట్లు గన్పించదు. అందుచేతనే కొందరు "విషురూపే" యనగ "వివిధరంగుల" ని అన్వయించియున్నారు. "నక్తోషాసా" యొక్క స్వరూపము "విరూపే" యని ఋ I. 113, 3—లో వర్ణించియున్నారు. అచ్చటకూడ శాయనులవా రీయర్థమునే చెప్పియున్నారు. దీని విషయమై యింకను దీర్ఘముగ ఆలోచించినవా రెవరును గాన్పింపరు. కాని, శాయనులవారి కంటె పూర్వపువాడైన మాధవాచార్యులవారు "వివర్ణ" మను తమ సామవేదభాష్యమందు "విరూపే" యను పదమును గూర్చి పూర్ణముగ వ్యాఖ్యానము జేసియున్నారు. సామవేదముయొక్క "ఉత్తరార్చికము" నందు (19,4,2,3) యీ పదమునుగూర్చి యీవిధముగ జెప్పియున్నారు. "సంవత్సరములో దక్షిణాయనములో రాత్రికాలము

వృద్ధియగుచుండును. ఉత్తరాయణములో పగటికాలము వృద్ధిబొందును. [సుమేకే-సంవత్సరే దక్షిణాయనే రాత్రేర్వృద్ధిః; ఉత్తరాయణే త్వహ్నః, నక్తం రాత్రిః, ఉషాకాలప్రభృత్యహః] మాధవాచార్యులవారి యీభాష్య ప్రకారము "విషురూపే, విరూపే" — యను ఋగ్వేద పదములకు సరియైన యర్థమును జెప్పుటకు మనకు వీలు కలిగినది. "రూప", "వపుస్" శబ్దములు దివారాత్రముల యొక్క దీర్ఘతను (పొడవును), వ్యాప్తిని, తెలియజేయు పదములని మన మిప్పుడు గ్రహింపవలెను. కనుక, "విరూపే" యనగ "వివిధములైన పొడవులు గల రాత్రిం బగళ్ళు" అని సరళమైన యర్థ మేర్పడుచున్నది. అనగ, దివారాత్రిము లొకప్పు డొకపొడవును, మరియొకప్పు డింకొకపొడవును కలవై యున్నవని యర్థము. దీనితోబాటు, యీ కొలతలు మారిపోవుటయే గాక, యీ దివారాత్రములలో నొకటి ప్రకాశమానముగను, యింకొకటి నలుపుగను ఉండును. మాధవాచార్యులవారి భాష్యము నాధారముచేసికొని మన మిప్పు డీఋక్కుయొక్క మొదటి రెండు పాదములకును యీ క్రిందివిధముగ నర్థముచెప్పవచ్చును. "ఈ కవలపిల్లలయొక్క పొడవులు (వపూంషి) వివిధములుగ (నానా) మారుచుండును. వానిలో నొకటి మెరయుచుండును; మరియొకటి నల్లగ నుండును." —

ఈ ఋక్కులో మొదటి రెండుపాదములకు నర్థమును జెప్పితిమి. కాని మూడవపాదమువద్దకు వచ్చుసరికి యింకొక క్రొత్తచిక్కు తటస్థించుచున్నది. మూడవపాదమున కర్థమే మనగ:—“ వారు ఇద్దరు అప్పచెల్లెండ్రు (స్వసారా) ఒకటి చీకటిగను (శ్యావీ,) రెండవది ప్రకాశమానముగను (అరుషీ) ఉండును. ” మూడవపాదములో చెప్పబడిన అప్పచెల్లెండ్ర కును (స్వసారా) మొదటి రెండు పాదములలో వర్ణింపబడిన “కవలపిల్లల” కును (యమ్యా) యేమైన సంబంధమున్నదా? ఇవిరెండును వేర్వేరు వ్యక్తులా ? లేక ఒకవ్యక్తియేనా ? ఈ రెండును ఒకేవ్యక్తియని చెప్పినయెడల యీ మూడవ పాదము అనవసరమగును. మూడవపాదముయొక్క ప్రయో జనమేమి ? ఇక యివి రెండును వేర్వేరు వ్యక్తులని చెప్పిన యెడల యీ రెంటికిని గల భేదమేమియో చెప్పితీరవలెను. వ్యాఖ్యాత లెవరును దీనిని సమర్థింపజాలరైరి. అందువల్ల వారు పునరుక్తిదోషమునకొడిగట్టియైనను యీ రెండును ఒకేవ్యక్తి యని సమర్థించిరి. కాని యీ వ్యాఖ్యానము సంతృప్తికరముగ లేదని యందరికిని తెలియును. కనుక, మనచేతనైన యెడల నీవాక్యములకు సంతృప్తికరముగ నర్థమును జెప్పుటకై యత్నింతము.

ఇచ్చట రాత్రిం బవళ్ళయొక్క వర్ణనలు రెండు విధములుగ నున్నవి. ఒకజంటగాక రెండు జంటల నిచటవర్ణించి యున్నారు. ఈ యొక్కచోటనేగాక, యిదేవిధముగ ననేక

చోట్ల దివారాత్రములను రెండు తరగతుల జంటలుగ వర్ణించిన ఘట్టము లనేకములు గలవు. వీనికన్నిటికిని సమాధానము జెప్పుటెట్లు ? ఋగ్వేదమునందు దివారాత్రములను వర్ణించుటకు "అహానీ" యను మరియొక పదముగలదు. దీనికర్థమేమి ? దీని యర్థము "రెండు పగళ్ళు" అనికాదు: "అహానీ" యనగ "ఒకరాత్రి, ఒకపగలు (జంట)"అని యర్థము. కారణమేమన, ఋ VI, 9, 1లో "చీకటిదిన(అహః) మొకటియు, వెలుతురుదిన (అహః) మొకటియు గలవు"— అని స్పష్టముగ రెండు విధములైన "అహః" కలవని వర్ణించియున్నారు. కనుక "అహానీ" యను పదమునకు "ఒక రాత్రింబగళ్ల యొక్క జంట"యని స్పష్టమగుచున్నది. ఋగ్వేదములోనే మరియొకచోట "ఉషాసానక్తా" యని యింకొక జంటను వర్ణించి యున్నారు. "అహానీ"యను జంటకును "ఉషాసానక్తా" యను జంటకును భేదమేమైన గలదా ? లేక యివి రెండును ఒకటియేనా? దీనికిసమాధానము ఋగ్వేదము IV, 55, 3-లో కనిపించగలదు. అచ్చట "ఉషాసానక్తా" యను దేవతను, "అహానీ" యను దేవతను— యీ రెంటిని— వేర్వేరుగ సంబోధించి, వేర్వేరుగ నాహ్వానించి యున్నారు. [ఉభేయథానో అహా నిపాత ఉషాసానక్తా కరతామదబ్ధే] ఈ జంట దేవతలను వేర్వేరుగ నాహ్వానించుటం జేసి, యీ జంటలు రెండును వేర్వేరు జంటలై యుండితీరవలెనని సిద్ధించుచున్నది. మ్యాక్సిముల్లరు పండితుడు సైతము యీ రెండు జంటలకును

గల భేదమును గుర్తించియే యున్నాడు. కాని వానియొక్క నిజ భావమేమియో పూర్తిగ విచారణ చేసియుండలేదు. మనదేశములో వలె సంవత్సరములోనున్న ३౬౦ దినములును ఒకే విధముగ నున్నయెడల యీ రాత్రిం బవళ్లను రెండు వేర్వేరు జంటలుగ వర్ణించుటకు కారణమేమి? ఈ రాత్రిం బవళ్ళు వివిధమైన పొడవులుగలవై యొకటి ప్రకాశమానము గను మరియొకటి నల్లగను ఉండుననివర్ణించిన చాలుగద. ఋ IV. 55, 3 లో - యీ రెండు జంటలకును జూపిన భేదమును మనమెట్లు సమర్థింపవచ్చును? దీనికై యీ భూగోళములో వివిధప్రదేశములలోనుండు దివారాత్రులనెల్ల పరీక్షించి చూడవలెను. ఉత్తరధ్రువము మొదలుకొని భూమధ్యరేఖవరకు గల దివారాత్రులనెల్ల పరీక్షించి చూచినయెడల, యీ ద్వంద్వ వర్ణనలకు సరిపోవు, దివారాత్రములు ఉత్తరధ్రువ ప్రాంతదేశములలోనుండు దివారాత్రులేగాని, యిట్టివి మరియెచ్చటను లేవని తేలుచున్నది. ఉత్తర ధ్రువమండలములో నుండు దివారాత్రుల యొక్క లక్షణములేమి? అనేకదినములవరకు యెడతెగక వ్యాపించియుండు ఒకరాత్రియు, యిట్టిదే దీనితో తులదూగగల యొక పగలును—అనగ, ఒక దీర్ఘరాత్రియును, ఒక దీర్ఘదివసమును—గలిగిన దివారాత్రుల జంట యొకటి యుండును. ఇది యొక తరగతిజంట. ఇదిగాక, వివిధపొడవులు గలిగినట్టియు, మొత్తము ౨౪ గంటలకు మించనట్టియు

మరియొక తరగతి దివారాత్రముల జంటలుండును. ఇది యింకొక తరగతి జంట. (పటమును చూడుడు) ఇట్టి విచిత్రమైన దివారాత్రముల జంటలు ఉత్తరధ్రువమండలములో దప్ప మరియింకెచ్చటను గానరావు. భూమధ్య రేఖవద్ద దివారాత్రము లెప్పుడును ఒకేవిధముగ నుండును. ౨౪ గంటలలో సగము పగలును, సగము రాత్రియు గలిగి సంవత్సరములో నెట్టిమార్పులేక యేకరీతిగనే యుండును. అనగ, భూమధ్య రేఖవద్ద దివారాత్రములు "విరూప" ముగనుండక, "సరూప" ముగనేయుండును. భూమధ్యరేఖకును, ధ్రువరేఖకును మధ్యనున్న దేశములో దివారాత్రము లెప్పుడును మొత్తము ౨౪ గంటలకు మించియుండవు. కాని, యీ ౨౪ గంటలలో ఒక్కొక్క చోట [ఉత్తరధ్రువమును సమీపించిన కొలది] ౨౩ గంటల పగలును ఒకగంట మాత్రమే రాత్రియు నుండవచ్చును; లేదా ౨౩ గంటలరాత్రియు, నొకగంట మాత్రమే పగలును కూడ నుండవచ్చును. ఈ రీతిగ రాత్రింబగళ్ళయొక్క పరిమితులు నానావిధములుగ మారుచుండును; కాని యీ రాత్రింబగళ్ళు రెండును గలిసి మొత్తము ౨౪ గంటలకు మాత్రము మించవు. ఇదియే ఋ III. 55, 11—లో మొదటి రెండు పాదములలో వర్ణింపబడిన దివారాత్రముల జంట— "నల్లగను, ప్రకాశమానముగను, వివిధ వపుస్సులు గలదిగను" ఉండు జంట. ఇది మొదటితరగతి జంట. ఇక ధ్రువరేఖను దాటి ఉత్తరధ్రువమండలములోనికి ప్రవేశించినచో, యీ

మొదటి తరగతి జంటతోపాటు యింకొక తరగతి జంట కూడ గాన్పించును. ౨౪ గంటలకు మించని మొదటి తరగతి దివారాత్రముల జంటగాక, అనేక దినములవరకు నెడలేక వ్యాపించియుండు దీర్ఘరాత్రింబవళ్ళ జంట ఇంకొకటి సంభవించును. ఇది రెండవతరగతి జంట. ఉత్తర ధ్రువమండలములో నీరెండు తరగతులజంటలు గలవని సిద్ధించుచున్నది. కేవలము ఉత్తర ధ్రువము మీదికే పోయి కూర్చున్నచో దీర్ఘజంట యొక్కటి మాత్రమే–6 నెలల రాత్రియు, 6 నెలల పగలును–ఉండును; ౨౪ గంటల జంట మాయమై పోవును.

మనము భూమధ్యరేఖవద్దనుండి బయలుదేరి ఉత్తర ధ్రువమువైపునకు ప్రయాణమై పోవుచున్నచో, మనకు మధ్యత్రోవలో క్రమముగ నీక్రిందివిధములైన దివారాత్రములు గాన్పించును:—


(౧) భూమధ్యరేఖవద్ద:— ఒకేజంట; ౨౪ గంటలకు మించదు; సగము నలుపు, సగము మెరుపు; రాత్రింబవళ్ళ పొడవులలో మార్పులుండవు. అనగ 'సరూప'ము.

5–వ పటము.


(౨) భూమధ్యరేఖకును ధ్రువరేఖకును మధ్య } ఒకేజంట; ౨౪ గంటలకు మించదు. వీని పొడవులు సంవత్సరములో సమానముగ నుండక వివిధములుగ (విరూపే) మారుచుండును.

6–వ పటము.

బ్లాకు 5.



భూమధ్యరేఖవద్ద అనగ "౦" అక్షాంశ. ఇచ్చట క్షితిజమును, ఉత్తరధ్రువమును ఏకమైపోవును. సంవత్సరములో ప్రతిదినమును సగము వెలుతురు, సగము రాత్రియు నుండును. ఇచ్చట 12 నెలల పొడవునను - రాత్రిళ్లు చీకటిలో - సూర్యరశ్మి యుండును. రాత్రింబవళ్లు సరిసమానమైన పరిమితిగలవి. (సరూపము) దీర్ఘరాత్రియు, దాని ననుసరించి దీర్ఘదివసమును పూర్తిగ మాయమగును. కాబట్టి ఇచ్చట ఒకే జంట గలదు.



భూమధ్య రేఖకును ధృవ రేఖకును మధ్య అనగ 23½° మొ॥ 66½° వరకు గల మధ్యప్రదేశములో

ఈపటము 45° డిగ్రీల ప్రదేశమును సూచించును. ఇచ్చట 12 నెలల పొడవునను మామూలు రాత్రింబవళ్లుండును. కాని, అవి సమాన పరిమితులుగలవి కావు (అనగ విరూపములు.)

దీర్ఘరాత్రియు, దీర్ఘదివసమును పూర్తిగ మాయమగుటచే, ఇచ్చట ఒక్కజంటయే గలదు.

(3) ధ్రువరేఖకును, ధ్రువమునకును మధ్య ... అనగ ధ్రువమండలములో.

7-వ పటము.

రెండు జంటలు;
ఒకజంట:- ౨౪ గంటల జంట; ఇవి 'విరూప'ములు, కొంత నలుపు కొంత మెరుపు.
రెండవజంట:- దీర్ఘజంట; ఒక దీర్ఘరాత్రియు, దానితో తులదూగగల ఒక దీర్ఘదివసమును కలిసి యీజంట యేర్పడుచున్నది.

(౪) కేవలము ఉత్తర ధ్రువముమీద:-

8-వ పటము.

ఒకే జంట:- ఆరు నెలల దీర్ఘరాత్రియు, ఆరు నెలల దీర్ఘదివసమును కలిసి యీదీర్ఘజంట ఏర్పడుచున్నది. ఇది 'సరూప'ము.

ఋ IV. 55,3 లో "ఉషాసా నక్తా" యనియు, "అహానీ" యనియు రెండు జంటలను వర్ణించియున్నారుగద. ఆ రెండు జంటలును పైమూడవ పటములో చూపించిన జంటలై యుండితీరవలెను. కనుక ఆ ప్రదేశము ధ్రువమండలములోనిదై యుండితీరవలెను. ఇట్టి వింకొకచోట నుండుటకు అసలు వీలే లేదు. ఋ IV. 55,3 ను, ఋ III. 55,11-తో సంపుటీకరణ మొనర్చి చూచినయెడల III. 55,11- యొక్క అర్థము సువిధముగ చెప్పవచ్చును. ఈ ఋక్కులో రెండు జంటలను వర్ణించియున్నారు.

(౧) ఆ కవలపిల్లలు (యమ్యా ౨ర గంటల జంట) అనేక రూపములను (నానావపూంసి) ధరింతురు. ఆరెంటిలో నొకటి ప్రకాశింపుచుండును (రోచతే). రెండవది నల్లగ (కృష్ణమ్) నుండును. ఇది మొదటితరగతి జంట. "ఉషాసా నక్తా" యను జంట.

(౨) వారు యిద్దరు అప్పచెల్లెండ్రు (స్వసారౌ-దీర్ఘ జంట.) ఒకటి నల్లగను (శ్యావీ) రెండవది ప్రకాశమానము గను (అరుషీ) ఉండును. ఇది రెండవతరగతి జంట "అహానీ"—యను జంట.

ఈ ఋక్కునకి ట్లర్థము చెప్పినయెడల వీనిలోని పాదము లెవ్వియును నిరుపయోగములు కాజాలవు. పునరుక్తిదోషము పోవును. దీని భావము సులభగ్రాహ్యమగును. సమస్త మును తెల్లమగును. ఋగ్వేదమునందు వర్ణింపబడిన "ఉషాసా నక్తా" "అహానీ" యను జంటలు రెండును వేర్వేరు జంటలని ఋ IV. 55, 3, వలన తెల్లమగు చున్నది. "ఉషాసా నక్తా" యను జంట ౨ర గంటలకు మించని దివారాత్రిమును తెలియజేయు మొదటి తరగతి జంటయనుకొందము; 'అహానీ' యను జంట దీర్ఘనిశను దీర్ఘదివసమును కలిసిన (రెండవ తరగతి) దీర్ఘ జంట యను కొందము. (వీని నీకిృంద ఋజువుపరచెదము) ఈ రెండు జంట లకును గల భేదము నీకొకవిధముగ జూపెదము. మొదటి తరగతి ౨ర గంటల జంటలోని దివారాత్రిములు ఒక దాని

నంటి మరియొకటి వరుసగ, నిరవకాశముగ, వచ్చుచుండును. అనగ, రాత్రి గడచుటతోడనే పగలును, పగలు గతించుటతోడనే రాత్రియు—నవిచ్ఛిన్నముగ, చర్వితచర్వణముగవచ్చుచు పోవుచుండును. కాని రెండవతరగతిది యగు దీర్ఘజంటలోని దీర్ఘదివసమును దీర్ఘరాత్రమును ఒకదానినంటి యొకటిరాదు. దీర్ఘరాత్రి మంతమొందుటతోడనే దీర్ఘదివసము రాజాలదు. దీర్ఘరాత్రి మంతమొందిన ౪, ౫, ౬ నెలలకు గాని దీర్ఘదివసమురాదు. దీర్ఘనిశకును దీర్ఘదివసమునకును మధ్య కొన్ని నెలలు గతించవలెను. దీర్ఘనిశ సాధారణముగ హిమసంక్రమణము వద్ద (షుమారు మార్గశీర్ష పుష్యమాసములలో) తటస్థించును. దీర్ఘదివసము సాధారణముగ గ్రీష్మసంక్రమణము వద్ద (షుమారు జ్యేష్ఠాషాఢమాసములలో) తటస్థించును. ఈదీర్ఘనిశయు, దీర్ఘదివసమును — (అహానీ,) పోను మిగతా సంవత్సరములో మన సాధారణపు ౨౪ గంటలకు మించని (మొదటి తరగతి ఉషాసానక్తా)- దివారాత్రము లుండును. దీర్ఘనిశకును దీర్ఘదివసమునకును మధ్య యెన్ని నెలలు గతించవలెనో దీనినిబట్టి చదువరులే గ్రహింపగలరు. గ్రీష్మర్తువంతయు నెడలేనిపగలుగను, హేమంతర్తువంతయు నెడలేని దీర్ఘరాత్రిగను ఉండునని చెప్పిన చెప్పవచ్చును.

ఈ రెండవ తరగతి "అహానీ" జంటలోజేరిన దీర్ఘరాత్రికిని దీర్ఘదివసమునకును మధ్య షుమారు ఆరుమాసముల యానకాశముగలదని చెప్పవచ్చును. ఇది 'అహానీ' జంటయొక్క—

లక్షణము. ఈ లక్షణములు మన పూర్వుల కెరుకయే. దీనికి ప్రమాణము: — తైత్తిరీయ ఆరణ్యకము — I. 2, 3 [ఏకహిశిరో । నానాముఖే । కృత్స్నంతదృతులక్షణమ్] ఇచ్చట "సంవత్సర" దేవతను వర్ణింపుచున్నాడు. ఈ దేవతకు ఒకతలయు, రెండు భిన్నముఖములును గలవు. ఇవన్నియు ఋతులక్షణములు. ఇకనీవాక్యములకు భాష్యకారు లెట్లర్థము జెప్పిరో చూతము. సంవత్సరములో రెండు అయనములు గలవు. గనుక సంవత్సరదేవతకు రెండు నోళ్ళున్నవని వర్ణించి రట. సంవత్సరములో వచ్చు ఋతువులన్నియు, నీ అయన ములలో నిమిడి యున్నవి. గనుక యీ నోళ్ళను ఋతులక్ష ణములని వర్ణించిరట. మనవ్యాఖ్యాత లీవిధముగ సమ ర్థించిరి. ఈ తైత్తిరీ యారణ్యకములోనే యింకొక కొంచెము దూరము పోయి చూతము. తై.ఆ. I. 2, 4– [శుక్ల కృష్ణే సంవత్సరస్య దక్షిణవామయోః పార్శ్వయోః తస్యై షా భవతి శుక్రంతే అన్యద్యజతంతే అన్యద్విషురూపే అహా నీ ద్యౌరివాసి విశ్వాహి మాయా అవసిస్వధావో భద్రా తే పూషన్నిహరాతిరస్తు నాన్న భువనం నపూషా నపశవః నాదిత్యః సంవత్సర ఏవప్రత్యక్షేణ ప్రియతమమ్ విద్యాత్]— అర్థము:- [సంవత్సర దేవతకు దక్షిణవామపార్శ్వములందు శుక్ల కృష్ణ " అహా " ములు గలవు; నీకొకరూపము ప్రకాశమాన ముగను, మరియొకరూపము నల్లగను నుండును. ఈ రెండును వేర్వేరు రూపములు గల " అహా " ములైయున్నవి. నీవు

"ద్యౌ" వలె నున్నావు. ఓ స్వాశ్రయమూర్తీ! నీవు మాయాభూతములనెల్ల రక్షింపుచుందువు. ఓ పూషన్! నీ యపారమహిమ మాకిచ్చట మంగళకరమగుగాక] ఇచ్చట "పూషన్" అను దేవతను "ద్యౌ" తో పోల్చియున్నారు. దానికిని "అహానీ" వలె, నలుపు, మెరుపు రూపములు గలవు. ఈ "అహానీ" యొక్క మెరుపు నలుపు రూపములే సంవత్సరదేవతయొక్క కుడి యెడమ పార్శ్వములై యున్నవి. అనగ, యీ మెరుపు నలుపు రూపములు ఒకదానినంటి మరి యొకటిరావు. ఈ రెంటికిని మధ్య చాలనెలల యవకాశము గలదు. ఇట్టి లక్షణములుగలిగిన దీర్ఘనిశాదివసములు (అహానీ) ఉత్తరధ్రువమండలములో తప్ప తదితరచోట్ల నెచ్చటను సంభవింపజాలవు. (మూడవపటమును జూడుడు.) దీర్ఘనిశ హేమంతర్తువందును, దీర్ఘదివసము గ్రీష్మర్తువందును సంభవించును. కనుక 'అహానీ' యొక్క మెరుపు నలుపు రూపములు సంవత్సర దేవతయొక్క ముఖద్వయమని తైత్తిరీయారణ్యకములో వర్ణించియున్నారు.

మనమింతవరకును దీర్ఘరాత్రమును గూర్చియే పరీక్షించి యున్నాము. ఇక దీర్ఘదివసమును వర్ణించు ప్రత్యక్షప్రమాణము లేమైన కలవేమో విచారింతము. ఋ V. 54, 5 లో (తన్వీర్యం వో మరుతో మహిత్వమమ్ దీర్ఘం తతాన సూర్యో న యోజనమ్) ఇచ్చట సూర్యునియొక్క "దీర్ఘం యోజనం" అను దానిని వర్ణించినారు. అనగ సూర్యుడు

పగటిపూట దీర్ఘప్రయాణము చేయుచున్నాడట. అట్లే మరు త్తులుకూడ తమయొక్క శక్తిని, మహిమను, వృద్ధినొందించు కొనిరట. ఇంతకంటె బలవత్తరమైన ప్రమాణము ఋ X. 138, 3 లో-కలదు. (విసూర్యోమధ్యే అముచ ద్రథం దివో విద ద్దాసాయ ప్రతిమానమార్యః దృఢాని పిప్రో రసురస్య మాయిన ఇంద్రో వ్యాస్యచ్చ కృవాం ఋజిశ్వనా) ఇది మూడవ ఋక్కు. దీనిలో నింద్రుని వీరకృత్యములను వర్ణించి నారు. మొదటి ఋక్కులో వృత్రాసురవధయు, తద్వారా నీటికిని ఉషస్సులకును గలిగిన బంధమోక్షణమును వర్ణించి నారు. రెండవ ఋక్కులో వృత్రాసురవధవలన సూర్యుడెట్లు ప్రకాశింపజేయబడెనో వర్ణించి యున్నారు. 4, 5, 6, ఋక్కులు వృత్రాసురునికోటలను భంజించుటయు, చంద్రాదులను తిరిగి తమతమస్థానములలో నిలుపుటయు, మొదలు గాగల వీరకృత్యములను వర్ణించినారు. ఈ ఋక్కులతో మన కిప్పుడంతగ పనిలేదు. మనకిప్పుడు కావలసినది పైనుద హరించిన మూడవఋక్కు. ఈ ఋక్కున కర్థమేమనగ:- [సూర్యు డాకాశమధ్యమందు తనయొక్క రథమును దింపు కొనినాడు (వి అముచత్) * దాసు డొనరించిన కృత్యము

* దాసుడనగ వృత్రాసురుడు. ఇతడు రాక్షసుడు. ఇతడు సూర్యుని (అనగ ఆర్యుని) కట్టివేయుటచే దీర్ఘనిశ యేర్పడుచున్నది. ఇప్పుడన్నచో వృత్రాసురుడు ఇంద్రునిచే సంహారింపబడుటవలన సూర్యునకు బంధమోక్షణము గలిగినది. కనుక, దాసు డొనర్చిన కార్యమునకు ప్రతిమానముగ —

నకు ప్రతిమాన మొనర్చుటకు—అనగ ప్రతికృత్య మొనర్చుటకు—ఇప్పుడు ఆర్యునకు అవకాశము జిక్కినది. ఋజిశ్వన సహాయుడై ఇంద్రుడు మాయికుడైన "పిప్రు"డను అసురుని బలిష్ఠమైన కోటలను భంజించెను.] ఈ ఋక్కులోని మొదటి రెండు చరణములే మన కిప్పుడు ముఖ్యముగ కావలసినవి. సూర్యుడు తనరథమును దింపుకొని కూర్చున్నాడట. ఎచ్చట? అస్తమయసమయమందు గాదు; క్షితిజమువద్ద గాదు; మరి యెచ్చట? ఆకాశమధ్యమందు; కొంతకాల మచ్చట విశ్రమించుటకొరకై సూర్యుడు తన రథమును దింపుకొనినాడు. ఇంతవరకు నిస్సందిగ్ధముగ దీని యర్థము తెల్లమగుచునే యున్నది. కాని, సూర్యునియొక్క యిట్టి విపరీతచర్య మన వ్యాఖ్యాతల కెంతమాత్రమును బోధపడినదికాదు. గ్రిఫిత్ అను పాశ్చాత్యశాస్త్రజ్ఞుడు దీనికొక విచిత్రార్థమును జెప్పెను. బహుశః యీవిపరీతచర్య సూర్యగ్రహణమై యుండవచ్చునట. లేదా ఆర్యులు తమ శత్రువులైన దస్యులను జయించుటకు గాను బహుశః సూర్యుని ఆకాశమందు గట్టివేసినా రేమో నట! ఈ రెండర్థములుకూడ తృప్తికరములుగ గాన్పింపవు.

యాతికి ప్రతిగ; కుక్కకాటుకు చెప్పుదెబ్బ యన్నట్లు — సూర్యు డాకాశమున తన రథమును ఊడదీసి కూర్చునియున్నాడు. వృత్రాసురుడు దీర్ఘనిశను గలుగజేసినాడు గాన, దానికి ప్రతిమానముగ సూర్యుడు దీర్ఘదివసమును గలుగజేయుచున్నాడు.

ఏల ననగ:- సూర్యగ్రహణమునాడు సూర్యుడు బాగుగ ప్రకాశింపడు. ఛాయాగ్రహముచే నావరింపబడి యుండును గద. అదిగాక, గ్రహణమునాడు సూర్యుడు ఆకాశమధ్య మందు నిలువబడడు. కనుక, పైనవర్ణించిన సూర్యునిచర్య సూర్యగ్రహణము కానేరదు. ఇక రెండవ యర్థమును చర్చింపనే యక్కర లేదు. ఆ యర్థ మిచ్చుట యెంతమాత్రమును సరిపోదు. ఋగ్వేదమునం దెచ్చటను యిట్టి యర్థమునకు ప్రమాణము గాన్పింపదు.

ఇక శాయనాచార్యులవారు దీని నెట్లు సమర్థించిరో చూతము. "రథం వి అముచత్ మధ్యే దివః=సూర్యుడు తన రథమును వదలెను." అనగ, ఆకాశమధ్యమునకు ప్రయాణ మొనర్చుటకుగాను సూర్యుడు తనరథవర్గములను వదలెను; లేక సడలించెను. "రథం ప్రస్థానాయ విముక్తవాః"—యిది శాయనులవారి భాష్యము. వృత్రాసురుని సంహరించిన పిమ్మట, ఇంద్రుడు సూర్య రథమును ఆకాశమధ్యము పైపునకు ప్రయాణమొనర్చు నిమిత్తము వదలివేసెనట. కాని యీ వ్యాఖ్యాన మంతసరళముగ గన్పింపదు. ఋగ్వేదమునందు "వి—ముచ్" అను పదమును రథహయములను గూర్చి చెప్పు సందర్భములో ౧౦, ౧౨ చోట్ల ప్రయోగించినారు. ఈ ౧౦, ౧౨ చోట్లలోను "కాడిని ఊడదీయుట, జీనును ఊడదీయుట, రథమునుండి గుర్రములను వేరుపరుచుట" యనునర్థములో ప్రయోగించిరేగాని, మరి యింకొకభావ మెచ్చటను గాన్పిం

పదు. ఆ యా ప్రదేశములలో శాయనాచార్యులవారు కూడ యిదేయర్థమును శలవిచ్చియున్నారు. ఋ I. 104, 1 లో "వి-ముచ్య" అనగ = "రథాత్ విశ్లిష్య" అని శాయనులవారే తెలిగించియున్నారు. ఋ I. 32, 1 లో "రథాత్ విముచ్య," యనియు, ఋ X. 160, 1 లో "రథాత్ విసృజ్య" యనియు శాయనులవారే వ్యాఖ్యానము జేసియున్నారు. ఇంకను కావలసినయెడల, ఋ I. 171, 1; I. 177, 4; VI. 40, 1— ఋక్కులను పోల్చిచూడ వచ్చును. ఈ సందర్భములను బట్టి "సూర్యుడు తనరథమును ఊడదీసి దింపుకొన్నాడు" అనునదియే మిక్కిలి సరళమైన అర్థమని స్పష్టమగుచున్నది. "దివఃమధ్యే" = అనగ, "ఆకాశమధ్యమందు" అని యర్థముగాని "ఆకాశమధ్యమువైపునకు" అనియర్థము కానేరదు. "వి—ముచ్" అనగ "ప్రయాణమునిమిత్తమై రథపగ్గములను వదలినాడు" అని మన మొకవేళ యర్థము జెప్పినను, తత్పూర్వమందు రథమునిలిచియైన నుండవలెను; లేదా మిక్కిలి నెమ్మతిగనైన నడచుచుండవలెను. అట్లనియొప్పుకొన్నను ఆకాశమధ్యమందు సూర్యుడు తన రథము నేల నిలుపవలెను? ఏల నెమ్మదిగ నడిపింపవలెను? ఈ ప్రశ్నలకు సమాధానమింకను జెప్పవలసియే యున్నదిగద. అప్పటికి సూర్యుడు క్షితిజముకిం్రద నున్నయెడల ప్రయాణమునకై బయలుదేరినాడని చెప్పవచ్చును; క్షితిజము క్రిందనైనను, ప్రయాణమునకు పూర్వము, సూర్యుడు నిలిచి యుండవలెను గద. దీనినిట్లు

సమర్థింతుము? కాని యీ ఋక్కులో వర్ణింపబడిన సూర్యుడు క్షితిజముక్రింద లేడు, దివామధ్యమందున్నాడు. కనుక ప్రయాణమునకై బయలుదేరినాడని చెప్పుటకు సందర్భపడదు. అదియునుగాక, దాసుడగు వృత్రాసురుడు దొంగచ్చినకృత్యమునకు సూర్యుడు ప్రతిమాన మొనర్చుచున్నాడని యీ ఋక్కునందున్న భావమున కర్థమేమి? శాయనులవారి వ్యాఖ్యకు మనము సమ్మతించిన యెడల యీ "ప్రతిమాన" మును సమర్థించు టెట్లు? కనుక, సూర్యుడాకాశమధ్యమందు తన రథమును ఊడదీసి కూర్చున్నాడను నదియే సహజ సిద్ధమైన యర్థము.

సూర్యుడాకాశమధ్యమందు నిలిచియున్నాడని చెప్పుటకు ఋ VII. 87, 5, లో నింకొక ప్రమాణము గలదు. (చక్రే దివి ప్రేఙ్ఖమ్ హిరణ్మయమ్) "హిరణ్మయుడైన సూర్యుడాకాశమందు "ఊయల" వలె నున్నాడు. అనగ, ఆకాశమధ్యమందు సూర్యుడు ఊయలవలె ముందునకును వెనుకకును ఊగులాడుచున్నాడట. దీనియొక్క నిజభావము మన కీప్రాంతములలో గాన్పింపదు. ఉత్తరధ్రువప్రాంతదేశములకు బోయి జూచిననేగాని మన కీవిచిత్రచర్య సుబోధకము గాదు. ఉత్తరధ్రువ మండలములో దీర్ఘదినసమునందు— అనగా, అనేక దినములవరకు సూర్యుడు క్రుంకక క్షితిజముపైననే తిరుగుచున్నప్పుడు—యీ విచిత్రచర్య గాన్పించును. మొట్టమొదట ఉషస్సును భేదించుకొని సూర్యుడు క్షితిజముపైకి వచ్చును. ఒక్క అర గంటలు గతించునప్పటికి సూర్యుడు

క్షితిజముయొక్క అంచుచుట్టును ఒకచుట్టు తిరిగివచ్చును. కాని ఒక్కచుట్టు తిరిగివచ్చునప్పటికి సూర్యబింబము క్షితిజముయొక్క అంచుననే యుండక కొంచెము పైకి లేచుచుండును. ఈ విధముగ కొన్నిదినములు గతించునప్పటికి సూర్యబింబము అడ్డముగ ౨౪ గంటల కొక చుట్టుచొప్పున కుమ్మరి సారెవలె తిరుగుచు క్రమక్రమముగ పైకిలేచుచుండును. ఇట్లు కొంతయెత్తువరకును లేచి ౧, ౨, మాసము లైనతరువాత తిరిగి క్రిందికి — అదేరీతిగ — క్రమక్రమముగ దిగుచుండును. ఇంకొక ౧, ౨ మాసము లగుసరికి సూర్యబింబము క్షితిజము క్రిందికి క్రుంకును. దీనినిబట్టి మన మేమి గ్రహింపవలెను ? దీర్ఘదినసమునందు సూర్యుడు క్రమముగ పైకెక్కుటయు, క్రిందికి దిగుటయు తటస్థించుచున్నది. అనగ, సూర్యుడు ఊయలవలె ముందునకుబోయి వెనుకకు వచ్చుచున్నాడని చెప్పుటకు అవకాశ మేర్పడుచున్నది. కనుక, యిది ఉత్తర ధ్రువమండల లక్షణమే యని సిద్ధించుచున్నది.

"విదద్దాసాయ ప్రతిమాన మార్యః" — అను రెండవ పాదమునకు పాశ్చాత్యశాస్త్రజ్ఞులు విచిత్రార్థమును చెప్పిరి. దీనిలోని "దాస" "ఆర్య" శబ్దములు హిందూదేశములోని ఆర్య, అనార్యజాతిప్రజలను సూచింపునని వారు తలంచిరి. కాని, ఋగ్వేదములో యీవాక్యముల నా యర్థములో ప్రయోగింప లేదు. "దాస" శబ్దము ఇంద్రశత్రుపరముగ ప్రయోగింపబడినది. శంబరుడు, పిప్రు, నముచి — మొద

లగు ఇంద్రశత్రువు లందరును దాసులనియే వర్ణింపబడిరి. ఇంద్రుడు దాసుల మనస్సులలో భీతిని పుట్టించునట. (ఋ X. 120,2) తనకు మృత్యువులేదని విర్రవీగిన దాసుని ఇంద్రుడు చీల్చివేసెనట (ఋ II. 11,2). ఈవాక్యములవల్ల "ఆర్య" "దాస" శబ్దములు ఇంద్రునకును, ఇంద్రశత్రులకును వర్తించునేగాని ఆర్యానార్యజాతిప్రజలకు వర్తింపవని తేలుచున్నది. ఇదిగాక, యీవీరకృత్యములన్నియు నెచ్చటనో ఊర్ధ్వలోకములందు జరిగిన కార్యములు. ఇట్టి సందర్భములో, యీఋక్కులో నెచ్చటనో యొకటి రెండు పొడిమాటలను బట్టుకొని, హిందూదేశములో ఆర్యానార్యజాతిప్రజలకు జరిగిన పోరాటముతో పోల్పజూచుట హాస్యాస్పదము. ఇక రెండవ యంశ మేమనగ, "ప్రతిమాన" భావము నెట్లు సమర్థింపవచ్చును? ఆర్య లోకప్రభువు దాసులవలన ఓడింపబడి యుండిన గాని, తిరిగి ఆర్యులు విజృంభించి తమ కసితీర్చుకొని రని చెప్పుటకు వీలు లేదుగద. తత్పూర్వమం దార్య లోకప్రభువు దాసులచే నోడింపబడిన ట్లెచ్చటను చారిత్రక దృష్టాంతము గాన్పింపదు. కనుక, యీ యర్థ మిచ్చుట సరిపోదు. కనుక యీ ఋక్కుయొక్క సరళభావ మేమనగ, సూర్యు డాకాశమధ్యమందు నిలువబడి దీర్ఘదివసమును కల్పించెను. అందువలన, తనశత్రువైన దాసునకు 'ప్రతిమాన' మొనర్చుటకు యింద్రుని కిప్పుడు మంచి యవకాశము చిక్కినది. ఏలనగ, దీర్ఘనిశి యొసరివలన కలిగి

నది ? ఇంద్రశత్రుడగు దాసునివలనగద. ఇంద్రశత్రుడగు దాసుడు దీర్ఘనిశను గల్పించినాడు గనుక, దానికి 'ప్రతిమాన'ముగ ఇంద్రుడిప్పుడు దీర్ఘదివసమును కల్పించి కసి తీర్చుకొన్నాడు. ఇదే ఉత్తరధ్రువమండల లక్షణము. అచ్చట దీర్ఘనిశయు, దానితో తులదూగగల దీర్ఘదివసమును కలుగుచుండును. ఇదియే యీ ఋక్కుయొక్క నిజభావము. ఆర్యానార్య పోరాటములు మొదలగు అసందర్భపు వ్యాఖ్యానము లెవ్వియు నిచట సరిపడవు.

మన మీయధ్యాయములో గ్రహించిన సారాంశముల నన్నిటి నిచ్చట క్లుప్తముగ చెప్పెదను:—

(౧) ఋగ్వేదమందు దివారాత్రములను వర్ణింపు జంటలు రెండు గలవు. ఒకటి ౨౪ గంటల పరిమితిగల సాధారణపు దివారాత్రిమును (ఉషాసానక్తా) వర్ణించును. రెండవది, దీర్ఘనిశాదివసమును (అహానీ) వర్ణించును. దీనికి ప్రమాణము: ఋ III. 55, 11.

(౨) 'అహానీ' జంటలో వర్ణింపబడిన దీర్ఘనిశయు, దీర్ఘదివసమును సంవత్సరదేవతయొక్క వామదక్షిణపార్శ్వములు. ఇదియే ఉత్తర ధ్రువమండలములోని దీర్ఘదివసమును, దీర్ఘరాత్రమును నైయున్నవి. దీనికి ప్రమాణము తైత్తిరీయారణ్యకము.

(3) పూర్వకాలమందు మనవారు "యిక తెల్లవారదనే తెల్లవారద" ని భయపడెడివారట—అనగ, రాత్రికాలమంత

అర్థము చెప్పినను, సూర్యుడు ఉషస్సుయొక్క పుత్రుడన నర్థమేమి? ఉషస్సునకు దక్షిణ యనుపేరేల వచ్చినది? దక్షిణ యనగ దక్షిణదిక్కని అర్థము చెప్పినచో యీ వాక్యముయొక్క నిజభావము తేటపడగలదు. ఋ I. 123,1; X. 107, 1 – లో ఉషస్సును 'దక్షిణ' యని సంబోధించి యున్నారు. ఋ III. 58,1 లో–సూర్యుడు దక్షిణయొక్క పుత్రుడని వర్ణించియున్నారు. ఈవాక్యములనుబట్టి చూచి నచో, సూర్య, ఉషస్సులు దక్షిణదిక్కుగ వచ్చినట్లు తేటపడ గలదు. సూర్యుడు దక్షిణదిక్కుగ ప్రయాణము చేయుచున్నట్లు గాన్పించు ప్రదేశము ఉత్తరధ్రువమండలమే యని చెప్పి యున్నానుగద. కనుక యీపై ఋగ్వేదవాక్యములు ఉత్తర ధ్రువమండల లక్షణములను సూచించుచున్నవి. ఇది సిద్ధము.

ఉత్తరదిక్కునకు ఆపేరెట్లు వచ్చినది. "ఉత్–తర"= అనగ పైభాగము; లేక ఊర్ధ్వభాగము అని యర్థము. దక్షిణదిక్కునకు "అధర" యనుపేరుకూడ కలదు. ఈ రెండు శబ్దముల వ్యుత్పత్త్యర్థములుకూడ మన సిద్ధాంతమున కనుకూ లించుచునే యున్నవి. ఉత్తరదిక్కు పైభాగమున, సూటిగా నెత్తిమీద, నున్న ప్రదేశములో గాన్పించును? ఉత్తరధ్రువ మండలమందే గాన్పించును. ఉత్తరధ్రువమండలమందు ధ్రువ నక్షత్రము సూటిగ నెత్తిమీద గాన్పించును; కనుక ఉత్తరపు దిక్కు సూటిగ నెత్తిమీద నుండును; దక్షిణపుదిక్కు కాలి క్రింది అధోభాగమందుండును. అందుచేతనే ఉత్తరదిక్కునకు

"ఉత్"–తర (పైభాగము)" అనియు, దక్షిణదిక్కునకు "అధర (క్రిందిభాగము)" అనియు పేర్లువచ్చినవి. అదిగాక, యిటీవలి సంస్కృతవాఙ్మయమందు "సూర్యమార్గము సప్తర్షి మండలమున కంటె క్రిందుగ * (అధః) నున్న"దని యొక ప్రతీతిగలదు. సూర్యమార్గము (రాశిచక్రము) సప్తర్షి మండలమునకు దక్షిణముగ నున్నమాట వాస్తవమే; అయితే దానికి క్రిందుగ నున్నదనగ అర్థమేమి? ఈ వర్ణన మేదేశములో సరిపోవును? సప్తర్షిమండలము నడినెత్తిమీదనున్న దేశములో సరిపోవును. అనగా ధ్రువప్రాంతదేశములలో సరిపోవును. సప్తర్షిమండలము (ఋక్షాః) మిక్కిలి యెత్తుగ (ఉచ్చైః) నున్నదని యిదివరకే ప్రమాణమును జూపియున్నాము.

ఇంతవరకు నీ యారవయధ్యాయములో దీర్ఘదినసము, దీర్ఘరాత్రములనుగూర్చిన వేదప్రమాణములను పరిశీలించియున్నాము. సప్తమాధ్యాయములో మాసములనుగూర్చియు ఋతువులను గూర్చియు గూడ చర్చించి, యివికూడ ఉత్తర ధ్రువమండలమునే సూచించుచున్నవని ధ్రువపరచెదము.

---

* కాళిదాసు కుమారసంభవము :— VI. 7 :— "అధః ప్రస్థాపితాశ్వేన సమావర్జిత కేతునా సహస్రరశ్మినా సాక్షాత్ప్రణామ మివేక్షితాః॥

I. 16 :— "సప్తర్షి హస్తావచితావశేషాణ్యధో వివస్వాన్ పరివర్తమానః॥

మల్లినాథ వ్యాఖ్య చూడనగును.

వైదికనిలయము

7-వ అధ్యాయము.

మాసములు, ఋతువులు.

దేవతలకు ఆరుమాసములు పగలును, 6 మాసములు రాత్రియునని సంస్కృతవాఙ్మయమునం దెచ్చట జూచినను స్పష్టముగ గన్పట్టుచున్నది. ఈయంశమే పారశీక వేదమగు "అవస్థ" గ్రంథమందుకూడగలదు. ఇవిగాక ముప్పదిదినముల పరిమితిగల ఉషస్సునుగూర్చియు దీర్ఘదివసము, దీర్ఘరాత్రిని గూర్చియు, ఋగ్వేదమందే ప్రత్యక్షప్రమాణములను జూచియుంటిమి. ఈయంశములు పూర్వయుగపునాటివనికూడ ఋగ్వేదము చెప్పుచున్నది. ఈలక్షణములు ఉత్తరధ్రువప్రాంత లక్షణములనుటకు సందియము లేదు.

అయితే యిక ఋతువులు మాసములు వగైరాలను గూర్చిన ఉత్తరధ్రువలక్షణము లేవైన వేదమునందు గలవా యను నంశమును ఇకముందు విచారింపవలసియున్నది. వేద సంహితాకాలమునాటి (దక్షిణదేశములకు వచ్చిననాటి) పంచాంగమునకును ధ్రువనివాసకాలమునాటి పంచాంగ మునకును చాల భేదములు కలవని ఇదివరకు వివరించియుం

టెమి. అయితే ఈధ్రువనివాసకాలమునాటి పంచాంగలక్షణ
ములను తెలిసికొనుటెట్లు ? సంహితాకాలమునాటి పంచాం
గము వెనుకటిపంచాంగముకంటె భిన్నమైనదైనను దీనియందు
వెనుకటియంశములు కొన్ని నిలిచియుండకపోవు. ఏలననగ
యాజ్ఞికులకు ప్రాచీనాచారములందు పట్టుదల మెండుగ
నుండును కనుక ప్రస్తుతదేశకాలస్థితులు మారినను వెనుకటి
వానిని మాత్రము వారు పూర్తిగ విడిచిపెట్టరు. వాని నేదో
విధముగ ఈనూతన పరిస్థితులకు అంటగట్టుదురు. కనుక
ఈనూతన పంచాంగమునందు ప్రాచీనపంచాంగపు లక్షణ
ములుకూడ కొన్ని తప్పకమిగిలియుండునని మనము గట్టిగ
చెప్పవచ్చును. వీనిని తెలిసికొనుటకు మార్గమేమిగలదు ?
యజ్ఞములను చేయుటయనునది ప్రపంచమందు సర్వజాతుల
వారికిని పూర్వకాలమందు సాధారణాచారమైయుండెనని పరి
శోధనలవలన రుజువగుచున్నది. ఈయజ్ఞయాగాది కర్మకాండ
యంతయు కేవలము సూర్యునివార్షికగతిపై యాధారపడి
యుండెను. ఈయజ్ఞములు (ముఖ్యముగ వార్షికసత్రములు)
సూర్యుని వార్షికగతిక సరియైన నకలని చెప్పవచ్చును. కనుక
యార్యులు ఉత్తరధ్రువమును వదలి దక్షిణదేశములకు వచ్చి
నప్పుడు వారికి సూర్యుని వార్షికగతియందు చాలభేదములు
గన్పట్టెను. తదనుగుణముగ యాజ్ఞికులు తమ కర్మకాండ
యందుకూడ కొన్నిమార్పులను గావించుకొని యుండిరి.
అయినను వెనుకటిసూర్యగతిని లేక పంచాంగలక్షణములను

డెలుపుకర్మ భాగము లిప్పటికిని మిగిలియేయుండెను. వెనుకటి వానిని పూర్తిగ వారు తొలగించివేయలేదు. ఇట్లు యాజ్ఞికుల పూర్వాచారపరాయణత్వమువల్లను పట్టుదలవల్లను మిగిలిపోయిన ప్రాచీనకర్మకాండభాగములనుబట్టి పూర్వపు ధ్రువపంచాంగస్థితి కొంత బోధపడగలదు. ఇట్టిమిగిలిపోయిన ప్రాచీన కర్మకాండ భాగములను బట్టిచూడగ ఆర్యులొకప్పుడు ఉత్తర ధ్రువప్రాంతములం దుండిరని ఋజువుకాగలదు.

కాని ఈవేదప్రమాణములను పరిశీలించుటకుముందు మనము కొన్ని ఖగోళాంశములను డెలిసికొనవలెను. ఉత్తర ధ్రువప్రాంతమందలి సూర్యగతికిని దక్షిణభాగములందలి సూర్యగతికిని ఏమేమిభేదములుండునో మనము జ్యోతిర్గణిత మునుబట్టి సులభముగ డెలిసికొనవచ్చును. మఱియు ఇట్టి భేదములే కర్మకాండయందుకూడ జరిగియుండవలెను. కనుక ధ్రువనివాసమునాటి కర్మకాండకును, సంహితాకాలమునాటి (అనగా దక్షిణదేశములకు వచ్చిననాటి) కర్మకాండకును ముఖ్యముగ ఏయేభేదములుండునో మనము ముందుగనే యూహించి తెలిసికొనవచ్చును. ఈభూగోళముపై సంవత్సరం పొడవునను సూర్యరశ్మి యెట్లుండునోచూతము.

(ప్లాను నెం. 5 రు)

(I) భూమధ్యరేఖవద్ద:—మొత్తము పండ్రెండు నెలలు సూర్యరశ్మి (౧౨) యుండును. ఇరువదినాలుగు గంటలలో సమపరిమితిగల ఒకరాత్రియు ఒకపగలును యుండును.

(బ్లాకు నెం. 6 రు)

(II) భూమధ్యరేఖకును ధ్రువరేఖకును మధ్యమండలం:— పంన్రెండు నెలల పొడుగునను సూర్యరశ్మియుండును. ఇరువదినాలుగు గంటలలో ఒకపగలును ఒకరాత్రియు నుండును. అయితే ఈరాత్రింబవళ్లు సమానపరిమితిగలవి కావు.

(III) ధ్రువరేఖకును ధ్రువమునకును మధ్య (ధ్రువ మండలం):—అక్షాంశభేదమును బట్టి ఈక్రింది విధముగ నుండవచ్చును. (రోజు = ౨౪ గంటలు.)


(i)	౧	నెల యెడతెగని చీకటి (దీర్ఘరాత్రి.)	మొత్తము ౧౧ నెలలలో సూర్యరశ్మి యుండును. తక్కిన నెల దీర్ఘరాత్రి.
(బ్లాకు నెం. 7 రు)	౫	నెలలు: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు. (రోజులో వెలుతురు భాగ మంత కంత కెక్కువగు చుండును.)	
	౧	నెల యెడతెగనిసూర్యరశ్మి (దీర్ఘదివసము.)	
	౫	నెలలు: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు. (రోజులో వెలుతురు భాగ మంత కంతకు తగ్గుచుండును.)	

(ii) ౨ నెలలు: ఎడతెగని చీకటి (దీర్ఘ రాత్రి.)
౪ నెలలు: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు.
(రోజులో వెలుతురు భాగమంత కంత కెక్కువగుచుండును.)
(ధ్రువ గం. ౯ ని)
౨ నెలలు: ఎడతెగని సూర్యరశ్మి (దీర్ఘ దివసము)
౪ నెలలు: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు.
(రోజులో వెలుతురు భాగమంత కంతకు తగ్గుచుండును.)

(iii) 3 నెలలు: ఎడతెగని చీకటి (దీర్ఘ రాత్రి.)
3 నెలలు: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు.
(రోజులో వెలుతురు భాగమంత కంత కెక్కువగును.
(ధ్రువ గం. 10 ని)
3 నెలలు: ఎడతెగని సూర్యరశ్మి (దీర్ఘ దివసము.)
3 నెలలు: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు.
(రోజులో వెలుతురు భాగమంత కంతకు తగ్గును.)

ప్లాను 7.

ఉ. ధృ.




(ధృవ రేఖకును ; ధృవమునకును మధ్య)

70° ల అక్షాంశవద్ద - ఒక నెల దీర్ఘరాత్రి యుండును : ఒక నెల దీర్ఘదివస ముండును. తక్కిన పదినెలలలో రాత్రింబవళ్లు నానారూపములుగ ఎక్కుచు, దిగుచునుండును. అనగ, యిచ్చట రెండురకముల రాత్రింబవళ్ల జంటలు గలవు.

ఇచ్చట ఒక నెల **మాత్రము** మొదలంగని చీకటి యుండును. తక్కిన పదునొకండు నెలలలో కొద్దియో గొప్పయో సూర్యరశ్మి యుండును.

బ్లాకు 9.

ఉ. ధృ.




75° అక్షాంశవద్ద - రెండు నెలల దీర్ఘరాత్రియు, రెండు నెలల దీర్ఘదివసము నుండును. తక్కిన యెనిమిది నెలలలో రాత్రింబవళ్లు ఎక్కుచు, దిగుచు నానారూపములుగ నుండును.

రెండు నెలలు ఎడతెగని చీకటి యుండును: తక్కిన పదినెలలలో కొద్దియో గొప్పయో సూర్యరశ్మి యుండును. ఇది " దశగ్వు "లుండు ప్రదేశము.

బొమ్మ 10.

ఉ. ధృ.




79° డిగ్రీల అక్షాంశవద్ద: 3 నెలల దీర్ఘరాత్రియు, మూడు నెలల దీర్ఘదివసము నుండును. తక్కిన ఆరు నెలలలో రాత్రింబవళ్లు నానారూపములుగ నుండును. (విహూపే)

3 నెలలు ఎడతెగని చీకటి యుండును: తక్కిన తొమ్మిది నెలలలో కొద్దియో గొప్పయో సూర్యరశ్మి యుండును. ఇది "నవగ్స్వా" లుండు ప్రదేశము.

బ్లాకు 11.

ఉ. ధృ.



83° అక్షాంశనద్ద: 4 నెలల దీర్ఘరాత్రియు, 4 నెలల దీర్ఘదివసము నుండును. తక్కిన నాల్గు నెలలలో అహోరాత్రములు నానారూపములుగ నుండును. ఇచ్చట, 4 నెలలు ఎడతెగని చీకటి యుండును. తక్కిన ఎనిమిది నెలలలో కొద్దిదో గొప్పదో సూర్యరశ్మి యుండును.

(iv) (ధ్రువ నం. 11 కి)	౪ నెలలు: ఎడతెగని చీకటి (దీర్ఘరాత్రి) ౨ నెలలు: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు. (రోజులో వెలుతురు భాగమంత కంత కెక్కువగును.) ౪ నెలలు: ఎడతెగని సూర్యరశ్మి (దీర్ఘదివసము.) ౨ నెలలు: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు. (రోజులో వెలుతురు భాగమంత కంతకు తగ్గును.)	మొత్తము ౮ నెలల సూర్యరశ్మియు, ౪ నెలల దీర్ఘరాత్రము నుండును.
(v) (ధ్రువ నం. 12 కి)	౫ నెలలు: ఎడతెగని చీకటి (దీర్ఘరాత్రి.) ౧ నెల: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు. (రోజులో వెలుతురు భాగమంత కంత కెక్కువగును.) ౫ నెలలు: ఎగతెగని సూర్యరశ్మి (దీర్ఘదివసము.) ౧ నెల: రోజులో కొంత చీకటి, కొంత వెలుతురు. (రోజులో వెలుతురు భాగమంతకంతకు తగ్గును.)	మొత్తము ౭ నెలల సూర్యరశ్మియు, ౫ నెలల దీర్ఘరాత్రము నుండును.

(IV) కేవలము ఉత్తరధ్రువముమీద:—


	౬ నెలల యెడతెగని రాత్రి (దీర్ఘరాత్రి)	
౪౦౫౯ దినములు		౧ సంవత్సరము
	౬ నెలల యెడతెగని సూర్యరశ్మి (దీర్ఘదివసము.)	

యజ్ఞయాగాది క్రతువులు సూర్యరశ్మియున్న మాసములలోనే చేయబడును. సంహితా బ్రాహ్మణములు, (ఆర్యులు ధ్రువమును వదలివేసి) దక్షిణదేశములందు నివాసమొనర్చుకాలములలో వ్రాయబడినవి. ఈకాలములో ఆర్యులకు సూర్యరశ్మి ౧౨ మాసములుండెను. కనుక సంహితా బ్రాహ్మణములందలి సత్రములు ౧౨ మాసములపరిమితి గలవై యున్నవి.

ఉత్తరధ్రువమండలములో సూర్యరశ్మి ౧౨ మాసములుండక కొన్నిప్రదేశములలో ౭ మాసములును, కొన్నిచోట్ల ౮ మాసములును, కొన్నిచోట్ల ౯, ౧౦, ౧౧ మాసములును మాత్రమే యుండునని పైవివరణనుబట్టి తెలియగలదు. కనుక ఒకప్పుడు ఆర్యులు ఉత్తరధ్రువమువద్ద నివసించి యుండుటయే సత్యమైనచో, ప్రాచీనకాలమునాటి సత్రములు ౭ మాసములుగాని, ౮ మాసములుగాని, లేక ౯, ౧౦, ౧౧ మాసములుగాని పరిమితిగలవై యుండవలెను. కనుక పూర్వయుగపుసత్రములకును, తదుపరి సంహితాకాలమునాటి సత్రి

బ్లాకు 12.

ఉ. ధృ.



87° అక్షాంశవద్ద: 5 నెలల దీర్ఘరాత్రియు, 5 నెలల దీర్ఘదివసము నుండును: తక్కిన రెండునెలలలో రాత్రింబవళ్లు నానారూపములుగ నుండును.

ఇచ్చట అయిదు నెలలు మొత్తముగని చీకటి యుండును. తక్కిన యేడుమాసములలో కొద్దియో, గొప్పయో సూర్యరశ్మి యుండును.

"అతిగాధ" యను 83°, 87° అక్షాంశ మధ్యమున్న ప్రదేశమునకు పుట్టినది.

ములకును, ఉండవలసిన ముఖ్యభేద మిదియై యుండవలెను. సంహితాకాలమునాటి సత్రములు ద్వాదశ మాసపరిమితి గలవిగను తత్పూర్వయుగమునాటి సత్రములు అంతకంటె తక్కువమాసముల పరిమితిగలవిగను ఉండితీరవలెను. అట్ల గునచో ౧౨ మాసములకంటె తక్కువపరిమితిగల సత్రము లేమైన పూర్వయుగమం దుండియున్నట్లు వేదములందు ప్రమాణములేమైనగలవా ? యని పరిశీలింపవలసి యున్నది.

ఆర్యు లందరును కేవలము ఉత్తరధ్రువముమీదనే కూర్చుండిరని మామతముగాదు. వారు ధ్రువమండలము నందంతటను వ్యాపించియుండిరి. కనుక, ధ్రువమునకు దగ్గరగ నున్నవారికి మొత్తము ౭ మాసములలో సూర్యరశ్మి యుండును. అంతకంటె దూరమందున్నవారికి ౮ మాసములలో సూర్యరశ్మిగాన్పించును. ఇట్లే ధ్రువమునుండి దూరమైనకొలది ౯, ౧౦, ౧౧ మాసములలో సూర్యరశ్మియుండును. కనుక ధ్రువమునకు దగ్గరనున్నవారి సత్రములు ౭ మాసములపరిమితి గలవైయుండును. అంతకంటె దూరమందున్న వారివి ౮ మాసముల పరిమితి గలిగియుండును. ఇట్లు ధ్రువమును విడిచి దూరముపోయిన కొలదియు ౯ మాసముల యజ్ఞములు చేయువారును (నవగ్వులు); ౧౦ మాసములయజ్ఞములు చేయువారును (దశగ్వులు); ౧౧ మాసములయజ్ఞములు చేయువారునుకూడ కనిపించవచ్చును. ఇట్టి పూర్వయుగస్థితిని దెలుపు యీపలు తెరగులగు యజ్ఞముల చిహ్నములు సంహితలయం దేమైనగలవా ?

మొట్టమొదట ౭ మాసముల పరిమితిగల యజ్ఞములనుగూర్చి విచారింతము. ధ్రువమునకు దగ్గరగనున్నచో అచ్చట సంవత్సరములో మొదటి ౫ మాసములు (ఉషస్సుతోసహా) ఎడతెగని చీకటియుండును. ౬ వ మాసములో సూర్యుడు క్రమముగ దినములో కొంచెముసేపు కనుపడును. ఈరీతిగ నెల జరుగునప్పటికి సూర్యరశ్మి ప్రతిదినమును ఎక్కువగుచుండును. ౭, ౮, ౯, ౧౦, ౧౧ మాసములలో ఎడతెగని సూర్యరశ్మి (చీకటియనుమాటయే లేకుండ) ఉండును. ఇదియే దీర్ఘదివసము. పిమ్మట ౧౨ వ నెలలో సూర్యరశ్మి క్రమముగ దినములవగుసను తగ్గిపోయి ౧౨ వ మాసము పూర్తియగునప్పటికి ఎడతెగని అంధకారము (దీర్ఘ రాత్రి) మరల ప్రవేశించును. కనుక యీప్రదేశమందు సూర్యరశ్మి కనుపించేమాసములు యేడుమాత్రమేనని గ్రహింపవలెను.

ఇట్టి ౭ మాసముల సూర్యరశ్మినిగూర్చి ఋగ్వేదమందు నిదర్శనములు నిలిచియున్నవి. దీనికి "అదితి" (లేక సప్తాదిత్యుల) గాథయే ప్రమాణము. అతిప్రాచీనకాలమందు ఆదిత్యుల (లేక సూర్యుల) సంఖ్య యేడు అని యీగాథ చెప్పుచున్నది. ఈవిషయమే ఋగ్వేదమందు పలుతావులలో గలదు. ఋ IX 114-3 లో యేడుగురు ఆదిత్యులును, యేడుగురు యాజ్ఞికులును చెప్పబడిరి. కాని వారిపేళ్లు యిచ్చుటలేదు. ఋ II ౨౭, 1 లో మిత్ర, అర్యమన్, భగ, వరుణ, దక్ష,

అంశలను ౬ గురి సూర్యులపేర్లు చెప్పబడినవి. ౭ వ సూర్యుని పేరు చెప్పబడలేదు. దీనిని మనమంతగ పాటింపనక్కరలేదు. ఈసప్తసంఖ్యప్రసిద్ధమే. సూర్యుడు సప్తాశ్వుడని V, 45,9 లో కలదు. ఏడుచక్రములుగల సూర్యరథము యేడుగుర్రములచే లాగబడుచున్నది (I, 50, 8) సూర్యరథము యేడుపేర్లుగల ఒకగుర్రముచేతనే లాగబడుచున్నది. (1, 164, 2) "సూర్యుని ప్రకాశమానములైన యేడుకిరణము"లనుగూర్చి (అధ. VII 107, 1) చెప్పుచున్నది. సూర్యుడు ఆదిత్యుడని ఋగ్వేదము చెప్పిన మాటనే అధర్వవేదముకూడ (XIII, 2, 9) "అదితేః పుత్రః" అని చెప్పుచున్నది.

సూర్యునియొక్క యేడుకిరణములనుబట్టి సూర్యుని కిసంఖ్యావాచకనామము వచ్చినదని శాయనాచార్యులవారును యాస్కాచార్యులవారును, చెప్పుచున్నారు. అయితే సూర్యునకు యేడుకిరణములే యుండవలెనా? దీనియొక్క భావమేమియో యెవరును విప్పిచెప్పలేదు. సూర్యకిరణములో నిమిడియున్న ౭ రంగులును యిటీవల కనిపెట్టబడినవి. ఈరంగు లాయాచార్యులకే తెలియవు. కనుక, పూర్వకాలపుటార్యులను తెలియుననుట మరింతసాహసము. ఒకవేళ యీసమాధానమును ఒప్పుకొన్నను దీనికింకొక బాధయున్నది. ఏమనగా:- (ఋ X, 72; 2 3) అదితిగాథలో నేమిచెప్పబడియున్నదనగా:- అదితి తనదేహమునుండి పుట్టిన ౮ మంది కొడుకులలో యెనిమిదవవాడగు మార్తాండుని పారవేసి, తక్కిన యేడుగురి

తోడనే ఆమె దేవతలను సమీపించెను. "అదితి తన యేడుగురి కొడుకులతో పూర్వయుగమందు (పూర్వ్యంయుగం) దేవతలను సమీపించెను. ఆమె మార్తాండుని మరల చావుపుట్టుకలకై అక్కడికి తెచ్చెను." ఈగాథ వేదవాఙ్మయమందనేకచోట్ల చర్చించబడెను. వానినట పరిశీలించెదము. దీనికి సమంజసమైన భావార్థము నెవరును తెలుపలేదు.

అదితికీయాదిత్యులు పుట్టినవిధము అనేకచోట్ల అనేక విధములుగ చెప్పబడియున్నది.

౧. తై. సం. (VI 5, 6, 1) మొదట అదితి బ్రహ్మౌదనమును వండెను. దానిలో మిగిలినదానిని దేవతలామె కిచ్చిరి. దానివల్ల ఆమెకు ౪ గురు ఆదిత్యులు పుట్టిరి. పిమ్మట రెండవపర్యాయము ఆమె వండి, తానుతినెను. దాని యిప్పుడుపుట్టిన ఆదిత్యుడు "కరణిత్వముగాని సిద్ధ"గ నుండెను. మూడవపర్యాయము వండుకొని తినిన వివస్వంతుడను ఆదిత్యుడు పుట్టెను. తక్కిన ఆదిత్యులనుగూర్చి యీ సంహితయందేమియు చెప్పబడలేదు.

౨. అయినను యీలోపమును తైత్తిరీయ బ్రాహ్మణము తీర్చుచున్నది. I-1, 9 అదితి నాలుగుపర్యాయములు వండెను. అందులో మిగిలినదానిని దేవతలామెకిచ్చిరి. ఈ నాలుగు పర్యాయములును నాలుగురెండ్లు యెనమండుగురు కొడుకులు అదితికిబుట్టిరి. (ధాతృ-అర్యమ;) (మిత్ర-వరుణ;) (అంశ-భగ) (ఇంద్ర-వివస్వత;)—అనునీనాలుగు జంటలు

కాని, యెనిమిదవ ఆదిత్యునకు మార్తాండుడనుపే రెట్లు వచ్చెనో, అదితియీమార్తాండుని యేలపారవేసెనో యీ బ్రాహ్మణము చెప్పుటలేదు

3. ఋX, 72, 8-9 లోని ఋక్కులే తైత్తిరీయారణ్యకములోగూడ (I, 13, 2-3) కూడ ఉదాహరింపబడినవి. కాని యీ రెంటికిని కొంత భేదమున్నది. "ఆమె మార్తాండుని మరల (త్వత్పునః) చావుపుట్టుకలకై అక్కడికి తెచ్చెను" అని ఋగ్వేదమునందుండగ ఆమె మార్తాండుని చావుపుట్టుకలకై ప్రత్యేకముగ పెట్టియుంచెను; తత్పరా—అని ఆరణ్యకమందున్నది. పిమ్మట ఏడు మంది ఆదిత్యుల పేర్లు చెప్పబడినవి. ఎనిమిదవవానిగురించిగాని మార్తాండుని పేరునుగాని చెప్పలేదు.

4. ఈనాల్గవది తై. ఆ. I, 7, 1-6 లోగలదు. కాని కొంత భేదమున్నది. (ఆరోగ, భ్రాజ, పటర, పతంగ, స్వర్ణర, జ్యోతిషీమత్, విభాస, కశ్యప) కశ్యపుడను యెనిమిదవ ఆదిత్యుడు సదా మేరుపర్వతశిఖరమునందుండి ఆప్రదేశమును వదిలియుండడు. తక్కిన 7 గురు సూర్యులును [illegible] కాంతిని [illegible] కశ్యపునివలననే పొందుచున్నవి. మానవులకు [illegible] యెనిమిదవ సూర్యుడు కనబడడు. [illegible] ఆదిత్యులవలె మనుష్యులలోనున్న 8 ప్రాణములని ఆరణ్యకము [illegible]. ఇవి 8 తరగతుల ఋత్విక్కులకు [illegible]. ఇక మూలవిషయమునకు వత్తము: [illegible] ఋతువులలోగాని, మాసములలోగాని,

సూర్యకిరణములవలనగలుగు శీతోష్ణాదుల భిన్నపరిస్థితులను బట్టి సూర్యుడు యేడువిధములుగ భావింపబడుచున్నాడని మఱికొందరు తలంచుచున్నారు. దీనికి ప్రమాణముగ "పలు తావులలో తిరుగుచు సూర్యకిరణములు ఋతువులను కలిగించుచున్నవి. దిగ్భ్రాజ ఋతూన్ కరోతి" అను వేదమంత్రము ఉదాహరింపబడినది. కాని యీమంత్రము ఉన్నదున్న సంహితలలో నాకెచ్చటను గాన్పింపలేదు. అదిగాక శాయనులవారుకూడ యీమంత్రమున్న స్థలమును సూచింపలేదు. "ఆయాశీతోష్ణాది ఋతుపరిస్థితులనుబట్టి ఆయా తావులలో పలుతెరగులగు సూర్యులున్నారని చెప్పవచ్చును" అని మాత్రము శాయనులవారు వ్రాసిరి.

౫. అయితే ఋతులక్షణములును తద్భేదములును పలు తెరగులుగనున్నవి. అట్లయినప్పుడు యెనమండ్రుగురు ఆదిత్యులేయని ఖండించి యేలచెప్పవలెను? ఈబాహ్యాంతరమునకు యీయారణ్యకమేమియు తగిన సమాధానమును చెప్పలేదు. "యీయెనిమిదిసంఖ్య వేదమందు స్థిరపడిపోయినది." (అష్టౌతువ్యవసితః) దానినిగురించి మనమేమియు నిక చర్చింపబనిలేదని నిరంకుశముగ వ్రాసివేసిరి.

౬. శతపథ బ్రాహ్మణముగూడ యిట్టిసమాధానమే చెప్పుచున్నది. ౮ గురు ఆదిత్యులలో యేడ్గురే దేవాదిత్యులట. ఎనిమిదవవాడగు మార్తాండుడు అపరిపక్వస్థితియందు పుట్టెనట. కాన, దేవతలు దీనినుండి మనుష్యులను, మృగజాతిని పుట్టించిరట.

౭. ఇంకొకచోట ఆదిత్యులు ౧౨ గురని శతపథ బ్రాహ్మణము చెప్పుచున్నది. ప్రజాపతిచే విడువబడిన ౧౨ బిందువులనుండి వీరు పుట్టిరట, వీరిని ౧౨ దిశలలోనుంచిరట.

౮. ఇంకొకచోట, యీ ౧౨ గురు ఆదిత్యులును సంవత్సరములో వచ్చు ౧౨ మాసములేయని చెప్పబడియున్నది.

౯. ఆదిత్యులు ౧౨ గురని ఉపనిషత్తులు చెప్పుచున్నవి. వేదవాఙ్మయమున కిటీవలి వాఙ్మయమం దెల్ల మొదలను ఆదిత్యుల సంఖ్య ౧౨ గనే యున్నది. ఈ ౧౨ సంఖ్య సూర్యరశ్మి గల దక్షిణభాగములందలి ౧౨ మాసములకు సరిపోవుచున్నది. పాశ్చాత్య వ్యాఖ్యాతలుగూడ యీ సంఖ్యలనుగూర్చిగాని వివిధభావములనుగూర్చిగాని సరియైన సమాధానమును చెప్పలేదు.

అదితిగాథను గూర్చియు, ఆదిత్యుల సంఖ్యను గూర్చియు వేదవాఙ్మయమందున్న అనేక చర్చలను గూర్చి యిట స్పష్టముగ వివరించితిమి. కాని దీని కీలక మెవరికిని చిక్కలేదు. అందుచే పలువురు, పలుపోకలబోయిరి. కాని దీని నిజలక్షణమును పట్టుకొన్నచో యీగాథకు సరియైన భావార్థము కుదురగలదు. అదేదనగా:- ఇటీవలి వేదవాఙ్మయమందు ౧౨గురు ఆదిత్యులును ౧౨ మాసముల కధిష్ఠానదేవతలుగ వర్ణింపబడిరను మాట నిర్వివాదము. దీనికి శతపథ బ్రాహ్మణము X. I. 6–3; 8; బృ. ఆ. ఉ. III, 9, 5— ప్రమాణములు. "సంవత్సరములో ౧౨ మాసము లున్నవి.

వీరే ౧౨ గురు ఆదిత్యులు. ఈయుగమందు ౧౨ గురు ఆదిత్యులు సంవత్సరములో ౧౨ మాసములకు అధిష్ఠానదేవత లైనప్పుడు, పూర్వయుగమందు (పూర్వాయుగం) ౭ గురు ఆదిత్యులు సంవత్సరములో ౭ మాసములకు అధిష్ఠానదేవత లని చెప్పుటలో కష్టమేమున్నది? కాని యీ యభిప్రాయ మెవరికిని తట్టలేదు. కారణమేమనగ; ఆదిత్యులు [illegible] యుండుండిరనియే వీరి భ్రమ.

ఇదిగాక ఋతు, మాస భేదములు భిన్న సూర్యుల చేతనే గలుగుచున్నవను ప్రధానాంశము [illegible] మందే ఖండితముగ గ్రహింపబడు చుంతయు సంతృప్తికరముగ నున్నది. ౭ సంఖ్య యేల వచ్చెనో యింతవరకు వ్యాఖ్యానము చెప్పక పోయినను యీ భావముమాత్రము సరియైనదే. దీనిని బల పరుచుటకు ఋ IX. 114, 3 లో, "సప్తదిశలు గలవు; ఇందు నానాసూర్యులు గలరు; ఏడ్గురు హోతృలు గలరు; వీరే యేడ్గురు ఆదిత్యులు; — ఓసోమా! నీవు మమ్ము రక్షింపుము." ఇచ్చట "నానాసూర్యాః" అనుపదము "దిశః సప్త" అనుపదమును వర్ణించు విశేషణమై యున్నది. ఏడు దిశలును, అందుండు యేడుసూర్యులును, యిచట స్పష్టముగ వివరింపబడియున్నది.

కనుక, అదితిగాథకు సరియైన భావార్థము చక్కగ కుదురుచున్నది. అదితి తనకొడుకులైన యేడ్గురు ఆదిత్యులను (సూర్యులను) ఆకాశముమీదికి తీసికొనివచ్చి దేవతలకు

అర్పించెను. దీనివలన, ఆస్థలమందు ౭ మాసముల సూర్య రశ్మియుండెను. ఆమెకు ఎనిమిదవ కుమారుడుండెను. కాని అతడు పరిపక్వస్థితియందు పుట్టలేదు. అనగ ఆస్థలమందు ౮ వ మాసము సూర్యరశ్మిగలమాసము కాదని భావము. అనగ ఆస్థలమందు దీర్ఘరాత్రి ౮ వ మాసములో ప్రారంభ మయ్యెనని భావము. ఇదంతయు జరిగినదెప్పుడు ? ఈయుగ మందుకాదు; పూర్వయుగమందు (పూర్వ్యం యుగం) ఋ X, 72-9 లోనున్న "పూర్వ్యంయుగం" అనుమాటలు చాల భావగర్భితమైనవి. ఇదేరీతిగ సూర్యుని యేడుకిరణములు, యేడుగుర్రములు, మొదలగు వర్ణనలన్నియు సులభగ్రాహ్య ముకాగలవు. ఒకభావమే యిన్నివిధములుగ వర్ణింపబడినది. ఉషస్సు యెడతెగకుండ మాసముదినము లున్నచోట సూర్య రశ్మి ౭ మాసములయందే యుండును. తక్కిన ౫ మాసము లును దీర్ఘరాత్రియే. ఏడుమాసములు సూర్యరశ్మియుండి, ౮ వ మాసమందు దీర్ఘరాత్రి ప్రవేశించుస్థలమునే (   ) యీ అదితి గాథ తెలియపరుచుచున్నది. ఇంకొకవిధమైనచో దీనికి సరియైన భావార్థము కుదురనేకుదురదు. ౮ వ సూర్యు నకు మార్తాండుడను పేరెట్లువచ్చెనో చూతము. మార్త = చచ్చిన, లేకపక్వముగాని; అండ = గ్రుడ్డు, లేకపక్షి; సూర్యుడు పక్షిగ అనేకచోట్ల ఋగ్వేదము చెప్పియున్నది. అదిగాక సూర్యుని అస్తమయామునకు "మమార" = చని పోవుట అని ఋగ్వేదము చెప్పుచున్నది. కనుక మార్తాండ=

చనిపోయినపక్షి = చనిపోయిన లేక అస్తమించిన సూర్యుడు అనిఅర్థము. కనుక యెనిమిదవసూర్యుడు చనిపోయెను అనగా ఆప్రదేశమందు సూర్యుడు యెనిమిదవమాసములో క్షితిజము క్రిందికి అస్తమించిపోయెనని భావము అనగా యెనిమిదవనెల చీకటినెల అని యర్థము. ఇట్టి విచిత్రమగు ప్రకృతిలక్షణము ప్రజలమనస్సునుండి త్వరగా మాసిపోజాలదు. కనుక ఆర్యులు తదుపరి దక్షిణదేశములకు వచ్చినను ఆపురాతన ప్రకృతి లక్షణమును వారు తమ గ్రంధములందు పూర్వయుగలక్షణముగ నిలుపుకొని యున్నారు.

ధ్రువమండలమందు 7 మాసములు సూర్యరశ్మి గల ప్రదేశములేగాక, 8, 9, 10, 11 మాసములు సూర్యరశ్మి గల ప్రదేశములుకూడగలవని పైన వివరించితిమి. అయితే వీనినిగూర్చికూడ పురాతనగాధలుగాని నిదర్శనములుగాని యేమైన వేదవాఙ్మయమందు నిలిచియున్నవా. మన అదృష్ట వశాత్తు ఇట్టి నిదర్శనములు ఋగ్వేదమందుగలవు. వాని నిక పరిశీలింతము.

(1) సూర్యుని గుర్రములు యేడు (I—50—8) అని మాత్రమేగాక పది (IX—63—9) అనికూడ ఋగ్వేదము చెప్పుచున్నది. కనుక మొదటివాక్యమునకు యేడునెలల సూర్యరశ్మి అని అర్థమైనప్పుడు రెండవదానికికూడ పది మాసములసూర్యరశ్మి యనియే అర్థము చెప్పకతప్పదు. కాని మన సిద్ధాంతమంతయు ఈఒక్క చిన్నవాక్యముపైననే ఆధార

పడవలసిన అవసరము లేదు. ఇంతకంటె బలవత్తరమైన ప్రమాణము కర్మకాండయందు మనకు దొరుకుచున్నది.

(2) ఋగ్వేదమందు పలుతావులలో పలుతెరగులగు "ప్రాచీనయాజ్ఞికులు" వర్ణింపబడిరి. వీరుమనపితరులు(నఃపితరః) అనియు,మనపురాతనపితరులు (నఃపూర్వేపితరః)అనియుఋగ్వేదము వర్ణించినది.వీరు పూర్వకాలమందు యజ్ఞముల నేర్పాటు చేసి, వానిని నడిపించుపద్ధతులను, రీతులను, నిర్మాణము చేసియుండిరి. మానవులీపద్ధతులను సదా అనుసరించుచు యజ్ఞములను చేయుచుండవలసినదని వారు నియమించిరి. అనేకులనేకపద్ధతుల నవల నేర్పరచిరి. ఈయజ్ఞవిధాననిర్మాతలలో "మనువు" ఒకడై యున్నాడు. ఋ I. 76,7 లో మనువుచే నిర్మింపబడిన యజ్ఞపద్ధతి తక్కినవారొనర్చినపద్ధతులతో పోల్చబడెను. ఈమనువే గాక యితనితోపాటు అంగిరస, యయాతి అనువారుకూడ I. 31,17 లో ప్రాచీనయాజ్ఞికులుగ చెప్పబడిరి. VIII. 43, 13 లో భృగు, అంగిరసులును, I. 80, 16 లో అథర్వణ, దధ్యంచ అనువారును, I. 139, 9 లో దధ్యంచ, అంగిరస, అత్రి, కణ్వ అనువారును చెప్పబడిరి. I. 83, 5 లో అథర్వణుడు తన యజ్ఞముచేత మార్గమును విశాలము చేసెననియు, అంతట సూర్యుడు ఉదయించెననియు చెప్పబడియున్నది. అదిగాక, X. 14, 6 లో అథర్వణులు, అంగిరసులు, నవగ్వులు, భృగులు అని బహువచనములముగ కొందరు మన పితరులు (నఃపితరః) అని ఉదా

హారింపబడిరి. ఇంకను II. 34, 12 లో దశగ్వులు స్తుతింపబడిరి. భృగులు తమ శక్తిచే దేవతలైపోయినట్లును అధర్వణుడు తన యజ్ఞములచే శాంతిని నిలిపెనని X. 92, 10 లో గలదు.

శబ్దసాదృశ్యమునుబట్టి అధర్వాణపదము "ఆత్రవాన్" (అగ్నినికాపాడుయాజ్ఞికుడు) అను పార్సీపదముతో సరిపోవుచున్నది. అంగిరసపదము "అగ్గెలాస్ - దూత" అను గ్రీకు పదముతోడను, "అంగర = దూత" అను పారసీకపదముతోడను సరిపోవుచున్నది. దీనినిబట్టి అంగిరస, అధర్వణులు ఒక్కభారతీయులకే గాక, గ్రీకు, పారసీకాది సమస్త ఆర్యజాతులకుకూడ పూర్వపితరులని యూహింపవచ్చును. దీనిని బట్టి మనకు తెలియుచున్న సారాంశమేమనగ, ఆర్యసంతతులన్నియు ఉత్తరధ్రువమండలమందున్నకాలమునందు, అధర్వణ, అంగిరసాది కుటుంబములవారు యజ్ఞములను, వానిని నడిపించుపద్ధతులను యేర్పాటుచేసియుండిరి. పిమ్మట చాల కాలమునకు ఆర్యసంతతులు ధ్రువమండలమును వదలి దక్షిణదేశములకు వచ్చి అనేకశాఖలుగ చీలిపోయిరి. వీనిలో ఒక శాఖవారు దక్షిణదేశములకు వచ్చినకొంతకాలమునకు ఋగ్వేదమును రచించిరి. అప్పటికీయజ్ఞపద్ధతులను మొదటనిర్మించిన మను, అంగిరసాదిపురాతన కుటుంబములు పితృదేవతలుగను, దేవతలుగను భావింపబడిరి. ఆర్యసంతతియందు మొట్టమొదట యజ్ఞములను యేర్పాటుచేసి నడిపించినది యీకుటుంబముల

వారేయని ఋగ్వేదమందు పలుతావులలో వర్ణింపబడిరి. కనుక వీరును మొట్టమొదట మానవులే. పిమ్మట కాలము గడచినకొలదియు, వారు దేవతలుగ భావింపబడి రన్నచో ఆశ్చర్యములేదు. ఇప్పుడు మనము పరిశీలింపవలసిన యంశమేమనగ:- మొట్టమొదట ఆర్యసంతతులన్నియు కలిసి ఉత్తరధ్రువమండలములో నున్నప్పుడు మను, అంగిరసాది యజ్ఞనిర్మాత లేర్పరచిన యజ్ఞములయొక్క కాలపరిమితిని తెలుపునిదర్శనములేమైన మనకు ఋగ్వేదమందు దొరుకునా? దొరికినచో అవి మనధ్రువసిద్ధాంతము నేమైన బలపరచునా? ఇది విచారణీయాంశము.

అంగిరసకుటుంబమువా రేర్పరచిన యజ్ఞములయొక్క కాలపరిమితినిగూర్చి వేదవాఙ్మయమందు నాకు కొంత ఆధారము దొరికినది. తక్కినమను, అధర్వాణ, భృగు మొదలగు వా రేర్పరచిన యజ్ఞకాలపరిమితినిగూర్చి యే వేదమందును నాకు ప్రమాణములు దొరకలేదు. కనుక యిప్పుడు అంగిరసులనుగూర్చి విచారింతము.

శ్రౌతసూత్రములందు "అంగిరసాం అయనం" అను వార్షికసత్రమొకటి వర్ణింపబడినది. కాని దీని కాలపరిమితి మాత్రము ఖండితముగ చెప్పబడలేదు. అయినను, యీ కాలపరిమితిని నిర్ణయించుటకు ఋగ్వేదమందే మన కితర సాధనములు గలవు. అంగిరసకుటుంబమందే రెండు ప్రధాన శాఖలు (అంగిరస్ తమ) గలవు. వారికి నవగ్వాలు,

దశగ్వులు అనిపేరు. వీరుకూడ మన పూర్వపితరులే, (నః పూర్వే పితరః) అని ఋగ్వేదము చెప్పుచున్నది. వీరు "వలా" యను అసురుని సంహరించుటలో యింద్రునకు చాల సహాయముచేసిరని వర్ణింపబడియున్నది. వీరు తమ గానముచే యింద్రునకు ప్రోత్సాహముగలిగించి, కొట్టమును, పగుల గొట్టి ఆవులను విడిపించిరట. వీరియొక్క యజ్ఞకాలపరిమితిని నిర్ణయించుటకు రెండుబుక్కులేగలవు. ఋ V, 45, 7లో — "అనూనోదత్రహస్తయతో అద్రిరార్చన్ యేన దశమాసో నవగ్వాః" నవగ్వులు పదినెలలు పాడిరి (అర్చించిరి). మరియు ఋ V, 45, 11 లో — "ధియంవో అప్సు దధిషే స్వర్షాం యయాతరన్ దశమాసో నవగ్వాః" "పదిమాసములు సాధించగల మీప్రార్థనలను నేను సిద్ధపై యుంచుచున్నాను. (అర్పించుచున్నాను.) ఈప్రార్థనలతో నవగ్వులు తమ పదినెలలను పూర్తిచేసిరి. ఇదిగాక, ఋ II, 34, 12 లో — "వారు (అనగ దశగ్వులు) అందరికంటె ముందుగ బయలుదేరిరి. వారు ఉషస్సు ప్రకాశించుసమయమందు మమ్మును గ్రహింతురుగాక". మరియు ఋ IV, 51, 4 లో "కువిత్స దేవీః సనయో నవోవా యామో బభూయా దుషసో వోఅద్య యేనానవగ్వే అంగిరే దశగ్వే సప్తాస్యే రేవతీ రేవదూష॥ "నవగ్వ అంగిరసులపైనను, సప్తాస్యులగు దశగ్వులపైనను, ఉషస్సులు విరివిగ వికసించెను." అనగ వీరి యజ్ఞములకు ఉషసోదయముతో సంబంధముగలదనియు, అవి

పదిమాసములపరిమితి గలవనియు, దీనివలన తెలియుచున్నది. వీరు తమ యజ్ఞములవలన చేసిన మహాత్కార్యములు వర్ణింపబడినవి. వీరు తమ యజ్ఞములచే కొట్టమును పగులగొట్టి ఆవులను విడిపించిరి. ఋ III. 39, 5 – "సఖాహ యత్ర సఖిభిర్నవగ్వై రభిజ్ఞ్వా సత్వభి ర్గా అనుగ్మన్। సత్యంతదింద్రో దశభిర్దశగ్వైః సూర్యం వివేద తమసి క్షియంతం॥ వీరి సహాయముతో ఇంద్రుడు ఆవులవెంట వెదకికొనుచు పోగా సూర్యు డచ్చట చీకటియందు పడియుండెను. (తమసి క్షియంతం) ఋ X. 62,2–3 లో అంగిరసులే (అనగ, నవగ్వదశగ్వులే) తమంతటతామేపోయి "వలా" ను సంహరించి, సంవత్సరాంతమందు ఆవులను విడిపించి, సూర్యుని బయటికి తీసికొని వచ్చిరి. (పరివత్సరే వలం అభిందన్.)

ఈ యంశము లన్నియు క్రోడీకరింపగ ఈ సారాంశములు తేలుచున్నవి. (౧) నవగ్వ దశగ్వులు తమ యజ్ఞములను పది నెలలలో పూర్తిచేసిరి. (౨) ఈ యజ్ఞములకును ఉషస్సోదయమునకును సంబంధము కలదు. (౩) సంవత్సరాంతమందు వలను సంహరించి ఆవులను విడిపించు పనిలో వీరు యింద్రునకు తోడ్పడిరి. (౪) ఆవులను విడిపించుకొనివచ్చుటకై యింద్రుడు పోయినస్థలమందు సూర్యుడు చీకటియందు వసించియున్నాడు.

ఈనాలుగు సారాంశములను విపులముగ పరిశీలింతము. అంగిరసులు తమ యజ్ఞములను పది నెలలలో (దశ

మాసాః) పూర్తిచేసిరి. అనగ, అర్థమేమి? పదినెలలలోనే హోమముగించిరి. ౧౦ నెల లెంకకు చేయలేదు. నవగ్వాలు ఆవులను (సూర్యకిరణములను) విడిపించుటకై ఇంద్రునకు తోడ్పడిరనియు, వారు సంవత్సరాంతమందు 'వల' ను సంహరించి సూర్యుని ఆకాశముపైకెత్తిరనియు ఋగ్వేదము చెప్పుచున్నది. ఈపని ప్రతిసంవత్సరము జరుగుచున్నయట్లు స్పష్టముమున్నది. ఇదిగాక, ఇంద్రునిచే విడిపింపబడుటకు పూర్వము సూర్యుడు చీకటిలో పడియుండెనట.— అనగ మానవులకు కనుబడకుండ క్షితిజముక్రిందికి అస్తమించి (క్రిందికి) పోయెనని భావము. ఇట్లు వలయను రాక్షసునిచే చీకటిలో బంధింపబడిన సూర్యుని విడిపించుటకై ఇంద్రుడు పోయి వలను సంహరించెను. పిమ్మట సూర్యుని విడిపించెను. ఈకార్యమందు అంగిరసులు తమ యజ్ఞముచేతను, గానములచేతను, ఇంద్రునకు తోడ్పడిరి. ఈయజ్ఞములు పదిమాసముల పొడవునను చేయబడెను. అయితే, యీయజ్ఞములు ఇంద్రునకును వలకును యుద్ధము జరుగుచున్నకాలమందు చేయబడవేమోయని కొందరు తలంపవచ్చును. కాని, యదిసరియైన యూహ కాదు. ఇదియే సరియైనయూహయైనచో చీకటి యెడతెగక పదినెల లున్నదని చెప్పవలెను. ఇది యేప్రదేశమందునుకూడ సాధ్యముకానేరదు. ఈ యజ్ఞములు యుద్ధమునకు పూర్వము సూర్యరశ్మియున్న పదినెలలయందే చేయబడెను. ఈ అంగిరసులు నివసించియున్న ప్రదేశమందు

సూర్యరశ్మి ౧౦ నెలలే యుండియున్నచో వీరు తమయజ్ఞము లను ౧౦ నెలలలోనే ముగింపవలసిన యావశ్యకత లేదు. ఈపదిమాసములైనపిమ్మట సూర్యుడు వలయనురాక్షసునిచే గొనిపోబడి 'చీకటియందు బంధింపబడెను.' కాని యీపది నెలలయజ్ఞములలో ఆంగిరసు లర్పించిన సోమరసము చేతను, హవిర్భాగముల చేతను ప్రోత్సహింపబడినవాడై, యింద్రుడు వలమీఁదికి దండెత్తిపోయి, అతని సంహరించి, సంవత్సరాంత మందు తిరిగి సూర్యుని విడిపించెను. అంతటితో మరల సూర్య రశ్మి వచ్చెను.

ఈ గాథయొక్క భావార్థ మిప్పుడు కరతలామలక మగుచు నున్నది. నవగ్వదశగ్వాది ఆంగిరసులును, తక్కిన ప్రాచీనయార్యులును నివసించినస్థలమందు సంవత్సరములో పదిమాసములు సూర్యరశ్మియుండెననియు, తక్కిన రెండు మాసములలో నెడతెగని చీకటియుండెననియుస్థిరపడుచున్నది. ఇది ఉత్తర ధ్రువమండలమందేసాధ్యమగును గానియింకొక చోట గాదు. సూర్యరశ్మియున్న యీపదిమాసములందే వారు యజ్ఞ ములఁజేయుచుండిరి. కనుక, వారి యజ్ఞములయొక్క కాల పరిమితి పదిమాసములుగనుండెను.

ఇక 'నవగ్వ' 'దశగ్వ' యను పదములయొక్క శబ్దార్థమును విచారింతము. 'గ్వ' యను పదమునకు "నవ, దశ" యను పదములు చేర్చుటచే నవగ్వ, దశగ్వ పదము లేర్పడుచున్నవి. 'నవ' అనగ "క్రొత్త" లేక "రమ్యమైన"

యనియు గ్వ = అనగ పోవుటయనియు శాయనులవారు చెప్పిరి. కనుక " నవగ్వ " అనగ రమ్యముగ పోవుచున్న వారు= రమ్యమైన జీవితముగలవారు అని శాయనులవారి అర్థము. అయితే, " దశ " అనగ పదియనియే తప్ప వేరుఅర్థము చెప్పుటకు వీలులేదు. నవగ్వ, దశగ్వ పదములు ఋగ్వేదమందెల్ల యెడలను జంటగ కలిపియే చెప్పబడుచున్నవి. ఈ రెండును విడదీసి చెప్పబడలేదు. కనుక, వీనిభావ మొకటియైయుండవలెను. కనుక, ' దశ ' పదము సంఖ్యావాచకమైనప్పుడు, ' నవ ' పదమును డ సంఖ్యావాచకమే యైయుండవలెను.

ఇక " గ్వ " అనగ అర్థమేమి ? దీనికి రెండర్థములు చెప్పబడినవి. గ్వ అనగ = ' గో ' (గోవు); లేక ' గం ' (పోవుట) అనుఅర్థములు వచ్చును. దీనినిబట్టి నవగ్వ, దశగ్వ పదములకు " తొమ్మిది గోవులగుంపు " " పదిగోవులగుంపు " అనిగాని, లేక " తొమ్మిదిగపోవు, " " పదిగపోవు " అనిగాని రెండువిధములుగ అర్థమువచ్చును. దశగ్వులు పదిమందిగలరని ఋ III. 39, 5 చెప్పుటచే రెండవ యర్థమే బలపడుచున్నది. అయినను, యీ నవగ్వ, దశగ్వపదములు యేకవచననామవాచకములను వర్ణించుటకై యేకవచనమందే విశేషణములుగ చాలచోట్ల ప్రయోగింపబడియున్నవి. అందుచే నవగ్వ, దశగ్వ లనగ తొమ్మిది, పదిమందిగలిగిన సమూహామే యని ప్రతిచోటను నిర్ధారణగ చెప్పుటకు వీలులేకున్నది. ఉదా:— అగ్నికిరణములు ' నవగ్వము ' లని చెప్పబడినవి. (VI. 6, 3.)

మరియు, "అధ్రిగు" అను నాతడు 'దశగ్వు' డని VIII. 12–2 నందును, 'దధ్యంచ' అను నాతడు 'నవగ్వు' డని IX 108–4– నందును చెప్పబడియున్నది. కనుక మన మీ సంఖ్యావాచకపదములకు ఇంకొక సరళమైన యర్థమును చెప్పకొనవలసియున్నది. అదేదనగ :- శాయనులవారు తమ ఋగ్వేదభాష్యమందు I. 62, 4 నకు వ్యాఖ్య వ్రాయుచు నిట్లు వ్రాసిరి. "ఆంగిరసులలో నవగ్వులనియు, దశగ్వులనియు రెండు తెగలు గలవు. నవగ్వులనగ సత్రమును (అనగ యజ్ఞమును) తొమ్మిది నెలలలో పూర్తిచేసి లేచువారు; దశగ్వులనగ సత్రమును (అనగ యజ్ఞమును) పదినెలలలో పూర్తిచేసి లేచువారు. [అంగిరసో ద్వివిధాః। సత్రయాగమనుతిష్ఠన్తోయే నవభిర్మాసైః సమాప్య గతా స్తే నవగ్వాః।...... 'నవగ్వా నవనీతగతయ' ఇతి యాస్కోవ్యాచఖ్యౌ। యేతు దశభిర్మాసైః సమాప్య జగ్ము స్తే దశగ్వాః] మరియు X. 62,6 కు వ్యాఖ్య వ్రాయుచు శాయనులవా రిట్లు చెప్పచున్నారు:- సత్రే మాసి నానా మాంగిరసాం మధ్యే కేచన నవసు మాస్సు కర్మకృత్వో దతిష్ఠ కేచన దశసు మాస్స్వితి। ఏవ మాంగిరసా మయన ముక్తమ్। తేషా మగ్ని ర్నవగ్వాశ్చ దశగ్వ శ్చోక్తః॥ ఋ V,45,7 11 లలో నవగ్వులును దశగ్వులును తమ సత్రములను పదినెలలలో పూర్తిచేసిరని చెప్పబడియున్నది. కనుక, యీఋక్కునుబట్టి శాయనులవారిభావము సరియైనదని స్పష్టముగ ఋజువగుచున్నది. తక్కిన వారందరు చెప్పిన

దానికంటె శాయనులవారు చెప్పినయర్థమే అంగీకార్య మైనది. అయితే మన మిట యీశంకయంశమును గుర్తించవలెను. ఋ V, 47, 7 - 11 లలో నవగ్వ దశగ్వులిరువురి విషయములోను పదిమాసముల పరిమితిగల సత్రమే చెప్పబడియున్నదిగాని, నవగ్వులకై ప్రత్యేకించి తొమ్మిది మాసముల సత్రము చెప్పబడలేదనుట నిజమే. అయినను, యీశబ్దముల యుత్పత్తినిబట్టి నవగ్వులనగ తొమ్మిదిమాసముల యజ్ఞమును చేసినవారనియు, దశగ్వులనగ పదిమాసముల యజ్ఞమును చేసినవారనియు సాహసించి చెప్పవచ్చును. ఇచ్చట సంఖ్యాభేదమేతప్ప విశేష మేమియు లేదుగాన దశగ్వులు పదిమాసములలో చేసినపనినే నవగ్వులు తొమ్మిది మాసములలో చేసిరనుటలో ప్రత్యేకమైన తాత్పర్య భేద మేమియు లేదు. సారాంశ మొక్కటియే; ప్రధానవిషయ మొక్కటే.

మన సిద్ధాంతమును, బలపరుచు నిదర్శనమింకొకటి గలదు. అంగిరసులు "విరూపు" లని ఋ III, 53-7 లో చెప్పబడినది. మరియొకచోట విరూప, అంగిరసశబ్దములు సమానార్థకములుగ ప్రయోగింపబడినవి. ఇదిగాక, ఋ X, 62, 5-6 “యే అగ్నేః పరిజజ్ఞిరే విరూపాసో దివస్పరి నవగ్వోను దశగ్వో అంగిరస్తమః సచాదేవేషు సంహతే॥ అంగిరసులు విరూపులనియు, వారు అగ్నినుండి (ఆకాశము నుండి) పుట్టిరనియు వర్ణనగలదు. మరియు వీరిలో నవగ్వదశ

గ్వులు ఉత్తములనియు (అంగిరసస్తమ,) దేవసభలో వస్నె నెక్కినవారనియు వర్ణనగలదు. ఈ ఋక్కులు రెండును మనకు చాలముఖ్యమైనవి. ఇచ్చట విరూపశబ్దము విశేషణముగ ప్రయోగింపబడినది. విరూప అనగ అనేకరూపులు గల అని అర్థము. కనుక అంగిరసులలో అనేక తెగలు (విరూపములు) గలవనియు, ఆ తెగలలో యీ నవగ్వదశగ్వ తెగలు ప్రధాన మైనవనియు (అంగిరసస్తమ) దీనివలన తెలియుచున్నది. విరూపశబ్దము క్రిందటి యధ్యాయములో కూడ రాత్రింబవళ్ళ జంటకు విశేషణముగ ప్రయోగింపబడినది. అది ఆ యధ్యాయమందు రాత్రింబవళ్ళ జంటయొక్క పలుతెరగులగు కాల పరిమితులను దెలుపుచున్నదని స్థిరపరచితిమి. ఇప్పు డిచ్చట కూడ యీ యర్థమే వివక్షితమగుచున్నది. అంగిరసులు చేయు యజ్ఞయు ౯, ౧౦ మాసములపరిమితిగలవేగాక, ఋంకను అంతకు తక్కువగాని యెక్కువగాని మాసములపరిమితి గల వనికూడ దీనినిబట్టి తెలియుచున్నది. అంగిరసులలో ౭,౮,౯, ౧౦, ౧౧ మాసములు యజ్ఞములుచేయు పలుతెరగులవారు (విరూపులు) గలరు. అయినను వీరిలో ౯, ౧౦ మాసముల యజ్ఞములుచేయు నవగ్వదశగ్వులుమాత్రము ప్రధానులు (అంగిరసస్తమః). దీనినిబలపరుచుటకు ఋX,47–6లో నొకా నొక "సప్తగ్వు"ను పేర్కొనబడియున్నాడు. ఇతనితో పాటు అంగిరసపుత్రుడగు బృహస్పతియు పేర్కొనబడెను. సప్త గ్వుపదమిచ్చట బృహస్పతిని వర్ణించువిశేషణముగా ప్రయో

గింపబడినది. మరియొకచోట బృహస్పతి సప్తాస్యుడనియు, (అధ. వే. IV, 5, 1) లో దశాస్యుడనియు వర్ణింపబడెను. ఋ IV, 51, 4 లో దశగ్వుడు సప్తాస్యుడనియుకూడ వర్ణింపబడినట్లు పైన నుదహరించియుంటిమి.

దీనినిబట్టి అంగిరసులలో చాల తెగలుగలవనియు, వారు ధ్రువమండలమందంతటను వ్యాపించియుండిరనియు ఒక్కొక్క-తెగవారు తాము నివసించియున్న ప్రదేశమందు సూర్యరశ్మి యెన్నిమాసములుండునో అన్నిమాసములలోనే తమ యజ్ఞములను పూర్తిచేయుచుండిరనియు దీనివలన విదితమగుచున్నది. ఈసిద్ధాంతముపైననే తప్ప యింకొకరీతిగ యీపదముల కన్నిటికిని యేకవాక్యతను చేకూర్చుటకు సాధ్యముకాదు. పూర్వపు యజ్ఞములు సాధారణముగ ౭ మొదలు ౧౦ మాసముల పరిమితిగలవై యుండెడివి. యజ్ఞమెన్నిమాసములు పట్టునో అందరు హోతృలుండిరి. వీరు నెలకొకరు చొప్పున యజ్ఞమును నిర్వహించుచుండిరి. సూర్యరశ్మి పూర్తిగపోయి, దీర్ఘరాత్రి ప్రవేశించుటతోడనే యజ్ఞములు సమాప్తమయ్యెడివి. ఈదీర్ఘరాత్రియందు యింద్రునకును, 'వల' కును, యుద్ధముజరుగును. ఈయుద్ధమందు యింద్రుడు 'వల' ను ఓడించి, సంవత్సరాంతమందు (పరివత్సరే) సూర్యుని విడిపించును. "పరివత్సరే"యను పదము చాలముఖ్యమైనది. ఏలయనగ దీర్ఘరాత్రి అంతమొందగనే ప్రాతసంవత్సరముకూడ సమాప్తమై క్రొత్తసంవత్సరము ప్రారంభమయ్యెడిదని భావము.

పదిమాసముల సూర్యరశ్మినిగూర్చి తెలుపు నిదర్శన మింకొకటి "దీర్ఘతమస్సు" కథలో గానవచ్చుచున్నది. అంధుడును, అశక్తుడునునై గోతిలో పడిపోయిన దీర్ఘతమస్సను నతని అశ్వినీదేవతలు రక్షించిరని యీకథయొక్క సారాంశము. ఈకథ భారతమందును, ఋగ్వేదమందును గలదు. భారతమందున్నకథ యేమనగా:- (ఆదిపర్వము 104 అధ్యా.) 'ఉతథ్యుని' వలన 'మమత' యందు "దీర్ఘతముడు" పుట్టెను. ఇతడు బృహస్పతి శాపమువలన పుట్టంధు డయ్యెను. ఐనను, ఇతడు 'ప్రద్వేషి'యను భార్యను వివాహమై ఆమెయందు పెక్కండ్రు కొడుకుల బడసెను. ఇతడు గ్రుడ్డివాడగుటచే ఇతని భార్యయు పుత్రులును విసుగుజెంది, ఇతని నొక తెప్ప మీద గూర్చుండబెట్టి గంగలో వదలివేసిరి. కొంతదూరమిట్లు కొట్టుకొనిపోగా, "బలి" యను రాజితని రక్షించి, తన యింటికి తీసికొనిపోయెను. ఆ రాజుకు సంతానము లేమిచే, ఆత డీమహాత్మునివలన తన భార్యయందు సంతతిని బడసెను. ఈసంతతియే పెక్కుదేశములకు రాజులైరి.

ఋగ్వేదమునందు గూడ యీకథయే కొద్దిమార్పులతో గలదు. దీర్ఘతముడు మామతేయుడనియు, ఉతథ్యుడనియు గలదు. (అనగ ఉతథ్యునివలన మమతయందు పుట్టెనని యర్థము.) దీర్ఘతముడు "దాసత్రైతన" వలన అగ్నియందును నీటియందును ముంచబడి బాధపడుచు, తన్ను రక్షింప వలసినదని అశ్వినిదేవతలను వేడికొనెను. అంతట అగ్ని వచ్చి

దీర్ఘతమునకు నేత్రదృష్టి నిచ్చెను. (ఒక దేవత చేసినపని యింకొక దేవత కంటగట్టుట ఋగ్వేదమునందు సహజమే). అనగ, అశ్వినీదేవతలు దీర్ఘతముని రక్షించిరని అర్థము. ఈ కథయంతయు ఋగ్వేదము మొదటి మండలమందు ౨౧౧ సూక్తములలో వర్ణింపబడినది. ఈరీతిగ, అశ్వినులచే ఒక్క దీర్ఘతముడేగాక చ్యవనుడు, వందనుడు మొదలగువారి... కులు రక్షింపబడిరి; ఆరోగ్యవంతులుగ జేయబడిరి. ఈ ... కథ లకిని తాత్పర్యమేమి? శీతకాలమందు చిక్కిపోయిన సూర్యుడు తిరిగి తేజోవంతుడగుటయే యీకథలయొక్క భావార్థమని పండితులు తలంచుచున్నారు. కాని యీగాథలలో కొన్ని చోట్ల "చీకటిలో పడియున్న సూర్యునివలె" అను వర్ణనలు గలవు. కనుక, యీకథలలో శీతకాలమందు ... తేజస్సు తగ్గిన సూర్యుడే యుద్దేశింపబడినాడని చెప్పజాలము. ఇచ్చట కేవలము చీకటిలో నివసించియున్న — అనగా, దీర్ఘకాలము క్షితిజముక్రిందికి గ్రుంకిపోయిన — సూర్యుడు ఉద్దేశింపబడినాడనుట స్పష్టము. ఈకథ యింకను పరిశీలింతముగాక.

ఋ I, 158, 6 [దీర్ఘతమా మామతేయో జుజుర్వాన్ దశమే యుగే అపామర్థం యతీనాం బ్రహ్మా భవతి సారథిః.] యిట్లు చెప్పబడినది. "మామతేయుడగు దీర్ఘతముడు పదియవ యుగమందు ముసలివాడై, తనగమ్యస్థానమునకు పోవుచున్న నీళ్ళకు బ్రాహ్మణసారథియయ్యెను." "పదియవయుగ" మనగనేమి? "తనగమ్యస్థానమునకు పోవుచున్ననీళ్ల" అనగ

అర్థమేమి ? ఈ రెండు వాక్యములపైనను పండితులు చాల వివాదపడిరి. తక్కిన కథయంతయు బహుసులభముగనే యున్నది. "పదియవయుగ" మనుమాటలోనున్న "యుగ" మనుపదమువిషయమై పలువురు పలుతెరగులుగ అర్థము చెప్పుచున్నారు.

౧. యుగమనగ:- (వేదాంగజ్యోతిషము ననుసరించి) ఐదేండ్లని కొందరర్థము చెప్పిరి. దీనినిబట్టి దీర్ఘతముడు తన ౫౦ వ యేట ఆశక్తుడయ్యెనని భావింపవలెను.

౨. పాశ్చాత్య పండితులు యుగమనగ మనుష్య సంతతియని అర్థము చెప్పుచున్నారు. యుగ మనుపదము ఋగ్వేదమందు కాలవాచకము కానేకాదని వారి గట్టిమతము.

3. సాయనాచార్యులవారు మహీధరుడు మొదలగు పండితులీయుగపదమునకు కాలవాచకమగు నర్థమేగాక, "సంయోగము" లేక "జంట" యను అర్థములనుకూడ చెప్పియుండిరి. కనుక దీనినిబట్టి "యుగ" మను శబ్దమునకు మూడర్థములను చెప్పవచ్చును. (ఒకటి) రాత్రింబవళ్ళ జంట యనిగాని, (రెండు) రెండు నెలలజంట — ఋతువు — అనిగాని, (మూడు) రెండు పక్షములజంట (మాసము) లేక సూర్యచంద్ర సంగమమునని యర్థము చేసికొనవచ్చును.

కనుక, పాశ్చాత్యులనుబట్టి చూడగ యీ కథయందున్న యుగశబ్దమునకుగాని, ఋగ్వేదమందునవచ్చు "మానుష" యు

గాని ” అనుశబ్దములకుగాని భావార్థము స్పష్టపడుటలేదు. కనుక మన మింకొకమార్గము నారయవలసియున్నది.

ఋగ్వేదమందు “ యుగే యుగే ” యను పదము ౹౩, ౩ స్థలములందు ప్రయోగింపబడియున్నది. ఈ స్థలములలో శాయనులవారు ‘ కాలపరిమితి ’ యనునర్థమునే చెప్పియుండిరి. మరికొన్నిచోట్ల “ ఉత్తరయుగాని ” (యుటీవలికాలములు;) “ ఉత్తరేయుగే ” (యుటీవలికాలమందు) అను పదములు కలవు. తరువాత “ దేవానాం పూర్వ్యే యుగే ” “ దేవానాం ప్రథమే యుగే” అనుపదములు దేవతల ప్రాచీన కాలములను తదుపరికాలములను యుపునర్థమందే ప్రయోగింపబడినవి. ఇచ్చట “ దేవానాం ” అనుపదము బహువచనము; యుగపదము యేకవచనము కనుక యీ పదమునకు “ దేవతలసంతతులు ” అని అర్థముచెప్పుటకు వీలుపడదు. ప్రాచీనకాలమందు దేవతలయొక్క సృష్టిని (ఉత్పత్తిని) గూర్చి యిట వివరింపబడుచున్నది. కనుక పూర్వోత్తరసందర్భమును బట్టికూడ యీపదము కాలవాచకమే యని స్పష్టపడుచున్నది. “ దేవానాం యుగం ” అనుపదమునకు “ దేవతలయొక్కకాలము ” అని అర్థమైనచో “ మనుష్యా యుగాని ” “ మనుష్యా యుగా ” అనుపదములకు “ మానవులయొక్క కాలము ” అనియేల అర్థముచెప్పకూడదో యూహింపజాలకున్నాను. “మానుషా యుగా”యనుపదనమునకు కాలవాచకముగతప్ప మరి యింకొకవిధముగ అర్థముచెప్పుటకుఅసలు వీలే

లేని ఋక్కులు రెండు ఋగ్వేదమందు గలవు. ఉదాహరణము:— ఋ V,52, 4లో "విశ్వేయే మానుషాయుగా పాంతిమర్త్యం రిషః"— అర్థము— [పాంతి=రక్షించు (క్రియాపదము); విశ్వేయే=వారందరు (ప్రథమావిభక్తి కర్త); మర్త్యం=మనుష్యుని (కర్మ); రిషః=కష్టమునుండి (పంచమి); మానుషా యుగా= దీని యర్థమును ప్రస్తుతము వదలివేయుదము] 'మానుషాయుగా' అను పదమును ప్రస్తుతము వదలివేసి చూచినచో యింతవరకు తేలినయర్థమేమనగ:— "మనుష్యుని కష్టమునుండి రక్షించు వారందరు ......" అయితే, యిప్పుడు "మానుషాయుగా" అన అర్థమేమి? దీనిని పై వాక్యముతో అతుకుట యెట్లు? దీనికి "మనుష్యసంతతులను" అని అర్థము చేసినచో, అత్యుక్తిదోషము సంభవించును. యేలననగ:— పాంతి (రక్షించు) అను క్రియకు "మనుష్యుని"— అనుకర్మ యిదివరకే యున్నది; కనుక "మనుష్య సంతతులను" అను యింకొక కర్మ నిష్ప్రయోజనమగును. ఒకవేళ రెండు కర్మలున్నవని యంగీకరించినను, వాటిని కలుపుటకు "చ"— వంటి సముచ్చయపద మేదియు నిట గానరాదు. అందుచే యీయర్థ మిచ్చుట అతకదు. (అయినను మాక్సుముల్లరు పండితుడీయర్థమునే పట్టుకొని వ్రేలాడుచున్నాడు) కనుక, 'మానుషాయుగా' అను పదమునకు కాలసూచకమైన అర్థమునే చెప్పవలెను. అట్లయినచో యీఋక్కునకువచ్చు అర్థమేమనగ:— "మానవయుగము (కాలము) లందు మనుష్యుని కష్టముల

నుండి రక్షించు వా రందరు— (అనగ మరుత్తు లను దేవతలు— అని పూర్వోత్తర సందర్భము). ఈ యర్థమిచ్చుట చక్కఁగ అతుకుచున్నది. ఇంతకంటె సహేతుకమైనట్టియు, సరళమైనట్టియు అర్థ మింకొకటి గానరాదు. గ్రిఫిత్ పండితుఁడును యీ యర్థమునే యంగీకరించెను.

II. ఇంకొక వాక్యమును విమర్శింతము:—

ఋతావానమ్ (ఋజుమార్గుడును) (1) మహిషం (బలిష్ఠుడును) (2) విశ్వదర్శతం (అందరికి కనుపడువాడును) (3)

అగ్నిమ్ (అగ్నిని) (కర్మ) సుమ్నాయ (శ్రేయస్సుకొరకు) దధిరే (ఉంచుకొనిరి) (క్రియ) పురో (యెదుట) జనాః (జనులు) (కర్త)

శ్రుత్ — కర్ణం (శ్రద్ధగమైన చెవులుగల) (4) సప్రథస్ — తమమ్ (విశాలతమమైన) (5)

త్వా (నిన్ను) గిరా (స్తోత్రములతో) దైవ్యం (దేవతాసంబంధమైన) (6) మానుషాయుగా (?)

(1) మొదలు (6) వరకుగల పదములు అగ్నిని వర్ణించు విశేషణములై యున్నవి. " మానుషాయుగా " అను చివరిపదమును వదలివేసినచో తేలు అర్థమేమనగ:—"పూర్వోక్తగుణములుగల అగ్నిని ప్రజలు తమ శ్రేయస్సుకొరకై తమయెదుట స్తోత్రములతో నుంచుకొనిరి. " అయితే మానుషాయుగా అనుపదము నిప్పుడెట్లుతుకవలెను ? దీనికి గాల

సూచకార్థమును చెప్పినచో పై వాక్యముతో చక్కగ అతుకును. ఎట్లనగ:- "పూర్వోక్తగుణములుగల అగ్నిని ప్రజలు మానవయుగము (కాలము) లందు తమ శ్రేయస్సు కొరకై స్తోత్రపాఠములతో తమ యెదుటనుంచుకొనిరి."

కాని, గ్రిఫిత్ పండితు డీయర్థమును చెప్పక, "మానవ సంతతులను" అని చెప్పెను. అందుచే అసలు ఋక్కులో లేని క్రొత్తక్రియాపదము నొకదానిని అప్పుతెచ్చుకొనవలసి వచ్చెను. "మానవసంతతులు అగ్నిని స్తోత్రపాఠములతో గొప్పవానిని జేయుచున్నారు". ఇచ్చట "గొప్పవానిని చేయుచున్నారు" అను క్రియాపదము ఋక్కులో లేనే లేదు. అసలు నిజార్థమును తెలిసికొనక, యేదోవిధముగ అతుకులు పెట్టదలచినచో మేటిపండితులైనను యెన్నితికమకలు పడ వలసివచ్చునో దీనినిబట్టి స్పష్టమగుచున్నది.

ఈ ఋక్కే వాజసనేయసంహితయందుకూడ గలదు. అచ్చట మహీధరుడుకూడ యీ యర్థమునే చెప్పెను. "మానుషా యుగా" యను పదము "జనాః" "మర్త్యాః" అను పదములతో కలిసియుండి, యచ్చట యుగమునకు ఖండితముగ కాలసూచకార్థమునే తప్ప యింకొక యర్థము నసలు చెప్పుటకు వీలే లేని స్థలములు ఋగ్వేదమం దిరెండే గలవు. ఒకసారి, ఒకానొక పదమునకు ఖండితమైన యర్థ మును నిర్ణయించిన పిమ్మట, పూర్వోత్తరసందర్భములకు భంగము లేనిచో, ఆ యర్థమే యితరస్థలములందుకూడ అంగీక

రింపదగియున్నది. యాస్కాచార్యులవంటి భాష్యకారులు వేద వాక్యముల కర్థము చెప్పుటలో యీమార్గమునే యవలంబిం చిరి. కనుక, మన మిప్పు డిచ్చుట వింతమార్గమును క్రొత్తక్కును లేదు. "మానుషాయుగా" అనగ "మానవయుగములు లేక కాలములు" అని యర్థము చెప్పితిని. అయితే 'యుగమనగ నెంతకాలమో మన మిప్పుడు నిశ్చితముగ నిర్ణయింపవలసి యున్నది. అథర్వణవేదము VIII. 2,21 ని బట్టి యుగమనగ పదివేల సంవత్సరములకు తక్కువగాని కాలమని తెలియు చున్నది. కాని, బహుప్రాచీనమగు ఋగ్వేదమందు 'యుగ' పదమంతకంటె చాలతక్కువకాలమును సూచించునని చెప్పు టకు దృఢమైనయాధారములు గలవు. ఋగ్వేదమందు "ప్రథమా" (మొదటి) ఉషస్సునుగూర్చియు "ఆయతీ నాం ప్రథమా" (రాబోవువానిలో మొదటి) ఉషస్సును గూర్చియు, "అవమా" (చిట్టచివరి) ఉషస్సునుగూర్చియు పలుతావులలో పేర్కొనబడెను. ఉషస్సనకు "మొదటి దినము తెలియున" ని మరియొకచోట పేర్కొనబడెను. "ప్రథమ ఉషస్సు" అన్నప్పుడు "సంవత్సరములో వచ్చు మొదటి ఉషస్సు" లేక "సంవత్సరముయొక్క మొదటినాడు వచ్చు ఉషస్సు" అని అర్థము చెప్పినచో భావము చక్కగ బోధపడును. అట్లయినప్పుడే 'ప్రథమ' యనుపదము సార్థక మగునుగాని యింకొకవిధమైనచో కాజాలదు. దీనికిసాదృశ్యముగ బ్రాహ్మణములలో ప్రయోగింపబడిన "ప్రథమారాత్రి"

యను పదమును చూడవచ్చును. కనుక, "ప్రథమా" "అవమా" ఉషస్సు లాకాశమందు సంవత్సరముయొక్క ఆద్యంతములను దెలుపునవిగ నున్నవి. వైదికఉషస్సులను గూర్చి 9 వ. అధ్యాయమందు చేసినవివరణమునుబట్టి విచారింపగ మన మిట్లని నిశ్చయింపవచ్చును. దీర్ఘరాత్రి యంత మొందగనే ఉషస్సులు ప్రారంభమగును. ఈ యుషస్సులతో నూతన సంవత్సరము ప్రారంభమగును. ఇట్లు నూతన సంవత్సరమును ప్రారంభించు ఉషస్సమూహములోనిదైన మొదటి ఉషస్సే యీరీతిగ ఋగ్వేదమందు "ప్రథమా" ఉషస్సని వర్ణింపబడినది.

ఋ I, 124, 2; I, 92, 11- లలో యీ ప్రథమ యుషస్సు "మానుషయుగముల నడిపించుచున్నది" (ప్రమినతీ మనుష్యా యుగాని) అని యున్నది. మరియు I, 115, 2 లో- "ఉషస్సు కనిపించగనే సత్పురుషులు యుగములను విస్తరింతురు, అనగ విప్పుదురు." (యత్రా నరో దేవయంతో యుగాని వితన్వతే). ఈ రెంటిలో మొదటి వాక్యమందు "మానుషా యుగాని" పదములోనున్న 'యుగ' శబ్దమునకు కాలవాచకమైన యర్థమే చెప్పితీరవలెనని స్పష్టముగ గాన్పించుచున్నది. ఈ ప్రథమయుషస్సు వచ్చి దివ్యవ్రతములను (దైవ్యాని వ్రతాని) ప్రారంభించుచున్నదనియు, మానుష యుగములను నడిపించుచున్నదనియు, యీ వాక్యమందు వర్ణింపబడియున్నది. అనగ, యీ మొదటి యుషస్సుతో

యజ్ఞయాగాది కర్మలును, "మానుషయుగము" లను పేరు గల కాలభాగముల నడకయు ప్రారంభమయ్యెనని తాత్పర్యము. అనగ, మానుషయుగముల లెక్క యీ యుషస్సుతోఁ బ్రారంభమయ్యెనని భావము. ఈ రీతిగ, మానుషయుగములకును, ప్రథమ యుషస్సునకును యెడబాయకుండ నేర్పడిన బంధమునుబట్టి "మానుష యుగము" యొక్క కాలపరిమితిని మన మిప్పుడు బహుసులభముగ నిశ్చయింపవచ్చును. ఈ మానుష యుగములు సంవత్సరముయొక్క "పూర్వా" యుషస్సుతోఁ బ్రారంభమైనచో నది సంవత్సరముయొక్క "అవమా" యుషస్సుతో నంతమొందవలెను. కనుక, మొత్తముపై మానుష యుగములన్నియుఁ గలసి సంవత్సరములో మొదటి యుషస్సునకును, చిట్టచివరి యుషస్సునకును మధ్యనున్న కాలపరిమాణమును దెలుపుచున్నవి. కనుక, ఒక్క మానుష యుగముయొక్క పరిమితి యీ సంవత్సర కాలపరిమాణముకంటె తక్కువయని నిశ్చయమగుచున్నది.

దీర్ఘతముని గాథ నటుంచి, మనమిప్పుడు ఋగ్వేద ప్రమాణములనుబట్టి రెండు ముఖ్యసారాంశములను చెప్పితిమి. (౧) "మానుషయుగములు" అనగ సంవత్సరములో మొదటి యుషస్సునకును చిట్టచివరి యుషస్సునకును మధ్యనున్న మొత్తపు కాలపరిమాణమేగాని, "మానవసంతతులు" అనిపాశ్చాత్యులు చెప్పిన అర్థముకాదు. (౨) "యుగ" మను పదము సంవత్సరమునకంటె తక్కువ కాలమానమును దెల్పుచున్నది.

ఈ రెండు సారాంశములనుబట్టి చూచినచో, దీర్ఘతముని గాథయందున్న, "దీర్ఘతముడు పదియవ యుగమందు ముసలివాడయ్యె" నను వాక్యమునకు అర్థము కరతలామలక మగుచునే యున్నది. ఈ గాథలో నున్న "యుగ" శబ్దమును "మానుషాయుగ" లోనున్న, 'యుగ' శబ్దమును ఒకటేయైనచో, "దీర్ఘతముడు పదియవ నెలయందు ముసలివాడయ్యె"నని పై వాక్యమున కర్థమగుచున్నది. ఈగాథ సారగాథయైనచో దీని భావ మేమనగ:- "సూర్యుడు (దీర్ఘతముడు) పదియవ నెలయందు ముసలివా డయ్యెను". ప్రపన్నమా, అనవా ఉషస్సులమధ్య (అనగ, సంవత్సరము యొక్క ఆద్యంతములకు నడుమ) పదియుగములు గలవని దీనివలన తెలియుచున్నది. కనుక యిచ్చట యుగమనగ నెల యనియే అర్థము చెప్పవలెను. ఏలననగ:- సంవత్సరాద్యంత ములకు నడుమ పదిరోజులు గలవన్నను, పదిపక్షములు గల వన్నను సంవత్సర కాలపరిమితి కిది బహు తక్కువగును— చాలదు. పోనీ, పదిఋతువులన్నచో సంవత్సరమునకు మించి పోవును. కనుక, యుగమనగ నెలయనియే అర్థము చెప్పితీర వలెను; వేరే యర్థము చెప్పుటకు వీలులేదు. వేయేల, దీర్ఘతముడనగ పదియవమాసమందు ముసలివాడై పోయిన సూర్యుడే. అతడు నీటిప్రవాహముపై, స్వారిచేయుచుపోయి, క్షితిజముక్రిందనున్న సముద్రములోపడిపోయెను.(VII. 49,2) ఈనీటికి అర్థమేమి? వరుణుని పరిపాలనక్రిందనున్న జలమే

యీనీరు. వరుణుని ఆజ్ఞచే యీజలము ప్రవహించెను. ఈ నీటియందు సూర్యుని ప్రయాణమునకై వరుణు డొక కాలువను త్రవ్వించెనట (VII. 49, 1–4; II. 28,4; VII. 87,11) ఇంద్రుడు వృత్రాసురుని సంహరించి సూర్యుని విడిపించగనే, యీకాలువలోనున్న నీటిప్రవాహమునంబడి సూర్యుడు పైకి కొట్టుకొని వచ్చునట. (I, 51, 4) ఈ నీటినిగూర్చి యింకొక అధ్యాయములో ముందు చర్చించెదము. ప్రస్తుతము మనము గ్రహించవలసినదేమనగ:— క్షితిజము క్రిందనున్న సముద్రములోనుండి పైకివచ్చి, పదిమాసములు మానవులకు సూర్యరశ్మినిచ్చి, తదుపరి రెండుమాసములు మరల సముద్రములో గ్రుంకిపోవు ఉత్తర ధ్రువమండల సూర్యుడే దీర్ఘతముడు పదిమాసములలో తమయజ్ఞములను ముగించు దశగ్వుల చరిత్రముతో యీగాథ సర్వవిధముల తూచినట్లు సరిపోవుచున్నది.

‘యుగ’ శబ్దమునుగూర్చి నేనిచ్చట యింతవిపులముగ చర్చించియుంటిని. కారణమేమనగ:– పాశ్చాత్య పండితులును తదితరులును దీని విషయమై చాలయపార్థములను గల్పించి, నిజార్థమును మరుగుపరచిరి. ఈచర్చవలన ‘యుగ’ శబ్దమునకు మాసమను అర్థమే అతిప్రాచీనమగు ఋగ్వేదమందు ఉద్దేశింపబడినట్లు నిశ్చయమగుచున్నది. ఈయర్థమునే చెన్నపురి నివాసులగు రంగాచార్య పండితులవారుకూడ తదితర ప్రమాణములవలన నిశ్చయించియున్నారు. వారు ‘యుగ’ శబ్దమునకు

సంగమము లేక సంయోగము అను అర్థమును తీసికొని యిట్లు వ్రాసియున్నారు. " చంద్రుని కళలను గుర్తించుట బహు సులభము. ఈచాంద్రకళలు జ్యోతిర్గోళముల సంయోగమును (యుగమును) బట్టియే కలుగుచున్నవగుటచే యుగ శబ్దమునకు ప్రప్రథమమున కాలమానవాచకమైన అర్థమేర్పడియుండవచ్చునని వీబరు పండితుడు తలంచుచున్నాడు" ...... పిమ్మట, రంగాచార్యులవారు సూర్యేందుసంగమమునకు (అమావాస్యకు) ప్రాచీనపదమగు "దర్శ" యను పేరునుకూడ నుదాహరించి యిట్లువ్రాయుచున్నారు. "ఈ సూర్యేందు సంగమమునేగాక, మనపూర్వులు తదితరములగు జ్యోతిర్గోళసంయోగములనేకములను చూచియున్నట్లనేక నిదర్శనములు గలవు. అయినను, వీనియన్నిటిలోను ముఖ్యముగ (అందరికిని సులభముగ గన్పట్టు) యీసూర్యేందుసంగమమునుండియే మొట్టమొదట 'యుగ' శబ్దమునకు కాలమానవాచకమైన యర్థమేర్పడియుండును. అనగ, అమావాస్యకును, మరియొక అమావాస్యకును గల మధ్యకాలమునకే "యుగ" మనిపేరు మొట్టమొదట వచ్చియుండవచ్చును. దీనినిబట్టి యుగశబ్దమునకు మొట్టమొదటియర్థము చాంద్రమాసమనియే యేర్పడుచున్నది.

ఇదిగాక "మానుష యుగముల చక్రమును నడిపించునది 'ప్రథమా' యుష"స్సని చెప్పువాక్యమును పైనుదహరించియుంటిమి. ఈవాక్యమును ఋ X, 139, 6 శ్లో పోల్చి

చూడుడు. ఇంద్రుడు వృత్రాసురుని సంహరించి, ఉషస్సును, సూర్యుని, పైకితెచ్చి ఆకాశమందు " మాసముల నడకను యేర్పాటుచేసెను " అని యీ ఋక్కునందుగలదు. ఈరెండు వాక్యములనుబట్టి చూచినను, మొదటియుషస్సుతో ప్రారంభమైన కాలమానచక్రము మాసచక్రముగనే స్పష్టమగుచున్నది. కనుక " మానుషాయుగా " యనగ పూర్వకాలమందు ఉత్తరధ్రువమువద్ద సూర్యరశ్మియున్న మాసములు— అని యర్థమేర్పడుచున్నది. ఈమానుష యుగములందే (అనగా సూర్యరశ్మియున్న మాసములందే) ఆర్యులు యజ్ఞయాగాది క్రతువులను చేయుచుండిరి.

ఈయర్థమునే స్థిరపరచువాక్యము లనేకములు ఋగ్వేదమందుగలవు. కాని, యీయస్పష్టత పాశ్చాత్య పండితులు " మానుషాయుగా " యనుపదమునకు " మానవ సంతతులు, లేక తెగలు" అను అర్థము చెప్పుటచే నది యెవరికిని బోధపడియుండలేదు. ఉదాహరణము:— ఋ VIII, 46, 12- " అందరును తమ (సోమరసపు) గిన్నెల నెత్తి మానుష యుగములందు యింద్రుని ఆహ్వానింతురు." ఈవాక్యమునకు గ్రిఫిత్ గారు చెప్పిన అర్థమేమనగ:— " మానవజాతుల వారందరును యింద్రుని ఆహ్వానింతురు." కాని యీయర్థము పూర్వోత్తరసందర్భములతో సంతృప్తికరముగ సరిపడుటలేదు. ఇంకొక యుదాహరణ:—(ఋ II. 2,2) లో "ఋగ్మ్య' మానుష యుగా' యందును, 'క్షపః' యనుపదమును "పగలును" [illegible].

'క్షపః' — "యెడతెగనిరాత్రులు". ఈవాక్యమున కర్థమేమనగ, "ఓ అగ్ని! నీవు మానుషయుగములందును, అఖండరాత్రులందును వెలుంగుచున్నావు. ఇచ్చట "మానుషయుగ," "క్షపః" అను పదములు రెండును జంటగ ప్రయోగింపబడినవి. ఇది అత్యవసరమైన విషయమే. ఏలననగ:— అగ్ని సంవత్సరము పొడవునను వెలుగుచునే యుండును. కాని "మానుష యుగ" యను శబ్దమందు దీర్ఘదివసమును, రాత్రింబవళ్ళతో కూడిన కొన్నిదినములును మాత్రమే యిమిడియున్నవి, గాని, సంవత్సరమంతయు పూర్తిగ యిమిడియుండలేదు — అనగ దీర్ఘరాత్రి యిమిడియుండలేదు. కనుక యీ "మానుష యుగా"కు దీర్ఘరాత్రిని (క్షపః) కూడ కలిపిననేగాని సౌర సంవత్సరము పూర్తి కానేరదు. కనుక ఋ II. 2, 2 లో సౌరసంవత్సరమును పూర్తిగ చెప్పవలసి వచ్చినప్పుడు, "మానుషయుగా" + "క్షపః" యను పదముల రెంటిని జంటగ చేర్చవలసిన తప్పదయ్యెను.

"క్షపః" అనగ యెడతెగని, లేక అఖండరాత్రులని (Continuous nights) మాక్సుముల్లరు పండితుడు సరియైన యర్థమునే చెప్పెను. కాని, దానిలోని సంపూర్ణ భావమును గ్రహింపజాలక పోయెను. "ఓ యగ్ని! నీవు యెడతెగనిరాత్రులందు మానవజాతులమీద వెలుగుచున్నావు" అని పాశ్చాత్యపండితులు అర్థము చెప్పుచున్నారు. మానవజాతులమీద వెలుంగుచున్నావనగ అర్థ

మేమో సుబోధకముగ లేదు. ఉషః = అనగ ఎడతెగని రాత్రి లేదైనచో ఉత్తరధ్రువమండలమందుండు "దీర్ఘరాత్రి" యే తప్ప వేరొండు లేదు. కనుక యీదీర్ఘరాత్రిపోగా మిగిలిన సౌరసంవత్సర భాగమే యీ "మానుషయుగా" లేల కాకూడదు? ఈ ఉషః శబ్దము మానుషయుగా శబ్దముతో జంటగ కలిపియే చెప్పబడియున్నది. కనుక, దీని భావ మొకటియే యైయుండక తప్పదు.

ఋ IV. 16, 19 — కి కూడ పండితులు విట్టి యపార్థములనే కల్పించిరి. "ఉషః మదేమ శరదశ్చపూర్వీః" — "మేమనేక ఋతువులందును, రాత్రులందును, సంతోషింతుముగాక." ఇచ్చట "ఋతువులు, రాత్రులు," అనునవి ద్వంద్వసమాసముగ ప్రయోగింపబడినది. కాని "ఋతువు" లంటే 'రాత్రులు' కూడ యిమిడియున్నవని పాశ్చాత్యపండితులు తలంచుటచే వారీ రెండుపదములను విడదీసి రెండుక్రియల కంటగట్టిరి. అందుచే యీ రెండుపదములను గలుపు "చ" యను ప్రత్యయము నిష్ప్రయోజనమగుచున్నది. కాని, యీ రెంటిని కలిపి యర్థము చెప్పినచో, "మేము దీర్ఘరాత్రి (ఉషః) తోడను, ఋతువులతోడను కలిసియున్న సంవత్సరము నందంతటను సంతోషించుచుందుముగాక." అని సరళమైన అర్థమేర్పడగలదు. ఈపండితులకు ఉత్తరధ్రువసిద్ధాంతము తెలియకపోవుటచే, ఋతువులందును, యుగములందును "రాత్రి" లిమిడియేయున్నవని వారపోహపడియుండిరి. "మానుషయుగములందును, 'ఋతువు' లందును 'దీర్ఘ

రాత్రి' యిమిడియుండ లేదను ఉత్తరధ్రువలక్షణము పాపమా పండితులకు తెలియదు.

సారాంశమేమనగ:— "మానుషయుగా" యనుపదములో "క్షపః" యను పదమును జంటగ చేర్చుటచే, "మానుషయుగా" కు "సూర్యరశ్మియున్న నెలలు" అను నర్థము మరింతబలపడుచున్నది.

దీర్ఘతమునిగాథనుండియు, దశగ్వుల చరిత్రమునుండియు తేలిన సారాంశమే వేదములందు ఉదాహరింపబడిన ఋతువుల సంఖ్యనుబట్టికూడ నిర్ధారణమగుచున్నది. పది మాసముల సూర్యరశ్మియున్నప్పుడు రెండుమాసముల దీర్ఘరాత్రియుండును. కనుక సంవత్సరములో 5 × 2=10 మాసములుపగిదిమీఁద గల ఐదు ఋతువులుండును. తక్కిన రెండు నెలలో సూర్యుడు క్షితిజము క్రింద సముద్రములో మునిగి యుండును. సరిగ యీ వర్ణనయే ఋ I. 164,12 లో కలదు. పంచపాదం పితరం ద్వాదశాకృతిం దివ ఆహుః పరే అర్ధే పురీషిణమ్। అథేమే అన్య ఉపరే విచక్షణం సప్తచక్రే షడర ఆహు రర్పితమ్॥ ఇట్టి వాక్యములే అథర్వవేదమందును, ప్రశ్నోపనిషత్తునందును కూడ గలవు. దీని యర్థమేమనగ:- "ద్వాదశాకృతియు, పంచపాదుడునైన పితరుడు ఆకాశముయొక్క క్రిందిభాగమందు (పరే అర్ధే) నీటియావిరిచే (పురీషిణం) నిండియున్నా" డని కొందరు చెప్పినారు. విచక్షణుడైన పితరుడు ఆకాశము

యొక్క పైభాగమందు (ఉపరి అర్థి) షడరములతో (ఆరు ఆకులతో) నొప్పుచున్న సప్తచక్ర (రథము) పైనున్నాడని మరికొందరు చెప్పుదురు." ఇచ్చట పూర్వోత్తరసందర్భము లనుబట్టి పితరుడనగ ౧౨ మాసములతో నొప్పుచున్న సంవత్సరదేవతయని యర్థము. ఈ సంవత్సరము విషయమై పై ఋక్కునందు రెండు తెగలవారి భిన్నాభిప్రాయములు పేర్కొనబడినవి.

కొందరు సంవత్సరదేవత "పంచపాదు" డని చెప్పు చున్నారు. అనగ సంవత్సరము ౫ ఋతువులుగ విభాగింపబడిన దని వీరి మతము. మరికొందరు సంవత్సరదేవతకు షడరములు (ఆరు ఆకులు) గల రథము గలదని చెప్పుచున్నారు. అనగ సంవత్సరము ౬ ఋతువులుగ విభాగింపబడినదని యీ రెండవ తెగవారి మతము. పూర్వకాలము నుండి యభిప్రాయ భేద మేల కలిగెను ?

ఋగ్వేదమందు కొన్నిచోట్ల ౫ ఋతువులే పేర్కొన బడియున్నమాట వాస్తవము. దీనినేదో విధముగ సమన్వయింప చుటకై ఐతరేయబ్రాహ్మణతైత్తిరీయ సంహితలు ప్రయత్నించినవి. ఈ గ్రంథములు హేమంతశిశిరఋతువుల రెంటిని కలిపి ఒకే ఋతువుక్రింద లెక్కవేసెను. కాని, శతపథ బ్రాహ్మణముమాత్రము వర్షశరదృతువుల రెంటిని కలిపి ఒకే ఋతువుక్రింద లెక్కవేసెను. అట్లయినచో, ఎవరియిష్టము వచ్చినట్లు వారుయేవో రెండు ఋతువులను కలిపి ఒకటిగ

చేసిన చాలునాయేమి? కనుక యీ పద్ధతి బొత్తుగపనికి రాదు. సంవత్సరములో 6 ఋతువులుగలవను ఋగ్వేద వాక్యమును సమన్వయించుటకు మన మింకొకపద్ధతి నవలంబింపవలెను.

ఈ ఋక్కునందు ప్రథమభాగములో నేమిచెప్పిరనగ:—పంచపాదుడైన పితరుడు ఆకాశముయొక్క "పరే అర్ధ" మందు నీటిలోమునిగియున్నాడు. (పురీషణం) రెండవ భాగములో నేమిచెప్పిరనగ:—ఆరు ఆకులరధముతోకూడిన సంవత్సరము "విచక్షణ" మైనది. పురీషణ, విచక్షణ పదములు ఒకదానికొకటి ప్రతిరూపములుగ గన్పట్టుచున్నవి. ఈ యంశమే తరువాత రెండు ఋక్కులలో స్పష్టపరుప బడినది. పంచారేచక్రే పరివర్తమానే తస్మిన్నాతస్థు ర్భువనాని విశ్వా। తస్యనాక్ష స్తప్యతే భూరిభారః సనాదేవన శీర్యతేసనాభిః॥ సనేమి చక్రమజరం వివావృత ఉత్తానాయాం దశయుక్తావహంతి। సూర్యస్యచక్షూరజసైత్యావృతం తస్మిన్నా ర్పితాభువనాని విశ్వా॥ 13 వ ఋక్కునందు "ఐదు ఆకుల (పంచారే) చక్రము చాలపురాతనమైనదైనను విరిగిపోకుండ అక్షే నిలిచియున్నది" మరియు, 14 వ ఋక్కునందు "అజరమైన (చెడని) చక్రము తననేమితో తిరుగుచున్నది. దానిని ఆకాశముపై పది (గుర్రములు) లాగుచున్నవి. సూర్యనేత్రము "రజస్" (నీటి ఆవిరి) చే కప్పబడి తిరుగుచున్నది. సమస్తభువనములు ఆతనిపై ఆధారపడియున్నవి". ఈ

ఋక్కును ౧౨ వ ఋక్కుతోఁ బోల్చి చూతము. పురీషిణాం, రజసావృతం (నీటిచే గప్పబడిన) — అను పదములు రెండును సమానార్థకములే. అనగ, పంచపాదుడైన సంవత్సర దేవత లేక సూర్యుడు కొంతకాలము నీటిలో మునిగియుండె ననిగాని, లేక క్షితిజము క్రిందిభాగమందు సూర్యుడు నీటిచే గప్పబడి కొంతకాల మదృశ్యుడయ్యెననిగాని యీ ఋక్కుల భావము. "ఈతని రథమును పది (గుఱ్ఱములు) లాగు చున్నవి." అనగ, యిచ్చట సూర్యరశ్మి పదిమాసము లుండె నని తెలుచున్నది. ఈపదిమాసములు కలిసి ౫ ఋతువులగు చున్నవి. కనుక, ౫ ఋతువు లనగ పదినెలలని యర్థమునను గాని, ౧౨ నెలలుగల ఆరుఋతువులలో నెరడింటిని కలిపి ౫ ఋతువులుగ జేయుటకాదని యీ "పది (గుఱ్ఱములు) లాగుచున్నవ"ను వాక్యమువలన ఖండితముగ సిద్ధాంతమగు చున్నది.

కనుక, 12 వ ఋక్కుయొక్క మొదటి భాగమునగు పదినెలల సూర్యరశ్మిగల, ౫ ఋతువులతో కూడిన, లేక (పంచపాదుడైన) సంవత్సరదేవత (సూర్యుడు) కొంతకాలము (అనగ, తక్కిన రెండునెలలు) నీటిలో మునిగ యుండెను. (పురీషిణం) — అని చెప్పబడు రీతియు సహజముగనే యున్నది. ఇది యొకతెగ వారి మతము — ఇది ఉత్తర ధ్రువలక్షణము. కాని, ఆర్యులు దక్షిణదేశములకు వచ్చిన పిమ్మట సూర్యరశ్మి ౧౨ మాసము లుండెను. ఋతువులు

ఆరమ్యెను. కనుక సంవత్సరదేవత (సూర్యుడు) పూర్వకాలమందువలె రెండుమాసములు నీటిలో మునిగియుండవలసిన అగత్య మిప్పుడు లేకపోయెను. ఇదివరకు "పురీషణ" ములో నున్న సంవత్సరదేవత యిప్పుడు "విచక్షణు" డయ్యెను. ఈ యభిప్రాయమే ౧౨ వ ఋక్కుయొక్క రెండవ భాగమందు చేర్కొనబడెను. ఇది రెండవ తెగవారి మతము — అనగ దక్షిణదేశప్రాంతముల లక్షణము. సంవత్సరదేవతను గూర్చిన యీ రెండు భిన్నాభిప్రాయములును ౧౨ వ ఋక్కుయొక్క రెండు భాగములందు చేర్కొనబడినవి. ఈరెంటియొక్క లక్షణములును ఒకదానితో నొకటి పోల్చబడినవి.

౧౨ వ ఋక్కు: మొదటిభాగము.	౧౨ వ ఋక్కు: రెండవభాగము.
(౧) ఆయిదు ఋతువులు	(౧) ఆరు ఋతువులు
(౨) పరే అర్ధే (క్రిందిభాగము)	(౨) ఉపరే అర్ధే (పైభాగము)
(3) పంచపాదం లేక పంచారే (14 ఋ) } ౫ ఋతువులు	(3) షడారే (౬ ఋతువులు)
(౪) పురీషిణం ... (సూర్యుడు ౨ నెలలు నీటిలో మునిగియుండుట)	(౪) విచక్షణం ... (నీటిలో మునిగియుండకుండ ౧౨ మాసములును చక్కని సూర్యరశ్మి)

ఈరీతిగ వైదికఋషులు ౧౦ మాసముల సూర్యరశ్మియు, ౨ మాసముల దీర్ఘరాత్రియు గల ఉత్తరధ్రువమండల సంవత్సర లక్షణమును యీ ౧౨ వ ఋక్కుయొక్క

మొదటిభాగమందు మరచిపోకుండ నిలిపియున్నారు. తొమి ఋక్కును వ్రాసిననాటికి తమకు ౧౨ మాసముల సూర్య రశ్మియున్నను, ఆ వెనుకటి ౧౦ మాసముల సూర్యరశ్మిని గూర్చి పూర్తిగ మరచిపోకుండ నుచ్చుట దాని నుదహరించి యున్నారు. ఈ పూర్వయుగస్థితి పరంపరగ వచ్చుచున్నందుచే వారు దానిని విడిచిపెట్టకుండ నుచ్చుట నుదహరించియుండిరి.

ఈ ౧౨వ ఋక్కునందు మనము విచారింపవలసిన పదము లింకను రెండుగలవు. (ద్వాదశాకృతి; సప్తచక్ర) మొదటిపాదమందు ౫ ఋతువులతో నుస్న సంవత్సరము "ద్వాదశాకృతి" గలదని వర్ణింపబడినది. అనగ, 12 మాస ములు గలదని చెప్పబడెను. ఈ ఋక్కు దక్షిణదేశములలో వ్రాయబడియున్నది. అప్పటికి ౧౨ మాసముల సంవత్సరము వాడుకలోనికి వచ్చెను. కనుక, యీ ఋక్కును వ్రాయుచు సంవత్సరమును "ద్వాదశాకృతి" యని వర్ణించిరి.

ఇదిగాక, రెండవభాగమందు ౬ ఋతువుల సంవత్సర మును వర్ణించుచు "సప్తచక్ర" యనుపదము ప్రయోగింప బడినది. ఈ పదము యేడుమాసముల సూర్యరశ్మిని సూచిం చుట లేదాయని కొందరు అపోహపడవచ్చును. కాని ఒకా నొక భాషలో పదములెట్లుత్పత్తియగునో అవి యెప్పుడెట్లు ప్రయోగింపబడుచుండునో తెలిసికొన్నచో ఎవరును యీ పదము విషయమై గందరగోళపడవలసిన యవసరముండదు. ఆర్యు లొకప్పుడు ఉత్తరధ్రువమండలమందు 7 మాసముల

సూర్యరశ్మిగల ప్రదేశమం దున్నప్పుడు సూర్యునకు (లేక సంవత్సరమునకు) సప్తాశ్వ, సప్తచక్ర యను పేరులు వచ్చి యుండెను. ఆపేరులే బహుకాలప్రయోజనముచే రూఢమై పోయి భాషయందు స్థిరముగ పాదుకొనిపోయెను. వానియొక్క యుత్పత్తివిధానము మరుగుపడెను. వైదికఋషు లీఋక్కులను వ్రాసినకాలమునాటికే యీ పదము లిట్లు భాషయందు రూఢములై పోవుటచే వారు సంవత్సరమును (సూర్యుని) వర్ణించుచు యీ సప్తచక్రసప్తాశ్వ యను పదములను మామూలుగ ప్రయోగించియుండిరి. కనుక యీపదములు ఆ ఋక్కులుపుట్టిననాటి పరిస్థితులనే వర్ణించుచున్నవని మనము భ్రమనొందగూడదు.

ఈ శబ్దోత్పత్తియొక్క పుట్టుపూర్వోత్తరములు బ్రాహ్మణములకాలమునాటికే యిట్లు మరుగుపడిపోవుటచే వానినేదో విధముగ సమన్వయించుటకై బ్రాహ్మణములను రచించిన ప్రాచీనులు అనేకపాట్లుబడిరి. కాని ఐతిహాసికదృష్టితో చూచినచో యిన్ని తికమకలుపడవలసిన యవసరముండదు. ఈరీతిగ అనాదినుండియు పరంపరగవచ్చుచున్న దేశకాలపరిస్థితులు మరుగుపడకుండ ఋగ్వేదమందుగట్టిగ పదిలపరుపబడియున్నవి. ఇట్టిపదములకును, గాథలకును ప్రాచీనతమమగు ఋగ్వేదమొకగనియని చెప్పవచ్చును.

సింహావలోకనము.

(౧) అదితిగాథనుబట్టి సంవత్సరములో యేడు నెలలు మాత్రమే సూర్యరశ్మియుండెనని స్పష్టమగుచున్నది.

(౨) దశగ్వులయొక్కయు, దీర్ఘతమునియొక్కయు చరిత్రలనుబట్టి సంవత్సరములో పదినెలలు మాత్రమే సూర్య రశ్మియుండెనని స్పష్టమగుచున్నది.

ఈ రెండంశములను ధ్రువసిద్ధాంతముపైనన తప్ప యింకొక విధముగ సమన్వయించుటకు వీలే లేదు.

(3) ఈ సూర్యరశ్మిగల పదిమాసములను పూర్వా ర్యులు యజ్ఞయాగాది క్రతువులొనర్చుకొను కాలముగ నుండెను. ఈ కాలమునకు "మానుషాయుగా" యను సంజ్ఞ గలిగెను.


(౪) తక్కిన రెండు నెలలును దీర్ఘరాత్రిగ నుండెను. ఈ దీర్ఘరాత్రియందు యింద్రుడు "వల" ను సంహారిం చి చీకటిలో పడియున్న సూర్యుని సంవత్సరాంతమందు పైకితీసి కొని వచ్చెను. ఈ కాలమునకే "ఉషః"యను సంజ్ఞగలిగెను.

(౫) ఈరీతిగ "మానుషాయుగా" (౧౦ మాసముల సూర్యరశ్మి) + ఉషః (౨ మాసముల దీర్ఘరాత్రి) యు కలిసి = మొత్తము ౧౨ మాసముల సంవత్సరము పూర్తి యయ్యెను. ఆర్యులు దక్షిణదేశములకు వచ్చిన పిమ్మటకూడ

"మానుషాయుగా" + "క్షుపః" అను పదము ఋగ్వేదమందు వాడుకలోనే యుండెను.

(౬) సంవత్సరములో ౫ ఋతువులే గలవనియు, సూర్యరథమునకు పదిగుఱ్ఱములే గలవనియు కొందరి మతమై యుండెను. యీ యంశముకూడ పైదానికి సరిపోవుచున్నది.

ఈ గాథలన్నియు ఒక్క భారతీయులందే గాక తక్కిన ఆర్యసంతతులలో గూడ గలవని ముందు ముందు నిరూపించెదను. ఇక యీ గాథలనటుంచి, ౧౦ మాసముల యజ్ఞములను గూర్చిన ప్రత్యక్షవాక్యములను రాబోవు అధ్యాయములో విమర్శింతము.



వైదిక నిలయము

8-వ అధ్యాయము.

"గవాం అయనమ్."

ఒక్క దశగ్వులచారిత్రమేగాక, ప్రాచీన సంవత్సర మునుగూర్చి దెల్పుచిహ్నము లింకననేకములు యాజ్ఞిక వాఙ్మయమందు గలవు. ఐ. బ్రా. 1, 18,22 లలో వర్ణింపబడిన "ప్రవర్గ్యవిధి" యందు ప్రాచీన సంవత్సరమునుగూర్చి స్పష్టముగసూచించినట్లు గన్పట్టుచున్నది. ఈ "ప్రవర్గ్యవిధి" యను కర్మను చేయుటకు 3 దినములుపట్టును. "పసుయాజ్ఞ" మను సోమయాగమును చేయుటకు ముందుగ ప్రతివాడును యీ విధిని నెరవేర్చితీరవలెను. ఈప్రవర్గ్యవిధిని చేయనివాడు సోమయాగమును చేయుటకు వీలులేదు. ఈవిధియంతయు కేవలము సూర్యునియొక్క (లేక యజ్ఞముయొక్క) పునరుజ్జీవనమును దెలుపుచున్నది. సూర్యుడుతిరిగి సకాలమందు ప్రజనన మొందుటకై బీజరూపముగ మృత్తికాపాత్రయందు భద్రపరుపబడుచున్నాడు. ఈ ప్రవర్గ్యవిధియందు ఉపయోగింపబడుసామాగ్రి లన్నిటిలో ప్రధానమైనది మట్టికుండ

ఈమృత్తికాపాత్రకు "ఘర్మ" లేక "మహావీర" యని పేరు. అధ్వర్యు డీకుండను వేదికపై బెట్టి దానిచుట్టు వర్తులాకారముగ * మట్టికట్టను వేయును. అంతట యీకుండను బాగుగ కాచి, రెండు కట్టెలతోపైకెత్తి యినతలబెట్టి, దానిలో అప్పుడు పితికిన ఆవుపాలను పోయును. పిమ్మటదానిలో మ్యుతవత్సయైన మేకపాలుపోసిబాగుగ కలియబెట్టును. అటు పిమ్మట యీకలియబెట్టినపాలలో కొన్నింటిని ఆహవనీయాగ్నియందు హోమముజేయును. మిగిలినవానిని హోత్రియే త్రాగును.

ఐ. బ్రా. (I. 22) యీ ప్రవర్గ్యవిధి కీవిధముగ అర్థము చెప్పుచున్నది. "పాత్రలోనున్నపాలు బీజము; అగ్ని యేగర్భము; (అగ్నిదేవతలకు గర్భమనుట ప్రసిద్ధమే) ఈ బీజము దేవతలగర్భమగు అగ్నియందు ఆధానముచేయబడి యున్నది." ఈ విధముగ సూర్యుడు (లేక యజ్ఞము, లేక సంవత్సరము) బీజరూపముగ భద్రపరుపబడి, తిరిగి సకాలమందు పునరుజ్జీవితుడుగ చేయబడుచున్నాడు.

ఈ మృత్తికా పాత్రయందు పాలుపోయుచు పఠించు మంత్రము ఋ VIII, 72, 8 నుండి గ్రహింపబడినది. ఈ మంత్రముతో పాటు 6, 7, మంత్రములనుగూడ యిచ్చట తలిగించెదను. ఉత్ స్వాన్యయన్మహాదశ్వావదోజ్యైజనంబృహాత్

---

* ఈ మట్టికట్టకు "ఖర" అనిపేరు. ఈ కట్టకువేయు మట్టిని గాడిద (ఖర) వీపుమీదవేసి తీసికొనివచ్చుటచే దానికాపేరు వచ్చెను.

దామూరథస్యదదృశే॥ దుహన్తి సప్తైకాముపద్వా పంచసృ
జతః। తీర్థే సిన్ధోరధిస్వరే॥ ఆదశభిర్వివస్వత ఇంద్రః కోశమచు
చ్యవీత్। ఖేదయాత్రి వృతా దివః॥

6 వ మంత్రము :- "ఇప్పుడు ఆతని గొప్పరథము, గుఱ్ఱములతోడను, రథమార్గముతోడను, గానవచ్చుచున్నది.

7 వ మంత్రము :- "ఏడ్గురు ఒకదానిని పితుకుచున్నారు. గర్జించుచున్న సింధు (సముద్ర) తీరమున యిద్దరు అయిదింటిని సృజించుచున్నారు."

8 వ మంత్రము :- వివస్వతునియొక్క పదియు నైన పిమ్మట, యింద్రుడు తనయొక్క మూడ్పేటల సమ్మెటతో ఆకాశకలశమును క్రిందికి పడగొట్టెను. (యిది మృత్తికా పాత్రలో పాలుపోయునప్పుడు పఠించు మంత్రము.)

సూర్యరథమును గుఱ్ఱములను కనుబడగనే క్షితిజముమీద ఉషస్సు కన్పట్టెనని అర్థము. ఇది ఆరవమంత్రమునకు భావార్థము. అంతట యేడ్గురు హోత్రులువచ్చి యీ ఒక్కదానిని (అనగ ఉషస్సును) పాలుపితికి రెంటిని (అనగ రాత్రింబవళ్ళను) పుట్టించుచున్నారు. ఈ రెంటివలన అయిదు (అనగ ఋతువులు) పుట్టుచున్నవి. — ఇది యేడవమంత్రము యొక్క భావార్థము. ఈ అయిదుఋతువులు గడచినపిమ్మట యేమిజరుగునో 8 వ మంత్రము చెప్పుచున్నది. వివస్వతుని యొక్క పదియునైన పిమ్మట (అనగ, పదినెలలు గడచిన పిమ్మట) ఇంద్రుడు తన మూడ్పేటల సమ్మెటతో ఆకాశ

కళంహాసును (సూర్యుని) క్రిందికి పడగొట్టెను. — అనగ దివ్యజలముయొక్క మూడుకోశములు సముద్రములోనికి వంచివేయబడి ఖాళీచేయబడెను. ఈజలముతోపాటు సూర్యుడుకూడ అధోలోకమునకు పోయెను. VII, 101,4 పలుకునగ, సూర్యకాంతి మూడువిధములుగ నున్నదని ఋ VII, 101,2 చెప్పుచున్నది. తై॥సం॥లో(II. 1,2,5)కూడ సూర్యరశ్మి మూడువిధములని చెప్పబడియున్నది. ప్రాతఃకాల కాంతికి "వసంత" యనియు, మధ్యాహ్నకాంతికి "గ్రీష్మ" యనియు, సాయంకాలకాంతికి "శరత్" అనియు పేర్లు తై॥సం॥ యందు చెప్పబడినవి. దివ్యజలముయొక్క త్రివిధ గమనమును లేక సూర్యుని త్రివిధకాంతి ఇంద్రుని ముప్పేటల సన్నుటగ యీ 8 వ మంత్రమందు ఉదాహరింపబడియున్నది. ఇదంతయు పదిమాసములైన పిమ్మట జరుగునని. అటుపిమ్మట సూర్యుని యజ్ఞమును బీజరూపముగ భద్రపరుపబడి యుండెను. ఇదియే "ప్రవర్గ్యవిధి" యను కర్మ.

సూర్యుడు ఆకాశమునుండి జారిపడుట యను నది యాజ్ఞికవాఙ్మయమునందు తరుమగవచ్చుచుండు క్రియయేగాని యనాక్రాంతమేమియు లేదు. యీయంశమే ఐ. బ్రా. IV. 18—లో వర్ణింపబడినది. తస్య పరాచోఽతిపాతాదబిభయుస్తం పరైః స్వర్గైర్లోకైః పరస్తాత్ప్రత్యస్తభ్నువన్॥ "సూర్యుడు తలక్రిందులైతమ్మును దాటిపోయిదూరముగ పడునేమో యను భయముచే అతనికి పోటీగపైన ఉత్తమ

లోకములనుంచిరి." ఈఋక్కునందు "దూరముగపోయి పడుట"=పరాచోఽతిపాతాత్ — అను మాటచాలప్రధానమైనది. అనగ, సూర్యుడుతమకు ఆవలివైపుకున్న అధోలోకమందు పడునని తాత్పర్యము. అశ్వినీదేవతలచే రక్షింపబడినవారిలో "చ్యవను" డొకడుకలడు. "చ్యవన" శబ్దము "చ్యు"=పడుట-అను ధాతువునుండి పుట్టినదని మాక్సుముల్లరు పండితుడు చెప్పుచున్నాడు. అశ్వినీదేవతలు చ్యవనునకు యౌవనమునొసంగిరి. అనగ, అధోలోకమందు పడిపోయిన సూర్యుడు తిరిగి పునరుజ్జీవనము నొందెనని భావార్థము.

ఇంతవరకు తేలిన సారాంశమేమనగ :— యాజ్ఞికవాఙ్మయమందు గల సూర్యపతనమునుగూర్చిన కథయే యింకొక మాదిరిగ (యీ పడిపోయిన సూర్యబీజము తిరిగి ప్రజననమొందుటకై నిలువజేయుటగా) యీ "ప్రవర్గ్యవిధి" యందు వర్ణింపబడియున్నది. ఈ ప్రవర్గ్యవిధిలో పఠించు మంత్రమును పరిశీలించితిమేని దానియందు అయిదు ఋతువులతోడను, ౧౦ మాసములతోడను, నొప్పుచున్న ప్రాచీన సంవత్సరము సూచింపబడినట్లు స్పష్టమగుచున్నది.

ప్రాచీన వార్షికసత్రములయొక్క అవధిని (కాలపరిమితిని) గూర్చి స్పష్టముగ దెల్పు వైదిక వాక్యములనిక పరిశీలింతము. యజ్ఞమను సంస్థ ఒక్క భారతీయులందే గాక సమస్త ఆర్యసంతతులందును ప్రాచీనకాలమునందు యేర్పడియుండెననుమాట నిర్వివాదమైనది. ఈ యజ్ఞముల యొక్క-

నిజమైన భావార్థము కొంతకాలమునకు మరుగుపడిపోయినను యాజ్ఞికులు మాత్రము యీ యజ్ఞాదులలో చేయవలసిన ప్రతి చిన్నక్రియను బహుజాగ్రతగ యెన్నియో తరములనుండి విడిచిపెట్టకుండ లాగుకొనియే వచ్చుచుండిరి. ఈక్రియలకన్నిటికిని యేదోవిధమైన భావార్థమును చెప్పుటకై యాజ్ఞికులు ప్రయత్నించుచువచ్చిరి. కాని యెన్నివిధముల యత్నించినను భావార్థము తెగలని క్రియలు కొన్ని కర్మకాండయందు నిలిచిపోయెను. వానినేమియు చేయుటకు చేతగాక, "ఇది అనాదినుండియు వచ్చుచున్న ఆచారము" అని మాత్రము చెప్పుచు దానిని మాత్రము వదలిపెట్టకుండ, తరతరములనుండి లాగుకొని వచ్చుచుండిరి. ఈవిధముగ నిలిచిపోయిన వాక్యములను గూర్చియు క్రియలను గూర్చియు మన మిప్పుడు పరిశీలించి భావార్థమును తేల్చవలసియున్నది.

బ్రాహ్మణములు లోను, శ్రౌతసూత్రముల లోను, "ఆదిత్యానాం అయనం", "అంగిరసాం అయనం", "గవాం అయనం" — మొదలగు వార్షికసత్రము లనేకములు వర్ణింపబడియున్నవి. ఇవన్నియు సూర్యుని వార్షికగమనమున కనుసరణముగ నేర్పాటుచేయబడినట్లు గాన్పించుచున్నవి. వైదికయాగము లన్నిటిలో నివి బహుపురాతనమైనవి. కనుక వీనియొక్క యవధియు (అనగ కాలపరిమితియు) తక్కిన వివరములును యజ్ఞకాండయందు విపులముగ చెప్పబడియున్నవి. ఇవన్నియు ఒకతీరకమైన యజ్ఞములు. వీనిలో వీనికిని విశేష

భేదమేమియు లేదు. వీనికన్నిటికిని "గవాం అయనం" అను యజ్ఞము ఆదర్శమైయున్నది. ఈనమూనానుబట్టియే తక్కిన యజ్ఞములుకూడ నడచును. దీనికిప్రమాణము ఐ. బ్రా. IV, 17—వారు "గవాం అయనం" అను సత్రమును చేయుదురు. ఇందలి గోవులే ఆదిత్యులు. (మాసాధిష్ఠానదేవతలు. గవాం అయనమును చేసినందువల్ల వారు "ఆదిత్యానాం అయనము" ను గూడ చేసినట్లే" కనుక, గవాం అయనము యొక్క యవధిని మనము నిర్ణయించినచో, తక్కిన వాని యొక్క యవధినికూడ నిర్ణయించినట్లే అగును వానిని ప్రత్యేకముగ పరిశీలించవలసిన పనియుండదు. యజ్ఞముల కన్నిటికిని నమూనాయైన యీ గవాం అయనము కర్మకాండయందు ఐ. బ్రా; తై. సం॥ లలో ముఖ్యముగ మూడు ప్రదేశములలో వర్ణింపబడియున్నది. వానినిట వివరించెదను. ఐ. బ్రా. IV, 17 గావో వై సత్రమాసత । శఫాః శృంగాణి సిషా సన్త్యస్తాసాం దశమే మాసి శఫాః శృంగాణ్యజాయన్త । తా అబ్రువన్ యస్మై కామాయాదీక్షామహ్యాపామ తముత్తిష్ఠామేతి । తా యా ఉదతిష్ఠం స్తా ఏతా శృంగిణ్యోఽథయాః సమాపయిష్యామః సంవత్సర మిత్యాసత తాసామశ్రద్ధయా శృంగాణి ప్రావర్తన్త । తా ఏతా స్తూపరా ఊర్జం త్వసున్వం సస్మాదుతాః సర్వా ఋతూన్ ప్రాప్త్వోత్తర ముత్తిష్ఠం త్యూర్జం హ్యాసున్వన్ సర్వస్యవై గావః ప్రేమాణం సర్వస్య చారుతాం గతాః ॥ సర్వస్యప్రేమాణం సర్వస్య చారుతాం గచ్ఛతి య ఏవం వేద॥

“ (ఒకప్పుడు) ఆవులన్నియుచేరి, తమకు గొరిజలను కొమ్ములను సంపాదించుకొనుటకుగాను సత్రమునుచేసెను. (ఈసత్రముయొక్క) పదియవ మాసమందు వానికి కొమ్ములును గొరిజలును వచ్చెను. అంతట అవి “ మనము దేనిని కోరి యజ్ఞదీక్షితులమైతిమో ఆకోర్కె సఫలమాయెను. (యజ్ఞము పూర్తియైనది గనుక) మనమిక లేచెదముగాక” అని చెప్పెను. అంతటితో లేచినవానికి కొమ్ములుండెను. కాని సంవత్సరము పూర్తియగువరకు కూర్చుందము” అని చెప్పుచు (యజ్ఞమును నడుపుచునే) యున్నవానికి వానియొక్క అవిశ్వాసముచేత కొమ్ములూడిపోయెను. వీరే కొమ్ములులేనివారు (తూపరాః) వీరు (యజ్ఞమును సాగించుచు) వీర్యమును (ఊర్జమును) పుట్టించిరి. (ఇట్లు ౧౨ నెలలును యజ్ఞమునుచేసిన) పిమ్మట ఋతువుల నన్నిటిని సంపాదించి, తుదకు వారు (మరల) లేచిరి. ఫలననగ :— (పోయినకొమ్ములు గొరిజలు మొదలగువానిని సంపాదించుకొనగల) శక్తిని లేక వీర్యమును (ఊర్జం) వారు పుట్టించిరి. ఈ రీతిగ ఆవులు సమస్తమైనవారికి ప్రేమపాత్రములయ్యెను. అందరిచేతను అలంకరింపబడెను”.

యజ్ఞదీక్షవహించిన యావులకోర్కె పదిమాసములలోనే సఫలమునొందెనని యిట స్పష్టముగ విశదీకరింపబడియున్నది. అంతట కొన్నియావులు లేచిపోయెను. అంతటితో లేచిపోక యింక రెండునల లెక్కువ యజ్ఞముచేసిన ఆవులు “అవిశ్వాసము” గలవని చెప్పబడెను. ఈ యవిశ్వాసమునకు

ఫలితముగ, అవి తమకు లభించినకొమ్ములను పోగొట్టుకొన వలసివచ్చెను. దీనినిబట్టి తేలిన సారాంశమేమనగా:— సూర్య గమనమునుబట్టి ౧౨ మాసముల యవధిగలదిగ సంహితా బ్రాహ్మణము లందు పేర్కొనబడిన "గవాం అయనం" అనబడు యీసత్రము ప్రాచీనకాల మందొకప్పుడు పదిమాస ములలోనేపూర్తియయ్యెనని యిచ్చటస్పష్టముగ నిరూపింపబడి యున్నది. దీనికి కారణమేమి? ౧౨ మాసముల యవధిగల వార్షిక సత్రము పూర్వము ౧౦ మాసములలోనే యేల ముగింపబడెను. ౧౨మాసములు యజ్ఞముచేసిన ఫలము ప్రాచీనులకు ౧౦ మాసములు యజ్ఞము చేసినంతమాత్రము చేతనే యెట్లులభించెను? ఇవి చాలముఖ్యమైన ప్రశ్నలు. కాని యీశంకలు ఐతరేయ బ్రాహ్మణమునకు తోచలేదు. కాని తైత్తిరీయ సంహితకుమాత్రమీశంకలు గలిగినవి. వారివారి యిష్టమునుబట్టి గవాం అయినమును ౧౦ నెలలలోగాని, లేక ౧౨ నెలలలోగాని ముగించవచ్చునని తై॥ సం॥ స్పష్ట ముగ చెప్పుచున్నది. కాని దీనికిగల కారణమేమియో తనకు తెలియదని తైత్తిరీయ సంహితయే యొప్పుకొనుచున్నది. "ఇది అనాదినుండియు వచ్చుచున్న ప్రాచీనాచార" మని మాత్రము చెప్పి యూరకొనుచున్నది. గవాం అయనమును గూర్చి యీ తై॥ సం॥ యెట్లు వర్ణింపుచున్నదో చూతము ...

తై॥ సం॥ VII, 5,1,1,2 గావోవా ఏతత్ సత్రమాసతా శృంగాః సతీః శృంగాణిసో జాయంతా ఇతి కామేన। తాసాం

దశమాసా నిషణ్ణా ఆస న్నథ శృంగాణ్యజాయంతతా ఉదతిష్ఠ
న్నరాత్స్మేత్యథయాసాం నాజాయంత తాః సంవత్సరమాప్త్వో
దతిష్ఠ న్నరాత్స్మేతి। యాసాం చాజాయంత యాసాంచ న
తా ఉభయీ రుదతిష్ఠ న్నరాత్స్మేతి। గోసత్రంవై సంవత్స
రోయ ఏవం విద్వాంసః సంవత్సర ముపయంత్యృధ్నువంత్యేవ
తస్మా త్తూపరా వార్షికౌ మాసౌ పర్త్వా చరతి సత్రాభిజితం
హ్యస్యై తస్మా త్సంవత్సర సదో యత్కించ గృహే క్రియతే
తదాప్త మవిరుద్ధ మభిజితం క్రియతే॥ "కొమ్ములులేని మనకు
కొమ్ములు గలుగుగాక" యని కోరుచు ఆవులు కూడి సత్రము
చేసెను. వారి సత్రము పదిమాసములు పట్టెను. అంతట
వానికి కొమ్ములు రాగా "మా కోర్కెఫలించె" నని
చెప్పుచు లేచెను. కాని కొమ్ములురాని గోవులు సంవత్స
రమునరకు యాగమును చేసి "మా కోర్కెఫలించె" నని
చెప్పుచు లేచెను. కొమ్ములు వచ్చిన ఆవులు, కొమ్ములురాని
ఆవులు—అన్నియుకలిసి "మా కోర్కెఫలించె" నని చెప్పుచు
లేచెను. ఈరీతిగ గోసత్రము వార్షికసత్రమైయున్నది. దీని
జరిగినవారు సంవత్సరమునుచేరి నిజముగ సుఖింతురు. కనుక
కొమ్ములులేని (ఆవు) వర్షకాలము రెండునెలలును సంతోష
ముతో (మేయుచు) తిరుగును. సత్రమువలన గోవునకు కలిగిన
ఫలిత మిది. కనుక యీ వార్షికసత్రముచేసిన వారింటిలో
నేపనిజేసినను అది సకాలమందు జయప్రదమగును; సక్రమ
ముగను జరుగును."

బ్రాహ్మణములోని కథకును యీసంహితలోని కథకును కొద్దిభేదములుగలవు. సంవత్సరముపొడవునను యజ్ఞము చేసిన గోవులకు కొమ్ములురాలేదని సంహిత చెప్పుచున్నది. కాని వానికి "ఊర్జము" వచ్చుటకుమారుగ, హాయిగ రెండు నెలలు వర్షకాలములో మేతదొరికెనని సంహితచెప్పుచున్నది. రెండు నెలలెక్కువ యజ్ఞముచేసినందుకు గలిగిన ఫలితమిది. కొమ్ములున్న గోవులు యీరెండునెలలలో హాయిగ మేయ జాలకపోయెనని వ్యాఖ్యాత చెప్పుచున్నాడు ! ఏలననగ, క్రొత్తగడ్డిమొలచిన ప్రదేశములందు గోవులకు కొమ్ములు ఆటంకముగనుండునట ! కాని యీసత్రమునకొక్క యవధి ౧౦ లేక ౧౨ మాసములుండవచ్చునను సంశయమాత్రము సంహితాబ్రాహ్మణములందు సమానముగనే యున్నది.

ఈకథయే తై॥ సం॥ యందు [illegible] యనువాకములో నిట్లు వర్ణింపబడినది:– తైత్తిరీయసంహిత VII, 5, 2, 1–2. గావో వా ఏతత్ సత్రమాసతా శృంగాః సతీః శృంగాణి సిషాసంతీస్తాసాం దశమాసా నిషణ్ణా ఆసన్నథ శృంగాణ్యజాయంత తా అబ్రువన్నరాత్స్మోత్తిష్ఠామావతం కామమరుత్స్మహి యేన కామేన న్యషదామేతి తాసాము త్వా అబ్రువ న్నర్ధా వా యావతీర్వాఽఽసామహా ఏవేమౌ ద్వాదశౌ మాసౌ సంవత్సరం సంపాద్యోత్తిష్ఠామేతి తాసాం ద్వాదశే మాసి శృంగాణి ప్రావర్తంత శ్రద్ధయా వాఽశ్రద్ధయా వా తా ఇమా యాస్తూపరా ఉభయ్యో వావ తా ఆర్ధ్నువన్

యాశ్చ శృంగాణ్యసున్వన్ యాశ్చోర్జమవారూంధతర్ధ్నోతి దశసుమాసూత్తిష్ఠన్నృధ్నోతిద్వాదశసు య ఏవం వేదపదేన ఖలు వా ఏతే యంతివిన్దతిఖలు పదేనయన్తద్వా ఏతదృద్ధమయనంతస్మాదేతద్గోసని ॥ "తమకు కొమ్ములు లేమిచే ఆవులుకొమ్ములను సంపాదింపగోరి యీసత్రమును చేసెను. ఈ సత్రము పదిమాసము లుండెను. అంతటకొమ్ములు మొలవగ, మనకోర్కె ఫలించెను, యిక లేచెదముగాక. మనము కూర్చున్నకోర్కె తీరెను. కాని వానిలో సగము ఆవులు మాత్రము, "మేమీ రెండు నెలలుకూడ తప్పక కూర్చుని సంవత్సరమును ముగించి లేచెదము." అని చెప్పెను. వీనిలో నమ్మిన కొందరికి ౧౨ వ మాసములో కొమ్ములు వచ్చెను నమ్మని వారికి యెప్పటి యట్లే కొమ్ములు లేకుండెను. ఈరీతిగ ఉభయులును—కొమ్ములువచ్చిన గోవులు, ఊర్జమును సంపాదించినగోవులును — తమ కామితార్థమును పొందెను. దీనిని తెలిసికొన్నవాడు. ౧౦ వ నెలలో లేచినను, ౧౨వ నెలలో లేచినను సుఖియగుచున్నాడు. వారు నిశ్చయముగ పదముందు (పదేన) నడుచుచున్నారు. పదమందు నడుచువాడు నిశ్చయముగ (గమ్యస్థానమును) చేరుచున్నాడు. ఇది జయప్రదమైన అయనము. అందుచే యిది "గోసని" (గోవులకు లాభకరమైనది.) యని చెప్పబడుచున్నది."

వినుపిటి యనువాకములోని కథయే యిచట మరల కొద్దిమార్పులతో చెప్పబడినది. కాని దీనిలో రెండువాక్యములు

మాత్రము చాల ప్రాధాన్యముగ గన్పట్టుచున్నవి. (౧) ఈ యజ్ఞమును పదినెలలలో ముగించినను లేక ౧౨ నెలలో ముగించినను ఒకటే ఫలము గలుగునని చెప్పబడినది. (౨) దీనికి కారణమేమనగ, యిది అనాదినుండి వచ్చుచున్న ప్రాచీనాచారము. (పదేన) (ఇదియే పథము). ౧౨ నెల లుండవలసినట్టియు, యిప్పుడు నిజముగ ౧౨ నెలలు జరుగుచున్నట్టియు "గవాం అయనము" వంటి వార్షికసత్ర మొకప్పుడు పదినెలలలోనే పూర్తిచేయబడుచుండెను. తైత్తిరీయసంహితా కాలమునాటికి దీనికిగల నిజకారణమేమియో యెవరికిని తెలియదు. అందుచే యిది అనాది యాచారముగ నంగీకరింపబడెను. ఈకథ యేతండ్యబ్రాహ్మణమునందు కూడ గలదు. అచ్చటకూడ యీసత్రమునకు రెండు అవధు లంగీకరింపబడినవి.

ఈకథలో చెప్పబడిన 'ఆవు' లనగ నేమో తరువాత విచారింతము. ప్రస్తుతము దీనికాలపరిమితిని పదినెలలు యజ్ఞ మొనర్చు దశగ్వుల చరిత్రతో పోల్చిచూడగ తేలిన సారాంశ మేమనగ:— వైదిక ఋషులనుముక్క ప్రాచీనతరమువారు ధ్రువ మండలములో సూర్యరశ్మి పదినెలలున్నచోట వసించి యున్నప్పుడు వారు తమ వార్షికసత్రములను ఆపదిమాసములలోనే ముగించెడివారు. కాని పిమ్మట కొంతకాలమునకీయార్యసంతతులు ౧౨ నెలలు సూర్యరశ్మిగల దక్షిణభాగములకు వచ్చిచేరినప్పుడు యీవార్షికసత్రము ౧౧ నెలతో యుండుటకు సాధ్యమయ్యెడిదికాదు; అందుచే వారీసత్రము

లను ౧౨ నెలలవరకు పొడిగించవలసి వచ్చెను. అయినను, ప్రాచీనాచారములందు వారికి మిగుల పట్టుదలయుండుటచే అనాదినుండియు వచ్చుచున్న యీపదినెలల యవధిని పూర్తిగవదలివేయుటకు వారు ఒప్పుకొనలేదు. కనుక యీ వార్షిక సత్రమునకు పదినెలల యవధిని వైకల్పికముగ సంహితలయందు అంగీకరింపక తప్పినదికాదు. అందుచే దీనిని ప్రాచీనాచారముగ నంగీకరించుచు తైత్తిరీయ సంహిత యీపది మాసముల యవధిని ఉదాహరించెను. తక్కిన విషయముల నటుంచి మనమింతవరకు ఖండితముగ నిర్ధారణచేయవచ్చును. ప్రాచీనతమమగు వార్షికసత్రము పదిమాసముల యవధిని మాత్రమే గలిగియుండెననుట నిర్వివాదాంశము:—కారణము లేమైనగానిండు.

ప్రాచీన వార్షిక సత్రమునకు యవధి పదిమాసములుమాత్రమే యేలయుండెనో తెలిసికొనజాలకపోయినది మన తైత్తిరీయసంహితను రచించిన ఋషులొక్కరే కారు సుమా! వీరితోపాటు యింకను కొందరుకలరు. ఇంగ్లీషు సంవత్సరములో చివరినెలకు యిప్పటికిని "డిశెంబరు" అను పేరుగలదు. డిశెంబర్ శబ్దము ల్యాటిన్ భాషనుండివచ్చినది. (ల్యాటిన్) 'డిశెం' = (సంస్కృత) 'దశన్' = పది; + (ల్యాటిన్) బర్ = (సంస్కృత) 'వార్' = కాలము లేక అవధి కనుక, 'డిశెంబర్' అనగ పదియవనెల యని యర్థము పూర్వము రోమకదేశపుపంచాంగములో పదినెలలుమాత్రమే

యుండెననియు, తరువాత కొంతకాలమునకు "న్యూమా" యను నాతడు వచ్చి మరిరెండు క్రొత్తనెలలను కలిపెననియు అందరికి తెలియును. దీనిని కొందరింకొకవిధముగ సమర్థింప జూచుచున్నారు. 'న్యూమా' క్రొత్తనెలలను కలుపలేదనియు, పూర్వపు పంచాంగములో చివరనున్న రెండు నెలలను తీసికొనివచ్చి ముందుపెట్టెననియు సమాధానము చెప్ప జూచుచున్నారు. కాని రోమన్ నెలల పేర్లనుబట్టిచూడగ వీరి సమాధానము సరియైనది గాదని స్పష్టమగుచున్నది. ఎట్లనగ:— జులై నెలకు "క్వింటిలిస్" అనునది ప్రాతపేరు. "క్వింటిలిస్" అనగ "అయిదవ" అని అర్థము. ఆగస్టు నెలకు "సెక్స్టిలిస్" = "ఆరవ" అనునది ప్రాతపేరు. సెప్టెంబరు (సప్తము లేక) 'యేడవ' నెలయని దానిపేరే చెప్పుచున్నది. అక్టోబరు (అక్టో=అష్ట) యెనిమిదవనెల; నవంబరు (నవ=నవ) తొమ్మిదవనెల; డిశంబర్ పదియవనెల. ప్రాతపంచాంగములో ౧౨ నెల లున్నమాట వాస్తవమైనచో మొదటినుండియు వచ్చుచున్న యీనెలలపేర్ల యొక్క క్రమము ఆకస్మికముగ పదియవ నెలతోడనే నిలిచిపోయి చివరి రెండు నెలకుమాత్రము యేవో పేర్లు పెట్టబడెనని తలంచుటకువీలులేదు. కనుక ప్లూటార్కు పండితుడు చెప్పినట్లు "ప్రాచీనరోమన్ సంవత్సరములో ౧౦ నెలలేయుండెను గాని, ౧౨ నెలలు లేవని చెప్పుటకు, అందు తుదినెలకు "డిశంబరు" అను పేరుండుటయే మనకు గొప్ప నిదర్శనము" దీనివిషయమై యెవరికైన నింకను సందేహ

మున్నచో, " దశగ్వాదీ ఋక్తతములగాథలను బట్టియు, గవాం అయనము యొక్క ప్రాచీనయవధినిబట్టియు ఆసంశయము విచ్ఛేదము గాగలదు. న్యూమాయను నతడు రెండుక్రొత్త నెలలను కలిపెనేగాని, వెనుకనున్నవానిని తీసికొనివచ్చిముందు పెట్టలేదని మాక్సిమియను పండితుడుకూడ స్థిరపరుచు చున్నాడు. పారశీకుల పంచాంగమీాదివిషయమై యేమిచెప్పు చున్నదో పిమ్మట విచారించెదము. మన మిప్పుడింతవరకు నిర్ధారణచేయగలము. ఏమనగ:—పురాతనముగు రోమక సంవత్సరమునకు పదిమాసములే యవధియుండెను. పిమ్మట కొంతకాలమునకు—గవాం అయనముయొక్క యవధివలెనే—యిదికూడ ౧౨ మాసములకు పొడిగించబడెను. పూర్వపు సంవత్సరము ౧౦ మాసములేయేలయుండెనో, తదుపరి అది యేల ౧౨ మాసములుగ మార్చబడెనో యింతవర కెవరును కనుగొనజాలకపోయిరి. కాని, మన ధ్రువసిద్ధాంతము నాధారముగ గైకొన్నచో యీావైదికరోమక పరంపరలకు గల నిజకారణము కన్నులకు గట్టినట్లు గోచరము గాగలదు. రోమనులును, భారతీయులును, ఆర్యసంతతుల వారే. వీరందరుకలిసి మొట్టమొదట ధృవమండలమందు ౧౦ నెలల సూర్యరశ్మియున్న ప్రదేశములలో నివసించియున్నప్పుడు వారి సంవత్సరమునకు ౧౦ మాసములే యవధి యుండెను. తక్కిన రెండుమాసములును దీర్ఘరాత్రియందు గలిసిపోయెను. ఈ దీర్ఘరాత్రియందే యింద్రుడు 'వల

యుద్ధముజేసి ఆతనిచే బంధింపబడిన గోవులను విడిపింప యత్నించుచుండెను. ఈ దీర్ఘరాత్రియందే "హెర్క్యులిస్" తన ఆవులను దొంగిలించుకొనిపోయిన "కాకస్" అను రాక్షసునితో యుద్ధము జేయుచుండెను. ఈయార్యసంతతులు దక్షిణదేశములకు రాగనే, యిచ్చట సూర్యరశ్మి ౧౨ నెల లుండుటచే తమ సంవత్సరమునకు రెండు క్రొత్త నెలలు కలుపు కొనవలసివచ్చెను. ఇట్లు వీరు రెండుక్రొత్త నెలలను కలుపు కొన్నను పాతసంవత్సరపు లక్షణములు కొన్ని యప్పటికిని మిగిలియేయుండెను. ఇట్లు మిగిలిపోయిన శేషములనుబట్టి పూర్వము పదిమాసముల యవధిగల సంవత్సరమును తదు పరి ౨ మాసముల యవధిగల దీర్ఘరాత్రియు నచ్చుచుండె నని నిర్ధారణమగుచున్నది. ఈయభిప్రాయమే ప్రాచీనగాథల వలనకూడ ధృవపడుచున్నది. ఈగాథల నింకొక యధ్యాయ ములో ముందు చర్చింపనున్నాము.

"గవాం అయనం" అనగ అర్థమేమి? నిజముగ ఆవులు యజ్ఞము చేసెనా? "ఈగోవులే ఆదిత్యులు" అని ఐతరేయబ్రాహ్మణము చెప్పుచున్నది. ఆదిత్యులనగ మాసా ధిష్ఠానదేవతలు. ఇది నిజముగ సూర్యదేవతల సత్రము. ఒక్క భారతీయులలోనేగాక తదితర ఆర్యసంతతులవారి గాథలలో కూడ గోవులు రాత్రింబవళ్ళుగ వర్ణింపబడినవి. కనుక యీ సత్రమునకు నిజమైన భావార్థమును మన మిప్పుడు నిర్ణయింప వచ్చును. ఆర్యసంతతులయొక్క ప్రాచీనగాథలలో తరుచుగ

వచ్చుచుండు గోవులనుగూర్చి మాక్సిముల్లరుపండితుని యభిప్రాయముల నిట క్లుప్తముగ దెలిపెదను.

"వేదవాఙ్మయమందు ఆవులు మూడుతరగతులుగ వర్ణింపబడినవి. (౧) నిజమైన ఆవులు. (౨) మేఘములలోనుండు ఆవులు; అనగ నీరు లేక పాలు. (౩) 'రాత్రి' యను చీకటి కొట్టమునుండి బయటికి వెడలివచ్చు ఆవులు — అనగ, ప్రాతఃకాలమందలి, సూర్యకిరణములు — ఉషస్సు, లేక సూర్యకాంతి, ఉషస్సు చాలచోట్ల ఆవులతో పోల్చబడెను; వానిని ఉషస్సు కేవలము ఆవులే యని చెప్పబడెను. ఒకసారి యేవస్తువునైనను రెండవ వస్తువుతో పోల్చినప్పుడు యింకొకసారి యీ వస్తువు కేవల మావస్తువే యని చెప్పుట వేదమందు సహజమైపోయినది. ఈరీతిగ, యీ మూడుతరగతుల ఆవులును విడదీయుటకు వీలులేకుండ వేద వాఙ్మయమందు పెనవేయబడియున్నవి." దీనిని ధృవపరుచుటకు మాక్సిముల్లరు పండితుడనేక ఉదాహరణముల నిచ్చియున్నాడు. (ఋ I, 92, 1; I, 9, 3, 4; I, 62, 3; II, 19, 3; II, 24, 3; II, 3, 4, 1; V, 14, 4;) – యీప్రదేశములలో ఆవులనగ ఉషస్సులనిగాని, సూర్యకిరణములనిగాని సూర్యకాంతియనిగాని, లేక దినములనిగాని అర్థము. I, 32, 11 లో ఆవులనగ నీరనియర్థము. "పైనుదహరించిన వాక్యములలో చాలచోట్ల "ఇవ" = (వలె) అనుపదములు గానరావు. ఉషస్సులు మొదలగునవి చీకటికొట్టులోనుండి బయటికివచ్చిన

ఆవులవలె నున్నవని చెప్పక, కేవలము ఆవులే బయటికివచ్చిన వని చెప్పబడియున్నది. అదిగాక, ఒకఉషస్సు (యోషనచనం) ఆవులకు తల్లి (మాతాగవాం) అనికూడ ఋ IV, 52, 2 చెప్పుచున్నది. ”

“ఆవులనగ ప్రాతఃకాలమందు గన్పడు మొయిళ్ళు మేఘములని కుష్ణిపండితుడు తలంచుచున్నాడు. కాని ప్రాతఃకాలమందెల్లప్పుడు మేఘములుండవు. అదిగాక, రాత్రియందే మేఘములు బంధింపబడెననియు చెప్పుటకు వీలులేదు.

ఇంకొక ఆశ్చర్యకరమైన విశేషమేమనగ:—యీప్రాతఃకాలిక గోవులు ఒక్క వేదమందేగాక, తదితర ఆర్యసంతతులవారి పురాణగాధలలోకూడ గన్పట్టుచున్నవి. అవి యచ్చటి దినములతో పోల్చబడెననుట నిర్వివాదాంశము. ఆగాధలయందీ గోవులసంఖ్య 12 × 30=360 (మునుమ్నూటఅరువదిగ) చెప్పబడియున్నది.”—(ఇవిమాక్సిముల్లరు పండితుని యభిప్రాయములు.)

పురాణగాధలందు గన్పట్టు ఆవులునిజమైన ఆవులు కావు. అవి “పణి” యనురాక్షసునిచే దీర్ఘరాత్రియందు బంధింపబడిన “రాత్రింబవళ్ళ” నియే భావము. “గోవులు” అని యున్నచోట “రాత్రింబవళ్ళ”ని చెప్పి చదివిచూచినచో గవాం అయనముయొక్క నిజభావము తేటపడగలదు. కొమ్ములను సంపాదించుకొనుటకై ఆవులు పదినెలలు యజ్ఞముచేసెనను వింతకథకు అర్థమేమి? “పణి”యను రాక్షసుని బంధములనుండి

బయటపడిన రాత్రింబవళ్ళనబడు గోవులు పూర్వము పది నెలలవరకు విహరించుచుండెను. అనగ, ఆర్యుల ప్రాచీన సంవత్సరము పదినెలల యవధినిమాత్రమే గలిగియుండె ననియు, తదుపరి రెండుమాసములును దీర్ఘరాత్రిగ నుండె ననియు, యీదీర్ఘరాత్రియందే రాత్రింబవళ్ళనబడు నీగోవులు అంధకారరాక్షసులచేత దొంగిలింపబడి బంధింపబడెననియు భావార్థము. ప్రాచీన రోమక సంవత్సరముకూడ పదినెలల యవధినిమాత్రమే గలిగియుండెనని పైన నిరూపించియుంటిమి. పారశీక వేదమగు "అవస్థ" గ్రంథమందుకూడ యీపదినెలల సంవత్సరమే వర్ణింపబడినది. పదినెలలైన పిమ్మట దుష్టరాక్షసులు ప్రపంచమునంతను కమ్మివేసి అతిచలిని, మంచును దెచ్చిపెట్టిరట. ఈవర్ణనలనుబట్టిచూడగ, గ్రీకు, పారశీక, భారతీయాది ఆర్యసంతతుల వారందరు ఒక్కజాతిగ ప్రాచీన కాలమందు ధ్రువమండలములో నివసించియున్నప్పుడే యీ పదిమాసముల సంవత్సరము వారిలో ప్రచారమయ్యెనని స్పష్టమగుచున్నది. ఇట్టి ప్రాచీనసంవత్సరముయొక్క చిహ్నములే ఋగ్వేదమం దిప్పటికిని నిలిచియున్నవి. ఇవి ప్రాచీన చరిత్రను దెలుపు నిదర్శనములుగ నున్నవి. వీనియొక్క నిజకీలక మెవరికిని తెలియకపోవుటచే, యివి యింతవరకును మహాపండితులకు సైతము దుర్గ్రాహ్యములుగనుండిపోయినవి.

ఆర్యులు ధ్రువమండలమందు నివసించియున్న మాట యే వాస్తవమైనచో ఒక్కపదిమాసముల సంవత్సరమేగాక,

అక్షాంశ భేదములనుబట్టి 7, 8, 9, 11 మాసముల సంవత్సరములుకూడ యుండియుండవలెనుగద. అదితిగాథనుబట్టియు, ముప్పదిదినముల యుషస్సునుబట్టియు 7 మాసముల సంవత్సరముండెనని ఋజువగుచున్నది. నవగ్వాల చరిత్రనుబట్టి 9 మాసములసంవత్సరముండెనని విదితమగుచున్నది. ఇవిగాక, అంగిరసులలో పెక్కుతరగతులవారు (విరూపులు) గలరని చెప్పుటచే 7, 8, 9, 11 మాసములు యజ్ఞము చేయువారుకూడ గలరని తెలియుచున్నది. అనగ, 9, 8, 11 మాసముల సంవత్సరములుకూడ నుండెనని తెలియుచున్నది అయినను, అంగిరసులందరిలో నవగ్వదశగ్వాలు ప్రధానులు. (అంగిరస్‌-తము) అని చెప్పుటచే వీనియన్నిటిలో ౧౦ మాసముల సంవత్సరమే యెక్కువ ప్రచారములోనుండెననిగాని, లేకసగటున ౧౦ మాసముల సంవత్సరమే ప్రధానముగ గైకొనబడెననిగాని అర్థమగుచున్నది.

ఈయంశమునే తదితర జాతులవారి పురాణగాథలుకూడ బలపరుచుచున్నవి గ్రీకుదేవతయగు 'హీలియో'కు ౩౫౦ ఆవులును, ౩౫౦ గొర్రెలును నుండెనట దీనినిబట్టి, గ్రీకు సంవత్సరములో ౩౫౦ పగళ్ళును, ౩౫౦ రాత్రిలును మాత్రమే యుండెనని మాక్సిముల్లరుపండితు డభిప్రాయపడుచున్నాడు. కాలుడగు కమ్మరివానికి 700 ఠింగులేయుండెనని జర్మనుగాథలు చెప్పుచున్నవి. అగ్నికి 720 మంది కొడుకులు గలరని ఋ I, 164, 11 చెప్పుచున్నది. ఈరెంటినిపోల్చిచూచి

జర్మనుల ప్రాచీనగాథలందుకూడ ౩౬౦ దినములసంవత్సరము గలదని మాక్సిమ్యుల్లరుపండితుడు తలంచుచున్నాడు. ఈప్రాచీన సంవత్సర మిప్పటి సౌర సంవత్సరమునకు ౧౫ దినములు కొరవడుచున్నది. ఇప్పటి సాధారణసంవత్సరమునకు ౧౦ దినములు కొరవడుచున్నది. ఆర్యులు ఉత్తరధ్రువమండలమును విడిచి వివిధశాఖలుగ చీలిపోకమునుపు ౩౬౦ దినముల సంవత్సరమే యుండియున్నచో, దీనికి వెనుకనే ౧౦, ౧౫ దినముల దీర్ఘరాత్రి యుండియుండవలెను. సంవత్సరము ౩౦౦ దినములే యైనచో, యీదీర్ఘరాత్రి ౬౦ దినములుండియుండవలెను. ఈరీతిగ స్థలభేదమునుబట్టి ఉత్తరధ్రువమండలమందు పలుతెరగులగు కాలపరిమితులుగల దీర్ఘరాత్రులుండియుండవలెను. ఇట్టిదీర్ఘరాత్రులలో యేరాత్రి యతిదీర్ఘమైనదో మనము శోధించవలసియున్నది. 'హీలియో' యొక్క ఆవులను (లేక యెద్దులను) గూర్చి మాక్సిమ్యుల్లరుపండితుడిట్లు చెప్పుచున్నాడు. (క్లుప్తీకరణము).

"ఈగ్రీకుగాథలో చెప్పబడిన గోవులే (యెద్దే) వేదవాఙ్మయమందుకూడ గలవు, 'హీలియో' యొక్క ఆవులను "యులిసెస్" యొక్కసహచరులు తినివేసిరని యీగాథ చెప్పుచున్నది. దీనికి అర్థమేమో బోధపడుటలేదు. ఇదిగాక, "అపోలో" కు ౧౦౦౦ ఆవులు, ౧౨ యెద్దు, ౧ ఆంబోతు యుండెనట; ౫౦ యెద్దులని కొందరుచెప్పుచున్నారు అపోలో యొక్క యెద్దులను "హెర్మిస్" దొంగిలించి, వానిలో

రెంటిని చంపెనట. ఈకథగూడ అగమ్యగోచరముగ నేయున్నది. ఈ "తినివేయుట," "దొంగిలించుట" అనగ నేమియో యూహించుటకు శక్యముగాకున్నది".

ఉత్తరధ్రువసిద్ధాంతము తెలిసియున్నచో మాక్సుముల్లరు పండితు డింతగందరగోళపడవలసిన యావసర ముండెడిది గాదు. "ఆవుల నెత్తికొనిపోవుట" యనగ భావము మన కిప్పుడు కరతలామలకమగుచునే యున్నది. అనగ, యిన్నిదిన ములు దీర్ఘరాత్రియందు గడచిపోయెనని భావము. స్థలభేద మునుబట్టి యీదీర్ఘరాత్రియందు పడిపోయిన దినములసంఖ్య (ఆవుల సంఖ్య) భేదించుచుండును. ఆవులను దొంగిలించుట యనునది వేదవాఙ్మయమందుకూడ కలదు. వృత్రాసురుడు ఆవులను దొంగిలించెను; కాని యెన్నిఆవులో చెప్పబడలేదు. కాని, I, 116, 16 – లో; 117, 18 – లో ఋజ్రాశ్వుడు (ఎఱ్ఱ గుఱ్ఱము) ౧౦౦, లేక ౧౦౧ గొఱ్ఱెలను చంపి, ఆడ తోడేలునకు ఆహారముగ వేసెనట. ఈకథ పైగ్రీకు కథతో పోలుచున్నది.

ప్రాచీనసంవత్సరమునుగూర్చియు, అందు ముఖ్యముగ దీర్ఘరాత్రినిగూర్చియు, వైదికకర్మకాండయందు ప్రముఖమైన నిదర్శన మింకొకటి నిలిచియున్నది. కాని, యిది ఇటీవల దట్ట ముగ పెరిగిన వ్యాఖ్యానములలోను, భాష్యములలోను మరుగుపడి పూడిపోయి యున్నది. కనుక, దీనిని త్రవ్వి వెళ్ళగించుటకై, మన మిప్పు డిచ్చట సోమయాగముల

యొక్క సంపూర్ణచరిత్రను సమగ్రముగ పరిశీలింపవలసి యున్నది. ఈసోమయాగ మనునది చాల పురాతనసంస్థ యైనట్లు ఆర్యసంతతుల ప్రాచీనగాథలే వేనోళ్ళచాటుచున్నవి. కర్మకాండయంతటిలోను యీసోమయాగమే చాల పురాతన మైనది. ఋగ్వేదమం దిదియే ప్రధానవైదికకర్మగ వర్ణింప బడినది. ౧౧౪ సూక్తములతో నొప్పుచున్న ప్రత్యేకమండల మొకటి దీనికొరకై ఋగ్వేదమందు ప్రత్యేకింపబడియున్నది. కనుక, దీనిని మనమిప్పుడు పరిశీలించి చూచి, యతిప్రాచీన సత్రములస్వభావ మెట్టిదో తెలిసికొందము.

సోమయాగమునకును తక్కిన యాగములకును గల ముఖ్యమైన భేదమేమనగ :— ఈ సోమయాగమందు సోమ రసము త్రాగబడును. ఈ రసమును త్రాగుటకుముందు దీనిని దేవతలకు అర్పింతురు; ఇదియే ముఖ్యమైనభేదము. ఈ భేదము సోమయాగమను పేరునుబట్టియే తెలియుచున్నది. ఈ సోమ రసము ఉదయ మొకసారి, మధ్యాహ్న మొకసారి, సాయం కాల మొకసారి— మొత్తముమీద దినమునకు మూడుపర్యా యములు అర్పింపబడును. దీని నర్పించుసమయమందు మంత్ర ముల పఠింతురు.

వానివాని కాలపరిమితినిబట్టి సోమయాగములు మూడుతరగతులుగ విభజింపబడియున్నవి.

(౧) ఏకాహములు:— ఒకదినములో పూర్తియగునవి.

(౨) అహీనములు :— ఒకదినమునకంటె యెక్కువ ౧౩ దినములకంటె తక్కువకాలములో పూర్తియగునవి ;

(౩) సత్రములు:— ౧౩ దినములుగాని, అంతకన్న ఎక్కువ దినములుగాని పట్టునవి. ఈ సత్రములలో వెయ్యి సంవత్సరములు పట్టు సత్రములుకూడ గలవు.

I. ఏకాహముక్రిందికివచ్చున వేవనగ :—

(౧) అగ్నిష్టోమ ....
(౨) అతిఅగ్నిష్టోమ
(౩) ఉక్థ్య ...
(౪) షోడశీ ...
(౫) వాజపేయ...
(౬) అతిరాత్ర...
(౭) అప్తోర్యామ...

{ (౨)–(౭): ఈ ౬ను కొద్దిమార్పులతో అగ్నిష్టోమమునే పోలియుండును. }

{ (౧)–(౭): సూత్రముమీద యీ యేడును "జ్యోతిష్టోమము" యొక్క అంతర్భాగములనిగాని లేక రకములని గాని చెప్పుచున్నారు. }

ఈ యేడును ఒకటేరకమైన యజ్ఞములు. సోమరస మర్పించునప్పుడు చదువు మంత్రముల సంఖ్యలోను, చదువు విధములోను, అందుపయోగించు పాత్రలసంఖ్యలోను ఏవో కొద్దిమార్పులు తప్ప, వీనిలో వీనికి విశేషభేదమేలేవియు లేవు. ఈరకము యజ్ఞములతో మన కిప్పుడంతగ పనిలేదు.

II. ఇక రెండవ తరగతివి అహీనములు:— ఈతరగతి క్రిందికి వచ్చున వేవనగ:—

(౧) రెండు, మూడు, మొదలు ౧౨ రాత్రులవరకు పట్టు, ద్విరాత్ర, త్రిరాత్ర, 'చతురాత్ర' ములను పేర్లుగల సోమయాగములు 'ద్వాదశరాత్ర' ములవరకు గలవు.

(౨) "ద్వాదశాహ":— ఇది యీ తరగతిలో ప్రధానమైనది. ఇది ౧౨ దినములుపట్టును. (ఇది అహీనముగను, సత్రముగనుకూడ పరిగణింపబడుచున్నది.) దీనియందు జ్యోతిః, గో, ఆయుస్, అను పేర్లుగల మూడు 'త్ర్యహ'ములున్ను (3 × 3 = ౯ దినములున్న) + ౧. పదియవదినమున్ను + ౨ అతిరాత్రులున్ను=కలిసి మొత్తం ౧౨ దినములగుచున్నవి. ఈ 'త్ర్యహ'ములు మూటికిని కలిసి "నవరాత్ర" యని పేరు.

III. ఇక మూడవ తరగతివి సత్రములు:-

ఈ తరగతిలో వెయ్యి సంవత్సరములుపట్టు యాగములు కూడ చెప్పబడియున్నను యిందు ముఖ్యమైనవి వార్షికసత్రములే. తక్కినవానితో మన కిప్పుడు పనిలేదు. ఈ వార్షిక సత్రములలో ప్రధానమైనది "గవాం అయనం".

ఈ సత్రముల స్వభావమును పరిశీలించుటకు ముందు మనము "షళహ" అను పదమునకు అర్థ మేమో తెలిసికొనుట అత్యావసరమై యున్నది. షళహ = (షట్ + అహ), అనగ, ఆరురోజు లని అర్థము. (కర్మకాండయం దీపదము ఆరురోజులు చేయు కర్మకు పేరుగ పెట్టబడినది) ఐదు షళహాలు కలిసినచో ఒక నెల యగును. కనుక "షళహ"

యనునది "వారము", "పక్షము" వలె ఒకానొక కాలమానమని తెలిసికొనవలెను. "షళహ" లోనున్న ఆరురోజులలో వరుసగ జ్యోతిష్, గో, ఆయుస్ — ఆయుస్, గో, జ్యోతిష్టోమములను పేర్లుగల ఆరుహోమములు జరుగుచుండును. కనుక, ప్రతి "షళహ" యు జ్యోతిష్టోమముతో ప్రారంభమై, జ్యోతిష్టోమముతో ముగియును. షళహాలో నిత్యము జరుగు హోమములందు సోమరస మర్పించు సమయమున పఠించు మంత్రముల లేక స్తోత్రముల క్రమమునుబట్టి యీ 'షళహా' లు "అభిప్లవ" షళహాలనియు, "పృష్ఠ్య" షళహాలనియు రెండురకములేర్పడెను. "పక్షముల" లో "శుక్ల", కృష్ణ భేదములున్నట్లు, "షళహాల" లో "అభిప్లవ," "పృష్ఠ్య" యను భేదములేర్పడెను.

వార్షిక సత్రమందు ప్రధానముగ కొన్ని "షళహా" లుండును. వీనికితోడు సత్రముయొక్క ఆద్యంతములందును, మధ్యయందును, ప్రత్యేకముగ కొన్నిక్రియలునడుచును. సత్రముయొక్క మధ్యదినమునకు "విషువత్" అనిపేరు. ఇది సత్రమును రెండుసరిసమానమైన భాగములుగ విభజించుచున్నది. ఈవిషువత్ దినము యజ్ఞదినములలో లెక్కపెట్టబడదు. మొదటిభాగమందు జరిగినక్రియలే రెండవభాగమందును తలక్రిందు క్రమముగజరుగును. ఇట్టి వార్షికసత్రముయొక్క నమూనా (model) యెట్లుండునో ఉదాహరణార్థమై యీక్రింద వివరించెదను.

వార్షికసత్రముయొక్క నమూనా (Model.)

(౧) యజ్ఞోప క్రమణసంబంధమైన అతిరాత్రము ...	౧. దినము.
(౨) ఆరంభనీయ, లేక ప్రాయణీయ యను పేరుగల చతుర్వింశ దినము, ఇదియే సత్రమునకు నిజమైన ఆరంభము ...	౧. దినము.
(3) నెల ౧ కి ౪ అభిప్లవషళహాలు + ౧. పృష్ఠ్యషళహా మొప్పున ౫ నెలల వరకు, మొత్తము ౨౫ షళహాలు = (25 × 6=150 దినములు) ...	౧౫౦. దినములు.
(౪) మూడు అభిప్లవషళహాలు+ఒక పృష్ఠ్యషళహా	౨౪. దినములు.
(౫) ' అభిజత్ ' దినము	౧. దినము.
(౬) మూడు "స్వర–సామా" దినములు	3. దినములు.
(౭) "విషువత్" దినము (ఇది యజ్ఞ మధ్యదినము ; ఇది లెక్కలోనికి రాదు)	
(౮) మూడు " స్వర–సామా " దినములు	3. దినములు.

(౯) "విశ్వజిత్" దినము	౧. దినము.
(౧౦) (౧పృష్ఠ్య + ౩ అభిప్లవ) షళహాలు	౨౪. దినములు.
(౧౧) (అ) నెల ౧ కి (౧ పృష్ఠ్య + ౪ అభిప్లవల) చొప్పున ౪ నెలల వరకు = ౨౦ షళ్హాలు = ...౧౨౦ దినములున్ను + + (ఇ) ౩ అభిప్లవలు + గోష్టోమ + ఆయుష్టోమ + దశరాత్ర (౧౦. దినములు) = ... ౩౦ దినములున్ను వెరశి ౧౫౦ దినములు.	౧౫౦. దినములు.
(౧౨) మహావ్రతదినము. (ఇదిచతుర్వింశ దినమునకు) ప్రతిగ నున్నది	౧. దినము.
(౧౩) ఉపసంహార సంబంధమైన అతిరాత్రము	౧. దినము.
	వెరశి ౩౬౦ దినములు.

పైనుదహరించిన ౩౬౦ దినములను రెండుతరగతులుగ విభజింపవచ్చును. (౧) స్థిరమైన దినములు (౨) అస్థిరమైన

దినములు. పై పట్టికనుబట్టిచూడగ, యీవార్షికయజ్ఞములో ఉపక్రమోపసంహారములందలి అతిరాత్రములును, చతుర్వింశ మహావ్రతదినములును, అభిజిత్ విశ్వజిత్ దినములును, విషువనుకు ముందువెనుకలనుండు స్వరసామన్ దినములును, విషువన్ దినమును, ద్వాదశాహములోనున్న దశరాత్రమును కలిసి మొత్తము ౨౨ దినములు చాల ప్రధానమైనవి. ఈయజ్ఞములో ఇవియే స్థిరమైనవి. తక్కిన దినములు అభిప్లవ, పృష్ఠ్య షళహాలలో ఇమిడియున్నవి. ఇవి స్థిరమైనవి కావు. ఇష్టమువచ్చినట్లు యీదినములసంఖ్యను మార్పవచ్చును. ఈపట్టికనుండియే కొద్దిమార్పులతో అనేకసత్రము లుత్పన్నములగుచున్నవి. ఎట్లనగ:— గవాం అయనముయొక్క యవధి ౧౧ మాసములే యైనచో ౩౬౧ దినములలో ౨ నెలలను కొట్టివేయవలెను. ఈరెండు నెలలను స్థిరమైనదినములలోనుండి కొట్టివేయుటకు వీలులేదు. కనుక, అస్థిరభాగము నుండియే కొట్టివేయవలెను. అనగ, పై పట్టికలో (౩), (౧౧) భాగములనుండి చెరిఒకటి షళహాలను కొట్టివేసినచో గవాం అయన మేర్పడును. మరియు పై పట్టికలోనున్న షళహాలనన్నిటిని అభిప్లవషళహాలుగ మార్చినచో "ఆదిత్యానాం అయన" మేర్పడుచున్నది అట్లే షళహాలనన్నిటిని పృష్ఠ్య షళహాలుగ మార్చినచో "అంగిరసాం అయన" మేర్పడుచున్నది. కాని, యీ చివరిరెండు అయనములలోను మొత్తము దినములు మాత్రము ౩౬౦ గనే నిలిచియున్నవి. ఈపట్టికలో ౬

దినములుతగ్గించి 3గిర దినములే యజ్ఞముచేసినచో "ఉత్సర్గి ణాం - అయన" మేర్పడుచున్నది.

ఈ రీతిగ ఆయా ప్రదేశములందుండు సంవత్సరము యొక్క కాలపరిమితికని, తదితర లక్షణములకును సరిపోవు నట్లు నమూనాగా పైన నుదహరించిన ప్రణాళికలోని అస్థిర భాగములలో కొలది సవరణలను మాత్రము చేసికొనుచు, పలువురు పలు తెరగులగు యజ్ఞములను చేయుచుండిరి. ఈ కొలదిభేదములను వదలి చూచినచో యీ సత్రములన్నియు మొత్తముమీద ఒక్క నమూనాగానేయుండును. ప్రధాన కర్మలు అన్నిసత్రములలోను స్థిరముగనేయున్నవి. విషువత్, అభిజిత్, విశ్వజిత్, స్వరసామ దినములలో నేయేకర్మలను చేయవలెనో బ్రాహ్మణములందును, శ్రౌతసూత్రములందును విపులముగ వివరింపబడియున్నవి. అతిరాత్ర, చతుర్వింశ దిన ములందు ఏయేకర్మల జేయవలయునో ఐతరేయబ్రాహ్మణము విపులముగ జెప్పుచున్నది. చతుర్వింశ దినమందు ఇర ౨౪ ముల స్తోమములను పఠింపవలసియుండుటచే దానికా పేరు వచ్చినదట. ఇదియే సత్రమునకు నిజమైన ఆరంభము. మహా వ్రతదినముతో సత్రము నిజముగ ముగిసిపోవును. ఈ దిన మందు చేయవలసిన క్రియలు విపులముగ, ఐతరేయబ్రాహ్మ ణము IV, 14 లో గలవు. మహావ్రతదినమందలి కర్మప్రవర్గ్య విధిని పోలియున్నది. "హోత్రాత్రిబీజమును నిలువజేసి మహా వ్రతకర్మవలన యీ బీజము తిరిగి మొలకెత్తునట్లుజేయును."

సకాలమందు మరల మొలకెత్తుటకై యజ్ఞబీజమీరీతిగ భద్ర పరుపబడినది. ఇదియే మహావ్రతకర్మ — ఇదియే ప్రవర్గ్యవిధి యని పైనదెలిపియుంటిమి. గతించిన పాపసంవత్సరమునకును, ముందురానున్న క్రొత్తసంవత్సరమునకును యీమహావ్రత కర్మ యొకవిధమైన "లంకె"గ నున్నది.

ఇంకొకవిశేషమేమనగ:- ఈసత్రముయొక్క తుది భాగమందువచ్చు ద్వాదశాహమును—అందులో ముఖ్యముగ ౧౧ రోజులును— చాల ప్రధానములుగనున్నవి. ఇట్లే సత్రము యొక్క ఉపక్రమోపసంహారములందలి అతిరాత్రములును చాల ప్రధానమైనవి.

ఆర్యులు ధ్రువమండలమును వదలివచ్చినపిమ్మట రచించిన యాజ్ఞికవాఙ్మయమందు గన్పట్టుచున్న ౩౬౦ దినముల పరిమితిగల వార్షికసత్రముయొక్క నమూనాను (ప్రణాళికను) పైనవివరించియుంటిమి. కాని; యింతకుపూర్వము ధ్రువమండలమందున్నప్పటి సత్రముయొక్క స్వభావమెట్లుండునో మన మిప్పుడు విచారింపవలెను. దీనికొరకై మనమిప్పుడింకొక రకము సోమయాగములను పరిశోధింపవలయును. వీనికి రాత్రి క్రతువులని పేరు.

సోమయాగములలో ఏకాహములనియు, అహీనములనియు, సత్రములనియు — మూడుతరగతులు గలవని పైన

జెప్పితిమి. రెండవతరగతియైన అహీనములలో ద్విరాత్ర, త్రిరాత్రములను పేర్లుగల సోమయాగములు "ద్వాదశ రాత్రము"లవరకు గలవనికూడ జెప్పియుంటిమి. కాని, యీ జాపితా యింతటితో ఆగలేదు. ఇవిగాక, యింకను త్రయోదశరాత్ర, చతుర్దశరాత్రములను పేర్లుగల సోమయాగములు "శతరాత్ర"మువరకు గలవు. ఈ జాపితా "శతరాత్ర"తో నిలిచిపోవుచున్నది. వీని కన్నిటికిని కలిసి "రాత్రిక్రతువు"లని పేరు. (ఇవి రాత్రులందు జేయబడు క్రతువులని ముందు నిరూపింప నున్నాము.) ఇవి 'నూరు'వరకుమాత్రమే కలవు అంతకుపైన లేవు. ఈ నూరింటిలో ౧౨ రాత్రులవరకు అహీనవర్గములోను, ౧౩ నుండి — ౧౦౦ వరకు 'సత్ర' వర్గములోను చేర్చిరి. ఈ కృత్రిమవిభాగమును మన మంతగ పాటింపవలసిన పనిలేదు. ఏది యెట్లున్నను మొత్తముమీద ౨ మొదలు ౧౦౦ రాత్రులవరకు వివిధకాలపరిమితులుగల రాత్రిక్రతువులను పేరుగల యింకొకరకము సోమయాగములు తైత్తిరీయసంహిత, బ్రాహ్మణములు, శ్రౌతసూత్రము లందు స్పష్టముగ వర్ణింపబడియున్నవి. వీనియొక్క సంఖ్యను గూర్చిగాని, స్వభావమునుగూర్చిగాని, అవధులనుగూర్చిగాని యెట్టి సాంకోచములును లేవు. ఈ రాత్రిక్రతువులసాఖ్య ౯౯. అతిరాత్రక్రతువునుకూడ వీనికి గలిపినచో రాత్రిక్రతువుల సంఖ్య మొత్తము నూరగును.

[సోమయాగముల వర్గీకరణము]

సో మ యా గ ము.

- ఏకాహ (౧ ది)
  - జ్యోతిష్టోమ
    - (౧) అగ్నిష్టోమ
    - (౨) అతిఅగ్నిష్టోమ
    - (౩) ఉక్థ్య
    - (౪) షోడశీ
    - (౫) వాజపేయ
    - (౬) అతిరాత్ర *
    - (౭) అప్తోర్యామ
- అహీన (౨-౧౨ ది)
  - * (౧) ద్విరాత్ర
    - (౨) త్రిరాత్ర
    - (౩) చతురాత్ర
    - ... ...
    - (౧౧) ద్వాదశరాత్ర
  - (౧) ద్వాదశాహ = ద్వాదశాహ
- సత్ర (౧౩ ది. ౧౦౦౦ సం॥)
  - ద్వాదశాహ
  - * (౧) త్రయోదశరాత్ర
    - (౨) చతుర్దశరాత్ర
    - ... ...
    - (౮౮) శతరాత్ర
  - (౧) గవాం అయనం ౧౦ మాసములు.
  - (౨) ఉత్సర్గిణాం అయనం ౩౫౪ ది
  - (౩) అంగిరసాం అయనం ౩౬౦ ది.
  - (౪) ఆదిత్యానాం అయనం ౩౬౦ ది.

[వరా :— * ఈ మార్కుతో నున్నవి మొత్తము నూరును రాత్రిక్రతువులు.]

మనమిప్పుడు విచారింపవలసిన యంశమేమనగా:-ఇన్ని సోమయాగములుండగ వీనిలో యీనూరుమాత్రమే యేల "రాత్రిక్రతువు"లని చెప్పబడినవి? ఈరాత్రి క్రతువులసంఖ్య నూరుమాత్రమే యేలయుండవలెను? నూరురాత్రులకంటె యెక్కువ పరిమితిగల రాత్రి క్రతువులేల లేవు? "రాత్రి" యనగ కర్మకాండయందు "దినము" అని అర్థముచేసికొన వచ్చునని మీమాంసకులు సమాధానము చెప్పుచున్నారు. శతరాత్రమనగ నూరుదినముల యవధిగల యజ్ఞమని వారి సమాధానము. ప్రాచీనకాలమందు కాలమానమును తెలిసికొనుటకు చంద్రుడే ప్రధానసాధనముగనుండెను. గనుక దినములకు రాత్రియను నామధేయముకూడ ప్రచారములో నుండియుండవచ్చును. దీనినిబట్టికూడ మీమాంసకులయర్థమును ఒకవిధముగ ఒప్పుకొనవచ్చును. అయితే యింతమాత్రముచే పై ప్రశ్నలు పరిష్కరింపబడజాలవు. రాత్రియనగ దినమని యొప్పుకొన్నను యీరాత్రి క్రతువులనగున నూరు రాత్రులతోడనే నిలిచిపోనేల? తిరిగి ౩౬౦ దినములయజ్ఞము వచ్చువరకు యీలోపుగ నెట్టియజ్ఞము (రాత్రిక్రతువు) గాని యేల లేకపోయెను? ఒకటి మొదలు నూరువరకు క్రమముగ వచ్చినయజ్ఞములవరుస యింత ఆకస్మికముగ నూరువద్ద తెగిపోనేల? తిరిగి ౩౬౦ దినముల సత్రమువచ్చువరకు యీ మధ్య యింతపెద్దగండి పడనేల? నూటికిని, మున్నూటఅరువదికిని మధ్య యింతపెద్దఖాళీ యేలయుండెనో యింతవరకెవరును తగిన సమాధానము చెప్పలేదు.

గవాం అయనమువంటి యే వార్షికసత్రములోను చేరకుండ, "రాత్రిక్రతువు" లనుపేరుతో ఒకనూరు సోమయాగములు కర్మకాండయందు ప్రత్యేకముగ — కేటాయింపుగ — నిలిచిపోయినవి. ఇవి యుక్థ్యాదులలోను చేరకుండ యేల ప్రత్యేకముగ నిలిచిపోయినవో యింతవర కెవరును చెప్పలేదు. వీనియొక్క యవధి నూరురాత్రులకంటె యేల యెక్కువ లేదో యెవరును తెలిసికొనలేదు. చాలకట్టుదిట్టములతో నొప్పుచున్న సోమయాగ పద్ధతియందీనూరు క్రతువులు మాత్రమే యెందులోను చేరకుండ దూరముగ, ఒంటరిగ, యేలనిలిచిపోయెను? ఇన్నియుగములు గడచిన పిమ్మట నేనిప్పుడీ ప్రశ్నలకు సమాధానము చెప్పబోవుట అతిసాహసముగ గన్పట్టవచ్చును. కాని మన ఉత్తరధ్రువ సిద్ధాంతము నాధారముగ గైకొన్నచో యీప్రశ్నలకు చక్కని సమాధానము కుదురునని నాకు గట్టిగతోచుచున్నది. కనుక, యీవిషయముపై నాకున్న యభిప్రాయముల నిట వివరించెదను.

అతిరాత్రక్రతువు యీకాలమందుకూడ రాత్రియందే చేయబడుచున్నది. ఈశబ్దములోని "రాత్రి"కి రాత్రియనియే యర్థమిప్పటికిని చెప్పబడుచున్నది. అట్లయినచో, ద్విరాత్ర, త్రిరాత్రాది శబ్దములలోనుండు రాత్రిశబ్దమునకుకూడ రాత్రి యనియే యేల అర్థము చెప్పకూడదు? సోమరసమును రాత్రిపూట తీయుటకు వీలులేదు గనుక రాత్రియని అర్థము చెప్ప

కూడదని కొందరనుచున్నారు. కాని, యీ యభ్యంతరము నిలువజాలదు. ఏలననగ:– అతిరాత్రి క్రతుప్రసంగము సోమ రసము మామూలుగనే రాత్రియందుతీయబడి మూడు "పర్యా యము"లు ఇంద్రునకు అర్పింపబడుచున్నవి. అతిరాత్రక్రతువు ప్రతిసత్రమునకు ఉపక్రమోపసంహారము లందాచరింపబడు చున్నది. అసురులు చీకటిలో దాగుకొనిరి. దేవతలు వెలు తురులో నుండిరి. ఈరాక్షసులను చీకటిలోనుండి వెడల గొట్టుటకై దేవతలుపూనిరి. కాని, యీపనికై దేవతలందరి లోను ఇంద్రుడొక్కడు తప్ప తదితరు లెవరును సాహసింపరైరి. ఇంద్రుడు మరికొందరిని వెంటబెట్టుకొని, చీకటికోటను ప్రవే శించిమొదటిపర్యాయపు సోమరసముతో రాక్షసులను రాత్రి యొక్క ప్రథమభాగమునుండి తరిమివేసెను; రెండవపర్యా యపు సోమరసముతో రెండవభాగమునుండి తరిమివేసెను; మూడవపర్యాయపు సోమరముతో మూడవభాగమునుండి పూర్తిగ వెడలగొట్టెను. దీనినిబట్టి సోమరసము రాత్రియే తీయబడెననియు, రాత్రియందే మూడుపర్యాయములు ఇంద్రునకర్పింపబడెననియు, యీ రసమును త్రాగి ఇంద్రుడు ఉత్సాహవంతుడై రాక్షసులను (చీకటిని) తరుమగొట్టె ననియు స్పష్టమగుచున్నది.

ఇట్టి అతిరాత్రక్రతువే పారశీగ్రంథములందు కూడ వర్ణింపబడెను. రాత్రిలో మూడుభాగములు (త్రిష్వై) గల వట. మొదటి భాగమందు అగ్నిగృహ యజమానుని

మేల్కొలిపి, "అజి" (సంస్కృతం—అహి) అను రాక్షసుడు అసురులచే ప్రేరేపింపబడి నామీఁదికి వచ్చి నన్ను చంపజూచుచున్నాడు. కనుక, నేనిప్పుడు మిక్కిలి తేజస్సుతో ప్రకాశింపవలసియున్నది; నీవిప్పుడు వెంటనే లేచి మొలదట్టీ (కోష్టి) బిగించి, కట్టెలనుతీసికొనిరా" అని చెప్పెను. ఈరీతిగనే, అగ్నిగృహాయజమానుని మూఁడు 'పర్యాయము'లు మేల్కొలిపిచెప్పెను. ఈకథ యింద్రునకు మూఁడుపర్యాయములు సోమరసమర్పించుటనుబోలియున్నది. మొలదట్టీ (కోష్టి) బిగించి కట్టెలు తెచ్చుటయు, సోమరసము తీసి అర్పించుటయు రాత్రిపూఁటయందేజరిగెను. ఈకథపారశీకులందుఁగూడనుండుటచే అతిరాత్రక్రతువు చాలపురాతనమైనదని స్పష్టమగుచున్నది.

అతిరాత్రక్రతువు ఒక్కరాత్రితోనే పూర్తియగును; ఒకరాత్రి పరిమితిగల అతిరాత్రక్రతువునకుచెప్పిన సమాధానమే ౨, ౩, ౪, ౫, ... ౧౦౦ రాత్రుల పరిమితులుగల తక్కిన ద్విరాత్ర, త్రిరాత్రాదిక్రతువుల కేలచెప్పరాదు.? ప్రాచీనులగు ఆర్యులు తమయజ్ఞములను పదినెలలలోనే ముగించెడివారనియు, వీరి యజ్ఞములు కాగనే దీర్ఘరాత్రి వచ్చెడిదనియు యిదివరకుచెప్పి యుంటిమి. అయితే, యీయార్యులీదీర్ఘరాత్రియందేమిచేయుచుండిరి? రెండునెలలును మొడతెగకుండ నిద్రపోవుచునేయుండిరా? ఇప్పుడుకూడ ఉత్తరధ్రువమండలమందు "లాపు" లను నొకజాతిమనుష్యులు నివ

సించుచునేయున్నారు. వారీదీర్ఘరాత్రియందు సదా నిద్రపోవుచునేయుండరు. మనమిచ్చట సూర్యగమనమువలన రాత్రింబవళ్ళనుగుర్తించినట్లే "లాపు" లుకూడ బహుకాలాభ్యాసముచే ఆదీర్ఘరాత్రియందు నక్షత్రములయొక్క ఉచ్చ, నీచలనుబట్టి రాత్రింబవళ్ళ సంజ్ఞ నేర్పరుచుకొనిరి." అని ఆదేశమును చూచివచ్చిన "పాల్డు–షైలు" అను నాతడు చెప్పుచున్నాడు. ఇట్లేర్పరచుకొన్న రాత్రిపూటయందే వారు నిద్రపోదురు తక్కినప్పుడు యేవోవ్యాపారములను చేసికొనుచుందురు. కనుక, యీనాడీ "లాపు" లు చేయుచున్నట్లే. ఆనాడు ఆర్యులుకూడ చేసియుండిరనుకొనుటలో ఆశ్చర్యమేమున్నది. ప్రాచీనులగు ఆర్యులు పదిమాసములు యజ్ఞములు చేసినపిమ్మట రెండునెల లెడతెగకుండ నిద్రపోయియుండరు. "వల" తో జరుగనున్న యుద్ధమందు యింద్రునకు తోడ్పడుటకై ఆర్యులు పదిమాసములు యజ్ఞములు చేసిరి; ఇప్పుడు యుద్ధముతీవ్రముగ ప్రారంభమైనది; యిప్పుడే యింద్రున కెక్కువ సహాయము గావలసియున్నది; పాపమింద్రుడు 'వల' తో పోరాడుచుండగ, ఆర్యులు ఆతనికేమియు తోడ్పడకుండ — ఒకగిన్నెడు సోమరసమైన నివ్వకుండ — కాళ్ళుపారజాపుకొని సోమరులై ఆర్యులు నిద్రపోవుచుండిరా? అట్లయినచో, అసలు యజ్ఞములయొక్క మూలసిద్ధాంతమే కూలిపోవును. కనుక, యీదీర్ఘరాత్రులందు ఇంద్రున కుత్సాహముగల్గించుటకై ఆర్యులీరాత్రిక్రతువులను చేయుచు, ఇంద్రునకు సోమరస మర్పించుచుండిరి.

ధ్రువమండలమందు అక్షాంశభేదములనుబట్టి దీర్ఘరాత్రి కొన్నిచోట్ల 3 నెలలును, మరికొన్నిచోట్ల ౧ నెల, ౨ నెలలును, మరికొన్నిచోట్ల, ౨, 3, ౪, ౫... 3౦ రోజులునుకూడ నుండవచ్చునుగద. కనుక ఆయా ప్రదేశములలో నుండు దీర్ఘరాత్రులయొక్క అవధులనుబట్టి ద్విరాత్రి, త్రిరాత్రాదిక్రతువులు చేయబడుచుండెను. దీర్ఘరాత్రి ౨ రోజులున్నచోట ద్విరాత్ర క్రతువుచేయబడెను; పదిరోజులున్నచోట దశరాత్రక్రతువును, ౧౦౦ రోజులున్నచోట శతరాత్రక్రతువును చేయబడుచుండెను. శతరాత్రక్రతువులతో యీరాత్రిక్రతువులు నిలిచిపోయెను. అంతకుపైన లేవు. అనగ, మనయార్యులున్నచోట ౧౦౦ రోజుల దీర్ఘరాత్రికంటె యెక్కువ దీర్ఘరాత్రిలేదనిభావము. ఈభావమును బలపరుచుటకు అదితిగాథయే ప్రబల ప్రమాణముగ నున్నది. ఈగాథనుబట్టి ౭ మాసముల సూర్యరశ్మిగల ధ్రువమండలప్రదేశము సూచింపబడుచున్నది. దీనికిముందు 3౦ రోజులు ఉషస్సును, వెనుకప్రక్కను 3౦ దినముల 'యీరెండు' యు కలిపినచో మొత్తము వెలుతురు ౯ మాసములుండును. తక్కన మూడుమాసములును (౯౦ రోజులే ౯౫ రోజులును) దీర్ఘరాత్రియే. ఇంతకుమించిన దీర్ఘరాత్రిని ఆర్యులెరుగరు. ఈలెక్క పైనవివరించిన ౧౦౦ రోజుల పరిమితిగల 'శతరాత్ర' క్రతువుతో సరిపోవుచున్నది. నూరురోజులకెక్కువ దీర్ఘరాత్రిలేదుగనుక, నూరురోజుల పరిమితి

గల "శతరాత్ర" క్రతువునకంటె యెక్కువ పరిమితిగల రాత్రి క్రతువులును లేవు.

ఉపస్సునుగూర్చియు, యీరెండనుగూర్చియు ప్రత్యేక క్రతువులుండుటచే యివి రాత్రిక్రతువులలో చేరవు. కనుక, రాత్రిక్రతువులసంఖ్య నూరింటిలో డనే నిలిచిపోవుట మిక్కిలి సహజముగనున్నది. ఎందుననుచేరక ప్రత్యేకముగ నిలిచి యున్న రాత్రిక్రతువులనుగూర్చియు ఇందు ముఖ్యముగ "నూరు" అనుసంఖ్యనుగూర్చియు, యింతసరళమగు భావార్థము ఒక్కధ్రువసిద్ధాంతము పైననేతప్ప మరి యేయితర సిద్ధాంతముపైనను కుదురదు. దీనినిబట్టి ఒకమాసము ఉపస్సును ౭ మాసములు సూర్యకాంతియు, ఒకమాసము యీరెండయు, 3 మాసములు దీర్ఘరాత్రియుకలిసి ప్రాచీన కాలమందొకప్పుడు ఆర్యులకు సంవత్సరముగ నేర్పడెనని యీరాత్రిక్రతువుల చరిత్రమువలన ధ్రువపడుచున్నది.

ఈ యంశమును బలపరుచుట కింకొక ప్రబలప్రమాణము గలదు. ఇంద్రునకు "శతక్రతు" అను నామధేయము ఋగ్వేదమందు గలదు. ఇటీవల ప్రబలిన పురాణములలో కూడ ఇంద్రుడు నూరుక్రతువులకు అధిపతియనియు, నూరు క్రతువుల కధిపతియైనవాడే ఇంద్రపదవికి అర్హుడనియు కూడ చెప్పబడియున్నది. ఈపురాణగాథకును, ఋగ్వేదమందున్న 'శతక్రతు' నామధేయమునకును సంబంధములేదన్నియు, వేదములో ఇంద్రునకు చెప్పబడిన "శతక్రతు" పదమునకు

"నూరుశక్తులకు అధిపతి" యని భావమనియు శాయనాచార్యులవారును, వారిననుసరించి పాశ్చాత్యపండితులుకూడ వ్రాసియున్నారు. కాని, నూరురాత్రిక్రతువుల యుత్పత్తిని గూర్చి నేను పైనచేసిన వివరణము నిజమైనచో, ఇటీవల పురాణములలో ప్రబలినగాథ కేవలము ఋగ్వేదమందున్న శతక్రతునామధేయము పైననే ఆధారపడియున్నదని చెప్పక తప్పదు. ఈ నూరురాత్రిక్రతువుల కింతవర కెవరును సరియైన సమాధానము చెప్పలేదు. దీర్ఘరాత్రియందు "వల" యను రాక్షసునితో పోరాడుటకు సాహసించినది ఇంద్రు డొక్కడే. ఈ యింద్రుని గూర్చియే యీ నూరురాత్రిక్రతువును చేయబడినవి. కనుక, ఇంద్రుడు నూరుక్రతువులకు అధిపతియనుట యెంతయు సమంజసముగ నున్నది. ఇట్లు నూరుదినములు "వల"తో, చీకటియందు పోరాడి, నూరుక్రతువుల కధిపతియైనవా డీ ఇంద్రు డొక్కడే. కనుక "శతక్రతు" అను బిరుదునకును, ఇంద్రపదవికిని, యీ ఇంద్రు డొక్కడే అర్హుడు. అందుచేతనే, ఋగ్వేదమం దింద్రునకు "శతక్రతు" నామధేయము వచ్చెను. ఈ నామధేయములో నిమిడియున్న భావమునుబట్టియే ఇటీవలి పురాణములుకూడ ఇంద్రుడు నూరు యజ్ఞముల కధిపతి యయ్యెనని చెప్పినవి.

అయితే, ఇంద్రపదవికి అర్హత నిచ్చు యీనూరుక్రతువులును అశ్వమేధములని పురాణములు చెప్పుచున్నవి. దీనిని సమన్వయించు టెట్లు? ఋగ్వేదమందు చెప్పబడిన శతరాత్రి

క్రతువు అశ్వమేధమా? ఈభేదమంతగ పాటింపదగినది కాదు. ఏలననగ:- అశ్వమేధముకూడ ఒకానొక సోమయాగమే కాని, వేరు కాదు. కర్మకాండయందీ అశ్వమేధము రాత్రిక్రతువు లతో పాటు వర్ణింపబడియున్నది. తైత్తిరీయసంహిత VII, 2, 11 లో —— అశ్వమేధమం దర్పింపవలసిన నూరు బలులు పేర్కొనబడియున్నవి. ఈబలులు లేక హోమములు ప్రజా పతికి "రాత్రియందు" అర్పింపబడెనని తై॥ బ్రా॥ III, 8, 15, 1- చెప్పుచున్నవి. కనుక, అశ్వమేధమం దర్పింపబడు హోమములు "రాత్రిహోమముల"ని చెప్పబడుచున్నవి. యజ్ఞాశ్వమెప్పుడు తిరిగివచ్చునో తెలియదు గనుక అశ్వ మేధముయొక్క అవధికూడ యొక్కడను నిర్ణయింపబడలేదు. యజ్ఞాశ్వమనగ నీటిలో సంచరించుచున్న సూర్యుడని ఋ I, 163, 1 చెప్పుచున్నది. ఆయా పరిదేశములలో నుండు దీర్ఘ రాత్రియొక్క పరిమితిననుబట్టి, రాత్రిక్రతువులపరిమితులవలనే, యీయశ్వమేధముయొక్క పరిమితులుకూడ భేదించుచుండ వచ్చును. కనుక, యజ్ఞాశ్వముతిరిగివచ్చుటయు, సూర్యుడు దీర్ఘరాత్రినితరించి తిరిగి యుదయించుటయు నొక్కటే. కనుక, యింద్రునకు సహాయార్థముగ దీర్ఘరాత్రియందు చేయ బడినరాత్రిక్రతువులకును అశ్వమేధమునకును పోలిక సర్వవిధ ములచేతను విధాయకముగ సరిపోవుచున్నది. పూర్వము, ఋగ్వేదమందు శతరాత్రక్రతువుగ వర్ణింపబడిన సోమయా గమే యిటీవల పురాణములందు అశ్వమేధమను సోమయాగ

ముగ వర్ణింపబడిన దనుటలో మహాశ్చర్యమేమియు లేదు. ఈరెండును ఒకపరంపరనే తెలుపుచున్నవి. ధ్రువసిద్ధాంతము యొక్క ఆధారముచే వీనికన్నిటికిని చక్కని సమన్వయము కుదురుచున్నది.

"శతక్రతు" పదమునకు "నూరుశక్తులకధిపతి" యని చాలచోట్ల శాయనులవారును, వారి ననుసరించి అన్ని చోట్ల పాశ్చాత్యులునుకూడ అర్థముజెప్పిరి. కనుక, దీని నిజార్థమేమియో మన మిప్పుడు విపులముగ చర్చించవలసి యున్నది.

"శతక్రతు" లోని "శత" అను శబ్దమునకేమిఅర్థము చెప్పవలెను? "శత" అనగ "అనేక" మని కొందరుచెప్పిరి. కాని యిదిసరికాదు. "శత" అనగ నూరు – కేవలమునూరు – అనియే చెప్పవలెను. ఎట్లనగ:– ఇంద్రునకనేక పేర్లుగలవు. శతనీత, సహస్రనీత; శతం–ఊతి, సహస్రం–ఊతి; శతమన్యు (ఋ), సహస్రమన్యు (సా. వే), సహస్రముష్క (ఋ). ఇవి గాక యింద్రుని బాణమునకు శతబ్రధ్న, సహస్రప్రాణ అని పేర్లుగలవు. మరియు 'సోమ' మునకు శతయామన్, సహస్రయామన్ – అను విశేషణములు ప్రయోగింపబడినవి. ఈపైనవివరించిన పేర్లన్నిటిలోను "శత, సహస్ర" అను పదములు "అనేక" అను భావములో ప్రయోగింపబడియున్నవి.

పై జాబితానుబట్టి చూచినచో "శతనీతి"కి ప్రతిగ "సహస్రనీతి" కలదు. "శతం–ఊతి" కిబదులుగ "సహస్రం–

ఊతి” గలదు. ఇట్లే ప్రతిచోటను “శత”కు బ్రతిగ “సహస్ర” గలదు. ఈపేర్లలో “శత” యన్నను “సహస్ర” యన్నను “అనేక”మనియేఅర్థము. కాని, శతక్రతుపేరునకు బ్రతిగ “సహస్రక్రతు”అనుపేరు వేదములందెక్కడను లేదు. శతక్రతు పదముఋగ్వేదమందు షుమారు ౬౦ సార్లును, తదితర వేద గ్రంథములందనేక పర్యాయములును బ్రయోగింపబడి యున్నది. ఇంద్రుడు “అనేకక్రతువులకధిపతి” యనుభావమే యుండియున్నచో పైపేర్లన్నిటితోపాటు “సహస్రక్రతు” అను పేరేల ప్రయోగింపబడదు? కనుక ‘శతక్రతు’ లోనున్న “శత”కును తక్కినపైపేర్లలోనున్న “శత”కును స్వభావమందు చాలభేదముగలదు. ఇంద్రుడు నూరుక్రతువులకంటె యెక్కువ క్రతువులకధిపతిగాడు గనుక, “శత” అనగ “నూరు” అను అర్థమందే “శతక్రతు” పదమును ప్రయోగించి, అంతటితో నిలిచిపోయిరేగాని “సహస్రక్రతు” అని పేరు పెట్టుటకు వైదికఋషులకధికారములేమిచే వారాపదము నెచ్చటను ప్రయోగింపరైరి. ఇంద్రుడు నూరుక్రతువులకే అధిపతియని తమకుగట్టిగ తెలిసినప్పుడు, ఆతనికి “సహస్ర క్రతు” అని పేరుపెట్టుట తప్పని వైదికఋషు లెరుంగుదురు. అందుచేతనే, వేదమందెక్కడను “సహస్రక్రతు” అను పేరు ప్రయోగింపబడలేదు. కనుక, “శతక్రతు” లోని “శత” కు “నూరు” అనియే ఖండితమైన అర్థము. ఋ 1, 102, 6 లో యింద్రునకు “అమితక్రతు” అనుపదము

ప్రయోగింపబడినది; "అమిత" అనగ "నూరుకంటె యెక్కువ" అను అర్థమెక్కడనున్నది? ఇంతమాత్రముచే "శతక్రతు" లో నున్న "శత" కు "నూరు" అను సరళమైన అర్థమును వదలివేయవలెనను భావ మెచ్చటను లేదు.

ఇక, "శతక్రతు" లోని "క్రతు" అనగనేమి? "క్రతు" అనగ 'శక్తి' యని కొందరుచెప్పిరి. "శతక్రతు" అనగ "నూరుశక్తులకధిపతి" యట! ఏనూరుశక్తులు? ఇంద్రునకు ప్రత్యేకముగ ఫలానిఫలాని శక్తులు మొత్తము నూరు మాత్రమే గలవని యెచ్చటను లెక్కబెట్టిచెప్పబడలేదు. పోనీ, అనేకశక్తులకధిపతియందుమా యన్నచో, "శత" అనగ, నూరనియే అర్థముగాని, "అనేకము" గాదని పైన నిరూపించితిమిగద. కనుక, "క్రతు" అనగ "యజ్ఞ" మనియే అర్థము చెప్పవలెను. ఇదిగాక, యజ్ఞమను నర్థమందే "క్రతు" శబ్దము ఋగ్వేదమందు చాలచోట్ల ప్రయోగింపబడియున్నది. ఇట్టి ప్రయోగములు ఋగ్వేదమందుండియే యున్నప్పుడు "శతక్రతు" పదమును "నూరుయజ్ఞముల కధిపతి"యను భావములో నేల ప్రయోగించకూడదు? దీనికి అభ్యంతరమేమియో నాకు తోచలేదు. అందునను, ముఖ్యముగ, ఇటీవలి పురాణములుకూడ యీ యర్థమునే చెప్పుచున్నప్పుడు దాని నింకొకవిధముగ నన్వయించుట స్వభావవిరుద్ధముగ గన్పట్టుచున్నది.

ఇంద్రుడు శత్రుపురములను 90,99 లేక నూరింటిని నాశనమొనర్చినట్లు ఋగ్వేదమందు పలుతావులలో వర్ణన గలదు. ఇదికూడ మన యర్థమునే బలపరుచుచున్నది. "దేవపురాః" (దేవతలకోటలు) అనగ "దినములు;" అని ఐతరేయసంహితావాక్యమునకు అర్థము చెప్పబడినది. శంబరుడను రాక్షసుడు యింద్రునకు శత్రువు. ఈశంబరపురము లనే యింద్రుడు నాశన మొనర్చెను. దేవపురములనగ దినములైనప్పుడు శత్రుపురము లనగ రాత్రు లనియే అర్థము. దేవతలకు పగలెట్లు కోటయో, రాత్రులకుచీకటియు నట్లే కోటయయ్యెను. ఈరాక్షసులీచీకటికోటలలో దాగకొనిరి. ఇంద్రుడీ చీకటికోటలను నూరింటిని నాశనమొనర్చెనన నూరురోజుల పరిమితిగల దీర్ఘరాత్రియందు యింద్రుడు రాక్షసులతో పోరాడి, సూర్యుని పైకితెచ్చెనని భావము. ఈదీర్ఘరాత్రియందే ఆర్యులు శతరాత్రాది "రాత్రిక్రతువుల" నూరింటిని జేయుచుండిరి. ఈదీర్ఘరాత్రియందే యింద్రుడు "అహి" తోపోరాడుచు నాన నదులను (స్రవంతీః) దాటెను. (I, 32, 14). ఈదీర్ఘరాత్రియందే "కుత్స" యను వాడు యింద్రుని నూరు తోలుపట్టీలతో తనయజ్ఞమునకు కట్టివేసి, "నిన్ను నీవే విడిసించుకొనుమ"ని చెప్పెనట. (తైం. బ్రా. IX, 2, 22; ఋ X, 38, 5) ఈవర్ణనలన్నియు నొకేభావమును సూచింపుచు, ఒక్కయింద్రునే నూరుయజ్ఞముల కధిపతిని జేయుచున్నవి; మరియు వైదికఋషులయొక్క పూర్వ

తరములవారొకప్పుడు నూరుదినముల దీర్ఘరాత్రిగల ఉత్తర ధ్రువమండలమందున్నట్లు స్పష్టముగ ఋజువుజేయుచున్నవి.

ఋ V, 48, 3 లో ఆ గ్రావభిరహాన్యే భిరక్తుభిర్వరిష్ఠం వజ్రమా జిఘర్తి మాయిని। శతం వా యస్యప్రచరన్ స్వే దమేసంవర్తయన్తో వి చ వర్తయన్నహా॥ యింకొక ప్రబల దృష్టాంతముగలదు. "ఇంద్రుడు వృత్రాసురుని వజ్రములో కొట్టుచున్నకాలమందు యింద్రుని మందిరములో చరించు చున్న నూరును (యజ్ఞములు) సాధారణదినములయొక్కగతిని తెగగొట్టి, మరల పునరుద్ధరించుచుండును." అని యీఋక్కు యొక్క అర్థము ఆనూరును యేమి? ఇవే దీర్ఘరాత్రియందు చేయబడుచున్న రాత్రిక్రతువులు; లేదా ఇంద్రజయమునకు కావలసిన నూరుదినములు. సూర్యరశ్మి నశించి మరల సూర్య రశ్మి వచ్చులోపల ధ్రువమండలమందు నూరుదినముల దీర్ఘ రాత్రియుండునుగద. ఈ దీర్ఘరాత్రి సాధారణదినముల గతిని తెగగొట్టి, మరల పునరుద్ధరించుచున్నదని చెప్పుట యెంతయు సహజముగనేయున్నది.

ఇంద్రుడు వృత్రాసురుని చంపి అతనిచే బంధింపబడిన ఆవులను లేక నీళ్ళను విడిపించి, ఉషస్సును లేక సూర్యుని పైకి తెచ్చెనని ఋగ్వేదమందు గలదు. దీనికి సరిసమానమైన కథయే పారశీగ్రంథములందుకూడ గలదు. "తిష్ట్రియ" యను నాతడు "అపోష" యను రాక్షసుని చంపి నీళ్లను, లేక ఉషస్సును, లేక సూర్యకాంతిని చెరనుండి విడిపించెను. ఈ

కథలో చెప్పబడిన "నీరు" అనగ మేఘములను చీల్చి తెచ్చు వర్షపునీరని కొందరు అర్థముచేయుచున్నారు. కాని, యిది సరికాదు. ఉషస్సు లేక సూర్యకాంతి లేక నీరు చెరనుండి విడిపింపబడినవి. ఒక భావమే యిన్నిరూపములుగ, యిన్నికథలుగ వర్ణింపబడెను. ఈకథలలో చెప్పబడిన నీటియొక్క స్వభావమునుగూర్చి ముందు చర్చింపనున్నాము. ఈకథలన్నియు అంధకారమునకును, వెలుతురునకును జరిగిన పోరాటమును దెలుపుచున్నవి.

'అహురామజ్దా' చేసిన "హియోమ" (సోమ) యాగముచే ప్రోత్సహింపబడినవాడై "తిష్ట్రియ" యను దేవత "అపోష" యను రాక్షసుని సంహరించెను. ఈ యుద్ధము "వోరు-కశా" యను సముద్రమునందు జరిగెను. "అపోష"ను సంహరించి "తిష్ట్రియ" యా సముద్రజలము నుండి జయప్రదముగ బయటికి వెడలివచ్చెను. ఈయుద్ధమునందు "అపోష" రాక్షసుడు నల్లనిగుర్రముయొక్క రూపమును దాల్చెను. "తిష్ట్రియ" తెల్లనిగుర్రమై అతనితో పోరాడి, అతనిని చంపి, జయప్రదముగ సముద్రమునుండి వెడలివచ్చెను. ఇట్లే యజ్ఞాశ్వము సముద్రజలమునుండి బయటికి వెడలివచ్చెనని ఋగ్వేదము (I, 163, 1) చెప్పుచున్నది. తాను శత్రువును జయించి, భక్తులకు నియమితకాలమందు పాడసూపుటకుగాను భక్తులైనవారేమి చేయవలసియుండునో "తిష్ట్రియ" యను నీదేవత భర్తుడగు "అహురామజ్దా" తో యిట్లని చెప్పుచున్నాడు.

"నన్ను పేరుబెట్టి ఆహ్వానించుచు, యజ్ఞముచేసి, నన్నుపూజించినభక్తులకు నేను సకాలమందు (నియమితకాలమందు) పొడసూపుదును. ఒకరాత్రియైననుసరే, రెండురాత్రులైననుసరే, యేబది రాత్రులైననుసరే, నూరు రాత్రులైననుసరే, నేను సకాలమందు (నియమితకాలమందు) పొడసూపుదును.

ఈవాక్యములు చాలభావగర్భితములుగనున్నవి. సకాలము (లేకనియమితకాలము) అనగ యీ "తిష్ట్రియ" దేవత చీకటిరాక్షసునితో పోరాడినకాలమని యర్థము. (౧) ఈ కాలము ఒకటి మొదలు నూరు రాత్రులవరకుండవచ్చును. (౨) ఈయుద్ధకాలమందు భక్తులు తనపేరుబెట్టిపిలిచి సోమయజ్ఞమునుచేయుచు తనకు ఉత్సాహమును గలుగజేయుచుండవలెను. వృత్రాసురవధయందుకూడ యింద్రున కుత్సాహముగలుగుటకై "రాత్రిక్రతువు"లను నూరు సోమయాగములు చేయబడెనని వేదవాఙ్మయమందు గలదు. కనుక యీ పారశీకథకూడ రాత్రిక్రతువుల యుత్పత్తినిగూర్చి నేను పైనవివరించినభావమునే బలపరుచుచున్నది. పారశీకథయందున్న "నియమితకాలము" ఒకటిమొదట నూరు రాత్రులవరకేల యుండవచ్చునో యెవరును యింతవరకు సమాధానముచెప్పలేదు. రాత్రిక్రతువుల యవధులుకూడ ఒకటిమొదలు నూరు రాత్రులవరకే యుండునని మన వేదముజెప్పుచున్నది. మన భారతీయ, పారశీకపు టార్యులెరిగినంతవరకు ఇంద్ర, వలలకు లేక తిష్ట్రియ, అపోషలకు జరిగిన యుద్ధము మొత్తముమీాద

నూరు రాత్రులకంటె యెక్కువకాలము పట్టలేదనియు, యీయుద్ధము "వోరుకశా" యందు లేక అంధకారావృత మైన సముద్రమందు జరిగెననియు యీకథలవలన తెలియు చున్నది. "వెరెత్రఘ్న" యను పారశీదేవత చక్కని మేష రూపమును దాల్చెనట; వృత్రఘ్నుడగు యింద్రుడుకూడ మేషరూపమునుదాల్చెనని ఋ VIII, 2, 40-చెప్పుచున్నది. పారశీగ్రంథమందొకచోట నూరు ఘనకార్యములు చేసిన మేషము (మేషాహె శతోకరహె) వర్ణింపబడెను. మేష రూపుడైన "వెరెత్రఘ్న" డే యీనూరుఘనకార్యములు చేసిన "మేషాహె శతోకరహె" గావచ్చును. మేషరూపు డైన వృత్రఘ్నుడే నూరుయజ్ఞములకధిపతియైన "శతక్రతు" డని పైన వివరించితిమి. కనుక పారశీగ్రంథములో నున్న "శతోకరహె" మన వేదములో నున్న "శతక్రతు" పద మును పోలియున్నది. పారశీక, వైదికభావములు సర్వవిధ ములచేతను సమానముగనే యున్నవి. వైదిక ఋషులపూర్వ తరముల వారొకప్పుడు కాపురమున్నచోట భిన్నయవధులు గల దీర్ఘరాత్రు లుండుటచేతనే యీరాత్రిక్రతువులు మొట్ట మొదట ఉత్పన్నమయ్యెనని యీ హిందూ పారశీ గాథలవలన స్థిరమగుచున్నది.

ఇదిగాక, పారశీగ్రంథములందొకచోట తిష్ట్ర్య యను దేవత "మానవుల సంవత్సరచక్రమును తిరిగి యిచ్చుటకై తెచ్చెను" అని చెప్పబడియున్నది. ఈవాక్యము "ఉషస్సు

మానవయుగముల (మానుషాయుగా) నడకను సాగించెను" అను మన వేదవాక్యముతో తులదూగుచున్నది. అనగ, నక్షత్రవధ లేక అహోమవధ పూర్తియై, దీర్ఘరాత్రి యంత మొందగనే, నూతనసంవత్సరము దీర్ఘఉషస్సుతో ప్రారంభమై, తదుపరి అక్షాంశభేదములనుబట్టి ౭ మొదలు ౧౧ నెలలవరకు సూర్యరశ్మితో నొప్పారుచుండెనని భావము.

ఇంతవరకు చర్చించిన యంశముల నాధారము జేసికొని, మన మిప్పుడు "అతిరాత్ర" మనగ నేమి యర్థమో చూతము. ఈ క్రతువు నిప్పటికిని, రాత్రిపూటయే చేయబడుచున్నది. కనుక నిచ్చట "రాత్రి"యనగ 'దిన' మని యర్థము జెప్పుటకు మీమాంసకులకు సాధ్యము కాలేదు. సరే, యింతవరకు బాగుగనే యున్నది. అయితే, యీ యజ్ఞమునకు "అతిరాత్రి" యను పేరేలవచ్చెను? "అతి" యనగ అర్థమేమి? "అతి" అనగ "ఒకదానిని మించిన" లేక "ఒకదానికి ఆవలిప్రక్కగగాని, యీవలిప్రక్కగానియున్న" అని అర్థము. "ఈఅతిరాత్రి" పదముఋగ్వేదమందు VII, 103, 7-లో మాత్రమేగలదు. దీనికి శాయనాచార్యులవారిట్లని అర్థముజెప్పిరి. "రాత్రిం అతీత్య వర్తతే యితి అతి రాత్రః" = "రాత్రిని గడచినట్టిది లేక మించినట్టిది యేదైతేగలదో అది అతిరాత్రము." ఆపస్తంబశ్రౌతసూత్రములకు వ్యాఖ్యవ్రాయుచు రుద్రదత్తుడుకూడ యీ యర్థమునే జెప్పెను. కనుక, రాత్రియొక్క ఆద్యంతముల

యందు చేయబడినక్రితువే అతిరాత్రిక్రితువు. అసురులను రాత్రియొక్క చీకటినుండి తరిమివేయుటకుగాను యీయతి రాత్రిక్రితు వుద్దేశింపబడినదని ఐ॥ బ్రా॥ IV, 5 స్పష్టముగ జెప్పుచున్నది. ఈఅతిరాత్రిక్రితువును మొట్టమొదటజూచిన ప్రిజాపతి యీక్రితువునుండి రాత్రింబవళ్ల జంటను (అహో-రాత్రే) సృజించెనని తండ్యబ్రాహ్మణము (IV, 1, 4, 5) చెప్పుచున్నది. ఏరాత్రియంతమొందగనే, మామూలురాత్రింబవళ్ళజంటతిరిగి యుత్పన్నమయ్యెనో ఆట్టిరాత్రి యొక్క అంతమందే యీ "అతిరాత్రి" క్రితువుచేయబడెనని పైవాక్యమునుబట్టి స్పష్టమగుచున్నది. అనగ, యీఅతిరాత్రిక్రితువు చేయగనే, మామూలు అహోరాత్రములనడక తిరిగిప్రారంభమయ్యెనని తాత్పర్యము.

దీర్ఘరాత్రి అంతమొందగనే మామూలు అహోరాత్రముల నడక ప్రారంభమగునని యిదివరకు వివరించియుంటిమి. కనుక, యీదీర్ఘరాత్రియొక్క అంతమందే యీ అతిరాత్రక్రతువు చేయబడవలెనని పైవివేచనమునుబట్టి నిర్ధారణమగుచున్నది.

మనదేశములందిచ్చట అహోరాత్రములు సంవత్సరము పొడవునను — మధ్య అవాంతరమేమియు లేకుండ — నడచుచునే యుండును. కనుక, యీ అహోరాత్రము లన్నియు సంవత్సరములో నేదియోయొక్క ఘోరాంధరాత్రి నుండియే పుట్టినవని వేరిలుపెట్టి చూపించుటకు వీలు లేదు.


అదిగాక, సంవత్సరములో ప్రతిరాత్రినుండియు అసురులను తరిమివేయుటకై యీ క్రతు వుద్దేశింపబడినదని వాదించినచో, యీ అతిరాత్రక్రతువును ౩౬౦ రాత్రులలోను చేయుచుండవలసినదేగద. కాని అట్లు జరుగుటలేదు. ఈ అతిరాత్రక్రతువు సత్రముయొక్క ఆద్యంతములందు మాత్రమే (అనగ, సంవత్సరములో ౨ పర్యాయములు మాత్రమే) చేయబడుచున్నది. అదిగాక, సత్రముయొక్క నిజమైన ఆద్యంతములు యీ అతిరాత్రక్రతువులు కానేకావు. చతుర్వింశమహావ్రతదినములే సత్రమునకు నిజమైన ఆద్యంతములని పై ప్రణాళికలో వివరించి యుంటిమి — చూడుడు. వార్షిక సత్రము లిప్పుడు ౩౬౧ దినములు జరుగుచున్నవి. ఈ సత్రముయొక్క ౩౬౦ దినములలో మొదటి రాత్రి నుండియు చివరి రాత్రినుండియు మాత్రమే రాక్షసులను తరిమివేయుటకై యీఅతిరాత్రిక్రతువు లుద్దేశింపబడినవని చెప్పుటకువీలులేదు. ఇది యే నిజమైనచో తక్కిన ౩౫౮ దినములనుండిమాత్రము రాక్షసులను తరిమివేయవలసిన అవుసరము లేదాయను ప్రశ్న బాధించును. కనుక, రాక్షసులను తరిమివేయవలసిన అగత్యముగలరాత్రి యేదియోయొకటి ప్రత్యేకముగ — యీసత్రదినములలో చేరకుండ — ఉండియుండవలెను. ఈ విధముగ సత్రదినములలో చేరకుండ కేటాయింపుగ — ప్రత్యేకముగనున్న యిట్టి రాత్రియొక్క ఆద్యంతములందే యీఅతి

రాత్రిక్రతువు జరుగుచుండెననుట నిర్వివాదాంశముగ గన్పట్టుచున్నది. ఇట్టిరాత్రియేది ?

ఆర్యులు ధ్రువమండలమందున్న ప్రాచీనకాలమందు సూర్యరశ్మి ౧౦ మాసములే యుండెననియు, తక్కినరెండు మాసములు దీర్ఘరాత్రిగనుండెననియు దెలిపితిమి. కనుక, "గవాం అయనము"వంటి వారిప్రాచీన వార్షికసత్రములు ౧౦ మాసముల యవధిమాత్రమే గలిగియుండెనని తెలిపితిమి. ఈపదిమాసముల వార్షికసత్రము పూర్తికాగనే ౨ మాసములు దీర్ఘరాత్రి వచ్చుచుండెను. ఈదీర్ఘరాత్రినుండియే రాక్షసులను తరిమివేయుట అవసరమయ్యెను. కనుక, యీదీర్ఘరాత్రియొక్క అద్యంతములందే యీఅతిరాత్రక్రతువు చేయబడుచుండెను. ఈదీర్ఘరాత్రిసమాప్తిమొందగనే, మరలమామూలు అహోరాత్రములును, వానితోపాటు సత్రమును యథాప్రకారముగ ప్రారంభమయ్యెను. ఈమామూలు రాత్రులందు అసురులను తరుమువలసిన పనిలేదు; యేలననగ:—తండ్యబ్రాహ్మణము జెప్పినట్లు—అతిరాత్రక్రతువుయొక్క ఉద్దేశము అంతటితోనే (దీర్ఘరాత్రితోనే) నెరవేరిపోయినది. కనుక, ప్రతిమామూలు రాత్రియందును అతిరాత్రక్రతువు జేయవలసిన అవసరము లేక పోయెను.

ఇంతవరకు తేలిన సారాంశమేమనగ:—౧౨ మాసములకు తక్కువయైన "గవాం అయనము" వంటి ప్రాచీన

పటము 13.



వార్షిక సత్రముయొక్క యవధిలో చేరకుండ విడిగనున్న దీర్ఘరాత్రినుండి రాక్షసులను తరిమివేయుటకై ఆదీర్ఘరాత్రి యొక్క ఆరంభమునందును, తుదియందును యీ అతిరాత్రి క్రతువులు చేయబడుచుండెను. ఇవి యీదీర్ఘరాత్రియందు గాక, దీర్ఘరాత్రియొక్క ఆద్యంతములందుమాత్రమే చేయ బడుటచే "అతి" యను ప్రత్యయమీ "రాత్రిక్రతు" వులకు చేర్చబడెను. అందుచే యివి "అతిరాత్ర" క్రతువు లయ్యెను. తక్కిన ద్విరాత్ర, త్రిరాత్రాది రాత్రిక్రతువులు కేవలము దీర్ఘరాత్రియందే—అనగ, ఆద్యంతములందున్న యీ రెండు అతిరాత్రిక్రతువులకుమధ్య—జరుగుచుండెను.

బ్లాకు నం. 13 రు. A మొదలు B వరకు పదిమాసములు మామూలు అహోరాత్రములు (దీర్ఘ దివసముతో సహా;) యిది సత్ర

కాలము. ఈ పదిమాసముల సత్రముపూర్తికాగనే దీర్ఘరాత్రి ప్రవేశించును. ఈదీర్ఘరాత్రియొక్క ప్రదేశమందు B వద్ద అతిరాత్రము జరుగును; పిమ్మటదీర్ఘరాత్రికాలమందు ద్వి రాత్ర, త్రిరాత్రాది రాత్రిక్రతువులు జరుగును. A. వద్ద దీర్ఘరాత్రియంత మొందును. ఈయంతమందు మరల యిం కొక అతిరాత్రక్రతువు జరుగును. ఈఅతిరాత్రక్రతువు కాగనే తిరిగి మామూలు అహోరాత్రములును, దానితోపాటు సత్రమును ప్రారంభమగును ఈవిధముగ సంవత్సరచక్రము


పూర్తియగును. ఇది ధ్రువమండలమందున్నప్పటి ప్రాచీన పద్ధతి. కాని, ఆర్యులు ధ్రువమండలమును వదలి ౧౨ మాసముల సూర్యరశ్మిగల దక్షిణదేశములకు వచ్చినప్పుడు దీర్ఘరాత్రిమాయమైపోయెను; దీనితోపాటు ద్విరాత్రి, త్రిరాత్రాది రాత్రిక్రతువులయొక్క ప్రయోజనమును నశించెను. వీనిప్రయోజనమిట్లు నశించిపోయినందున కొంతకాలమునకు వీనిపుట్టుకయొక్క పూర్వోత్తరచరిత్రము. మరుగుపడిపోయెను. అందుచే, వీనినేమిచేయుటకును తోచక, మీమాంసకులు రాత్రి యనగ "దిన" మని అర్థముచెప్పి వీనిని దినక్రతువుల క్రిందికిమార్చి, వీనినొక ప్రత్యేకసోమయాగవర్గముగ నేర్పాటు చేసియుంచిరి. ఇట్లు దీర్ఘరాత్రితోపాటు రాత్రిక్రతువులు మాయమైపోయినను, ఆద్యంతములందున్న అతిరాత్రక్రతువులు రెండునుమాత్రము మన అదృష్టమువలన యెట్లో నిలిచియుండెను. పూర్వము ౧౨ మాసములకు తక్కువగనున్న సత్రమిప్పుడు సంపూర్ణముగ ౧౨ మాసములకు * పెంచబడెను. పూర్వముండిన దీర్ఘరాత్రి ముడుచుకొని శూన్యమైపోగనే దానిఆద్యంతములందుండిన అతిరాత్రములు రెండును యిప్పుడు యీ ౧౨ మాసముల సత్రమునకు ఆద్యంతములుగ నేర్పడుట

---

* పై పట్టికను జూడుడు:—స్థిరభాగముల నటుంచి, అస్థిరభాగములను మన యిష్టమువచ్చినట్లు పెంచవచ్చును; లేక తగ్గించవచ్చునని యిదివరకే చెప్పియుంటిమిగద.—

ప్లేటు 14

[redacted]



౧౨ మాసములును సూర్యరశ్మి యుండుటచే దీర్ఘరాత్రి క్షీణించిపోవును. కావున దీర్ఘరాత్రియొక్క ఆద్యంతములుగను చేయబడు అతిరాత్ర మిప్పుడు సంవత్సరముయొక్క ఆద్యంతములుగా నాచరింపబడుచున్నది.

తటస్థించెను. ఈరీతిగ యాజ్ఞికులు వార్షికసత్రప్రణాళిక యం దీరెండు అతిరాత్రములకును కొంతనిలువనీడ నిచ్చియుండిరి.

ప్లాను నెం. 14 రు.

పూర్వము దీర్ఘరాత్రియొక్క ఆద్యంతము లందాచరింపబడుచు వచ్చిన యీ అతిరాత్రములిప్పుడు ౧౨ మాసముల వార్షికసత్రమునకు ఉపక్రమోపసంహారక్రతువులుగ ఆచరింపబడుచున్నవి. ఆహా! అతిరాత్రమను శబ్దమిదివరకే నాశనమైపోయి యుండినచో మనకీప్రాచీనచరిత్రమంతయు మరుగుపడిపోయెడిదేగదా. ఈచిన్నతీగ యొక్కటియైనను యిప్పటికి నశింపకుండ మిగిలియుండబట్టియే, దీనిని బట్టుకొని మా[illegible]కసంతయు కదలింపగలిగితిమిగద. ఈఅతిరాత్రములవలన కొంతకు కొంతయైనను ప్రయోజనముండుటచే యవిరోధమును వార్షికసత్రప్రణాళికయం దిప్పటికిని యేదో విధముగ నిలిచియుండుట తటస్థించెను. కాని, దీర్ఘరాత్రి యనునదిప్పుడు అసలుపేరే లేకుండ పూర్తిగ మాసిపోవుటచే, అందు చేయబడుచున్న రాత్రిక్రతువులగతి యేమయ్యెనో మన మిదివరకే విచారించితిమిగద. వీనికి ౧౨ మాసముల వార్షికసత్ర ప్రణాళికయందు తలదాచుకొనుటకైనను చోటు లేకపోయెను. వీనియొక్క పుట్టుపూర్వోత్తరమెల్లరును మరచి పోవుటచే వీనిని వెలివేసినట్లు దూరముగనుంచిరి. అంతట,

పాపము! మీమాంసకులువచ్చి 'రాత్రి' యనగ "దిన" మని యర్థముచెప్పి వీనిని ప్రత్యేక మొక దైనికసోమయాగ వర్గముగ నేర్పాటుజేసి, కొన్నింటిని అహీనవర్గము క్రిందికిని, మరికొన్నింటిని సత్రవర్గముక్రిందికిని జేర్చిరి.

పైన వివరించిన మార్పులన్నియు నెట్లు జరిగినవో విపులముగ విచారించుట కిది యదనుగాదు. ప్రాతపంచాంగమును మార్చి, నూతనపరిస్థితుల కనుగుణముగ క్రొత్త పంచాంగమును నిర్మించుట సులభమైన పనిగాదు. ఇది బహు కష్టసాధ్యమైన పనియని యెరుంగవలెను. ఆర్యులకు యజ్ఞ కర్మ చాల ప్రధానమైనది. ప్రాతయజ్ఞములందు దేశకాలాది పరిస్థితులనుబట్టి క్రొత్తమార్పులను చేయక తప్పినదికాదు. అయినను, పూర్వాచారములందు వీరికి పట్టుదల మెండుగ నుండుటచే యీ నూతన యజ్ఞపద్ధతులయందును పూర్వపు ప్రాతయాచారములను సాధ్యమైనంతవరకు చాల భాగము నిలుపుకొనవలెననియే వీరు పెనగులాడి యుందురు. ఈ మార్పులన్నియు బహుశః బ్రాహ్మణములను రచించినవారును, తత్పూర్వమందున్న బ్రహ్మవాదినులును చేసియుందురు. వీరీ మార్పులను చేయబూనిన నాటికే యీ ప్రాచీనాచారములయొక్క నిజమగు భావార్థములు మరుగుపడిపోయెను. ఇట్లు నిజభావములు మరుగుపడిపోయిన ప్రాచీనాచారములను పూర్తిగ వదలిపెట్టుటకు వీలులేకపోయెను; తగిన యర్థములు జెప్పుట కంతకంటె చేతగాకపోయెను. ముందుకు పోయిన

నూఱు, వెనుకకు పోయిన గోయి— యన్న చందమాయెను. కనుక, యీ బ్రాహ్మణములను రచించిన పండితులు బహు శ్రమపడవలసివచ్చెను. ప్రాచీనపరంపరలయొక్క నిజభావములు స్ఫుటముగ నున్నంతవరకు వారు స్పష్టముగ నుదాహరించిరి. కాని, నిజార్థములు మరుగుపడిపోయిన చోట్ల మాత్రము, వారు పూర్వోత్తరసందర్భములనుబట్టి తమకు తెలిసినంతవరకు ఊహించి అర్థము వ్రాసియుండిరి. ఇంతవరకు చేసిన వివేచనవలన బ్రాహ్మణగ్రంథముల రచనను గూర్చియు, వాని స్వభావమును గూర్చియు తెలిసికొనుటకు కొంత అవకాశము దొరికెను. కాని, మన ప్రస్తుతాంశమునకిది సంబంధించదు గనుక దీని నింతటితో విరమింతము.

సింహావలోకనము.

(౧) వైదికవాఙ్మయమందు వర్ణింపబడిన సోమయాగపద్ధతియొక్క చరిత్ర నిట కొంతపరిశీలించితిమి. అందు యింతవరకు దుర్గ్రాహ్యములుగ నుండిపోయిన కొన్ని యంశములకు మనమిప్పుడు ధ్రువసిద్ధాంతముచే సరళమగు నర్థములను చెప్పితిమి.


(౨) ఎందునను చేరకుండ వెలిగానిలిచిపోయిన రాత్రిక్రతువులను యీనూఱు సోమయాగములును ఆర్యులు దీర్ఘరాత్రి యందుండినపుడు సహాయార్థముగ సోమయాగములు చేసిననాటి ప్రాచీనకాలమును సూచించుచిహ్నములుగ నున్నవని ఋజువుపరచితిమి.

(3) ప్రాచీనమగు "గవాంఅయన" యజ్ఞము ప్రాచీన రోమక సంవత్సరమువలెనే ౧౦ మాసములయవధిమాత్రమే గలిగియుండెనని నిరూపించితిమి. తక్కిన రెండుమాసముల దీర్ఘరాత్రియందునను రాత్రిక్రతువులు చేయబడెనని వేరుగ చెప్పనక్కరలేదు. ఈరెండంశములును ధ్రువమండల నివాస కాలమునే సూచింపుచున్నవి. నవగ్వ, దశగ్వ, దీర్ఘతమాది గాధలుకూడ యీయంశమునే బలపరుచుచున్నవి.

(౪) పారశీగ్రంథములో చెప్పబడిన తిష్ట్రి, అపోమల యుద్ధకాలమును, యింద్రుని "శతక్రతు" నామధేయమును, రాత్రిక్రతువులు నూరనుసంఖ్యయు, తదితరచిల్లర అంశము లును ధ్రువసిద్ధాంతమును బలపరుచుచున్నవి.

ఇటీవల వేదవాఙ్మయమందు విరివిగ ప్రబలిన కర్మ జాలములన్నియు, ప్రాచీనకాలమందుకూడ నుండెనని నేను తలంపను. ప్రాచీనయజ్ఞములు బహుసులభముగను, ఆడంబర రహితముగను, నుండెనని నాతాత్పర్యము. ప్రాచీనుల మత మంతయు యజ్ఞమందేయుండెను. ఇది వారొక పెద్దకార్య ముగగన్పట్టెడిదిగాదు. మామూలు గృహకృత్యముల జేసి కొనునట్లే వారు నిత్యమునుబలుల నర్పించుచుండెడివారు. ఇదియొక పెద్దయాగపద్ధతిగ ముందు పరిణమింపబోవుచున్నదని వారు తలంపలేదు; వారాకాలమందును అట్లు భావించుకొన లేదు. సూర్యుని గతినిబట్టివారు బలులు వగైరాలనర్పించుచు దానితోపాటు తమకాలమానమునుగూడ (పంచాంగమును

గూడ) కాపాడుకొనుచుండెడివారు. వారి యాగములుసూర్య గమనమునకు సరియైన నకలుగనుండెడివని చెప్పవచ్చును. కనుక, వారి యాగపద్ధతిని తెలిసికొన్నచో, ఆప్రదేశమందలి సూర్యగతికూడ యెరుకబడును. కనుక, ఐతిహాసికదృష్టితో చూచినచో మన కీయాగపద్ధతి యెంతయో అమూల్యమైనదిగ గన్పట్టుచున్నది. నేనీదృష్టితోడనే పైవివేచనను జేసియుంటిని. ఇట్లుచేయగ, అందుగన్పట్టిన పెక్కుఅంశములను కేవల మొక్క ధ్రువసిద్ధాంతముపైననేతప్ప యింకొక విధముగసమన్వయించు టకువీలు లేకపోయెను. ఈరీతిగ ఒకప్రక్కను ఋగ్వేద సూక్తములును, మరియొకప్రక్కను కర్మకాండయు నిలువ బడి మన సిద్ధాంతపక్షమున సాక్ష్యమిచ్చుచుండగ మన సిద్ధాంతములోని సత్యమునుగూర్చి యింకశంకింపనేల ?



వైదిక నిలయము

తొమ్మిదవ అధ్యాయము.

వైదికగాథలు: (౧) నిరుద్ధజలము. (నిరుద్ధఆపః.)

ధ్రువమండల సిద్ధాంతమునుగూర్చి మనమింతవరకు చర్చించిన ప్రధానాంశముల నిట క్లుప్తముగ జ్ఞాపకముచేసి కొందము.

(౧) దేవతలకు ఆరుమాసములు పగలును ఆరుమాసములురాత్రియు కలిసి మొత్తము సంవత్సరమయ్యెనని మొదట నిర్ణయించితిమి. ఈయంశము హిందూపారశీక గ్రంథములందే గాక, జర్మనుజాతుల పురాతనగ్రంథములందుకూడ గలదని చూపితిమి.

(౨) తదుపరి ఋగ్వేదమందున్న ఉషస్సునుగూర్చి చెప్పబడిన సూక్తములపరిశీలించితిమి. వైదికఉషస్సు బహువచనముగ ప్రయోగింపబడినది. ఇదిగాక, ఉషస్సులసంఖ్య ముప్పదియను ప్రత్యక్షవాక్యమే దొరికెను. పూర్వకాలమందు ఉషఃకాంతి కనుపడిన చాలదినములకుగాని సూర్యోదయముగాకుండెను. ఉషస్సుక్షితిజముచుట్టు చక్రాకారముగ

(గుండ్రముగ) తిరుగుచుండెనని స్పష్టముగ ఋగ్వేదమందుగలదు. ఈలక్షణములన్నియు ధ్రువమండలలక్షణములే.

(3) అదిగాక, అక్షాంశభేదములనుబట్టి భిన్నయవధులుగల దీర్ఘరాత్రులను, వానికిప్రతిగనున్న దీర్ఘదివసములను ఋజువుపరచు వేదవాక్యములను క్రిందటి మూడధ్యాయములలో చర్చించితిమి. ప్రాచీనకర్మకాండపద్ధతిని పరిశీలింపగ, ప్రాచీనవార్షికసత్రములు ౧౨ మాసములు జరుగక ౭, ౮, ౯, ౧౦, ౧౧ మాసములలోనే పూర్తిగావింపబడెననియు, తక్కినకాలమందు రాత్రిక్రతువులు జరిగెననియు నిశ్చయమయ్యెను. నవగ్వ, దశగ్వ, దీర్ఘతములయొక్కయు, అదితిపుత్రులయొక్కయు గాథలుకూడ పైయంశము ననుసరించియే యున్నవి.

కనుక మనసిద్ధాంతము కేవలము అచ్చటచ్చట చెదురుగపడియున్న పొడిమాటలపై యాధారపడక, గట్టిపునాదులపైననే నిలిచియున్నదని యింతవరకు ఋజువైనది. పైనవివరించిన ధ్రువమండల లక్షణములలో ప్రతియొక్కటియు వైదికఋషులకు తెలియునని చెప్పుటకు ప్రత్యక్షముగ వేదవాక్యములే సాక్ష్యమిచ్చుచున్నవి. ఋగ్వేదరచయితలగు ఋషులు ౧౨ మాసముల సూర్యరశ్మిగల దక్షిణదేశములలో నివసించియుండగ, వారికీధ్రువలక్షణము లెట్లు తెలిసెనని కొందరనుగవచ్చును. ఋగ్వేదమును రచించిన ఋషులు ధ్రువమండలమందు తాముగ నివసింపకపోయినను, వీరిపూర్వతర

ముల వారెప్పుడో యొకప్పుడచ్చట నివసించియుండి యుండ వలెను. అప్పటినుండి, తరతరములుగ చెప్పుకొనుచువచ్చిన కథలవలన యీధ్రువమండల లక్షణములు వైదికఋషులకు తెలిసియుండవలెను. ఇవియెన్నియో వేలసంవత్సరములనాటి మాటలగుటచే మనమిప్పుడు పేర్కొనిన యీలక్షణములలో ప్రతియొక్కదానికిని సమానముగ దృఢమగు సాక్ష్యముదొరుకునని తలంచుటకు వీలులేదు. అయినను, మనసాక్ష్యము ఖగోళాంశములపై యాధారపడియుండుటచే, ఒక్కయంశమును ధ్రువముగ ఋజువుపరచినచాలును; తక్కినవి వానియంతట యవియే ఋజువయి తీరవలెను. కనుక, మనమింతవరకు సమకూర్చిన సాక్ష్యమంతటియొక్క మొత్తపుఫలితాంశము మన సిద్ధాంతమునే ఋజువుపరచుచున్నది.

ఉత్తరధ్రువ కీలక మొవరికిని యింతవరకు తెలియక పోవుటచే మన మీగ్రంథమందు చర్చించిన వేదవాక్యములకేదోవిధముగ శాయనాచార్యాది వ్యాఖ్యాతలు శబ్దార్థములను మాత్రము చెప్పి అంతటితో వదలివేసిరి. కొన్నిటికి పూర్తిగ శబ్దార్థమునైనను చెప్పక వదలివేసిరి. అందుచే, నేనీవాక్యముల కిప్పుడు చెప్పిన యర్థములు భిన్నములుగ గన్పట్టవచ్చును. అయినను, శాయనాచార్యాది వ్యాఖ్యాతలకు కూడ యీ కీలక మెంతమాత్రమైన తెలిసియుండినచో, వారుకూడ యిట్లే యర్థములు చెప్పియుందురు. కాని, వారి మనస్సున కిది తట్టకపోవుటచే వారనేకతప్పుత్రోవల ద్రొక్క

వలసివచ్చెను. పిమ్మట కొంతకాలమునకు పాశ్చాత్యవ్యాఖ్యాతలు బయలుదేరి యీపొరబాటులను కొంతవరకు సర్దిరి. కాని, వీరుకూడ ధ్రువసిద్ధాంతము నంగీకరింపకపోవుటచే, ఆ లక్షణములను సూచించు వేదవాక్యము లేమైన వచ్చినప్పుడు వీని వాని నేదోవిధముగ విరిచియో, ఊరక త్రోసివేసియో, అతుకులుపెట్టిరి. ఈవిధముగ యెల్లరిచేతను విరిచి అతుకులుపెట్టబడినట్టియు, నిర్లక్ష్యముగ త్రోసివేయబడినట్టియు, దుర్గ్రాహ్యములుగ నెంచబడినట్టియు వాక్యములను నేనిప్పుడెత్తుకొని, వానికి సరళమగు భావార్థములను జెప్పితిని. కొన్ని వాక్యములకు వ్యాఖ్యాతలు సరియైన శబ్దార్థములనే జెప్పిరి. కాని, వానిలోని నిజమగు భావార్థమును మాత్రము గ్రహింపలేక అంతటితో వదలివేసిరి. అట్టి వానికి నేను ప్రత్యేకముగ శబ్దార్థములను చెప్పక వానిలోని భావమును మాత్రమే ప్రకటించితిని. ధ్రువసిద్ధాంతమును మొట్టమొదట నామనస్సులో పెట్టుకొని, దానినెట్లైన సమర్థించి తీరవలెనను దురాగ్రహముతోనే నీపనికై పూనలేదు. అంతయేల, మొదటనే నీ ధ్రువసిద్ధాంతమును నమ్మనేలేదు; యిది అసంభవమనికూడ తలంచితిని. కాని, హెచ్చుపెరిగివచ్చుచున్న ప్రమాణపరంపరలయొక్క బలవేగముచే నేను నా యభిప్రాయమును మార్చుకొనక తప్పినదికాదు. ఇంతవరకీ గ్రంథములో చర్చించినప్రమాణములను సమగ్రముగ పరిశీ

లించిచూచినవారికికూడ యిట్టి దృఢాభిప్రాయమేగలిగితీరునని తలంచెదను.

మన మింతవరకు విచారించిన ప్రమాణములు ప్రత్యక్ష ప్రమాణములని చెప్పవచ్చును. ఇకముందు విచారింపబోవ నున్నవి పరోక్షప్రమాణములు వైదికఋషుల పూర్వజులొక ప్పుడు ధ్రువమండలమందు నివసించియున్నమాట వాస్తవమే యైనచో, అచ్చటిసృష్టి చమత్కారములును వాతావరణ పరిస్థితులును వారి పురాతనగాథలయందు కొంతకు కొంత యైనను యెక్కియుండక మానవు. కనుక, యీపురాతన వైదికగాథలను పరిశీలించినచో మనకు ధ్రువమండలలక్షణము లేమైన నందుగాన్పించునేమో చూడవలసియున్నది. ఈపురా తనగాథలను పలువురు పలుతెరగులుగ నన్వయించి యుండు టచే యివి యంతగ బలవత్తరమైన ప్రమాణములని చెప్పుటకు వీలుండకపోవచ్చును. కనుకనే, వీనిని పరోక్ష (Indirect) ప్రమాణములని జెప్పితిమి. పురాతనగాథలకు భావార్థములను జెప్పుటలో మొత్తముమీద, పండితలోకమందు నాలుగు మతములు గలవు.

(౧) ఐతిహాసికమతము:—వైదికదేవతలందరును పూర్వ మొకప్పుడు మానవమాత్రులుగనేయుండి, మనవలెనే యీ భూమిపై సంచరించుచుండిరనియు, పిమ్మట కొంతకాలమునకు వారియొక్క సుగుణసంపదనుబట్టియు అప్రతిమానమగు శక్తిని బట్టియు వారికి దేవత్వము లభించెననియు యీతెగలోని పండితులమతము.

(౨) బ్రహ్మవాదినమతము:- ఈమతమువారు వైదిక దేవతలను కర్మదేవతలనియు, ఆజానదేవతలనియు రెండుతెగలుగ విభజింతురు. తాముస్వయముగ చేసినకర్మలవలన దివ్యపదవినొందినవారు కర్మదేవతలు; పుట్టుకతోనే దేవత్వమునొందినవారు ఆజానదేవతలు.

(౩) నైరుక్తమతము:- సృష్టిచమత్కారములే యీ దేవతారూపములుగను, వారొనర్చు మహాత్కార్యములుగను వేదములం దలంకారరూపముగ వర్ణింపబడెనని నైరుక్తుల మతము.

(౪) ఆధ్యాత్మికమతము:- ఈమతమువారు వైదిక కథలనన్నిటిని బ్రహ్మజ్ఞానపరముగ నన్వయింతురు.

ప్రధానమగు యీనాలుగుమతములేగాక, యింకపలువురు పలువిధములుగ నన్వయించువారునుగలరు. ఈపలుమతములలోని గుణాగుణముల తారతమ్యముల నిట చర్చించుట కిదియదనుగాదు.

వైదికగాథలందు సృష్టిచమత్కారములే అలంకారరూపముగ వర్ణింపబడియున్నవనుసంగతిని ఒక్కనైరుక్తులేతప్ప తక్కినమతములవారెవరును ఒప్పుకొనరు. ఈనైరుక్తమతము చాలపురాతనమైనది. ఆధునికపండితులుకూడ చాలవరకీమతమునే యంగీకరించిరి. యాస్కాచార్యులవంటి కొందరుఆధునిక నైరుక్తులుచిన్నచిన్న వివరములలో ప్రాచీననైరుక్తులతో నేకీభవింపకపోయినను మొత్తముమీద యీప్రాచీననైరుక్తపద్ధతి

యీకాలమందుకూడ చాలవర కంగీకరింపబడియున్నది. ఈరీతిగ వైదికగాథలకు నైరుక్తమత మంగీకరింపబడినను యీవైదిక గాథలప్రమాణము పరోక్షమగుటచే దీనిని ప్రత్యేకించి యింత వరకు నిలిపియుంచితిని. ఒకవేళ, యీవైదికగాథల నన్వ యించు విషయములో నెవరేమతము నంగీకరించినను, నెవ రేమతము నంగీకరింపకపోయినను మన మింతవరకు చర్చించిన ప్రత్యక్షప్రమాణములకు మాత్రమెట్టి బాధయు గలుగనేరదు. అది స్థిరముగ నిలిచియే యుండును. అందుచేతనే, యీ రెండురకముల ప్రమాణములను నేను వేరువేరుగ నుంచితిని. ఉత్తరధ్రువమండలమందున్న సృష్టిచమత్కారములను నిస్సం శయముగ ఋజువుపరచు ప్రత్యక్షప్రమాణముల నన్నిటిని మొదటి ౮ అధ్యాయములలో చర్చించి, పరోక్షప్రమాణము లగు యీవైదికగాథల చర్చను యింతవరకు నిలిపియుంచితిని. కావున, మన మిప్పుడీవైదికగాథల చర్చకు ప్రారంభించెదము. మన చర్చ నైరుక్తులు చూపిన త్రోవనే యంగీకరించు చున్నది.

ప్రాచీననైరుక్తులు దాదాపు వైదికగాథల నన్నిటిని సూర్యకాంతికిని అంధకారమునకును నిత్యము జరుగుచుండు యుద్ధముగగాని; లేక సర్వసస్యముల కాధారభూతమైన నీటిని సూర్యకాంతిని బంధించివేసిన కారుమబ్బులకును, పర్జన్యదేవు నకును జరుగు యుద్ధముగగాని భావించి యర్థము చెప్పిరి. ఉదాహరణ:– "తోడేలు నోటిలోపడిన పరిగపిట్టను (వర్తికా)

అశ్వినులు కాపాడిరి" అనియున్న వైదికగాథకు "రాత్రిపూట అంధకారమునందు బంధింపబడిన సూర్యకాంతిని, ఉషస్సును విశిపించుట" యను భావార్థమును యాస్కాచార్యులవారు చెప్పిరి. ఇట్లే వృత్రాసురునిగూర్చి యాస్కాచార్యులువారు తమ నిరుక్తమందు (II, 16) భిన్నమతస్థుల యభిప్రాయముల నిట్లని వివరించియున్నారు:– తత్కో వృత్రః మేఘఇతినైరుక్తాః త్వాష్ట్రోఽసుర ఇత్యైతిహాసికాః అపాంచజ్యోతిషశ్చ మిశ్రీభావకర్మణో వర్షకర్మజాయతే తత్రోపమార్థేన యుద్ధవర్ణాభవంతి అహివత్తుఖలు మంత్రవర్ణాః బ్రాహ్మణవాదాశ్చ వివృద్ధ్యా శరీరస్యస్రోతాంసి నివారయాం చకార తస్మిన్హతే ప్రసస్యన్దిరేఆపః॥ "వృత్రుడెవరు ? "మేఘ" మని నైరుక్తులు చెప్పుచున్నారు. "త్వష్ట్రి" కుమారుడగు అసురుడని ఐతిహాసికులు చెప్పుచున్నారు. నీరును వెలుతురును మిశ్రమమగుటయే వర్షమనబడుచున్నది. ఈకర్మనే యుద్ధమని యుపమాలంకారముగ చెప్పబడినది. వృత్రుడు సర్పమని బ్రాహ్మణములును, మంత్రములును చెప్పుచున్నవి. ఈవృత్రుడు త[illegible] శరీరమును పెంచి నీటిప్రవాహములన్నిటిని నిరోధించెను వృత్రాసురుడు హతుడుకాగనే నీరు మరల ప్రవహించెను దీనినిబట్టి, నైరుక్తుల వ్యాఖ్యానమునకు మేఘ (లేక వర్ష[illegible] సిద్ధాంతమును, ఉషస్సిద్ధాంతమును ప్రధానాధారము[illegible] గన్పట్టుచున్నవి. వేదములందు వర్ణింపబడిన దేవతలయొక[illegible] మగుస్వభావమును వీరు క్రీస్తుపూర్వము చాలశతాబ్ద[illegible]

క్రిందటనే కనిపెట్టిరి. ఈరీతిగ వేదవాక్యములలోని నిజతత్వ మును కనిపెట్టగలిగినగౌరవము తప్పక ప్రాచీనవైదికులకే చెందవలెను. కాని, ఉత్తరధ్రువమండలమందలి సృష్టిచమ త్కారములను, తల్లక్షణములను తెలిసికొనగలిగినంత భూగోళపరిజ్ఞానము వారికప్పుడు లేకపోవుటచే వారివేదగాథల నన్నిటిని యీపద్ధతిపై పూర్తిగ సమన్వయింపలేకపోయిరి. ఈలోపమును పాశ్చాత్యపండితు లిటీవలకొంతవరకు సవరించిరి. యాస్కాచార్యాది ప్రాచ్యపండితులకంటె యీపాశ్చాత్య పండితులు చాల యుత్తరభూములలో నివసించియుండుటచే సూర్యుడు శీతకాలమందెట్లు చాలవరకు క్షీణించిపోవునో, మరలవసంతమందెట్లు సంపూర్ణముగ వికసించునో వారు ప్రత్యక్షముగచూచి యున్నారు. కనుక మేము, ఉషస్సిద్ధాంత ములపై సమన్వయించుటకు వీలుగాని వైదికగాథలకొన్నిటిని పాశ్చాత్యపండితు లీసూర్యుని వృద్ధిక్షయముల నాధారముగ గైకొని సమన్వయించియుండిరి. దీనికి వసంతసిద్ధాంతమనిపేరు. పెట్టవచ్చును. ఇంతవరకు నైరుక్తమతమందు ముఖ్యముగ మూడు సిద్ధాంతములుగలవని తెలిసినది. వానినిట క్లుప్తముగ వర్ణింపుచు వైదికగాథలనన్నిటిని పూర్తిగ సమన్వయించుటకవి యెట్లుపనికిరావో తెలిపెదను.

మొట్టమొదటిది ఉషస్సిద్ధాంతము:— ప్రాచీనకాల మందు సమస్తదేవవంశములకును, సమస్తవేదాంతములకును ఉషాదేవతయే మూలభూతమగు కేంద్రస్థానముగ నుండెను.

జ్యోతిర్మూర్తులగు దేవతలకును, పలుమూర్తులదాల్చిన సూర్యునకును, సమస్తఋతువులకును, సాయంప్రాతరాది త్రికాలములకును — ఉషాదేవతయే మాతృస్వరూపిణిగనుండెను. ఇక, ఆయుషాదేవతయన్ననో, వేయేల, కేవల మమృతత్వము మూర్తీభవించినదో యన్నట్లు బహుతేజోమయ విగ్రహమై వెలుంగుచుండెను. మాక్సిముల్లరుపండితుడు ఉషస్సును గూర్చి బహుసుందరముగ వర్ణించియున్నాడు. "ఉషస్సు మన కిప్పుడు కేవలము నేత్రానందకరమగు దృశ్యముగమాత్రము గన్పట్టుచున్నది. కాని, ప్రాచీనులగు పండితులకును ప్రేక్షకులకును మాత్రమిది మహాగూఢమగు తత్వముగ గన్పట్టుచుండెను. పరమేశ్వరుని యనంతశక్తికి ప్రతిరూపములుగనున్న జ్యోతిర్మూర్తులన్నియు నిత్యము నుదయించుటకీయుషస్సే గర్భాశయమగు జననస్థానముగనుండెను. ఈసృష్టియందీ లోకమొక్కటేగాక యింకచాలలోకములు గలవనియు, యీసృష్టియంతయు నేదోమహాశక్తిచే ప్రేరేపింపబడి నడచుచున్నదనియు, యీసృష్టి గుర్తింపొంతగనడువక యేదోయొక సూత్రమును, క్రమమును అనుసరించి నడుచుచున్నదనియు, యీసమస్తసృష్టిని యింత తెలివితేటలతో క్రమముదప్పకుండ నడిపించు మహాజ్ఞానసంపన్నుడొకడున్నాడనియు మొట్టమొదట ప్రాచీనుల మనస్సునకు తోపజేసినదీ ఉషస్సే. మనకండ్లకు వట్టి సూర్యోదయముగ గన్పించుసృష్టి వ్యాపారము వారి కండ్లకు మహాగూఢతరమగు పరమతత్వముగనుండెను. ఈ

సృష్టిరహస్యమేమియను గాఢసమస్య వారికెంతోకునిత్యము పొడగట్టుచుండెను. వారి జీవితమును నడిపించు దినములన్నియు మహాగంభీరమగు అంధకార సముద్రమునుండి ప్రతియుదయమునను బయల్వెడలివచ్చుచుండెను. ఈసముద్రతీరమంతయు ప్రతియుదయమునను అత్యద్భుతమగు తేజః పుంజములతోడను, చైతన్యముతోడను కళకళలాడుచు ఆనందసంధాయకముగను, నేత్రోత్సవదాయకముగను గన్పట్టుచుండెను. ప్రతి యుదయమునను సూర్యుని నూతనారుణకాంతులు, నూతన చైతన్యమును, నూతనోత్తేజమును వెలిగ్రక్కుచుండెను. ఈయుషః కాంతి రోదోంతరాళమునకు సింహద్వారముగనున్న ప్రాఙ్నభస్థలముపై బంగారుకాంతులను వెదజల్లుచుండెను. బంగారు కాంతులతో తళతళలాడుచున్న యీ ప్రాగ్ద్వారమునుండి కోమలమందమారుతములు ఉషస్తేజస్తరంగములతో మేళవించి సర్వప్రాణికోట్లకు సత్కారపూర్వకముగ నాతిథ్యమొసంగి యాహ్వానించుచున్నవో యన్నట్లు హాయిగ వీచుచుండెను. అల్లదే! మలయపర్వతపంక్తుల కావల, మేఘమండలముల దాటి, ఉషస్తరంగముల నతిక్రమించి, " మనల నిచ్చటికి వచ్చిన యీ యమృతసింధువు " న కద్దరినున్న బహుదూరభూములనుండి బయల్వెడలి వచ్చి, బంగారుకాంతులతో రోదోంతరాళము నంతను వెలిగించుచున్న ప్రాగ్ద్వారములమీదుగ ఆ మందమారుతములు హాయిగ వీచుచుండెను. సూర్యుని విజయప్రస్థానమునకు త్రోవనొసంగుటకై యుషాదేవత బంగారుకాంతుల

వెదజల్లు ప్రాగ్ద్వారములను విశాలముగ తెరచియుంచెను. ప్రాక్సింహద్వారము లిట్లు విశాలముగ తెరువబడియున్నప్పుడు ప్రాచీనులగు ఆర్యులు ఆద్వారముల కావలిప్రక్కనున్న యనంతమయప్రపంచములోనికి తొంగిచూచుటకై, అమాయికులగు చిన్నిశిశువులవలె తమ నేత్రములను, హృదయములను వికసింపజేసి తేరిపారజూచుచుండిరి. నిరామయమును, నిశ్శబ్దమును, అవ్యక్తమును, అనంతమును, పరమశాంతియుతము నగు నా ప్రకృతిదృశ్యము వీరి మనస్సులందు అనంతమును, అజరామరమును, దివ్యము నైన పరతత్వభావము నుదయింపజేసెను. కనుక, అప్పటినుండియు ఉషస్సునకీ కళ్యాణగుణ విశిష్టములైన నామధేయములే ప్రసిద్ధములయ్యెను.

ఈవర్ణన మెంతయు మనోహరమగు కవితాధోరణిని వెల్లడించుచున్నదే గాని, ఉషస్సుయొక్క నిజార్థమును మాత్రము తెలుపుటలేదు. ఈ ఒక్క ఉషస్సునుగూర్చిన వర్ణనలే వేదములందు పలుతెరగులగు కథలుగ జెప్పబడినవని మాక్సిముల్లరు పండితుని యభిప్రాయము. ఉదా:—“శరణ్యు” వను నామె వివస్వతునివలన కవలపిల్లలనుకని, ఆడగుర్రము రూపమునుదాల్చి ఆతనినుండి పారిపోయెను. అంతట వివస్వతుడు మొగగుర్రమై ఆమెవెంట పరుగెత్తెను.—— ఈ కథకు మాక్సిముల్లరు పండితుడు చెప్పిన భావార్థమేమనగ :—— ఉషస్సు అను స్త్రీ అహోరాత్రములను కవలపిల్లలను గని

సూర్యుఁ డుదయింపఁగనే అదృశ్యమయ్యెనట. ఇట్లే, సూర్యుఁడు "సోమ"ను వివాహమాడిన కథయు, యింద్రుఁడు 'వృషాకపాయీ' యొక్క యెద్దను మ్రింగివేసిన కథయు, అదితికి ఆదిత్యులు పుట్టిన కథయు, "పణి" యను రాక్షసునిచే దొంగిలింపఁబడిన ఆవులను వెదకుటకై 'సరమా' సముద్రములను దాఁటిన కథయు,— యివన్నియు ఉషస్సునుగూర్చి పలురీతులుగఁ జెప్పఁబడిన కథలని యీ పండితుని యభిప్రాయము. వేయేల, ప్రాచీనుల కీయుషస్సుతప్ప వేఱే యింకొకటేమియు లేనేలేదని యీతని మతము. ఇది బహు ఆశ్చర్యముగ నున్నది! ఏమి? వారి కీయుషస్సేతప్ప ప్రపంచములో నింక నేమియు తెలియనే తెలియదా? ఈ సందేహము కొంతకాలమునకు మాక్సిముల్లరు పండితునకే గలిగెను. కాని, యెంత యోచించినను మాక్సిముల్లరున కీ యుషస్సు తప్ప యింకొకటి కనుబడలేదు. మాక్సిముల్లరు వర్ణించిన ఉషస్సు మనమీదేశములలో నిత్యమును జూచు ఉషస్సేయని యెఱుంగవలెను. మనమిచ్చట నిత్యమును జూచు ఉషస్సు బహుస్వల్పకాలముండును. ముహూర్తమాత్రముండి మాయమైపోవు యీమనయుషస్సే ప్రాచీనార్యుల మనస్సులందింత భయభక్తులను పుట్టించి, యిన్నిగాథలను కల్పించుటకు కారణభూతమైనదని యీ పండితుని మతము. కాని, ఋగ్వేదమందు వర్ణింపఁబడిన ఉషస్సు ముహూర్తమాత్ర జీవనముగల మనయుషస్సుగాదనియు, అదినిజముగ దీర్ఘకాలముండు ధ్రువ

మండల యుషస్సనియు మనము ఋజువుపరచినప్పు డేగాథల యొక్క భావార్థములెట్లు పూ ర్తిగ మారిపోవునో చూడ వలసియున్నది. అయినను, యీ కథలనన్నిటిని యెత్తుకొని మరల వానికి క్రొత్తభావార్థములను వ్రాయుట కిప్పుడు మనము పూనుకొనలేదు. ధ్రువసిద్ధాంతమును ఋజువుపరచు టయే మనపని.

రెండవది మేఘసిద్ధాంతము:— ఉపసిద్ధాంతమునకు లొంగనిగాథలకు భావార్థములను జెప్పుటకై ప్రాచీననైరు క్తులు రెండవదియగు మేఘసిద్ధాంతమునుగూడ బయలుదేర దీసిరి. ఈసిద్ధాంతము పైసమన్వయింపబడిన కథలలో ఇంద్ర వృత్రాసురులకథ ప్రధానమైనది. ఇంద్రశబ్దము "ఇందు"= వర్షబిందువు — అనుమూలమునుండి యుత్పన్నమయ్యెనట. వృత్రశబ్దము "వృ" = కప్పివేయుట యను మూలము నుండి యుత్పన్నమయ్యెనట. ఈరెండుశబ్దోత్పత్తులనాధారము జేసికొని, వీలుగానిచోట్ల తక్కినపదములను విరిచి, యీకథ నంతను సమన్వయించిరి. ఉదాహరణము:— ఇంద్రుడు 'పర్వత' మునుపగులగొట్టి అందుండి నదులను విడిపించెను. ఇచ్చట 'పర్వత' మనగ 'మేఘ' మనియు "నదుల"నగ 'వర్ష ధారల' నియు నైరుక్తులుజెప్పిరి. ఇంద్రుడు వజ్రమును (లేక పిడుగును) ధరించెననగ:— యింద్రుడు తుపానున కధిష్ఠానదేవ తయనినైరుక్తులు జెప్పిరి. తుపానుతోపాటు వర్షమువచ్చుట ప్రసిద్ధమేగద. ఈయుద్ధమందు యింద్రునకు 'మరుత్తు' లు

(వాయువులు) సహాయము జేసిరట. అనగ, తుపానుపట్టినప్పుడు ప్రబలమైనగాలివీచుట సహజమేగద.

అయితే, వృత్రుడు (లేక అహి) నీళ్ళను చుట్టుముట్టి బంధించి వేసెనని కథలోకలదు. దీనిభావమేమి? నీళ్ళనుగొని పోయి, మేఘములలో బంధించి వేసెనని చెప్పవచ్చును. కాని, వృత్రవధచే సింధువులు (నదులు) విడుదలచేయబడెనని ఋగ్వేదము చెప్పుచున్నది. 'నదు' లనగనేమి? నదులనగ పంజాబులోనున్న నదులని వీరిమతము. ఇవి పంజాబునదులైనచో వృత్రుడు వీనినెట్లు చుట్టుముట్టిబంధించెనో బోధపడకున్నది. కాని, నైరుక్తులీయంశమును బహుతెలివితేటలతో సమన్వయించిరి. ఎట్లనగ:— పంజాబునదులు వేసవిలో యెండిపోవును; కనుక వర్షదేవతయగు యింద్రుడు, వర్షకాలమందు, తిరిగి వీనికి జీవనముల నిచ్చునుగనుక, యింద్రుడీనదులను వృత్రాసుర బంధములనుండి తప్పించెనని చెప్పవచ్చును. మనభారతీయ నైరుక్తులింతకంటె పైకిపోలేదు. కాని, జర్మనుపండితులు కొందరీసిద్ధాంతమును విస్తారముగ పెంచి ఉషస్సిద్ధాంతమునకు ప్రత్యర్థిగ నిలువబెట్టిరి. మాక్సుమ్యుల్లరుపండితుడు వైదిక గాథలకన్నిటికిని ఉషస్సే ఆధారమని చెప్పినట్లు యీపండితు లిప్పుడు వానికన్నిటికిని మేఘమే లేక గాలివాన, తుపాను మొదలగు వాతావరణ పరిస్థితులే మూలాధారమని వాదింప జొచ్చిరి. "మేఘములు; తుపానులు, వర్షములు, ఉరుములు, మెరుపులు,—అన్నిటికంటె యివియే ప్రాచీనార్యుల మనో

భావముల నెక్కుడుగ ఆకర్షించెను ” అని “కుహర్క” పండితుడు చెప్పుచున్నాడు. “ భూమిమీదనున్న వస్తువులు వారికి మామూలుగనే గన్పట్టెను. కాని, ఆకాశము నందుత్పన్నములైన యీమహాగంభీర దృశ్యములుమాత్రము వారికిమహాశ్చర్యమును, భయమును గల్పించెను. ఇట్టి వింతవస్తువులతో పోల్చుటకై భూమిమీద తామెరిగియున్నవస్తువులేమి యున్నవాయని వెదుక నారంభించిరి. సూర్యచంద్రాదుల యుదయాస్తమయములుకాడ — ఒకానొకక్రమముననుసరించి యుండుటచే — వారి కంతటి యాశ్చర్యమును పుట్టింపలేదు. కాని, ఆకాశమందలి వాతావరణపరిస్థితులుమాత్రము క్షణమునకొక వింతరూపముగ మారుచు మహాగందరగోళముగనుండెను. పీనితత్వము మహాగూఢముగను, గంభీరముగను, దురవగాహముగను గన్పట్టెను....” కనుక, ప్రతివైదికగాథయు యీతుపానుమీదనే ఆధారపడెనని “ కుహర్క ” పండితుని యభిప్రాయము.

మూడవది వసంతసిద్ధాంతము :— ఈ రెండునుగాక, మూడవది యింకొక సౌరసిద్ధాంతముగలదు. దీనికి వసంతసిద్ధాంతమని పేరుపెట్టుదము. మాక్సిముల్లరు మొదలగు పాశ్చాత్యపండితులు యాస్కాచార్యాది ప్రాచ్యనైరుక్తులకంటె ధ్రువమండలమున కెక్కువ దగ్గరగనున్నారు. అచ్చట, హేమంతర్తువునందు సూర్యునికాంతి చాలవరకు క్షీణించిపోవును. తిరిగి వసంతమునందు సూర్యకాంతి ప్రబలమగును.

సూర్యతేజమం దిట్టి వృద్ధిక్షయములు మనదేశమందం తగ గన్పట్టవు. కాని, జర్మనీ మొదలగు ఉత్తరదేశములలో స్పష్టముగ గన్పట్టును గనుక, మాక్సిముల్లరు పండితుడు చాల గాథల నీఋగ్వేదాంశముపై నన్వయించియున్నాడు. అశ్వినీ దేవతలు అనేకమందిని రక్షించియున్నారు. అశ్వినులు చ్యవనునకు యౌవనము నొసంగిరి; అత్రిని శీతోష్ణాదులనుండి కాపాడిరి; బ్రతికియుండగనే గోతిలో పూడ్చిపెట్టబడిన 'వందన' ముని పైకితీసి రక్షించిరి; 'విశ్పలా' యను నామె యొక్క కుంటికాలును బాగుచేసిరి; ఋజ్రాశ్వమునకు నేత్రదృష్టినొసంగిరి. — ఈకథలన్నిటికిని ఒకటే భావార్థము— అనగ, శీతకాలమందు క్షీణించిపోయిన సూర్యుడు తిరిగి వసంతకాలము రాగనే పరిపూర్ణతేజస్సుతో వెలిగెను.

ఈ వసంత, ఉషస్సిద్ధాంతములు రెండును సౌరసిద్ధాంతములే — అనగ, సూర్యునకు సంబంధించినవే. అయితే, ఉషస్సిద్ధాంతము సూర్యుని దైనికగతిని దెలుపుచున్నది; వసంతసిద్ధాంతమన్ననో సూర్యునివార్షికగతిని దెలుపుచున్నది. మేఘసిద్ధాంతము సూర్యునకుసంబంధింపదు. ఇది కేవలము వాతావరణపరిస్థితులను దెలుపుచున్నది.

ఇంతవరకు వర్ణించిన వసంత, మేఘ, ఉషస్సిద్ధాంతములుగాక, యింక ననేక సిద్ధాంతములుకూడ గలవు. వానినన్నిటి నిట చర్చించుట మన పనికాదు. నేనిప్పుడు చెప్ప దలచుకొన్న ముఖ్యమైనమాట యేమనగ:— ఎన్నిసిద్ధాంత

ములు బయలుదేరినను యిప్పటికిని యీ సిద్ధాంతములకు వేని కిని లొంగని వైదికగాథలును, కథాభాగములును, చాలవరకు సరిచియే యున్నవి. క్లిష్టమైన యిట్టి యంశములు పండితు లకు సాధ్యముగానందున, ప్రతివారును వానిని వదలివేసియో, లేక అప్రాముఖ్యమైనవని త్రోసివేసియో సరిపుచ్చుకొనిరి. వీరిచే నిట్లింతవరకు దురవగాహమైనవిగ వదలివేయబడిన గాథలకు మన ధ్రువసిద్ధాంతమువలన సరళమగు భావార్థము కుదిరినచో, మన సిద్ధాంతమును బలపరుచుకొనుటకై యీ గాథల నేల మనము సాక్ష్యముగ గైకొనకూడదు ? కనుక, మన ధ్రువసిద్ధాంతముచే యీగాథల కేమైన సరళమగు భావార్థము కుదురునేమో పరిశీలించి చూతముగాక. మొట్ట మొదట మనము ఇంద్ర వృత్రాసురులు గాథ నెత్తికొందము. దీనిని పండితు లిదివరకు మేఘసిద్ధాంతముపై పూర్తిగ సమ న్వయింపగలిగితిమని తలంచుచున్నారు. అయినను, మన మిప్పుడు దీనిని మరల నామూలాగ్రముగ పరిశీలించిచూతము. ఇంద్రునకును వృత్రునకును జరిగిన పోరాటము వేదములందు నాలుగువిధములుగ వర్ణితమైయున్నది. (౧) వృత్రతూర్య:— ఇది ఇంద్రునకును, వృత్రుడను రాక్షసునకును జరిగిన యుద్ధము. ఈ యుద్ధమందు వృత్రుడు నముచి, శుష్ణ, శంబర, వల, పిప్ర, కుయవాది నామములతో వర్ణితుడైయున్నాడు. (౨) అప్-తూర్య (నీటికై పోరాటము) ఈ పోరాటము నీటిని విడిపించుటకై చేయబడినట్లు వర్ణింపబడినది. ఇంద్రుడు

వృత్రుని సంహారింపగనే సింధువులు (నదులు) లేక నీరు (ఆపః) విడివడి పారజొచ్చెను. కనుక యింద్రుడు "అప్సు-జిత్" (నీటిలో జయముగొన్నవాడు) ఆయెను. ఇచ్చట వృత్రాసురుడు "నీటిని చుట్టుముట్టె" నని (ఆపః పరి-శయానమ్) చెప్పబడెను. (౩) గో-ఇష్టి= (గోవులను తిరిగి సంపాదించుటకై చేసిన పోరాటము). ఇంద్రుడు వృత్రాసురుని సంహారించి, ఆతనిచే బంధింపబడియున్న గోవులను విడిపించెను. (౪) దివిష్టి = (సూర్యకాంతిని విడిపించుటకై చేసిన యుద్ధము.) ఇంద్రుడు వృత్రుని సంహారించి అతనిచే బంధింపబడిన సూర్యుని, ఉషస్సును విడిపించి స్వైకీలిసికొనివచ్చెను.

ఒక్క-పోరాటమే ఈనాలుగువిధములుగ ఋగ్వేదమందు వర్ణితమైయున్నది. ఈ చతుర్విధవర్ణనలనుగూర్చిన ఋగ్వేద ప్రమాణముల నీక్రింద సంక్షేపముగ వివరించెదను.

—* వృత్రవధనుగూర్చిన ప్రమాణములు *—

(౧) I, 80, 11
II, 11, 9, 10
VI, 17, 9
} ఇంద్రుడు తన వజ్రముతో వృత్రాసురుని ప్రహరించినప్పుడు (అనగ కొట్టినప్పుడు) భూమ్యాకాశములు భయముచే దద్దరిల్లిపోవును.

(౨) I, 80, 14 } ఈవజ్రమును నిర్మించిన "త్వష్టి" కూడ యింద్రుని మహోగ్రకోపమునకు గడగడ వడంకును.

(౩) I, 32, 5	ఇంద్రుడు తనవజ్రముతో వృత్రాసురుని తుత్తునియలుగ కొట్టివేయును.
(౪) I, 52, 15	ఇంద్రుడు కొసదేరిన తన ఆయుధముతో వృత్రాసురుని మొగముమీదపొడుచును.
(౫) III, 20, 2	నీటిని చుట్టుముట్టిన వృత్రుని యింద్రుడు చావ గొట్టెను.
(౬) IV, 19, 2	నీటిచుట్టును పరుండియున్న (పరిశయానమ్) భయంకరసర్పమును యింద్రుడు చావ మొత్తెను.
(౭) V, 30, 6	నీటిమీదపరున్న ఘోరాహిని యింద్రుడు జయించెను.
(౮) II, 11, 5	నీటిలోదాగికొని, నీటిని ఆకాశమును నిరోధించుచున్న ఘోరాహిని యింద్రుడు చంపెను.
(౯) II, 14, 2	చెట్టువలె నీటినిచుట్టుకొనియున్న వృత్రుని యింద్రుడు తన వజ్రముతో చావ మొత్తెను.
(౧౦) VIII, 36, 1	ఈవిధముగ "నీటిలో జయముగొన్నవాడు" (అప్సు-జిత్) అను బిరుదు యింద్రునకొక్కనికే చెల్లును.

—• వృత్రుని నివాసస్థానమునుగూర్చిన ప్రమాణము. •—

(౧) I, 32, 10 — వృత్రునకు రహస్యమగు (నిణ్య) నివాసస్థాన మొకటిగలదు. ఇంద్రుడు నీటిని విడిపించినప్పుడవి యీరహస్య ప్రదేశమునుండి బయటపడి యీయసురుని శరీరముమీఁదుగ ప్రవహించి వచ్చెను.

(౨) I, 121, 11; II, 11,19 — వృత్రుడు నీటిపై పరుండును.

(౩) I, 52,6 — వృత్రుడు నీటిచే కప్పబడి "రజస్" యొక్క అడుగు భాగమందు (బుధ్న) పరుండియుండును.

(౪) I, 80, 5 — ఇంద్రుడు నీటిని ప్రవహింపజేసినప్పుడు వృత్రుడు 'సాను' ప్రదేశమందు (కొండమీఁద) పరుండియుండెను.

(౫) X, 89, 7 — ఇంద్రుడు వృత్రుని చంపి, అతని కోటలను నాశన మొనర్చెను.

(౬) VIII, 93, 2; VII, 19, 5 — వృత్రునకు ౯౯ కోటలు గలవు.

(౭) I, 130, 7; IV, 30, 20 — వృత్రుని కోటలు ౯౦ లేక ౧౦౦.

(౮) I, 52, 2 — వృత్రుడు "నదీ-వృత్" (నదులను చుట్టుముట్టుకొని యున్నవాడు.)

(౯) I, 57, 6 — వృత్రుని కడుపులో పర్వతము గలదు.

(౧౦) IV, 30, 20; IV, 27, 1 — వృత్రుని కోటలు రాతితోను, యినుముతోను కట్టబడినవి.

(౧౧) I, 130, 7; I, 131, 4; IV, 20, 10 — వృత్రుని కోటలు "శారదీః" అని చెప్పబడెను. (దీని యర్థమును పిమ్మట విచారింతము.)

—♦ యుద్ధరంగమును గూర్చిన ప్రమాణములు ♦—

(౧) V, 32, 5, 6 — ఇంద్రుడు తనతో పోరాడుట కాతురుడై యున్న "శుష్ణ"ను చీకటిగోతిలో పెట్టి, సూర్యరశ్మిలేని గాఢాంధకారమందు, (అసూర్యే తమసి) వధించెను.

(౨) I, 34, 10 — వృత్రుని మందిరములో చీకటి వ్యాపించి యుండెను.

(౩) II, 23, 18 — బృహస్పతి, యింద్రసహాయుడై, చీకటిచే ఆవరింపబడియున్న సముద్రమును క్రిందికి విసరివేసి, ఆవుల కొట్టమును తెరచెను.

(౪) I, 32, 10 — వృత్రుని శరీరము నీటిచే ఆవరింపబడి దీర్ఘమగు గాఢాంధకారమందు మునిగి యుండెను.

(౫) II, 23, 18 — వృత్రుని సముద్రము చీకటిలో మునిగి యుండెను. (తమసి పరివృతం)

షరా:— వృత్రునిచే ఆవరింపబడిన సముద్రము (అర్ణః) సూర్యరశ్మిలేని గాఢాంధకారముగనుండెను. కనుక యిది V, 45, 10 లో-సూర్యుడు యెక్కి వచ్చిన జ్యోతిర్మయ సముద్రమున కంటె (శుక్రం అర్ణః) భిన్నమైనదని యెఱుంగవలెను.

(౬) I, 53, 7; VIII, 12, 17; VIII, 45, 25 — ఇంద్రుడు వృత్రాసురుని సంహరించుటకై చాల దూరదేశము (పరావత్) లోనికిపోయెను.

షరా:— చాల దూరప్రదేశమందు, చీకటిలో, నీటి మధ్యను, యీ యుద్ధము జరిగినని సారాంశము.

—* యుద్ధకాలమునుగూర్చిన ప్రమాణములు *—

(౧) VIII, 32, 26 — ఇంద్రుడు అర్బుదను (వృత్రుని) మంచులో (హిమ) చంపెను.

(౨) X, 62, 2 — ఆవులను విడిపించుటలో యింద్రునకు తోడ్పడిన అంగిరసులు వలను(వృత్రుని) సంవత్సరాంతమందు (పరివత్సరే) చంపిరి.

(3) — ఇంద్ర శంబరుల యుద్ధకాలమును ఖండితముగ నిర్ణయించుటకై ఋగ్వేదమందింకొక ప్రమాణవాక్యముగలదు. దానిని తదుపరి చర్చింతము.

—* యుద్ధ ఫలితములనుగూర్చిన ప్రమాణములు. *—

(౧) III, 34, 8 — ఇంద్రుడు వెలుతురును, దివ్యజలములను, సంపాదించుకొని వచ్చెను.

(౨) VIII, 89, 4 — ఓయింద్రా! వృత్రునిసంహరించి, వెలుతురును సంపాదించుకొని రమ్ము.

(౩) I, 51, 4
I, 52, 8 — ఇంద్రుడు తనవజ్రముతో ఘోరాహిని సంహరించి, మానవులకొరకు నీటిని విడిపించినప్పుడు సూర్యునికూడ యెల్లరికి కనిపించునట్లు ఆకాశమందుంచెను.

(౪) II, 19, 3 — ఘోరాహిహంతకుడగు యింద్రుడు సముద్రజలములను ప్రవహింపజేసెను. సూర్యునిపైకితెచ్చెను. ఆవులను కనుగొనెను.

(౫) III, 34, 8, 9 — రాక్షసుని సంహరించిన పిమ్మట యింద్రుడు సూర్యుని జలములను సంపాదించెను.

(౬) I, 32, 4
VI, 30, 5 — ఇంద్రుడు రాక్షసుని సంహరించి, పర్వతమునుండి నీటిని విడిపించినప్పుడు ఆతడు సూర్యుని, ఆకాశమును, ఉషస్సునుకూడ పుట్టించెను.

(౭) I, 62, 5 II, 12, 7 VI, 17, 5	ఇంద్రునిచే విడిపింపబడిన వస్తువులలో సూర్య, ఉషస్సులతోపాటు ఆవులు కూడ పేర్కొనబడినవి.
(౮) I, 7, 3 II, 19, 3 X, 138, 2	సూర్యునితోపాటు ఆవులుకూడ పేర్కొనబడెను.
(౯) II, 11, 2	ఘోరాహిచే బంధింపబడిన ప్రవాహములను యింద్రుడు విడిపించెను.
(౧౦) I, 32, 12 II, 12, 12	ఇంద్రుడు ఆవులను గెలుచుకొనివచ్చి సప్తనదులను ప్రవహింపజేసెను.
(౧౧) II, 15, 6	ఇంద్రునిచే విడిపింపబడిన నదులు ఊర్ధ్వముగ (ఉదంచగ) ప్రవహించుచున్నవి.

వరా:— ఈ ప్రదేశములలో పర్వత, గిరి, అద్రి, ఊధస్ (పొదుగు), ఉత్స (నీటిబుగ్గ), కబాధ (పెట్టె), కోశ (గిన్నె) — అను పదములే ప్రయోగింపబడియున్నవి. గాని మేఘమను భావమును సూచించు 'అభ్రా'దిపదములు మందునకైనను ప్రయోగింపబడలేదు. అయినను, నైరుక్తులును పాశ్చాత్యులును కూడ యీపైపదముల కన్నిటికిని మేఘమనియే యర్థము చెప్పిరి. 'గో' అనగ 'ఆవు' అని సాధారణార్థము. కాని, కొన్నిచోట్ల 'గో' అనగ ఇంద్రునిచే విడిపింపబడిన నీరని పండితులు చెప్పిరి. రాతిగోడలలో బాధింప

బడిన గోవులను ఇంద్రుడు విడిపించె ననగ, మేఘమను రాతి గోడలమధ్య బంధింపబడిన నీటిని ఇంద్రుడు విడిపించెనని శాస్త్రార్థమును జెప్పిరి. ఈ యుద్ధమం దిందునికు తోడ్పడిన వారిలో మరుత్తలు, విష్ణు, అగ్ని, బృహస్పతి, అంగిరసులు — మొదలగువారు పెక్కుమందిగలరు. ఈ కథయే ఋగ్వేద మందింక ననేకవిధములుగ వర్ణింపబడియున్నది. కాని, మన కింతవరకు చాలును.

వృత్రాసురవధను మేఘసిద్ధాంతముపై సమన్వయించితి మని పండితులు తలంచుచున్నారు. కాని, వీరి సమర్థనము సరియైనదిగాదు. దీనికి ముఖ్యముగ నాలుగభ్యంతరములుగలవు. వానినిట వివరించెదను.

I. మొదటి అభ్యంతరము :— (యుద్ధఫలితములను గూర్చిన అభ్యంతరము) వృత్రాసురవధకు ఫలితముగ నేక కాలమందు నాలుగు ఫలితములు గలిగినవి. (౧) ఆవులు విడిపింపబడెను; (౨) నీరువిడిపింపబడెను; (3) ఉషస్సు పునర్జనన మొందింపబడెను; (౪) సూర్యుడు ప్రజనన మొందింపబడెను. ఈ సమకాలిక చతుర్విధఫలోత్పత్తిని మేఘసిద్ధాంతము సంతృప్తికరముగ సమర్థింపలేదు. వృత్రుడు మేఘుడని యన్నచో నింద్రుడు తనవజ్రముతో మేఘమునుచీల్చి అందు బంధింపబడియున్న నీటిని విడిపించెనని చెప్పవచ్చును. కాని, వృత్రవధవలన ఒక్కనీరేగాక దానితోపాటు ఆవులుకూడ విడిపింపబడియున్నవే? ఆయావులేవి? ఆవులగ నీరేయని

నైరుక్తులు చెప్పుచున్నారు. ఆవులన్నను, నీరన్నను ఒక్కటే యైనచో యివిరెండు భిన్నఫలితము లెట్లుగాగలవు? కనుక, యివి యెట్లు భిన్నపదార్థములో నైరుక్తులు చెప్పలేకపోయిరి. మరియు, ఆవులు, నీరు నను నీ రెండువస్తువులేగాక, వృత్రవధ వలన సూర్య, ఉషస్సులు సయితము ఆకాలమందే ప్రజనన మొందెను. మేఘసిద్ధాంత మీ సూర్య ఉషస్సుల యుత్పత్తి సమర్థించుట కెంతమాత్రమును చాలదు. మేఘములు సూర్యుని సదా కప్పవు. ఏ బహుస్వల్పకాలమో మేఘము లాచ్ఛాదించినంతమాత్రముచే, మేఘములను చీల్చినందువలన సూర్యుడు ప్రజననమొందెనని చెప్పుటకు సాధ్యపడదు. అట్లే ఉషసోదయముకూడ అసమర్థనీయముగనున్నది. మేఘములు సాధారణముగ ఆకాశమధ్యమందు సంచరించుచుండును. బహు అరుదుగ క్షితిజమువద్దకు పోవును. అట్లయినప్పుడు, మేఘములను చీల్చినందువలన ఉషస్సు ప్రజననమొందెనని సమర్థింపజూచుట చాల అసంగతముగనున్నది. ఈ చతుర్విధ ఫలముల సమకాలికోత్పత్తిని సమర్థించుట కింతవర కెవరును ప్రయత్నించియుండలేదు. ఒక నైరుక్తులుమాత్ర మీ మేఘ సిద్ధాంతముచే కొంత యత్నించి చూచిరి. ఈ నాల్గుఫలితము లలో నీరే ప్రధానమైనదిగ గన్పట్టుటచే, నైరుక్తులీ మేఘ సిద్ధాంతమును బయలుదేరదీసిరి. నీరు (ఆపః) అనగ మనము ప్రతిదినమునుచూచు మామూలునీరనియే వారర్థముచేసి కొనిరి. కాని, యీనైరుక్తులును పాశ్చాత్యులును యెన్ని

విధముల ప్రయత్నించినను యీఫలితములసమకాలికోత్పత్తిని మాత్రము సమర్థింపనేలేకపోయిరి. "తుపానుపోయిన తరువాత సూర్యుడు గనుపట్టుటకును — రాత్రిగడచిన పిదప సూర్యోదయమగుటకును — చాలభేదముగలదు. ఇవి రెండును రెండు భిన్నవిషయములు. కాని, యీ రెండు విషయములును (వేదములందు) గందరగోళముగ తారుమారు జేసి చెప్పబడియున్నవ" ని మ్యాక్డోనాల్డుపండితుడు తలంచుచున్నాడు. కనుక యీమాటవలన తేలినసారాంశమేమనగ:— "ఈసమకాలికోత్పత్తియొక్క నిజమగు భావార్థము మాకు తెలియలేద"ని పండితులుస్పష్టముగ నొప్పుకొనియున్నారని యర్థమగుచున్నది. కాని దీనిలోవచ్చిన వింతయేమనగ:— ఇట్టి అసమర్థతకు తమ అశక్తియే కారణమని చెప్పుకొనక వైదికఋషులే యేమో గందరగోళపడిరని చెప్పుచు తమతప్పును వైదికరుషులమీదికి త్రోసివేయుచున్నారు!

II. రెండవ అభ్యంతరము:— (యుద్ధరంగమును గూర్చిన అభ్యంతరము) ఇంద్రుడు ఆవలిప్రక్కనున్న బహుదూరదేశములో భయంకరమగు గాఢాంధకారమందు సముద్రజలములమధ్యను వృత్రునిసంహరించెను. ఇంద్రుడు వృత్రుని సంహరించుటచే దేవయానద్వారములు బాహాటముగ తెరపియయ్యెను. అనగ, యింద్రుడువృత్రుని దేవయానమునకు పోవు గుమ్మమువద్ద చంపెను. పారశీగ్రంథమందుకూడ 'తిష్ట్రి'

అపోషను వోరు-కశౌసముద్రిమందు చూపెను. యుద్ధానంతర మందు 'త్విష్ట్రి'మష్ణాయను దేవతచే చేయబడిన మార్గమందు (దేవయానమందు) నడచుచువచ్చెను. వృత్రమందిరము "రజస్" యొక్క అట్టడుగున నీటిచేగప్పబడి అదృశ్యముగ నుండెనని ఋ I, 52, 6 చెప్పుచున్నది. ఈవర్ణనలలో నొక్కటియైనను మేఘమునకు సరిపోజాలవు. మేఘము సముద్రమని చెప్పుటకు వీలులేదు. మేఘము ఆవలిప్రక్కనున్న బహుదూరదేశములో (పరావత్) నున్నదని చెప్పుటకును వీలులేదు. మేఘము * "దేవయాన గుమ్మము" వద్దనున్నదనియు చెప్పజాలము. ఆకాశమధ్యమందు తిరుగాడుచున్న మేఘములు దేవయాన గుమ్మమువద్దనున్నవనిగాని, ఆవలిప్రక్క దూరదేశమందున్న వనిగాని వర్ణింపబడజాలవు. అదిగాక, మేఘములు సూర్యరశ్మి లేని గాఢాంధకారమందు (అసూర్య తమస్) మునిగియున్న వను వర్ణనయు అసంగతమే. కనుక, ఈ యుద్ధమును తీసికొనిపోయి మేఘములలో పెట్టుట ఏమాత్రమును వీలులేదు. ఈ యుద్ధరంగము మనకు ఆవలిప్రక్క దూరదేశ ములో గాఢాంధకారపరివృతమై యున్న సముద్రమధ్యమందు జరిగెను. ఈ యుద్ధానంతరము సూర్యుడు తేజోమయుడైన

* దేవయాన మనగ ఖగోళముయొక్క పై యర్థభాగము; పితృయాన మనగ ఖగోళముయొక్క అడుగు భాగము. దేవయాన గుమ్మమనగ మనకు పైన గాన్పించు ఖగోళార్థభాగమునకు (అనగ ఆకాశమునకు) ప్రవేశ గుమ్మము; అనగ క్షితిజమునకు కొంచెము క్రిందిభాగమని యర్థము.

సముద్రము (శుక్రంఅర్ణః) మీదికి—అనగ మనపైనకనుబడుచున్న ఆకాశముమీదికి— యెక్కి-వచ్చెను. యుద్ధముజరిగినచోటు గాఢాంధకారమైయున్న అర్ణవముగనుండెను. (తమసాపరివృతం) యుద్ధానంతరము సూర్యుడుపైకియెక్కి-వచ్చినచోటు తేజోమయార్ణవముగనుండెను. (శుక్రం అర్ణః) కనుక యీ రెండును భిన్నప్రదేశములుగ ప్రత్యేకించి వేదమునందే చెప్పబడియున్నవి. దీనినిబట్టి మనక్షితిజముక్రిందనున్న ఖగోళార్ధభాగమందు (అనగ, అధోలోకమందు) యుద్ధముజరిగెనేగాని, మనక్షితిపై యాకాశమందు తిరుగాడుచున్న మేఘములోకాదుసుమాయని స్పష్టమగుచున్నది. (ఇంద్రుడు వర్షాధిష్ఠానదేవతయైన నైయుండవచ్చునుగాక; కాదని నేజెప్పుటలేదు. కాని ప్రస్తుతాంశమేమనగ:— వృత్రహంతకుడుగ వేదమందు వర్ణింపబడిన యింద్రుని మాత్రము వర్షాధిష్ఠానదేవతగ నన్వయించి చెప్పుటకు వీలులేదని మామతము.)

III. మూడవఅభ్యంతరము:- (యుద్ధకాలమును గూర్చిన అభ్యంతరము) మేఘసిద్ధాంతము సంగీకరించినచో యీ యుద్ధము వర్షకాలమందు జరిగెనని చెప్పవలసివచ్చును. కాని, యింద్రునిచే నాశనముచేయబడిన వృత్రుని * కోటలు శరదృతుసంబంధమైనవని (శారదీః) ఋగ్వేదము చెప్పుచున్నది. ఈయసందర్భమును సమర్థించుటెట్లు ?

* కోటలను నాశనముచేసినందువల్ల యింద్రునకు పురందర, పురభిత్, నామములు వచ్చెను.

పూర్వము వర్ష శరదృతువుల రెంటికినికలిసి మొత్తముపై యొక్క శరదృతువను పేరేయుండెనని చెప్పి దీనిని సమర్థింప వచ్చును. కాని, ఒకవేళ దీని నిట్లు సరిపుచ్చుకొన జూచినను "వృత్రుడు సంవత్సరాంతమందు (పరివత్సరే) చంపబడెనని చెప్పు ఋ X, 62, 2 వాక్యము నెట్లు తప్పించుకొనగలము. దీనినితప్పించుకొనుటకై పూర్వమొకప్పుడు సంవత్సరము శరదృతువుతో ప్రారంభమయ్యెనని చెప్పుకొనవలెనుకాబోలు! ఇంద్రుడు అర్బుదను (వృత్రుని) మంచుతో (హిమముతో) చంపెనని వేదము చెప్పుచున్నది. యుద్ధము వర్షకాలమందు జరిగినచో, ఉషస్సోదయమును యుద్ధఫలితముగ నెట్లు చెప్ప వచ్చును. యుద్ధము అసూర్యమగుతమస్సులో జరిగెనని యెట్లు చెప్పవచ్చును. కనుక, యీయుద్ధకాలమును సమర్థించుటకు కూడ యీమేఘసిద్ధాంతము సరిపోదు.

IV. నాల్గవ అభ్యంతరము:– (శబ్దజాలమునుగూర్చిన అభ్యంతరము) వృత్రుడునీటిని బంధించియుంచిన ప్రదేశమును వర్ణించుచు వేదమునందు, పర్వత, గిరి, అద్రి, ఊధస్, ఉత్స, కబంధ, కోశ,– మొదలగు శబ్దములు ప్రయోగింపబడియున్నవి. మేఘసిద్ధాంతవాదు లీపదముల కన్నిటికిని "మేఘ" మను భావార్థమునే చెప్పిరి. వేయేల, యీ ప్రదేశమును వర్ణించుటకై వేదఋషు లేపదమును ప్రయోగించియున్నను సరే దాని సరళార్థము నెంతమాత్రము లెక్కగొనక మన వైగక్తులు దాని నంతయు విరిచి ప్రతిచోట మేఘమనియే భావా

ర్థమును జెప్పిరి. ఈ వృత్రగాధకు నిజమగు భావార్థమును తెలిసికొనుట కీమేఘసిద్ధాంత మొక్కటియే తప్ప అప్పటికి వేరొండు గతిలేకపోవుటచే, వారిట్లు శబ్దములను విరిచి యేదో విధముగ సరిపెట్టుకొనవలసినవారైరి. అప్పటి యవసరమును బట్టి వారేదో యొకవిధముగ నిట్లు సరిపెట్టుకొన జూచినను, మొత్తముమీద యీపద్ధతి చాల లోపభూయిష్టమనిమాత్ర మొప్పుకొనక తప్పదు. అందుచే వారి వ్యాఖ్యానపద్ధతికంత విలువ యుండజాలదు. ఈ లోపమును గ్రహించి, దాని నెట్లైన సరిపుచ్చుటకై పాశ్చాత్యపండితులు కొంత యత్నించిరి. కాని వారియత్నములు సయితము నిష్ఫలము లయ్యెను. పర్వత, గిరి, అద్రి, అను పదములకు మేఘమనుటకు బదులుగ "పర్వత" మనియే సరళార్థమును చెప్పిన బాగుండునని యొక పండితుడు సూచించెను. అనగ, ఇంద్రుడు తన వజ్రముతో పర్వతములను పగులగొట్టి నదులను విడిపించెనట. "పర్వతమును వజ్రముతో (పిడుగుతో) పగులగొట్టినంతమాత్రముచే దానినుండి నదులెట్లు ప్రవహించి రాగలవని వెంటనే మాక్సుముల్లరుపండితు డాక్షేపించెను. కనుక, యీ రెండవయర్థ మసలే సరిపోదు. ఇది మొదటిదానికంటె మరింత అయోమయముగనున్నది. మేఘసిద్ధాంతముతప్ప మనకింక వేరుగతిలేనప్పుడు ప్రతిమాటకు మేఘమనియే అర్థముచెప్పుకొని సరిపుచ్చుకొనక తప్పదు.

ఈవిధముగ మేఘసిద్ధాంతము సమకాలీన చతుర్విధ ఫలోత్పత్తిని సమర్థించుటకుగాని యుద్ధరంగమును సమర్థించుటకుగాని, యుద్ధకాలమును సమర్థించుటకుగాని, శత్రుజాలమును సమర్థించుటకుగాని, పనికిరాకపోయెను. ఇట్లయ్యును యిది యింతకాలమునుండియు యేల యంగీకరింపబడుచు వచ్చెనో తెలియకున్నది. ఈనాలుగుఫలితములలో మొదటి రెంటిని (నీరు,ఆవులు) మేఘసిద్ధాంతము సమన్వయించుచున్నది; చివరిరెంటిని (సూర్యుడు, ఉషస్సు) ఉషస్సిద్ధాంతము సమన్వయించుచున్నది. కాని, యీనాల్గింటినికలిపియే యొక్కసిద్ధాంతమును సమర్థింపజాలకున్నది. ఈనాల్గింటిని యేకకాలమందు సమర్థించునట్లుగ యీసిద్ధాంతములరెంటిని సమ్మేళనజేయుటకైనను సాధ్యపడకున్నది. అట్లుగానిచో, తుపానుపోయిన పిమ్మట వచ్చుసూర్యకాంతిని, రాత్రిగడచిన పిమ్మట కలుగుసూర్యోదయమును– యీరెంటిని తారుమారు చేసి వైదికఋషులే తబ్బిబ్బులుగ జెప్పిరని యీతప్పును వైదికఋషులనెత్తిపైననైనను వేయవలసివచ్చును.

మేఘ ఉషస్సులను నీరెండు సిద్ధాంతములలో ప్రాచీన నైరుక్తులు మేఘసిద్ధాంతమునే యెక్కువ మాన్యమైనదానినిగ గ్రహించియుండిరి. కారణమేమనగ:– ఇంద్రుడు వర్షాధిష్ఠానదేవతయను భావము నైరుక్తులకు తదితరకారణములచే యేర్పడియుండెను. ఈ తమ భావమునకు మేఘసిద్ధాంతము సరిపోవుటచే వారు దీనినే యెక్కువగ నంగీకరించుచు, యీ సిద్ధాంతమునకు లొంగని, సూర్యోషస్సుల ప్రజననాదులు

చాల అప్రస్తుతమైనవనియు, అప్రాముఖ్యమైనవనియు, అగ్రాహ్యమైనవనియు చెప్పి త్రోసివేసిరి. పాశ్చాత్యులుకూడ యీ సిద్ధాంతమునే యంగీకరించిరి. ప్రస్తుత మిప్పుడు పండితలోకములో నిలిచియున్న దీ మేఘసిద్ధాంత మొక్కటే. అయినను, యిది వృత్రగాథను సమన్వయించుటకు బొత్తుగ పనికిరాకుండ నున్నది; ఇది యెంతమాత్రమును చాలకుండనున్నది. ఈవృత్రగాథ నింతకంటె యెక్కువ బాగుగసమన్వయింపగల క్రొత్త సిద్ధాంత మింకొకటి మనకు దొరికినచో, యీ పనికిరాని మేఘసిద్ధాంతమును వదలివేయుటకు పండితలోకము సంకోచింపదు.


వృత్రగాథయందలి యుద్ధము పిడుగును చేబూనివచ్చిన యింద్రునకును, మేఘమునకును జరిగినదనుకొనుట తప్పు. అసలేయుద్ధము నిజముగ అంధకార, ప్రకాశములకు మధ్య జరిగియుండెను. వృత్రివధమాట యటుంచి యింద్రుడు ప్రప్రథమములో "వెలుతురు" నకధిదేవతయని యెరుంగవలెను. దీనికనేక ప్రమాణములుగలవు.

(౧) III, 34, 4 VIII, 15, 5 X, 43, 4 I, 108, 8 IV, 16, 4	చీకటిలో పడియున్న వెలుతురును యిందుడుకనుగొని పైకితీసుకొని వచ్చెను.

(౨) II, 12, 7 II, 21, 4 III, 31, 15	ఇంద్రుఁడు సూర్యుని, ఉషస్సును కలిగించెను.
(౩) I, 62, 5	సూర్య, ఉషస్సులతో యింద్రుఁడు చీకటిని భేదించెను.
(౪) VIII, 3, 6	సూర్యుని వెలుగ చేసినది యింద్రుఁడే.
(౫) I, 7, 3	సూర్యుని ఆకాశముమీఁద నెక్కించినది యింద్రుఁడే.
(౬) X, 111, 3	సూర్యునకు త్రోవ నేర్పాటుచేసినది యింద్రుఁడే.
(౭) III, 39, 5	చీకటిలోఁ బడియున్న సూర్యుని కనుగొన్నది యింద్రుఁడే.
(౮) ఐ. బ్రా. IV, 5	రాత్రిపూట అంధకారములోఁ దాఁగికొన్న అసురులను తఱిమివేయుటకు దేవతలందరిలోను యింద్రుఁ డొక్కఁడే పూనుకొనెను.

ఈవాక్యములం దెచ్చటను వృత్రవధమాటయే లేదు. కనుక, వృత్రవధతో సంబంధము లేకుండనే యింద్రుఁడు జ్యోతిర్దేవతయని యెఱుంగవలెను. సూర్యుని, వెలుతురును సంపాదించుకొని వచ్చినది ఇంద్రుఁడే. కనుకనే ఇంద్రునకు " అప

వృత్రవిజృంభణ




(జలములు, సూర్యుడును వృత్రునిచే అన్యాయముగా బంధింపబడియున్నారు.)

1 వరుణవృక్షము
2 దివ్యాః ఆపః (దివ్యజలములు)
3 అహి (సర్ప) రూపుడగు వృత్రుడు
4 సూర్యుడు

ప్లేటు 16.

వృత్రవధ



([illegible], సూర్యుడును వృత్రుని చెరనుండి విడిపింపబడిరి.)

1 సగుణావృతము

2 దివ్యాః ఆపః (దివ్యజలము)

3 అహి (సర్ప) రూపుడగు వృత్రుడు

4 సూర్యుడు

వర్యః" (వెలుతురును తిరిగి కలుగజేసినవాడు) అను బిరుదు వచ్చెను; ఆమచేతనే మాక్సిముల్లరుపండితుడు ఇంద్రుని గ్రీకుపురాణములలో జ్యోతిర్దేవతయైన "అప్పొలోను" తో పోల్చియున్నాడు.

వెలుతురును పునరుద్ధారణజేసెనను యీ ఇంద్రలక్షణము ఆతడొనర్చిన వృత్రవధ, నీటివిడుదల మొదలగు కార్యములతో యేల కలిపిచెప్పబడవలెను? ఈ రెంటికిని సంబంధమేమి? ఈనీటికిని, వెలుతురునకును సంబంధమేమి? ఈ రెంటను యేకకాలమందే యేల చెప్పబడినవి? వేయేల, యీగాధ మేఘసిద్ధాంతమునకుగాని, ఉషస్సిద్ధాంతమునకుగాని పొసంగకపోవుట కీజ్యోతిర్జలముల కలయికయే (సమకాలికత్వమే) ముఖ్యమైన అభ్యంతరముగ నున్నది. ఇంద్రుడు వృత్రవధవలన నీటిని విడిపించి, వెలుతురును పైకితెచ్చెను. — వేదమునందంతటను యిదే పాట. ఈజ్యోతిర్జలముల సమకాలికోత్పత్తిని ఇంతవర కెవరును సంతృప్తికరముగ సమన్వయింపలేదు. మేఘసిద్ధాంతమునవలన నీటివిడుదలను సమర్థింపవచ్చునుకాని, వెలుతు రెట్లు వచ్చునో చెప్పజాలము. అట్లే, ఉషస్సిద్ధాంతమునవలన వెలుతు రెట్లు వచ్చునో సమర్థింపవచ్చునుకాని, నీటి కెట్లు విడుదలకలిగెనో చెప్పజాలము. ఈ రెంటిని యేకకాలమందు సమర్థించుటకు వీలులేకున్నది. ఇది బహు చిక్కుగనున్నది. కనుక, వేదమందు చెప్పబడిన నీరు (ఆపః) యొక్క స్వరూపస్వభావము లెట్టివో మన

మిప్పుడు విపులముగ పరిశీలించుట యావశ్యకమైనది. ఈనీటి యొక్క స్వభావమును తెలిసికొన్నపిమ్మట యీమేఘ, ఉషస్సిద్ధాంతముల నంగీకరించుటయో, లేక త్రోసివేయుటయో యను ప్రశ్నను పరిష్కరించుకొనవచ్చును.

మన మిప్పు డీనీటిని (ఆపః) గూర్చి పరిశీలింతము:—

ఇంద్రుడు వృత్రుని చంపి నీటిని విడిపించెనని చెప్పు వేదవాక్యములలో నెచ్చటను మేఘమను మాటయే మచ్చున కైననుకానరాదు. ఆవాక్యములలో పర్వత, గిరి, అద్రి — మొదలగుపదములే ప్రయోగింపబడియున్నవి. నీటిని సూచించుటకు ఆపః, సింధవః అను శబ్దములుగలవు. ఋగ్వేదమందు 'ఆపః' శబ్దము 'నీరు' ను సాధారణార్థములో ప్రయోగింప బడియున్నది. కాని, 'ఆపః' అను యీపదమే ఋగ్వేదమందు చాలచోట్ల "దివ్యజలము," లేక "ఆకాశజలము" అను నర్థమును తెలుపుచున్నది. ఋ I, 23, 17—లో - ఈజలము దేవతల మార్గమున పోవుచుండునని; ఇవి తమసన్నిధినున్న సూర్యునితో కలిసియుండునని. VII, 49, 2—లో—ఆకాశజలమును (దివ్యాః ఆపః), భూజలమును (ఖనిత్రిమాః) వేర్వేరుగ ప్రత్యేకించి స్పష్టముగ చెప్పబడియున్నవి. ఈజలములన్నియు తుదకు సముద్రములో పోయిచేరునట. ఏడునదులు భయంకర ధ్వనితో అగాధములో పడునట్లు వరుణదేవుని ముఖగహ్వర మందు పడుచున్నవని VIII, 69, 12 చెప్పుచున్నది. వరుణ దేవుడు యింద్రునివలెనే నదులను ప్రవహింపజేయునట

(II. 28, 4) దీర్ఘతనుడు తమ గమ్యస్థానమునకు పోవుచున్న నీటిపై తేలియాడుచు పోయెనని I, 158, 6 లో చూచియుంటిమి. ఈ నీటివిషయమై యింక యెక్కువగ ప్రమాణముల జూపవలసిన యవసరము లేదు. ఏలనన:—ఋగ్వేదమందు ఆకాశజలమును, భూజలమును,— రెండురకముల జలములు— ప్రత్యేకించి వేర్వేరుగ చెప్పబడియున్నవని పండితులెల్లరు నంగీకరించియే యున్నారు కనుక, యీవిషయములో తగాదా యేమియు లేదు. కాని, యీ ఆకాశజలము (దివ్యాః ఆపః) యొక్క నిజమైన స్వరూపస్వభావములను పండితులు బాగుగ గ్రహించినట్లు గనపట్టదు. అందుచేతనే వృత్రగాథలో చెప్పబడిన ఉషస్సుదయ, జలమోక్షణములకుగల సన్నిహితసంబంధమును పండితులు గ్రహింపజాలక పోయిరి. ఋగ్వేదము దివ్యజలమును (దివ్యాః ఆపః) పేర్కొన్నప్పుడెల్ల అది 'పానసీశే' యని పండితులు తలంచుచుండిరి. ఇది పెద్దపొరబాటు : ఏలయనగ:— ఈ జగత్తుయొక్క సృష్టినిగూర్చిచెప్పు సందర్భములో యీసృష్టికి పూర్వము విశ్వమంతయు యేకార్ణవమై యుండెనని (ఒక్కటే సముద్రమైయుండెనని) ఋ X, 82, 6, 129, 3) చెప్పుచున్నది. బైబిలు చెప్పినట్లే ఆదియందీ విశ్వమంతయు జలమయముగ నుండెనని— పైన ఆకాశమందును, క్రింద భూమియందును— సమస్తమును జలమయముగ నుండెనని ఋగ్వేదముకూడ చెప్పుచున్నది. శత. బ్రా. (XI, 1, 6, 1); ఐత. ఉప. (I, 1); మనుస్మృతి (I 9) — కూడ యీ

ప్రపంచమంతయు నీటియావిరినుండి యుత్పన్నమయ్యెనని చెప్పుచున్నవి. కనుక, యీ దివ్యజలమునుగూర్చి వైదిక ఋషుల పూర్వజులకు బాగుగ తెలియునని మనము పూర్ణా పథముగ జెప్పవచ్చును. ఈ దివ్యజలమునుండియే జగత్తు పుట్టినని చెప్పుటచే, దీనిస్వభావము తేటపడుచున్నది. దివ్య జలముగ యిప్పటి ప్రకృతిశాస్త్రజ్ఞులుచెప్పు "ఈథరు" అను ఒకానొక, బహుసూక్ష్మమైన అస్పష్టద్రవపదార్థము. ఇది మన త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణములకుగోచరింపదు; ఇదివాయువునకంటె యెన్నియోరెట్లు బహు సూక్ష్మమైనది; ఇదివిశ్వమునంతనువ్యాపించియున్నది; ప్రతియవకాశమునందున నిండియున్నది; వాయువులేని ఖాళీప్రదేశములలో సైత మిది కలదు; వేయేల, ఇదిలేనిచోటు లేనేలేదు. ఏచోటునుండియు దీనిని తరిమివేయుటకు సాధ్యముగాదు; మన మింతదూరము పోనేల, ఋగ్వేదమందు దివ్యజలమును (దివ్యాః ఆపః) నీటి యావిరియు (పురీషం) పేర్కొనబడియున్నవని చెప్పిన మనకు చాలును. ఈ విశ్వమంతయు — పైనను, క్రిందను, సర్వ దిశలును, సమస్తాంతరాళములును, సమస్తావకాశములును— యీ దివ్యజలములచే నిండి పరివేష్టితమై యున్నవనియు, యీ విశ్వ మున్నంతకాల మీ దివ్యజలము లుండి తీరుననియు (ఋ X, 30,10) వైదికఋషులు తలంచిరి. మన కింతవరకు చాలును.

మనకు నెత్తిపైన గన్పట్టుచున్న ఖగోళార్థభాగమేగాక, మన భూమికి క్రిందిభాగమందుకూడ రెండవ ఖగోళార్థము గలదను విషయము వైదికఋషులకును, తత్పూర్వజులకును స్పష్టముగ తెలియును. దీని కనేకప్రమాణములు గలవు. దీని విషయమై పండితలోకములో నెవరికిని సందేహము లేదు. దీని నిట ప్రత్యేకముగ బుజువుపరచవలసిన పనిలేదు. అయినను, కొందరు పాశ్చాత్యపండితు లీయంశమునుఒప్పుకొని యుండలేదు; ఇట్లొప్పుకొనకపోవుటకు ముఖ్యముగ వారిసాంప్రదాయికమగు దురాగ్రహమే కారణము. భూమి గుండ్రముగ బంతివలెనుండి, అవకాశములో ఖగోళమధ్యమందు, వ్రేలాడుచున్నదను సంగతి ప్రాచీనులకు తెలియనే తెలియదట! భూమి బల్లపరుపగనుండి, పైనఆకాశమను డిప్పచే కప్పబడియున్నదని ప్రాచీనులు తలంచిరట! ఇట్టిసాంప్రదాయికాగ్రహ మొకటి పాశ్చాత్య పండితుల మనస్సును కప్పివేయుటచే, తమయెదుట ప్రత్యక్షముగ, కండ్లకు గట్టినట్లు, కన్పట్టుచున్న సరళవాక్యములను వారు విరిచియో, లేక మెలిబెట్టియో, వానికి పెడార్థములను చెప్పవలసినవారైరి. మనభూగోళముక్రిందకూడ ఆకాశము లేక వాతావరణము (రజస్) కలదను సంగతి వైదికఋషులకు తెలియునని చెప్పుటకు చాల ప్రమాణవాక్యములు గలవు. వానిలో కొన్నింటినిట యుదాహరించెదను:—

(౧) VI, 9, 1 } శుక్ల, కృష్ణ దివసములు రెండును రజస్సుల (లోకముల) రెంటిని ప్రసిద్ధ మార్గములగుండ వివర్తన చేయుచున్నవి. (అనగ, చుట్టుచున్నవి.)

వ రా:—ఈ రెండు రజస్సులు (లోకములు) ఏవి ? ఒకటి ఖగోళముయొక్క యూర్ధ్వభాగము; రెండవది ఖగోళముయొక్క అధోభాగము. (ఖగోళముయొక్క తిర్య, గూర్ధ్వ భాగములు రెండును యీ వాక్యమందు స్పష్టముగ పేర్కొన బడియున్నవి) —

(౨) VII, 80, 1 } ఒకదానినొకటి అనుకొనియున్న (సమంతే) లోకములు రెంటిని (రజసీ—ద్వివచనము) ఉషాదేవత విప్పిసమాస్తమును బహిరంగము చేయుచున్నది.

వ రా:—ఈ రెండులోకములును క్షితిజమువద్దకలియు ననియు, ఈ రెంటికిని క్షితిజము సరిహద్దనియు యీ వాక్యములో స్పష్టపరుపబడియున్నది. క్షితిజమునకు పై భాగమంతయునొక లోకము (రజస్) అడుగుభాగమంతయు నింకొకలోకము (రజస్).

(3) V, 81, 4 } ఓసవితృ ! నీవురాత్రి రెండువైపులను తిరిగివత్తువు. (రజనీ ముభయతః పరీయసే.)

వరా:— రెండువైపు లనగ ఖగోళముయొక్క తిర్య గూర్ధ్వభాగములని స్పష్టమగుచున్నది. ఈమూడువాక్యముల లోను పేర్కొనబడిన లోకములు రెండును పైన ఆకాశము లోనే యున్నవని యర్థముచేసికొనవలెనట! ఆహా! యేమి! పాశ్చాత్యుల సాంప్రదాయికాగ్రహము. సూర్యుడు రాత్రి పూట క్రిందిలోకమునకు పోకుండ పైఆకాశములో యేలోక మున దాగికొనునో!

(ర) VII, 104 11 — మా శత్రువు మూడులోకముల యడుగు భాగమునకు పోవుగాక! (తిస్రః పృథివీః అధః)

వరా:- దీనినిబట్టి యీ యధోలోకము నరకమువలె దుఃఖమయమైనదని సూచింపబడెను.

(ఱ) X, 152, 5 — మాకు హానిచేయువాడు, అధోలోక మందున్న అంధకారములో బడుగాక. (అధరం తమః)

వరా:- ఈ యధోలోకము చీకటిమయమని సూచింప బడెను.

(ల) III, 53, 21 — మమ్ముల ద్వేషించువాడు క్రిందికి పడిపోవునుగాక. (అధరః)

(ళ) II, 12, 4 — ఇంద్రునిచే చంపబడిన దస్యుసంతానము అజ్ఞాతమగు అధోలోకమునకు పోయిరి. (అధరం గుహాకః)

వరా:- దీనినిబట్టి ఇంద్రునకును వృత్రాసురునకును జరిగిన యుద్ధ మీయధోలోకమందే జరిగెనని సూచింపబడెను.

(౮) I, 34, 8 — అశ్వినీదేవతలు ఊర్ధ్వలోకముల మూడింటిపైనను (త్రిస్సః పృష్ఠేపి ఉపరి) తిరుగుచు రాత్రింబవళ్ళు అంతరిక్షము యొక్క పై భాగమును (దివో నాకం) కాపాడుచుందురు.

వరా:—ఈమూడు ఊర్ధ్వలోకములును, ఇదివరకు చెప్పిన మూడుఅధోలోకములకును ప్రతిరూపములుగనున్నవి. భూమిని మూడులోకములుగ విభజించుట వేదములలో సర్వసామాన్యవిషయమే.

(౯) I, 164, 6 — ఈభూమికి పైనను క్రిందను మూడున్ను మొత్తము ఆరురజస్సులు గలవని ఋగ్వేదము చెప్పుచున్నది.

(౧౦) సూర్యుడు చీకటిలోకమునుండి (కృష్ణేనరజసా) కదలి వచ్చుచున్నాడనియు, అవలి ప్రక్కనున్న చాల దూరదేశమునుండి, (పరావత్) వచ్చుచున్నాడనియుకూడ వేదము చెప్పుచున్నది. కనుక, ' పరావత్ ' 'కృష్ణేనరజసనా'— యను నీరెండుపదములును ఒకేయర్థమును సూచించుచున్నవి. కృష్ణరజస్సునుండి సూర్యుడు పైకెక్కును.

(ఉ—ద్యక్; ఉద్—ఆచరత్) కనుక రాత్రిపూట సూర్యుడు అధోలోకము నకు పోవునని స్పష్టమగుచున్నది.

(౧౧) I, 117, 5 I, 164, 32, 33 — సూర్యుడురాత్రిపూట "నిఋతి" యొక్క యొడిలో పరుండునట. రాత్రిపూట చీకటిలో నివసించియుండునట. 'నిఋతి' యనగభూమికి క్రిందిభాగమున పడమరనుండి తూర్పువరకు వ్యాపించిన అధోలోకమని మాక్సిముల్లరు మొదలగు పాశ్చాత్యులు చేసిన యూహాలనుబట్టియు, తదితర ఋగ్వేద వాక్యములనుబట్టియు నిర్ధారణయగుచున్నది.

(౧౨) II, 27, 15 — ఖగోళముయొక్క తిర్యగూర్ధ్వ భాగములరెంటిని దెలుపుటకు "ఉభేఅర్ధా" అనుపదము ప్రయోగింపబడినది.

ఇదిగాక, యింకొకచోట దూరమందున్న (క్రిందనున్న) అర్ధభాగమునకు "పరేఅర్ధే" యనియు మనకుదగ్గరగ (పైన) నున్న అర్ధభాగమునకు "అపరేఅర్ధే" యనియుకూడ శబ్దములు ప్రయోగింపబడియున్నవి. ఈవిధముగ ఖగోళము రెండర్ధభాగములుగ విభజింపబడియున్నదని చెప్పుటకు ఋగ్వేదమునుండి యనేక ప్రమాణములను చూపవచ్చును. అధర్వవేదమందుకూడ (X, 8, 7) రెండు "సగములు" (అర్ధం)

చెప్పబడియున్నవి. ఋగ్వేదమందు మరికొన్నిచోట్ల యీ భావమందే "సముద్రా" అనుపదము ప్రయోగింపబడి యున్నది. ఈరెండు సముద్రములలో ఒకటి యీప్రక్కను (అవర) రెండవది ఆప్రక్కను (పర) ఉన్నదట. ఈసందర్భమందే, అవస్తాత్ పరస్తాత్, అను పదములుకూడ గలవు. ఈరెంటికే యొకచోట పరావత్, అంబర అనుపదములు ప్రయోగింపబడినవి. సూర్యుడు "పరావత్" ప్రదేశమందు నిద్రించుచుండునట. ఖగోళముయొక్క యీరెండుసగములను కలిపి చెప్పవలసివచ్చినప్పుడు "ఉభయతః" అని ప్రయోగించిరి.

మనయెదుట నిన్ని ప్రమాణములుండగ ప్రాచీనులకు అధోలోక మొకటియున్నదను సంగతి తెలియనే తెలియదనుట కెట్లు సాహసించవచ్చును. ఖగోళముయొక్క శిర్యగర్భమునుగూర్చి యిప్పటిశాస్త్రజ్ఞులకు తెలిసినన్ని వివరములు ప్రాచీనులకు తెలియకపోయి యుండవచ్చునుగాక. అంతమాత్రముచే అధోలోకమొకటి యున్నదను సమాచారమే వారికి తెలియదని చెప్పుట బహుసాహసము. ఈయంశము నింతటితో విరమించి యింకకథాభాగమునకు వత్తము.

మనభూమికి క్రిందనున్న ఖగోర్ధభాగమును వైదికఋషులెరుంగుదురని సిద్ధాంతముచేసిన పిదప, యిక వేదములందు పలుతావులలో చెప్పబడిన దివ్యజలముయొక్క స్వరూపస్వభావమును గుర్తించుట బహుసులభము. విశ్వమంతయు— సమస్తావకాశమును — దివ్యజలముచే నిండియున్నది. ఈ

జలము ప్రవాహములుగట్టి క్రిందినుండి పైకిని, పైనుండి క్రిందికిని, సదా ప్రవహించుచుండును. ఈప్రవాహవేగముచేతనే, సూర్యచంద్రాదులును, తదితర జ్యోతిర్గోళములును ఆకాశమందు నడచుచుండును. ఈ యంశమే చాల ప్రధానమైన కీలకమని గుర్తుంచుకొనవలెను. ఈ కీలకమును బట్టుకొన్నచో వైదికగాధలను చాలవరకు సరళముగ సమన్వయింపవచ్చును. ఈ జలము నదులరూపముగ ఆకాశమందు ప్రవహించుచు తుదకువరుణునిముఖగహ్వరమందు-అనగ, అధోలోకమందున్న సముద్రములో—పోయిపడునని ఋగ్వేదము (VII, 49, 2; VIII, 69, 12) చెప్పుచున్నది. అధోలోకమే ఈజమున కంతటికిని కూడలిస్థానము— లేక ఆశయము. ఈ జలాశయము (Reservoir) "యహ్వాతీః" (శాశ్వతమైనది) అని చెప్పబడెను. ఈ జలాశయమే వరుణరాజ్యము; యిదే యమలోకము; యిదే రహస్యముగనున్న (నిణ్య) వృత్రుని నివాసస్థానము. ఈ నీటియొక్క పారుదలనుగూర్చి పారశీగ్రంథము లేమిచెప్పుచున్నవో చూతము:—

ఈదివ్యజలముతమకుకూడలి స్థానమైన "వోరు-కశా" సముద్రమునుండిలేచి, ఆకాశముమీదికి ప్రవహించి, మరల క్రిందికి దిగివచ్చి యీసముద్రములో కలియును. ఇట్లొకయావృతమైన పిమ్మట, మరల రెండవయావృతము ప్రారంభమగును. ఈరీతిగ యీదివ్యజలము సదాపైకి, క్రిందికి, నడుచుచునేయుండును. ఇదిగాక, జలమును, వెలుతురును—

రెండును ఒకమూలస్థానమునుండియే బయలుదేరివచ్చు చున్నవి; తిరిగి రెండును ఆమూలస్థానమునకే చేరుచున్నవని యింకొక పారశీగ్రంథము చెప్పుచున్నది. దివ్యజలములు దేవతలచే యేర్పరుపబడిన మార్గముగుండ ప్రవహించుచున్నవని పారశీగ్రంథము చెప్పుచున్నది. ఋగ్వేదముకూడ సూచినట్లు సరిగ యీభావమునే చెప్పుచున్నది. పారశీగ్రంథములోని జలములవలెనే, ఋగ్వేదజలములుకూడ ఆకాశమార్గమున ప్రవహించుచుపోయి తుదకు అధోలోకసముద్రమందు—వరుణముఖమున—బడుచున్నవి. కాని, ఋగ్వేదమునకంటె పారశీగ్రంథ మింకొక విశేషమును యెక్కువగ జెప్పుచున్నది. ఏమనగః—జలమును, వెలుతురును—రెండును—ఒకేమూల స్థానమునుండి బయలుదేరివచ్చి, మరల తుదకు, ఆ మూల స్థానమునే చేరుచున్నవని పారశీగ్రంథము ఖండితముగ చెప్పు చున్నది. మనకు కావలసిన కీలక మిదియే. ఇది పారశీ గ్రంథమందు నిస్సంశయముగ తోచుచున్నది. అదిగాక, "ఓ సూర్యుడా ! నీవు పైన అంతరిక్షమార్గమున యీ జలప్రవాహము వెంట నడచిపొమ్ము"— అని పారశీగ్రంథము చెప్పుచున్నది. ఇంకొకచోట, "అర్ద్విసూర అనాహిత" యను నది పర్వతశిఖరమునుండి మహావేగముతో పరుగెత్తి వచ్చి క్రిందనున్న "వోరు-కశా" సముద్రములో పడుచున్న దట.సరస్వతీనది అంతరిక్షమందున్న పర్వతశిఖరములను చీల్చు కొనుచువచ్చి యజ్ఞప్రదేశమునకు దిగుచున్నట్లు ఋగ్వేదము

చెప్పుచున్నది. ఈ రెండునదులును "దివ్యవాహినులే" ఇవి భూలోకమునకు దిగివచ్చి, భూమిపైనున్న నదుల నన్నిటిని జలపూరితములుగ జేయునట. ఈ భూమిపైనున్న జల మంతయు — మన శరీరములలోను, చెట్లలోను కూడనున్న సమస్త ద్రవపదార్థములును — మేఘములద్వారా అస లీదివ్యజలమువలననే యుత్పత్తియగుచున్నదట. మనకు పైన మూడు ఊర్ధ్వలోకములు గలవని ఋగ్వేదము చెప్పినట్లే, పారశీగ్రంథములుకూడ చెప్పుచున్నవి. మొదటిది నక్షత్ర లోకము; ఈ లోకమందు సమస్తయోషధుల బీజములు నుండును. "అర్ద్విసూరఅనాహిత" నది యీ నక్షత్రలోకముగుండ ప్రవహించును. ఈనదిలోని నీరంతయు పైలోక ములకేపోకుండ కొంతభూలోకమునకుకూడ ప్రవహించుటకు గాను మానవులీనదిని స్తుతింతురు. అంతట, సమస్తబీజముల తో సహా యీదివ్యజలము — మేఘములద్వారా — భూమిపైకి నీటినిపంపును. ఈనీటితో కలిసివచ్చిన బీజములవలననే మనకు ఓషధులు లభించుచున్నవి. సరస్వతీనదికూడ యిట్లే అంతరిక్ష మున ప్రవహించుచు మానవులచేస్తుతింపబడి, భూమిపైకి — మేఘములద్వారా — కొంతనీటిని పంపును. ఈనీటితో కలిసి వచ్చిన బీజములవలన ఓషధులు మొలుచును. "వోరుకశా" సముద్రమధ్యమందొక వృక్షముగలదట. ఈవృక్షమునుండియే సమస్తబీజములుపుట్టును. ఇట్లు పుట్టినబీజములు దివ్యజలము తో కలిసిపోవును. వర్షము కురిసినప్పుడీబీజములుకూడ నీటితో

కలిసి భూమిపై బడును. వానినుండి వృక్షాదులు మొలుచును. దీనికిసరియైన భావమే ఋగ్వేదమందుకూడ (I, 23, 20)కలదు. సమస్తఓషధులును నీటిలోగలవని సోముడుచెప్పెనట. వారు. కశాసముద్రము చుట్టును పర్వతపంక్తి (ఆల్ బురుజ్) గలదట. (బహుశః వేదములందు చెప్పబడిన అద్రి, పర్వత, గిరి,—యిత్యాదిపదములు యీపర్వతమునే సూచించుచున్నవి.) సరస్వతీనదికి "వృత్రఘ్ని" (వృత్రుని సంహరించిన స్త్రీ) యను బిరుదము ఋగ్వేదమందు (VI, 61, 7) గలదు. "అర్ద్వీసూర అనాహిత" యను పార్సీనదికూడ తనను గొల్చిన భక్తునకొకనికి త్రిశిరుడగు రాక్షసునొకని చంపుటకు తగినశక్తినిచ్చెనట. ఈరెండు కథలవలన యీదివ్యవాహినీ రూపములుగనున్న దివ్యజలమునకును, వృత్రవధకును గల సంబంధము స్థిరపరుపబడినది.

ఈవిధముగ, అర్ద్వీసూర అనాహిత, సరస్వతీనదులకు పోలిక సర్వవిధములచేతను విధాయకముగ సరిపోవుచున్నది. దివ్యజలములు అధోలోకమందు మూలస్థానముగ జేరియున్న జలాశయమునుండి (సముద్రమునుండి) బయలుదేరి, దాని చుట్టునున్న పర్వతకనుమల (బిలముల) గుండ బయటికి వచ్చి, అంతరిక్షముపైకిలేచి, అంతరిక్షముగుండ ప్రవహించి, మరల క్రిందికి దిగివచ్చి, యీసముద్రములో కలియుచుండును. అంతరిక్షముగుండ ప్రవహించుచున్న కాలములో, మానవులచే స్తుతింపబడి, కొంత నీరు (బీజములతోసహా)

భూమిపైకి వర్షరూపముగ పడుచుండును. ఇట్లు స్తుతింపనిచో ఆ దివ్యజలమునకు దయరాక వర్షములను బిగబట్టునేమో యను భయముచే మానవులు యజ్ఞయాగాదులను చేయు చుండిరి.

ఈదివ్యజలముయొక్క పారుదలను గూర్చి తెలిసి కొంటిమి. ఈదివ్యజలప్రవాహముల వెంటనే సూర్యచంద్రాదులును, తదితర జ్యోతిర్గోళములును ఆకాశమందు (పడవలలో వలె) సంచారము చేయుచుండును. ఈదివ్యజలప్రవాహములు నిలిచిపోయినచో సూర్యచంద్రాదుల చలనములుకూడ కట్టు బడిపోయి, ప్రపంచమంతయు గాఢాంధకారమున మునిగి పోవును. అందుచేతనే, దివ్యజలమునకును, వెలుతురునకును యెడబాయని సంబంధ మేర్పడుచున్నది. వృత్రాసురు డీదివ్య జలప్రవాహములను కట్టివేసినప్పుడు, ప్రపంచమున కెంత క్షోభగలిగెనో మనము సులభముగ యూహించవచ్చును. అధో లోకసముద్రమందు నివాస మేర్పరుచుకొనియున్న వృత్రుడు తన దేహమును పెంచి, సముద్రమునంతను చుట్టివేసి, కొండ బిలముల నన్నిటిని మూసివేసెను. అంతటితో యీదివ్యజల ములుపైకిప్రవహించుటకువీలు లేక సముద్రమందే బంధింపబడి పోయెను. సూర్యచంద్రాదులుకూడ అందే బంధింపబడి పోయిరి. ఇంద్రుడువచ్చి, వృత్రుని సంహరించి, కొండబిలము లను తెరపిచేసెను. అంతట, యీదివ్యజలములు యథా ప్రకారముగ యీ కొండబిలములవెంట బయటికివచ్చి ఊర్ధ్వ

ముఖముగ ప్రవహించెను. వానితోపాటు సూర్యచంద్రాదులు కూడ యీ ప్రవాహములవెంట, ఆకాశముపైకియెక్కి సంచరించిరి. ఈ వోరుకశా సముద్రమును చుట్టియున్న "ఆల్ బురుజ్" పర్వతపంక్తిలో తూర్పున ౧౮౦ బిలములును, పశ్చిమమున ౧౮౦ బిలములును మొత్తము ౩౬౦ బిలములు — గలవట. దివ్యజలప్రవాహములును, వానితోపాటు, సూర్యచంద్రనక్షత్ర గ్రహాదులును యీ బిలములవెంటనే బయటికి వచ్చుచు, పోవుచు, నుండుననని పారశీ గ్రంథములు చెప్పుచున్నవి. ఇంద్రుడు వృత్రాసురుని యీ కొండమీద నుండగనే చూచెనట. ఈ కొండలమధ్యనే వృత్రుడు ఆవులను బంధించియుంచెనట. చుట్టునున్న యీ కొండలను ఛేదించియే అంగిరసులును, బృహస్పతియు, ఆవులను విడిపించుకొని వచ్చిరట. ఈఋగ్వేదప్రమాణములేగాక, యితరవలి సంస్కృత వాఙ్మయమందుకూడ సూర్యుడు ఉదయాద్రిపై నెక్కి వచ్చుననియు, అస్తాద్రివెనుకకు దిగిపోవుననియు వర్ణనలుగలవు. హిందూ, పారశీకవర్ణనలిట్లు తూచినట్లు సరిపోవుచున్నవి. వృత్రవధవలనకలిగిన చతుర్విధఫలముల సమకాలికోత్పత్తిని ప్పుడు మనము సరళముగ సమన్వయింపవచ్చును. దివ్యజలములు విడుదలకాగానే, వానితోపాటు ఉషస్సు, సూర్యుడు, ఆవులు (ప్రాతఃకాలిక సూర్యకిరణములు, లేక పగళ్ళు)కూడ విడుదలయయ్యెను.

ఈనీటిపారుదలకును సూర్యచంద్రుల ప్రకాశమునకును గల సన్నిహిత సంబంధమును స్థిరపరుచుటకింక నెన్నియో

ప్రమాణములు పారశీగ్రంథములందును వేదములందునుకూడ గలవు. పితృదేవతలొనర్చిన మహాత్కార్యములనేకములు వేదములందు వర్ణింపబడియున్నవి. సృష్టివ్యాపారమును నడిపించుటలో దేవతలకు పితృదేవతలుకూడ చాల తోడ్పడిరట. పితృదేవతలు ఆకాశమును నక్షత్రములతో నలంకరించి, రాత్రియందు చీకటిని, పగటియందు వెలుతురును ఉంచిరి. (X, 68, 11); మరుగుపడియున్న వెలుతురును కనుగొని తెచ్చిరి; ఉషస్సును ప్రజనమొందించిరి. (VII, 76, 4; X, 107, 1) పారశీగ్రంథము లిట్లు చెప్పుచున్నవి:— చాల కాలమువరకు ప్రవహించుటకు వీలులేక ఒకచోటనే నిలువయున్న నీటిని పితృదేవతలు ప్రవహింపజేసి, వానికి దేవతలచే నిర్మింపబడిన మార్గమును చూపిరట; అంతట నీరు దేవమార్గమువెంట ప్రవహింప జొచ్చెనట; అట్లే, అసురుల నిర్బంధముచే ఒకచోటనే చాలకాలమునుండి కట్టుబడియున్న సూర్యచంద్రనక్షత్రాదులను పితృదేవతలు విడిపించి వానికి దేవనిర్మితమార్గమును జూపిరట; అంతట సూర్యచంద్రాదులు దేవయానమార్గమువెంట సంచరింప జొచ్చిరట; ఈవిధముగ నీటిపారుదలకును వెలుతురునకును గల సంబంధము ధృవపరుపబడియున్నది.

వృత్రగాథయందు మహోదురవగాహముగ నెంచబడిన యీజ్యోతిర్జలముల సన్నిహితసంబంధము, వేదవాక్యములచే

నంత ఖండితముగ వివరింపబడకపోయినను యీ పార్శీగ్రంథ ప్రమాణములవలన స్పష్టముగ కరతలామలక మగుచున్నది.

ఈ సీటిపారుదల శీతకాలమందు — దీర్ఘరాత్రికాల మందు — నిలిచిపోయెనని తెలుపుట కింకను పార్శీగ్రంథ ప్రమాణములు గలవు. పారశీకులు తమ శవములను దహనముచేయక సూర్యరశ్మిలో (యెత్తుప్రదేశమందు) పక్షుల కాహారముగ వదలివేయుదురు. ఒకభక్తు డిట్లు దేవునియడుగు చున్నాడు. "వేసవిగడచిపోయి, శీతకాలమువచ్చినచో భక్తు డేమిచేయవలెను?" దీనికి దేవుడిట్లు బదులుచెప్పుచున్నాడు:— "ప్రతియింటిలోను మూడు 'కాట' లను (గోతులను) త్రవ్వియుంచవలెను. శవమును ఆగోతిలోపెట్టి — పక్షు లెగుర నారంభించువరకు, ఓషధులు మొలువ నారంభించువరకు, వాహినులు ప్రవహింపనారంభించువరకు, భూమిమీది నీరంతయు యెండిపోవనారంభించువరకు, — రెండురాత్రులైనను సరే, మూడురాత్రులైననుసరే, లేక నెలదినములైననుసరే— అట్లే యుంచవలెను. పక్షు లెగురనారంభింపగనే, ఓషధులు మొలువ నారంభింపగనే, వాహినులు ప్రవహింపనారంభింపగనే, భూమిమీది నీరంతయు యెండిపోవనారంభింపగనే, భక్తుడగువాడు శవమును సూర్యునకభిముఖముగ (యెత్తు ప్రదేశముమీద) పెట్టియుంచవలెను." ఇచ్చట వాహినులు ప్రవహించుటయు, ఓషధులు మొలచుటయు, నను క్రియలు బహుకాలము కట్టుబడియున్న సూర్యుడు మరలతిరిగి నుదయిం

చుటతో సమకాలికముగనున్నవి. ఈవిధముగ యీరెంటికిని సంబంధము స్థిరపరుపబడినది. సూర్యుడు చాలకాలమువరకు కనిపింపలేదని చెప్పుటకు శవమును నెలదినములవరకైననుసరే యింటిలో గోతిలోనేపెట్టుకొని యుండవలెనని భగవంతుడు చెప్పుటయే ప్రబల ప్రమాణముగనున్నది. సూర్యుడు ప్రతి దినమును కనుబడుచున్నచో మరునాడే దానిని సూర్యరశ్మిలో నుంచవచ్చునే; అట్లుగాక, దానిని నెలదినములవరకైనను సరే – (సూర్యరశ్మికై నిరీక్షించుచు) – యింటిలోనే పెట్టుకొని యుండవలసిన యవుసరమేమి? అనగ, యీనెల దినములును సూర్యుడు కనుపడలేదని వేరుగచెప్పవలెనా? ఈసందేహ మును దీర్చుటకోయన్నట్లు యీనెలదినములలో గాఢాంధకార ముండెనని యింకొకచోట స్పష్టపరుపబడియున్నది. దీనితో సందేహానివృత్తియగుచున్నది. "చీకటిగనున్నప్పుడు, మంచు గురియుచున్నప్పుడు, యెవరైనను చనిపోయినచో యేమి చేయవలెను?" –దీనికికూడ పైనచెప్పిన ప్రత్యుత్తరమే భగ వంతుడుచెప్పెను. "ఇంటిలో గొయ్యిత్రవ్వి, నెలదినములైనను సరే, పక్షులెగురువరకు వాహినులు ప్రవహించువరకు,...... శవమునట్లేయుంచి, పిమ్మట సూర్యరశ్మిలో వదలివేయవలెను. ఈనెలదినములలో సూర్యుడు కనుబడకపోయెననియు, వాహి నులుకట్టుబడిపోయెననియు, ఓషధులు మొలుచుటలేదనియు అతిశీతకాలమనియు, — వేయేల, యిది ధృవమండల మొదలి దీర్ఘరాత్రి యనియు, ఆరాత్రిలో సూర్యరశ్మి లేక

పోవుటచే శవమునకు జరుగవలసిన యంత్యక్రియలు నిలిచి పోయెననియు యీపార్శీవాక్యములు చెప్పకయే చెప్పు చున్నవి. దక్షిణాయనమందు మరణించుట అశుభమని హిందువు లిప్పటికిని తలంచుచున్నారు. బహుశః, ఇది ధ్రువ మండలనివాసమునాటి యాచారమై యుండనోపు. పారశీకుల వలెనే, హిందువులుకూడ ఆ ధ్రువమండల దీర్ఘరాత్రియందు శవమునకు జరుగవలసిన యంత్యక్రియలను జరుపకుండ, సూర్యుడు కనుపించువరకు, — నెలదినములైనను సరే, — శవమును ఇంటిలోనే పెట్టుకొని యుండిరని యూహించుట కవకాశములు గలవు. ఎట్లనగ, పార్శీగ్రంథములో గోతికి ప్రయోగింపబడిన “కాట” యను శబ్దము వేదములందు కూడ గలదు. “కుత్స” యను పేరుగల యొకానొక ఋషి “కాట” యందు (గోతిలో) పడియుండి, “వృత్రుని చంపు చున్న ఓ ఇంద్రా! నన్ను రక్షింపుము”ని మొరపెట్టుకొను చున్నాడు. (ఋ I, 106,6). అనగ, వృత్రసంహారము పూర్తియై, తిరిగి వాహినులు ప్రవహింప నారంభించువరకు, సూర్యు డుదయించువరకు, ఓషధులు మొలువ నారంభించు వరకు పూర్వము ధ్రువమండలవాసులగు హిందువులుకూడ తమ శవములను ఇంటిలోనే పెట్టుకొని యుండిరని యూహించుట కిచ్చట పరోక్షమైన ప్రమాణ మొకటి గాన్పించు చున్నది.

ఈ పై నిదర్శనమునుబట్టి వృత్రగాథకును, ఇంద్రుని ఘనకార్యములకును, ఇంక ననేకమైన వేదవాక్యములకును మన మిప్పుడు సరళమైన భావార్థములను చెప్పవచ్చును. ఇంద్రుడు తన బలిమిచే ప్రవాహములను ఊర్ధ్వముఖముగ ప్రవహింపజేయుచున్నాడు. (ఉదంచ IX, 15, 6) వృత్రవధ వలన నదులు బాహాటముగ ప్రవహించునట్లు చేయబడెను. (I, 32, 12) జ్యోతులు నిరభ్యంతరముగ ఆకాశమందు వెలుగునట్లును, జలములు బాహాటముగ ప్రవహించునట్లును యింద్రుడు చేసెను. (I, 80, 5) ఈవిధముగ వెలుతురును, నీరును, యేకకాలమందే ప్రవహించుచున్నట్లు దెలుపు నిదర్శనములు వేదములం దింకను పెక్కులుగలవు.

మన మింతవరకు వివరించిన దివ్యజలస్వరూప స్వభావములను వ్యాఖ్యాత లింతవరకు గుర్తింపకపోవుటచే వృత్రగాథను సమన్వయించుటవారికి బహుకష్టసాధ్యమయ్యెను. అందుముఖ్యముగ, సమకాలిక చతుర్విధపలోత్పత్తిని సమర్థించుట మరింత కంటకప్రాయమయ్యెను.

దివ్యజలసంచారమునుగూర్చి హిందూపారశీకగాథలందు మాత్రమేగాక తదితర ఆర్యజాతుల ప్రాచీనగాథలలోకూడ నిదర్శనములు గలవు. సూర్యుడు సముద్రమునుండిలేచి, ఆకాశముపైకెక్కి బంగారుపడవలో తూర్పునుండి పడమరకు ప్రయాణముజేసి, మరలసముద్రములోనికి చేరునని గ్రీకుగాథలు చెప్పుచున్నవి. భూమ్యాకాశములకుమధ్య సదా

నొకనది ప్రవహించుచుండుననియు, దానిలోని జలము ఆవిరి రూపముగనుండి, పైనుండి క్రిందికిని, క్రిందినుండి పైకిని, యెక్కి దిగుచుండుననియు "ఆరిస్టోటల్" అనుగ్రీకు పండితుడు చెప్పు చున్నాడు. ఇట్టి నదియే ప్రాచీనజర్మను గాధలందు గలదట. "ఫిన్ను" జాతివారి గాధలందుగూడ పైకి, క్రిందికి యెక్కి దిగి వచ్చుచుండు రెండు దివ్యవాహినులు పేర్కొనబడియున్నవి. "లెట్టు" లను మరియొక జాతివారి గాధలందు, బంగారుపడవ యొకటి సముద్రములో మునిగిపోవుచుండగ ఆకాశదేవత దుఃఖించెనట. అంతట కొందరు దేవతలు పడవలమీదపోయి దానిని రక్షించిరట. ఈకధ వేదములందు చెప్పబడిన చ్యవన కధను పోలియున్నదని మాక్సుముల్లరుపండితుడు చెప్పు చున్నాడు. చ్యవనుడు మొదలగు వారిని అశ్వినులురక్షించిరి. అనగ, దీర్ఘరాత్రియందు క్షీణించిపోయినసూర్యుడు మరల తేజస్వియయ్యెనని భావము. ఈభావమునే "లెట్టు"లకధ చెప్పుచున్నది. అశ్వినులు తమభక్తులను పడవలలోపోయి రక్షించిరని ఋగ్వేదము (I, 116, 3; I, 182, 6) చెప్పు చున్నది. "పూషణ" అనుదేవత ఆకాశసముద్రమును, బంగారు పడవలలో దాటునని ఋగ్వేదము (VI, 58, 3) చెప్పు చున్నది. దీర్ఘతముడు (సూర్యుడు) సిటిప్రవాహమువెంట (సారధివలె) కొట్టుకొనివచ్చెనని యిదివరకే చెప్పితిమి. దివ్య జలమునుగూర్చి ఐగుప్తీయుల గాధలుకూడ చెప్పుచున్నవి సిటిప్రవాహములును, దానివెంట నక్షత్రగణములునుకూడ

కలిసియే ఆకాశదేవత ఐగుప్తుగాథలలో వర్ణింపబడియున్నది. ఒక్కసూర్యుడేగాక, నక్షత్రములుకూడ తూర్పునుండి పడమరకు ఆకాశముమీద పడవలలో ప్రయాణముచేయుచున్నవని ఐగుప్తుగాథలు చెప్పుచున్నవి. ఆదియందు విశ్వమంతయు జలమయముగ నుండెననియు, పిమ్మట ఆకాశజలము వేరుగను, భూమిమీద జలము వేరుగను, విభజింపబడెననియు యూదుల గాథలు (బైబిలు) చెప్పుచున్నవి. ఈవిధముగ, సమస్తఆర్య సంతతులకును తెలిసిన యీదివ్యజలలక్షణములే హిందూ పారశీగ్రంథములందు మరింతవిపులముగ వర్ణింపబడియున్నవన్న-చో మన మాశ్చర్యపడవలసిన పనిలేదు. కనుక, వైదిక గాథలందు గాన్పించుచున్న జ్యోతిర్జలముల సమకాలికసంచారమీదివ్యజలసంచారముపై సమన్వయింపబడుట కెట్టి యభ్యంతరమునుండజాలదు.

ఈదివ్యజలసంచారమును గూర్చియు, జ్యోతిర్జలముల సమకాలికోత్పత్తినిగూర్చియు మనము ఒప్పుకొన్నను, యీ సందర్భమున ఉత్తరధ్రువసిద్ధాంతము రావలసినపనియేమి ? దీనిచే ధ్రువసిద్ధాంతమెట్లు ఋజువగుచున్నది ? ఈవృత్రవధ వలన చీకటికిని వెలుతురునకును నిత్యము సూర్యోదయాత్పూర్వము జరుగుచుండుపోరాటమే సూచింపబడుటలేదా ? యని కొందరు శంకింపవచ్చును. కాని, కొంచముసూక్ష్మముగ ఆలోచించిచూచినచో వృత్రగాథలోని వివరములనన్నిటిని సమన్వయించుటకు మనమీదేశములలో సూర్యోదయాత్పూర్వము

నిత్యమునుజూచుచుండు చీకటివెలుగుల పోరాటము చాలదు. ఇంద్రసహాయులగు అంగిరసులు వృత్రుని సంవత్సరాంతమందు (పరివత్సరే) చంపిరి. దీనినిబట్టి యీపోరాటము సంవత్సరమున కొకసారి జరుగునదేగాని, నిత్యమును జరుగునది కాదని ధ్రువపడుచున్నది. ఇంద్రుడు అర్బుదను (వృత్రుని) మామూలు వజ్రముతో చంపక, మంచుతో (హిమముతో) చంపెను. అనగ, యీయుద్ధము మంచుకాలమందు, అనగ, శీతకాలములో (హేమంతర్తువునో) జరిగెనని యిచ్చట సూచింపబడినది. ఈభావమే పైనయుదాహరించిన పారశీగ్రంథవాక్యములవలన కూడ స్థిరపడుచున్నది. వృత్రునికోటలు "శారదీః" అని వర్ణింపబడినవి. అనగ, యీయుద్ధము శరదృతువుయొక్క అంతమందు ప్రారంభమై, హేమంతఋతువునం దంతటను జరుగుచుండెనని భావము. తిష్ట్రియబహిమయుద్ధము ౧౦ నెలుదలు ౧౦౦ రాత్రులవరకు జరుగుచుండెనని పారశీగ్రంథములు చెప్పుచున్నవి. అట్లే రాత్రిక్రతువులసంఖ్య నూరునకుగలదని ఋగ్వేదము చెప్పుచున్నది. కనుక, వృత్రగాథలోని యిట్టివివరములనన్నిటిని సమర్థించుటకు దైనికపోరాటముచాలదు; సాంవత్సరిక పోరాటముచేతనే యివి సమర్థింపబడగలవు. అనగ, ధ్రువసిద్ధాంతముచేతనే యీసు నిజమగు భావార్థము లన్నియు తేటపడగలవు.

ఇంద్ర వృత్రాసురుల పోరాటము శారదాంతమందు ప్రారంభమై శిశిరాంతమువరకు జరిగియుండవలెనని యింత

వరకు నిరూపించితిమి. ఇక వేయేల, యుద్ధము యేతిథియందు జరిగెనోకూడ, నిస్సందిగ్ధముగ దెలుపు ప్రమాణవాక్యమొకటి మనకు ఋగ్వేదమందే దొరుకుచున్నది. II, 12, 11 యః శంబరం పర్వతేషు క్షియంతం చత్వారింశయాం శర ద్యన్వవిందత్ । ఓజాయమానం యో అహిం జఘానదానుం శయానం స జనాస ఇంద్రః॥ "ఇంద్రుడు శరదృతువులో నలుబదియవ (తిథి) యందు(చత్వారింశ్యామ్ శరదీ) పర్వతముమీదనున్న శంబరుని కనుగొనెను. "చత్వారింశ్యామ్" అను పదము వరుసను సూచించు సంఖ్యావాచకపదము; ఇది సప్తమీ విభక్తి; స్త్రీలింగమునందు గలదు. "శరదీ" యను పదము కూడ సప్తమీవిభక్తి, స్త్రీలింగమునందున్నది. కనుక యీ పదమునకు రెండువిధములుగ అర్థము చెప్పవచ్చును. (౧) "చత్వారింశ్యామ్" — అను పదమును "శరదీ" కి విశేషణముగ గైకొన్నచో — ఇంద్రుడు శంబరుని నలుబదియవ శరత్తులో (అనగ ౪౦ వ సంవత్సరములో) కనుగొనెను." వ్యాకరణరీత్యా, యీయర్థము సరిగనే యున్నది. శాయనాచార్యులవారును, పాశ్చాత్యపండితులును కూడ యీ యర్థమునే గ్రహించిరి. అయితే, దీని భావమేమి? ఇంద్రుడు శంబరునికై ౪౦ సంవత్సరములు వెతకెనా యేమి? ఇంద్రశంబరుల పోరాటము ౪౦ సంవత్సరముల కొకసారి జరుగునని తలంచుటకు వీలులేదు. కారణమేమనగ:- దీనివలన, "ఇంద్రుడు సంవత్సరాంతమందు 'వల'ను సంహరించెనని చెప్పు ఋగ్వేద

వాక్యమునకు (X, 62, 2) బాధ కలుగుచున్నది. ఆర్యులకును, ఆదిమ నివాసులగు అడవిజాతివారికిని ౪౦ సంవత్సరములు జరిగిన పోరాటముగాని, లేక పూర్వ మొకప్పుడు తటస్థించిన ౪౦ సంవత్సరముల క్షామముగాని యీ "చత్వారింశ్యామ్ శరదీ" యను వాక్యముచే సూచింపబడుచున్నదని కొందరు పండితులు చెప్పుచున్నారు. ఇట్టి విపరీతజ్ఞానములనుగూర్చి మన మంతగ పాటింప బనిలేదు. ఇట్టియభిప్రాయములను మనము సరకుచేయక త్రోసివేయవచ్చును. ఇంద్ర శంబరుల పోరాటము ఋగ్వేదమందు పలుతావులలో చెప్పబడెను. ప్రతిచోటను యది యింద్ర వృత్రులనే సూచించు చుండెను. అకస్మాత్తుగ యీయొక్కచోటనే, ఆర్యుల కును ఆదిమనివాసులకును జరిగిన ౪౦ సంవత్సరముల పోరాట మిచ్చట, ఒకవాక్యములో, అప్రస్తుతముగ, చెప్పబడెనని తలంచుటకంటె మహావిపరీత మింకొకటియుండబోదు. కనుక "చత్వారింశ్యామ్ శరదీ" కి ౪౦ సంవత్సరములని యర్థము చెప్పుట నిష్ప్రయోజనము. ఈ వాక్యముయొక్క భావార్థము దీనివలన యొంతమాత్రమును తెలియవచ్చుటలేదు. (౨) ఇక రెండవ యర్థమును విచారింతము:—మనము యీకాలమందు కూడ, యేతిథినైనను చెప్పవలసివచ్చినప్పుడు,—కార్తికే, శుక్ల పక్షే, త్రయోదశ్యామ్—అని చెప్పుదుము. అనగ, కార్తిక మాసమందు. శుక్లపక్షమందు, ౧౩ వ తిథియని సప్తమీ విభక్తిని ప్రయోగింతుము. మరియు, "త్రయోదశ్యాంతిథౌ"

యని చెప్పక, కేవలము "త్రయోదశ్యాం" అని మాత్రమే చెప్పుదుము; తిథినిగాని, దినమునుగాని, సూచించుపదమును వదలివేయుదుము. దీనికి తై॥ బ్రా॥ (I, 1, 9, 10) కూడ సాక్ష్యమిచ్చుచున్నది. ఇది సంస్కృత సాంప్రదాయలక్షణము. అయితే, మన మిప్పుడు చర్చించుచున్న వేదవాక్యములో— "చత్వారింశ్యామ్, శరదీ"–యని యున్నది. ఈరెంటిని రెండు ప్రత్యేకసప్తమీ విభక్తి పదములుగ గైకొన్నచో, పైసాంప్రదాయమునుబట్టి యీవాక్యమునకు "చత్వారింశ్యామ్" తిథియందు; శరత్తునందు, —అని అర్థము వచ్చును. అనగ, "శరదృతువులో, నలుబదియవ తిథియందు" అని యర్థము వచ్చును. ఈ రెండేతప్ప యింకొక మూడవవిధముగ యీవాక్యమున కర్థము చెప్పుటకు వీలులేదు.

ప్రాచీనకాలమందు సంవత్సరము వసంతర్తువుతో ప్రారంభమయ్యెను. శరదృతువులో ౪౦ వ తిథియనగ ఏడు నెలల, పదిదినములు లేక ౨౨౦ దినము లగును. కనుక, ఇంద్రశంబరుల పోరాటము (చీకటివెలుగుల పోరాటము) సంవత్సరములో ౮ వ నెల, ౧౦ వ తేదీన ప్రారంభమయ్యెనని తేలుచున్నది. అనగ, ధ్రువమండలమందు — యీ వాక్యముచే సూచింపబడిన ప్రదేశమందు – సంవత్సరములో యేడు నెలలవరకు సూర్యరశ్మియుండి, ౮ వ నెల ప్రారంభమై ౧౦ దినములుమాత్రమే గడచినపిమ్మట, దీర్ఘరాత్రి ప్రారంభమయ్యెనని భావము. ఈ భావము, అదితిగాథతో సంపూర్ణ

ముగ నేకీభవించుచున్నది. పూర్వయుగమందు అదితి తన ౭ గురు కొడుకులను (మాసాధిష్ఠాతలగు సూర్యులను) దేవతల కిచ్చి, ౮వ వాడగు మార్తాండుని — (అపక్వస్థితిలో పుట్టుటచే) — పారవైచెనట. అనగ, ఎనిమిదవమాసము నకు అధిదేవతయగు సూర్యుడు పుట్టిన బహు కొలదికాలము నకే మరణించెనట. అనగ, యెనిమిదవ మాసారంభమందు దీర్ఘరాత్రి ప్రారంభమయ్యెనని భావము. కనుక, యీదిన మందే (౮వ నెల, ౧౦వ తేదీయందే) ఇంద్ర వృత్రాసురుల యుద్ధము ప్రారంభమయ్యెనని చెప్పుట యెంతయు సహజముగ నున్నది. అదితిగాథయు, ఇంద్రశంబరుల యుద్ధోపక్రమణ దినమును నిర్ణయించు ఋగ్వేదవాక్యమును (II, 12, 11)— యీరెండును — అత్యద్భుతముగ, సర్వవిధముల, విధాయక ముగ, సరిపోవుచున్నవి.

పైచర్చనుబట్టిచూడగ, శరదృతువునందు సూర్యరశ్మి క్షీణించి, నశించి పోవుచున్నదనుట స్పష్టము. 'శరత్' యొక్క శబ్దోత్పత్తికూడ యీయర్థమున కనుకూలముగనే యున్నది. "శరత్" శబ్దము "శౄ"=క్షీణించు, నశించు—అను మూలమునుండి యుత్పన్నమగుచున్నది. శరదృతువనగ క్షీణించు, లేక నశించు ఋతువని అర్థము.—అనగ, సూర్యుని తేజస్సు యీఋతువునందు క్షీణించిపోవునని భావము. దీనికై తై॥ సం॥ (II, 12, 5):– త్రీణి వా ఆదిత్యస్య తేజాంసి వసంతా ప్రాత గ్రీష్మే మధ్యం దినే శరద్యపరాహ్ణే । యావాన్యేవ

తేజాంసి తా న్యే వావరుంధే॥ "సూర్యునకు మూడు తేజస్సులుగలవు. ప్రాతఃకాలమందు వసంత తేజము; మధ్యాహ్నమందు గ్రీష్మతేజము; సాయంకాలమందు శరత్ తేజము." ఇచ్చటకూడ సూర్యునిసాంవత్సరికగమనములో శరదృతువునందు సూర్య తేజము క్షీణించిపోవునని సూచింపబడెను. ఈశరదృతువు దాటినపిమ్మటసూర్యునకు తేజమే లేదు. అనగ,అంతటినుండియు సూర్యుడస్తమించును; హేమంతశిశిర ఋతువులందు సంపూర్ణముగ దీర్ఘరాత్రి నిండియుండును. జైమిని సూత్రములకు వ్యాఖ్యవ్రాయుచు శబరుడొక వేదవాక్యము నుదాహరించెను. ఆదిత్యో వా సర్వఋతవః సయదైవోదిత్యథ వసంతో యదా సంగవోఽథ గ్రీష్మో యదా మధ్యందినోఽథ వర్షాయదాఽపరాహ్ణోఽథ శరద్ యదా స్తమే త్యథ హేమంతశిశిరా॥ సూర్యుడే సర్వఋతువులునై యున్నాడు; ఉదయకాలమప్పుడు వసంతము; సంగవకాలమప్పుడు (పాలుపితుకు వేళ) గ్రీష్మము; మధ్యాహ్నమప్పుడు వర్షము; సాయంకాలమప్పుడు శరత్తు; అస్తమించినప్పుడు హేమంత, శిశిరములు రెండును, సూర్య తేజము శరత్తునందు క్షీణింపనారంభించెనని యీ వాక్యము ఖండితముగ దెలుపుచున్నది. శారదాంతమందు సూర్యుడు అంధకారరాక్షసులకు పూర్తిగ లోబడిపోయెనని యు, హేమంతశిశిరములు పూర్తిగదీర్ఘరాత్రిలో మునిగిపోయెననియు యీ వేదవాక్యము ఘంటాపథముగ జెప్పుచున్నది. ఋ I, 34,1–లో–'రాత్రి'ని దెల్పుటకు "హిమ్యా" యను

శబ్దము ప్రయోగింపబడియున్నది. అనగ, హేమంతఋతువంతయు గాఢాంధకారముగ నుండెనని భావము.

పూర్వము తేదీలను వ్రాయునప్పుడు మాసములపేర్లు చెప్పక ఋతువులపేర్లుమాత్రమే వ్రాయుచుండిరనుటకు ప్రమాణములు లేవేయని కొందరాక్షేపించెదరేమో. కాని హిందూదేశములో కొన్ని కొండగుహలలోనున్న ౧౪౦౦ సంవత్సరములనాటి పురాతన శాసనములనుబట్టిచూడగ ఫలాని కార్యము, ఫలానిఋతువులో, ఫలానిపక్షములో, ఫలాని తిథియందుజరిగెనని వ్రాయబడియున్నదేగాని, మాసము పేరెచ్చటను ఉదాహరింపబడనే లేదు. కనుక, యీశాసనములకంటె పూర్వమెన్నియో వేలసంవత్సరములక్రింద బయలువెడలిన ఋగ్వేదమందు తేదీలను వ్రాయునప్పుడు మాసములపేర్లనెత్తక కేవలము ఫలానిఋతువులో, ఫలానిదినమందు (తిథియందు) మాత్రమే ఫలానికార్యము జరిగెనని వ్రాయుట యొకవింతగాదు. దీనికిపారశీకగ్రంథమందు స్పష్టమైన ప్రత్యక్ష ప్రమాణములేగలవు. ఒకానొకతేదీనివ్రాయుచు ఆగ్రంథమందు ఋతువుపేరును, ఆఋతువునందాదినము యొక్కవరుస సంఖ్యయు మాత్రమే పేర్కొనబడియున్నవి. — మాసము పేరెచ్చటను లేదు. ఈపద్ధతిననుసరించియే ఋగ్వేదమందు కూడ "చత్వారింశ్యాంశరదీ" — "శరత్తులో ౪౦ వ (దినము)"- అని, ఋతువును, అందరి తిథిసంఖ్యయుమాత్రమే చెప్పబడినవి. వృత్రశంబరుల యుద్ధోపక్రమణ దినమిచ్చట

స్పష్టముగ లిఖింపబడియున్నదనుట కెట్టి సందేహమును లేదు. ఈయుద్ధముయొక్క నిజమైన భావార్థము పండితుల మనస్సునకు తట్టకపోవుటచే, వారీ వాక్యమునకు పెడార్థములను లాగిరి. తాముదీసిన పెడార్థములవలనకూడ వారికి సరళమైన భావార్థమొక్కింతయు కుదురలేదు; వారంతట యుక్కిరిబిక్కిరియై దానినచ్చటనే వదలివేయవలసిన వారైరి. చత్వారింశ్యామ్, శరదీ—యను శబ్దముల రెంటిని స్వతంత్రమైన రెండు సప్తమీవిభక్త్యంత శబ్దములుగ గ్రహించినచో దాని నిజభావము అత్యద్భుతముగ బయటపడితీరును. దీనికి, ధ్రువసిద్ధాంతమును కూడ జేర్చినచో, శరదృతువుయొక్క ౪౦ వ తిథియందు ఇంద్రుడు వృత్రుని కనుగొనెననగ భావమేమియో కరతలామలక మగుచునే యున్నది; వృత్రుని కోటలు "శరదీః" అని యేల చెప్పబడినవో తేటతెల్లమగుచునే యున్నది; అర్బుదయను రాక్షసుడు హిమచే (మంచుచే) యేల చంపబడెనో స్పష్టమగుచునే యున్నది; శంబరుని కోటలను (పురములను) వర్ణించుసందర్భమున 'పుర'మనగ 'దిన'మని యిదివర కర్థము చెప్పితిమి. ఈదినములు శరదృతువులోని దినము లగుటచే, యీపురములు లేక కోటలుకూడ "శరదీః" అని చెప్పబడుట సహజమేగద. కనుక మనయర్థము సూచినట్లు సరిపోవుచున్నది. ధ్రువమండలమందు సూర్యుడు శ్రావణమాసారంభమున పూర్తిగ అస్తంగతుడై, దీర్ఘరాత్రిని గలుగజేసినట్టి సృష్టిచమత్కారముపై యీవృత్ర

గాథయంతయు నాధారపడియున్నదనుట కొంతమాత్రమును సందేహము లేదు.

వృత్రవధవలన జలమును, వెలుతురును యనేకకాల మందే విడుదల యయ్యెనని ఋజువుపరచితిమి. ఇట్లు విడుదల యైన నీరు వాహినులుగ లేక నదులుగ ప్రవహించుచున్నవనియు (II, 15,3; 11,2); యీనదులు ఊర్ధ్వముఖముగ (ఉదాచ) ప్రవహించుచున్నవనియు (II,15,6); ఈనదులసంఖ్య యేడుగ నున్నదనియు (I,32,12; II, 12,12) ఋగ్వేదము చెప్పుచున్నది. ఈనదులేల యూర్ధ్వముఖముగ ప్రవహించుచున్నవో మనము పైన ఋజువుపరచియుంటిమి. కాని, వీనిసంఖ్య యేడని చెప్పుటలో అర్థమేమి ? మన మిప్పు డీయంశమును చర్చింపవలసి యున్నది. దీనివిషయమై మేఘసిద్ధాంతవాదులు చెప్పిన సమాధానమేమనగ:— మేఘములలో బంధింపబడియున్న నీటిని వర్షకాలమందు యింద్రుడు విడిపించుటచే, పంజాబు దేశములోని నదులు సంపూర్ణజలపూరితములగుచు ప్రవహించును; అందుచే, వృత్రవధచే యీపంజాబు నదులు విడిపడె నని చెప్పవచ్చునట ! దీనిని బలపరచుటకు మేఘసిద్ధాంత వాదులు పారశీగ్రంథములలో హిందూదేశమునకు ప్రయోగింపబడిన "హప్త-హిందు" (సప్తసింధు)-వను పదమును కూడ సాక్ష్యముగ జూపుచున్నారు. వీరివాదము పైకొంత చక్కగ గన్పట్టుచున్నను, ఇది సంతృప్తికరముగ లేదు. ఏల ననగ:—నీటియొక్కయు, వెలుతురుయొక్కయు సమకాలిక

సంచారము దివ్యజలసంచారముపైననే తప్ప యింకొకవిధ ముగ సమర్థించుటకు వీలులేదని పైన ఋజువుపరచియుంటిమి. అట్లయినప్పుడు, ఊర్ధ్వముఖముగ ప్రవహించుచున్న యీదివ్య వాహినులు పంజాబునదులే యని చెప్పుట కెట్లు వీలగును. వేయేల, యీసప్తదివ్యవాహినులను . భూమిమీదనున్న యే నదులతోడనుకూడ పోల్చుటకు వీలులేదు. అదిగాక, పంజాబు దేశము 'పంచనద' దేశముగాని, 'సప్తనద' దేశముగాదు. పంజాబు 'పంచనద' దేశమని వాజసనేయ సంహిత స్పష్టముగ చెప్పుచున్నది. వా. సం. XXXIV, 11:- పంచనద్యః సర స్వతీమపియంతి సస్రోతసః । సరస్వతీతు పంచధా సోదేశేఽ భవత్ సరిత్ ॥ "సప్తసింధవః" యను పదము ఋగ్వేదమందు షుమారు ౧౨ పర్యాయములు ప్రయోగింపబడియున్నది. వీనిలో ౫, ౬, చోట్ల "సప్తసింధవః" అనగ వృత్రవధచే ఆవులు, వెలుతురు, మొదలగువానితోపాటు యేకకాలమందే విడుదలనైన దివ్యజలవాహినులని ఖండితముగ చెప్పబడి యున్నది. కనుక, యీ ౫, ౬ ప్రదేశములలోను భూమిమీద నున్న నదు లుద్దేశింపబడలేదనుట స్పష్టమగుచునే యున్నది. మిగిలినచోట్లకూడ భూమిమీద పారుచున్న నదు లుద్దేశింప బడినట్లు సూచన లిసుమంతయైనను లేవు. కనుక, ఋగ్వేద మందు "సప్తసింధవః" యనుటచే సాధారణముగ దివ్యజల వాహినులే యుద్దేశింపబడినవనుట యెక్కువ సమంజసముగ నున్నది.

సప్తసింధవః, సప్తస్రవతః, సప్తప్రవతః — మొదలగు పదములకు భూమిమీద పారుచున్న నదులను భావము లేనే లేదని నేనువాదింపను. ఏలననగ:— దేవలోకమందు మోడు నదులును, భూలోకమందు మోడునదులును, అధోలోకమందు మోడునదులును పారుచున్నవని ఋగ్వేదము చెప్పుచున్నది. ఈసప్తవిధవిభాగమొక్క నదులయందేగాక, తదితర విషయములలోకూడగలదు. ఎట్లనగ:— సప్తలోకములు, సప్తపర్వతములు, సూర్యుని సప్తాశ్వములు, సప్తహోత్రులు, సప్తదిశలు, సప్తాదిత్యులు, సప్తధీతులు, సప్తమర్యాదలు మొదలగుసప్తవిధవిభాగముఋగ్వేదమునందు ప్రతిచోటను గన్పట్టుచున్నది. ఇటీవలిసంస్కృత వాఙ్మయమందుకూడ యీసప్తవిధవిభాగము గన్పట్టుచున్నది.ఒక్క వేదములందేగాక, తదితర యూర్యజాతుల వారి ప్రాచీన గాథలలోకూడ యీసప్తవిధ విభాగమిట్లే ప్రతి విషయమునను గన్పట్టుచున్నది.కనుక, యీసప్తసంఖ్యయొక్క ప్రాముఖ్యము ఆర్యజాతులందరును కలిసి ఒకటిగనున్నప్పుడే పుట్టి యుండవలెను. అంతియేగాని, ఒక్క పంజాబునదుల యాధారముననే పుట్టినదని చెప్పుట కంతమాత్రమును వీలు లేదు. ఏలననగ, పంజాబులో ౫ నదులేయున్నవి; ఒకవేళ, యింక యే రెండుచిన్ననదులనో కలిపి మొత్తము ౭ నదులున్నవని యొప్పుకొన్నను యీపంజాబునదుల సప్తవిధవిభాగమును జూచియే, యార్యజాతులవారందరును యీసప్తవిధవిభాగసూత్రమును ప్రతివిషయములోను వర్తింపజేసిరని

తలంచుటకు వీలులేదు. ఏలననగ:—ప్రపథమమున పంజాబులో నున్న ౭ నదులనాధారముగ గైకొనియే ఆర్యజాతులవారం దరును ౭ సంఖ్య కింతటి ప్రాముఖ్యమునిచ్చిరని చెప్పినచో, పంజాబుదేశమే మొట్టమొదట ఆర్యసంతతుల కందరికిని మూలస్థానముగ నుండెనని చెప్పవలసి వచ్చును. కాని, యిట్టి యూహా కాధార మెంతమాత్రమును లేదు. ఇంద్రునిచే నూర్ధ్వముగ ప్రవహింపజేయబడిన నదులు దివ్యవాహినులే గాని, భూమిమీాద పారు నదులు గావనియు, ఋగ్వేద మందలి "సప్తసింధవః" యను పదము ప్రప్రథమమున పంజాబునదుల మూలమున పుట్టలేదనియు, మన మింతవరకు ఋజువు చేసితిమి. అట్లయినచో, యీాపదముయొక్క నిజ భావ మేమి? పారశీగ్రంథములో హిందూదేశమును దెలుపుటకు ప్రయోగింపబడిన "హప్త — హిందు" పదముయొక్క నిజ భావ మేమి? ఈరెండుప్రశ్నలకును మన మిప్పుడు సమా ధానము చెప్పవలసియున్నది.

"సప్త—సింధవః"లోని నిజభావము ఇంద్రునిచే యేక కాలమందే విడిపింపబడిన జ్యోతిర్జలముల సమకాలికసంచార మందే యిమిడియున్నది. ఈ సప్తవాహినులను ప్రవహింప జేసిన ఇంద్రుడు "సప్తరశ్మిః" యనబడుచున్నాడు. (II, 12, 12). అనగ సప్తరశ్ములకును, సప్తవాహినులకును సన్నిహిత సంబంధముగలదని దీనివలన సూచితమగుచున్నది. జలము లును, సూర్యుడును—రెండును — ఒకపర్యాయమే కదలునని

పారశీగ్రంథములు చెప్పియున్నవిగద. అట్లయినప్పుడు, సప్త సూర్యులు ప్రయాణముచేయుటకు సప్తాశ్వము లక్కరలేదా? సప్తసూర్యు లాకాశమందు సంచారమొనర్చుటకు సప్తదివ్య జలవాహిను లక్కలేదా? దీర్ఘతమునైన సూర్యు డీదివ్యజల వాహినివెంటనే గదా ప్రయాణముచేసి వచ్చునది? అదితి గాథ యేమి చెప్పుచున్నది? ఏడు దిశలలోను యేడుగురు సూర్యులు (మాసాధిదేవతలగు సూర్యులు) గలరనియు, వారు యేడుమాసములలో మాసమునకొక్కవిధముగ శీతోష్ణాదులనుగలుగజేయుచుందురనియు, అదితిగాథ చెప్పుచున్నది. ఏడుభిన్నదిశలలోనున్న యీయేడుగురు సూర్యులును ఆకాశ మందెట్లు సంచరింపగలరు? అధోలోకమందు దివ్యజలపూరితమైయున్న సముద్రమునుండి యేడు దివ్యజలవాహినులు ఆకాశముపైకి యెక్కివచ్చును. ఈనదులిట్లు అధోలోకము నుండి బయలుదేరి, ఆకాశముపైకెక్కివచ్చునప్పుడు, వానిలో ఒక్కొక్కనది ఒక్కొక్కసూర్యుని తనవెంట బెట్టుకొనివచ్చును. కనుక ఒక్కొక్కసూర్యునకు ఒక్కొక్కనదిగలదు. ఇట్లీయేడు నదులవెంటయేడుగురు సూర్యులును ప్రయాణము చేయు చుందురు. సప్తసూర్యులను మోసికొనిపోవు యీసప్తదివ్య జలవాహినులును ఋగ్వేదమందు (IX, 54, 2) స్పష్టముగ పేర్కొనబడి యున్నవి. ఈనదులయొక్క నదకయు, ఉష స్సోదయమును సమకాలికమని ఋగ్వేదము పలుతావులలో చెప్పియున్నది. వానిలోకొన్నిటి నిదివరకే మనముదాహరించి

యున్నాము. ఈయంశములన్నియు పాశ్చాత్యులు చెప్పిన సిద్ధాంతముపై సమన్వయింపబడజాలవుగనుక, మనము చెప్పిన యీ పై సమాధానమే సర్వవిధముల సరిపోవుచున్నది. హిందూదేశమును పేర్కొనునప్పుడు పారశీగ్రంథములు "హాప్త–హిందు" (సప్తసింధు) అను పదము నేల ప్రయోగించెను ? నేనిదివరకు పైన చెప్పినట్లు, 'సప్తసింధు' శబ్దము చాల ప్రాచీనమైనది. ఇది, ఆర్యసంతతు లందరును కలిసి ఉత్తరధ్రువమండలమందు యేడుమాసముల సూర్యరశ్మిగల ప్రదేశమందున్నప్పుడు పుట్టినమాట. తదుపరి, ఆర్యు లనేక శాఖలుగ చీలి, వివిధప్రాంతములకు వలసబోయినప్పుడు, వారీ సప్తసింధుశబ్దమును తమ వెంటగొనిపోయి, తాము క్రొత్తగ ప్రవేశించిన క్రొత్తదేశముల కీపేరు నంటగట్టిరి. ఇది ప్రపంచమం దిప్పటికిని సర్వసాధారణగ జరుగుచున్న యాచారమే గాని, దీనిలో క్రొత్తవింత యేమియులేదు. ఉదాహరణ:— ఇంగ్లీషువారు తమ తల్లిదేశమును విడిచి క్రొత్తగ అమెరికా, ఆస్ట్రేలియా, దేశములకు వలసపోయినప్పుడు, తమ ఇంగ్లండులోనున్న ప్రాతపేర్లను తీసికొనిపోయి, అమెరికాఖండములోనున్న క్రొత్తదేశములకును, స్థలములకును అంటగట్టిరి. అట్లే, అయోధ్య, మిథిలాప్రాంతములనుండి కొందరు భారతీయులు బర్మాదేశమునకు వలసపోయి, అచ్చటనున్న కొన్నిపట్టణములకు "అయోధ్య", "మిథిలా" యను పేర్లను బెట్టిరి ! ఇట్లే, ప్రాచీనులగు పారశీకులుకూడ "హాప్త – హిందు"

అను ప్రాతపేరును ధ్రువమండలమునుండి తమ వెంటగొని వచ్చి, యిచ్చట తమ సమీపముననున్న హిందూదేశమునకో, లేక పంజాబునకో అంటగట్టి యుండవచ్చును. దీనిలో వింత యేమియు లేదు.

సింహావలోకనము.

(౧) ఇంద్రునిచే విడిపింపబడిన జలముల యొక్క స్వభావ సంచారములు బ్రాహ్మణముల కాలమునుండియు, ప్రాచీననైరుక్తుల కాలమునుండియు సూర్గ్రాహ్యములుగనే యుండిపోయెను. పండితులెల్లరు సిసిక విహగతార్థముల లాగిరి. ఆకాశమందు "పూషన్" దేవతబాగాను పడవలలో ప్రయాణముచేయును; అశ్వినులు, సూర్యునుకూడ పడవలలో ప్రయాణము చేయుదురు. అశ్వినుల బాగాను రథములు "సమానయోజనములు" (I, 30, 18)— అనగ ఆకాశము పైనను, నీటిపైననుకూడ సమానముగ ప్రయాణము చేయగలవి. ఈవాక్యములలోని నిజభావమును తెలిసికొనలేక, యీ నీరంతయు మేఘములో బంధింపబడియున్న నీరని నైరుక్తులు తలంచిరి.

(౨) ఇంద్రునిచే విడిపింపబడిన సప్తవాహినులు గంగా, యమునాదులగు భారతదేశములోని నదులని పండితులు భ్రమపడిరి.

(౩) పర్వత, గిరి, అద్రి, మొదలగు పదములను విరిచి పెడార్థములను చెప్పిరి.

(౮) అంతట పాశ్చాత్త్యులు బయలుదేరి, పారశీకగ్రంథములో భారతదేశపరముగ ప్రయోగింపబడిన "హప్త-హిందు" శబ్దమునుబట్టుకొని, యింద్రునిచే విడిపింపబడిన సప్తవాహినులు పంజాబునదులేయని చాటించిరి. ఆర్యులు పంజాబులో నుండగ వేదగాన మొనర్చుచుండుట లేదని నేను చెప్పను. కాని, వేదములందు యింద్రునిచే విడిపింపబడినట్లు చెప్పబడిన సప్తసింధువులుమాత్రము పంజాబునదులు కాజాలవు.

(౯) కనుక, వృత్రగాథను సమన్వయించుటకు దివ్యజల సంచారమే ముఖ్యమైన యాధారము. "ఈథర్" (Ether) వలెనున్నయీదివ్యజలము ప్రవాహములుగ యేర్పడి, ఊర్ధ్వాధోలోకములమధ్య సదా సంచరించుచు, తన ప్రవాహములవెంట సూర్యచంద్రాదులను, తదితర జ్యోతిర్గోళములను గొనివచ్చును. ఈదివ్యజలములకు మూలస్థానమైన అధోలోకసముద్రములో వృత్రాసురుడు పరుండియుండి, తనదేహమును విపరీతముగపెంచి, చుట్టునున్న పర్వతబిలములను మూసివేసి యీజలప్రవాహములు బయటికిపోకుండ నిరోధించెను. అంతటితో సూర్యచంద్రాదుల గతికూడ కట్టువడియెను. అందుచే, ఉత్తరధ్రువమండల వాసులగు మనయార్యులకు దీర్ఘరాత్రియేర్పడెను. ఈదీర్ఘరాత్రియందు దార్యులు క్రతు

వులను జేసి, యింద్రునకు కావలసినంత సోమరసమిచ్చి, వృత్రునిమీాదికి పంపిరి. ఇంద్రుడు వృత్రుని సంహారించి, కొండబిలములను తెరపిజేసెను. అంతట, వెంటనే, దివ్యజల ప్రవాహములు యథారీతిగ పారనారంభించెను. ఈదివ్యజల ప్రవాహములవెంటబడి ఉషస్సు, సూర్యుడు, ఆవులు (కిరణములు లేక పగళ్లు) కొట్టుకొనివచ్చెను. ఈరీతిగ, వృత్రవధ వలన చతుర్విధఫలములు సమకాలముగా ఉత్పత్తియయ్యెను. ఈచతుర్విధఫల సమకాలికోత్పత్తిని సరిళముగ సమన్వయింప లేక పండితులు గంద్రగోళపడి, తుదకు తమతప్పును వైదిక ఋషులమీాదికే త్రోసివేసిరి.


(౬) ఇంద్రుడు నూరురాత్రిక్రతువులలో సర్పింపబడిన సోమరసముచే ఉత్సాహవంతుడై సీటిలో దాగియున్న అంధకార రాక్షసుని మంచులో (హిమములో) సంహారించి, అతని నూరు "శరదీః" కోటలను పగులగొట్టి, సప్తదివ్యవాహినుల నూర్ధ్వముఖముగ పంపి, వానివెంట సూర్యుని, ఉషస్సును, ఆవులనుకూడ పంపెను. ఈయుద్ధము ప్రతిసంవత్సరము శరదృతువు, నలుబదియవ తిథియందు ప్రారంభమై, శిశిరాంతము వరకు జరుగుచుండును. ఈయుద్ధవర్ణనమంతయు ఉత్తరధ్రువ లక్షణములనే సూచించుచున్నది.

(౭) అయితే, యింద్రుడు వర్షాధిదేవత కాడా కాదా? అయిన నయియుండవచ్చును. ఇంద్రుడు వర్షమునిచ్చునసనకూడ

ఋగ్వేదములో నచ్చటచ్చట గలదు. కాని, వృత్రహంతకుడగు యింద్రుడు వేరు; వర్షాధిదేవతయగు యింద్రుడు వేరు (ఇవి రెండును రెండుహోదాలు) వృత్రవధను, దివ్యజలమోక్షణమును గూర్చిన కథ బహు పురాతనమైనది. ఇది సమస్తఆర్యజాతులలోను కలదు. వేదములోని వృత్రుడే, గ్రీకుగ్రంథములలో "ఆర్థ్రోస్" అయ్యెను. కాని, ఇంద్రశబ్దము మాత్రము తదితరభాషలలో లేదు. కనుక, వృత్రహంతకునకు ఇంద్రుడను పేరు మొట్టమొదట లేదనియు, ఈ వృత్రవధ జేసినవాడు ఇంద్రుడుగాక యెవరో మరియొక దేవతయనియు, తదుపరి కొంతకాలమునకు ఇంద్రుడు వేదములందు ప్రధానదేవతగ పరిగణింపబడుటచే ఆ దేవత యెవరోచేసిన వృత్రవధ యీ ఇంద్రున కంటగట్టబడెననియు కొందరు పండితులు తలంచుచున్నారు. పారశీగ్రంథములో కూడ యిట్టి భావమే గలదని తోచుచున్నది. రాక్షసుని వధించినవాడు "తిష్ట్రి" యనువాడేగాని, "వెరెత్రఘ్న" (మన మిప్పు డింద్రుడని తలంచువాడు) కాడు. కనుక, వృత్రవధ యొనర్చినవాడు మనము సాధారణముగ తలంచు ఇంద్రుడు కాడేమోనని యనుమానించుట కిచ్చుట కొంత యాధారము గన్పట్టుచున్నది. అట్లుగాక, మొదట వృత్రుని వధించిన ఇంద్రుడే, తదుపరి వర్షాధిదేవతయగు ఇంద్రుడయ్యెనని మరికొందరు తలంచుచున్నారు. ఏది యెట్లున్నను, ఈ యంశము మన సిద్ధాంతమునుమాత్రము

కదల్పజాలదు. తనచేతులార వృత్రవధచేసిన "వృత్రహా" యే, తదుపరి వర్ష దేవతయగు యింద్రుడుగ మారెనో, లేక, యింకే వల ప్రధానుడగు వర్ష దేవతగ పరిగణింపబడిన యింద్రునకే యీవృత్రవధయంట గట్టుటచే యింద్రుడు "వృత్రహా" అయ్యానో మనము నిర్ధారణ చేయవలసిన పనిలేదు.

వృత్రాసురునిచే బాధింపబడిన నీరు మేఘములలోని నీరుకాదనియు, యిది "ఈథర్" వలెనున్న దివ్యజలమనియు దీనిని అధోలోకమందు వృత్రుడు బంధించుటచే, దీనితో పాటు సూర్యుడుకూడ నిలిచిపోయెననియు, దానివలన ఉత్తరధ్రువ మండలమందు దీర్ఘరాత్రి యేర్పడెననియు, దాని నొకదేవత విడిపించుటచే, మరల దివ్యజలవాహినులును, దానితో పాటు సూర్యుడు, ఉషస్సు మొదలైనవి తిరుగ నారంభించెననియు చెప్పిన చాలును.



వైదికనిలయము

పదియవ అధ్యాయము.

వైదికగాథలు: ప్రాతఃకాలిక దేవతలు.

వృత్రగాథను సమన్వయించుటకు మేఘ, ఉషస్సిద్ధాంతము లెట్లు పనికిరాకపోయెనో క్రిందటి యధ్యాయములో వివరించితిమి. ఇప్పుడు సామాన్యముగ వసంత సిద్ధాంతముపై సమన్వయింపబడిన జెప్పంచబడుచున్న గాథలనుకూడ విచారించి యీ గాథలలోని ప్రధానాంశముల కేకవాక్యతను గూర్చుట కీ వసంతసిద్ధాంత మెట్లు సరిపోదో యీ యధ్యాయమందు దెలిపెదము. ఈ గాథలన్నియు ముఖ్యముగ అశ్వినీదేవత లొనర్చిన మహాత్కార్యములపైననే ఆధారపడియున్నవి. అశ్వినీదేవతలనగ యిద్దరు కవలదేవతలు. వీరు దేవతలకు మందులిచ్చి కాపాడు వైద్యులు వీరొనర్చిన మహాత్కార్యములన్నియు ఋగ్వేదమందు స్పష్టముగ జెప్పబడియున్నవి. ఈమహాత్కార్యములను పలువురుపండితులు పలుతెరగులుగ సమన్వయించియున్నారు. కాని వానియన్నిటితో మనకిప్పు డంతగపనిలేదు. పూర్వమువలెనే మనమీగాథలనుకూడ నైరుక్తమత ప్రకారమే విచారింతము. ఈనైరుక్తమతమందుకూడ పలువురు

పలుతెరగులుగ తలంచుచున్నారు. అశ్వినులనగ సూర్యోదయాత్పూర్వమందు గన్పట్టు నక్షత్రములని కొందరును, మిధున రాశిలోనుండు నక్షత్రద్వయమని మరికొందరును, తలంచుచున్నారు. శీతకాలమందు క్షీణించిపోయిన సూర్యుడుమరల వసంతమందు పరిపూర్ణ తేజోమూర్తిగ వెలుగొందుసృష్టి చమత్కారమే యీయశ్వినగాథలకన్నిటికిని మూలమని సర్వసామాన్యముగ పండితలోకము తలంచుచున్నారు. ఈగాథలనన్నిటినిప్పుడు విపులముగ పరిశీలించుట మనపనికాదు. వసంత, ఉషస్సిద్ధాంతములచే నింతవరకు సంతృప్తికరముగ సమర్థింపబడజాలని యంశములను మాత్రమెత్తుకొని,వానినిప్పుడు ధ్రువసిద్ధాంతముచే సమన్వయించుటకేమైన వీలున్నదేమో విచారించి చూతము.

అశ్వినీ దేవతలకును ఉషస్సునకును చాల దగ్గరసంబంధమున్నట్లు ఐతరేయబ్రాహ్మణము స్పష్టముగ చెప్పుచున్నది. సూర్యోదయాత్పూర్వమందు వేయిశ్లోకములుగలిగిన "అశ్వినశాస్త్ర" మనుబహుదీర్ఘశాస్త్రమొకటి హోతృలచేపఠింపబడునని ఐ. బ్రా. IV, 7, 9 చెప్పుచున్నది. ఈయంశమును మనమిదివరకే అయిదవ యధ్యాయమందు వివరించియున్నాము. సూర్యునిపుత్రిక అశ్వినుల రథమెక్కెనని ఋ I, 116, 17; 119, 5-చెప్పుచున్నది. అగ్ని, ఉషస్సు, యింద్రుడు, అశ్వినులుకలిసి అశ్వినశాస్త్రమును సంపాదించుటకై పందెము వేసికొనిరట. ఈపందెములో అశ్వినులు గెలిచిరట. అశ్వినులు

గన్పింపగనే, వారితోపాటు సూర్యోదయము, ఉషసోదయము, యజ్ఞాగ్నిప్రజ్వలనము — యీమూడును యేక కాలమందే జరిగెనని (I, 157, 1; VII, 72, 4) ఋగ్వేదము చెప్పుచున్నది. "ఎర్రని ఆవులమధ్య చీకటియింకనుఉండగనే" (అనగ, ఉషఃకాలమందే) అశ్వినీదేవతలు కనుబడుదురు (X, 61, 4) ఈయంశములనుబట్టి అశ్వినీదేవతలకును, ఉషస్సునకును సన్నిహిత సంబంధమున్నదనియు, ఉషసోదయ సూర్యోదయములకు మధ్యనున్న కాలమందు అశ్వినులు గనిపింతురనియు - ఈరెంటివిషయమై - పండతులెల్లరును నిస్సందేహముగ అంగీకరించియేయున్నారు. దీనివిషయమై అభిప్రాయభేదమేమియులేదు. ఈగాథలను సమన్వయించువిషయములో మనమేసిద్ధాంతము నవలంబించినను అశ్వినీదేవతలనగ ఉషస్సును. ప్రాతఃకాలిక తేజస్సును తమవెంట తీసికొనివచ్చు ప్రాతఃకాలిక దేవతలను సంగతిమాత్రము మనము మరచిపోకూడదు.

వృత్రహా, శతక్రతు, — అను యింద్రుని బిరుదములు వంటివే అశ్వినులకుకూడ గలవు. "వృత్రహంతమా" (VIII, 8, 22); "శతక్రతు" (I, 112, 23) అను బిరుదములు అశ్వినులకు కూడ గలవు. వృత్రాసురుని సంహరించిన యింద్రమరుత్తుల లక్షణములే అశ్వినులకుకూడ గలవు. (ఇంద్రతమా — మరుత్తమా) నముచివధా సందర్భమున అశ్వినులు యింద్రునకుచాల సహాయముచేసిరి (X, 131, 4) -

దీనినిబట్టి, యింద్రవృత్రాసురుల యుద్ధమందు అశ్వినులును కూడ చాలవరకు పాల్గొనియుండిరని స్పష్టమగుచున్నది.

ఇంతియేగాక నిరుద్ధజలమును విడిపించుటలో సైతము వీరికి భాగమున్నట్లీ క్రిందినిదర్శనములవలన తెలియగలదు. సముద్రము వీరికి తల్లియట (I, 46, 2 – సింధు-మాతరా) వీరిరథము సముద్రమునుండి బయల్వెడలి వచ్చునట (IV, 43, 5) అశ్వినులు తమ రథమునకై ఆవలిప్రక్కనున్న దూర దేశమందు (పరావతి) సూర్యుని చుట్టినత్తురట (I, 112, 13) అశ్వినులు సముద్రమును కదలించిరట (I, 112, 9) — అనగ, సముద్రజలమును ప్రవహింపజేసిరని తాత్పర్యము. అశ్వినులు 'రసా'యను దివ్యనాహిని ప్రవహింపజేసి, గుఱ్ఱములేని రథమును జయప్రదముగ సాగించిరట (I, 112, 12) శంబరాసురునితో పోరాడుచున్న అతిథిగ్వ, దివోదాసులకు అశ్వినులు తోడ్పడిరి. ఇంద్ర మిత్రుడగు 'కుత్స'ను అశ్వినులు తోడ్పడిరి. అశ్వినులు విజయాత్సనాప్రాంతముల పాలప్రవాహమును విడిపింప బయల్వెడలిరి. అశ్వినులు ఆకాశసముద్రమందు (దివో అర్ణవే) నివసింతురు (VIII, 26, 17) ఈయంశమునుబట్టి చూడగ, జ్యోతి, జలముల మోక్షణమునకై పోరాడుచున్న ఇంద్రునకు అశ్విని దేవతలు కుడిభుజముగనుండి చాల సహాయము జేసిరని స్పష్టమగుచున్నది. అశ్వినులు దేవతలకు వైద్యులు గనుక, యుద్ధరంగమందు వీరు నిలువబడి ఇంద్రునకు సహాయము జేసిరనుట సమంజసము

గనే యున్నది. యుద్ధరంగమం దిట్లు అశ్వినీదేవతలు ఇంద్రుని కు చేదోడుగనుండి యుద్ధమందు జయించి తెచ్చిన జ్యోతిర్జలాదుల నన్నిటిని అశ్వినీదేవతలు తమ వెంటబెట్టుకొని వచ్చిరనుటయు మిక్కిలి సమంజసముగ నున్నది. యుద్ధానంతరమందు జయప్రదముగ బయల్వెడలివచ్చుచున్న అగ్ని, ఉషస్సు, సూర్యుడు—మొదలగు ప్రాతఃకాలిక దేవతా శ్రేణి కందరికిని అగ్రభాగమం దీయశ్వినీదేవతలు నాయకత్వము వహించి వచ్చుచుండిరి. కనుక, అశ్వినీదేవతలను గూర్చిన యీలక్షణముల నన్నిటిని సమర్థించుటకు వసంతసిద్ధాంతము గాని, లేక ఉషస్సిద్ధాంతముగాని యెంతమాత్రమును పనికి రాదు. "అశ్వినీశాస్త్ర"మును పఠింపవలసిన యుషఃకాలము బహు దీర్ఘఉషఃకాలమేగాని, యీదక్షిణమండలముల లోని ముహూర్తమాత్ర జీవనముగల ఉషస్సుగాదు. వీని నన్నిటిని సమర్థింపజాలిన దీయొక్క ధ్రువసిద్ధాంతమే తప్ప వేరొండు లేదు. ఈ సిద్ధాంతదృష్టితో చూచినచో యీ యాశ్వినగాథలన్నియు సరళముగ సమన్వయమగును.

అశ్వినులు చేసినట్టి మహాత్కార్యములలో ప్రధానమైన వాని నిట క్లుప్తముగ వివరించెదను. ముదుసలియైన చ్యవనునకు యౌవనమునొసంగి, ఆతని భార్యకు ఆనందము గల్పించిరి; వృద్ధుడగు "కలి" కి యౌవనమొసంగిరి; యౌవనుడగు "విమదను" రథముపై భార్యనుగొని తెచ్చి యిచ్చిరి. "తుగ్ర" కుమారుడగు "భుజ్యు" డు సముద్రమధ్యమందు పడి,

కొయ్యముక్కనుపట్టుకొని త్రేలాడుచు గాఢాంధకారములో నటు నిటు కొట్టుకొనుచు అశ్వినీదేవతలను ప్రార్థించెను. అంతట అశ్వినులు ఆధారరహితమగు, అడుగులేని (అనారంభణే) సముద్రములో నూరు తెడ్ల పడవలో భుజ్యుని కూర్చుండబెట్టి యింటికితీసికొనిపోయిరి. అంతరిక్షమందు సంచరించుచున్న—నీరుసోకని నాలుగుపడవలలో — ఒకరెక్కల పడవలో — నూరుపాదములును, ఆరుగుఱ్ఱములును గలిగి యెగురుచున్న మూడు రథములలో—భుజ్యునికూర్చుండబెట్టి రక్షించిరి. "రేభ" యను ఋషి, బంధింపబడి, దుర్మార్గులచే రహస్యప్రదేశమందు కట్టివేయబడి, పదిరాత్రులు, తొమ్మిది పగళ్ళు నీటిలోముంచబడి, చచ్చిపోయినట్లెంచబడి, అతిదీనావస్థయందు పడియుండగ అశ్వినీదేవతలు వచ్చి ఆతనిని లేవదీసి, విడిపించి, కాపాడిరి. వందన, యను ఋషిని ఘోర విపత్తునుండి కాపాడి సూర్యకాంతిని జూపించిరి. అశ్వినులీవందనకొరకొక గోతినిత్రవ్వి, దానిలో "నిద్రగతియొడిలో నిద్రించుచున్న" దానివలెను, లేక "అంధకారమందు పడియున్న సూర్యుని"వలెను, పూడ్చిపెట్టబడి తళతళ మెరయుచున్న బంగారుముద్దనుత్రవ్వియెత్తిరి. "అత్రి - సప్తవధ్రి" యను ఋషి నొకరాక్షసుడు మండుచున్నగోతిలో పడవేసిపోగా, అశ్వినులతనిని పైకిదీసికాపాడి, అంధకారమునుండిపైకితెచ్చిరి. తోడేలునోటిలోపడిన పరిగపిట్టను కాపాడిరి. ఋజ్రాశ్వుడు ౧౦౧ గొఱ్ఱెలనుచంపి ఆడుతోడేలునకు వేయగ

క్రూరుడగు నాతనితండ్రి ఋజ్రాశ్వముయొక్క కంటిని పొడిచి వేసెను. కాని, ఆతతోడేలుయొక్క ప్రార్థనను విని అశ్వినులు ఋజ్రాశ్వమునకు మరల నేత్రదృష్టి నొసంగిరి. "పరావృజ"కు కుంటితనమును, గ్రుడ్డితనమును పోగొట్టిరి. "విశ్పలా" యొక్క కాలుయుద్ధరంగమందు పక్షిరెక్క తెగినట్లు తెగి పోగా అశ్వినులతనికి యినుపకాలునిచ్చిరి. "ఘోషా" యను నామె తనతండ్రియింట వృద్ధురాలై పోవుచుండగ, అశ్వినులామె కొకభర్తనొసంగిరి. నపుంసకుడగు నొకానొకనిభార్య "వధ్రిమతీ" యనునామెకు అశ్వినులు "హిరణ్యహస్తుడ"ను నొక కుమారునొసంగిరి. "శయూ" యొక్కఆవునకు కాన్పుడిగి పోగా, తిరిగి పాలుపడునట్లు చేసిరి. ఇట్టివే యశ్వినులొనర్చిన మహాత్కార్యములింక నెన్నియోగలవు. కాని, మనకిప్పుడివి చాలును.

దీనులకు తోడ్పడుటయే అశ్వినుల ప్రధానలక్షణముగ గన్పట్టుచున్నది. ఈ గాథలలో సూర్యుని క్షీణదశకూడ అచ్చటచ్చట సూచింపబడినది. దీని నాధారముగ జేసికొని మాక్సుముల్లరు మొదలగు పండితు లనేకు లీగాథలనన్నిటిని సూర్యుడు హేమంతర్తువందు క్షీణించి వసంతర్తువందు తిరిగి తేజోవంతు డగు సృష్టిచమత్కారముపై సమర్థింపజూచిరి. చ్యవను డనగ గాఢాంధకారపూరితమై యగ్నిచే ప్రజ్వలించుచున్న అగాధములోనికి క్రుంకుచున్న సూర్యుడని మాక్సుముల్లరుగారు చెప్పిరి. "వందన" కొరకు అశ్వినులు త్రవ్వియెత్తిన బంగారు నిధియనగ సూర్యుడేనని ఆ గాథయే చెప్పక చెప్పుచున్నదట.

కలి, విశ్పలా గాథలు చంద్రుని కృష్ణపక్షక్షైణ్యమును దెల్పు చున్నవట. ఋజ్రాశ్వము యొక్క అంధత రాత్రిపూట నున్న చీకటిగాని, లేక హేమంతర్తువందలి సూర్యుని క్షీణతేజమును గాని దెల్పుచున్నదట. 'పరావృజ' గాథవలన అస్తంగత సూర్యుడుగాని, లేక హిమసంక్రమణమువద్దనున్న సూర్యుడుగాని సూచింపబడుచున్నాడట. భుజ్యు కేభ గాథలు కూడ అస్తంగత సూర్యునే సూచించుచున్నవట. వధ్రిమతీ గాథ కేవలము ఉషస్సునే సూచించుచున్నదట. రాత్రిపూట ఉషస్సు (వధ్రిమతీ) తన భర్తయగు సూర్యునెడబాసి యుండుటచే, ఆమె నపుంసకుని భార్యగ వర్ణింపబడెనట. శయువుయొక్క ఆవనగ ప్రాతఃకాలమందలి తేజస్సని భావమట. ఈరీతిగ ప్రతిగాథయు పాశ్చాత్యపండితులచే సమన్వయింపబడినది. ఒకానొకప్పుడు సూర్యుడుగాని, చంద్రుడుగాని క్షీణించిపోవుటయు, మరల యథాప్రకారముగ వారు తిరిగి ప్రజ్వలించుటయు సృష్టియందు సాధారణముగ జరుగు వ్యాపారమే. ఈరీతిగ క్షీణతేజులైన సూర్యచంద్రులు మరల పరిపూర్ణ తేజస్కులైనప్పుడు, దేవతావైద్యులగు అశ్వినులే వీరికి మందులిచ్చి వీరిని మరల తేజోవంతులనుగ జేసిరని యీగాథలకు భావార్థము చెప్పబడినది.

పాశ్చాత్యపండితు లవలంబించిన యీ వసంతసిద్ధాంతము యాస్కాచార్యులవారు చెప్పిన ఉషస్సిద్ధాంతమునకంటె చాల సరళముగ నున్నదనుటలో సందేహ మేమియు లేదు.

అయినను, దీనిలో ముఖ్యముగ మూడులోపములు గన్పట్టు చున్నవి. అవేవనగ:-

మొదటిలోపము:-అశ్వినులు తాము రక్షించినభక్తుల నాదరిని గాఢాంధకారమునుండియే లేవనెత్తిరి; యీభక్తులలో చాలమందికి గ్రుడ్డితనమును పోగొట్టిరి. ఈగ్రుడ్డితనము వలనకూడ గాఢాంధకారమే సూచింపబడుచున్నది. కాని, వసంతసిద్ధాంతమువలన యీగాధలలోనికెల్ల మిక్కిలి ప్రధానాంశమగు నీయంధకారమును మాత్రము సమర్థించుటకు వీలులేదు. వందనగాధలో త్రవ్వబడిన బంగారుముద్ద "గాఢాంధకారములో పడియున్న సూర్యుని"తో పోల్పబడెను. భుజ్యుడు అంతులేని గాఢాంధకారమందు (అనారంభణే తమసి) పడియుండెను; అత్రికూడ గాఢాంధకారమునుండియే లేవనెత్తబడెను. ఇంకననేకచోట్ల గాఢాంధకారమును, గ్రుడ్డితనమును పేర్కొనబడినవి. వీనినన్నిటిని సమర్థించుటెట్లు? హేమంతర్తువందు సూర్యతేజస్సు క్షీణించుననుమాట వాస్తవమే. అందుచే సూర్యుడు ముసలివాడయ్యెననిగాని, కుంటివాడయ్యెననిగాని, లేక దుఃఖదశ యందుండెననిగాని, చెప్పవచ్చును. కాని, గ్రుడ్డివాడయ్యెననిగాని, గాఢాంధకారమందు మునిగిపోయెననిగాని చెప్పుటకు వీలులేదు. కనుక యీగాధలలో నిజమైన అంధకారమే (రాత్రిచీకటియే) సూచింపబడెననుటలో సందేహ మొంతమాత్రమును లేదు. అదిగాక, సూర్యుడీ యంధకారములో చాలదినములవరకు

కూడ పడియుండెనని యీగాధలవలన తెలియుచున్నది. కనుక యీగాధలను సమన్వయించుటకు నిత్యము జరుగు సూర్యాస్తమయముగాని, హేమంతఋతువందు జరుగు సూర్యతేజ క్షైణ్యముగాని, పనికిరావు. వీనిని సమన్వయించుటకు ధ్రువమండల దీర్ఘరాత్రి యొక్కటియే పనికివచ్చును.

రెండవలోప మేమనగ :— అశ్విన భక్తులనుభవించిన విపద్దశలయొక్క కాలపరిమితులను సమర్థించుటకు కూడ యీ వసంతసిద్ధాంతము చాలదు. రేభయను ఋషి పది రాత్రిళ్ళును, తొమ్మిది పగళ్ళును నీటిలో మునిగియుండెను. భుజ్యుడు గాఢాంధకార సముద్రములో మూడు రాత్రిళ్ళు మూడు పగళ్ళు పడియుండెను. అశ్వినులు ఆవలి ప్రక్క-నున్న దూరదేశమందు (పరావత్) మూడు రాత్రింబవళ్ళుండిరి. ఈ యవధులను సమర్థించుటెట్లు? సూర్యుడు హేమసంక్రమణము వద్ద నటు నిటు కదలక 9, 10 దినములవరకు నుండవచ్చునని మాక్సిముల్లరు పండితు డూహించుచున్నాడు. కాని, సూర్యుడట్లు కదలక మెదలక హేమసంక్రమణమువద్ద 9, 10 దినములవరకు నిలిచియుండునాయను సంశము సంశయాస్పదమని మాక్సిముల్లరుపండితుడే మరల సంకోచించుచున్నాడు. అర్వాచీనభౌతికశాస్త్రజ్ఞులకే యీవిషయము దుర్గ్రాహ్యముగనున్నది. ఈపదిదినములపరిమితి చాల యెక్కు-వగ గన్పట్టుచున్నది. కనుక యిదిపనికిరాదు. పోనీ, దీనినొక వేళయొప్పుకొన్నను అశ్వినులచే రక్షింపబడిన దీర్ఘతముడు

౨ మాసములు సముద్రములోనుండెను. అట్లైనచో, సూర్యుడు కూడ హిమసంక్రమణమువద్ద ౨ నెలలవరకు కదలక నిలిచి యుండెనని చెప్పవలసివచ్చును ! ఇది కేవల మసంభవముగద. కనుక, యీలోపమును పూర్తిచేయుటకు మనకు ఉత్తరధ్రువ మండల దీర్ఘరాత్రియే పనికివచ్చును. దీనినాధారముగ గైకొన్నచో, సూర్యుడు ౧ మొదలు ౧౦౦ రాత్రులవరకు–వేయేల ౬ మాసముల వరకుకూడ–క్షితిజముక్రింద గ్రుంకి యుండెనని సమర్థించుటకు వీలు చిక్కును.

మూడవలోప మేమనగ:— అశ్వినభక్తులు పడియున్న స్థలమును నిర్దేశించుటకు కూడ యీ వసంతసిద్ధాంతము చాలదు. భుజ్యుడు అడుగు (ఆధారము) లేనట్టియు (అనారంభణే), గాఢాంధకారపూరితమైనట్టియు, (తమసీ), నీటియందు (అప్సు) పడియుండెను. ఈవర్ణన ఇంద్రవృత్రాసురుల యుద్ధరంగమునకు సర్వవిధముల సరిపోవుచున్నది. కనుక, దీనిని హేమంతర్తువందు సూర్యుని క్షీణతేజస్సుతో పోల్చుట కొంతమాత్రమును వీలులేదు. ఆధారరహితమును, గాఢాంధకారపూరితమును, జలమయమునగు సముద్రమును సమన్వయించుటకు ఉత్తరధ్రువసిద్ధాంతమునే తీసికొనిరావలెను. "ప్రక్కను రంధ్రమున్నట్టి (జింహా–బారం) యేడు ఆధారముల సముద్రమును ఇంద్రుడు తెరచెనని ఋ VIII, 40, 5–చెప్పుచున్నది. దీనిచే, నిరుద్ధజలమును విడిపించుటకై ఇంద్రుడు అధోలోకమందొనర్చిన యుద్ధము స్పష్టముగ

సూచింపబడుచున్నది. ఈవాక్యములలోనున్న "జింహ-బారం" అనుపదమే అశ్వినులొనర్చిన ఘనకార్యములను వర్ణింపుచు I, 116, 9; I, 85, 11 – లలోనైతము ప్రయోగింపబడి యున్నది. "అడుగుపైకిని, మూతిక్రిందికిని యున్న (లేక ప్రక్కను రంధ్రమున్న) బావిని అశ్వినులు పైకెత్తిరి"ట. "ప్రక్కకువంగి యున్న (జింహ)బావిని అశ్వినులుపైకెత్తిపోసి గోతముని దాహమును మాన్చిరి"ట. ఈవర్ణనలన్నియు పాతాళలోకమునకు (అధోలోకమునకు) సరిపోవుచున్నది. పాతాళలోకమందు ప్రతివస్తువు తలక్రిందుగ నుండుననుభావము సర్వసాధారణమైనదేగద. గ్రీకులు, ఐగుప్తీయులు మొదలగు తదితర ఆర్య సంతతులుకూడ నిట్లేతలంచియున్నారు. ఈభావము బహు ప్రాచీనకాలమునుండి వచ్చుచున్నది. పాతాళలోకము లోట్ట బోర్లించినట్లు తలక్రిందుగనుండి, గాఢాంధకారమయమును, జలమయమునుగ నుండునని ప్రాచీనులుతలంచిరి. పాతాళమున కాధారముగాని, అడుగుగాని లేదు. అందుచేతనే దీనిలోనుండు నీరు పైకి ప్రవహించుటకై అశ్వినులీ బోర్లించియున్న తొట్టియొక్క ప్రక్కలో నొక రంధ్రమును చేయవలసివచ్చెను; లేక, దానిని పైకి నెట్టవలసివచ్చెను. ఈ తొట్టి నిట్లు పైకినెట్టగనే, దానిలోని నీరు ఊర్ధ్వముఖముగ ప్రవహించి, ఆకాశముపైకెక్కి వర్షరూపముగ పడి గోతముని దాహమును దీర్చెను. ఇట్టి వర్ణనమే I, 85, 10, 11 — లో మరుత్తులొనర్చిన మహాత్కార్యమునుగూర్చి

చేయబడియున్నది. "ఉచ్చా-బుధ్నా" (అడుగుపైకియున్న); "జింహా - బార" (మూతి క్రిందికి లేక ప్రక్కకు నున్న); — అను విశేషణములు ఒకానొక బావిని (అవత) వర్ణింపుచు ప్రయోగింపబడియున్నవి. పండితు లీవర్ణనను మేఘమున కంటగట్టిరి. కాని యిది సరికాదు. ఏలననగ; ఈ బావిలోని నీటిని ఊర్ధ్వముఖముగ యీవలికి ప్రవహింపజేయుటకై అశ్వను లీబావిని పైకి నెట్టవలసినవారైరి. (ఊర్ధ్వంనునుద్రే) ఇట్లే I, 24, 7_లో వరుణదేవుడు "అడుగులేని (అబుధ్న) ప్రదేశమందు వృక్షమూలమును నిలువబెట్టియుంచుచున్నాడు. ఈవృక్షమునుండివచ్చు కిరణములు (శాఖలు) తలక్రిందుగ నుండి, క్రిందివైపునకు ప్రవహింపుచు, మనకు గోచరింపవు." ఈవర్ణనము తలక్రిందుగనున్న పాతాళలోకమునకు సరిపోవుచున్నది. ఈతలక్రిందుగనున్న పాతాళమునకు అడుగులేదు; ఆధారము లేదు. అడుగులేనట్టియు, ఆధారములేనట్టియు, తలక్రిందుగనున్నట్టియు, గాఢాంధకారపూరితమైనట్టియు, జలమయమైనట్టియు, యీ యధోలోకసముద్రమందే భుజ్యుడు పడి కొట్టుకొనుచుండెను. (I, 182, 6). ఈ సముద్రము నుండియే అశ్వినులు తెచ్చిన పడవలలో కూర్చుని భుజ్యుడు ప్రాణమును రక్షించుకొనెను. "తిర్యగ్బిలమును, ఊర్ధ్వబుధ్నమును నగు పాత్రమందు సమస్తయశస్సు (కాంతి) నిండియున్నది. అందు యేడుగురు ఋషు లీమహాయశస్సును రక్షించుచు కూర్చునియున్నారు" అధర్వవేదము. X_8_9;

తిర్యగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్నస్తస్మిన్యశో నిహితం విశ్వరూపమ్ । తదాసత ఋషయః సప్తసాకం యే అస్య గోపా మహతో బభూవుః. ఈవాక్యమే బృహదారణ్యకోపనిషత్తు II, 3, 3-లో కూడ కొద్దిమార్పులతో కలదు. యాస్కాచార్యులవారు (నిరుక్తం XII, 38) యీరెంటికి రెండర్థములను జెప్పిరి. మొదటి వాక్యమునకు:— సప్తఋషులనగ సూర్యుని సప్తరశ్మలనియు; పాత్రమనగ పైఆకాశమనియు చెప్పిరి. రెండవ వాక్యమునకు:— పాత్రమనగ మనుష్యుని నోటిలోనున్న అంగిలియని యర్థము జెప్పిరి. కాని, నాకు జూడగ, యీరెండువాక్యములలో పేర్కొనబడిన "పాత్ర" మనగ తలక్రిందుగ బోర్లించినట్లున్న అంధలోకమనుట యెక్కువ సమంజసముగ నున్నది. ఇట్టి వర్ణనము పారశీ గ్రంథములందు కూడ గలదు. తలక్రిందుగ బోర్లించియున్న పాత్రయందుంపబడిన తేజస్సువంటి తేజస్సే పారశీగ్రంథమందుకూడగలదు. ఈతేజస్సు దేవతలవద్దనుండి పోయెననియు, దానిని సంపాదించుటకై "వోరుకశా" సముద్రమందు యుద్ధముజరిగెననియు వర్ణనగలదు. ఈవర్ణన వృత్రవధతో సరిపోవుచున్నది. కనుక, తలక్రిందుగ బోర్లించియున్న పాత్రము కేవలము తలక్రిందుగనున్న పాతాళమే గాని వేరొండుకాదు. ఇది గాఢాంధకారపూరిత సముద్రము. ఈ సముద్రమందే భుజ్యుడుపడిపోగా అశ్వినులు రక్షింపవలసివచ్చెను.

భుజ్యు డీసముద్రమందు మూడురాత్రింబవళ్ళు పడి యుండెను. అనగ యీకథ మూడుదినముల దీర్ఘరాత్రిని సూచింపుచున్నది. రేభయను ఋషికూడ నీసముద్రమందే 9 పగళ్లును, 10 రాత్రులును పడియుండెను. ఈకథవలన పది దినముల దీర్ఘరాత్రి సూచింపబడుచున్నది. గ్రీకుపురాణములలో "హేలియో" కు 350 గొఱ్ఱెలును, 350 యెడ్లును గలవని చెప్పబడియున్నది. గొఱ్ఱెలనగ రాత్రులు; ఎడ్లనగ పగళ్ళు అనగ దీనివలన పదిదినముల దీర్ఘరాత్రి సూచింపబడుచున్నది. యీగ్రీకుగాథయు, రేభఋషికథయు సమానార్థకములేయని యెరుంగవలెను. ఋజ్రాశ్వము ౧౦౧ గొఱ్ఱెలను చంపివేసెనని చెప్పుగాథవలన నూరుదినముల దీర్ఘరాత్రి సూచింపబడుచున్నది. దీనికి "హేలియోయెడ్లను దొంగిలించిన" గ్రీకుకథచే మరింతబలము చేకూరుచున్నది. ఈరీతిగ, అశ్వినగాథలవలన, 3, 10, 100 దినముల యవధులుగల దీర్ఘరాత్రులు, సూచింపబడుచున్నవి. ఈగాథలలోనున్న వివరములన్నియు ధృవసిద్ధాంతముచే చక్కగ సమన్వయమగుచున్నవి. ఈవివరములింతవరకు వసంతసిద్ధాంతముచేగాని, ఉషస్సిద్ధాంతముచేగాని సమన్వయింపబడజాలకుండెను.

మన మిప్పుడు "అత్రిసప్తవధ్రి" గాథను విచారింతము. ఋగ్వేదము ౫ వ మండలము, ౭౮ వ సూక్తమునందు ౯ ఋక్కులుగలవు. ఈతొమ్మిదిఋక్కులలో యీగాథ వర్ణింపబడియున్నది. "అత్రిసప్తవధ్రి" యను నతడు ఘోరా

పదలో పడియుండి, తన్నురక్షింపవలసినదని అశ్వినీదేవతలను మొరపెట్టుకొనుచున్నాడు. మొదటి మూడుబుక్కులలో:— "ఓ అశ్వినులారా! మీరు రెండు హంసలవలె యజ్ఞమునకు రావలసినది." అని ఆహ్వానముగలదు. ౪ వ. బుక్కులో— "అత్రిసప్తవధ్రి" గోతిలో పడిపోయి, తన్నురక్షింపవలసినదని ఆడదానివలె యేడ్చుచు, అశ్వినులను ప్రార్థించుచున్నాడు. ౫, ౬, బుక్కులలో:—"అత్రిసప్తవధ్రి" కొయ్యపెట్టెలో బంధింపబడియుండి,— "శిశువునుగనుచున్న స్త్రీయొక్క గర్భము భేదిల్లినట్లుగ యీపెట్టె పగిలిపోవునుగాక—" యని అశ్వినులను ప్రార్థించుచున్నాడు. తరువాత ౭, ౮, ౯ బుక్కులలో:— పదినెలలుమోసిన స్త్రీ శిశువును ప్రసవించు విధానము వర్ణింపబడినది. ఈమూడు బుక్కులకు "గర్భస్రావిణీ - ఉపనిషత్" అని సాయనాచార్యులవారు పేరుపెట్టియున్నారు. వాని నిట వివరించెదము.

౭ వ బుక్కు :— యథా వాతః పుష్కరిణీం సమింగయతి సర్వతః । ఏవా తే గర్భ ఏజతు నిరైతు దశమాస్యః॥

౮ వ బుక్కు:— యథా వాతో యథా వనం యథా సముద్ర ఏజతి। ఏవాత్వం దశమాస్య సహావేహి జరాయుణా॥

౯ వ బుక్కు:— దశమాసాఞ్ఛశయానః కుమారో అధిమాతరి। నిరైతు జీవో అక్షతో జీవో జీవంత్యా అధి॥

అర్థము:— ౭ వ బుక్కు:— గాలి కమలాకరమును అన్నివైపుల కదల్చునట్లు, నీగర్భము కదలుగాక! నీగర్భము పదినెలలు పెరిగినపిమ్మట (దసమాస్యః) బయటికివచ్చునుగాక.

౮ వ ఋక్కు:- గాలి కదలినట్లు, వనముకదలునట్లు, సముద్రము కదలునట్లు, ఓ పదినెలల పిండమా! పై మావితోకూడ బయటికిరమ్ము.

౯ వ ఋక్కు:- తల్లిగర్భమందు పదినెలలున్న కుమారుడు సజీవుడై యేహానియులేక, తల్లి కానందమును గలుగజేయుచు బయటికివచ్చునుగాక !

ఈప్రసవవిధాన మిచ్చట యింతవిపులముగనేల వర్ణింపబడినది? ఇది అప్రస్తుతముగ వర్ణింపబడినదా? దీనికిని మొదటి ఆరుఋక్కులలో చెప్పబడిన "అత్రిసప్తవధ్రి" గాధకును సహజమగు సంబంధముండితీరవలెను. ఆసంబంధమేమి? వసంత, ఉషస్సిద్ధాంతములచే యీసంబంధమేమియో నిర్ధారణ కాజాలదు. ఈచివరి మూడుఋక్కులలో పదకాఠిన్యమేమియు లేదు, గర్భమందు పదినెలలున్న శిశువుయొక్క సుఖప్రసవమునకై ప్రార్థనగావింపబడినది. ఈశిశువెవరు? ఈశిశువెవరో పండితుల కింతవరకును అగమ్యగోచరముగనేయుండిపోయినది.

కాని, ధ్రువసిద్ధాంతముచే సర్వమును తేటతెల్లమగుచున్నది. సూర్యుడుభూమ్యాకాశముల(ద్యావా-పృథివీ)యొక్క పుత్రుడని ఋగ్వేదము పలుతావులలో ఘోషించుచున్నది. సూర్యుడు "దివస్పుత్రు" డనియుకలదు. ఋ I, 164, 33-లో "ద్యౌ (లేక దివము) మనలను గన్నతండ్రి; మనకాతడు మూలము; ఈభూమిమనతల్లి; తండ్రిపిండమును విశాలమగు నీరెండుపాత్రలందు (ఉత్తానయోః చంవోః) ఉంచెను."

మరియు I, 164, 32 లో- "సూర్యుడు తన తల్లిగర్భములో నుండియే నిరృతిలోనికిపోయెను;" మరియు, "తననుపుట్టించిన వాడు తన్నెరుగడు; తన్నిదివరకు చూచుచున్నవారికి అతడిప్పుడు గోచరముగుటలేదు;" మరియు, I, 160, 1 లో, "భూమ్యాకాశములు రెండును మహోత్కృష్టములగు రెండు జననపాత్రలు (లేక జననస్థానములు); ఇవి చాలపవిత్రమైనవి; ఈరెంటిమధ్య సూర్యుడు కొన్నినియమముల ననుసరించి తిరుగుచుండును "—ఈపైవాక్యములవలన ముఖ్యముగ మూడు సారాంశములు తేలుచున్నవి. (౧) సూర్యుడు భూమ్యాకాశము లనబడు రెండుపాత్రలలోనుండి పుట్టిన శిశువుగ వర్ణింపబడియున్నాడు. (౨) సూర్యుడీభూమ్యాకాశములమధ్య గర్భస్థపిండమువలె తిరుగుచున్నాడు; (3) కొంతకాలమిట్లు సూర్యుడు మాతృగర్భములో సంచరించి, పిమ్మట నిరృతిలోకములోనికి పోయెను. అందుచే, తన్నిదివరకు చూచుచున్నవారికి నాతడిప్పుడు గోచరముగుట లేదు. ఈరీతిగ సూర్యుని వార్షికగమనమును నిర్ణయించినచో, సూర్యుడు మాతృగర్భమునుండియే, నిరృతిలోకమునకు పోయెనని చెప్పుట బహుసులభమగును. అయితే, యీ సందర్భములో సూర్యుడు "మాతృగర్భమందు పదిమాసములు తిరిగి" నను వాక్యమునకు అర్థమేమి? పదిమాసములైన పిమ్మట దీర్ఘతముడు సముద్రములోనికి కొట్టుకొనిపోయెననగ నేమియర్థమో, లేక దశగ్వులు తమ వార్షికసత్రమును ౧౦

నెలలో ముగించిరనగ నేమియర్థమో—యీవాక్యమునకును అదియే యర్థము. అనగ, ధ్రువమండలమందు సూర్యుడు ౧౦ మాసములే క్షితిజముపై సంచరించుచున్నప్పుడు భూమ్యాకాశ ములనబడు మాతృగర్భగోళమందు సూర్యుడు ౧౦మాసములు సంచరించెనని చెప్పుట సహజముగనే యున్నదిగద. తక్కిన రెండుమాసములలో సూర్యుడు క్షితిజముక్రిందికి క్రుంకిపోయి దీర్ఘరాత్రిని గల్గించినప్పుడు, సూర్యుడు దశమాసానంతరము తన తల్లిగర్భమునుండి నిర్రుతిలోకమునకు నిష్క్రమింపగ అచ్చట కొయ్యపెట్టెలో బంధింపబడి పోయెననుటయు మిగుల సమంజసముగనే యున్నదిగద. కనుక, సూర్యుడు (అత్రిసప్త వధ్రి) తన నీ పెట్టెనుండి విడిపించవలసినదనియు, దశమాసా నంతరము తన మాతృగర్భమునుండి సురక్షితముగ బయట పడునట్లు చేయవలసినదనియు అశ్వినులను ప్రార్థించుట మరింత సరళముగ నున్నది.

ఈగాథలో మన మింకను విచారింపవలసిన యంశ ములు ముఖ్యముగ రెండు గలవు. వానిలో మొదటిది:— కొయ్యపెట్టెలో బంధింపబడిన సూర్యునకు "సప్తవధ్రి"యను పేరేట్లు వచ్చును? వధ్రియనగ నపుంసకుడు; 'సప్తనపుంసకు' డను పేరేట్లు వచ్చెను? అధ. వే. XI, 5, 12—లో సూర్యుడు "కేకలిడుచు, ఉరుముచు, శ్వేతారుణకాంతులతో వెలుగుచు భూమినొంట మహామేఢ్రమును (బృహచ్ఛేపస్) నాటిపోవుచున్నాడు" అను వర్ణన గలదు. భూమ్యాకాశముల

మధ్య సంచరించుచున్నప్పుడు సూర్యునకు మహామేఘ్రమున్న దని చెప్పినచో, నిర్ఋతిలోకమునకు గ్రుంకిపోయినప్పు డాతడు నపుంసకు డయ్యెనని చెప్పుటయు సహజముగనే యున్నది. అయితే, సూర్యుడు నిర్ఋతిలోకమునకు పోయి నప్పుడు నపుంసకుడు (వధ్రి) అయ్యెనని యొప్పుకొన్నను, ఆతడు సప్త-నపుంసకు డెట్లయ్యెను? భూమ్యాకాశములేగాక, అధోలోకముకూడ యేడు భాగములుగ విభజింపబడినట్లు మన మిదివరకే చెప్పియుంటిమి. దీనికి సక ప్రమాణవాక్యముల నిదివరకే జూపియుంటిమి. కాన, వానినిట మరల వివరింపపని లేదు. కనుక, బృహచ్ఛ్వేపుడైన సూర్యుడు భూమ్యాకాశ ముల మధ్యసంచరించుచున్నప్పుడు సప్తరశ్ముడు లేక సప్తాశ్వు డెట్లయ్యెనో, అట్లే నిర్ఋతిలోకమందు నపుంసకుడై పడియున్న ప్పుడు సూర్యుడు సప్తనపుంసకుడయ్యెననియు చెప్పవచ్చును. ఈరీతిగ ౫ వ మండలము, ౭౮ వ సూక్తములోని మొదటి ౬ ఋక్కులకును, తుది 3 ఋక్కులకును చక్కని సంబంధ మేర్పడుచున్నది. సూర్యుడు పదిమాసములు తల్లిగర్భమందు సంచరించి, మిగిలిన రెండు మాసములను నిర్ఋతిలోకమందు సప్తనపుంసకుడై కొయ్యపెట్టెలో బంధింపబడిపోయెనని చెప్పు "అత్రిసప్తవధ్రి" గాధ కీరీతిగ, పదినెలల సూర్యరశ్మితోడను, రెండునెలల దీర్ఘరాత్రితోడను గూడిన ఉత్తరధ్రువమండల లక్షణమువలన సరళమగు భావార్థ మేర్పడుచున్నది.

ఈకథాసందర్భమందింకొక చిన్నకట్టుకథ బయల్వెడలుచున్నది. సూర్యుడుపదినెలలు తల్లిగర్భములో సంచరించి, పిమ్మట నిర్రుతిలోకమునకు నిష్క్రమించి, కొయ్యపెట్టెలో బాధింపబడుటచే, యెవరికిని కనుబడలేదు. సాధారణముగ, దశమాసానంతరము శిశువుపుట్టగనే, అందరికిని గాన్పించును. కాని, యీసూర్యశిశువుమాత్రమెవరికిని గన్పడలేదు. ఇది మహాశ్చర్యముగ దోచుచున్నది. ఈవిరోధాభాసమునుగూర్చి వైదికఋషు లనేకచోట్ల చమత్కారముగ వర్ణించియున్నారు. ఋ I, 164, 32 లో– "సూర్యుడు తననుపుట్టించినవానికి గన్పడలేదు" అని చెప్పిరి. V, 2, 1లో—కుమారం మాతా యువతిః సముబ్ధం గుహా బిభర్తి నదదాతి పిత్రే। అనీకమస్య స మినజ్జనాసః పురః పశ్యంతి నిహితమరతౌ॥౧॥ కమేతః త్వం యువతే కుమారం పేషీ బిభర్షి మహిషీజజాన। పూర్వీర్హి గర్భః శరదో వవర్ధాపశ్యం జాతం యదసూత మాతా॥౨॥ యువతియగు "తల్లి శిశువును రహస్యముగనుంచినది; ఆమె శిశువును తండ్రికి ఒప్పగించలేదు. 'అరాతి'లోనుండి క్షీణించి పోవుచున్న అతనిముఖమును ప్రజలుతమయెదుట చూడలేదు. ......" I, 72, 2-లో– "దేవతలు తమచుట్టు సంచరించుచునే యున్న ఆవుదూడను కనుగొనలేకపోయిరి......" అగ్నిచాలకాలము (జ్యోక్) దీర్ఘతమస్సులో (దీర్ఘంతమః) నివసించి, నీటిలోనుండి పుట్టినబిడ్డవలె (అపాంనపాత్) బయటికి వచ్చుచున్నాడని ఋ:X, 124, 1-లో—చెప్పబడియున్నది. ఇచ్చట

అగ్నియన్నను, సూర్యుడన్నను సమానార్థకమే. ఉత్తరధ్రువ సిద్ధాంతమును, దివ్యజలసంచారమును—యీరెంటిని– ఆధారముగ గైకొన్నచో యీకట్టుకథల నన్నిటిని చక్కగ విశదీసి చెప్పవచ్చును. దశమాసానంతరము తానుగన్న శిశువును తల్లి దాచియుంచినదనగ, ఉత్తరధ్రువమండలమందు పదినెలలవరకు సూర్యుడు క్షితిజముపై వెలుగుచుండి, పిమ్మట రెండు నెలలు క్షితిజముక్రిందికి పూర్తిగ గ్రుంకిపోయి, ప్రజలకు గాన్పింప లేదని భావార్థము.

ఈవిధముగ, నదృశ్యుడైన కుమారుడు యేమయ్యెను ? అతడు మరల పైకిరానేలేదా ? అతని నెవరును పైకితీసికొని రాలేదా ? ఋభుదేవత యీకుమారుని పైకితీసికొనివచ్చి మరల తలిదండ్రుల కొప్పగించిరట. ఋభువులు పెంగ దూడను తల్లితో గలిపిరి I, 110, 8; అశ్వినులు వధ్రిమతికి హిరణ్యహస్తుడను కుమారు నొసంగిరి; అశ్వినులు 'శయు' ఆవునకు పాలుపడు నట్లు చేసిరి; ఈకథలన్నియు కుమారసూర్యుని మరల తల్లితో కలుపుటనే సూచించుచున్నవి.

ఈగాథలో "కుమారు"డుగ వర్ణింపబడిన బాలసూర్యుడే తరువాత పురాణములలో కార్తికేయుడగు కుమారస్వామిగ వర్ణింపబడియున్నాడు. తల్లిగర్భమునుండి దశమాసానంతరము నిరృతిలోకమునకు జారిపోయినట్టియు, (స్కంద) లేక దాగినట్టియు (గుహ) యీకుమారసూర్యుడే పురాణములలో కుమారస్వామియయ్యెను. ఈకుమారసూర్యుడు ప్రాతఃకాల

ముగను తనసప్తమాతృకలతో,—అనగ సప్తదివ్యజలవాహినులతో—పైకివచ్చి దేవసైన్యములకు (అనగ వెలుతురునకు) సేనాపతియై దేవయానమువెంట విజయప్రయాణము సాగించెను. బాలసూర్యుడు పగళ్లకు నాయకుడు; అగ్నికుమారుడు దేవసైన్యములకు నాయకుడు. మరుత్తులు వృత్రవధయందు ఇంద్రునకు సహాయముచేసి సూర్యునివిడిపించిరి; కనుక, కుమారస్వామి (అనగ బాలసూర్యుడు) మరుత్తులకు (అనగ రుద్రునకు) కుమారుడని పురాణములువర్ణించినవి. సూర్యుడు వృత్రవధానంతరము నీటినుండిపుట్టెను; అగ్నికూడ నీటిలోనుండి పుట్టెను; కనుక, కుమారస్వామి (బాలసూర్యుడు) పురాణములలో అగ్నికుమారుడయ్యెను. బాలసూర్యుడు వృత్రవధానంతరము సప్తవాహినులవెంటవచ్చెను; గనుక, కుమారస్వామి (బాలసూర్యుడు) సప్తమాతృకలకు (లేకషట్కృత్తికలకు) పుత్రుడయ్యెను. బాలసూర్యుడు వృత్రవధానంతరము సముద్రము నావరించిన కొండబిలములలోనుండి బయటికివచ్చెను. గనుక, కుమారస్వామి (బాలసూర్యుడు) కొండను భేదించెను. అనగ, క్రౌంచపర్వతమును భేదించుటచే కుమారస్వామికి "క్రౌంచదారణు" డను నామము పురాణములలో ప్రసిద్ధమయ్యెను. మనకింతవరకుచాలును. ఈరీతిగ బయల్వెడలిన కుమారస్వామి చరిత్రమునకుతదుపరి పురాణములలో ననేక చిలవలు పలవలు పుట్టినవి. వానితో మనకిప్పుడు పనిలేదు.

మనము అశ్వినగాథలతో బయల్వెడలితిమి. సప్తవధ్రి గాథలోనున్న "దసమాస్య"యను పదముచేతను, దీర్ఘతముని గాథలోనున్న "దశమేయుగే" యనుపదముచేతను ఉత్తర ధ్రువమండలమందలి పదినెలల సూర్యరశ్మి సూచింపబడు చున్నది. భుజ్యు, రేభ, ఋజ్రాశ్వ,గాథలనుబట్టి ఉత్తరధ్రువ మండలమందలి మూడు, పది, నూరు, దినముల దీర్ఘరాత్రులు సూచింపబడుచున్నవి. ఇదిగాక, "సూర్యుడు గాఢాంధకార ములో నిద్రించుచున్నాడు;" "నిర్ఋతియొడిలో పరుండి యున్నాడు"-అను వాక్యములచే హేమంతర్తువందు క్షీణించి పోయిన సూర్యుడుగాక, కేవలము కటికచీకటిలో పడిపోయిన-అనగ, దీర్ఘరాత్రికాలములో క్షితిజముక్రిందికి గ్రుంకిపోయిన ధ్రువమండలసూర్యుడే సూచింపబడుచున్నాడు. ఈరీతిగ, అశ్వినగాథలలోని ప్రధానాంశములన్నియు ధ్రువమండల దీర్ఘ రాత్రినే సూచించుచున్నవిగాని శీతకాలమందు క్షీణించి పోయిన సూర్యతేజమును సూచించుటలేదు.

—* సూర్యచక్రము *—

ఉత్తరధ్రువమండలమందు సూర్యరశ్మి ౭, ౯, ౧౦ మాస ములుండు ప్రదేశములను సూచించుటకు అదితి, నవగ్వ,దశగ్వ, సప్తవధ్రి, దీర్ఘతమాది గాథలను వివరించితిమి. ఇవిగాక, ౧౦ మాసముల సూర్యరశ్మినిదెల్పు ప్రత్యేకసౌరగాథ యిం కొకటి గలదు. ఇంద్రుడు సూర్యచక్రమును దొంగిలించెనని యింకొకగాథగలదు. వృత్రుని సంహరించి, వెలుతురును పైకి

తీసికొనివచ్చినవాడు యింద్రుడు. అదిగాక, యింద్రుడు సూర్యునకు ప్రతిచోటను మిత్రుడని వర్ణింపబడియుండగ, అతడు సూర్యచక్రమును దొంగిలించెననుమాటకు అర్థమేమి?

సూర్యరథమున కొక్కటే చక్రమున్నట్లు ఋగ్వేదము చెప్పుచున్నది. ఈ యొక్కచక్రమును యింద్రుడు దొంగిలించినచో సూర్యగమనము పూర్తిగ నిలిచిపోవలెను. కనుక, యిచ్చట సూర్యచక్రమనగ సూర్యుడే యని చెప్పవలెను. ఇంద్రు డీసూర్యచక్రమును దొంగిలించి, దానితో నేమిచేసెను ? ఇంద్రుడు సూర్యకిరణములతో రాక్షసులను దహించెనని ఋ VIII, 12, 9 — చెప్పుచున్నది. కనుక, సూర్యచక్రహరణమును వృత్రవధయు యేకకాలమందే జరిగినవనుట స్పష్టము. కాని, యిచ్చట నొక విరోధాభాసము తటస్థించుచున్నది ; సూర్యుడు అంధకారములో పడియున్నప్పుడు, యింద్రు డీసూర్యబింబముతోడనే, ఆయంధకారమును భేదించి సూర్యుని పైకి తెచ్చెనని యెట్లు చెప్పవచ్చును. సూర్యుడున్నచోట చీకటియుండజాలదని మన మిప్పుడు తలంచుచున్నాము. కాని వైదికఋషులట్లు తలంపలేదు. సూర్యుడు క్షితిజముక్రిందికి గ్రుంకగనే, అతని తేజస్సు మాసిపోయెనని వైదికఋషులు తలంచిరి. కనుకనే, సూర్యుడు అంధకారములో పడియున్నాడు (తమసి క్షియాంతం) అని వర్ణించిరి. సూర్యుడు క్షితిజముక్రిందికి గ్రుంకినప్పుడు అంధకార రాక్షసులు వచ్చి అతని తేజస్సును హరించిరి. అంతట, ఇంద్రుడువచ్చి సూర్య

చక్రమును ఆయుధముగ ధరించి, దానితో అంధకారరాక్షసులను హతమొనర్చి, వారిచే హరింపబడిన సూర్యతేజస్సును మరల సూర్యున కిప్పించెను. ఇచ్చట సూర్యచక్రము (బింబము), సూర్యతేజస్సు — అనునవి రెండు భిన్నపదార్థములుగ గ్రహింపవలెను. సూర్యచక్రముచే రాక్షసులు హతులైరి; అంతట వారు దొంగిలించిన సూర్యతేజస్సు (వెలుతురు) మరల సూర్యునిబొందెను. కనుక, ఇంద్రుడు సూర్యచక్రమును నిలిపి, దానిని గిరగిర త్రిప్పి, అంధకారావృతమైయున్న అధోలోకములోనికి విసరివేసెనని ఋ IV, 17, 14– చెప్పుచున్నది. అనగ, ఇంద్రుడీచక్రమును అంధకారరాక్షసులపై ప్రయోగించెనని తాత్పర్యము.

కాని యీ కథాసందర్భమున, మన మింకను విచారింపవలసిన ప్రధానాంశ మింకొకటిగలదు:—ఋ VI, 31, 3 ను విచారింతము.

త్వమ్ కుత్సేన అభిశుష్ణం యింద్ర
1 అశుషమ్ యుధ్య 2 కుయవం గవిష్టౌ
దశ ప్రపిత్వే అధ సూర్యస్య
3 ముష్యాయస్ చక్రం 4 అవివే 5 రపాంసి॥—

1. అశుషం=అశనాతురుడు.
2. కుయవం=పంటల నాశనముచేయువాడు. } ఇవి రెండును 'శుష్ణ'ను వర్ణించు విశేషణములు.
3. ముష్యాయస్=దొంగిలించు, లేక హరించు.
4. అవివే=నాశనముచేయుట.
5. అపాంసి=విపత్తులు.

మొదటి రెండుపంక్తులకు అర్థము:— ఓ యింద్రా! నీవుగోవులను విడిపించుటకై 'కుత్స' తోకలిసి, అశనాతురుడును, పంటలనాశనముచేయువాడునునగు శుష్ణతో (వృత్రునితో) పోరాడుచున్నావు. ఇంతవరకును దీనియర్థము సరళముగనే యున్నది.—

ఇక చివర రెండుపంక్తులు బహుక్లిష్టముగ నున్నవి:— "దశప్రపిత్వే"యను పదమును వదలివేసి చూచినచో— "నీవు సూర్యచక్రమును హరించి విపత్తులను నాశనమొనర్చితివి"— అని అర్థము తేలుచున్నది. ఇంతవరకుబాగుగనేయున్నది. మన మిక "దశప్రపిత్వే" యను పదమునకర్థము లాగవలెను. ఈ గాథనేవర్ణించుచు IV, 16, 12 లో- శుష్ణుడు పగటియొక్క— "ప్రపిత్వ" మందుచంపబడెను—(అహ్నః ప్రపిత్వేనిబర్హీః)- అనియున్నది. కనుక, యిచ్చట, 'ప్రపిత్వే'యను శబ్దము కాలమునుసూచించుచున్నది. మరియు V, 31, 7 లో—ఇంద్రుడు "ప్రపీత్వ"మును జేరి (ప్రపిత్వంయాన్) శుష్ణుడొనర్చు దుండగములను నిలిపివేసెను—అని యున్నది.

కనుక, VI, 31, 3 లోనున్న "దశప్రపిత్వే"

IV, 16, 12 ... ... "అహ్నఃప్రపిత్వే"

V, 31, 7 ... ... "ప్రపిత్వం యాన్"

ఈమూడింటిలోనున్న "ప్రపిత్వ" శబ్దములకన్నిటికిని ఒకటే యర్థము చెప్పితీరవలెను. ఈయర్థమేమో పండితులు

స్పష్టపరుపలేదు. పలువురుపలురీతులుగ చెప్పిరి. కనుక, భావము స్ఫుటముగనున్న మరికొన్నివాక్యములను పరిశీలించిచూతము. VII, 41, 4; VIII, 1, 29 ఉతేదానీం భగవంతః స్యామోత ప్రపిత్వ ఉతమధ్యే అహ్నాం। ఉతోదితా మఘవన్ సూర్యస్య వయం దేవానాం సుమతౌ స్యామ॥ ముమత్వా సూర అదితే మమ మధ్యం దినేదివః। మమ ప్రపిత్వే అపిశర్వరే వసవాస్తో మాసో అవృత్సత్॥ "ప్రపిత్వే" శబ్దము పగటియొక్క ప్రథమ (ఉదితా,) మధ్య (మధ్యే) భాగములకంటె భిన్నమైనదిగ చెప్పబడినది. కనుక, "ప్రపిత్వే" యనగ పగటియొక్క చరమభాగమను భావముస్ఫుటముగ తేలుచున్నది. మహీధరుడుకూడ యీసందర్భమున "ప్రపిత్వే" యనగ "ప్రపతనే" లేక "అస్తమయే" యని యర్థముచేసియున్నాడు. ఈయర్థమునుబట్టి చూచినచో IV, 16, 12–నకు "శుష్ణుని పగటియొక్క చరమభాగమందు చంపబడె" నని తేలుచున్నది. కనుక, VI, 31, 3 లో–నున్న "దశప్రపిత్వే" అను పదమునకు "పదింటియొక్క చరమభాగమందు" అని అర్థము చెప్పితీరవలెను. (అనగ, పదినెలలయొక్క అంతమందు, లేక 'దశమాసాంతమందు' అనుభావము తేలుచున్నది.) కాని, పదపాఠమందు "దశప్రపిత్వే"యను దానినొకటే సమాసముగ గ్రహింపక, దశ, "ప్రపిత్వే" యను రెండు స్వతంత్రశబ్దములుగగ్రహించుటచే పండితులకు దీనియర్థము బోధపడలేదు. కాని, నేనిప్పుడు "దశప్రపిత్వే" యను దానిని

యేకసమాసముగ గ్రహించి అర్థము చెప్పుచున్నాను. పదపాఠమే శుద్ధమైనదానినిగ మనము గ్రహింపవలసినపని లేదు. దానిలోకూడ తప్పులుగలవు. అందుచేతనే, శాయనాచార్యులవారును, యాస్కాచార్యులవారును కూడ, అచ్చటచ్చట కొన్ని పదపాఠములలో సవరణలుచేసియే యున్నారు. కాన నేనిప్పు డవలంబింపబోవు పద్ధతి క్రొత్తదికాదు. సహజమును, సరళమును నగు భావార్థము కుదరనప్పుడు పదపాఠమందు సవరణచేయుట సాంప్రదాయకమే యైయున్నది. ఈ యర్థమును గ్రహించినచో, మనము చర్చించుచున్న శ్లోకభాగమున కీరీతిగ అర్థము తేలుచున్నది.

"పదింటియొక్క చరమభాగమందు నీవు సూర్యచక్రమును హరించి, విపత్తులను నాశనమొనర్చితివి" — ఈ వాక్యము శుష్ణవధాకాలమును సూచించుచున్నదనుటకుసందేహము లేదు. ఇక, "పదింటియొక్క చరమభాగమ"నగ అర్థమేమి? పదియనగ, పదిదినములా? లేక పదినెలలా? పదిదినము లనుటకువీలు లేదు. అట్లయినచో, శుష్ణవధ (వృత్రవధ) పదిదినముల కొకపర్యాయము జరుగుచున్నదని చెప్పవలసివచ్చును. కనుక, మనము పదిమాసములనియే చెప్పితీరవలెను. పదిమాసముల చివరభాగమందు (దశమాసాంతమందు) 'శుష్ణ' వధింపబడెను. ఈరీతిగ, "దశప్రపిత్వే"యనగ "దశమాసాంతమంద"ని యర్థము నిర్ణయించితిమి. దీనివలన, వృత్రవధాకాలమును, సూర్యచక్రహరణకాలమును నిర్ణ

యింపబడుచున్నవి. ఈనిర్ణయము మన యిదివరకుచేసిన నిర్ణయముతో సర్వవిధముల సరిపోవుచునేయున్నది. ఈగాథకూడ పదిమాసముల సూర్యరశ్మిగల ధ్రువమండలమునే సూచింపుచున్నది.

—* విష్ణుని త్రిపాదములు. *—

ధ్రువమండల లక్షణములను దెలుపు గాథలు మఱికొన్ని గలవు. వానినిట క్లుప్తముగ విచారింతము. వానిలో మొదటిది విష్ణుపాదములను గూర్చి చెప్పుచున్నది. విష్ణుని త్రిపాదములను గూర్చి ఋగ్వేదమందు పలుతావులలో పేర్కొనబడియున్నది. ఈ పాదము లెచ్చటెచ్చట నున్నవో పండితు లేకగ్రీవముగ చెప్పియుండలేదు. పలువురు పలురీతులుగ చెప్పియున్నారు. సూర్యుని ఉదయ, మధ్యందిన, అస్తమయములనే యీ మూడు పాదములుగ వర్ణింపబడినవని మాక్సుముల్లరు పండితుడు తెలుచుచున్నాడు. ఈ విష్ణుపాదములే పురాణములలో వామనమూర్తియొక్క మూడడుగులుగ వర్ణింపబడియున్నవి. ఇచ్చట విష్ణుడనగ సూర్యుడని పండితులందరును ఒప్పుకొనియేయున్నారు. దీనిని గూర్చి అభిప్రాయభేదములేదు. కాని, యీమూడు పాదములును సూర్యుని దైనికగతిని దెలుపునా ? లేక వార్షిక గతిని దెలుపునా యను విషయమై పండితులు భిన్నాభిప్రాయులై యున్నారు. ఈ రెంటిలోనే యభిప్రాయము సరియైనదో మన మిప్పుడు నిర్ణయింపవలసి యున్నది. " విష్ణుడు నాలుగుపేర్లతోనున్న తన తొంబదిగుఱ్ఱములను

చక్రాకారముగ పరుగెత్తించుచున్నాడు ” అని ఋ I, 55, 6 చెప్పుచున్నది. దీనివలన, ఒక్కొక్కదానిలో తొంబది దినములుగల నాలుగు ఋతువులు (మొత్తము 90 × 4=360 దినములు) సూచింపబడుచున్నవి. దీనినిబట్టి, సూర్యుని వార్షికగతియే విష్ణుకార్యములకు మూలాధారముగ నున్నదని స్పష్టమగుచున్నది. అదిగాక, విష్ణుడు యింద్రసఖుడనియు, వృత్రవధయందాతని కెంతయో సహాయము చేసెననియు ఋగ్వేదమందు పలుతావులలో వర్ణింపబడియున్నది. [IV, 18, 11; I, 156, 4; VII, 99, 4, 5]. కనుక, వృత్రవధకాలమందు విష్ణువు అధోలోకసముద్రమందు, యింద్రునకు కుడిభుజమై నిలుచున్నాడనుట స్పష్టము. కనుక, విష్ణుని మూడుపాదములలో నొకపాదము అధోలోకసముద్రమందుండితీరవలెను. అందుచేతనే, యీ మూడువిష్ణుపాదములలో రెండుమాత్రమే మానవులకు గాన్పించుననియు, మూడవది పశుపక్ష్యాదులకుగాని, నరులకుగాని గాన్పించదనియు ఋ I, 155, 5—చెప్పుచున్నది. ఈఅధోలోకము చీకటిమయముగను, జలమయముగనుండి నరుల కదృశ్యముగ నుండునని మన మిదివరకే చెప్పియున్నాము. కనుక, యీయధోలోకమందున్న విష్ణుపాదముకూడ మన కదృశ్యముగనే యున్నదనుట సహజముగనే యున్నది. వేయేల, సూర్యుని వార్షికగమనమే మూడు విష్ణుపాదములుగ వర్ణింపబడినది. సూర్యుడు క్షితిజముపైనుండి ప్రజలకు గాన్పించుకాలము విష్ణుని రెండుపాదము-

లగును. తదుపరి సూర్యుడు క్షితిజము క్రిందికి గ్రుంకిపోయి దీర్ఘరాత్రిని గల్గించినప్పుడు అదృశ్యమగు విష్ణుని మూడవ పాద మేర్పడుచున్నది. ఈ మూడవపాదమందే విష్ణు డింద్రునకు వృత్రవధయందు సహాయము చేసెను.

ఇంద్ర శంబరుల పోరాటము శరదృతువు ౪౦ వ తిథి నాడు ప్రారంభమయ్యెనని యుదివరకు నిర్ణయించి యుంటిమి. దీనివలన షుమారు ౮ నెలల సూర్యరశ్మియు, ౪ నెలల దీర్ఘరాత్రియు సూచింపబడుచున్నది. ౮ నెలల సూర్యరశ్మియే విష్ణునకు (సూర్యునకు) రెండుపాదములగును యీపాదము లందరికిని గాన్పించును. ౪ నెలల దీర్ఘరాత్రియే విష్ణునకు (సూర్యునకు)మూడవపాదమగును. ఇది యెవరికిని గన్పింపదు. విష్ణువు సంవత్సరములో ౪ నెలలు నిద్రించునని పురాణములు చెప్పుచున్నవి. దీనివలన కూడ ౨ మాసముల దీర్ఘరాత్రియే సూచింపబడుచున్నది. విష్ణువు సముద్రమధ్యమందు అనంత పర్యంకమందు నిద్రించునట. ఈ సముద్రము అధోలోకమందున్న దివ్యజల (ఆపః) సముద్రము; యీ అహియే వృత్రాసురుడు; యీ నిద్రసంవత్సరముయొక్క చరమభాగమగు *హేమంతమందే జరుగును. విష్ణుని నాలుగుమాసముల నిద్రయు, అతని మూడవపాదమును-ఒకేభావమును దెలుపుచున్నవి. అనగా, వీనివలన ఉత్తరధ్రువమండల దీర్ఘరాత్రి (౨ మాసముల దీర్ఘ

* కాని, యిటీవల ప్రబలిన మేషసిద్ధాంతముచే పండితులీనిద్రను వర్షకాలమునకు మార్చిరి. ఇది పొరబాటు.

రాత్రి) సూచింపబడుచున్నది. గ్రీకుగాథలలోకూడ "ఫిర్గియన్" అను దేవత శీతకాలమందు నిద్రించి, వేసవికాలమందు పని చేయునట! ఇట్టికథయే ఐరిషుగాథలలోకూడగలదు. ఇవన్నియు ఉత్తరధ్రువమండల దీర్ఘరాత్రినే సూచింపుచున్నవి.

ఈ పౌరాణికగాథ నటుంచి, యీయర్థమునే దెలుపు యింకొక వైదికగాథనెత్తికొందము. ఋ VII, 100, 6-లో విష్ణునకు "శిపివిష్ట" యను అశ్లీలనామ మొకటి ప్రయోగింపబడినది. "శిపివిష్ట" శబ్దము అశ్లీలార్థమును దెలుపుచున్నదని (కుత్సితార్థీయం) యాస్కాచార్యులవారికి పూర్వులైన ఔపమన్యవ పండితులు చెప్పియున్నారు. "శిపివిష్ట" యనగ,— "శేపః ఇవ నిర్వేష్టితః"—మేఢ్రమువలె కప్పబడియున్న— అనిగాని, లేక "అప్రతిపన్నరశ్మిః"— కాంతిమాసిన-అనిగాని, రెండువిధములుగ శాయనులవా రర్థముజేసియున్నారు. అయినను, యీబూతుపదమును విష్ణుమూర్తికి ప్రయోగించుట కిష్టములేక శాయనులవారు "శిపివిష్ట" పదమునకు యింకొక మంచియర్థమును గల్పింపజూచిరి. "శిపివిష్ట" యనగ, "ఎవని కిరణములు (శిపయః) ప్రదర్శితమగుచున్నవో (ఆవిష్టాః) ఆతడు శిపివిష్టుడు!" ఎవడు తేజోమూర్తిగ వెలుంగుచున్నాడో ఆతడు శిపివిష్టుడని శాయనులవారొక మంచియర్థమును గల్పించిరి. కాని, శాయనుల వారు తమయసాధారణప్రజ్ఞచే నెంత యత్నించినను "శిపివిష్ట" శబ్దమున కిప్పటికిని అశ్లీలార్థమే సంస్కృతవాఙ్మయమందు స్థిరముగనిలిచియున్నది. "శిపివిష్ట"

యనగ "వెండ్రుకలు రాలిపోయిన" లేక "కునుర్చుటకుపేలు లేని చర్మరోగముచే బాధపడుచున్న"- యను అసహ్యార్థ మిప్పటికిని సంస్కృతమందు నిలిచిపోయున్నది. "శిపి" యనగ "పశవః" అని అర్థముచెప్పి తైత్తిరీయ సంహితాకారులుకూడ విష్ణునకు మంచిపేరుపెట్ట జూచిరి. కాని, యీయత్నము లన్నియు నిష్ఫలములయ్యెను. ఋగ్వేదమిప్పటికిని "కుత్సి తార్థీయము" గనే (బూతుమాటగనే) గ్రహింపబడుచున్నది. విష్ణున కీఅశ్లీలమైన పేరెట్లువచ్చెనో చూతముగాక! ఋ VII, 5, 6 లో భక్తుడనగు నేను... యీదినమున "శిపివిష్ట" యను నీనామమును భజించుచున్నాను. బలహీనుడనగు నేను బలవంతుడవగు నిన్ను కొనియాడుచున్నాను—నీవీలోకమున కావల, అధోలోకమందు నివసించుచున్నావు. (క్షయంతం అస్యరజసః పరాకే) "ఓవిష్ణూ! నేను "శిపివిష్టు"డనని నీవు చెప్పు కొనుటలో తప్పేమియున్నది? యుద్ధమునందు నీవు నానావేష మును ధరించియున్నావు గనుక, యీవేషమును (నగ్నపు) మాదృష్టినుండి దాచకుము." అను వర్ణనగలదు. "ఈలోకమున కావల" "అధోలోకమందు నివసించుచున్నావు" (రజసఃపరాకే)-అనుమాటలవలన యీఋక్కుయొక్క భావార్థమంతయు కరతలామలకమగుచున్నది. విష్ణు వీయధోలోకమందుండగ ఆతనికి "శిపివిష్టు"డను నశ్లీలనామధేయము గలిగెను. గాఢాంధకారపూరితమగు నీలోకమునకు పోవుటచే విష్ణువు నల్లని యావరణములో మూసికొనిపోయెను. అందుచే ఆతనికి

శిపివిష్టుడు (మేఘమువలె మూసికొనిపోయినవాడు) అను బూతుపేరు వచ్చెను. "ఈ అశ్లీలనామముచే నీవు సిగ్గుపడవలసిన పనిలేద"ని భక్తుడు విష్ణునితో చెప్పుచున్నాడు. ఏలననగ, యీరూపము, అధోలోకమందు అసురులతో పోరాడవలసి వచ్చినప్పుడు, తాత్కాలికముగ ధరింపబడినదే గాని శాశ్వతమైనదిగాదు. కాన, దీని విషయమై యెవరును అసహ్యించుకొనవలసిన పనిలేదని విష్ణుభక్తుడు తలంచుచున్నాడు. ఇప్పుడు యుద్ధము ముగిసినది గనుక, "నీ నిజస్వరూపమును (వర్పస్) మాకు చూపవలసినదని భక్తుడు ప్రార్థించుచున్నాడు. ఈ ఋక్కునకు నిజమైన అర్థ మిది. సూర్యుడు క్షితిజలముపై మహాతేజోవంతముగ వెలుగుచున్నప్పుడు "బృహాచ్ఛేపు"డుగ వర్ణింపబడెను. కనుక, అధోలోకమందు దీర్ఘకాలము హీనతేజుడై గాఢాంధకారములో మునిగియున్నప్పుడు సూర్యుడు "శిపివిష్టు"డుగ వర్ణింపబడుట సమంజసముగనే యున్నది. దీనికై విష్ణుమూర్తిగాని, విష్ణుభక్తులుగాని సిగ్గుపడవలసినపని యేమాత్రమైనను లేదు. తదుపరి ప్రబలిన పురాణములలో యీ భావమునే విష్ణుమూర్తియొక్క నిద్రగ వర్ణించిరి. నిద్రయన్నను, రోగమన్నను ఒక్కటే భావము. విష్ణుమూర్తినల్లని యాచ్ఛాదనమునుధరించి, పాతాళలోకమునకుపోయి, అసురుల నెత్తిపై తనమూడవ పాదమునుంచెనన్నను, లేక నల్లనికవచమును ధరించి వృత్రవధయందు యింద్రునకు సహాయముచేసెనన్నను ఒకటేభావము. ఈకథలన్నియు ఉత్తరధ్రువమండల దీర్ఘరాత్రినే దెలుపుచున్నవి.

విష్ణునివలెనే యీవిశ్వమునంతను చుట్టివచ్చుచుండు తదితర దేవతాస్థానములను పరిశీలించిచూచినను యీసిద్ధాంతమే ధ్రువపడుచున్నది. "సవిత్రి" యను దేవత ప్రపంచమునంతను (రజాంసి) చుట్టివచ్చును. సవిత్రికిమూడులోకములు (ద్యావః) గలవు. వీనిలోరెండు దగ్గరనున్నవి; మూడవది యమలోకములో నున్నది. (అనగ, అధోలోకమందున్నది.) ప్రపంచమును చుట్టివచ్చు రెండవ దేవత అగ్ని. అగ్నికిమూడు స్థానములుగలవు. మొదటిది సముద్రమందు; రెండవది దివియందు; మూడవది నీటియందు (అప్సు) అగ్నితేజము త్రివిధములు; అగ్నిత్రిశిరుడట. అతనికిమూడునాలుకలున్నవట; అగ్నియొక్కమూడవస్థానము ఒక్కవిష్ణునకుమాత్రమే తెలియునట. అనగ,యిదివిష్ణునిమూడవపాదమునకుసరిపోవుచున్నది. మరియు, అగ్నితనయూర్ధ్వ (ఉపమ) పాదములో పవిత్రములగు గోవులను కాపాడుచున్నాడని ఋ V, 3, 3 చెప్పుచున్నది. ఈ వర్ణన విష్ణుని యూర్ధ్వపాదవర్ణనములో సరిపోవుచున్నది. ఎట్లనగ, విష్ణుని యూర్ధ్వపాదమునుండి తేనె ప్రవాహములు ప్రవహించుచుననియు, యీ పాదమందు గోవులున్నవనియు I, 154, 5, 6, చెప్పుచున్నది. ఈవిధముగ అగ్నిపాదములును, విష్ణుపాదములును ఒకేభావమును దెలుపుచున్నవి. ఇచ్చట అగ్నియన్నను, విష్ణుడన్నను సూర్యుడనియే అర్థము. ఈ యిరువురే గాక, అశ్వినులుకూడ ప్రపంచమును చుట్టివచ్చువారే. (పరిజ్మన్). వీరికికూడ మూడుస్థానములు గలవు. వీరి రథము

యీ మూడుస్థానములందును సమానముగనే (సమానయోజనః) పోవును. ఈ రథమునకు మూడుచక్రము లున్నవి. వీనిలో మూడవ చక్రము యెవరికిని గనపడకుండ యొకానొక రహస్యమైన గుహాయందున్నదట. ఈవర్ణన విష్ణుని మూడవ పాదవర్ణనతో సరిపోవుచున్నది. ఈరీతిగ ప్రపంచమునంతను చుట్టివచ్చు దేవతలందరియొక్క తృతీయస్థానములు ఒకేరీతిగ వర్ణింపబడియున్నవి. కనుక, యీతృతీయస్థానము (లేక పాదము) అధోలోకమునే సూచింపుచున్నదనుట కెంతమాత్రమును సందేహములేదు. అందుచే, ధృవమండల దీర్ఘరాత్రికి మరింతబలమైన ప్రమాణము దొరుకుచున్నది.

—* "త్రిత ఆప్త్య" *—

సంవత్సరమును మూడుభాగములుగ చేసి, యీమూటిని మూడువిష్ణుపాదములతో పోల్చియుండిరి. మరియొకచోట, యీమూటిని ముగ్గురుఅన్నదమ్ములుగ పోల్చిరి. వీరిలో మొదటియిద్దరునుకలిసి మూడవవానిని చీకటిగోతిలోనికి త్రోసిరట. ఈ కథయే ఋగ్వేదములో "త్రితఆప్త్య" కథగ చెప్పబడియున్నది. ఇదిగాక, శాయనులవారు "శాట్యాయను"ల కథను చెప్పియుండిరి. ఏకత, ద్వితి, త్రిత, — అను ముగ్గురు అన్నదమ్ములుగలరట; మొదటియిద్దరుకలిసి మూడవవాడగు "త్రిత"ను చీకటిగోతిలోనికి త్రోసిరట. వా డచ్చుటపడి మొరపెట్టుకొనుచుండగ బృహస్పతివచ్చి వానిని పైకిలేవదీసెనట. ఋగ్వేదమందు ఏకత—యను పేరులేదు. కాని, ద్వితి, త్రిత,—ల

పేర్లుగలవు. త్రిత– అనగ, మూడవవాడని యర్థము. ఈ 'త్రిత'కు "ఆప్త్య"—నీటిలోబుట్టినవాడు, లేక నీటిలోనుండువాడు–అను విశేషణము వేదమందుగలదు. ఈతడు, వృత్రవధయందు యింద్రమరుత్తులకు సహాయముచేసెనని ఋగ్వేదము పలు తావులలో చెప్పుచున్నది. ఇదిగాక, యీతడొక కూపమందు పడినట్లును, యీతని మొరవిని, బృహస్పతివచ్చి, పైకితీసి కాపాడినట్లును ఋ I, 105, చెప్పుచున్నది. ఈ సూక్తమందలి వర్ణనుబట్టి యీ "త్రిత" యను నాతనికి అత్యంతశీతప్రదేశములతో సంబంధమున్నట్లును, దురదృష్టవశమున నీటిలో పడియున్నట్లును తెలియుచున్నది. త్రితయొక్క నివాసస్థానము, విష్ణుని తృతీయపాదమువలెనే, యెవరికిని గాన రానంత రహస్యముగ నున్నదని IX, 102, 2 చెప్పుచున్నది. ఈకథనే సూచించినట్లుగ పారశీగ్రంథముకూడ చెప్పుచున్నది. ఇదిగాక విశేష మేమనగ "త్రైతన" (అనగ, త్రిత) అనువానిని రాక్షసునితో పోరాడునప్పుడు తన అన్నల నిద్దరిని కూడ వెంటబెట్టికొని వచ్చెనట. ఇదిగాక, ప్రాచీనమగు పారసీ భాషయందు "త్రియత్" అనగ సముద్రమని అర్థముగలదు; ఇదికూడ మన సిద్ధాంతమునే సూచించుచున్నది.

పండితలోకమునకు ఉత్తరధ్రువసిద్ధాంతము తెలియనందున, యీ కథయొక్క భావార్థము వారికి గోచరము కాలేదు. ఈదేవతకు "త్రిత" (మూడవవాడు) అను సాంఖ్యావాచకనామ మేలకలిగెనో పండితులు గ్రహింపలేకపోయిరి.

కావున, త్రితశబ్దము తప్పనియు, "తృత"శబ్దమే అసలు సరి యైన మాటయనియు మాక్సిముల్లరుపండితు డూహించు చున్నాడు. "తృత"శబ్ధము, "తౄ=దాటుట"యను ధాతువు నుండి యుత్పన్నమగును. కనుక, "తృత"యనగ, సముద్ర మును దాటుచున్న సూర్యుడని మాక్సిముల్లరు పండితు డూహించుచున్నాడు. (దీనిని, "తరణి"యను సూర్యనామ ముతో పోల్పవచ్చును.) దీనివలన, నిత్యమును సముద్రమందు గ్రుంకుచుండు సూర్యుడు సూచింపబడుచున్నాడని మాక్సి ముల్లరుగారి యభిప్రాయము. "త్రిత"యొక్క నివాసస్థానము అంతులేని గాఢాంధకారపూరితముగ నున్న ఆ సముద్రమే యనియు (అనారంభణం తమస్) దీనినుండియే అత్రి, వందన, మొదలగు జ్యోతిర్దేవతలు నిత్యమును బయటికి వచ్చుచుండు రనియు మాక్సిముల్లరుగారు వ్రాసియున్నారు. ఈ వాక్య ములో — "నిత్యమును" — అను ఒక్కమాటను తీసి వేసినచో సర్వమును మాకు అంగీకారమే. ధ్రువసిద్ధాంతము తెలియనందున మాక్సిముల్లరుగారు గురికి ఒక నూలువాసి తప్పిపోయిరి. సంవత్సరమును మూడుభాగములుగ చేసినచో, మూడవభాగము ధ్రువమండలమందు దీర్ఘరాత్రిగ నుండును. దీనినే ఒక దేవతగ పోల్చినచో యీదేవతకు "త్రిత" యను నామము సార్థకమగును. తదుపరి వర్ణనమంతయు తూచినట్లు సరిపోవును. ఈ సంఖ్యావాచకనామము ఒక్క వేదమందే గాక, పారశీక, గ్రీకు, ఐరిషు గ్రంథములలో సైతమున్నప్పుడు

దీనిని తప్పనుట బహుసాహసము. ఒకానొక శబ్దములో నంతర్గర్భితమైయున్న భావార్థము బోధపడనప్పుడు మహాపండితులుసైత మెన్నిపాట్లు బడవలసివచ్చునో దీనినిబట్టి మనము గ్రహింపవచ్చును. మాక్సుముల్లరుగారికి యీ భ్రమసిద్ధాంతకీలక మేమాత్రమైన తెలిసియున్నచో వారట్టి సాహసమున కొడిగట్టవలసిన పనియుండెడిది కాదు.

—: ఆపః :—

దివ్యజలమునుగూర్చి చెప్పవలసిన దంతయు నిదివరకే చెప్పియుంటిమి. కనుక, యీజలదేవతయొక్క స్వరూపస్వభావముల నిచ్చట క్లుప్తముగ మరియొకసారి వివరించెదను. త్రైతిజము క్రిందనున్న అధోలోకము తలక్రిందుగ బోర్లించిన పాత్రవలెనున్నది. ఇది జలపూరితమును, గాఢాంధకారపూరితమును నైయున్నది. కనుక, దీనికి అంతులేని పెద్ద ప్రదేశమనియు, అడుగులేని సముద్రమనియు చెప్పవచ్చును. ఈసముద్రము చుట్టును పర్వతపంక్తి యొకటిగలదు. ఊర్ధ్వ అధోలోకములను వేరుబరచురాతిగోడగ యీపర్వతపంక్తిని చెప్పవచ్చును. ఈపర్వతపంక్తిలో కొన్నిబిలములుగలవు. వృత్రుడు ఈసముద్రమందుండి తనదేహమును పెంచి, యీబిలముల నన్నిటిని మూసివేయుటచే, దీనిలోని నీరు పైకిప్రవహింపక, అందే నిర్బంధింపబడిపోయెను. అంతట, యింద్రుడు వచ్చి, వృత్రుని సంహరించి, యీకొండబిలములను ఖాళీచేయుటచే లోపల నున్ననీరు యీవలికివచ్చి ఊర్ధ్వముఖముగ ప్రవహించెను.

ఈరీతిగ, కొండలతోడను, చీకటితోడను నిండియున్న యీ యధోలోకసముద్రము రాక్షసులకును, దుష్టగ్రహములకును, నివాసస్థానమయ్యెననియు, ఇదియే దేవదానవుల (చీకటి, వెలుతురుల) యుద్ధరంగ మయ్యెననియు, వృత్ర, భుజ్యు, సప్తవధ్రి, త్రిత—గాథలవలన తెలియుచున్నది. సూర్య, అగ్ని, విష్ణు, అశ్విన, త్రితాది జ్యోతిర్దేవతలు తమ వార్షికసంచారమందీ సముద్రజలములలో కొంతకాల ముండవలసివచ్చెననియు కూడ తెలియుచున్నది. విష్ణు డీసంద్రమందే నిద్రించెను; యీసంద్రమునుండియే సప్తదివ్యవాహిను లూర్ధ్వముఖముగ ప్రవహించి తమవెంట సప్తసూర్యులను పైకిగొనిపోయి ధ్రువమండలమందున్న ఆద్యులకు యేడుమాసముల సూర్యరస్మిని గల్పించి, పిమ్మట మరలివచ్చి యీ సంద్రమందే గలిసెను. ఈవిధముగ, గగనమార్గమున ప్రవహించు దివ్యజలవాహినుల నుండియే భూప్రజలకు వర్షము గలిగి ఓషధులు మొలచెను. ఈ సముద్రము పశ్చిమమునుండి తూర్పునకు వ్యాపించి పాతాళమందున్న మూడులోకములను నింపుచున్నది. కొండగోడలమధ్యనున్న యీసంద్రమందే వృత్రుడు ఆవులను బంధించెను. ఇదియే యమ, వరుణుల రాజ్యము; ఇందే పితరులు నివసింతురు. పైనున్న భూమ్యాకాశము లేరీతిగ 3, ౭, ౧౦, లోకములుగ విభజింపబడియున్నవో, యీయధోలోక సముద్రముకూడ అదేరీతిగ 3, ౭, ౧౦, విధములుగ విభజింపబడియున్నది.

వైదికగాథలయొక్కయు, వీనినిబట్టి తరువాత బయల్వెడలిన పౌరాణికగాథలయొక్కయు నిజమగు భావార్థమును తెలిసికొనగోరినచో యీదివ్యజలములయొక్క నిజమైన స్వరూపస్వభావములను చక్కగ తెలిసికొనుట యెంతయో ఆవశ్యమైయున్నది. దీని నిజస్వభావము తెలియనిచో అనేకగాథలన్నియు అయోమయముగ దోచును. వేదములందు పేర్కొనబడిన యీ దివ్యజల లక్షణములను యీవల మనవారు భూమిపైనున్న సముద్రజలముల కంటగట్టిరి. సముద్రమును వర్ణించుచు భర్తృహరి మహాయోగి యీ లక్షణములను పేర్కొని యున్నాడు.

భర్తృహరి:- నీతిశతకం: పరోపకారపద్ధతి:-

శ్లో॥ ఇతః స్వపితి కేశవః కులమితస్తదీయ ద్విషా
మితశ్చ శరణార్థినాం శిఖరిణాం గణాః శేరతే
ఇతో౽పి బడబానలః సహసమస్తసంవర్తకై
రహో వితతమూర్జితం భరసహంచ సింధోర్వపుః॥

చ॥ ఒకయెడఁ బవ్వళించు హరి ♦ యొకయెడఁ [వసియించు రాక్షస
ప్రకరము లొక్కచో నడఁగుఁ ♦ బర్వతసంఘము [లొక్కెడఁ బలా
హకములతోడ నుండు బడ ♦ బాగ్నియు విస్తృత [మూర్జితంబును
బ్రకటభరక్షమం బగుచు ♦ భాసిలు నౌర సముద్ర [మొత్తయున్ ॥

తా॥ సముద్రము తనయందొక్కచోట విష్ణుని, ఒక్కచోట రక్కసులను, ఒక్కచోట పర్వతసమూహమును, ఒక్కచోట బడబానలంబును వహించియున్నది; ఆహా ! దీని మహాత్వమెంత గొప్పదైనది. ఇందు పేర్కొనబడిన ప్రతిలక్షణమును మనము పైనవివరించిన దివ్యజలసముద్ర లక్షణముల మీదనే యాధారపడియున్నది. యూరోపియన్ భాషలలో సముద్రమునకు " ఓషన్ " అని పేరుగలదు. ఈశబ్దము " ఆశయాన "– కప్పుచున్న, – ప్రపంచమును చుట్టియున్న– అను సంస్కృతమూలమునుండియే పుట్టినది. " ఓకేనస్ " అను గ్రీకుశబ్దముకూడ దీనితో సమానార్థకమైయున్నది. దివ్యజలము ప్రపంచమునంతను చుట్టియున్నదను భావము వేదమందు ప్రసిద్ధమేగద. ఈదివ్యజలలక్షణమే మనమామూలు సముద్రమునకుకూడ — అంటగట్టుటచే సముద్రమునకు — ప్రంపచమును చుట్టివచ్చునట్టి—పేరువచ్చెను. వైదికగాథలకన్నిటికిని యీదివ్యజలమే మూలాధారముగాన, యీ జలదేవత వైదికదేవతలందు మిక్కిలి ప్రధానమైనదిగ గ్రహింపబడుచున్నది. దీనికున్న నిజకారణ మిదియే.

—* సప్త, దశవిధ విభాగములు *—

భూమ్యాకాశములును, పాతాళమును ౩, ౭, ౧౦ విధములుగ విభజింపబడియున్నదని పైన వివరించితిమి. ప్రాచీన యాజ్ఞికులు తమ యజ్ఞములను ౭, ౯, ౧౦ నెలలో పూర్తి చేయుచుండిరి. వైదికవాఙ్మయమందును, తదితర ఆర్యసంత

తుల ప్రాచీన గ్రంథములందును సప్తవిధవిభాగము సర్వసాధారణముగ గన్పట్టుచున్నది. ఈ విభాగములు పలురీతులుగ గన్పట్టుచున్నవి. కనుక, యీ విభాగములకు సంబంధించిన యంశములనెల్ల నిచ్చట ప్రకటించి, యేసూత్రముపై యీవిభాగములు చేయబడినవో పరిశోధింపవలసియున్నది. వీనిలో సప్త, దశ, విభాగములు ప్రధానములుగ గన్పట్టుచున్నవి. కనుక వేదవాఙ్మయమునందీ విభాగము లెంతవరకు ప్రాకియున్నవో చూతము.

సూర్యుడు:— సూర్యునకు యేడు గుర్రములు గలవు. (సప్తాశ్వ) V, 45, 9. సూర్యరథమునకు యేడు చక్రములు గలవు. యేడు గుర్రములు రథమును లాగుచున్నవి; లేక యేడు పేర్లుగల ఒక గుర్రమే యారథమును లాగుచున్నది I, 164, 3. సూర్యరథమునకు యేడు హరితములు గలవు— I, 50, 8. అంతేగాక, సూర్యరథమునకు పది గుర్రములు కట్టబడినవి — IX, 63, 9. సంవత్సరదేవతయొక్క చక్రమును పదిగుర్రములు లాగుచున్నవి. — I, 164, 14. మరియు, సూర్యరథమునకు యెనిమిది చక్రములు (అష్టా-చక్ర) గలవని అథర్వవేదము XI, 4, 22 చెప్పుచున్నది.

ఇంద్రుడు:— ఇంద్రునకు "సప్త-రశ్మి" యను పేరు గలదు II, 12, 12; అతని రథముకూడ "సప్త-రశ్మి" యేనట. VI, 44, 24. కాని, మరియొకచోట యింద్రుని రథమును పది తెల్లగుర్రములు లాగుచున్నవని చెప్పిరి. V, 33, 8.

ఇంద్రుడు "క్రొత్త పదియవవాడు" (దశమం నవం) అని VIII, 24, 23. చెప్పుచున్నది. ఇంద్రుని ఆత్మ పది విధములుగ చరింపుచున్నదని (ఇంద్రస్య ఆత్మానం దశధా చరంతం) తైత్తిరీయ ఆరణ్యకము III, 11, 1 చెప్పుచున్నది. వెరెత్రఘ్ను (వృత్రఘ్ను) ని యొక్క దశావతారములు పారశీగ్రంథమందు పేర్కొనబడియున్నవి. ఇంద్రభక్తులలో "దశద్యు" అనువాతడు కలడు- I, 33, 14; VI, 26, 4. దశోణి, దశమాయా, యనువారలద్యోతనకు లొంగునట్లు ఇంద్రుడు చేసెనని VI, 20, 8 చెప్పుచున్నది. ఇంద్రుడు సోమరసమును త్రాగినప్పుడు అతనివెంట దశోణ్య, దశశిప్ర – యను వారలుకూడ కలరు. VIII, 52, 2.

సోమ, పూషన్:— వీరికి ౫ కిరణములును, ౭ చక్రములును గలవు. II, 40, 3. సోమునకు ౧౦ కిరణములుగలవు రశ్మయః–IX, 97, 23.

అగ్ని:– అగ్నికి సప్తరశ్మియనిపేరు గలదు (I, 146,1) అతనికిరణములు యేడని II, 5, 2, స్పష్టముగ చెప్పుచున్నది. అతని గుర్రములకు యేడు నాలుకలు గలవు. III, 6, 2. మరియు, అగ్ని "దశప్రమతి" యని I, 141, 2. చెప్పుచున్నది. X, 51, 3 లో అగ్నియొక్క రహస్యస్థానములు పది పేర్కొనబడినవి. కనిష్ఠుడగు అగ్నికి (నవిష్ఠాయ) "నవమం" లేక తొమ్మిదవవాడు–అను విశేషము V, 27, 3 లో గలదు.

గీతులు:— యజ్ఞకులలో నున్న ప్రార్థనలు లేక గీతులు యేడని IX, 8, 4 చెప్పుచున్నది. కాని, I, 144, 5 లో వాని సంఖ్య పదియని చెప్పబడినది.

ఆహారపదార్థములు:— ఇవి యేడని III, 4, 7 చెప్పుచున్నది. కాని, I, 122, 13 లో వాని సంఖ్య పదియని గలదు. హవిస్సు పదివిధములుగ చేయబడునని తై॥ బ్రా॥ I, 8, 1, 34, చెప్పుచున్నది.

హోతృలు:— ఏడ్గురు (III, 10, 4; IV, 2, 15; X, 63, 7.) విప్రులు యేడ్గురు. (III, 7,7) కాని, III, 39, 5 లో దశగ్వుల సంఖ్య పదిగ చెప్పబడినది. తై॥ బ్రా॥ II, 2, 1, 1; II, 2, 4, 1—లో హోతృల సంఖ్య పదిగ చెప్పబడినది.

బృహస్పతి:— ప్రథమయజ్ఞకుడు: అతనికి "సప్తాస్య" అను బిరుదు IV, 50, 4 లో గలదు. అథర్వ వే॥ XX, 88, 4 కూడ యీబిరుదునే యిచ్చుచున్నది. కాని, బృహస్పతి దశాస్యుడనియు, దశశీర్షుడనియు అథ॥ వే॥ IV, 6, 1 చెప్పుచున్నది. "మనపితరుడు" సప్తశీర్ష్ణి భక్తి లేక జ్ఞానమును (గీ) సంపాదించెనని X, 67, 1 చెప్పుచున్నది.

భూమి:— భూమియొక్క యేడుభాగములు I, 22, 6 లో గలవు. కాని, X, 94, 7 లో భూములు పదియని (దశావనీః) చెప్పబడియున్నది.

గోశాలలు:— అశ్వినులు నిరచిన గోశాలలు 'సప్తాస్య' ములని (X, 40, 8) చెప్పుచున్నది. కాని, దశవిధగోశాలలు

(దశవ్రజ) VIII, 8,20; 49, 10; 50, 9 – లలో పేర్కొనబడినవి.

రాజులు:– అర్యమన్, మిత్ర, వరుణ, రుద్ర, మరుత్త, పూషన్, భగ, — యను యేడ్గురు రాజులు X, 93,4– లో పేర్కొనబడిరి. కాని, బంగారమువలెనున్న పదిమంది రాజులను (హిరణ్యసందృష) VIII, 5, 38 పేర్కొనుచున్నది. పురాతన దేవతలు పదిమందియే యని అధ॥ వే॥ XI, 8, 10– చెప్పుచున్నది. VII, 83, 7–లో యజ్ఞములు చేయని (అయజ్యవః) పదిమంది రాజులు పేర్కొనబడిరి. అర్యముని వివిధరూపములలో (విషు–రూపేషు) సప్తహోత్రియని చెప్పబడుచున్నాడు X, 64, 5.

పై పట్టికనుబట్టి చూచినచో సప్త, దశ, విధవిభాగములు ప్రతివస్తువునందును ప్రధానముగ గన్పట్టుచున్నవి. ఈ సప్త, దశ, విభాగములేగాక భూమ్యాకాశపాతాళముల యొక్క త్రివిధవిభాగమును, దేవతలయొక్క యేకాదశ విధ విభాగమునుగూడ మనము గమనింపవలసియున్నది. మరియు, అధర్వవేదము XI, 7, 14–లో తొమ్మిది భూములు, తొమ్మిది సముద్రములు, తొమ్మిది ఆకాశములు పేర్కొనబడియున్నవి. అధర్వశిర — ఉపనిషత్తు — ౬ లో కూడ యీ నవవిధ విభాగము గన్పట్టుచున్నది. ఈ పలువిధ విభాగములయొక్క భావార్థమేమో యాస్కాచార్యాదిపండితులు వివరింపరైరి. భూమ్యాకాశపాతాళములను బట్టి త్రివిధ విభాగములను

సమర్థించినను తక్కిన ౭ మొదలు ౧౧ వరకు నున్న పలువిధ విభాగములను సమర్థింపను ఎట్లు? వీని కర్థమేమి? యే సూత్రాధారముచే యీ విభాగములు గావింపబడినవి? లేక, యేసూత్రము ననుసరింపకయే తలకొకవిధముగ చేసినారా? నవగ్వ, దశగ్వ, సప్తగుత్రుల చరిత్రలవలన మన సూత్రము కొంతవరకు గోచరించుచున్నది. సూర్యుని సత్రము నొకప్పుడు యేడనియు, మరియొకప్పుడు పదియనియు, చెప్పుటచే ధ్రువ మండలమందలి యేడుమాసముల సూర్యరశ్మి నొకప్పుడును, పదిమాసముల సూర్యరశ్మి నొకప్పుడును సూచింపబడు చున్నవి. ఇదేరీతిగ, తక్కిన వివిధ విభాగములన్నియు ధ్రువ మండలమందున్న ౭, ౮, ౯, ౧౦, ౧౧, నెలల సూర్యరశ్మిని సూచించుచున్నవి. ప్రాచీనార్యులు కాపురమున్న ధ్రువమండలములో అనేక స్థలములనుబట్టి కొన్ని ప్రదేశములలో ౭ నెలల సూర్యరశ్మియుండెను; మరికొన్నిటిలో ౮ నెలల సూర్యరశ్మియుండెను; మరియు, ౯, ౧౦, ౧౧ నెలల సూర్య రశ్మియున్న ప్రదేశములుకూడ గలవు. అంగిరసులలో నవగ్వ, దశగ్వులు, ప్రధానశాఖలనుటచేతను, సూర్యునకు సప్తాశ్వ నామము ప్రముఖమైన దగుటచేతను, ధ్రువమండలమందు, ౭, ౯, ౧౦, నెలల సూర్యరశ్మియున్న ప్రదేశములే మన యార్యులకు ప్రధాన నివాసస్థానములుగ నుండెననియు, తక్కిన, ౮, ౧౧ నెలల సూర్యరశ్మియున్నవి యంత ప్రధాన మైనవి గావనియు మనము గ్రహింపవచ్చును.

ఆర్యలోక ధ్రువమువిూదనే కూర్చునియుండక, ధ్రువమండలమంతటను వ్యాపించియున్నారనుటకు X, 27, 15, సాక్ష్యమిచ్చుచున్నది. ౭, ౮, ౯, ౧౦ "వీరులు" క్రింది నుండియు, పైనుండియు, ముందునుండియు, వెనుకనుండియు, లేచుచున్నారని యీఋక్కు చెప్పుచున్నది మరియు, యింద్రుడు ముందు, వెనుక, క్రింద, పైన, నున్న జనులచే పూజింపబడు చున్నాడని VII, 4, 1 చెప్పుచున్నది. ఈ రెండుఋక్కులును ఒకేభావమును దెలుపుచున్నవి. యాజ్ఞికులయొక్క సప్త, అష్ట, నవ, దశ, యేకాదశ, విధ విభాగములు ధ్రువమండల మందంతటను వ్యాపించియున్నవని దీనినిబట్టి తెలియుచున్నది. ఆయాప్రదేశములలో సూర్యరశ్మిగల మాసములసంఖ్యను బట్టి, ఆయాప్రదేశములం దీరీతిగ ప్రతివస్తువునందును వివిధ విభాగములు చేయబడెనని స్పష్టమగుచున్నది. ఈఒక్క సూత్రముపైననేతప్ప, యింకొకవిధముగ యీపలుతెరగులగు విభాగములను సమర్థించుటకు వీలులేదు. కనుక, యింత కంటె మంచిసూత్రము నెవరైనను చూపించువరకు మన సిద్ధాంతమే యంగీకార్యముగాక తప్పదు.

—• పదిమందిరాజులు; రావణుడు •—

బంగారువంటిరాజులు పదిమందియు (VIII, 5, 38) యజ్ఞములచేయని రాజులు పదిమందియు (VII, 83, 7) గలరని ఋగ్వేదము చెప్పుచున్నది. దివోదాస అతిథిగ్వుని కుమారుడగు సుదాసుడనువాడు యజ్ఞములుచేయని యీపది

మందిరాజులతో యుద్ధముచేసెననియు, యీయుద్ధమందాతనికి యింద్రవరుణులు తోడ్పడిరనియు ఋ VII, 33, 3–5; 83, 6–8– చెప్పుచున్నది. దీనికే "దశరాజ్ఞ" యుద్ధమనిపేరు. సుదాసు డీయుద్ధమందు తనపురోహితుడగు వసిష్ఠునిద్వారా యింద్రసహాయమును బడసెనట. దీనినిబట్టి, ఆర్యులు మొదట ఆర్యావర్తమునకు వచ్చినప్పు డచ్చటనున్న ఆదిమనివాసులతో చేసినయుద్ధము సూచింపబడుచున్నదని కొందరు పండితు లూహించుచున్నారు. కాని, నాకిదిసమంజసముగనగపడుటలేదు. ఇంద్రుడు అంధకారరాక్షసులతో చేసినయుద్ధము (X, 120, 6) యీరీతిగవర్ణింపబడినదనినాతాత్పర్యము. సప్తదాసులనుసంహరించినసందర్భమందును, వృత్రునిసప్తపురములను నాశనమొనర్చినసందర్భమందును ఇంద్రునకు "సప్తహా" యను బిరుదు గలిగెను. ఇంద్రునిచే భేదింపబడిన గాఢాంధకారము (లేక అధోలోకము) ఒక్క యేడువిధములుగానే గాక, పదివిధములుగకూడ విభజింపబడియున్నదని యిదివరకే మనముపైన వివరించితిమిగద. ఇంద్రునకు సప్తవిధవిభాగముపై "సప్తహా" అను బిరుదుగలిగినప్పుడు, దశవిధవిభాగముపై యింద్రునకు "దశహా" అను పేరేల యుండకూడదు? ఇంద్రునకు "దశహా" యను పేరు ఋగ్వేదమందు ప్రత్యక్షముగ లేకపోయినను, యీ దశరాజ్ఞయుద్ధమునకు భావార్థమీ "దశహా" నామమునే సూచింపుచున్నదని నాతాత్పర్యము. ఇంద్రశత్రువులలో, దశద్యూయు, దశోణి యనువారలు గలరు.

వీరినామములు దశసంఖ్యావాచకములుగ నున్నవి. కనుక, దశసంఖ్యావాచకనామములగు నీరాక్షసులను సంహరించిన యింద్రునకు "దశహా" అను పేరు సార్థకమే యగును. (దీనికి సప్తహా అను పేరే సాదృశ్యము.) అయజ్వాలగు దశరాజులతో బాటు, బంగారువలె ప్రకాశించుచున్న పదిమంది రాజులు సైతము పేర్కొనబడిరి. ధ్రువమండలమందు సూర్యరశ్మిగల పదినెలల కధిదేవతలగు దశాదిత్యులే యీరీతిగ వర్ణింపబడిరనుటలో సందేహము లేదు. ఈపదిమంది బంగారు రాజులును యాజ్ఞికుల కివ్వబడిరట. అనగ, ప్రాచీనయాజ్ఞికులు యజ్ఞములు చేయుచుండిన పదినెలలు సూచింపబడుచున్నవి ఇంద్రునిచే రక్షింపబడినవారిలో "దశద్యు"—పదివిధములుగ ప్రకాశించు వాడొకడు గలడు. ఈయంశముల నన్నిటిని క్రోడీకరించి పరీక్షించినచో, యింద్రశత్రువులగు అంధకారరాక్షసులు వేఱువేరగులుగనే గాక, పదివిధములుగ గూడ వర్ణింపబడియున్నారని తేలుచున్నది. అయజ్వాలగు పదిమందిరాజులతో పోరాడుచున్న, సుదాసున కింద్రుడు తోడ్పడెననగ మరల మనయెప్పటికథయే వచ్చుచున్నది. అనగ, దశవిధములుగ విభజింపబడిన అంధకారరాక్షసులతో యింద్రుడు పోరాడుచున్నాడని తాత్పర్యము.

రాజ శబ్దము క్షత్రియులకేగాక, అంగిరసులకుకూడ ప్రయోగింపబడియున్నది. (I, 139, 7) దీనినిబట్టి, "హిరణ్యసందృషులగు పదిమందిరాజులు," దశహోత్రులు, దశవిధాం

గిరసులు, పదినెలలు యజ్ఞమొనర్చు పదిమంది దశగ్వులు,— యీశబ్దములన్నియు సమానార్థకములగును. బృహస్పతి అంగిరసులలో ప్రధానుడు. ఈతడు సప్తాస్యుడనియు, దశాస్యుడనియు, దశశీర్షుడనియు, ఋగ్వేదము చెప్పుచున్నది. వృత్రాసురుని రాతిగోడలను పగులగొట్టి, అందు బంధింపబడియున్న ఆవులను యీబృహస్పతియే విడిపించెనని ఋగ్వేదము చెప్పుచున్నది. బృహస్పతి భార్య నెవనో యెత్తికొనిపోగా దేవతలామెను మరల బృహస్పతి కిప్పించిరని X, 109, చెప్పుచున్నది. పోయిన ఉషఃకాలము (భార్య) మరల వానిపతులకు (బృహస్పతికి) గన్పట్టుటయే యీరీతిగ వర్ణింపబడినది. ఇంద్రుడు అహల్యాజారుడని (అహల్యాయై జారః) తైత్తిరీయ ఆరణ్యకము I, 12, 3, 4 చెప్పుచున్నది. ఈగాథ సూర్య, ఉషస్సులకు సంబంధించినదని కుమారిల భట్టాచార్యులవారు చెప్పియుండిరి. అహల్య గౌతముని (చాల ఆవులుగలవాని) భార్యయని యిటీవలి సంస్కృతవాఙ్మయమునందు కల్పింపబడియున్నది. కనుక, అహల్య కథ ఉషస్సునకు సంబంధించిన కథయేయనుట స్పష్టము. ఈ కథయే యింకొక విధముగ X, 109 లో "బ్రహ్మజాయా" కథగ వర్ణింపబడియున్నది.

ఈ సందర్భమున, రామాయణములోని ప్రధానాంశములు కొన్నిజ్ఞప్తికి వచ్చుచున్నవి. రామాయణమునకు ఐతిహాసిక (Historical) మూలాధారమేమైన కలదాయని విచారించుట మనపనికాదు. రామాయణములో ప్రతిబిన్న

విషయమును మిక్కిలి విపులముగ వర్ణింపబడియుండుటచే, దీనికేదో ఐతిహాసికాధారముండియే తీరవలెనని గన్పట్టుచున్నది. అయినను, రావణునకు పదితల లెట్లువచ్చెను ? ఇట్టి వికృతపుమానిసి ఐతిహాసిక పురుషు డెట్లగును ? మరియు, శ్రీరాముని తండ్రికి దశ-రథుడు (పదిరథములు గలవాడు) అను పేరెట్లువచ్చెను ? కనుక, రామాయణ గ్రంథకారుడు వైదికగాథలలోనున్న కొన్నియంశములను తీసికొనివచ్చి, అసలుమూలమునందు ఐతిహాసికముగనున్న ప్రధానాంశములతో సమ్మిళితమొనర్చి యీరామాయణకథ నల్లెనని తెలియుచున్నది. ఇంద్రదశత్రువులలో దశోణి, దశమాయ యను వారలు గలరనియు, దశరాజ్ఞయుద్ధమందు సుదాసుడు అయుజ్యాలగు పదిమంది రాక్షసరాజులతో పోరాడవలసివచ్చెననియు ఋగ్వేదము చెప్పుచున్నది. వేదమందు పేర్కొనబడిన యీ పదిమంది రాక్షసరాజులే రామాయణమందు పదితలలు గలిగిన ఒక్క-రావణుడుగ వర్ణింపబడియున్నాడు. దీనికి సాదృశముగ, అంగిరసులలో ప్రధానుడగు బృహస్పతి దశాస్యుడనియు, దశశీర్షుడనియు, వేదమందే గలదు. మరియు, రావణునితమ్ముడు కుంభకర్ణుడు సంవత్సరములో ఆరునెలలు మెడతెగక నిద్రపోవుచుండుననుటచే ధ్రువమండల దీర్ఘరాత్రి సూచింపబడుచున్నది. రావణుడు దేవతలనందరిని బందిఖానలో బంధించియుంచెననియు, తదుపరి శ్రీరాముడు వారలను విడిపించెననియు, రామాయణము చెప్పుచున్నది.

ఇదేరీతిగ, గ్రీకులుకూడ, తమ దేవతలందరు శీతకాలమందు బందిఖానలో బాధింపబడుదురనియు, వేసవికాలములో విడుదలయగుదురనియు తలంచుచున్నారు. దీనినిబట్టికూడ, ధ్రువమండల దీర్ఘరాత్రియే సూచింపబడుచున్నది. రామాయణములో పేర్కొనబడిన హనుమంతు డెవడు? వానికి కోతి పేరెట్లువచ్చెను? శరద్విషువత్ వద్ద దీర్ఘరాత్రిలో బడిపోవుచున్న సూర్యునకు "వృషాకపి" యను పేరు ఋగ్వేదమందు గలదని నే నిదివరకు "మృగశీర్ష" యను గ్రంథమందు వివరించియున్నాను. ఈ దీర్ఘరాత్రిలో పడిపోవుచున్న సూర్యుడగు "వృషాకపి"యే రామాయణమందు హనుమంతుడుగ వర్ణింపబడి యుండవచ్చును. హనుమంతుడు సూర్యగ్రహణ కాలమందు పుట్టెననుటచే నీ యూహకు కొంత బలము చేకూరుచున్నది. "ఓ! సీతా! (నా గేటిచాలూ!) భక్తుపై సర్వసంపదల ననుగ్రహింపుము" — అని ఋగ్వేదము IV, 57, 6-7-లో నొక ప్రార్థనగలదు. వేదములో చెప్పబడిన యీ నా గేటిచాలే, — లేక సీతయే — రామాయణమందు నాగేటిచాలులో పుట్టిన సీతాదేవిగ వర్ణింపబడి యున్నది. సీతాదేవి భూమినుండియే పుట్టెను; తుదకు భూమిలోనికే చొచ్చుకొని పోయెను.

ఉత్తరధ్రువమండలమందు దీర్ఘరాత్రి గడచినపిమ్మట— అనగ, చాలకాలమునకు—ఉషస్సు మనుష్యులకు గన్పించును. ఉషస్సును స్త్రీతోపోల్చిరి. అంగిరసులలో ప్రధానుడగు

బృహస్పతియే యీస్త్రీకి భర్తగ పోల్చబడెను. ఉషస్సు మానవులకు చాలకాలమైనపిమ్మట గన్పడునను అంశమునే యెత్తుకొని,—బృహస్పతి తనభార్యను గోల్పోయెననియు, పిమ్మట కొంతకాలమున కామె యీయనవద్దకువచ్చి గలిసెననియు—ఒకకథగ వేదమందు వర్ణించిరి. బృహస్పతిభార్యను (అనగ, ఉషస్సును) తిరిగి తెచ్చుటకే యింద్రుడు దశరాజ్ఞయుద్ధమొనర్చెను. వైదిక గాథలలోనున్న యీయంశములనే యెత్తుకొని తమ ప్రధానైతిహ్యములతో సమ్మిళితమొనర్చి వాల్మీకులవారు రామాయణకథగను, ' హోమర్ ' అను గ్రీకుపౌరాణికుడు "ఇలియడ్" కథగను అల్లియుండిరి. " ఇలియడ్", "రామాయణ" గ్రంథములరెంటికిని మూలమొక్కటే. అందుచేతనే, యీ రెండు కథలకును పోలికచాల కలదు. గ్రీకులును, భారతీయులును, తదితర ఆర్యసంతతులును ఉత్తరధ్రువమండలమందు కలిసి కాపురమున్నప్పుడు వారికి స్వానుభవ గోచరమైన—ఉషారూపియగు భార్య మరల తన భర్తను పొందుటయను—సృష్టిచమత్కారమే యీరెండు మహాగ్రంథములకును మూలాధార మయ్యెనని చెప్పవచ్చును. అంతియేగాని, కొందర నుకొనునట్లు, వాల్మీకులవారు రామాయణకథను ఇలియడ్ గ్రంథమునుండి కాపీచేయలేదు.

బౌద్ధగ్రంథమగు " దశరథజాతకము " లో సీత రామునకు చెల్లెలని చెప్పబడియున్నది. దీనిభావమేమి? సూర్యుడు ఉషారూపియగు స్త్రీకి సోదరుడుగను, భర్తగనుకూడ వేదము

లందు పోల్పడి యున్నాడు. (VII, 75, 5; VI, 55, 4; X, 3, 3): బుద్ధునకు పూర్వమందు కొందరు శ్రీరాములవారిని సూర్యునితో పోల్పయారంభించినందువలన, సీత (అనగ ఉషస్సు) శ్రీరామునకు (అనగ, సూర్యునకు) చెల్లెలను భావము బౌద్ధ గ్రంథములలోని కెక్కి యుండవచ్చును.


దశావతార కథకూడ ఋగ్వేదమునందు పేర్కొనబడిన "హిరణ్య సంధృష" లను పదిమంది రాజులకును లేక అథర్వవేదమందు పేర్కొనబడిన పదిమంది దేవతలకును, లేక పారశీగ్రంథమందు పేర్కొనబడిన "వరేత్రఘ్న" ని పదియవతారములకును సంబంధించియే యున్నది. పారశీ గ్రంథమందు పేర్కొనబడిన దశావతారములు యేమనగా:— (౧) గాలి (౨) ఎద్దు (౩) గుఱ్ఱము (కల్కి) (౪) ఒంటె (౫) పంది (వరాహము) (౬) యువకుడు (వామనుడు) (౭) కాకి (౮) పొట్టేలు (౯) లేడి (౧౦) మనుష్యుడు (రాముడు). వీనిలో ౩, ౫, ౬, ౧౦ అవతారములు వరుస కల్కి, వరాహ, వామన, రామావతారములను బోలియున్నవి. ఇటీవలి పురాణములలో పేర్కొనబడిన మాత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, రామావతారములకు కొంచ మించుమించుగ ఋగ్వేదమే మూలమని చెప్పవచ్చును. కాని, వీని నన్నిటిని విపులముగ పరిశీలించుట మనపనికాదు. ఈ విషయము నెత్తికొన్నచో నిది ప్రత్యేకమొక మహాగ్రంథ మగును గాన దీని నింతటితో వదలివేయుదము. నే నింతవరకు

వైదిక, పౌరాణిక గాథలనుగూర్చి యీ గ్రంథమందు సూచించి వదలి వేసిన యంశముల నెల్ల మరల ప్రత్యేకముగ నెత్తికొని, వానిని ధ్రువసిద్ధాంతముపై సమన్వయింపబూనినచో నిది యొక మహాగ్రంథమగును. ఇది బహు కష్టసాధ్యమైనపని. దీని కెంతయో యోపికయుండవలెను. అదిగాక, మన ప్రస్తుతాంశమున కిది సంబంధింపదు; గనుక దాని నిట వదలి వేయుదము.

ఇంతవరకు మన సిద్ధాంతమును ధ్రువపరుచు గాథలను పరిశీలించి చూచితిమి. ఇట్టివే మరి యింక యెన్నియో గలవు. ఉదాహరణ:- మిత్రావరుణులు పరస్పరసంబంధము గల దేవతలని చెప్పబడిరి. మిత్రుడు ౬ నెలల దీర్ఘదివసమును, వరుణుడు ౬ నెలల దీర్ఘరాత్రమును సూచించుచున్న వారగుటచే వారు పరస్పరసంబంధముగల దేవతలనుట సహజముగనే యున్నది. మరియు, వరుణుడు "రాత్రులను కౌగలించుకొనుచున్నాడ"ని (క్షపః పరిశస్వజే) ఋ VIII, 41, 3 చెప్పుచున్నది. అనగ, వరుణుడు దీర్ఘరాత్రిని సూచించు దేవతగనున్నాడు. మేఘ, ఉషస్సిద్ధాంతములచేగాని, వసంతసిద్ధాంతముచేగాని, సమన్వయింపబడజాలని పెక్కుగాథలను మన ధ్రువసిద్ధాంతము సరళముగ సమన్వయింపగలిగినది. వృత్రవధ సంవత్సరమున కొక్కమారే జరుగునో, వృత్రవధవలన జ్యోతిర్జలముల కేకకాలమందే బంధమోక్షణమెట్లు గలిగెనో, శంబరాసురయుద్ధము శరదృతువు నలుబదియవ తిథి నాడేల

ప్రారంభమయ్యెనో, యీ యుద్ధము "పరావత్" మండల మందేల జరిగెనో, దీర్ఘతముడు పడియున "యుగ" = (మాస) మందేల అశక్తుడయ్యెనో, అదితి తన యెనిమిదవ కుమారుడగు మార్తాండు నేల పారవేసెనో, "త్రిత" నేల నొంటిగా పడెనో, విష్ణుని తృతీయపాద మేల మనకు గాన్పింపదో — యీ మొదలగు గాథలవల్ల వసంత, మేషు, ఉషస్సిద్ధాంతములు సమన్వయింపజాలకపోయెను. కాని, మనధృవసిద్ధాంత మీగాథలనే గాక, ఇంక పెక్కింటినిసైతము సాత్పత్తికరముగను, సరళముగను, సమన్వయింపగలినది. వృత్రి, సప్తవధ్రి, అదితి, దీర్ఘతమ, సూర్యచక్రాది గాథలలోనున్న కొన్ని ప్రత్యేకవాక్యములచే ధ్రువమండల మందలి ౭, ౧౦ మాసముల సూర్యరశ్మిగల ప్రదేశములు సూచింపబడుచున్నవి. ఇప్పటివరకు, మహాపండితు లందరిచే దుర్గ్రాహ్యములుగ వదలివేయబడిన యెన్నియో యంశముల నింతసరళముగ సమన్వయింపగలిగిన యీ ధ్రువసిద్ధాంతము నందరంగీకరింపక తప్పదు. ఇంతమాత్రముచే యిదివరకున్న వసంత, మేషు, ఉషస్సిద్ధాంతములను పూర్తిగ త్రోసివేయవలనని నేను చెప్పను. నేను చెప్పుసంగతి యేమనగ:— ఇప్పటివరకు దుర్గ్రాహ్యములుగ పండితు లందరిచే వదలివేయబడిన వైదికగాథలనేమి, వైదికపరంపరలనేమి, తదితరాంశములనేమి, పెక్కింటిని, మా ధ్రువసిద్ధాంతము చక్కగ సమన్వయింపుచున్నది. మరియు, వైదికగాథలకు భావార్థములను దీయుటలో మా ధ్రువసిద్ధాంతము మీ వసంత, మేషు,

ఉపసిద్ధాంతము లన్నింటికంటె యెన్నియో మణుంగు లెక్కువ శక్తిసామర్థ్యములు గలదని ఘంటాపథముగ చెప్పగలము. మా ధ్రువసిద్ధాంతమును ఋజువుపరచుటకు యీ ఒక్క వైదికగాథాప్రమాణములే చాలును. దీనికితోడు ఋగ్వేదము నుండి ప్రత్యక్షవాక్యములను, స్వతంత్రప్రమాణములనుకూడ యిదివరకే చూపియున్నాము. ఇదిగాక, అర్వాచీన భౌతిక పండితులు నేటివరకొనర్చియున్న భూగర్భ, భూనిక్షేపపరిశోధనలవలన కూడ యీ ధ్రువసిద్ధాంతము ఖండితముగ ఋజువగుచునే యున్నది. ఇన్నిప్రమాణములచే ఋజువైన సిద్ధాంతమును పండితలోక మంగీకరింపదా? శాస్త్రప్రమాణములకును, హేతువాదమునకును, బద్ధులైయున్న పండితులెల్లరీ సిద్ధాంతము నంగీకరింపకుండ తప్పించుకొనలేరు.



వైదిక నిలయము

పదునాల్గవ అధ్యాయము.

అవైదిక ప్రమాణము.

(పారశీక వేదప్రమాణము.)

ధ్రువసిద్ధాంతమును స్థాపించుటకు మన మిదివరకు వైదికప్రమాణములతో పాటు పారశీకుల వేదమునుండి కూడ అచ్చటచ్చట ప్రమాణముల నెత్తి చూపించి యున్నాము. భారతీయులకు వేదమంత ప్రాచీన గ్రంథము, పారశీకులకు అవైదికగ్రంథము కూడ అంతప్రాచీనమును, మాన్యమునైనదని మనము గ్రహింపవలెను. వైదిక, అవైదికగ్రంథము లేక-మూలమునుండియే పుట్టియున్నవి. వీనిని మన ఆర్యన జాతి ప్రాచీనధనమైన కవలగ్రంథములుగ నెన్నవచ్చును. ఈ రెండు గ్రంథములును అన్యోన్యపూరకములుగ నున్నవి. కావున, వేదములో లేని యంశములను అవైదిక గ్రంథమునుండియు, అవైదికగ్రంథములో లేని యంశములను వేదమునుండియు గ్రహింపవచ్చును. దీర్ఘరాత్రులు, దీర్ఘఉషస్సు, మొదలగు ధ్రువమండల సృష్టిచమత్కారములనుగూర్చి చెప్పు ప్రత్యేక వాక్యములును, గాథలును, పెక్కులు మన భారతీయుల

వేదమందు గానవచ్చుచున్నను, ఆర్యుల ధ్రువనివాసమును గూర్చిగాని, తదుపరి వారేయే కారణములచే తమ మూల స్థానమును వదలివేసి దక్షిణాపథములకు లేచివచ్చిరో స్పష్టముగ దెలియజెప్పు వాక్యములుగాని, గాథలుగాని, మన భారతీయ వేదమందు లేవు. కాని, మన యదృష్టవశమున పారశీకుల అవైస్థిక వాఙ్మయమందీలోపము పూర్తిచేయబడినది. ఇదివర కచ్చటచ్చట నుదాహరించియున్న అవైస్థిక ప్రమాణములనుబట్టి పారశీకుల పూర్వజులకు కూడ ఆరు మాసముల రాత్రింబవళ్ళనుగూర్చియు, మూడుమాసముల దీర్ఘరాత్రిని గూర్చియు, దివ్యజలసంచారమును గూర్చియు పూర్తిగ తెలియునని స్పష్టమగుచున్నది. భారతీయ వేదమందు పేర్కొనబడిన యీ ధ్రువమండల లక్షణములేగాక, ఇందులేని మరికొన్ని ప్రధానాంశములుకూడ పారశీకుల అవైస్థిక గ్రంథమం దెక్కువగ గానవచ్చుచున్నవి. ఉత్తరధ్రువమండలమందలి ప్రాచీన మూలస్థానమును గూర్చి అవైస్థికగ్రంథ మెక్కువ విపులముగ వర్ణించియున్నది. ఆ ప్రదేశమందు మొట్టమొదట ఆర్యులు కాపురమున్నప్పుడచ్చటి శీతోష్ణాది పరిస్థితు లెట్లుండెనో, తదుపరి యెట్లు మారెనో, యేకారణముచే మారెనో, అంతట ఆర్యులామూలస్థానమును వదలివేసి యేయే దేశములకు లేచివచ్చిరో — యీ మొదలగు అంశములన్నియు పారశీక వేదమందు స్పష్టముగ పేర్కొనబడియున్నవి. పారశీక వేదవాఙ్మయమందు ధర్మశాస్త్రముగ నెన్న

బడుచున్న "వెండిడాడ్" గ్రంథముయొక్క మొదటి రెండధ్యా
యములును మన కీసందర్భమున చాల యుపకరించుచున్నవి.
మొదటి యధ్యాయములో:— పారసీకదేవుడైన "అహురా-
మజ్దా" యను దేవుడు ౧౬ దేశములను సృజించెనట. మానవులకు
నివాసయోగ్యమైన భూములను దేవుడిట్లు సృజించుకొనుచు
పోగా, దుష్టస్వభావుడగు "అంగ్రమైన్యు" వను రాక్షసు
డీభూములకు ఉపద్రవములను గల్పించి మానవు లచ్చట నివ
సించుటకు వీలులేకుండ పాడుచేయుచుండెను.

దేవుడుచేసిన సృష్టులను, రాక్షసు డొనర్చిన ప్రతి
సృష్టులను దెలుపు నీప్రక్క పుటలోని పట్టికలో వివరింపబడిన
ఆ పదునారుభూములలో కనీసము పదునొకటైనను మన మిప్పటి
కిని నిజమైన దేశములుగ గుర్తింపవచ్చును. కనుక, యివి
పుక్కిటి పురాణములని త్రోసివేయుటకు వీలులేదు. కాని
యీపట్టికలో మొట్టమొదటి దేశమైన "ఐర్యనవైజో" యను
నది నిజమైన దేశమా లేక పుక్కిటిపురాణమా యను విషయమై
పండితులు భిన్నాభిప్రాయులై యున్నారు. (ఐర్యన=ఆర్యుల
యొక్క; వైజో = (సం) బీజము.) ఐర్యనవైజో యనునది
ఆర్యుల మూలస్థానమని దాని పేరే చెప్పుచున్నది. కాన,
యిది నిజమైన దేశమైనచో యిది యెచ్చటనున్నదో మనము
నిర్ణయింపవలసియున్నది. ఇది మొదటివిషయము. ఇక, రెం
డవ విషయమేమనగ, యీ పదునారుదేశము లిట్లు పేర్కొన
బడుట కర్థమేమి? ఆర్యులు తమ మూలస్థానమును వదలివేసిన

దేవుడు చేసిన సృష్టులను, రాక్షసు డొనర్చిన ప్రతిసృష్టులను తెలుపు పట్టీ.

వరుస సంఖ్య	దేవుడు సృజించిన మంచి భూములు.	అవైదికపండితుల నిర్ణయ ప్రకారము ఇప్పటి పేర్లు.	అంగ్రమైన్యుడను రాక్షసు డొనర్చిన యుపద్రవములు.
౧	ఐర్యన వైజో	?	అతిచలి, మంచు.
౨	సుగ్ధ	సామర్ ఖండ్	జోరీగలు, కందిరీగలు.
౩	మోరు	మర్వ్	పాపభూయిష్టమగు కామాంధత.
౪	బాక్ధీ	బాల్క్	పెద్దచీమలు; క్రూరమృగములు,
౫	నిసాయ	?	అవిశ్వాసము.
౬	హరోయు (సంస్కృతం:శరయు)	హీరట్; (హరినదీ ప్రాంతము)	దోమలు; దారిద్ర్యము.
౭	వైకెరెట	కాబూల్, లేక సెగస్థాన్	(వైరికాస్ ?)
౮	ఉర్వ	కాబూల్, లేక ఇసఫన్ ప్రాంతము	అశుచి; గర్వము; రాజులక్రౌర్యము.
౯	ఖెంట	గుర్ జాన్, లేక కంధహార్	అస్వాభావికమైన పాపము.
౧౦	హరస్వతి (సరస్వతి)	హరూట్	శవములను భూస్థాపనచేయుట.
౧౧	హైతుమంత్ (సేతుమత్)	హెల్ మెండు	మిడతలు; దుష్టమాంత్రికులు.
౧౨	రఘు	రై	అవిశ్వాసము; నాస్తికత.
౧౩	చక్ర	కొరసాన్ లో నొకపట్టణము ?	శవదహనము.
౧౪	వరేణ (వరుణ)	ఘిలాన్ (?)	విదేశస్థుల నిరంకుశపరిపాలన.
౧౫	హప్త-హిందు (సప్తసింధు)	పంజాబు	అత్యుష్ణము.
౧౬	రంఘ (రసా)	కాస్పియన్ సముద్రము; లేక మెసపొటేమియా: అర్యస్థాన్-ఇ-రూమ్-?	శీతలము; భూకంపము.

పిమ్మట యీ దేశములగుండ క్రమముగ సంచారము చేయుచు వచ్చిరని యర్థమా? లేక, యీ గ్రంథరచనా కాలమునాటికి పారశీకులకు తెలిసిన భూములన్నియు నీవిధముగ పేర్కొనబడి యున్నవని మాత్రము అర్థమా? ఈవిషయమై కూడ పండితులు భిన్నాభిప్రాయులై యున్నారు. ఆకాలమునాటికి పారశీకులకు తమ దేశములోనున్న యీ పదునారు భూములు మాత్రమే తెలియుననియు, కాన వానిని వారిచ్చట వివరించిరనియు, వానిలో మొట్టమొదటిది యగు "ఐర్యనవైజ్" యను భూమి వారికి తెలిసినంతవరకు తూర్పు సరిహద్దుగను, చిట్టచివరిదియగు "రంఘ" యను భూమి పశ్చిమపు సరిహద్దుగను నుండెననియు కొందరు పండితులు తలంచుచున్నారు. దీనినిబట్టి పారశీక దేశమునకు తూర్పు సరిహద్దున నున్న "ఆక్సస్," "జక్సార్టీసు" నదుల మూలస్థానమే "ఐర్యనవైజ్" యనబడవలెను. మరియు, పారశీకదేశమునకు పశ్చిమ సరిహద్దుననున్న మెసపొటేమియా దేశమే పదునారవది యగు "రంఘ" దేశమగును— ఇది కొందరి పండితుల మతము. కాని, మరికొందరి మతమేమనగ:— ఆర్యులకు మూలస్థానమైన "ఐర్యనవైజ్" యను భూమి చాల ఉత్తరమున నున్నదనియు, కారణాంతరములచే ఆర్యులీభూమిని వదలివేసి, దక్షిణాభిముఖులై క్రమక్రమముగ యీ పదునారు భూములగుండ దాటివచ్చుచు, తుదకు "రంఘ" యను దేశమునకు చేరిరనియు మరికొందరు పండితులు తలంచుచున్నారు. ఈ

దృష్టితో చూచినచో "సుగ్ధ" (సామర్ ఖండ్) మొదలు "హప్త — హిందు" (పంజాబు) వరకు గల పదునాల్గు భూములును ప్రాచీన పారశీకులు కాలక్రమమున తమమార్గమందు దాటుచు వచ్చిన భూములై యుండవలెను. ఈ రెండు మతములలో నేది సత్యమైనదో మన మిప్పుడు నిర్ణయింపవలసియున్నది. ఈనిర్ణయమంతయు "ఐర్యనవైజో" యొక్క స్థానమును స్థిరపరుచుట పై పూర్తిగ ఆధారపడియున్నది. కనుక, మన మిప్పుడీ "ఐర్యనవైజో" యొక్క స్థలమును నిర్దేశింతము.

ఐర్యనవైజోను వర్ణించు సందర్భమున "వెందిదాదు" గ్రంథమందు "ఐర్యనంవైజో వంఘుయావో దాయిత్యయో" యను వాక్యముగలదు. (వంఘుయావో = మంచి) దీనికి "డార్మెస్టటర్" యను పండితుడు "మంచినదియైన దాయిత్యనది ప్రక్కనున్న ఐర్యనవైజో" — అని అర్థముచేసెను. ఈ "దాయిత్య" నదికే "వంగుహి" నదియను పేరుకూడ గలదని యీపండితుడు తలంచుచున్నాడు ఈ "వంగుహి" యను పేరటీవల పారశీకదేశమునకు తూర్పుకొనసనున్న యొకానొక నదికి చెందియుండుట తటస్థించెను. కనుక, దానిప్రక్కనున్న ఐర్యనవైజో యనుభూమికూడ పారశీకదేశమునకు తూర్పుకొనయందే యుండితీరవలెనని, యీపండితునిమతము. కాని, దీనికి రెండు, మూడభ్యంతరములు గలవు. (౧) అసలు వాక్యములో నున్న "దాయిత్య" శబ్దమునకు "నది" = (River) యను అర్థమగునో కాదో సందేహాస్పదము.

ఈవిషయమై తక్కిన పండితులు భిన్నాభిప్రాయులై యున్నారు. (౨) ఒకవేళ, "దాయిత్య" యనగ 'నది'యే యని యొప్పు కొన్నను, దీనికి "వంగుహీ" యను యింకొక పేరేల వచ్చెనో డార్మెస్టటర్ గారు చెప్పలేదు. ఈ పదములు రెండును రెండుభిన్ననదులయొక్క పేర్లని యింకొక గ్రంథమందు చెప్పబడియున్నది. అదిగాక, వంగుహీనది యొక్క పేరు అసలువాక్యములో నెందున్నైన లేనేలేదు. (౩) ఒకవేళ, అసలువాక్యమందున్న "దాయిత్య" శబ్దము "వంగుహీ" నదిని దెలుపుచున్నదని యొప్పుకొన్నను పారశీకదేశమునకు తూర్పు కొనయందు ప్రవహించుచు నిటీవల "వంగుహీ" యను నామకరణమొనర్పబడిన యీనది యొడ్డుననే ప్రాచీనమూలస్థానమగు "ఐర్యనవైజో" గలదని నాదించుటసాసాసము. ఏలయనగ, ప్రజలు క్రొత్తదేశములకు వలసబోయినప్పుడు తమ ప్రాతదేశములోనున్న ప్రాతపేర్లనే యీక్రొత్తదేశమందలి క్రొత్తవస్తువులకు పెట్టుచుండుట ఆచారమైయున్నది. ఉదాహరణము:— ఇంగ్లాండునుండి కొందరు ప్రజలు మొట్టమొదట అమెరికాదేశమునకు వలసబోయినప్పుడు అచ్చటనున్న కొన్ని ప్రదేశములకు "ఇంగ్లండు" అని నామకరణ మొనర్చిరి! అట్లాయినచో, "ఇంగ్లండు" అమెరికాఖండమం దున్నదని చెప్పవలసినదేనా? అట్లే "వంగుహీ" యను నది ప్రాచీన గాథలలోనున్న దివ్యజలవాహిని పుక్కిటిపురాణములలో (గాథలలో) నున్న యీ "వంగుహీ" నామమునే, ఇటీవల

పారశీకులు క్రొత్తగ పారశీకదేశమునకు వలసవచ్చినప్పుడు అచ్చట తూర్పుకొనను పారుచున్న యొకానొకనదికి పెట్టిరి. అంతమాత్రముచే అతిప్రాచీనమూలస్థానమగు యీ "ఐర్యన వైజో" యను భూమి, ప్రాతపేరుతో క్రొత్తగ నామకరణ మొనర్పబడిన యీ తూర్పునదియొడ్డుననే యున్నదని చెప్ప వచ్చునా? అదిగాక, ఐర్యనవైజోలో "రంఘు" యను దివ్య వాహిని గలదని పార్సీగ్రంథము చెప్పుచున్నది. "రంఘు" యను ఒక నది పారశీకమునకు పశ్చిమకొనయందు పారు చున్నది. అట్లయినచో, "ఐర్యనవైజో"ను తీసికొనిపోయి పారశీకదేశమునకు పశ్చిమకొనయం దేలపెట్టకూడదు?

లోగడ వివరించిన పట్టీలో "రంఘు" యను భూమి చిట్టచివరిది. పారశీకదేశమునకు పశ్చిమకొనయందు పారు నొకానొక నదికి యిటీవల "రంఘు" యను పేరుండెను. కనుక, యీ పట్టీలోని "రంఘు" యను భూమికూడ పారశీక మునకు పశ్చిమకొనయందున్న మెసపొటేమియా యనియో, లేక కాస్పియన్ సముద్రమనియో డార్మెస్టటర్ గారు తలంచు చున్నారు. ఈ రీతిగ పట్టీలో మొదటనున్న "ఐర్యనవైజో"ను తీసికొనిపోయి పారశీకమునకు తూర్పుకొనయందును, చివర నున్న "రంఘు"ను తీసికొనిపోయి పశ్చిమకొనయందును డార్మెస్టటర్ గారు పెట్టుచున్నారు. "రంఘు" యనునది ప్రాచీన పారశీక గ్రంథములందు దివ్యజలవాహినిగనున్నది. ఇదియే పంజాబులోనున్న సింధునదియొక్క యుపనదియైన

"రసా" నదిగ ఋగ్వేదమందు పేర్కొనబడియున్నది. కనుక, యీ "రసా" నది భూమిమీద పాఱు నేరుగనుండు ఋగ్వేదమందు గలదు. దీనినిబట్టి, "రంఘు" యను భూమి పంజాబునకు దగ్గరగనుండి యుండవలెను. పూర్వోత్తర సందర్భములను బట్టి చూచినను యీ యూహయే యెక్కువ సమంజసమైనదిగ గన్పట్టుచున్నది. ఏలయనగ, పైపట్టీని పరిశీలించి చూచినచో యీ "రంఘు" యను ౧౬వ. భూమి, గంగానది యగు "సప్త-హిందు" లేక పంజాబునకు ప్రక్కనే యున్నట్లు స్పష్టము గాగలదు. కనుక, "రంఘు" భూమిని తీసికొనిపోయి పారశీకమునకు పశ్చిమకోనయందు పారవేయుట సమంజసముకాదు. ఈవిధముగ, ప్రాచీననామములతో యిటీవల నామకరణ మొనర్పబడిన నదులపేర్లనుబట్టి పాశ్చాత్య పండితులు "ఐర్యనవైజో" యొక్క స్థలనిర్దేశమును చేయబూనుట చాల తప్పుపద్ధతి. ప్రాచీనార్యుల మూలస్థానము ఉత్తరభూములలో నుండజాలదను సాంప్రదాయకాగ్రహమును (Prejudice) మనస్సులందు పెట్టుకొని పనిచేయుటచే పాశ్చాత్యులగు వారి పండితులు తప్పుత్రోవల త్రొక్కవలసివచ్చెను. ఐర్యనవైజో యొక్క శీతోష్ణాది పరిస్థితులను మిక్కిలి విపులముగ, కండ్లకు గట్టినట్లు, వర్ణించుచున్న ప్రత్యక్షవాక్యములే అవెస్థిక గ్రంథములందుగన్పట్టుచుండగ, యీపండితులు వానిని పుక్కిటిపురాణములని త్రోసివేసి, వానివంకనైనను చూడక, తమసాంప్రదాయకాగ్రహముచే యేవో వెఱ్ఱిమొఱ్ఱియూహలను మన

స్ననందుపెట్టుకొని తమ స్వకపోలకల్పితములగు వట్టియంచ
నాలతో (Estimates) గాలిలో మేడలగట్ట యత్నించుటచే
వీరందరు తలకొక త్రోవలోపడి ప్రాచీనగ్రంథములలో
యిప్పటివరకు పరంపరలుగ భద్రపరుపబడియున్న సత్యమగు
నైతిహాసికాంశములను కనిపెట్టలేక చీకటి పరువులు పెట్టు
చున్నారు.

పారశీకులకు మూలస్థానమును, స్వర్గమును నైన
ఐర్యనవైజో యను భూమి మొట్టమొదట సంతత వసంతసమ
య సౌభాగ్యసంపదలతో తులదూగుచుండెననియు, తదుపరి
కొంతకాలమునకు అంగ్రమైన్యుడను రాక్షసుడు వచ్చి యీ
సౌభాగ్యమునంతను నాశనమొనర్చి, అతి చలిబాధను, మంచు
గడ్డలను కల్పించి ఆస్థలము మానవ నివాసమునకు నిరుప
యోగముగ జేసెననియు వందిదాదు గ్రంథముయొక్క ప్రథ
మాధ్యాయమందు స్పష్టముగ వర్ణించి యున్నారు. ఈ వర్ణన
గల వాక్యమున కర్థము చెప్పుటలో పండితులు కొంతవరకు
భిన్నాభిప్రాయులై యున్నను మొత్తము మీద పండితు
లందరీ క్రింది మూడంశములలో మాత్ర మేకీభవించియే
యున్నారు.

(౧) దేవుడు మొట్టమొదట "ఐర్యనవైజో" యను
మంచిభూమిని సృజించెను. (౨) కొంతకాలమైనపిమ్మట,
అంగ్రమైన్యుడను రాక్షసు డీభూమిలో అతిచలిని, మంచును
గల్పించెను. (3) అంగ్రమైన్యుని ప్రతిసృష్టివలన పదిమాస
ముల శీతకాలమును, రెండు మాసముల వేసవియు కలిగెను.

అంగ్రమైన్యుని ప్రతిసృష్టివలన ఐర్యనవైజోలోని పరిస్థితులు తలక్రిందై పదినెలల శీతకాలమును, రెండు నెలల వేసవియుగలిగెనని తెలియుచున్నది. కనుక, అంగ్రమైన్యుడీయుపద్రవమును గలిగింపకపూర్వము అచ్చటి పరిస్థితు లెట్లుండెనో మనము గ్రహింపవచ్చును. సంవత్సరములో పదినెలలు అహ్లాదకరమగు వేసవియు, రెండు నెలలుమాత్రమే శీతకాలమును నుండి యుండవలెను. అంగ్రమైన్యుడు వచ్చి దీని తలక్రిందుచేయుటచే ఐర్యనవైజో యందిప్పుడు పదిమాసముల చలిబాధయు, రెండు నెలల వేసవియుగలిగెను. ఈవేసవిలోకూడ చెట్లు, చేమలు, నీరు, భూమి, సమస్తపదార్థములును చల్లగనే యుండెనని యీ వాక్యమందు గలదు. అనగ, యీ రెండు నెలల వేసవిలోకూడ చలియుండుటచే మనుష్యులు నివసించుటకు యోగ్యముగ లేకుండెను. ఇప్పుడు సంవత్సరము పొడవునను యీ రీతిగ చలియు, మంచు నుండు ప్రదేశము ధ్రువమండలముగాక మరి యేదేశము గలదు? ధ్రువప్రదేశమును స్పష్టముగ సూచించుచున్న యీ వర్ణనమును వదలివేసి పండితులు తమ స్వకపోలకల్పితములగు వట్టి యూహాలలో చిక్కుకొని పరిభ్రమించుచుండుట చాల విచారకరమైన సంగతి.

మొట్టమొదట ఐర్యనవైజోలో నున్న మంచి శీతోష్ణ పరిస్థితులు కొంతకాలమున కెట్లు మారిపోయెనో అవెస్థక గ్రంథము చక్కగ వర్ణించియున్నది. ఈ వర్ణనమంతయు

పుక్కిటిపురాణమని పండితులు త్రోసివేసిరి. శీతోష్ణపరిస్థితు లలో అస లిట్టి మార్పు జరుగుట కవకాశ మున్నదా యని పండితులు సంకోచించుచుండిరి. ఇట్టి మార్పు నిజముగ జరిగినదను నమ్మకము వారికి లేకపోవుటచేతనే స్వర్గతుల్యమగు ఐర్యనవైజోను తీసికొనిపోయి యిప్పుడు మంచుతో బిగుసుకొనిపోయియున్న యీ పాఠుడుత్తరధ్రువమండలమం దెట్లు పెట్టునుమా యని పండితులు సంశయించుచుండిరి. కాని, ౩౦, ౪౦, సంవత్సరములక్రింద చేయబడిన భూగర్భ, భూనిక్షేప పరిశోధనలవలన ధ్రువమండలమందలి శీతోష్ణ పరిస్థితులొకప్పుడు సంతత వసంతసమయముగ నుండెననియు తమపరి హిమప్రళయముచే ఆ మంచిపరిస్థితులన్నియు పూర్తిగ మారిపోయి యిప్పుడాప్రదేశము మంచుగడ్డలతో పేరుకొని పోయెననియు సిద్ధాంతీకరింపబడియున్నది. ఈరీతిగ భూగర్భ శాస్త్రవేత్తలు నిన్నగాక మొన్న కనిపెట్టిన యంశమునే యెన్నియో వేలసంవత్సరములక్రిందట పారశీకులు తమ అవైస్థికగ్రంథమందు స్థిరాక్షరములతో భద్రపరచి యున్నారు. ఇట్టియంశము అవైస్థిక గ్రంథమందు స్పష్టముగ వివరింపబడి యున్నను పండితులు తమ సాంప్రదాయికాగ్రహముచే దానిని నమ్మలేదు. కాని, ఆధునికభౌతికశాస్త్రవేత్తలే యీయంశమునిప్పుడు యథాశాస్త్రీయముగ ఋజువుపరచి యుండుటచే పండితలోకమిప్పటికైనను తమసంకోచములను, అనుమానములను, సాంప్రదాయకాగ్రహములను దూరముగ

నుంచి, హిమప్రళయమునకు పూర్వమందు నందనవనము వలె సంతత వసంతసమయసౌభాగ్యసంపదలతో తులదూగుచుండిన ధ్రువమండలప్రాంతమే పారసీకులపూర్వులకు ఐర్యనవైజో యను స్వర్గతుల్య నివాసస్థానముగ నుండెననియు, తదుపరి అంగ్రమైన్యుడొనర్చిన శీతోపద్రవమునందు – అనగా, హిమప్రళయమువలన–ఆప్రదేశము నివాసయోగ్యముగామిచే వారచ్చటనుండి లేచివచ్చిరనియు తెలిసికొందురుగాక. అవెస్థిక గ్రంథ మొనర్చిన అంగ్రమైన్యుని శీతోపద్రవ వర్ణనమును, యిప్పటి భూగర్భశాస్త్రవేత్తలు యథాశాస్త్రీయముగ గనుగొనిన హిమప్రళయ వర్ణనమును పోల్చినట్లు, ఒకేరీతిగ, సర్వవిధముల సరిపోవుచున్నది. కనుక, అవెస్థిక గ్రంథ వర్ణనమును మనము నమ్మకపోవుట కేవలము అవివేకమేగాని వేరొండులేదు. ఈ వర్ణనప్రకారము ఐర్యనవైజోయం దిప్పుడు సంవత్సరములో పదిమాసములు అతిచలియు, రెండుమాసములుమాత్రమే కొంచెము చలితోగూడిన వేసవియు నుండవలెను. ఇట్టి శీతోష్ణస్థితి యిప్పుడెచ్చటనున్నది?—ఉత్తరధ్రువమండలమం దున్నది. కనుక, ఐర్యనవైజో కూడ ధ్రువమండలమందే యుండితీరవలెను. ఇందులకు సందేహమెంతమాత్రమును లేదు. దీనిని ధ్రువపరుచుటకు మన మిదివరకు చర్చించియున్న వైదిక గ్రంథప్రమాణములే ప్రబలసాక్ష్యములుగ నున్నవి. హిమప్రళయమునకు పూర్వము ఉత్తరధ్రువమందు సంవత్సరములో పదిమాసములు ఆహ్లాదకరమగు వేసవియు, రెండుమాసములు వెచ్చని

హేమంతమును — అనగ, మొత్తముపై సంతత వసంత సమయముగ — నుండెనని భూగర్భశాస్త్రవేత్తలు యథా శాస్త్రీయముగ నిర్ధారణ చేసియున్నారు. అంగ్రమైన్యూడు రాకపూర్వ మీ " ఐర్యనవైజో " లో కూడ పదిమాసములు చక్కని వేసవియు, రెండుమాసములు శీతకాలము నుండి హాయిగనందనవలెను, స్వర్గతుల్యముగనుండెనని అవైదిక గ్రంథములవలన తెలియుచున్నది. దీనివలకూడ, సంతత వసంతసమయముగనున్న ధ్రువమండలమే పారశీకులకు ఐర్యనవైజో యను స్వర్గముగనుండెనని ఋజువగుచున్నది. ఉత్తర ధ్రువమండలమందు పదిమాసములు సూర్యరశ్మియు, రెండు మాసములు చలితోగూడిన దీర్ఘరాత్రియు గలదని మన మిదివరకే ఋజువుపరచియున్నాము. గవాం అయనం మొదలగు వార్షికసత్రములు పదిమాసములే జరిగెననియు, రోమక్ సంవత్సరములో పదిమాసములేయుండెననియుకూడ వివరించి యున్నాము. కనుక, ఐర్యనవైజోలోనున్న పదిమాసముల వేసవికూడ వైదిక గ్రంథములోనున్న " మానుషాయుగా " యను పదిమాసములతో సరిపోవుచున్నది. ఇక, తిష్ట్ర్య-అపోష యుద్ధకాలమువలనను, శవమున కంత్యక్రియ లొనర్పకుండ శీతకాలములో, చీకటిలో, నెల, రెండు నెలలకైనను యింటిలోనే పెట్టుకొనియుండవలెనని చెప్పుటచేతను, ఐర్యనవైజోలోనుండిన దీర్ఘరాత్రిస్థిరపడుచున్నది. మన మొకసారి ఐర్యనవైజోను తీసికొనిపోయి ధ్రువమండలమందు పెట్టిన

పిమ్మట అచ్చట దీర్ఘరాత్రియుండితీరవలెను. అది యిప్పుడున్న పదినెలల శీతకాలమధ్యమందు వచ్చుచున్నది. కాని, అంగ్రమయిన్యువకు పూర్వము దీర్ఘరాత్రి రెండు నెలల శీతకాలములోనే వచ్చియుండెను. ఇంతవరకు చెప్పిన సారాంశమేమనగ:— ఐర్యనవైజోయను పారశీకుల స్వర్గము ఉత్తరధ్రువమండలమందుండెను. అంగ్రమైన్యువు రాక పూర్వము — అనగ, హిమప్రళయమునకు పూర్వము — అచ్చట సం॥ లో పదినెలలు ఆహ్లాదకరమైన సూర్యరశ్మితో గూడిన వేసవియు, రెండునెలలు అతిచలిలేనిదీర్ఘరాత్రియు నుండెను. కాని, అంగ్రమైన్యు తెచ్చిన శీతలోపద్రవమువలన అచ్చట సంవత్సరములో పదినెలలు అతిచలియు, దానిమధ్య దీర్ఘరాత్రియు, రెండునెలలు చలితో కూడిన వేసవియు తటస్థించెను. ఈ దుర్భరపరిస్థితులే యిప్పటికిని ఉత్తరధ్రువమండలమందున్నవి. ఇట్టి భూమి హిమప్రళయముచే నిరుపయోగముగ చేయబడుటచే, ఆర్యులా స్వర్గమును, ఐర్యనవైజోను, వదలివేసి దక్షిణాభిముఖులై వెందిదాదునందు వర్ణింపబడిన ౧౬. భూములగుండ దాటివచ్చుచు, తుదకు "రంఘ" యను భూమివరకు (కాబూలుదగ్గరవరకు) వచ్చియుండిరి.

ఐర్యనవైజోలో యేడుమాసముల వేసవియు, అయిదుమాసముల శీతకాలముండెనని యింకొక ప్రాచీనపహ్లవ్యామొకటి "బుందహిష్" గ్రంథమందు గలదు. ఈ వాక్యమే

పైన చర్చించిన "వందిదాదు" వాక్యమునకు చేర్చబడియున్నది. ఈ యైతిహ్యముచే అంగ్రమైన్యునకు పూర్వమున్న శీతోష్ణస్థితి పేర్కొనబడి యున్నదనుట కెంతమాత్రమును సందేహము లేదు. ఇంతవరకు అంగ్రమైన్యుని యుపద్రవమునకు పూర్వమందు ఐర్యనవైజోలో నున్న శీతోష్ణ స్థితిని తెలియపరుచు వాక్యములు రెండు దొరకినవి.

(౧) సంవత్సరములో పదినెలలు వేసవియు, ౨ నెలలు శీతకాలముండును. (అంగ్రమైన్యుని ప్రతిసృష్టిని తల క్రిందు చేసినచో యీ పరిస్థితి యేర్పడును.)

(౨) సంవత్సరములో యేడునెలలు వేసవియు, ౫ నెలలు శీతకాలముండును. ("బుందహిష్" వాక్యము; వందిదాదు ప్రథమాధ్యాయమందు చేర్పబడిన వాక్యము.)

ఒక్క ప్రదేశమందే యీ రెండు విధములగు పరిస్థితు లెట్లుండునని పండితులు భ్రమపడిరి. ఇవి పరస్పర విరుద్ధములని వా రభిప్రాయపడిరి. కాని, ధ్రువమండలమందు అక్షాంశభేదములనుబట్టి కొన్నిచోట్ల ౭ నెలల సూర్యరశ్మియు, మరికొన్నిచోట్ల ౧౦ నెలల సూర్యరశ్మియు నుండుట అసంభవము గాదని మన మిదివరకే ఋజువుపరచియున్నాము. కాన, దీనిలో వింత యేమియు లేదు. ఋగ్వేదమందు సూర్యునకు యేడుకిరణములు గలవని యొకచోటను, పదికిరణములు గలవని ఇంకొకచోటను చెప్పినట్లే, అవైస్థికవాఙ్మయమందు కూడ ఐర్యనవైజోలో వేసవి యేడుమాసము లుండెనని యొక

చోటను, పదిమాసములుండునని యింకొకచోటను చెప్ప బడియున్నది. పరస్పరవిరుద్ధములుగ గన్పట్టు యీవాక్య ములచే ధ్రువమండలమందు ౭, ౧౦, మాసముల సూర్య రశ్మిగల భిన్నప్రదేశములు సూచింపబడుచున్నవి.

ఈరీతిగ ౭, ౧౦ మాసముల సూర్యరశ్మిగల భిన్న ప్రదేశములను సూచించుటకింకొక ప్రమాణముగలదు. సంవ త్సరములో ౮ వ నెల మొదటితిథినాడు శీతకాలము ప్రపం చములో ప్రవేశించునని బుందహిష్ గ్రంథము చెప్పుచున్నది. ఈవాక్యము శంబరాసుర యుద్ధప్రారంభమును తెలుపు శరత్తు ౪౦ వ తిథితో (పదిదినము లెప్పటికప్పుడగ) సరిపోవు చున్నది. ఈశీతకాలము ౧౨ వ నెల అఖరువరకు నుండునని కూడ చెప్పబడియున్నది. దీనివలన యేడునెలల సూర్యరశ్మి సూచింపబడుచున్నది. ఇంకొకవిశేషమేమనగ:— పదియవ నెల తొమ్మిదవతిథినాడు ఐర్యనవైజోలో శీతకాలము ప్రవే శించునని యీబుందహిష్ వాక్యమందేగలదు. అందువలన, ఆదినమందు ప్రతిచోటను మంటలువేయుదురని యీగ్రంథము చెప్పుచున్నది. శీతకాలప్రవేశమును సూచించుటకే యీమంటలు వేయబడుచున్నవి. దీనినిబట్టి ౯, లేక ౧౦ నెలల సూర్యరశ్మి సూచింపబడుచున్నది. ప్రాచీన రోమక సంవత్సరమందు పదిమాసములున్నట్లు, ప్రాచీనపారశీక సంవ త్సరమందుకూడ ౯ నెలల ౯ దినములేయుండి యుండవచ్చును. ఈబుందహిష్ వాక్యమువలన ధ్రువమండలములో ౭, ౧౦౦

మాసముల సూర్యరశ్మిగల భిన్నప్రదేశములు సూచింపబడు చున్నవనుట కొంతమాత్రమును సందేహము లేదు. ఇంతవరకు జరిగిన చర్చనుబట్టి ఐర్యనవైజో యనుభూమి పారశీకమునకు పూర్వకోనయందున్నదో, లేక ఉత్తరభూములలోనున్నదో - నిర్ణయమై పోయినది.

అంగ్రమైన్యుని ప్రతిసృష్టివలన ౧౦ నెలల శీతకాలమును, రెండు నెలల వేసవియు వచ్చెనని వందిదాదుయొక్క ప్రథమాధ్యాయములో గలదు. దానిని మనము తలక్రిందు చేసి భగవంతుడు మొదటచేసిన సృష్టిప్రకారము ౧౦ నెలల వేసవియు, ౨ నెలల శీతకాలమునుండియుండవలెనని యూహించితిమి. కాని, యిట్టియూహతో పనిలేకుండగనే, అంగ్రమైన్యుడు రాకపూర్వమీ ఐర్యనవైజో యెంత మనోహరమగు స్వర్గముగనుండెనో వందిదాదుయొక్క ద్వితీయాధ్యాయమందే ప్రత్యక్షముగ వర్ణించియున్నారు. ఆప్రదేశము నందనవనమువలె సకలసౌభాగ్య సంపదలతో తులదూగుచుండెననియు, అందలిప్రజలు జరామరణవర్జితులై, బహుసంతానులై, సకలైశ్వర్య సంపన్నులై యుండిరనియు, వారందరికి "ఇమ" యను నాతడు రాజై తన ప్రజలను కన్నబిడ్డలవలె గాపాడుచు, న్యాయమార్గమున ప్రజాపరిపాలన మొనర్చుచుండెననియు యీద్వితీయాధ్యాయము విపులముగ వర్ణించుచున్నది. అంత నొకనాడు భగవంతుడీ "ఇమ" యను రాజును తనదేవసభకు రప్పించి, ముందుభూలోక స్వర్గమగు ఐర్యనవైజోపై

రానున్న హిమప్రళయమునుగూర్చి తెలియఁజెప్పి, యీయుప
ద్రవమునుండి భూప్రజను రక్షించుటకై రాజను తా నొక
భవనమును (వర) నిర్మించవలసినదనియు, అందు సమస్త
జంతువులయొక్కయు, ఓషధులయొక్కయు బీజములను సంగ్ర
హించి యుంచవలసినదనియు హెచ్చరించెను. ఆ ప్రకారమే
" ఇమ " రాజు " వర " ను నిర్మించెను. ఈ " వర " యందు
" సూర్యచంద్రనక్షత్రాదులు సంవత్సరమున కొకసారి యుద
యించునట. ఈ " వర " లో నున్నవారికి సంవత్సర మొకదిన
ముగ మాత్రమే గన్పించునట"! ఈ రెండును ఉత్తరధ్రువ లక్ష
ణములుగాక మరియేమి ? దీనినిబట్టియైనను ఐర్యనవైజోను
ధ్రువమండలమందే యుంచవలెను. వందిదాద్గ్రంథమును
రచించిన పారశీకు లీ సృష్టిచమత్కారమును తమకన్నులార
చూచియుండకపోవచ్చును. కాని, వారిపూర్వులు తప్పక
యొకప్పు డీసృష్టిచమత్కారమును తమ కన్నులార చూచియే
యుండవలెను. వారిట్లు కన్నులారచూచిన యంశమే వారి
పరంపరగ, వ్యాప్తమైయిప్పటివరకు వచ్చియుండవచ్చును.
ఇట్లుపారంపర్యముగ వచ్చినదానినే వందిదాదు గ్రంథకారులు
తమగ్రంథమందు స్థిరాక్షరములుగ భద్రపరచియుండవచ్చును.
ఈకారణములచే ఐర్యనవైజోను తీసికొనిపోయి పారశీకదేశ
మునకు తూర్పుకొనయందు పెట్టుటకుపీలు లేదు. అట్లయినచో
౧౦ నెలల శీతకాలమునుగాని, సంవత్సరమున కొకసారియే
సూర్యచంద్రాదు లుదయించుటనుగాని సమర్థించుట కెంత

మాత్రమును వీలుండదు. కేవలముప్రాచీన గ్రంథములందున్న దివ్యజలవాహినులపేర్లతో యిటీవల క్రొత్తగ నామకరణ మొనర్పబడిన నదులపేర్లనుబట్టి ఐర్యనవైజోకు స్థలనిర్దేశమును చేయబూనుట చాలతప్పుపద్ధతి అట్లయినచో, ఇప్పుడార్యావర్తమనబడుచున్న వింధ్యహిమాలయ మధ్యప్రదేశమే ఆర్యులకు మూలస్థానమని యేలచెప్పకూడదు ? కనుక, కేవల మిటీవల క్రొత్తగపెట్టబడిన పేర్లనుబట్టియే స్థలనిర్దేశ మొనర్ప బూనుపద్ధతిని పూర్తిగ వదలివేయవలెను.

నందనవనమువలె నొప్పారుచుండిన ఐర్యనవైజో మీదికి హిమప్రళయ మెట్లురాబోవుచున్నదో భగవంతుడు ఇమరాజునకు తెలియజెప్పుచున్నాడు. చక్కని తమ దేశము మంచుచే నెట్లు పాడైపోయినదో ఆర్యులు తమ కండ్లార చూచి నట్లే యీ ద్వితీయాధ్యాయమందు వర్ణింపబడియున్నది. ఈ వర్ణనమంతయు ఆధునిక భూగర్భశాస్త్రవేత్త యొకడు యథాశాస్త్రీయముగ జేసిన వర్ణనవలెనే యున్నది. ప్రపంచ మంతయు మంచుగడ్డలతో పేరు కొనిపోవునట. మహోన్నత గిరిశిఖరములుకూడ కనీసము మూరెడెత్తు మంచులో మునిగి పోవునట. ఈ వర్ణనమింత ప్రత్యక్షముగను, యథాశాస్త్రీయ ముగ నున్నప్పుడు దీనిని పుక్కిటిపురాణమని త్రోసివేయ జాలము. ఏప్రదేశమందైనను శీతోష్ణస్థితిలో నిట్టి విపరీతమైన మార్పులు గలుగుట అసంభవమని పండితులు గట్టిగ తలంచు టచే, యీ వర్ణనమంతయు పుక్కిటి పురాణమని త్రోసివేసిరి.

కాని, పూర్వ మొకప్పుడు ఉత్తరధ్రువమండలమందు సంతత వసంతసమయముగ నొప్పారుచున్న శీతోష్ణస్థితియుండెననియు, యీ స్థితి కనీసము రెండుసార్లు తటస్థించిన హిమప్రళయములచే పాడై పోయెననియు, గతించిన హిమప్రళయము క్రీస్తుకు పూర్వము షుమారు ౮ వేల సంవత్సరములకు పూర్వమందు తటస్థించెననియు అమెరికను భూగర్భశాస్త్రవేత్తలు మొన్న మొన్న నే (౩౦, ౪౦ సంవత్సరములక్రిందట) నిర్ధారణ చేసియున్నారు. ఈ హిమప్రళయమే ఆంగ్రమైన్యుని శీతోపద్రవముగను, భగవంతునిచే ముందురానున్నదని యిమరాజునకు చెప్పబడిన హిమప్రళయముగను అవెస్థిక గ్రంథములందు స్పష్టముగ వర్ణింపబడియున్నది. కాన, యిది నిజమైన చారిత్రకాంశమేగాని పుక్కిటిపురాణము గాదని పండితు లిప్పటికైనను గ్రహింతురుగాక. మన ప్రాచీనగ్రంథములలోని వర్ణనము లెంత స్పష్టముగ నున్నను వానిని సమ్మతింపకపోవుట మనవారి కిప్పు డాచారమైపోయినది. ఇట్టి యపనమ్మకమే లేకపోయినచో [illegible] జోను పండితు లిదివరకే ధ్రువమండలమందు పెట్టియుందురు. నందన వనమువలె నొప్పారుచున్న తమ జన్మభూమి యిట్లు నాశనమైపోవుటచే, ఆర్యు లాప్రదేశమును విడిచిపెట్టక తప్పినది కాదు. ఆర్యులు స్వర్గతుల్యముగ నుండిన తమ జన్మస్థానమును వదలిపెట్టుట కిదియే కారణము గాని, కొందరనుకొనునట్లు, "చోటుచాలక" గాదు; "యేదోగుబులు"చే గాదు; వట్టి గుబులుచే స్వర్గతుల్యముగ నుండిన తమ జన్మస్థానము

నెవరైన వదలుదురా? ఇప్పటికి పదివేలసంవత్సరముల క్రిందట తమదేశము మంచుచే పాడైపోవుటచే ఆర్యులాదేశమును వదలివేసి దక్షిణాభిముఖముగ పయనమై రావలసినవారైరి. వారిశ్లేలలేచివచ్చిరో— ఆకారణము— అవైస్థికగ్రంథములందు యెన్నడో లిఖితపూర్వకముగ భద్రపరుపబడియున్నది. ఈ వర్ణనము సత్యమైనదేయని నిన్నగాక మొన్ననే మన భూగర్భశాస్త్రవేత్తలు కనుగొనియున్నారు. ఆహా ! వీరుకనుగొనక పోయినచో అవైస్థికవర్ణనమంతయు పుక్కిటిపురాణమేయై పోయెడిదిగదా !

దీర్ఘరాత్రులు, దీర్ఘదివసములు, దీర్ఘఉషస్సులు మొదలగు ధ్రువలక్షణములను దెలుపు నిదర్శనములు పెక్కులువైదికవాఙ్మయమందు గానవచ్చుచున్నను ఆర్యులాప్రదేశములలో నేకాలమందు నివసించిరో, యేకారణములచే అచ్చటనుండి లేచివచ్చిరో తెలియజెప్పు వాక్యమొకట్టియైనను మన వేదవాఙ్మయమందు గానరాదు. ఈలోపమును పూర్తిచేయుటకై మనము భూగర్భశాస్త్రపరిశోధనల నాధారము జేసికొంటిమి. ఇప్పుడుసదా మంచుతో గడ్డకట్టుకొనిపోయి మానవనివాసమున కనుపయోగముగనున్న యీధ్రువమండలమే, పూర్వమొకప్పుడు (పదివేలసంవత్సరములకుపైన)సంతతవసంతసమయసౌభాగ్య సంపదలతో తులదూగుచు మానవనివాసమునకత్యంతోపయుక్తముగ నుండెనని యీ శాస్త్రపరిశోధనలవలన ఋజువైనది. పదివేల సంవత్సరముల క్రిందటతట

స్థించినహిమప్రళయమునకు పూర్వమే ఆర్యు లాప్రదేశమందు కాపుర ముండియుండవలెను. గాని తెనాపటి యుండియుండ జాలరు. ఈ యూహయే అవెస్థిక ప్రమాణములవలన ప్రత్యక్షముగ ఋజువైనది. దీనినిబట్టి (౧) ఐర్యానవైజోలో మొట్టమొదట మంచి శీతోష్ణస్థితి యుండెను; కాని, కొంత కాలమునకు అంగ్రమైన్యుడు వచ్చి దానియందు పది నెలలు అతిచలిని, ౨ నెలలు వేసవిని గల్పించి మానవులు నివసించుటకు వీలు లేకుండ పాడుచేసెను. (౨) ఐర్యానవైజోయందున్న "వర"లో సూర్యచంద్రాదులు సంవత్సరమున కొకమారే యుదయింతురు; సంవత్సర మొక దినముగ నుండును. (౩) నందనవనముగ నున్న యీ భూమి హిమప్రళయముచే మానవ నివాసమున కనుపయోగమయ్యెను. ఈరీతిగ పూర్వకాలమందు నిజముగ జరిగియున్న చరిత్రాంశములనే ఆర్యులు వంశపారంపర్యముగ తమ మనస్సులందు జ్ఞాపకముంచుకొని, యీనాటివరకు సంక్రమింపజేసిరి. కాని, యీ ప్రళయము నిజముగ జరిగి యెన్నియో వేల సంవత్సరము లగుటచే, పరంపరానుగతముగ వచ్చుచున్న యీయైతిహ్యముయొక్క నిజభావమును మాత్రము ప్రజలు మరచిపోయి, దీనిని యిన్నాటివరకు పుక్కిటి పురాణముగనే తలంచుచుండిరి. కాని, మన అదృష్టవశమున, ౪౦, ౫౦ సంవత్సరముల క్రిందటచేయబడిన భూగర్భశాస్త్రపరిశోధనల వలన యీపరంపరానుగతమైన యైతిహ్యము సత్యమైన చరిత్రాంశమే యని స్థిరపడినది. ఈ విష

యమై యీశాస్త్రపరిశోధనలు లోకమునకు మహోప
కారమొనర్చినవనుటలో సందేహములేదు. మనమతగ్రంథము
లలో పరంపరానుగతముగ భద్రపరుబడియున్న యైతిహ్య
ములయొక్క సత్యాసత్యముల నింత ఖండితముగ ఋజువుచేయ
గల ఆధునిక భౌతికశాస్త్రపరిశోధన లింకను పెక్కులుగావింప
బడవలసియున్నవి. ఇంతవరకుచేసిన పరిశోధనలు బహుకొద్దిగ
మాత్రమున్నవి. ఇవిచాలవు.

మన మిప్పుడు ఐర్యనవైజోయొక్క స్థలనిర్దేశమును
పూర్తిగ చేసియున్నాము. కనుక, వందిదాదు గ్రంథము
యొక్క ప్రథమాధ్యాయములో వరుసగపేర్కొన బడిన
౧౬. దేశములయొక్క భావార్థమేమో మన మిప్పుడు
సరళముగ నిర్ణయింపవచ్చును. ప్రాచీన మూలస్థానమగు
ఉత్తర ధ్రువమండలమునుండి ఆర్యులు దక్షిణాభిముఖముగ
బయలుదేరి తమ మార్గమందు దాటుచు (పంజాబువరకు)
వచ్చిన భూములే యీ పదునారుభూములై యున్నవి. ఆర్యు
లీ దేశములగుండ వచ్చినారని "వందిదాదు" నందు ప్రత్యక్ష
ముగ చెప్పియుండనిమాట వాస్తవమే; చెప్పవలసిన అవుసర
మును లేదు. ఏలయనగ, ఐర్యనవైజో ఉత్తర ధ్రువమండల
మం దున్నదనియు, అది మంచుచే పాడైపోయి, మానవనివాస
మున కనుపయోగమై పోయినదనియు చెప్పినప్పుడు ఆర్యు
లచ్చటినుండి లేచివచ్చిరని వేరుగ చెప్పవలెనా యేమి? అది
గాక, ఐర్యనవైజోయను భూమి హిమప్రళయముచే మానవ

నివాసమున కనుపయోగమయ్యెనని చెప్పిన మాటనే యీ పదునారు భూములును క్రమముగ పేర్కొనబడుటచే యీ క్రమమున కేదియో అర్థముండితీరవలెనుగద. అనగ, మొదట నున్న చోటులో నుండుట యసంభవము కాగనే వారచ్చట నుండి లేచి యీ పదునారు భూములగుండ క్రమముగ సంచార మొనర్చుచు వచ్చిరని స్పష్టమగుచున్నది. కనుక, యిది నిజమగు చరిత్రాంశమే గాని పుక్కిటి పురాణముగాదు.

పూర్వము నందనవనమువలెనున్న యీ ధ్రువమండలమునందలి "ఐర్యనవైజో" యను భూమినే కొంతకాలమునకు పారశీకులు "స్వర్గ" మని చెప్పుకొనుచు వచ్చిరి. దీనినే మన పురాణములలో "మేరుపర్వతము"గ వర్ణించిరి. ఇది దేవతలకు నివాసస్థానము — అనగ స్వర్గము.

ఆర్యుల మూలస్థాన మిట్లు మంచుచే పాడైపోయిన చరిత్రాంశమే భారతీయగ్రంథములలో నుండ గలదు. శతపథ బ్రాహ్మణము, మహాభారతము, మత్స్య, భాగవతాదిపురాణములు మొదలుగా గల గ్రంథములలో యీ యంశమే వివరింపబడియున్నది. శత. బ్రా. I, 8, 1, 1–10–లోని వర్ణనము వీని యన్నిటిలో బహు పురాతనమైనది. మనువు ప్రాతఃకాలనాదులకై తెచ్చిన నీటిలో నొక చేప కనుబడెను. "నన్ను నీవిప్పుడు రక్షించినచో ముందురానున్న గొప్పవరద (ఓఘః) నుండి నిన్ను కాపాడుదును, యీ వరద సమస్తజంతుకోటిని తుడిచివేయనున్నది. (నిరోఢా)" అని ఆ చేప మనువుతో

చెప్పెను. మను వా చేపను మొదట కమండలములో నుంచెను; అది పెరిగినకొలది దానిని బావిలోను, నదిలోను, తుదకు సముద్రములోను వేసి కాపాడెను. అంతట ఆ చేప ఫలాని సంవత్సరములో (యే సంవత్సరమో తెలియదు) వరద రానున్నది; కనుక నీవిప్పుడొక నావను (నావం) కట్టి దానిలో భద్రముగ నుండుమని చెప్పెను. మను వాప్రకారమే చేసి ఓడలో సిద్ధముగ నుండెను. నావయొక్క పాశమును ఆచేపకొమ్మునకుకట్టి మనువు "యీఉత్తరపర్వతముమీదుగ"—ఏతం ఉత్తరం గిరిం—పోవును. ఈపర్వతమే హిమవత్పర్వతమని వ్యాఖ్యాతలు వ్రాసియున్నారు. నావయొక్క పాశమును ఆపర్వతముపైనున్న చెట్టునకు కట్టవలసినదని చేప చెప్పెను. మనువాప్రకారమేచేయగ వరదతోపాటు నావ కూడక్రమముగ క్రిందికిదిగెను. అందుచేతనే యీపర్వతమునకు "మనోర్ అవసర్పణం"—మనువు దిగినచోటు—అని పేరు_వచ్చెనట. ఈవరదవలన జనులందరునశించిరి; మను వొక్కడే మిగిలెను. మను వంతట "పాకయజ్ఞ" మొనర్పగ ఆసీటినుండి సంవత్సరములో "ఇడా" యను స్త్రీవచ్చెను. ఈస్త్రీవలన మనువు సంతానమును (ప్రజాతిః) బడసెను. ఈ కథయే అధ. వే. XIX, 39, 7, 8_లోకూడగలదు. అచ్చట గిరిశిఖరముపేరు "నావ_ప్రభ్రంశనమ్" అనియున్నది. మహాభారతకథలో "నౌబంధనమ్" అనియున్నది. మనువు తపస్సు చేసినచోటు మలయ (మలబారు) అని మాత్స్యపురాణము

చెప్పుచున్నది. ద్రవిడదేశపురాజగు సత్యవ్రతుడే మనువునకు బదులుగ భాగవతపురాణమునందు పేర్కొనబడియున్నాడు. వీనియన్నిటిలో శతపథబ్రాహ్మణవర్ణనమే బహుపురాతనమైనది. ఇది క్రీ. పూ. ౨౯౦౦ సంవత్సరములకుపూర్వమే వ్రాయబడినదని పండితులునిర్ణయించిరి. కనుక యిదియే మనకిప్పుడు ముఖ్యమైనది. మనువునకును చేపకును మొట్టమొదట సంభాషణ మెచ్చటజరిగెనో తెలియదు. మనువు నావ నెచ్చట యెక్కెనో తెలియదు. శతపథబ్రాహ్మణమందు నీటివరద వర్ణింపబడినదే గాని, అవైస్థికగ్రంథములోవలె మంచుగడ్డల సంగతి లేనే లేదు. అయినను, యీ రెండువర్ణనలును ఒకే యుపద్రవమును దెల్పుచున్నవని చెప్పవచ్చును. "ప్రాలేయ" యనగ "మంచు" అని యిటీవలి సంస్కృత వాఙ్మయమునందుగలదు. ఈ "ప్రాలేయ" శబ్దము "ప్రళయ" (వరద) శబ్దము నుండియే యుత్పన్నమైనదని పాశ్చాత్యాచార్యులవారు చెప్పుచున్నారు. కనుక, యీ వరదకును మంచునకును సంబంధమున్నట్లు మన ప్రాచీనులకు తెలియకపోలేదు. కాని, యీ సంగతిని ఆధునికు లంతగ గుర్తింపరైరి. హిమప్రళయము తటస్థించినప్పుడెల్ల మంచులో మునిగిపోయిన ప్రదేశములనుండి పెద్ద నీటివరదలు బయలుదేరి అన్నివైపులకు విరివిగ ప్రవహించునట. ఇట్లు అపారముగ బయల్వెడలి అన్నివైపులకు ప్రవహించుచున్న నీటివెల్లువలవెంట అపరిమితమైన బురదయు, యిసుకయు కొట్టుకొని వచ్చునట. ఈ యంశములను భూగర్భ శాస్త్రవేత్తలే చెప్పుచున్నారు. కనుక,

శతపథబ్రాహ్మణములో చెప్పబడిన వరద (ఔఘః) కూడ హిమప్రళయము క్రింద పడిపోయిన ప్రదేశము నుండి యిట్లుకొట్టుకొనివచ్చుచున్న యొకానొక నీటివెల్లువ యైయుండవచ్చును. బహుశః, మనువుకూడ యీనీటి వెల్లువ నొంట, నావలోనెక్కి, యీ చేపవెంబడి, హిమవత్పర్వత పార్శ్వమునకు కొట్టుకొనివచ్చియుండవచ్చును. కనుక, శతపథ బ్రాహ్మణవర్ణనము కేవలమొక్క నీటివరదనే సూచించుచున్నదని చెప్పుటకు వీలులేదు. భూగర్భశాస్త్రమును బట్టి చూడగ యీ కథ హిమప్రళయమునుకూడ సూచించుచున్నదనియే చెప్పితీరవలెను. కావున, అవైస్థిక గ్రంథములోని హిమప్రళయమును, శతపథబ్రాహ్మణములోని జలప్రళయమును ఒక్కటే చరిత్రాంశమును దెలుపుచున్నవి. వీనిరెంటికిని మూలమొక్కటే ఈరెంటికిని యింకొక పోలికకూడ కలదు. ఈజలప్రళయములో రక్షింపబడిన మనువు వివస్వతుని కుమారుడు; హిమప్రళయములో రక్షింపబడిన "ఇమ" యనునాతడు "వివంఘటు" ని కుమారుడు.

పదవేల సంవత్సరముల క్రిందట యీభూగోళముపై జరిగిన మహాప్రాకృతిక విపర్యయ మీరీతిగ ప్రాచీనార్య సంతతులచే వాఙ్మయరూపముగ భద్రపరుపబడి యున్నది. వైదిక, అవైస్థికవర్ణనముల రెంటిలో అవైస్థికవర్ణనమే మిక్కిలి పురాతనమును, యెక్కువ విపులమునునై యున్నది. భూగర్భశాస్త్రపరిశోధనలుకూడ అవైస్థికవర్ణనముతోడనే — ప్రతి చిన్నవివరమునందును — సూచినట్లు, సర్వవిధముల, సరిపోవు

చున్నవి. శబ్దశాస్త్రపరిశోధనలను బట్టికూడ శతపథబ్రాహ్మణమున కంటె వెందిదాద్ గ్రంథమే యెక్కువ పురాతనమైనదని హేగుపండితుడు కనుగొని యున్నాడు.

ఆర్యు లొకప్పుడు ఉత్తరభూములలో నివసించియున్నారని తెలుపు వాక్యములు కొన్నిగలవు. వానిలో రెంటి, మూటినిమాత్ర మిచ్చట పేర్కొందము. "శతం హిమాః" అను పదము ఋగ్వేదమందు పలుతావులలో గలదు. (I, 64, 14; II, 33, 2; V, 54, 15; VI, 48,8; Etc. ...) "శరదశ్శతం" అను పదముకూడ ఋగ్వేదమందు గానవచ్చుచున్నను, యీ "శతం హిమాః" అను పదముచే ఆర్యులప్పటికిని తమ యుత్తరమండల నివాసమును పూర్తిగ మఱచిపోలేదని తెలియుచున్నది. ఐ. బ్రా. VIII, 14— లో హిమవంతమున కావలనున్న "ఉత్తరకురు"భూములు పేర్కొనబడి యున్నవి. ఈ యుత్తరకురుభూములను మానవమాత్రుఁడు తనను జయింపజాలరనియు, యిచ్చట దేవతలు నివసింతురనియు, ఐ. బ్రా. VIII, 23 చెప్పుచున్నది. అనగ, యీ బ్రాహ్మణమునాటికే యీయుత్తర కురుభూములు దేవతానివాసస్థానములుగ పరిగణింపబడజొచ్చెనని తెలియుచున్నది. సత్కార్యములొనర్చిన పురుషులీయుత్తర కురుభూములలో నివసింతురని రామాయణము (IV, 43, 38) చెప్పుచున్నది. "అర్జునా! ఇవిగో!— యివియే ఉత్తరకురుభూములు; వీనినెవరును జయింప సాహసింపరు"—అని మహాభారతము (సభా: 28. అ) చెప్పుచున్నది. "టాల్మీ" యను గ్రీకుపండితుడుకూడ "ఒట్టొరొకొర"

అనుభూమియు, పర్వతమును, ప్రజలును, గలరని చెప్పు చున్నారు. "పత్యాస్వస్తి"కి (అనగ, వాగ్దేవికి) ఉత్తరమండల ములు (ఉదీచీమ్‌దిశం) తెలియునని కౌషీతకీబ్రాహ్మణము (VII, 6) చెప్పుచున్నది. ఈవాక్యములనుబట్టి ఆర్యులోక ప్పూరు ఉత్తరభూములలో నివసించియున్నట్లు తెలియుచున్న దని "మ్యూయిరు" పండితుడు తలంచుచున్నాడు. కాని, యీవాక్యములంత స్పష్టముగలేవు. వీనివలన ధ్రువమండ లము సూచింపబడుటలేదు. అయినను, తదితరప్రమాణ ములచే యిదివరకే ఋజువైన ఉత్తరధ్రువ నివాసమును మరింత యెక్కువగ తెలుపుటకుమాత్ర మీ వాక్యములు తోడ్పడుచున్నవని చెప్పవచ్చును. మన సిద్ధాంతమును ఋజువు చేయుటకు మన మిదివరకు చర్చించియున్న వైదిక, అవైస్థిక ప్రమాణములే ప్రబలాధారములుగ నున్నవి. వీనివలన ఆర్యు లోకప్పూరు ఉత్తరధ్రువమండలమం దుండిరనియు, తదుపరి హిమప్రళయముచే ఆమండలము పాడైపోగా వారచ్చట నుండి లేచి దక్షిణాభిముఖముగ పయనమై మధ్య అనేక భూములను దాటుచు, కొంతకాలము ఆకసు, సింధు, కుభా, రసా, నదీప్రాంతములలో నివసించుచు, తుదకు మరల అనేక శాఖలుగ చీలిపోయి కొందరు హిందూదేశము లోనికిని, మరికొందరు పారశీకదేశములోనికిని పోయిరనియు, తెలియు చున్నది.



వైదిక నిలయము

పండ్రెండవ అధ్యాయము.

తత్తుల్య గాథలు.

(Comparative Mythology)

ఆర్యుల ఉత్తరధ్రువనివాసమును ఋజువు చేయుటకు మనమింతవరకు భారతీయులయొక్కయు పారసీకులయొక్కయు ప్రాచీన గ్రంథములనుండి ప్రమాణములనెత్తి చూపియున్నాము. మన సిద్ధాంతము సత్యమేయైనచో ధ్రువనివాసమును దెల్పు నిదర్శనములు గ్రీకు, రోమను, కెల్టిక్, ట్యూటానిక్, స్లావోనికాది తదితర ఆర్యశాఖలవారి ప్రాచీనగ్రంథములందును గాథలయందును కూడ యుండియుండవలెనుగదా. ఈవిషయమై "రీసు" పండితుడు చాల శ్రమచేసి ఆ గాథల నన్నిటిని విపులముగ పరిశీలించిచూచి, వానివలన ఉత్తరధ్రువనివాసము సూచింపబడవచ్చునని చెప్పియున్నాడు. కనుక, ఆగాథలనన్నిటిని మనమిప్పు డిచ్చట మరల సూక్ష్మముగ పరిశీలింపవలసిన యావశ్యకత లేదు. "రీసు" గారిదివరకే చేసియున్న కృషివలన

మనపనిచాల తేలికయైనది. కనుక, యీవిషయమై మనము వారి కనేకవందనము లొనర్పవలసియున్నది. 'రీసు' గారొనర్చిన పరిశ్రమనాధారముజేసికొని నేనిచ్చటకొన్ని ముఖ్యాంశములను మాత్రము క్లుప్తముగ పేర్కొందును.

ధ్రువమండలమందలి ప్రాచీన సంవత్సరమును గూర్చిన చిహ్నము లేమైన తదితర ఆర్యజాతుల గ్రంథములలో కలవేమో ముందు విచారింతము. ఋగ్వేదమందు ఉషస్సు బహువచనములో ప్రయోగింపబడియున్నది. ముప్పదిమంది యుషాకన్యలు ఒక ఆవరణములోనే చీలిపోకుండ కలిసియుండి, ఒక్క మనస్సుతోనే, గిరగిర తిరుగుచుందురని ఋగ్వేదము వర్ణించెను. "లెట్టు" జాతివారి ప్రాచీనగ్రంథములందుకూడ ఉషస్సు "దివో-దుక్తే" – (ఋగ్వేదము:– దివో-దుహితా) అనగ, "దివముయొక్క కూతురు"గనే వర్ణింపబడియున్నది. సుందరులగు యిట్టి "దివో దుహితలు" చాలమంది గలరని "లెట్టు"కవులు వర్ణించియున్నారు. గ్రీకుగాథలందు "హెరకిల్సు" యొక్క భార్యలు పెక్కుమందిగలరు. "వీరు ఉషస్సునకంటె భిన్నమైనవారని చెప్పుటకు వీలులేద"ని మాక్సిముల్లరుగారే చెప్పియున్నారు. ఈ కథయే "కెల్టిక్" గాథలందు గలదు. సూర్యుని భార్యకు చాలపేర్లుగలవట. స్త్రీరూపములుగ వర్ణింపబడిన బహు సంఖ్యావాచకములగు నీయుషస్సులన్నియు సంవత్సరములో ౩౬౦ దినములలో ప్రతిదినమును కన్పడు ఉషస్సులు గావనియు, ఉత్తరధ్రువమందు సుమారు నెలదిన

ములవరకుండు దీర్ఘయఖండ ఉషస్సే యీవిధముగ వర్ణింపబడియున్నదనియు మన మిదివరకే ఋజువుపరచి యున్నాము. ఉషస్సు "దివో-దుహిత"గను, బహువచనముగను ఋగ్వేదమందేగాక లెట్టుగాథలలో కూడ ఒకేవిధముగ వర్ణింపబడియుండుటచే, యిది తప్పక ధ్రువమండలమందలి దీర్ఘయఖండ యుషస్సే యై యుండవలెను. [illegible], గ్రీకు గాథలకు కూడ నిదియే తాత్పర్యము.

'గవాం అయనం'యొక్క అవధిని గూర్చియు, దశగ్వుల చరిత్రనుగూర్చియు చర్చించుసందర్భమున ప్రాచీన రోమక సంవత్సరములో పదిమాసములే యుండెననియు, "న్యూమా"యను నాతడువచ్చి తరువాత రెండు నెలలను క్రొత్తగకలిపెననియు వివరించియుంటిని. ప్రాచీనసంవత్సరములో ౧౦ నెలలే యుండియున్నచో ౫ వ నెల మొదలు ౧౦ వ నెలవరకునున్న సంఖ్యావాచకనామము లొక్కసారి ఆకస్మికముగ, ౧౦ వ నెలతోడనే నిలిచిపోజాలవు. "క్వింటిలిస్" (అయిదవనెల) మొదలు "డిశంబరు" (పదవనెల) వరకునున్న రోమక నెలలయొక్క సంఖ్యావాచకనామములనుబట్టి మనమింకొక విశేషాంశమును గ్రహింపవచ్చును. మొట్టమొదట ఆర్యులందరుకలిసి ఉత్తర ధ్రువమండలమందున్నప్పుడు నెలలకు వానిక్రమమునుబట్టి – మొదటినెల, రెండవ నెల, మూడవ నెల,........ అను సంఖ్యావాచకనామములే యుండెను. గాని వానికి ప్రత్యేకమైన పేర్లు వేరుగ లేకుండెను.

కాని, ఆర్యు లందరును భిన్న శాఖలుగ చీలిపోయిన తరువాత యీ సంఖ్యావాచకనామములకు బదులుగ యెవరి యిష్టము చొప్పున వారు తమతమ నెలలకు క్రొత్తపేర్లను పెట్టుకొనిరి. అందుచేతనే, యిప్పు డన్ని భాషలలోను నెలలపేర్లు ఒకేమాదిరిగ లేక భిన్నములుగ నున్నవి. ప్రాచీన రోమక్ సంవత్సరము యొక్క పదినెలల యవధినిబట్టి పదినెలల సూర్యరశ్మిగల ధ్రువప్రాంతము సూచింపబడుచున్నదనుటలో సందేహము లేదు.

కెల్టిక్, ట్యూటానిక్, గ్రీకుజాతుల ప్రాచీన సంవత్సరమునుగూర్చిన వర్ణన లంతస్పష్టముగ లేవు. కెల్టుసంవత్సరమునుగూర్చి కొంచము తెలిసికొందము. సంవత్సరములోనున్న ఉష్ణోగ్రతనుబట్టియు, శీతోగ్రతనుబట్టియు వారిసంవత్సరము రెండు సమభాగములుగ విభజింపబడినట్లుగాన్పించుచున్నది. సూర్యరశ్మికంటె చీకటియు, పగటికంటె రాత్రియు వారికెక్కువ ప్రధానములుగ గన్పట్టుచున్నవి. నవంబరు మొదటి తేదీనాడు వారికి శీతకాలము ప్రవేశించును; చీకటియు వచ్చును. ఇదియే వారికి ప్రాతసంవత్సరములో చివరిదినము. ప్రాతసంవత్సరము చనిపోయినదని సూచించుట కనేక పండుగలు, జాతరలు జరుగును. ఇదియే పిశాచములు గన్పడుటకు తగిన సమయము. సూర్యదేవు డీదినమందే చలియు, చీకటియు నను రాక్షసులకు (లేక పిశాచములకు) లొంగిపోయెనని చెప్పుటకై వారనేకజాతరలను జరుపుదురు. అంధకారము

నల్లని పందిరూపమునుధరించి, తోకగాని చెవులుగాని లేక మహాభయంకరముగ ప్రపంచమందు విచ్చలవిడిగ సంచరించునట. ఈవిధముగ వారినూతనసంవత్సరము చలితోడను, చీకటితోడను ప్రారంభమగును. ఇదేరీతిగ, సూర్యుడతి తేజోవంతముగనున్న వేసవిమధ్యమును దెల్పుటకుకూడ కెల్టుజాతివారు ఆగష్టు మొదటి తేదీన "లమ్మ" సంతలను "లగ్నస[illegible]" పండుగలను జరుపుదురు. సూర్యుడతితీక్ష్ణములగు తనకిరణములచే శీతలమును, అంధకారమును భేదించి, సస్యములకు ఉత్తేజమును గలిగించును. కావున పంటలుకూడ, ఆకాలమందే చక్కగపండి సిద్ధముగనుండును. అందుచే "లగ్నస[illegible]"పండుగలును, "లమ్మ" సంతలును విరివిగ మహావైభవముగ జరుగును. ఇదియే పెండ్లిండ్లు జరుగుటకు మిక్కిలి అనుకూలమైన శుభోదయ కాలము. ఆగష్టుమొదటితేదీ వేసవిమధ్యమైనచో మేనెల మొదటితేదీనాడే సూర్యభగవాను డుదయింపవలెను. అందుచేతనే మేనెల మొదటితేదీన [illegible]టుకపండుగ జరుగును. దానికర్థమేమనగ:— శీతకాలము ప్రవేశింపగనే అంధకార రాక్షసుడు వచ్చి తనవద్దనుండి లాగికొనిపోయిన స్త్రీని సూర్యుడు తిరిగి యీ దినమందతనివద్దనుండి మరల లాగుకొని వచ్చునట. ఇట్టి కథయే యింకొకటికలదు. "ప్లూటో" యనునతడు "పర్సిఫోను" కన్యనెత్తుకొనిపోయి తనవద్ద ఆరుమాసములే యుంచుకొనగలిగెనట. తన కుమార్తెయైన యీపర్సిఫోనుకన్య తనవద్దనున్న ఆరుమాసములును భూదేవి సంతోషముగ నుండునట.

కాని, యీాకన్య భూమిక్రిందనున్న చీకటిలోకమునకు పోయి నప్పుడు భూదేవిదుఃఖించునట. దీనినిబట్టి కెల్టిక్ సంవత్సర ములో నవంబరు మొదలు యేప్రియల్ నెలాఖరువరకు చలితో గూడినదీర్ఘరాత్రియు, మేనెల మొదలు అక్టోబరునెలాఖరు వరకు సూర్యరశ్మితోకూడిన దీర్ఘదివసమును నుండునని తాత్పర్యము. ఇంకొకవిశేష మేమనగ, అంధకార రాక్షసుల కును జ్యోతిర్దేవతలకును జరిగిన యుద్ధము నవంబరు మొదటితేదీన జరిగెనని స్పష్టముగ గలదు. ఈ యంశము శంబరాసుర యుద్ధకాల నిర్ణయమొనర్చు శరుత్తు ౪౦ వ తిథిని పోలియున్నది. నార్వేజాతివారి సంవత్సరముకూడ యిదేరీతిగ నున్నది. అక్టోబరు ౧౧, ౧౮ తేదీలమధ్య వచ్చు శనివారము నాడు నార్వేజాతివారొక పండుగ జేయుదురు. ఇది ప్రాచీన కాలమందలి నూతన సంవత్సరాదిని సూచింపుచున్నదని పండి తుల యభిప్రాయము. "కెల్టు" వారి సంవత్సరమునకంటె "నార్వే" వారి సంవత్సరములో కొద్దిదినములు తక్కువగ నున్నవి. నార్వేదేశములో చలి కొంచెము ముందుగవచ్చుటచే వారి సంవత్సరముకూడ కొంచెము ముందుగ ప్రారంభమయ్యె నని రీసుగారు తలంచుచున్నారు.

గ్రీకుజాతివారి ప్రాచీనసంవత్సరముకూడ అక్టోబరునెల చివరతేదీనాడే ప్రారంభమయ్యెను. నూతన సంవత్సరాదిని, ప్రాతసంవత్సరాంతమును, దెలుపుట కానాడు పండుగలు జరుగును. వేసవి మధ్యమును దెలుపుటకు "లగ్నసద్"వంటి

పండుగలు జరుగును. సూర్యోదయమును తెలుపుటకు మే నెలలో కార్తిక పండుగలవంటి పండుగలే జరుగును. ఈ పోలికలనుబట్టి చూడగ, కెల్టుజాతివారి ప్రాచీనసంవత్సరమువలెనె గ్రీకుజాతివారి ప్రాచీనసంవత్సరముకూడ ధ్రువనివాసమునే తెల్పుచున్నది. దీనినిబట్టి ఏరోపాఖండవాసుల పూర్వజులకు ౬ మాసముల పగటినిగూర్చియు ౬ మాసముల రాత్రిని గూర్చియు తెలియునని యింతవరకు ఋజువగుచున్నది. భాషా పరిశోధకులుకూడ యీ విధముగనే సారాంశమును చెల్పుచున్నారు.

అదిగాక, ధ్రువమండలమున కొన్నిప్రదేశములలో ౭ మాసములును, మరి కొన్నిప్రదేశములలో ౮, ౯, ౧౦ మాసములును సూర్యరశ్మి యుండుటచే వారికి ౧౨ మాసములలో కూడిన సంవత్సరసంజ్ఞ యుండుటకంత అవకాశము లేదు. కనుక వారి సంవత్సరము "ఇన్నిమాసముల వేసవియు + ఇన్నిమాసముల శీతకాలము" నని మాత్రమే యుండును. లేదా, "ఇన్నినెలల సూర్యరశ్మియు + ఇన్నినెలల చీకటియు" నని యైన యుండును. దీనికి ఉదాహరణము:— సంవత్సరమునంతను పూర్తిగ తెలుపుటకు "మానుషాయుగా + ఋతుః" అను పదము ఋగ్వేదమందు ప్రయోగింపబడియున్నది. ధ్రువమండలమందలి ఆయాప్రదేశములలో నున్న శీతోష్ణములును, అంధకారప్రకాశములును ఒకేవిధముగ కలవి కాకపోవుటచే వారి సంవత్సరములుకూడ ఒకేరీతిగ నుండక పలురీతులుగ

నుండును. అందుచేతనే ఆర్యభాష లన్నిటిలో సంవత్సరమున కొకే పేరుండక వేర్వేరు పేర్లుండుట తటస్థించెను.

నవగ్వ దశగ్వుల పేర్లలోనున్న సంఖ్యలు వారివారి యజ్ఞకాలపరిమితులను దెలుపుచున్నవని యిదివరకే ఋజువు పరచితిమి. కెల్టుజాతివారిలో కూడ నొక కథ గలదు. తొమ్మిది సుందరరూపములు గల కన్య యొకతె గల దట. తన శత్రువు పడమరవైపునుండి తనమీదికి వచ్చుచున్నా డని వినగనే సూర్యుడు అతని నెదిరించుటకై ఆవైపునకు పయనమయ్యెనట. కాని, మధ్యలో ఆకస్మికముగ సూర్యు డొకా నొక సంకేతస్థానమునకుపోయి యీ నవరూపిణియగు కన్యను కలుసుకొనెనట. అచ్చట యీకన్యసూర్యునకు వేడి నీట అభ్యంజనస్నానముగావించి, మంచిభోజనముపెట్టి, రేపు రానున్న యుద్ధమునకు ప్రోత్సాహకరముగ నుండునట్లు తయారుచేసెనట. ఈకథ అంధకారరాక్షసులతో పోరాడ బోవుచున్న యింద్రునకు సోమరసమునిచ్చి ప్రోత్సహించిన నగ్వులచరిత్రను పోలియున్నది. కనుక, "నవరూపిణి" యగు "కెల్టిక్" కన్యయు, ఋగ్వేదమందుపేర్కొ-న బడిన "నవ గ్వులును"—ఒకేభావమును సూచించుచున్నారు. "థార్" అను నార్వే దేవత ప్రపంచమునుచుట్టియున్న ఘోరాహిని సంహరించి, తొమ్మిది అడుగులునడచి, అంతట ఆపాము విష ముచే చనిపోవునట. ఈ కథకూడ తొమ్మిదిమాసముల సూర్య రశ్మితోడను, 3 మాసముల దీర్ఘరాత్రితోడను నొప్పా

రుచున్న ధ్రువమండల ప్రాంతమునే సూచించుచున్నది. అవైస్థిక గ్రంథమందింకొక కథగలదు. "విగ్రనవాజా" యనునాతడు పక్షిరూపముగ పైకెగురవేయబడెను. అతడు మూడహోరాత్రములు ఆకాశమందు తిరుగాడుచున్నను తనయింటికి రాలేకపోయెను. మూడురాత్రులైన తరువాత ఉషస్సు కనుబడగనే ఆతడు "అర్ద్విసూర అనాహిత"ను ప్రార్థించెను. అంతట "అర్ద్విసూర అనాహిత" వచ్చి అతనిని సురక్షితముగ యింటికిచేర్చెను. ఈఅవైస్థికకథలోనున్న "విగ్రనవాజా" ఋగ్వేదమందున్న "విప్రనవగ్వ"యే యై యుండవచ్చును. ఋ VI, 22, 2 లో నవగ్వులతోపాటు యేడ్గురు "విప్రులు"కూడ పేర్కొనబడియున్నారు. మరియు ఋ V, 74, 4లో "విప్ర—వాహసా"యనబడిన అశ్వినులు దూరదేశమందు మూడహోరాత్రములు నివసించిరట. కనుక, దశమాసిక యజ్ఞానంతర మింద్రునకు తోడ్పడబోయిన నవగ్వులును, "విప్రవాహసా"యనబడిన అశ్వినులును కలిసియే అవైస్థిక కథయందు "విగ్ర—నవాజా" యై యుండవచ్చును. విప్ర శబ్దము అవైస్థికగ్రంథమందు "విగ్ర"గను, నవగ్వశబ్దము "నవాజా"గను మారియుండవచ్చును.

ఇంతవరకు చర్చించిన గ్రీకు, కెల్టిక్, నార్వేగాథలను బట్టి వారిపూర్వజులకు యెడతెగని శీతల, దీర్ఘ, రాత్రిని గూర్చి పూర్తిగ తెలియునని స్పష్టమగుచున్నది. దీర్ఘరాత్రి యున్నప్పుడు దీనికి ప్రతిగ దీర్ఘదివసముకూడ యుండితీర

వలెను. కనుక, యీదీర్ఘదివసమును సూచించుగాధలుకూడ కలవేమో చూతము. "బాల్డర్" అను నార్వే సూర్యదేవునకు ఆకాశమందొక నివాసస్థానముగలదట. ఇందుపై రీసుగారి యభిప్రాయమేమనగ:— "ఉత్తరధ్రువమండలమందు సూర్యుడు క్షితిజముపై దీర్ఘకాలముండునను సృష్టిచమత్కారమే యీ కథవలన సూచింపబడుచున్నట్లున్నది." దీనినిపోలిన వర్ణనమే వేదమందుగలదు. సూర్యుడు తన రథాశ్వముల నూడదీసి ఆకాశ మధ్యమందు విశ్రమించుచునని వేదములు వర్ణించినవి. ఈవాక్య మును మనమిదివరకు ఆరవయధ్యాయములో చర్చించియే యున్నాము.

"స్లెవోనిక్" వాఙ్మయమందు ముగ్గురన్నదమ్ములకథ యొకటిగలదు. ముగ్గురన్నదమ్ములుగలరట. మొదటియిద్దరు తెలివిగలవారు. "ఇవన్" అను మూడవవాడు కొంచము అమాయికుడు. "ఇవన్" నివసించుచోట యెల్లప్పుడును రాత్రియే యుండునుగాని పగలులేనేలేదు. ఈదీర్ఘరాత్రి ఒకపాముచే గల్పింపబడెను. ఈపామును చంపివేయుటకై "ఇవన్" పూనుకొనెను. ఈపామును చంపగనే ప్రపంచ మందంతటను వెలుగు కలిగెను. ఈకథ వేదమందున్న "త్రిత" కథతో సర్వవిధములసరిపోవుచున్నది. ధ్రువమండల దీర్ఘరాత్రి రష్యాజాతివారిగాధలందు "చావుగాని, మాంసముగాని లేని అస్థిపంజరరూపమైన ఘోరపిశాచము"గ వర్ణింపబడియున్నది. ఆపిశాచము వీరులనందరిని తనయెముకల చేతులమధ్యపెట్టిపిసికి

చంపివేయునట. ధ్రువమండలదీర్ఘదినసమును సూచించుగాథ నింకొకదానిని మాత్రమే యిట పేర్కొందును. "[illegible]"జాతి వారిగాథలలో నొకకథకలదు. "[illegible]" అను పురుషుడును (ఉషస్సు) "అమ్మారిక్" అను స్త్రీయు (సంధ్య[illegible]) గలరు. పితృదేవత వీరిద్దరికొక కాగడ నిచ్చి " దీనిని ప్రతియుదయమందు వెలిగించవలెను, ప్రతిసాయంత్రమం దార్పివేయవలెను. " అని చెప్పెను. వారాప్రకారమే చేయుచుండిరి. వేసవికాలమందు నాలుగు వారములు వీరిద్దరును రాత్రిపూట కలిసియుండి వివాహమాడవచ్చునని యాపితృదేవత యనుజ్ఞ నిచ్చెను.అంతట వీరిద్ద రీపనిని వదలివేసి వివాహమాడబోయిరి. కాని, పోవునప్పుడు వీరీకాగడ నార్పివేయుట మరచి పోయిరి. ఈకాగడ నాల్గువారము లట్లే మండుచుండెను. ఈ కథవలన నాల్గు వారముల దీర్ఘదివసము సూచింపబడుచున్నది. కనుక, యాప్రదేశమందు దీర్ఘరాత్రికూడ నాల్గువారములే యుండి యుండవలెను. అనగ యీ ప్రదేశమందు ౧౧ మాసముల సూర్యరశ్మిగలదని యర్థము.

ధ్రువమండల నివాసమును గూర్చిగాని, తన్నాశనకారణమును గూర్చిగాని ఖండితముగ యీగాథలందు చెప్పబడకపోయినను, దీర్ఘఉషస్సులు, బహుఉషస్సులు, దీర్ఘదివసములు, దీర్ఘరాత్రులు, చీకటిశీతకాలములు, — మొదలగు ధ్రువలక్షణములు మాత్రమిందు స్పష్టముగ పేర్కొనబడి యున్నవి. వీనికిలోడు వైదిక అవైదిక ప్రమాణములను

గూడ జతపరచి చూచినచో, ధ్రువనివాసము తప్పక సిద్ధింప గలదు. అంధకారప్రకాశముల పోరాటమును దెల్పు అశ్విన వృత్రగాథలవంటి గాథలు పెక్కు లింకను కెల్టిక్, ట్యూటానిక్ వాఙ్మయములందు గలవు. అంధుడైన శీత కాలరాక్షసుడు వేసవిదేవుడైన "బాల్డరు"ను చంపెనని నార్వేగాథ చెప్పుచున్నది. జలములు, అంధకారము, పితరులు, — యీ మూడును ఒకేచోటనుండునని కెల్టిక్‌గాథలవలన తెలియుచున్నది. వైదికగాథలుకూడ యీ యంశమునే దెలుపుచున్నవి. సంవత్సరములో కొంతకాలము ఐరిషుదేవతలందరును బహు సుస్తిగ నుండిరట; అప్పుడు సూర్యుడును అతని తండ్రియు మాత్రమే శత్రువుల నెదుర్కొనగలిగిరట. దేవతలకుగలిగిన యీ సోమరితనమును దెలుపుటకు ఐరిషు ప్రజలలో "కౌవేడ్" అను నొక వింతయాచారము గలదట. శీతకాలమందు సూర్యుడు హీనతేజుడైనట్లే, దేవతలందరుకూడ హీనతేజులై సుస్తిగనుండిరని దీని తాత్పర్యము. దేవతలకు గలిగిన యీ సోమరిపోతుతనమును దెలుపుట కనేక గాథలున్నవి. వాని నన్నిటి నిట వివరింపజాలము. ఈ సంబంధమైన కెల్టిక్, ట్యూటానిక్ గాథల నన్నిటిని సూక్ష్మముగ పరిశీలించిన మిాదట గీసుగారు తేల్చిన సారాంశమును మాత్రమే యిట కొంత వివరించెదను.

అంధకార ప్రకాశముల కెప్పుడు యుద్ధము జరుగునో కెల్టిక్ గాథ ఖండితముగ నిర్ణయించి చెప్పుచున్నది. తన శత్రువు

చంపబడగనే సూర్యదేవత తిరిగి యెప్పుడు రాజ్యమునకు వచ్చునో నార్వేగాథయుందుగనే దెల్పుచున్నది. గ్రీకు దేవతలకును రాక్షసులకును జరుగు యుద్ధము యొక్క పర్యవసానము యుందుగనే చెప్పబడుచున్నది. తమదేవుని చరిత్ర చర్విత చర్వణముగ ప్రతిసంవత్సరమొకేమాదిరిగ నుండునని "క్రీటను" ప్రజలు చెప్పుచున్నారు. ఈగాథలన్నిటినిబట్టి అంధకారప్రకాశములకు (అనగ, రాక్షసులకు, దేవతలకు) జరిగిన పోరాటము సాంవత్సరికమేగాని దైనికముగాదని నిర్ణయమగుచున్నది. "ఫిర్గియను"ల దేవుడు (మనవిష్ణువువలెనే) శీతకాలములో నిద్రపోయి వేసవికాలములో పనిచేయును. శీతకాలములో దేవతలందరు చెరసాలలలో బంధింపబడియుందురనియు, వేసవికాలములో విడిచిపెట్టబడుదురనియు "పాఫ్లగోనియను" జాతివారు తలంచుచున్నారు. పరిష్యుప్రజల "కాసేడ్" అనువింత యాచారముకూడ దేవతలకు గలిగిన అనారోగ్యమును దెలుపుచున్నది. "జీయస్" అను గ్రీకుదేవుడు "టైఫ" యను రాక్షసునిచే యెముకలేని ముద్దగకొట్టబడి, ఒకగుహలో పారవేయబడి, దిక్కుమొక్కులేక యల్లాడుచు, నుండెనట. రాత్రింబవళ్ళను దెలుపు "ఓడిన్" దేవునియుంగరము సూర్యుని(బాల్డరు) చితిపైపెట్టినప్పుడు, అదిసూర్యునితోకూడ అధోలోకమందు పడిపోయి యదృశ్యమగునని నార్వేగాథ చెప్పుచున్నది. ఈ కథ ఉత్తరధ్రువమండలమందు శీతకాలములో రాత్రింబవళ్ళ నడక నిలిచిపోయి సర్వము అఖండదీర్ఘరాత్రిగ నుండుటను

సూచించుచున్నది. సూర్యదేవుడు నిద్రపోకుండ చాలదినములు పోరాడుచున్నాడట. దీనివలన ధ్రువమండల దీర్ఘదివసము సూచింపబడుచున్నది. సూర్యదేవునికుమారుడు ఆకాశమందు చాలసేపుకూర్చుని న్యాయవిచారణము చేయుచుండునట. ఇదికూడ దీర్ఘదివసమునే సూచించుచున్నది. ఈగాథలవలన ఆర్యుల మూలస్థానము చాల ఉత్తరదేశములందు గలదని తెలియుచున్నది.

క్రొత్తగ చేయబడిన భూగర్భ, భూనిక్షేప పరిశోధక శాస్త్రాదిపరిశోధనలవలన గాథాశాస్త్రజ్ఞులును భాషాశాస్త్రజ్ఞులును తమ పూర్వాభిప్రాయముల నెట్లు మార్చుకొనవలసి వచ్చెనో రీసుగారు వివరించియున్నారు. ఆర్యుల మూలస్థానము మధ్యాసియా యందు గలదని పండితు లిదివరకు తలంచుచుండిరి. కాని, యిప్పు డీనూతనపరిశోధనలవలన ఆర్యుల మూలస్థానము జర్మనీకి ఉత్తరమందుగాని, స్కాండినేవియా యందుగాని యుండియుండవలెనని పండితు లొప్పుకొనక తప్పినది కాదు. కాని, "జ్ఞానాభివృద్ధియైనకొలది ఆర్యుల మూలస్థానమును నిర్ణయించుటకు మన మింకను ఉత్తరమునకు పోవలసి వచ్చునేమో"యని నేనూహించుచున్నాను. ఏది యెట్లున్నను నేనిప్పుడు మీకు విశదీకరించిన గాథలన్నియు ధ్రువమండలమందేదోయొక స్థలమును సూచించుచున్నవని నా యూహ. నార్వేవారు అమరలోకమని చెప్పునట్టి యా భూమియే "ఫిన్లాండు" నకు ఉత్తరమున, తెల్లసముద్రమునకు

దగ్గరగ, నుండి యుండవచ్చును. ఆర్యులచ్చటనుండి కాలక్రమమున స్కాండినేవియాలోనికి దిగివచ్చి యుండవచ్చునని మన మూహింపవచ్చును. ఇట్లు దిగివచ్చి "ఉప్సల"వద్ద తదితరజాతులతో కలిసి స్థిరనివాసము లేర్పరుచుకొని యుండవచ్చును. ఈ చుట్టుపట్లప్రదేశమంతయు మిక్కిలి చదునైన సమతలముగ నున్నది. ఈ స్థలమంతయు చాల సమాధులతో నిండియున్నది. ఈ సమాధు లెప్పటికాలము నాటివో చెప్పలేనంత బహుపురాతనమైనవిగ నుండుటచే, ఇది చాల పురాతనస్థలమని చెప్పకయే చెప్పుచున్నది" — ఇవి రీసుగారి మాటలు. ఒక్క ఆర్యసంతతులకే గాక, తదితరమానవజాతులకు కూడ ఉత్తరమండలములే మూలస్థానము లని కొందరు పండితులు చెప్పుచున్నారు. "ఈ భూగోళమునకు ఉత్తరార్థమంతయు మానవనివాసమునకు యోగ్యము గానంత అత్యుష్ణముగ నుండుటచే, మానవకోటియంతయు మొట్టమొదట ధ్రువసముద్రతీరమందే యుదయించె"నని యొకానొక సుప్రసిద్ధ ఫ్రెంచిపండితుడు గట్టిగ తలంచుచున్నాడు.

పైనుదహరించిన రీసుగారి యభిప్రాయములకంటె నే నింక యెక్కువగ చెప్పవలసిన దేదియు లేదు. అంధకారప్రకాశములకు జరుగుచున్న యుద్ధముగ పోల్చి వర్ణింపబడదగిన సృష్టిచమత్కారములు ముఖ్యముగ మూడేగలవు. (౧) సూర్యుని దైనికాస్తమయము; (౨) శీతకాలమందలి సూర్యుని తేజోహైన్యము; (3) ధ్రువమండలమందలి దీర్ఘరాత్రి. ఈ

యుద్ధము సాంవత్సరికమేగాని, దైనికముగాదని మనమిదివరకే నిర్ణయించి యుండుటచే మొదటియంశమును పూర్తిగ కొట్టి వేయవచ్చును. ఆర్యుల ప్రాచీనగాథలలో దీర్ఘాంధకారము మాటయే లేకపోయినచో రెండవయంశముకూడ మనకు పనికి వచ్చెడిదే. కాని, యీగాథలలో స్పష్టముగ చెప్పబడియున్న దీర్ఘాంధకారమును సమర్థించుటకీరెండవయంశము సమర్థము గామిచే దీనినికూడ కొట్టివేయవలసినదే. ఇకమూడవయంశము మిగిలినది. మనమువైదిక, అవైదికగాథలను పరిశీలించినట్లే రీసుగారుకూడ కెల్టిక్, ట్యూటానిక్, గాథలను బహుజాగ్రతగ పరిశోధించి, వానిని గ్రీకుగాథలతోకూడ పోల్చిచూచి, ఆర్యుల ప్రాచీనమూలస్థానము ఉత్తరధ్రువమండలమందే యుండి యుండవలెనని యూహించిరి. మనము చర్చించిన యంశములు కూడ రీసుగారికి తెలిసియున్నచో వారీ యభిప్రాయమునే మరింత దృఢముగ చెప్పియుండెడివారు. అయినను, వీనితో అగత్యము లేకుండగనే వారు స్వతంత్రముగ చేసిన యూహ చాల విలువయైనది. ఇది మనముచేసిన నిర్ధారణతో పూర్తిగ యేకీభవించుచున్నది. అందువలన, మన సిద్ధాంతము రెండింతలుగ ఋజువగుచున్నది. భాషాశాస్త్రజ్ఞులుకూడ తమ పూర్వాభిప్రాయములను వదలుకొనిరి. కాని యీ నూతనాభిప్రాయములతో నేకీభవించుటకింకను వారు కొద్దిగ సంశయించుచున్నారు. అందుచేతనే, జ్ఞానాభివృద్ధియైనకొలదియు ఆర్యుల మూలస్థానమును నిర్ణయించుటకై మన మింకను ఉత్తరము

వకుపోయి, ధ్రువమండలమును ప్రవేశింపక తప్పదని సుగాను చెప్పియున్నారు.

ఒక్క ఆర్యులేగాక, తక్కిన మానవజాతు లందరును కూడ ధ్రువమండలమందే మొట్టమొదట నివసించియుండిరని చెప్పుచు "వారెన్" పండితుడు విపులముగ చర్చించి యున్నాడు. ఇది చాల ముఖ్యమైన విషయమనుటలో సందేహము లేదు. అయినను మన ప్రస్తుతాంశ మిప్పు డొక్క ఆర్యుల మూలస్థానము నిర్ణయించుట మాత్రమే మైయున్నది. గావున తక్కిన జాతులను గూర్చి మన మీ గ్రంథమందు వివరింపజాలము. ఏది యెట్లున్నను మన సిద్ధాంతము "వారెన్" గారి సిద్ధాంతముతో సరిభవించుచు, దాని కింకను బలమును చేకూర్చుచున్నదే గాని, దాని కెంతమాత్రమును భిన్నముగ లేదు. కనుక, మన సిద్ధాంత మన్నివిధముల ఋజువగుచు న్నదియున్నది.



వైదిక నిలయము

పదమూడవ అధ్యాయము.

ఆర్యుల ప్రాచీనసభ్యత, మతము.

వైదికార్యుల పూర్వజుల మూలస్థానమునుగూర్చిన చర్చ మనమిప్పుడు ముగించినాము. మనమీయంశమును పలుదృష్టులతో పరిశీలించియున్నాము. మనవాదములు కేవలము ప్రాచీన భాషాపరిశోధనలపై గాని, ప్రాచీనసభ్యతను దెలుపు చరిత్రాంశములపై గాని ఆధారపడియుండ లేదని తెలిసికొనవలెను. మన మింతవరకు జూపిన ప్రమాణములన్నియు ముఖ్యముగ వైదిక, అవైస్థిక గ్రంథములందున్న ప్రత్యక్షవాక్యములే యైయున్నవి. ఒక్క ఉత్తరధ్రువమండలమందు మాత్రమే గన్పట్టు శీతోష్ణాదిపరిస్థితులతో ఋగ్వేద కర్తలకు పరిచయము గలదని యీవాక్యములవలన నిస్సందేహముగ ఋజువగుచున్నది. క్షితిజముచుట్టు గిరగిరతిరుగు ఉషస్సు; వృత్రునిచే బంధింపబడిన జలము; దీనదశయందున్న దేవతలను, సూర్యుని రక్షించిన అశ్వినులు; శతక్రతుడగు ఇంద్రుడు; తన త్రిపాద

ములతో విశ్వము నాక్రమించిన విష్ణువు; అంధకార, సముద్ర ముల కధిపతియగు వరుణుడు; మాసాధిదేవతలగు సప్తాదిత్యులు; మూడవవాడగు త్రితదేవత; — ఇత్యాదిప్రధాన వైదిక దేవతలందరు స్పష్టముగ ధ్రువోత్పత్తిని తెలుపు లక్షణములతో నలంకరింపబడి యున్నారు. వేదముల మూడవ అధ్యాయ ములో ప్రత్యేకధ్రువమండల లక్షణములుగ చేర్చబడిన లక్షణములన్నియు ఋగ్వేదమందు స్పష్టముగ గానవచ్చు చునేయున్నవి. వీనివలన నిర్ధారణమగు సారాంశమువిషయమును ఎట్టి యనుమానముగాని, సందేహముగాని యుండవలసిన పనిలేనంత ఖండితముగ యీలక్షణములన్నియు ఋగ్వేదమందు వర్ణింపబడి యున్నవి. షాణ్మాసికదివసము, షాణ్మాసికరాత్రి, శోభాయమానమగు నూతనారుణకాంతులను వెలిగ్రక్కుచు, బహుదినములవరకు వలయాకారముగ క్షితిజము చుట్టు నాట్య మాడుచు బోవుచుండు అఖండదీర్ఘఉషస్సు, ధ్రువమండల దీర్ఘదివసము దీర్ఘరాత్రి ౧౨ మాసములకు తక్కువైన సూర్యరశ్మితో కూడిన సంవత్సరము— యివన్నియు వైదిక ఋషులకు తెలియును. వారు వీనినన్నిటిని వట్టిగాథలుగను, అలంకారములుగను గాక, కేవలము స్పష్టమగు ప్రత్యక్ష వాక్యములతో ఖండితముగ వర్ణించియున్నారు. పండితులు మొన్నటివరకు యీ వాక్యములలోని నిజభావములను తెలిసి కొనలేక వానికి పెడార్థములను కల్పించియుండిరి. అయినను అధునిక శాస్త్రపరిశోధనలవలన మన ప్రస్తుతాంశముపై

నూతన విజ్ఞానము ప్రసరించుచున్నది. ఈనూతన విజ్ఞానము నాధారముగ చేసికొన్నచో యీ వేదవాక్యముల నన్నిటిని సరిగ సమన్వయింపవచ్చును. ఇంతయేల, నేనీగ్రంథమందు చేయఁబూనిన పని యిదియే. ఏమనగ, ఇట్టి వేదవాక్యముల నన్నిటిని వెదకిపట్టి, యిాదంతర్గర్భితమైయున్న భావములను తెరచి చూపగల నిజకీలకము పండితుల కిదివరకు చిక్కకపోవుటచే వారీ వాక్యములు నెట్లుమెలిపెట్టి పెడార్థముల జెప్పవలసి వచ్చెనో, లేక వాని నెట్లు పనికిమాలిన వానిక్రింద త్రోసి వేయవలసివచ్చెనో, చూపుటకే నేనీగ్రంథమందు పూని యున్నాను — అంతమాత్రముచే యాస్కాచార్యాది భారత ప్రసిద్ధులుగాని, లేక సాయనాచార్యాది వ్యాఖ్యాతలుగాని, ఇదివరలో చేసియున్న కృషి పనికిమాలినదని నే చెప్పుటలేదు. వారి కృషియొక్క విలువను తగ్గించవలెనని నా తాత్పర్యము కాదు. అంతేగాక, వారియొక్క తోడ్పాటే లేకుండపోయినచో వేదార్థములను తీయుటలో మేమొక రవ్వంతపనినైనను చేయ జాలకపోయెడివారమే. ఈవిషయమును మే మందరము తెలుగా మొప్పుకొనియే తీరుచున్నాము. కనుక, యీవిషయములో వారుచేసియున్న మానవసేవనుగూర్చి నాకు పూర్తిగ తెలియును. ఈ పవిత్ర గ్రంథముల కర్థమును తీయుటలో వారు తాము చేయగలిగిన దంతయు పూర్తిగ చేసియే యున్నారు. ఈ విషయమై యెంతమాత్రమును సందేహము లేదు. నా కొనవచ్చియున్న యీసేవకై భవిష్యత్సం

తతులవారు వారియెడల నాతయు కృతజ్ఞులై యుండక తప్పదు. దీనిని కాదనువారెవరు నుండుటకు వీలులేదు. వేదములు మనయార్యజాతికంతకును బహు ప్రాచీనగ్రంథములనుటలో సందేహములేదు. ప్రాచీన మానవకోటియొక్క చారిత్రమునుగూర్చిన విజ్ఞానమిప్పుడు విరివిగ వృద్ధినొందుచున్నది. ఇట్టిజ్ఞానాభివృద్ధి యగుచున్నకాలమున యీప్రాచీన గ్రంథములందు కొన్నికొన్ని నూతనాంశములును, నూతన వాక్యములును అప్పుడప్పుడు క్రొత్తగ బయటపడుట తటస్థించుచుండవచ్చును. మనపూర్వజుల ఆచారవ్యవహారములనుగూర్చిగాని, వారు నివసించియున్న పరిస్థితులనుగూర్చిగాని, స్పష్టపరుపగల శాస్త్రములు మనపండితులీవ్యాఖ్యలు వ్రాసిన కాలమునాటికి పూర్తిగ వికసించియుండకపోవుటచే, యిప్పుడు క్రొత్తగ బయటపడుచున్న యీనూతనాంశములు వారి దృష్టిపథమందు పడియుండకపోవచ్చును. కావున, మన ప్రాచీన వ్యాఖ్యాతలిదివరలో చూడనట్టిగాని, చూచియు వదలనట్టిగాని, నూతనభావములిప్పుడు మనకు వైదిక, [illegible] గ్రంథములందు క్రొత్తగ గాన్పించుచున్నచో అదియొక వింత గాదు. అందుచేతనే, నే నీ గ్రంథములందు వేదవాక్యములకు క్రొత్తగ చెప్పియున్న యర్థములను పూర్వవ్యాఖ్యాతల యర్థములతో పోల్చిచూచునప్పుడు పాఠకమహాశయు లీయంశమునే తమమనస్సులం దుంచుకొనవలెనని ప్రార్థించుచున్నాను.

మనమీ గ్రంథమందెత్తిచూపిన వేదవాక్యములకు సరిగయర్థము చెప్పినచో వీనియందంతర్గర్భితములై యున్న ధ్రువలక్షణములు తప్పక బయటపడుచున్నమాట వాస్తవమే. మన సిద్ధాంతమును ఋజువుచేయుట కీవాక్యము లొక్కటే చాలును. కాని, మన సిద్ధాంతము కేవలమీ వేదవాక్యముల కిట్లర్థము చెప్పుట మీదనే యాధారపడియుండ లేదు. వేదకాలమునాటి ప్రజలకర్మకాండను పరిశీలించినను, వారి ప్రాచీనగాథలను పరిశీలించినను కూడ మన కీసారాంశమే సిద్ధించుచున్నది. ఇవన్నియు అవెస్థికగాథలవలనను, పరంపరలవలననే గాక, ఐరోపాఖండస్థులగు తదితర ఆర్యజాతుల గాథలవలనకూడ మరింత బలపడుచున్నవి. ఉదాహరణార్థమై మన మిచ్చట దశగ్వుల దశమాసికసత్రమును, పదియవదియగు డిశంబరు నెలతో అంతమొందు ప్రాచీన రోమనుసంవత్సరముతో పోల్చిచూడవచ్చును. ఇట్టియుదాహరణల పెక్కింటిని మనమిదివరకే పూర్తిగ చర్చించియున్నాము. షాణ్మాసిక దివసమును, షాణ్మాసికరాత్రిసగూర్చిన పరిజ్ఞానమొక్క ప్రాచ్యఖండస్థులగు ఆర్యులకేగాక ఐరోపాఖండస్థులగు ఆర్యశాఖలవారికి కూడ పూర్తిగ గలదని నేనిదివరకే ఋజువుపరచియున్నాను. మరియు, మిక్కిలి యుత్తరమునసున్న పారశీకస్వర్గమును గూర్చియు, అందలి ప్రజలకు సంవత్సరమొక్క దినముగ గన్పించుటను గూర్చియు, హిమప్రళయముచే నాస్వర్గమంతయు దట్టమైన మంచుక్రింద పడి పూడిపోవుటను

గూర్చియు, ‘వెందిదాద’ గ్రంథమందు భద్రపరుపబడి యున్న ప్రాచీనపరంపరగాథ మన సిద్ధాంతమును ధృవపరుచుటకు ప్రబలప్రమాణముగ నున్నది. “ఆర్యుల మూలస్థానము ఫిన్లాండు లేక తెల్లసముద్రప్రాంతములో” గలదని పాశ్చాత్యార్యగాథలు చెప్పుచున్నవి. కాని, వైదిక, అవెస్టిక గాథల మూలస్థానము నింకను ఉత్తరమునకు తీసికొని పోవుచున్నవి. ఏలయనగ:— ముప్పది దినముల [illegible]గల యఖండదీర్ఘయుషస్సు మనకు గానవలె నన్నచో, అది యుత్తరధ్రువమునకు బహు దగ్గరలోనే గాని తదితర చోట్ల దొరకదు. ఈ ప్రకారముగ ఆర్యుల భూగోళముపై యే యక్షాంశమం దుండెనో స్పష్టముగ చెప్పికొనుట కవకాశమున్నను, ఏదేశప్రదేశమం దుండెనో ఖండితముగ తెలియజెప్పగల సూచన యీగాథలం దెంత మాత్రమును లేదు. అనగ, ఐరోపాఖండమునకు ఉత్తరమున నుండిరా లేక, ఆశియాఖండమునకు ఉత్తరమునుండిరా యను నంశమును నిర్ధారణచేయుట కట్టియవకాశములును చిక్కకున్నవి. కాని, యీప్రాచీనగాథలు తదితర శాఖలలోకంటె భారతీయ, పారశీక గ్రంథములందే యిప్పటికిని యెక్కువ బాగుగ భద్రపరుపబడియుండుటచే బహుశః ఆర్యులమూలస్థానము ఆశియాఖండమునకే యుత్తరమునుండి యుండవలె ననుట యెక్కువ సమంజసముగ తోచుచున్నది. అనగ, స్కాండినేవియాలో నున్నదనుటకంటె, సైబీరియాకు ఉత్తర

ముననే యున్నదనుట యెక్కువ సమంజసముగ నుండును. కాని, యింతకంటెయెక్కువ ప్రమాణములు దొరకనప్పుడు యీ యంశములనుగూర్చి పట్టి యాంచనాలను వేయుట నిష్ప్రయోజనము. ఏది యెట్లున్నను ప్రాచీనధ్రువమండల నివాసము మాట రూఢియే యని వైదిక అవైస్థికగ్రంథ ములు స్పష్టముగ సాక్ష్య మిచ్చుచున్నవి. హిమప్రళయము నకు పూర్వ మీధ్రువప్రాంతమందు మంచి సమశీతోష్ణపరి స్థితులు ప్రబలియుండెననికూడ యీగ్రంథములు సాక్ష్య మిచ్చుచున్నవి. కాని, ధ్రువమండలమందే ప్రత్యేకస్థలమందు ఆర్యులు కాపురముండిరో ఖండితముగ నిర్దేశించి చెప్పుట కింతకంటె యెక్కువ ప్రమాణములు మన కిప్పుడు లేవు. ఈయున్నవానితోడనే మన మిప్పుడు సంతృప్తిజెంది యుండ వలెను. ఆధునిక భౌతికశాస్త్రజ్ఞులచే నేటివరకు చేయబడి యున్న భూగర్భ, భూనిక్షేప పరిశోధనలయొక్క ఫలితాంశ ముల నన్నిటిని యీ గ్రంథారంభమందు క్లుప్తముగ వివరించి యున్నాము. వీనివలన మానవకోటియొక్క ప్రాచీనచారి త్రము కొంతవరకు బోధ పడుచున్నది. మరియు, ఆశియా యిరోపాఖండము లందలి యుత్తరభూము లన్నియు చతుర్థయుగ మందనేక హిమప్రళయములకు లోనయ్యె ననియు కూడ యీపరిశోధనలవలన దెలియుచున్నది. క్రిందటి హిమప్రళయమునకు పూర్వ మీభూగోళముపై మానవజాతి లేనే లేదని యిన్నటివరకు భూగర్భశాస్త్రవేత్తలు

తలంచుచుండుటచే వారి భ్రమ ప్రమాదముల నన్నిటిని తొలగించుటకై యిటీవల ప్రబలిన భూగర్భశాస్త్రపరిశోధనల యొక్క సారాంశమునంతటిని యీగ్రంథారంభమున దిగువ వివరింపవలసివచ్చినది. ఈసారాంశమును పరికించి చూచినచో మనధ్రువసిద్ధాంతము సమస్తపండితులచే ఖండితముగ నామోదింపబడిన యీయంశమునకు భూగర్భశాస్త్ర పరిశోధనలంతో సర్వవిధముల విధాయకముగ నరిపోవుచున్నది. మానవకోటి యొక్క ప్రాచీనత తృతీయ యుగమునకుకూడ ప్రాకుచున్నదనియు, హిమప్రళయమునకు పూర్వ ముత్తరధ్రువమండలమందు మంచి సమశీతోష్ణస్థితి యుండెననియు, తదుపరి తటస్థించిన హిమప్రళయముచే నాసమశీతోష్ణస్థితి పాడైపోయి, మానవ నివాసమున కనుపయోగమయ్యెననియు మొదలగునట్టి ప్రధానాంశముల పెక్కింటిని ఆధునిక భూగర్భ్యాదిశాస్త్రములు ఋజువుపరచి యిదివరకున్న భ్రమప్రమాదములను పూర్తిగ తొలగించి యుండనిచో మనధ్రువసిద్ధాంతము కేవల మసంభవమైపోయెడిదే. అతిచలిని, శీతకాలమును సూచించు వేద ప్రమాణములచే ధ్రువనివాసమును స్థాపించుటకై పండితులిదివరకు చేసినకృషి యేలఫలించలేదో మనమిప్పుడు సులభముగ గ్రహింపవచ్చును. ఏలననగ:— అసలు మొట్టమొదట, హిమప్రళయమునకు పూర్వమాప్రదేశమందు అతిచలిగాని, మంచుగాని లేనేలేదు. ఒకవేళ, అచ్చటచ్చట వేదవాఙ్మయమందు "శతంహిమం"వంటిపదములెచ్చటనైన గాన్పించినను,

అవి యామూలస్థానమందున్న అతిచలినిగాని, మంచునుగాని తెలుపుచిహ్నములని గ్రహించుటకును వీలులేదు. ఆర్యులకు మూలస్థానమైన యాధ్రువమండలమందు దీర్ఘరాత్రితో కూడిన శీతకాలము రాగనే ప్రాతసంవత్సర మంతమైపోవుటచే "శతంహిమం" వంటిపదము లాకాలమున వాడుకలోనికి వచ్చియుండును. మొట్టమొదట మంచి సమశీతోష్ణస్థితితో నొప్పారుచున్న యీభూమిని పాడుచేసినది యీ హిమప్రళయమేగాని వేరొండుగాదు. ఈహిమప్రళయము రాబట్టియే ఆభూమియంతయు మంచుక్రిందపడి పాడైపోయి మానవనివాసమున కనుపయోగమయ్యెను. ఈయంశమే అవైస్థిక గ్రంథమం దింకొక రీతిగవర్ణింపబడియున్నది. ఐర్యనవైజో యను మూలస్థానము మొట్టమొదట స్వర్గతుల్యముగ నుండెననియు, తదుపరి అంగ్రమైన్యుడువచ్చి ఆప్రదేశమం దతి చలిని, మంచును గల్పించి దానిని పాడుచేసెననియు వందిదాదుగ్రంథము చెప్పుచున్నది. అవైస్థిక వర్ణనమును, ఆధునిక భూగర్భశాస్త్రపరిశోధనలును యీరీతిగ నూచినట్లు సరిపోవుచుండుటచే ఆర్యులకాలమం దీయుత్తరధ్రువమండలమునకు కాపురముండిరో మన మిప్పుడు సులభముగ నిర్ణయింప వచ్చును. ఎట్లనగ:— ఉత్తరధ్రువమండలమందు మంచి సమశీతోష్ణస్థితి హిమప్రళయమునకు పూర్వమందే యుండియుండవలెను గాని, హిమప్రళయానంతర

ముందుట కనకాలము లేదని ఆధునిక భౌతిక శాస్త్రములు ఖండితముగ సిద్ధాంతీకరించి యున్నవి.

క్రిందటి హిమప్రళయము గతించి యిప్పటికి ౧౦ వేల సంవత్సరము లైనదనియు, ౮౦ వేల సంవత్సరములు కావ నైనదనియు కొందరు భూగర్భశాస్త్రవేత్తలు చెప్పుచున్నారు. వేదసూక్తములు పుట్టి క్రీ॥పూ॥ ౪౫౦౦ సంవత్సరములకంటె యెక్కువకాలము కాలేదని కొందరు పండితులు తలంచిరి. అందుచే, హిమప్రళయమునకు పూర్వమందున్న యైతిహ్యము హిమప్రళయమునకును వేదకాలమునకును మధ్య గతించిన యీ వేలకొలది సంవత్సరములలో చెడిపోకుండ పారంపర్యముగ, కేవలవాగ్రూపములుగ భద్రపరుప బడియున్నవని తలంచుటకు వీలు లేదని కొందరు వాదింప వచ్చును. కనుక, మనమీ విషయము నిచ్చట కొంచెము విపులముగ చర్చించుట యవసరమైయున్నది. తైత్తిరీయసంహిత యందును, బ్రాహ్మణములందును నక్షత్రమాల కృత్తికలతో ప్రారంభమగుటచే వసంతవిషువము ఆకాలమందు (క్రీ॥ పూ॥ ౨౫౦౦) కృత్తికలలో నుండెనని సిద్ధించుచున్నది. కాని వేద వాఙ్మయమందన్నటో మృగశీర్షప్రథమనక్షత్రమైనట్లు దెలుపు నిదర్శనములు పెక్కులు గానవచ్చుచున్నవి. తైత్తిరీయసంహిత కంటె బహు పురాతనము లైనవని నిస్సందేహముగ స్థిర పరుపబడిన ఋగ్వేదసూక్తముల పెక్కింటినిబట్టిచూడగ వాని యందు షుమారు క్రీ॥ పూ॥ ౪౫౦౦ సంవత్సరములను

సూచించు నిదర్శనము లనేకములు గన్పట్టుచున్నవి. అది గాక, యీవసంత విషువనే ఒకప్పుడు అదితిచే యధిష్ఠింపబడిన పునర్వసు నక్షత్రమం దుండియున్నట్లు దెల్పు నిదర్శనములు వేదవాఙ్మయ మందచ్చటచ్చట కొద్దిగ గాన్పించుచున్నవి. ఈస్థితి క్రీ॥ పూ॥ ౬౦౦౦ సంవత్సరములక్రిందటమాత్రమే సాధ్యమైయుండగలదు. ఈయంశముల నన్నిటిని నేనిదివరకు రచించిన "మృగశీర్షా" గ్రంథములో వివరించియున్నాను. ఇంతకంటె ప్రాచీనములైన వసంతవిషువత్ స్థానములను వెదకి కనిపెట్టుటకై నేనిటీవల కొంతపరిశోధనను చేసియుంటిని. కాని, అట్టివి నాకేవియు చిక్కలేదు. దానికిమారుగ యీ పరిశోధనలలో నాదృష్టి క్రమక్రమముగ ధ్రువనివాసమును గూర్చియు, ధ్రువపంచాంగలక్షణములనుగూర్చియు దెల్పు ప్రమాణములతో నిండియున్న వేదవాక్యములచే యెక్కువగ నాకర్షింపబడుచువచ్చెను. ఈప్రమాణవాక్యములను సూక్ష్మముగ పరిశీలించినకొలది నాకు చూడగ వైదికార్యులు షుమారు క్రీ॥ పూ॥ ౫, ౬ వేల సంవత్సరములక్రిందట మధ్యాసియా ఖండస్థములగు సమప్రదేశములలో స్థిరనివాసము లేర్పరుచు కొని యుండిరని నాకుతోచినది. ఇట్లు వీరు మధ్యాసియా యందు స్థిరనివాసమేర్పరచుకొనిన నాటికి, తత్ ప్రాచీన ధ్రువనివాసమునుగూర్చియు, అది మంచుచే నాశనమైపోవు టనుగూర్చియు, వైదికదేవతల ధ్రువోత్పత్తినిగూర్చియు, దెల్పు పరంపరలు వీరికిబాగుగ తెలియునని నే నీవేద

వాక్యములచే గ్రహించితిని. కనుక, ధ్రువప్రదేశమును పాడుచేసిన క్రిందటి హిమప్రళయమును తీసికొనిపోయి మృగశీర్షాయుగమునకు చాల వేలసంవత్సరముల వెనుకబెట్టుట కవకాశమీవైదికపరంపరలయందు నా కెచ్చటను గానుపించుటలేదు. నేనీప్రకారముగ వేసిన యంచనా అమెరికను భూగర్భశాస్త్రవేత్తల సిద్ధాంతములతో చక్కగ నేకీభవించుచున్నది. కొండలోయలకోతనుబట్టియు, బాగుగ పరిశోధించి నిశ్చయించిన తదితరాంశములనుబట్టియు చూడగ క్రిందటి హిమప్రళయము గతించి క్రీ॥పూ॥ ఎనిమిదివేల సంవత్సరములకంటె యెక్కువ కాలేదని యీ యమెరికను భూగర్భశాస్త్రవేత్తలు నిర్ధారించియున్నారు. ఈ యంశముల నన్నిటిని యీ గ్రంథారంభమందు మొదటి రెండధ్యాయములలో వివరించియున్నాము. వైదికపంచాంగమును, తత్పరంపరలనుకూడ అమెరికను భూగర్భశాస్త్రవేత్తలు తగుమాత్రముగ తగ్గించి వేసిన యంచనాను స్వతంత్రరీతిగ బలపరుచుచున్నవనికూడ మనము చెప్పవచ్చును. రెండు స్వతంత్రరీతులుగ చేసిన పరిశోధనలవలన ఒక్కటే సారాంశము తలవనితలంపుగ తేలినప్పుడు, "క్రోలు" మొదలగు పండితులు వేసిన ౨౦, ౮౦ వేల సం॥ల విపరీతపు అంచనాలను మనము త్రోసివేయవచ్చును. ప్రస్తుతము మనకు గల శాస్త్రాదిపరిజ్ఞానమును బట్టి చూచినంతవరకైనను క్రోలుగారి యంచనాను త్రోసివేసి తత్‌స్థానమున, క్రిందటి హిమప్రళయము గతించి తదనంతర

యుగమారంభమై యిప్పటికి షుమారు క్రీ॥ పూ॥ యెనిమిది వేల సంవత్సరములైనదను అంచనాను అంగీకరింపవచ్చును. ఈ హిమప్రళయానంతర యుగమునుండి మృగశీర్షాయుగము నకు వచ్చుటకు షుమారు 3 వేల సంవత్సరములు పట్టును. కనుక, హిమప్రళయాత్పూర్వమునాటి పరిస్థితులను దెల్పు పరంపరలను ఆర్యులీమూడువేలసంవత్సరముల పొడవునను మరచిపోకుండ జాగ్రతగ, జ్ఞాపకముంచుకొనుచువచ్చి, యీ మృగశీర్షాయుగమందు వానిని వేదసూక్తములలో నిమిడ్చి పరంపుచుండిరని చెప్పవచ్చును. దీనిలో అసంభవమేమియు లేదు. (ఈవేదసూక్తములు మృగశీర్షాయుగమందే యుత్పత్తి యైనట్లు స్పష్టమగు నిదర్శనములు గాన్పించుచున్నవి.) నేయేల, మనవైదికపరంపరలు భౌతికశాస్త్రప్రమాణములకు విరోధముగ లేకపోవుటయేగాక, క్రిందటిహిమ ప్రళయకాల నిర్ణయమునుగూర్చి భౌతికశాస్త్రజ్ఞులు అతివిపరీతముగ వేయు నిర్ణయించనాలను క్రమప్రకారము తగ్గించి, చక్కగసరి చేయుటకే యుపకరింపుచున్నవి. మితప్రమాణముగనున్న అమెరికను శాస్త్రజ్ఞుల యభిప్రాయమును మన మంగీకరించి నచో భూగర్భశాస్త్రపరిశోధనలును మన వైదికపరంపర లునుగూడ—ఒకేకాలమును సూచింపుచున్నవి. హిమ ప్రళ యానంతరమందు మనయార్యులు తమ జన్మస్థానమునుండి లేచిరావలసివచ్చిన కాలము క్రీ॥ పూ॥ షుమారు ఎనిమిది వేల సంవత్సరములై యుండునని దీనివలన తెలియుచున్నది.

ఒక్క వైదికపరంపరలే గాక, పౌరాణికపరంపరలను కూడ మనము సరిగ యర్థము చేసికొన్నచో అవియుండ యీ సారాంశమునే ధృవపరుచుచున్నవి. బహుదీర్ఘకాల యవధులలో యీభూగోళమును, విశ్వమునుగూడ అప్పుడప్పుడు ప్రళయమొందుచుండునని మనపురాణములు చెప్పుచున్నవి. ఈభూగోళమునకు చిన్నప్రళయమును, విశ్వమునకు పెద్ద ప్రళయమును తటస్థించుచుండునని, పురాణములు చెప్పుచున్నవి. బ్రహ్మ తన పగటియందు మేల్కొని యున్నప్పుడు యీ సృష్టియుండునట; కాని, దివసాంతమందు దాతడు నిద్ర పోయినప్పు డీసృష్టి ప్రళయమొంది నాశనమగునట; మరల ఆత డుదయమున మేల్కొని తన పనిని ప్రారంభించుటతోడనే తిరిగి యీసృష్టియుత్పత్తి యగునట కావున, బ్రహ్మయొక్క సాయంప్రాతరములే భూమికి ప్రళయ, ప్రభవములగును. బ్రహ్మయొక్క రాత్రిగాని పగలుగాని "కల్ప" మగును. బహుదీర్ఘకాలమును గణించవలసివచ్చినప్పుడు కల్పమును మానముగ గ్రహింతురు. రెండు కల్పములు కలిసినచో బ్రహ్మ కొక అహోరాత్రమగును. ౩౬౦ × ౨ = ౭౨౦ కల్పములైనచో బ్రహ్మ కొక సంవత్సరమగును. ఇట్టి సంవత్సరములు నూరైనచో బ్రహ్మకు పూర్ణాయుర్దాయమగును. బ్రహ్మకు నూరేండ్లు నిండగనే యీ విశ్వమంతయు మహాప్రళయమందు లయమగును. ఈ మహాప్రళయ మందు బ్రహ్మ కూడ లయమగును. కృత, త్రేతా, ద్వాపర, కలియుగ

ములు కలిసి దేవతల కొక యుగ మగునని మనుధర్మశాస్త్ర మును, భారతమును చెప్పుచున్నవి. ఇట్టి వెయ్యి దేవయుగ ములు కలిసి కల్పము లేక బ్రహ్మ కొక పగ లగును. (12, 000, 000 మానవ సంవత్సరములు — ఉభయ సంధ్యా కాలములతో సహా). ఈ కల్పాంతమందీ ప్రపంచము ప్రళయ ములో మునుగును. కాని, పురాణములలోని లెక్క దీనికి భిన్నముగ నున్నది. కృతత్రేతా ద్వాపరకలియుగములు కలిసి మహాయుగమగునట; ౭౧ మహాయుగము లొక మన్వంత రము; ౧౪ మన్వంతరము లొక కల్పము; ఈ లెక్కప్రకా రము కల్పమందు ౪, ౩౨౦, ౦౦౦, ౦౦౦ సంవత్సరము లుండును. పురాణములకును, మను భారతములకును నిట్టి భేద మేల గలిగె ననగ:— కృత త్రేతా ద్వాపర కలియుగము లకు చెప్పిన సంవత్సరములు దేవమానమని పురాణములును, మనుష్యమానమని మను, భారతములును గ్రహించియున్నవి. ఈ మాన భేదముచే ఇట్టి భేదముగ లైను. ఈవిషయమై ఇంకను యెక్కువ వివరములు దెలుసుకొనదలచినవారు కీర్తిశేషులైన యస్. బి. దీక్షితులుగారు మరాటీభాషలో రచించిన "భారత జ్యోతిశ్శాస్త్రచరిత్ర"ను శ్రీమాన్ రంగాచార్య పండితులవారు "యుగములు"నుగూర్చి రచించిన వ్యాసమును, అయ్యరుగారు రచించిన "ప్రాచీనభారతకాలక్రమానుసరణి"ని(Chronology of ancient India)చూడవచ్చును. అయ్యరుగారు తమగ్రంథ మందు యుగములను గూర్చియు, అందు ముఖ్యముగ కలి

యుగారంభమునుగూర్చియు, బహుసూక్ష్మముగను, సమగ్రముగను పరిశోధనజేసియున్నారు. ఒక్క ఆర్యభట్టుడు తప్ప తక్కిన భారతజ్యోతిశ్శాస్త్రజ్ఞులందరును పౌరాణిక గణితమునే యవలంబించినట్లు గాన్పించుచున్నది. ౭౧ మహాయుగములకు మారుగ ఆర్యభట్టుడు మన్వంతరములో ౭౨ మహాయుగములు గలవని తలంచుచున్నాడు. మఱియు, మహాయుగమందు కృత త్రేతాద్వాపర కలియుగములు నాలుగు సమభాగములని కూడ ఆర్యభట్టుని యభిప్రాయము. పౌరాణిక కాలగణన ప్రకారము మన * యిప్పుడు ప్రస్తుతకల్పమగు శ్వేతవరాహ కల్పమందు, యేడవదియగు వైవస్వతమన్వంతరమునందుక్క ౨౮ వ మహాయుగములోని కలియుగములో అయిదువేల మూడుసంవత్సరములు గతించి, అయిదువేల నాల్గవసంవత్సరములోనున్నాము. అనగ, ప్రస్తుత కల్పారంభమందు సంభవించిన ప్రళయము జరిగి యిప్పటికి ౧, ౯౭౨౯, ౪౯, ౧౦౩ సం॥ లైనదని యర్థము. శ్రీమాన్ రంగాచార్య పండితులవారు చెప్పినట్లు, యీ యంచనా ఆధునిక భౌతిక శాస్త్రజ్ఞులచే యంగీకరింపబడిన పరిమితికంటె చాలవిపరీతముగ మించిపోవుచున్నది. ఈకల్పారంభమందు సూర్యచంద్రాదులును, గ్రహములును,—అన్నియు,—ఒకే ఋజురేఖ (Straight line) యందుండెనని హిందూ జ్యోతిశ్శాస్త్రజ్ఞులు తలంచిరి. కావున, సూర్యచంద్రాదులును, గ్రహములును యీరీతిగ, భూమి

* "ఇప్పుడు" అనగ తిలకుగారీగ్రంథమును రచించిన ౧౯౦౩ సం॥ లో—

చుట్టు సంపూర్ణావృతు లొనర్చివచ్చి, తిరిగి అన్నియుకలిసి యేక రేఖయందే, యేకకాలమందే, నిలుచుట కెంతకాలము పట్టునో గణితశాస్త్రరీత్యా మన జ్యోతిష్కులు బహుశః లెక్కవేసి చూచియే యీ యంకెను నిర్ధారణచేసియుండ వచ్చును. అయినను, ఇది మన ప్రస్తుతాంశమునకు సంబంధిం పనిచే మనమిప్పు డీవివరములలోనికి దిగిచూడవలసిన పని లేదు. ఈపౌరాణిక పద్ధతికి కృతత్రేతాద్వాపరకలియుగములే ప్రధానమూలము. కనుక, చతుర్యుగవ్యాప్తమైన యీమహా యుగలక్షణ మెట్టిదో మనమిట కొంతసూక్ష్మముగ పరిశీలింప వలసియున్నది. అసలు, మొదట దీనియందున్న భావమును, దీని కిప్పుడు పండితులు సాధారణముగ చెప్పుచున్న భావ మును ఒకటి యగునో కాదో చూడవలసియున్నది.

శ్రీమాన్ రంగాచార్య పండితులవారును, ముఖ్యముగ అయ్యరుగారును యీయంశమునుగూర్చి మిక్కిలి సమర్థతతో తమ వ్యాసములందు చర్చించియున్నారు. వారి సారాంశముల తో నేను చాలవర కేకీభవించుచున్నాను. "చాలవరక"ని యెందుకు చెప్పుచున్నాననగ, నేనొనర్చిన పరిశోధనలవలన యీ "దేవసావత్సర" సిద్ధాంతమును కొట్టివేయవలసినదే యని నాకుకూడ స్వతంత్రరీతిగ దోచినను యీసందర్భమందింకను పరిష్కరింపబడవలసిన యంశములు చాలగలవు. ఇంక నెక్కు వగ పరిశోధన జేసిన మీాదటగాని, వీనినన్నిటిని పూర్తిగపరిష్క రించుటకు వీలులేదు. "యుగ"మనగ నెట్టుకానొకకాలపరి

మాణ"మను అర్థమందు ఋగ్వేదములో ప్రయోగింపబడి యున్నదని నేనిదివరకే దెలిపియుంటిని. మఱియు, "మానుషా యుగా" యనుపదమందున్న "యుగ" శబ్దమునకు "మానవులు" అను నర్థము చెప్పవలెనని కూడ వివరించియున్నాను. కాని, ఋ X, 72, 3 లోనున్న "దేవానాం ప్రథమే యుగే" వంటి పదములలోనున్న "యుగ" శబ్దము మాత్రము చాల యెక్కువ కాలమునే సూచించుచున్నది. అథ. వే. VIII, 2, 21 లో "మేము నీకు నూఱు, (లేక) పదివేల సంవత్సరములను గాని, లేక ౨, ౩, ౪ యుగములను గాని, యిచ్చుచున్నాము" అని యున్నది. [శతంతేఽయుతం హాయనాన్ద్వే యుగే త్రీణి చత్వారి కృణ్మః ॥] ఇచ్చట "యుగ" శబ్దము ౧౦ వేలసంవత్సరములకు తక్కువగాని కాలమును దెలుపుచున్నది. అందుచేతనే, యీ అథర్వవేదవాక్యములో ("పది వేల సంవత్సరముల"ని మాత్రమే చెప్పి) "ఒక" యుగ మను మాట చెప్పకుండ బుద్ధిపూర్వకముగ వదలివేసినారని ఆచార్యులుగారు చెప్పిన యభిప్రాయము వాస్తవమే. ఈ యభిప్రాయ ప్రకారము అథర్వవేదసంహితాకాలమునాటికి "యుగ" మనగ "పదివేలసంవత్సరములకాలము"ని యర్థము చేసికొన వచ్చును. ఇంతకెక్కువ వీలులేదు. మను, మహాభారతకర్తలు కృతత్రేతాద్వాపర కలియుగములకు వరుసగ ౪, ౩, ౨, ౧ వేలసంవత్సరముల పరిమితుల నిచ్చియున్నారు. అనగ, కలియుగ సంఖ్యను ౨, ౩, ౪ లచే గుణించగ ద్వాపర, త్రేతా,

కృతయుగముల సంఖ్యలు క్రమముగ వచ్చుచున్నవి. ('కృత'శబ్దమును లాటిన్ భాషలోనున్న "క్వాటుర్"— Quatuor — శబ్దముతో అయ్యరుగారు పోల్చియున్నారు.) సంస్కృత వాఙ్మయమందు "కృత"యనగ నాలుగను నర్థముగలదు. ఈ యర్థమునుబట్టి చూడగ, యీ యుగములపై క్లీసంఖ్యలను బట్టియే వచ్చినవని యనుకొనవచ్చును. కాని, యీ చతుర్యుగముల కాలపరిమితిని నిర్ణయించుటయే మన కిప్పుడు ప్రస్తుత కర్తవ్యము. ఈ చతుర్యుగములకు చెప్పబడిన సంఖ్యల నన్నిటిని కలిపినచో మొత్తము (४ + ३ + २ + १ = १०) పదివేల సంవత్సరము లగును. దీనికే "మహాయుగ" మని పౌరాణికులు పేరిడిరి. మనువును, వ్యాసులవారును యీ పదివేల కింకొక २ వేల సంవత్సరములను కలిపిరి. చతుర్యుగముల మధ్యవచ్చు "సంధ్యా" లేక "సంధ్యాంశా" కాలము లన్నియు కలిసి మొత్తముమీద రెండువేల సంవత్సరము లగునట. ఎట్లనగ:— కృతయుగము గతించిన తక్షణమే త్రేతాయుగము రాదు. కృతయుగమున కాద్యంతములందు చేరి నాలుగువందల సంవత్సరములును సంధ్యాకాల ముండునట. అట్లే త్రేతాయుగాద్యంతములందు చేరి ३०० సంవత్సరములు సంధ్యాకాల ముండును; ద్వాపరాద్యంతములందు చేరి २०० సంవత్సరములును, కలియుగాద్యంతములందు చేరి १०० సంవత్సరములును సంధ్యాకాలము లుండును. 'సంధ్యా'యనగ సాధారణముగ ఉషఃకాలమని యర్థము.

మనకు సాధారణముగ ౩౦ గడియలు యహస్సులో ౬ గడియలు ప్రాతఃకాలమందు ఉషస్సును; ౬ గడియలు సాయంకాలమందు 'యీరెండయు' నుండును. ఈ సంధ్యాకాలములు యవగా యహస్సులో పదియవ వంతు గనుక, ప్రతియుగసంధ్యాకాలమునుకూడ ఆ యుగపరిమాణములో పదియవ వంతుగ నిర్ణయించిరని అయ్యరుగారు చెప్పుచున్నారు. కావున, యీ సంధ్యాకాలములు యిటీవల క్రొత్తగ చేర్చబడియుండవచ్చునని అయ్యరుగారి యభిప్రాయము. ఈ లెక్క ప్రకారము, సంధ్యాకాలములను కూడ కలుపుకొన్నచో చతుర్యుగముల పరిమితి పదివేలనుండి పన్నెండు వేలకు పెరుగుచున్నది. (అనగ, కృతయుగము ౪౮౦౦, త్రేతాయుగము ౩౬౦౦, ద్వాపరయుగము ౨౪౦౦, కలియుగము ౧౨౦౦). మనుశాస్త్రమునాటికే, లేక, మహాభారతమునాటికే, కలియుగమారంభమైనది. కనుక, కలియుగములో, వెయ్య, లేక ౧౨౦౦ సాధారణ మానవ సంవత్సరములకంటె యెక్కువ లేనిచో, యీ కలియుగము సుమారు క్రీస్తుశకారంభమునందే * అంతమొంది యుండును. పురాణములు క్రీస్తుశక

* మహాభారతం: వనపర్వం 188. అ. V. 21—28. (కలకత్తా ప్రతి) :—

"ఆదితో మనుజవ్యాఘ్ర కృత్స్నస్య జగతః క్షయే । చత్వార్యాహుః సహస్రాణి వర్షాణాం తత్కృతం యుగం ॥ తస్య తావచ్ఛతీ సంధ్యా సంధ్యాంశశ్చ తథావిధః । త్రీణి వర్ష సహస్రాణి త్రేతాయుగ మిహోచ్యతే॥ తస్య తావచ్ఛతీ సంధ్యా సంధ్యాంశశ్చ తతః పరం। తథా వర్ష సహస్రే ద్వే ద్వాప

మారంభమైన మొదటి ౧, ౨, శతాబ్దములలో పుట్టినట్లు గాన్పించుచున్నవి. కనుక, అప్పటికి కలియుగ మంతమైపోయి, (మరల) కృతయుగము జరుగుచున్నదనియే యర్థము. కాని, యీపురాణములను వ్రాసినవా రప్పటికి కలియుగము గడచిపోయినదనిగాని, తా మప్పుడు కేవలము కృతయుగములోనే నివసించుచున్నామనిగాని, యెంతమాత్రమును నమ్మియుండలేదు. ఏలననగ:—కృతయుగమనగ మహాపుణ్యయుగము; కాని, తాము నివసించుచున్న కాలమందు దేశము సర్వవిధముల క్షీణించియుండుటచే, అది కృతయుగముకాజాలదని వారికట్టి నమ్మకము. అందుచే, యీ పౌరాణికులు కలియుగపరిమితిని పెంచుటకై దేవమానమును గల్పించిరి. ఒక దేవసంవత్సరము ౩౬౦ మానవసంవత్సరములకు సమానమనిరి. ఈలెక్క ప్రకారము కలియుగమునకు చెప్పిన ౧౦౦౦ (లేక ౧౨౦౦) సం॥లను దేవసంవత్సరముల క్రిందికి మార్చిరి. దీనికి సహాయముగ వారికి " సంవత్సరమనునది దేవతలకొక దినము " అను తైత్తిరీయ బ్రాహ్మణవాక్యముదొరికినది. మనువును, వ్యాసుల

పరం పరిమాణతః ॥ తస్యాపి ద్విశతీ సంధ్యా సంధ్యాంశశ్చ తథావిధః॥ సహస్రమేకం వర్షాణాం తథా కలియుగం స్మృతం । తస్య వర్షశతం సంధిః సంధ్యాంశశ్చ తతః పరం ॥ సంధిసంధ్యాంశయోస్తుల్యం పరిమాణ ముపధారయ । క్షీణే కలియుగే చైవ ప్రవర్తతి కృతంయుగం ॥ ఏషా ద్వాదశసాహస్రీ యుగాఖ్యా పరికీర్తితా । ఏతత్సహస్రపర్యంత మహో బ్రాహ్మముదాహృతం "

నొక్క-దానిని గూర్చియే మనువును, వ్యాసుఁడుగారును చెప్పు చున్నారుగాని, దేవసంవత్సరములవరకు చెప్పుటలేదు. కనుక నింకొక యాశ్చర్యమేమనగా:—అథర్వవేదమందు "యుగ" శబ్దమునకు పదివేలసంవత్సరములని చెప్పబడియున్నది. కనుక, కృతత్రేతాద్వాపరకలినామములచే నేర్పరుపఁబడ్డ యీ పది వేలసంవత్సరముల యవధికే ప్రమాణముగ నుండినను అధర్వ వేదకర్తలు దానికి "యుగ" యను నామకరణ మొనర్చి యుండవచ్చును.

ప్రళయానంతరమందు కృతయుగ ప్రారంభమగునని వ్యాస, మనువులు చెప్పుచున్నారు. (వారిద్దరును ౧౨౦౦ సంవత్సరముల వ్యాప్తిగల కలియుగారంభమును చెప్పుచున్నారని మనమనుకొనవచ్చును.) తమకుపూర్వము ౮౮౦౦ (లేక షుమారు ౧౧ వేల) సంవత్సరములక్రిందట జరిగినదని తమ పెద్దలవలన వినియున్న ప్రళయమునుగూర్చియు, తదనంతర కృతయుగారంభమునుగూర్చియు, వారు తమ గ్రంథములందు శ్లోకానుక ప్రాచీనపరంపరను ఉదాహరించి యుందురు. అనగ, ప్రాతప్రపంచమును ముంచివేసి క్రొత్తప్రపంచమును దెచ్చిన యీ ప్రళయము వ్యాస, మనువులకు పూర్వము షుమారు పదివేల సంవత్సరములక్రిందట (౮౮౦౦ సం॥ ల క్రిందట) జరిగియున్నదని యర్థము. కాని, యీ ప్రాచీనపరంపరను యిటీవల, యెవరికనుకూలమగునట్లు వారు మార్చిరి. అయినను, యీ ప్రాచీనపరంపరయొక్క- నిజలక్షణములను

మనమిప్పుడు సులభముగ గుర్తింపవచ్చును. ఇదియొకకష్టము కాదు. దీనియందున్న యీ నిజలక్షణముల నిట్లు గుర్తించిన పిమ్మట తేలిన సారాంశమేమనగ:—ఈ నూతన ప్రపంచము ప్రారంభమై, అనగ, భూగర్భశాస్త్రరీత్యా, హిమప్రళయము గతించి క్రీస్తుశకమునకు పూర్వము పదివేల సంవత్సరములకంటె యెక్కువకాలేదని మనము తీర్మానింపవచ్చును. వేదములందున్న కాలక్రమానుసరణిని పరిశీలించి చూచినను కూడ యీ హిమప్రళయము గతించి యింతకంటె యెక్కువకాలము కాలేదని మన మిదివరకే చెప్పియుంటిమి. ఏలననగ:—మృగశీర్షాయుగమునాటి కింకను వైదిక ఋషులు తమ ప్రాచీన ధ్రువనివాసమునుగూర్చిన పరంపరలను మరచిపోకుండ పూర్తిగ జ్ఞాపకముంచుకొనియేయున్నారు. కనుక, ఆర్యుల మూలస్థానముపైకి హిమప్రళయమువచ్చి క్రీస్తుశకమునకు పూర్వము పదివేల సంవత్సరములకంటె యెక్కువకాలము కాలేదనుట చాలవరకు నిశ్చయము. అమెరికను భూగర్భశాస్త్రవేత్తలు కూడ స్వతంత్రరీతిగ శాస్త్రపరిశోధనల నొనర్చిన పిమ్మట వారుకూడ యీ నిశ్చయమునకే వచ్చియుండిరని మన మిదివరకు చెప్పియుంటిమి. ఈ రీతిగ, వైదిక, పౌరాణిక, కాలక్రమానుసరణులు షుమారు ఒకే కాలమును సూచించుచున్నప్పుడు, కొందరు భూగర్భశాస్త్రవేత్తలు విపరీతముగ వేసిన ౨౦, ౮౦, వేల సంవత్సరముల యంచనాలను పూర్తిగ త్రోసివేసి, మనమిప్పుడు సర్వసాధారణముగ క్రిందటి హిమ

ప్రళయము గతించి క్రీ॥ పూ॥ షుమారు ౮, [illegible] వేల సంవత్సరములై నదని యంగీకరింపవచ్చును.

ధ్రువనిలయమునుగూర్చియు, తన్నాశనమునుగూర్చియు, తత్సంబంధమైన యితరాంశములను గూర్చియు తెలుపు పరంపర లిటీవల వైదిక అవెస్థిక గ్రంథములందు లిఖింపబడువరకు యేయేరీతులుగ చెడకుండ జాగ్రతగ భద్రపరుపబడియున్నవో మన మిట కొంత విచారింపవలెను. వంశపరంపరగ వచ్చుచున్న సత్యమగు చరిత్రాంశములే యందు పొందుపరుపబడి యున్న వనుటకు సందేహ మింతమాత్రమును లేదు. ఏల యనగ :— ఐరోపాఖండస్థులగు తదితర ఆర్యశాఖలలోఁ గూడ నిట్టి పరంపరలే గానవచ్చుచున్నవి. వీనిని శోధించిన '[illegible]సు' పండితుడుకూడ యీ నిశ్చయమునకే వచ్చియున్నాడు. మన పవిత్రగ్రంథము లన్నియు మొదటినుండియు జాగ్రతగ భద్రపరుపబడుచు వచ్చుచున్నవో కొంచెము గ్రహించినచో, ఇది యొక యసంభవముగ గాన్పింపదు. వ్రాతయు, ముద్రణాయంత్రములు నున్న యీకాలమందు మనము మన జ్ఞాపకశక్తిపై (మెదడుపై) అంత యాధారపడవలసిన యావసరము లేదు. మన జ్ఞాపకశక్తిని మొదటినుండియు బహు కఠినసాధనకు లోబరచి తగిన శిక్షణము నొసంగినచో దానివలన యెట్టి మహాద్భుతకార్యముల గావింపవచ్చునో మన మెరుంగుట కిప్పుడవకాశము లేదు. భరతఖండస్థులగు బ్రాహ్మణులు ఋగ్వేదము నంతను—వేయేల, వేదమును, తదనుబంధములగు [illegible]ద్యాది

గ్రంథములను కూడ — ఋ, చ, తప్పిపోకుండ, ప్రతి యక్షరమును, ప్రతిస్వరమును కూడ బహుజాగ్రతగ యిప్పటికి కనీసము ౩, ౪, వేల సంవత్సరములనుండి తమధారణాశక్తిచే భద్రపరచియుంచి యున్నారు. నిన్న మొన్నటివారగు యీ బ్రాహ్మణులే యిట్టి యద్భుత కార్యమొనర్చి యుండగ, ఆ కాలమునాటి బ్రాహ్మణులు ప్రాచీన ధ్రువ నివాసమును గూర్చిన పరంపరలను తమ పవిత్రగ్రంథములలోని కెక్కించునంతవరకు బహు జాగ్రతగ, యెక్కడ తప్పకుండ, తమ ధారణాశక్తిచే భద్రపరచియుండిరని మనము గట్టిగ చెప్పవచ్చును. బహుకాలసాధనచే మహాశక్తిమంతమైన యీ ధారణాశక్తి యొనర్చు మహాద్భుతకార్యములు మన కిప్పుడు చాల వింతగ దోచవచ్చును. కాని, ఆదినములలో నిది యొక సర్వసామాన్యమైన కార్యముగనే యుండెను. ఆదినములలో పుస్తకములు లేవు గనుక, వారు తమ జ్ఞాపకశక్తిపైననే యెక్కువ ఆధారపడవలసి యుండెను. అందుచేతనే వారు ప్రత్యేకము తమ ధారణాశక్తిని యెక్కువ శ్రద్ధగ సాధనచేసి, దానిని క్రమమైన శిక్షణమం దుంచెడివారు. అత్యంతశ్రద్ధగ తాము శాశ్వతముగ జ్ఞాపకముంచుకొనవలసిన విషయముల నన్నిటిని వారిట్లు సుశిక్షితమైన ధారణాశక్తిచే వంశపారంపర్యముగ సంక్రమింపజేయుచుండిరి. ఈధారణాశక్తియే వారికీకార్యమం దత్యంతవిశ్వసనీయమైన సాధనముగనుండెను. మనపవిత్రగ్రంథములలోని వాక్యము లొక్కస్వరమైనను తప్పకుండ

బహుజాగ్రతగ వంశపారంపర్యముగ భద్రపరచి యుంచుటకై తమ హృదయమును అతికఠిన శిలలుగ నొనరచి, తమధారణా శక్తిని సాధనచేయుటయే తమ జీవితములో ప్రత్యేకవృత్తిగ పెట్టుకొనియున్న వారిని జూచి యాక్షేపించుట మన కిప్పు డాచారమైపోయినది. ఇట్టివారిని "బసవన్నలను మూగజంతువుల"ని యూరోపియనాచార్యులనేకులు ఈ వేదపాఠకులమీద ఆక్షేపించి యున్నారు. "అర్థజ్ఞానశూన్యముగ చిలుకపలుకులు పలుకు వారి"ని మరికొందరాక్షేపించియుండిరి. కాని, ప్రాచీనమానవ కోటియొక్క నిజచరిత్రను, మతమును, తెలిసికొనుటకై యీ "చిలుకపలుకుల బలుకువారే" మనకిప్పు డెంతమహోపకార మొనర్చియుండిరో లెక్కింపశక్యముగాదు. ఆనాటినుండియు వచ్చుచున్న ప్రాచీనపరంపరలన్నియు మధ్య శిథిలముగాకుండ వీరు తమహృదయమున దిద్దుకొనిరి బహుజాగ్రతగ భద్రపరచి యున్నారు. ప్రత్యేకముగ సర్వమానవులందున ధారణా శక్తి ముఖ్యముగ నుండియున్న వారికిగాని వీనినన్నిటిని భద్రపరచుటకు సాధ్యము కాదుగద. ప్రత్యేకవిగ్రంథములను వల్లెవేయుటయే తమ వంశపరంపరానుగతమగు వృత్తిగ—పవిత్రమగు కార్యముగ— భావించుకొని కొందరిట్లు పరిశ్రమ చేయుటచేతనే గద యిన్ని ప్రాచీనపరంపర లెన్నియో వేలకొలది వత్సరములనుండి యిప్పటి వరకు చెక్కుచెదరకుండ మనకు భద్రముగ లభించినవి! కావున, వీరీవిషయమై చేసిన మహోపకారమును మన మెన్నటికిని మరువజాలము. వీరొనర్చిన మహోపకారమునకై

పేరిమెంత మన సంతతియు కృతఘ్నులమై యుండకతప్పదు. పండితు లు వేదసూత్రముల నిప్పుడు విశదీకరించి అర్థము చెప్పవచ్చును; వాని కెన్ని యేని సమగ్రవ్యాఖ్యల నిప్పుడు వ్రాయవచ్చును. కాని పూర్వకాలమందు కొందఱీవాక్యములను వల్లెవేయు టయే ప్రత్యేకవృత్తిగ పెట్టుకొని యుండకపోయినచో యీ పండితు లిప్పు డేమిచేసెడివారు? ఇవన్నియు యెన్నడో శిథి లములైపోయెడివేగదా? ఇవి యానాడే శిథిలములై పోయి యున్నచో పండితుల కిప్పుడొక్క ఆధారమైనను దొరికెడిది కాదుగద. అసలు మూలాధారమే లేనప్పు డీపండితు లేమి చేయగలరు? కావున మన మిప్పు డీప్రధానాంశమును మాత్రమున్నటికిని మరువజాలము. కాని, కొందఱింకొకరీతిగ వాదింపవచ్చును. ఈవిధముగ గ్రంథములను వల్లెవేయుట పూర్వమందవసరమైయున్నను ముద్రణాది సాధనాంతరములచే దాని యవసరమిప్పుడు తీరిపోలేదాయని కొందఱడుగవచ్చును. దాని యవసరమిప్పుడు తీరిపోయినదని ఖండితముగ చెప్పుటకు వీలులేదు. ఏలననగ, యీవిషయములో సుశిక్షితమైన ధారణా శక్తిముందర యీ ముద్రణాదిసాధనము లంతగ విశ్వసనీయ ములుగావు. మరియు, ప్రపంచములో ప్రతిదేశములోను యే యాచారములైనను నశించునుగాని మతాచారములు మాత్ర మంత త్వరగ నశింపవు. కావున, ఒకవేళ యీ యాచారము యొక్క యవసర మిప్పుడు తీరిపోయినదని యనుకొన్నను, యిది చిరకాలమునుండియు వచ్చుచున్న మతాచారమగుటచే యింత త్వరలో నశింపజాలదు.

సక్రమ శిక్షణము గాంచిన ధారణాశక్తిచే చెక్కుచెదర కుండ భద్రపరుపబడి యున్నట్టియు, నేటివరకు జరిగిన భూగర్భ, భూనిక్షేప, గాధాశాస్త్రాది పరిశోధనలవలన సంపూర్ణముగ బుజువైనట్టియు, వైదిక ఆర్యపూర్వికులు హిమప్రళయాపూర్వము దార్యసంతతు లుత్తరధ్రువమండలమందు నివసించి యుండిరనియు, క్రిందటి హిమప్రళయము దా భూమి పాడైపోవుటచే వారచ్చట నుండి యిది దక్షిణాభిముఖముగ బయలుదేరి వచ్చి, తదనంతరయుగమందు క్రీ॥ పూ॥ షుమారు ౮ వేల సంవత్సరముల నాడు ఉత్తర ఐరోపాభూములందో, లేక మధ్యాసియాయందో ప్రప్రథమమున స్థిరనివాసము లేర్పరచుకొనవలసి వచ్చెననియు, పూర్తిగ బుజువగుచున్నది. ఈరీతిగ, ఆర్యుల ప్రాచీనతను హిమప్రళయాపూర్వమునకు గొనిపోతిమి; మరియు, వారి ప్రాచీననివాసస్థానమును ఉత్తరధ్రువప్రాంతములకు గొనిపోతిమి. ఈ ఒక్కప్రదేశమందే ౩౦ దినముల పరిమితిగల యఖండదీర్ఘ ఉషస్సు సాధ్యముగాగలదు. ఆర్యసంతతులే గాక, తదితర మానవజాతులుకూడ వీరితోపాటు ధ్రువప్రాంతములందప్పుడు నివసించి యుండిరా లేదా యను విషయ మీ గ్రంథమునకు సంబంధింపదు. ప్రాచీనకాలమందు ఈజిప్షన్, అక్కేడియన్, అస్సీరియన్, బాబిలోనియన్, చీనా, జపాన్, జాతులుగూడ ధ్రువప్రాంతములందుండియున్నట్లు దెల్పు ప్రాచీనపరంపరల కొన్నింటిని డాక్టరు వారెన్‌గారు "స్వర్గము దొరికె" నను

నను గ్రంథమునం దుదాహరించి యున్నారు. వీని నన్నిటిని పరిశీలించి చూచినమీదట, సమస్తమానవకోటియొక్కయు పుట్టినిల్లు (లేక, పురిటి యుయ్యేల) ధ్రువమండలమందే గల దని డాక్టరు వారెన్ గారు తీర్మానించి యున్నారు. ఈ తీర్మానమును తదితర పండితులుకూడ బలపరచియున్నారు. తదితర మానవజాతుల ప్రాచీనపరంపరలు కూడ ఉత్తరధ్రువము నైపునకే సూచించుచున్నవని చెప్పుటచే మన మింత వరకు ఋజువుపరచుచున్న సిద్ధాంతమున కేమియు విరోధము రాజాలదు. ఏలననగ, ఉత్తర ధ్రువమం దార్యులొక్కరు మాత్రమే కాపుర ముండిరని మే మెన్న డును వాదింపలేదు. అదిగాక, ఋగ్వేదమందు తరుచుగ "పంచజనాః" యని చెప్పబడుచు వచ్చిన మానవజాతులేమను బహుశః ఆ కాలమం దార్యులతోపాటు ధ్రువమండలమందు నివసించియున్న తదితర మానవ జాతులై యుండనోపునని చెప్పుటకు కూడ అవకాశములు గలవు. ఏలననగ:— ఆర్యులు మూలస్థానమునుండి లేచివచ్చినపిమ్మట,తమ సంచారములో క్రొత్త జాతుల నైదింటిని మాత్రమే కలిసికొనిరనిగాని, లేక, తా మైదుశాఖలుగ మాత్రము చీలిపోయిరనిగాని, తలంపజాలము. ఏదియెట్లున్నను, యింక నెంతయో పరిశోధన గావించిన పిమ్మటగాని యీసమస్యను పూర్తిగ పరిష్కరించుటకు వీలు లేదు. ఆర్యులమూలస్థానమును నిర్ణయించు సమస్యతో యిది సంబంధింపదు గాన దీనినిటవిరమింతము. సమస్తమానవకోటియు

మొట్టమొదటపుట్టిపెరిగిన పురిటియిల్లార్యుల ఉత్తరధ్రువమండల మందే యున్నదని పండితులు ఖండితముగ నిశ్చయించినచో, మన మింతవరకు వైదిక, అవైదికగ్రంథముల ప్రమాణములచే ఋజువుపరచిన సిద్ధాంతము నది యెంతమాత్రమును బాధింప జాలదు. కాని, ఆర్యుల ప్రాచీన ధ్రువనివాసమును మే మిప్పుడు మరియొక స్వతంత్రమార్గమున ఋజువుపరచినచో, మానవకోటియంతయు మొదట అచ్చటనే పుట్టెనని చెప్పు సిద్ధాంతమున కది మరింత బలము నిచ్చును. తక్కిన మానవ కోటియందరికంటె పారశీకులును, భారతీయులును ప్రాచీన పరంపరలను తమ పవిత్రగ్రంథములం దెక్కువ బాగుగ భద్ర పరచి యున్నారను మాట నిర్వివాదమగుటచే, మానవకోటి యందరిమాట యటుంచి, ముందీయార్యుల మూలస్థానమును గూర్చియే స్వతంత్రముగ విచారించుట యెక్కువ సమంజస ముగ నుండును. ఇదియే మంచిపద్ధతి. అవెస్థ, వేద, గ్రంథము లార్యసంతతికి అతిప్రాచీనగ్రంథము లనుమాట సత్యమే యని పండితు లెల్ల రిప్పు డంగీకరించియున్నారు. అధునిక భౌతిక శాస్త్రపరిశోధనల నాధారముగ గైకొని మన మిప్పు డీగ్రంథ ములను పరిశీలింప మొదలిడినారముగాన నందున్న ప్రాచీన పరంపరలనుబట్టి ఆర్యుల మూలస్థానమును నిర్ణయించుట యొక కష్టము గాదని మన మిదివరకు చూచి యుంటిమి. ప్రాచీనకాలమం దార్యులు ఉత్తరధ్రువమండలమం దుండిరని మన మిప్పుడొకసారి నిర్వివాదముగ సిద్ధాంతీకరించినచో, వారి

ప్రాచీనసభ్యతను గూర్చియు, చరిత్రను గూర్చియు, యిప్పటి వారికున్న సమాహాలు పూర్తిగ మార్పుజెందవలసి వచ్చును. ఆర్యుల ప్రాచీననికేతనము మధ్యాసియాయం దుండెనని యిది వరకు తలంచిన పండితు లేయభిప్రాయపడిరనగ:— ఆర్యులు తమ యనాది మృగప్రాయత్వదశనుండి గడచి వేదసూక్తములందు గానవచ్చుచున్న నాగరక స్థితికివచ్చుటకు గావలసిన సాంఘిక, నైతిక, వైజ్ఞానికాది పురోభివృద్ధినంతను వారు మధ్యాసియాఖండస్థములగు సమప్రదేశములలో కాపురమున్న కాలమందే సంపాదించిరని యీ పండితుల యభిప్రాయము. ఉషఃకాలమందు ప్రాగ్దిశను గానవచ్చు మహాద్భుత చిత్రవిచిత్రములను, నూతనారుణకాంతులను, తేజోమయమూర్తియై యుదయించుచున్న బాలభాస్కరుని, భక్తిభయ భ్రాంతులతో ఆర్యులు మొట్టమొదట మహాశ్చర్యముగ తేరి పారజూచిన దీమధ్యాసియాఖండస్థములగు సమప్రదేశములందేనట! తమపై ఆకాశమునం దంతటను నవనీరదమాలికలు దట్టముగ నలుముకొని యటునిటు పర్వులిడుచుండుటయు, అంతట వర్షాధిదేవత మహాగంభీర గర్జన మొనర్చుచువచ్చి తన కులిశాయుధముతో నామేఘమాలికల జీల్చివైచి భూమిపై వర్షముకురిపించుటయు మొదలుగాగల మహాద్భుత వాతావరణ పరిస్థితులను ఆర్యులు మొట్టమొదట తమ కంన్నారగాంచి వినయవినమితగాత్రులైన దీప్రదేశమందేనట! దీనినుండియే పృథివ్యాది మహాభూతసంఘముల నుపాసించు

పద్ధతి ప్రారంభమయ్యెనట! దీనినుండియే [illegible] యార్యగాథలన్నియు బయలుదేరెనట! బట్టలు నేయుపద్ధతిని నీరిచ్చుటనే మొట్టమొదట నేర్చుకొనిరట! వారింతకు పూర్వము వస్త్రములకుమారుగ చర్మములను ధరించుచుండి రట! మరియు, రథములనుకట్టుట, గుర్రములను మాలిమి చేయుట, వెండిబంగారు మొదలగు ధాతువుల ప్రయోజన మును గనిపెట్టుట, మొదలుగాగలవాని నన్నిటిని ఆర్యులు మధ్యాసియాయందే మొట్టమొదటగ నేర్చుకొనిరట! నియేల, ఆర్యశాఖ లన్నింటియందును సర్వసాధారణముగ సమానముగ, గన్పట్టుచున్నట్లు భాషాపరిశోధనలవలన ఋజువైన నాగరికతా లక్షణములన్నియు మొట్టమొదట ఆర్యులందరును కలిసి హిమ ప్రళయానంతరమందు మధ్యాసియాభూములలో యేక కుటుం బముగ కాపురమున్న కాలమందే పుట్టియుండెనని పండితులు తలంచియున్నారు. ఆర్యుల ప్రాచీనసభ్యతనుగూర్చి భాషా పరిశోధనలవలన నిశ్చయింపబడిన యాసిద్ధాంతములను, వాని ప్రతివాదములను డాక్టరు "ష్రేడరు" గారు తమ * గ్రంథ మందు సమగ్రముగ వ్రాసియున్నారు. ఈ విషయములో మాత్రమీగ్రంథరాజముతో సమానమైన దింకొకటిలేదని చెప్ప వచ్చును. ఐతిహాసికదృష్టితో గాని, భాషాపరిశోధక దృష్టితో గాని చూచినవారి కీగ్రంథమందలి భాషాపరిశోధనలు చాల

* "ఇతిహాసపూర్వకాలికములగు ప్రాచీనార్య దేశాంశములు" (Prehistoric antiquities of the Aryan peoples.)

ప్రయోజనకారులుగ గన్పట్టవచ్చును. కాని, ఆర్యుల ప్రాచీన సంకేతసమిష్టినుండియో, వారచ్చట నేయేకాలమునందు నివసించిరో, యేకాలమున నచ్చటనుండి లేచివచ్చిరో — మొదలు గాగల ప్రధానాంశములు తెలియునంతవఱకుమాత్రమే యీకేవల భాషాపరిశోధనలవలన కొంచెమైనను లాభములేదు. పైగా యవి మనలను తప్పుత్రోవలకు యీడ్చుకొనిపోవచ్చును. ఉదాహరణము :— ఆర్యులు శాఖలుగ చీలిపోక పూర్వమే వారికి గోవునుగూర్చి బాగుగ తెలియుననియు, వారు దానిని మచ్చిక చేసిరనియుకూడ ఆయా ఆర్యభాషల నిఘంటు పరిశోధించుటవలన మనము కనుగొనవచ్చును. అట్లే వారికశ్వము బట్టల నేతపనికూడ తెలియునని గనుగొనవచ్చును. ఏలనగ:— గోవు, నేత, యను రెండుపదములును సమస్తఆర్యభాషల లోను గాన్పించుచున్నవి. కాని, యిప్పటి వివిధ ఆర్యభాషలను మాట్లాడు యీ యార్యశాఖలవారందరు పూర్వమేక కుటుంబముగ కలిసి కాపురమున్నస్థల మెద్దియో, వారెప్పుడెట్లు చీలిపోయిరో, ఖండితముగ నిర్ణయించుట కీశబ్దసాదృశ్యములు మనకెంతగ తోడ్పడజాలవు. ఇదియిట్లుండగ, యిటీవల భూగర్భమునుండి త్రవ్వియెత్తబడిన పురాతన వస్తుసముదాయమును, మనుష్యుల పుఱ్ఱెలు, యెముకలు, మొదలు గాగల వానిని పరిశోధించుటవలన తేలిన సారాంశమేమనగ:— ఆర్యులు మొట్టమొదట మధ్యాసియాయందుండిరనియు, తరువాత యచ్చటనుండి యనేక శాఖలుగ చీలి ఐరోపాఖండము

లోని వివిధ ప్రాంతములకు పోయిరనియు, తదుపరి సిద్ధాంతము అసంభవమని యీయాధునిక పరిశోధనలవలన ఋజువు చేయబడి యున్నది. కనుక, ఆర్యుల స్వస్థానము మధ్యాసియాయందుండెనని చెప్పుసిద్ధాంతము యిప్పుడు పూర్తిగ త్రోసి వేయబడెననియే చెప్పవచ్చును. ఇప్పుడు యూరోపుదేశములలో కాపురమున్న ప్రజల యొక్క పూర్వీకులగువారే యుత్తర శిలాయుగారంభమందుకూడ యూరోపుఖండములో కాపురముండి యుండిరని కొందరుపండితులు చెప్పుచున్నారు. కాని, దీని లోని చిత్రమేమనగా:— ఉత్తరశిలాయుగారంభమున దిప్పుడు యూరోపుయందు కాపురముండియుండిరని చెప్పబడుచున్న యీ పూర్వతరములవా రసలు యూరోపుయందే పుట్టిరా, లేక, మరి యేయితరదేశములనుండియైన యిచ్చటికి వలసవచ్చిరా యను సంశయమునుమాత్ర మీపండితులు సందేహముగానే వదలివేయు చున్నారు. యూరోపుఖండమందు పూర్వశిలాయుగములోకూడ నిప్పటివారి పూర్వులే కాపురముండిరనుమాటను మన మంతగ పాటింపనక్కరలేదని "ఐసాక్ టేలరు" గారు "ఆర్యుల యుత్పత్తి" యను తమగ్రంథమునందు చెప్పుచున్నారు. ఏల యనగా:—"ఆర్యభాషలు పెంపొందుటకును శాఖలుగ విడిపోవు టకును కావలసినంతకాలము ఉత్తరశిలాయుగమునందే గలదని భాషాశాస్త్రజ్ఞులు బహుశః ఒప్పుకొందురని" ఐసాక్ టేలరు గారు చెప్పుచున్నారు. ఇప్పుడు వివిధ ఆర్యభాషలలో గాన్పించుచున్న గాధలుకూడ ఆర్యులు విడిపోవుటకు పిమ్మట

పుట్టినని వీరిగ్రంథములందు చెప్పుచున్నారు. ఒకవేళ, "ద్యౌస్-పితర్," "జ్యూపిటర్; వరుణ, వరేణ;—వంటిపోలిక యున్నప్పటికిని గాన్పించినను అవి కేవలము శబ్దములమీాది పోలికలే గాని, అసలగాథలయొక్క యుత్పత్తియొక్క లేదానిని యర్థము కాదట! వేయేల, ఆర్యుల ప్రాచీనమూలస్థానము మధ్యాసియాయందుండెనని వాదించువారును, ఉత్తర యూరోపాయందుండెనని వాదించువారునుకూడ — ఉభయులును—ఆర్యసభ్యతయొక్క యుత్పత్తిని హిమప్రళయమున కావలి వైపునకు పోనీయకపోవుట కిష్టపడకున్నారు. ఈసభ్యత యంతయు హిమప్రళయమునకీవలనే పుట్టినని వీరిమతము. కనుక, ఆర్యుల మతమునకుగాని, గాథలకుగాని, యింతకంటె యెక్కువ ప్రాచీనతనిచ్చుటకు వీలులేదని వీరుచెప్పుచున్నారు. ఆర్యుల యుత్పత్తిని గూర్చియు, వారి ప్రాచీన నాగరకతను గూర్చియు, యిదివరకు చేయబడుచున్నట్టి యూహాలను, విమర్శనలను - అన్నింటిని — మన ధ్రువసిద్ధాంత దృష్టితో నిప్పుడు పునర్విమర్శన గావింప వలసియున్నది. ప్రాచీనార్యులు హిమప్రళయానంతరమందే పుట్టిరని మన మిప్పుడు చెప్పజాలము; ఉత్తరశిలాయుగములో మధ్యాసియాయందో లేక ఉత్తర యూరోపాయందో యుండగ వారు పశుత్వమునుండి నాగరికతలోనికి వచ్చిరనియు మన మిప్పుడు చెప్పజాలము. ఇప్పుడున్న వివిధఆర్యశాఖలవారి ప్రాచీనగాథలలో నొకే విధమగు దేవతలు గాన్పించుటవలన యీగాథలన్నియు నొకే

వల—అనగా, ఆర్యులు పిలిచే యుషస్సును—వర్ణించినవని వారి మతమును తెలుపుదురు. ఈ వాదమునకు ఉదాహరణము:—కొంత బెట్టునవాదిం నుదాహరణ:—"ఉషస్సు" అను సంస్కృతపదమునకు పారసీక భాషలో "ఉషహ్" అని యున్నది; దీనికి "యూయోస్" అను గ్రీకుపదమునకును, "అరోరా" యను లాటిను పదమునకును, "ఔస్ట్రో" యను పాత జర్మను శబ్దమునకును, "ఈస్ట ర్న్" యను లిథ్వేనియను శబ్దమునకును, "ఉస్త్రో" యను ఆంగ్లోశాక్సను శబ్దమునకును పోలికలు కలవన్నను, పాశ్చాత్య దేశ గాథలందుమాత్రమే యీ యుషస్సు ప్రాతఃకాలిక దేవతగ పరిగణింపబడియున్నది. తక్కిన యార్యజాతులవారి గాథలలో దీని కంతటి యున్నతపదవి (దేవతాపదవి) యీయఁబడలేదు. ఈ యంశమును బట్టి "ఉషస్సు"ను పూజించుపద్ధతి ప్రత్యే భారతదేశమందే యుత్పన్నమైనదని మన మూహింపవలె ను. కాని, మన గ్రంథస్థాపకములచే నిట్టి నిర్ణయము చేయుటకు సాధ్యపడదు. ఉషాదేవత కేవలము గ్రంథములందుమాత్ర ముననే సలాకించబడియున్నదనుట నిర్వివాదము. ఈ రీతిగనే, వాడినట్టి వైదిక దేవతలును గ్రంథములందుమాత్రమే, నిస్సందేహ ముగా, నిర్వాపితమన్నప్పటికి యా దేవతలకు సంబంధించిన గాథలు మధ్యాసియా భాగములలో పుట్టినవని మనము వాదింప వలెను. తేజఃపుంజముల యెడ భావనాసామ్యము, నిజముగ ముస్లిము ఋగ్వేదమునందు ప్రశంసింపబడియున్న యుషస్సును నూర్చి భారతఖండములో కాపురమున్న యార్యుల లోకటిగ

వెన్నెలను తమ మనస్సులందు భావించియుండజాలరు. ఇట్టి పటమును వారిమనస్సులందు చిత్రించుకొనుట కెంతమాత్ర మవకాశమే లేదు. ఇది సాధ్యమే కాదు. ఏలననగ:—మనమీ భరతఖండములో సూర్యుని జూచు ఉషస్సు ముహూర్తమాత్ర జీవనముగలది. ఇది క్షణములో మాయమైపోవును. కాని, ఋగ్వేదములో వర్ణింపబడిన యుషస్సు దీర్ఘఉషస్సు. అనగ, ధ్రువమండలమందలి యతిదీర్ఘఉషస్సు. కనుక, మన మిచ్చట మామూలుగ సూర్యుని జూచునపుడు ముహూర్తమాత్రజీవనముగల ఉషస్సునకును, ఋగ్వేదమందలి దీర్ఘఉషస్సునకును చాల భేదముగలదు. ఇదేరీతిగ, తక్కిన వైదిక దేవతలందరు కూడ ధ్రువలక్షణములతోడనే యొప్పారుచున్నారు. ఇంద్ర, వృత్రులు; నిరుద్ధజలములు; శీతకాలము నాలుగునెలలు నిద్రబోవు విష్ణువు; బావిలోపడిన త్రితదేవత; అప్పు డస్వస్థులగు దేవతల కారోగ్యమును గలుగజేసి కాపాడుచున్న అశ్వినీ దేవతలు; — వీరందరు ధ్రువలక్షణములతోడనే యొప్పారుచున్నారు. కేవల మీపేర్లే కెల్టిక్, ట్యూటానిక్, గాధలలో నుండకపోవచ్చును. కాని, యీ కెల్టిక్, ట్యూటానిక్ గాధలను పరిశోధింపగ నివికూడ ధ్రువలక్షణములనే సూచించుచున్నవి. ఇందలి దేవతలుకూడ వైదికదేవతలవలెనే ధ్రువలక్షణములతో నొప్పుచున్నారు. ప్రధానాంశములతో నివియు నైకీభవించుచుండిన ఆర్యశాఖలలోని గాధలన్నియు నొకమూలమునుండియే పుట్టలేదని వాదించుట సబబు కాదు; మరియు దేవతల పేర్లలో

పోలికలున్నచో నట్టి అవి కేవలము [illegible]సాదృశ్యములే గాని [illegible] సాదృశ్యములు గావని వాదించెదరు. [illegible] ఆర్యుల మూలస్థానము హిమవత్ప్రళయమునకు [illegible] ఆర్యసభ్యతయొక్క చరిత్రమునకు [illegible] మహోపద్రవకరమైన యీ ప్రళయానంతరమునను పూర్వపు నాగరికత కొంత చెడి మరల ప్రాగ్రూపావస్థ[illegible] పోవుట సహజముగ తటస్థించును. కావున, [illegible] లగు ఆర్యశాఖలలోకంటె, [illegible] యూరోపా భూములలో నివసించిన [illegible] నాగరికతగాని, సభ్యతయందు లోపముగాని [illegible] వన్నచో బహుశః దాని కిదియే కారణమై యుండవచ్చును. నాగరికతయందు ప్రవర్ధమానమగుచుండ్గా [illegible] పూర్ణముగా నాగిపోవుచున్న జాతి ఆకస్మికముగ మరల ప్రాగ్రూపావస్థ[illegible] కొనికి పడిపోవునని మనము సాధారణముగ [illegible] గాలము. కాని, యీ హిమప్రళయము వంటి మహోపద్రవములు తటస్థించినప్పుడు మాత్రము ప్రళయానంతరముకూడ తమ పూర్వపు నాగరికతయే కొనసాగునని మనము తలంచుటకు వీలు లేదా! ఎలసనగ:- [illegible] హిమప్రళయమునందలి మహోపద్రవమునుండి తప్పించుకొని బ్రతికినవారు బహుకొద్దిమంది యేయుందురు. మరియు, యీ బ్రతికినవారైనను [illegible] మంతయు తమ సంఘములోనున్న సభ్యతనంతను [illegible] వచ్చి, తమ నూతన నివాసస్థానములగు మధ్యాసియా, [illegible]

మై[illegible]ప్రాంతములలో, అనార్యులగు శత్రుజాతులమధ్య గాని, స్థాపించిరని చెప్పుటకును వీలులేదు. ఇదిగాక, మన [illegible]యమును జ్ఞాపకముంచుకొనవలెను. మధ్యాసియా, ఉత్తరధ్రువప్రాంతము లిప్పుడు సమశీతోష్ణముగ నున్నను హిమప్రళయకాలానంతరమవి బహుశీతలముగ నుండియుండవలెను. మరియు, యూరపుదేశములకు వచ్చినవారు, తమ తాతముత్తాతలు ఉత్తరధ్రువమునుండి లేచివచ్చి యిండ్లువాకిండ్లు లేక దేశదిమ్మరులుగ (లేక, మృగప్రాయులుగ) తిరుగాడుచున్న కాలమునందు పుట్టియుండవలెను. దేశదిమ్మరులుగ తిరుగాడుచున్న దుస్థితిలో పుట్టిన వీరు, తమ తాతముత్తాతలు హిమప్రళయమునకు పూర్వము స్వర్గతుల్యముగనున్న ధ్రువనిలయమునందు కాపురమున్న నాటి సభ్యతలో, జ్ఞానసంపత్తిలో యే [illegible]మునో — అచ్చటచ్చట బహుకొద్దిగ — తమవద్ద నిలుపుకొని యుందురు. కావున, ఉత్తరశిలాయుగారంభమున [illegible]ప్రాంతములో కాపురమున్న ఆర్యశాఖలవారు [illegible]నాగరిక స్థితిలో నున్నారన్నచో ఆశ్చర్యము లేదు. దీనికి [illegible] మనము [illegible] [illegible]ంపవలెను. హిమప్రళయము [illegible] మహావిపత్తు సంభవించి దేశమంతయు నానా [illegible] పాడైపోయినను పారశీక, భారతీయశాఖలవారి [illegible]ప్రయాసముచేతను, కృషిచేతను, హిమప్రళయానంతర[illegible] సభ్యతలో నెంతటిభాగ మిప్పటికైనను చెడకుండ [illegible]యుండ గలిగినదాయని మన మాశ్చర్యపడవలెను.

ప్రాచీన సభ్యతయు మతయు నేటికిఁగా మిగిలిన యీయావిష్కరణ ములను మీరు పరమపవిత్రముగా సంపాదించి యుంచుకొనుఁడి. వాఁ నంతమాత్రమునను చరిత్రకారుఁడు బహుశా గ్రహింపఁగ శాఖాభివృద్ధి త్సాంతతులవారికి సంక్రమించి వచ్చియుండెడి ధనము నీ సంపదను తమకు ఒప్పగించెనని మీరు తలంచెదరు. మీరు పరిపాలించిన యాస్థలను తలచుకొన్నచో మీ ప్రశంసయు పూర్వమునాటి నాగరికతయును, మతమునను, పూజావిధివిధానములలోను, యింతకు పెద్దభాగ ము నేఁటికి కాపాడుకొనుచు రానిరిగదా యని మన మాశ్చర్య పడకతప్పదు. పారశీక, భారతీయశాఖలు గాక మిక్కిన ఆర్య శాఖలవారి ప్రాచీనపరంపరల సంతతిక్రమముగ కాపాడియుండ లేదు. కాని, అంతమాత్రముచే, యీశాఖలవారు నాగరికత యుటీవలనే — ఆర్యులు శాఖలుగ వేరుపోయిన తరువాతనే — సంపాదించినదని వాదించుట సమంజసము గాదు.

హిమప్రళయమునకు పూర్వము ఈ ధ్రువప్రదేశము లలో మంచి సమశీతోష్ణస్థితి — సంతతవసంతసమయము — యున్నట్లుండెననియు, ఆ ప్రదేశము మిక్కిలి భాగ్యప్రదేశముగా ననియు, అది హిమప్రళయముచే క్రీ. పూ. * ... గురిపోయె ననియు, యిదివరకు దెలిపియుంటిమి. కృత్తికారంభమున ఆర్యులు కాపురమున్నప్పుడు వారి గతి స్వర్గతుల్యముగ నుండియుండ వలెను. వారికి గలిగిన అనాగరికత్వమంతయు మిక్కిలి ఉష్ణ...

* మొన్నటి జపాన్ ప్రళయమునందు కూడ యిట్టి కొన్ని లంకలు సము ద్రములోనికి పూర్తిగ క్రుంగిపోయెను. మా. స. కా. శాస్త్రి.

మాత్రమే యైయుండును. ఈఒక్క సృష్టిచమత్కారమునుండి యెన్నిగాథలు—అంధకారప్రకాశములకు జరిగిన యుద్ధములు-బయలుదేరినవో మన మిదివరకు చూచియున్నాము. దీర్ఘరాత్రివచ్చుటయు, అది బహుకాలముండి విసుగుపుట్టించుటయు, ఆకాశమందు క్షితిజముపై వెలుతురెప్పుడు కనపడునాయని వారు మిక్కిలి యాతురతతో కనిపెట్టుకొనియుండుటయు, కొన్ని నెలలుగడచినపిమ్మట యీ వెలుతురు కనబడుటయు—చాలప్రధానాంశములు. మన పూర్వతరములవారగు ఆర్యప్రజలనెక్కువగ ఆకర్షించిన ప్రకృతిచిత్రములే. అనేక నెలలు చీకటిలో పడియున్నపిమ్మట, అంధకారపూరితమును, దివ్యజలమయమునునగు అథోలోక సముద్రమునుండి పైకిలేచి వచ్చు ఉషస్సు కాంతిపుంజముల వెదజల్లుచు సర్వలోకానందకరముగ తూర్పుదిక్కున క్షితిజముపై తాండవమాడుచు సౌభాగ్యమానముగ వెలుగొందుచున్నప్పుడు యిది తమదేవతలొసగిన మహాత్కార్యముగ ఆనాటియార్యులు భావించిరన్నచో ఆశ్చర్యమేమి? సర్వలోకానందకరముగ నిట్లు తేజోదయమగుటతోడనే దీనితోపాటు తమ నూతన సాంవత్సరికోత్సవములు, పండుగలు, మత, సాంఘిక, యాజ్ఞిక కర్మలు యథారీతిగ మరల ప్రారంభమయ్యెను. దేవయానమునకిదియే ప్రారంభము. జ్యోతిర్దేవతలు, అంధకారరాక్షసులను జయించి తమవిజయోత్సవముల గావించుకొను చుండిరి. బాలభాస్కరుడగు కుమారస్వామి దేవతాసైన్యముల కగ్రేసరుడై దేవ

యానమార్గము వెంట విజయప్రదముగ బయలుదేరెను, (ఋగ్వేదమందు చెప్పినట్లు) "సానుకూలయుగములు" ను [illegible] చుండెను. విజయయాత్రను చేయుచున్న ఈ దినములను [illegible] కు ప్రతిగ, రెండవవైపున [illegible] గలదు. ఇదియే, [illegible] ధ్రువమండల దీర్ఘరాత్రి. ఈదీర్ఘరాత్రి [illegible] మాసములవరకుండును. ఇది ప్రజలు [illegible] కాలము. సూర్యకాంతిలేమిచే వారు చనిపోయిన శవములను కూడ అంత్యక్రియలను జరుపక సూర్యోదయమగువరకు అట్లు నట్లె నిలిపియుంచిరి. అంధకారగర్భమున [illegible] రాజ్యముచేయుచుండుటచే, అద్య [illegible] సంవత్స మత, సాంఘికనిర్ణయములకును, పండుగలకును, [illegible]. [illegible] యేల, (డాక్టరు [illegible] గారు చెప్పినట్లు) వారి సంవత్సరమంతయు రెండుభాగములుగ నుండెను:— ౭, ౧౦, మాసముల వేసవి + ౫, ౨, మాసముల శీతకాలము. [illegible], పూర్వకాలమందుమూడగ వేసవియు, శీతకాలమును— [illegible]— కలిపి సంవత్సరముగ గణించు ఆచారమున్నట్లు గాన్పించదు. ఒక్క వేసవియో, లేక శీతకాలమో తిరిగివచ్చునంతయే [illegible] సంవత్సరముగ వారు లెక్కించుకొనుచున్నట్లు గాన్పించుచున్నది. ప్రాచీనకాలమందున్న యేడునెలల సంవత్సరమును, పదినెలల సంవత్సరమును సమర్థించుట కిది యొకటే మార్గముగనున్నది. లేనిచో, దీనినింకొకవిధముగ సమర్థింపజాలము.

[illegible] పదినెలల యవధిగల వార్షికసత్రములనుగూడ [illegible]. ధ్రువమండలమును విడిచి దక్షిణదేశ [illegible] యీపద్ధతి పనికిరాదు. కనుకనే, హిమ [illegible] ఆర్యులు తమజన్మభూమినుండి లేచి [illegible] ఉత్తర[illegible] కాపురముండవలసి [illegible] వారు (న్యూయమాగారుచేసినట్లు) తమ ప్రాత [illegible] గములను మార్చుకొనవలసి వచ్చెను. కాని, కర్మ [illegible] మాత్రము యజ్ఞములకును, తదితర కర్మలకును [illegible] దేవయానలక్షణములను మాత్రము వారు [illegible] పెట్టుకొనియుంచిరి. ఈదేవయాన (ఉత్త [illegible]) ముఖ్యముగ [illegible] కర్మలకేమి, తదితరకార్యములకేమి, [illegible] మైనదిగను పరిగణింపబడుచున్నది. [illegible] ఉత్తరాయణము ప్రశస్తమైనదని గృహ్యా [illegible] చెప్పుచున్నవో, లేక, దక్షిణాయనములో చని [illegible] లెల తలంచుచున్నారో మన [illegible] సూక్ష్మముగ చెప్పవచ్చును. హిమప్రళయమునకు [illegible], మాసముల సంవత్సరము తత్ప్రళ [illegible] మాసముల సంవత్సరముగ మారెనో, [illegible] మొట్టమొదట విషువత్స్థానము [illegible] సమభాగములుగ విభజింపబడుచుండిన సంవత్స [illegible] — హిమగ్రీష్మసంక్రమణములం దెట్లు విభజింప [illegible] వచ్చెనో, దీనినిబట్టి ఉత్తరాయణమునకుకూడ ప్రాత

యూనానీయుల క్రైస్తవయుగ [illegible] వచ్చినా — [illegible] మొదలు గాగల యానకములన్నియు ఆర్యుల [illegible] గను [illegible] నక్షత్రయానము వారి ప్రధానమైనను [illegible] ప్రస్తుతము [illegible] [illegible]. [illegible], [illegible] ప్రస్తుతాంశమునకు వచ్చెదము. పృథ్వ్యాది భూతములను, తత్తత్ ప్రకృతిరచనలను పూజించుటనే హిందూ యూరోపియను మతములలో ప్రాచీనతమమని [illegible] గానవచ్చినను నేటి యూరోపియనుమాత్రము [illegible] [illegible]గ [illegible] నున్న వారి [illegible] నకు తీసికొనిపోవుటకు [illegible] వాదించుచున్నారు. [illegible] సాక్ష్య [illegible] [illegible] మును [illegible] సమర్థతతో [illegible]చియున్నారు. నాప్రస్తుతసిద్ధాంతమునకీ [illegible] గారు [illegible] మును పూర్తిగ [illegible] చుచున్నది. "ప్రాచీన [illegible]లను, మతమును పరిశీలించిన [illegible] సమస్తమైన [illegible] వారి [illegible] [illegible] [illegible], [illegible]ముగ [illegible], సంపూర్ణముగ విశ్వసనీయమైన ప్రమాణములు వాదాముగ నేకొని [illegible] మన [illegible] ఒక్క సారాంశము తెలుపుచున్నది; అదేమనగా:— ప్రాచీన యూరోపియా మతములన్నిటికిని మూలమొక్కటే; (అవన్నియు ఒక్క మూలమునుండియే యుత్పన్నమైనవి.) అదియేది యనగా:— ప్రకృతిశక్తులను పూజించుటయే. ఈపద్ధతి హిందూ-యూరోపియను జాతులన్నియు కలిసి కాపురమున్న దినము

[illegible] ." — [illegible] రుసాక్-)డర్ గారు చెప్పు చున్నారు.

[illegible], [illegible], [illegible]నులు, వృత్రహా, మొద [illegible] ప్రధాన లక్షణములతో నొప్పారు [illegible] భాషాపరిశోధకులు తేల్చిన సారాం [illegible]. ఆకాశము, ఉదయము, అగ్ని, [illegible] సృష్టిరచనల నన్నిటిని దెలుపు శబ్దములు [illegible] మాదిరిగనే యున్నవి. వేయే [illegible] చూచిననుసనే ఒక్కటే సారాంశము [illegible]. [illegible]మంతమగు ఆకాశము [illegible] (తన్యతు); సూర్యుడు; [illegible] యు ప్రాచీనకాలమందే దేవతలుగ [illegible]. "[illegible]" అను సంస్కృతపదము, "[illegible]" [illegible] "అబోమాంస్" అను [illegible] మూలమునుండియే యుత్ప [illegible] చూపగ, ప్రాచీన కాలము నాటికే ప్రజ [illegible] దేవతలకు బలు లర్పించుటయు, [illegible] యనుగ్రహమును సంపాదించుకొను [illegible] మొదలుగాగల పనులను చేయు [illegible] స్పష్టముగుచున్నది. ఈ ప్రకృతిశక్తులను పూజించు [illegible] యముసకు పూర్వమందే పుట్టెనో, [illegible] పుట్టెనో మన కింతవరకు లభించిన

యాంధారములను బట్టి నిర్ణయించుటకు సాధ్యము గాదు. అనగ, యీ ప్రకృతిశక్తులను దేవతలుగ భావించు సంగతిని మనము ఖండితముగ నిర్ణయింపలేము. కాని, మనమింత వరకు మాత్రము నిస్సందేహముగ చెప్పవచ్చును— ఏమనగ:— ఆర్యులందరేకకుటుంబముగ నీ ధ్రువమండల మందు కాపు రమున్న నాటికే భగవచ్ఛక్తియొక్క నానారూపాంతరములుగ భావింపబడిన యీ ప్రకృతిశక్తులయొక్క యుపాసనాపద్ధతి యమలులో నుండెనని మాత్రము మనము నిర్వివాదముగ చెప్పవచ్చును. ఈ ప్రాచీన యజ్ఞముల, యుపాసనాపద్ధతుల నుండియే హిందూప్రభృతి యాసనాతన మతములు ఉత్పన్న మయ్యెను. మనువు, అంగిరసులు, భృగులు, — మొదలగు ప్రాచీన యజ్ఞకులు ఋగ్వేదమున పేర్కొనబడియున్నట్లు మనమిదివరకే చూచియున్నాము. ఈ ప్రాచీన యాజ్ఞికులు తమ వార్షిక సత్రములను ౮, ౧౦ నెలలలో పూర్తిచేయు చుండిరని చెప్పుటచే వీరు ఉత్తర ధ్రువమండలమందు కాపుర మున్న సమష్టియార్యజాతికే చెందినవారని ఋజువగుచున్నది. ఈ యాజ్ఞికులే ఆ కాలమందు ధ్రువమండలములో ౮, లేక ౧౦ నెలల సూర్యరశ్మియున్న ప్రదేశములలో యజ్ఞయాగాదులను జరుపుచుండిరి; మరియు, ప్రాతఃకాలిక దేవతలకు బలులు నుప హారాల నర్పించి పూజించుచుండిరి. కాని, సూర్యుడు దీర్ఘరాత్రి యందు క్షితిజము క్రిందికి క్రుంగిపోయినప్పుడు వీరుకూడ తమ యజ్ఞములను కట్టిపెట్టి వృత్రహనన మొనర్చుచున్న ఒక్క

యింద్రునకు మాత్రమే సోమరసము నిచ్చుచుండిరి. ఈ దీర్ఘ రాత్రియం దింద్రుడు అంధకారరాక్షసులతో పోరాడు చున్నాడు. ఇంద్రునకే పోరాటమునందు జయముగలిగి అతడు మరల సూర్యకాంతిని తమవద్దకు తీసికొనివచ్చుటకుగాను యీయార్యులు యింద్రునకు సోమరసమునిచ్చి ప్రోత్సహించు చుండిరి. హిమప్రళయము పూర్వకాలమందు అతివిరళమైన మార్గశీర్షములు యుండెనని నేను వాదింపను. కాని, యజ్ఞమను నది మాత్రము ప్రాచీనార్యమతమున కత్యంతప్రాధాన్యమైన కర్మగనుండెనని మాత్రము నేను గట్టిగ చెప్పగలను. మరియు, యీ యార్యకర్మ అసలు మొట్టమొదట హిమప్రళయా నంతరమే పుట్టెనని చెప్పుట చాలపొరపాటని నా వాదము. ప్రాచీనార్యుల మతమును గూర్చియు, ఉపాసనాపద్ధతిని గూర్చియు, కర్మకాండమును గూర్చియు, నేనిటకొంత విపుల ముగ చెప్పవలసివచ్చినది. ఏలననగ :— ఈవిషయములపై యిప్పటివారికి చాలయపోహాలు గలవు; ఈ యపోహాలను, తప్పు అభిప్రాయములను వారికిస్పష్టముగ విప్పిచెప్పుటకై మన ధ్రువసిద్ధాంతమెంతయో తోడ్పడుటచే నే నీసందర్భమం దాయంశములను గూర్చి కొంతముచ్చటించవలసి వచ్చెను.

ప్రకృతి శక్తులన్నియు భగవంతుని సంకల్ప, శక్తుల యొక్క రూపాంతరములే యని భావించి వానిని పూజింప మొదలిడినట్టియు, ప్రత్యేక మొకసర్వాంగ సుందరమగు మాతృభావను పెంపొందించుకొన్నట్టియు, స్వర్గతుల్యముగ

నున్న ధ్రువమండల లక్షణముల నాధారముగ గొని వాని నుండి ప్రత్యేకమొక గొప్పగాథావాఙ్మయమును సృష్టించి నట్టియు, ఆర్యజాతి సామాన్యజాతియా ? ఇట్టి గొప్పపను లొనర్చినజాతి నాగరకతయందు చాల యభివృద్ధినొందియుండి యుండవలెను. కాని, సమష్టియార్యజాతి ధ్రువమండలమం దుండగ నాగరకతయం దెంతవర కభివృద్ధినొందెనో ఖచ్చితముగ కొలతవేసి చెప్పుటకు మన కిప్పుడు సాధనములు లేవు. నూలువేయుట; వడుకుట; లోహపుకనిముట్లను తయారు చేయుట; నావలను, రథములను కట్టుట; పట్టణములను భవనములను నిర్మించుట; అందు నివసించుట; క్రియవిక్రయాదు లొనర్చుట; వ్యవసాయము చేయుట;— మొదలుగాగల పనులన్నియు ప్రాచీనార్యులకు బాగుగ తెలియునని భాషా పరిశోధనలను బట్టిచూడగ స్పష్టమగుచున్నది. వివాహములు, స్థిరచరాస్తులకు సంబంధించిన చట్టములు,— మొదలుగాగల సాంఘిక, రాజకీయసంస్థాపన లాకాలమున నార్యులలో ప్రబలి యుండెననికూడ మనకు తెలియుచున్నది. ఆకాలమందలి సమష్టి యార్యజాతికి తెలిసియున్న జంతుసముదాయముల పట్టికయు, తరులతాగుల్మాదుల పట్టికయు పెద్దజాబితాలు మనకు భాషా పరిశోధనలవలననలభించుచున్నవి. ఇవిగాక, యీభాషా పరిశోధనలవలన యింక నెన్నియో చాల ముఖ్యమైన యంశములు బయట పడుచున్నవి. వీని నన్నిటినిబట్టి చూచినచో ఉత్తర శిలాయుగమందున్న మృగప్రాయత్వ దశకంటె ధ్రువనివాసము

నాఁడే యున్నతస్థితిలోనున్న నాగరికత ప్రబలియుండెనని స్పష్ట మగుచున్నది. కాని, మనమిట యింకొక సంగతిని విచారింప వలసియున్నది. ఈప్రాచీన నాగరికతయొక్క పరిమితియెంత వఱకు గలదు? పాశ్చాత్యశోధకులవలన మన కిదివరకు గన్పట్టి నంతవఱకే యుండెనా? లేక యంతకంటె యెక్కువయుండెనా? మనమిప్పుడు క్రొత్తగ ఋజువుపఱచుచున్న ధ్రువసిద్ధాంత ముచే యీవిషయమునందలి జ్ఞానమును పెంచుటకేమైన యవకాశమున్నదా లేదా? యను విచారణ చేయవలెను. వైదికగాథలందును పూజా పద్ధతులందును నున్నట్టి ధ్రువలక్షణములనుబట్టి చూడగ, యవి చాల పురాతనకాలమునాఁటివనియు, వానిపేళ్లు ఆర్యభాషల లోనంతటను పూర్వమే యవి ప్రబలియుండెననియు మన మిది వఱకు చెప్పియుంటిమి. ఇదేరీతిగ, ఆర్యులప్రాచీనసభ్యతను గూర్చియు పాశ్చాత్యశోధకులు చేసిన సిద్ధాంతములను మన ధ్రువసిద్ధాంత దృష్టితో కొంతవరకు మార్పుచేయ వలసివచ్చును. హిమప్రళయము సంభవించుటచే ఆర్యులు తమ మాతృభూమిని వదలిపెట్టక తప్పినదికాదు. ఈప్రళయమందు చావగ మిగిలిన యార్యులు తమపూర్వమందున్న మహోన్నత నాగరికతలో బహుకొద్దిగ మాత్రమే తమ వెంట వెట్టుకొని బయలుదేరియుందురు. ఈ కొద్దిపాటినాగరికతతో వారు హిమప్రళయానంతర యుగారంభమందు నూతననివాస ములను వెదకికొనుటకై దక్షిణభూములలో సంచారమొనర్చ నారంభించిరి. ఇట్లు సంచారమొనర్చుచుండగ వారికి మధ్య

త్రోవలో క్రొత్తజాతుల వారితో సంపర్కము గలుగు చుండెను. ఆర్యులు క్రొత్తజాతుల నన్నిటిని తమ వశము జేసికొని వారిపై యాధిపత్యము వహించిరి. తమ కంతటి యనుకూల పరిస్థితులు లేకపోయినను, యీ కొద్దిపాటినాగరి కతతో దేశద్రిమ్మరులుగ తిరుగుచున్న యీ యార్యులే తక్కిన జాతులవారి నందరిని (జయించియో, లేక తమలో కలుపుకొని యో) తమవశము జేసికొని వారిపూర్వ భాషలను, నాగరికము లను, భావములను, పూర్తిగ మార్చివేసి, వారినందరిని ఆర్యులు గనే చేసివైచిరి. కావున, ప్రళయానంతరమునాటి ఆర్యనాగరి కతయే యీ యార్యేతరజాతుల నాగరికతలం [illegible] మణుంగులు మహోన్నతమైనదని చెప్పుట [illegible] యొక్కటియే చాలును. ప్రళయానంతరము [illegible] లకు లేచివచ్చిన యార్యులలో [illegible] తనపూర్వ నాగరికతయే మహోన్నతమైనదని [illegible] బుజువగుచున్నది. ప్రస్తరశిలాయుగా [illegible] భాగములలో నివసించియున్న యార్యజాతులు [illegible] లచ్చటనే పుట్టినవని పండితులిదివరకు తలంచుచుండిరి. కావున, సమిష్టియార్యజాతి నాగరికతను సంపాదించినట్లు [illegible] సికొనుటకై ఆయా భాషలను [illegible] యొక్క పరిశోధన యవసరము లేకపోయెను. కాని, యిప్పుడు పండితుల యభిప్రాయములన్నియు మార్చుకొనవలసి వచ్చెను. ప్రస్తర శిలాయుగమునాటి యార్య సభ్యత స్వతంత్రమైనదా, సంపూ

ర్గమును [illegible]సది కాదు. అది సమిష్టి యార్యజాతి యంత యును ఉత్తరధ్రువమండలమందు కాపురమున్ననాటి సభ్యత లోనుండి యిప్పటికి దిగుమతియైన యొకానొక సహస్రాంశము యుండనోపు. కనుక, ఒకే యర్థమునిచ్చుమాటలుకొన్ని భాషలలో నేతప్ప యన్ని యార్యభాషలలోను గాన్పింప లేదను నొక్క కారణముచే యింతటి సభ్యత సమిష్టియార్య జాతికి లేదని వాదించుట సమంజసముకాదు. భాషాపరిశోధన లో కేవలము లాభము లేదని నేనుచెప్పను. అవి పనికివచ్చి నంతవరకు వానిని మనమంగీకరింపవచ్చును. కాని, మనమొక్క విషయములో మాత్రము బహుజాగ్రతగనుండవలెను. ఒకే యర్థమునిచ్చుమాటలు సమస్తార్యభాషలలోను గాన్పింప లేనంత మాత్రమున, ఆ వస్తువుగాని, ఆ యర్థముగాని ప్రాచీ నార్యులకు తెలియునో తెలియదని మనము వాదింపకూడదు. హిందూప్రళయముచే తత్పూర్వమందున్న నాగరికత యెంత నశించిపోయినదో తెలిసికొనుటకు మన కవకాశము లేదు. కాని, పూర్వపునాగరికతలో కొంతభాగము మరల దొరుకుట కవ కాశము లేకుండ పూర్తిగ నశించిపోయిన దనుటలో సందేహ మేమియు లేదు. కనుక, యిట్టి సందర్భములలో మన మొక మాటమాత్రము ఖండితముగ జెప్పవచ్చును. భాషాపరిశోధ నలవలన మన కిప్పుడు గన్పట్టుచున్న ఆర్యసభ్యత ప్రళయా త్పూర్వమందు సమిష్టియార్యజాతిలోనున్న సభ్యతలో కని ష్ఠాంశము (Minimun) చెప్పవచ్చును. ఈ యంశమును

మాత్రము మన మెప్పుడును మరచిపోకూడదు. ఎట్లనగా:— ఈ భాషాపరిశోధనల వలననే ప్రాచీనార్యసభ్యత నంతను పూర్తిగ కనుగొంటిమని పండితు లిదివరకు తలంచుచుండిరి. ఆర్యుల మూలస్థాన మెచ్చటనుండెనో తెలియుట కెవరకు యీ భాషాపరిశోధకుల వాదనలు బహుభాగముగనే గన్పట్టినవి. కాని, ఆర్యజాతియు తన్మతమును, హిమప్రళయమునకు పూర్వమందే ఏర్పడిగ ప్రబలియుండెననియు, అప్పటికవి పుట్టియుండు కాలమై నదో చెప్పుటకువీలులేనంతటి యనాదికాలమునందే యవి పుట్టెననియు శాస్త్రజ్ఞు లిటీవల ఋజువుపరచియున్నారు. కావున, హిమప్రళయమునకు పూర్వముండిన యార్యులు మృగప్రాయత్వదశలో నుండిరని చెప్పుట కిప్పుడు వీలులేదు. మానవచారిత్రమునందు శిలాయుగము, కాంస్యయుగము, లోహయుగము అను మూడుయుగములుండెనని భాషాశేష పరిశోధకులు నిశ్చయించియున్నమాట వాస్తవము. దీనిబట్టి, ఆర్యులకెప్పుడు శిలాయుగమందుండి యుండవలెనని వారు చెప్పుచున్నారు. కాని, ఆర్యజాతియొక్క శిలాయుగము హిమప్రళయానంతరమందే తటస్థించెనని చెప్పుట కీభాషాశేష పరిశోధనలలో నింతమాత్ర మాధారము గాన్పించుటలేదు. అదిగాక, సమిష్టియార్యజాతికి లోహపు పనిముట్లు తెలియునని భాషాపరిశోధకులు చెప్పుచున్నారు. దీనిబట్టిచూడగ, ఉత్తరధ్రువమండలమందున్న సమిష్టియార్యజాతియొక్క నాగరికతయే శిలాయుగమునాటి నాగరికతకంటె — అంతయేల,

లోహాయుగమునాటి నాగరికతకంటెనుకూడ — యెన్నియో రెట్లు యెక్కువైనదని తెలియుచున్నది. లోహాయుగము ఐరోపాఖండములో పుట్టలేదనియు, అది యుతరదేశములనుండి యిటకు వర్తకమువల్లనో, లేక ఆర్యశాఖలు కొన్నియిటకు వచ్చుట చేతనో, దిగుమతి యయ్యెననియు ప్రముఖులగు భూవిశేషపరిశోధకులు చెప్పుచున్నారు.

హిమప్రళయమునకు పూర్వమార్యులు ఉత్తర ధ్రువమండలమందుండిరనియు, ఆనాడువారు మహోన్నతమగు నాగరికతలోనుండిరనియు చెప్పు మన సిద్ధాంతముకూడ యీ భూవిశేష పరిశోధకుల యభిప్రాయమును బలపరుచుచున్నది. కేవలము భాషాపరిశోధనలపైననే యాధారపడుట యెంతటి యనర్థదాయకమో తెలుపుటకై నేనిచ్చట నొక యుదాహరణమును జూపించెదను. ప్రాచీనార్యులకు తామ్రలోహమునుగూర్చి తెలియునని డాక్టరు ష్క్రేడర్ గారు ఋజుపరచియున్నారు. దీనిలో వారప్పుడప్పుడు ఖడ్గములను, బల్లెములనుకూడ చేసియుండవచ్చునని వారు ఒప్పుకొనుచున్నారు. వెండిబంగారములు ప్రాచీనార్యులకు తెలియునో లేదో చెప్పుటకు వీలులేదట. 'భాషాపరిశోధకులు తమ మతములనే యెంతపట్టుదలతో పట్టుకొని వ్రేలాడుదురో యీ క్రిందియంశమువలన తెలియగలదు. వర్తకవ్యాపారాదులలో నిచ్చి పుచ్చుకొనునాణెము నొకదానిని "ఖల్కాస్" అను పేరుతో హోమరను గ్రీకు కవి తన గ్రంథమందు పేర్కొని

యున్నారు. ఈనాగమము బహుశః రాగిలోహమో లేక కంచు లోహమో చేయబడియుండును. ఋగ్వేదమందుకూడ (VIII, 1, 5) యిట్టి చిన్న నాగమములకు "సుల్క" యనుపేరుతో పేర్కొనబడియున్నది. బహుశః యిదికూడ రాగిలోహమో, కంచులోహమో చేయబడియుండి, హోమర్ కవి చెప్పిన "ఖల్ కాస్" ను పోలియుండును. కాని, భాషాపరిశోధకులు సాధారణముగ గ్రీకు "ఖ" ను సంస్కృత "హ" తో పోల్తురు. ఈ సూత్రము నిచ్చట వర్తింపజేసినచో గ్రీకు "ఖల్ కాస్" ను సంస్కృత "సుల్క" తో పోల్చుటకు వీలులేదు. కనుక, భాషాపరిశోధకులు గ్రీకు "ఖల్ కాస్" ను సంస్కృత "హ్రింకు, హ్లింకు," లతో పోల్చుటకై యత్నించిరి. కాని డాక్టర్ స్క్రేడర్‌గారు చెప్పినట్లుపోలిక యసంభవముగ గన్పట్టుచున్నది. ఎలవనగ:—"హ్రింకు" శబ్దము వేదమందు లేదు; దానికి "రాగి" లేక "కంచు" అను నర్థముకూడ లేదు. కనుక, యీభాషా పరిశోధకు లేర్పరచిన సూత్రము నటుంచి, నేను గ్రీకు "ఖల్ కాస్" ను సంస్కృత "సుల్క" తోడనే సరిపోల్చుచున్నాను. ఎలవనగ:—సంస్కృత "శ" వర్ణము గ్రీకు "క" వర్ణమునకు సరిపోవును. ఈ "క" వర్ణమునకుబదులుగ అప్పుడప్పుడు "ఖ" వర్ణముకూడ ప్రయోగింపబడుటయు నాచారముగ నేయున్నది. కనుక "ఖల్ కాస్" "శుల్క" శబ్దములు సమానార్థకములని నిర్ణయింపవచ్చును. దీనినిబట్టి చూడగ, సమిష్టిఆర్యజాతిప్రజలానాడు రాగినో

లేక సంఘమునో క్రయవిక్రయాదులందు నాణెములుగ వాడుకొనుచుండిరని నిశ్చయింపవచ్చును. ఇట్టి నిదర్శనములే యింక నెన్నియో గలవు. వానినన్నిటిని విచారించుట కిది తావు కాదు. ప్రాచీనార్యసభ్యత పరిమితిని నిర్ణయించుటలో భాషా పరిశోధనాఫలితముల మనమెంతవరకు గ్రహింపవచ్చునో తెలుపుటకే యీ యుదాహరణములనిట నిచ్చియున్నాను. ప్రాచీనార్యసభ్యతను హిమప్రళయానుపూర్వమునకు గొనిపోయినచో ఆనాటి వారు మృగప్రాయత్వదశలో నుండిరని చెప్పు సిద్ధాంతము యుక్తిసహమైనను నిలువజాలదు. ఒకవేళ ఉత్తర శీతలాయుగమునందు కొన్ని ఆర్యశాఖలలో తక్కువ నాగరికత యున్నచో, అది కేవలము హిమప్రళయముచే తటస్థించిన క్షీణదశయే యని యెరుగవలెను. ఈ మహావిపత్తునుండి ప్రజలు బయటపడి, యిండ్లు వాకిండ్లను గోల్పోయి, దేశభ్రష్టులుగ కాలమునగడుపుచు, పెక్కిడుముల పడవలసి వచ్చుటచే వారి పూర్వనాగరికత చాలవరకు వెనుకబడియుండవచ్చును. ఆశియాఖండస్థులగు ఆర్యులుమాత్రము ప్రాచీన మతమును, సభ్యతను, చాల యెక్కువగ కాపాడుకొనగలిగిరనుమాట సత్యమే, దీనికి కారణము బహుశః వారు తమ ప్రాచీనగాథలను కర్మకాండయందును మంత్రములందును, సూత్రములందును భద్రముగ బొందుపరచియుంచుటచే, అవి చెడకుండ యిప్పటివరకు నిలిచియుండవచ్చును. అదిగాక, యిట్లు బొందుపరచిన మంత్రములను కొందరు

ప్రజలు ప్రత్యేక వేదములవ్యాప్తిగ పూనకొని, కడపటివఱకు, సుశిక్షితమైన తమధారణాశక్తిచే వానిని వారివారి సంతానము సంక్రమింపజేయుచుండిరి. అందుచేతనే వేదభాగములు నాటినుండి యిప్పటివరకు భద్రముగ నిలిచియున్నవి. పారసీక ప్రజలవిషయమ ట్టిదికాదు, అసలు మొట్టమొదట రచింపబడిన మంత్రములును, సూక్తములును, చాలభాగము యిప్పుడు పారసీకుల యవెస్తాగ్రంథ మందు గానవచ్చుటలేదు — అవియెప్పుడో నశించిపోయెను. దీనినిబట్టిచూచినచో, యీప్రాచీనగాథలు నశించిపోకుండ కాపాడుట యెంత కష్టసాధ్యమైనకార్యమో మనకు సులభముగ బోధపడగలదు. "అవెస్తా" గ్రంథములోని వెండిదాదను గ్రంథమే యింక యెక్కువభద్రముగ కాపాడబడియున్నది. అయినను, దీనియందుకూడ కొన్నిభాగములు నశించి పోయెనని పండితులు నిర్ణయించియున్నారు. ప్రాచీనపార సీగ్రంథమునందు కాపాడబడిన యీకొలదిభాగములను, యిప్పటిగ్రంథములను మనము తరచిచూచినచో ధ్రువ నికేతనమును సూచించు ప్రమాణములెన్నో లభించగలిగినవా యని మనకెంతో యాశ్చర్యము గలుగవచ్చును. కాని, దీనిలో ఆశ్చర్యపడవలసినపనిలేదు. నిజముగ, ఆర్యులొకప్పుడు ఉత్తర ధ్రువమండలమందున్నమాట వాస్తవమే యని ఋగ్వేదప్రమాణములు చాటిచెప్పుచున్నవి. కనుక, ఉత్తర శిలాయుగమందైరోపాలోనున్న యార్యశాఖలవారు (మాక్స్ ముల్లరుగారు తలంచినట్లుగ) పశుత్వములోనుండి నాగరకము

కొనసాగెనని చెప్పి స్థిరపరచిరి. దీనికిమారుగ వారు హిమ ప్రళయానంతరము గూడ పూర్వనాగరకము నంతను పోగొట్టుకొని అప్పటికి కొంతకాలముగ పశుత్వములోనికి దిగిపోయి, నశింపగా మిగిలిన కొన్ని ప్రాచీన నాగరికతాశకలములతో యెట్లో కాలక్షేపముచేయు స్థితిలో నున్నారు.

ప్రాచీనార్యులయొక్కయు, వారిసభ్యతయొక్కయు యున్నస్థితిని హిమప్రళయాపూర్వమునకు గొనిపోతిమి. కొందరు ఈయీ తీర్పును సాధారణముగ తలంచుదానికంటె ఆనాటి నాగరికత చాల యెక్కువైనదనికూడ మనము తెలిసికొంటిమి. అయినను, ప్రాచీనార్యచరిత్రములో మన మింకను తెలిసికొనవలసిన యంశములు చాలగలవు. ఉదాహరణ:- ఆర్యులు తక్కిన మానవజాతులనుండి యెప్పుడు, యెక్కడ, వేరయ్యారు? ఆర్యభాష యెక్కడ యెట్లు వృద్ధి నొందెను? మానవకోటియొక్క చారిత్రమునం దీసమస్య లత్యంత ప్రాముఖ్యములైనవి. కాని వీనినన్నిటిని సంతృప్తి కరముగ పరిష్కరించుటకు తగిన సాధనములు మనకిప్పుడు లేవు. బహుశః ఆకాలమం దార్యులతో పాటు తదితరమానవ జాతులుకూడ నివసించియుండవచ్చును. కాని, దీనివిషయమై వేదమందు మన కచ్చటను ప్రమాణము లభించుటలేదు. తృతీయ యుగములోకూడ యీభూగోళముపై మానవులు నివసించియున్నట్లు భూగర్భ శాస్త్రవేత్తలు నిర్ణయించి యున్నారు. కనుక, హిమప్రళయములచే యీభూగోళముపై

గావింపబడిన మహావిఘ్నముల నన్నిటినీ మానవుఁడు తనసంస్కార గాంచియే యున్నాఁడనుట (భూగర్భశాస్త్రరీత్యా) సత్యమే. కాని, యీమానవజాతి శరీరవర్ణమునుబట్టియు, భాషను బట్టియు, యెట్లు, యెక్కడ, యెప్పుడు భిన్నజాతులుగ విడిపోయెనో తెలిసికొనుటకు మనకేమియు ప్రమాణములు లభించుటలేదు. దీనికిమారుగ, భూమినుండి త్రవ్వి యెత్తబడిన మనుష్యుల పుఱ్ఱెలు, యెముకలు మొదలగు వానిని పరీక్షించి చూడగ, యెంతవరకుపోయినను, మానవజాతి అప్పటికే కొన్ని రకములుగ విభజింపబడి యున్నట్లు గాన్పించుచున్నది. కనుక దీనినిబట్టి మానవజాతియొక్క యుత్పత్తిస్థానము నిదమిత్థమనినిర్ణయింపజాలము. కనుక యెవరియిష్టమువచ్చినట్లు వారు ఊహాపోహలగావించుటకు పండితుల కీవిషయమునందు కావలసినంత యవకాశమున్నది. ఆర్యులనుగూర్చిగాని, మానవజాతినిగూర్చిగాని అసలు ఉత్పత్తిస్థానమును, మతమును, భాషనుగూర్చియు నిర్ణయించుట కీగ్రంథమందు చర్చించి యున్న ప్రమాణములలో నొక్కటియైనను తోడ్పడజాలదు. హిమప్రళయమునకు పూర్వ మెంతకాలముక్రిందట ఆర్యజాతి పుట్టినది? ఈజాతియంతయు మొట్టమొదట ఒకస్త్రీనుండియు, ఒకపురుషునుండియు మాత్రమే పుట్టెనా? లేక అనేకదంపతులనుండిపుట్టెనా? ఈప్రశ్నలకు సమాధానము చెప్పుటకు మన శ్రీగ్రంథమం దుదాహరించిన వాక్యములలో నెట్టియును ఆధారములభింపదు. మనకిప్పటికి దొరికిన ప్రాచీనకంకరల

యాధారముచే మనమింతవరకు మాత్రము చేయగలము— ఏమనగా:— హిమప్రళయానంతరమందు దక్షిణమండలములలో నుండెనని తెలియబడిన ఆర్యజాతిని, ఆర్యసభ్యతను, గొనిపోయి హిమప్రళయాపూర్వమందు ఉత్తర ధ్రువమండలములలో పెట్టగలము. హిమప్రళయమిక రేపురానున్నదనగ, ఆర్యసభ్యతయు, ఆర్యజాతియు; ఒక్క-నాడే, ఆకస్మికముగ, పుట్టెనని మనము చెప్పజాలము. ఇవిరెండును అంతకుపూర్వము చాలకాలముక్రిందటనే పుట్టి, క్రమముగవృద్ధినొందుచువచ్చియుండవలెను. కాని, మనకుతగినన్ని ప్రమాణములు లేనందున ఈవిషయమై వట్టియూహాలతో కాలము గడపుట నిష్ప్రయోజనము. ఆర్యజాతియు, ఆర్యమతమును హిమప్రళయమునకు పూర్వమందే ప్రబలియుండెననియు, అవి అనతిపూర్వము పుట్టినవి కావనియు—మాత్ర మిప్పటికి తెలిసికొని, సంతృప్తినొందిన చాలును. ప్రస్తుతపరిస్థితులలో మన మింతకంటె ఎక్కువ చేయగలిగినదేదియు లేదు.

వేదముల యుత్పత్తిని గూర్చియు, స్వభావమును గూర్చియు ప్రామాణ్యమును గూర్చియు హిందూ వేదాంత శాస్త్రజ్ఞుల యభిప్రాయములకును, మనము పైనుదహరించిన యభిప్రాయములకును యెట్టిసంబంధముగలదో విచారింపకుండ యీయధ్యాయమును ముగింపజాలము. బ్రాహ్మణముల కాలమునాటినుండియుకూడ యీసమస్యలను వేదాంతులు బహుసూక్ష్మముగను, బహునిపుణముగను, బహుతీక్షణము

గను, బహుపాండిత్య ప్రకర్షతోడను చర్చించియున్నారు. కేవల వేదాంతదృష్టితో యీవిషయమును గూర్చి చెప్పవలసిన ప్రశ్నోత్తరసంగతులు కొన్ని మాత్రమును చెప్పెదము. పాశ్చాత్యదృష్టి వేరు; వేదాంతదృష్టి వేరు; యీ రెంటను భేదములున్నవి. కనుక, యీ రెంటిని కలిపి చర్చింపవలసినదానికంటెను వేరుగనుంచి ఒక్కొక్క దానిని పరీక్షించినచో మేలు. ఇట్లు విడివిడి వేరుగనుంచి ఒక్కొక్కదానిని ప్రత్యేకముగా పరీక్షించి చూచినచో, రెండిటి రెంటిలో గలిగినసారాంశములను పోల్చుటకవకాశమగును. ఈ రెంటికి యెక్కడపోలికలున్నవో, యెక్కడ విరోధములున్నవో తెలిసికొనవచ్చును. వేయేల, యీగ్రంథమును చదివిన యే హిందువుడుగాని యీ రెండుదృష్టుల నిట్లు పోల్చిచూడకుండ నుండజాలడు. కనుక, దీనినిగూర్చి ముఖ్యమైన మూడు విషయములను చెప్పి మాహిందూవైదికుల ప్రమాణముగా నిరూపించెదను.

హిందూవేదాంతశాస్త్రజ్ఞుల ముఖ్యప్రమాణము:— వేదములు నిత్యములు (నిత్యా:) వేదములకు ఆదిలేదు. (అనాదయ:) వేదములు మానవనిర్మితములుగావు (అపౌరుషేయా:) వేదములందు చెప్పబడిన యీలక్షణములు తమకు తెలిసినంతవరకు బహు ప్రాచీనకాలమునుండియు వచ్చుచున్నవని చెప్పుచున్నారు. డాక్టర్ మ్యాక్సు గారు యీవిషయములన్నిటిని చర్చించుటకై ప్రత్యేకమొకసంపుటమును వ్రాసియున్నారు. దీనికి సంబంధించిన మూలవాక్యముల ననేకములను వారా గ్రంథమందు ఉదాహరించియున్నారు. ఋగ్వేదభాష్యపీఠికయందు సాయనా

[illegible] విషయములనుగూర్చి సంక్షేపముగ వ్రాసిన విషయములను [illegible] భాష్యములోనుగాను తమగ్రంథమందుదాహరించియున్నారు. అట్లగాక, కీర్తిశేషులగు మహామహోపాధ్యాయ [illegible] శాస్త్రి [illegible] గారునుకూడ మొన్ననే యీయంశములను గూర్చి [illegible] సంస్కృతభాషయందు ప్రమాణించియున్నారు......కనుక, నేనిపుడు హిందూవేదాంత శాస్త్రజ్ఞుల [illegible] వివిధాభిప్రాయములను మాత్ర మిచ్చుట [illegible] వివరించను; వానివివరములలోనికి నేనిప్పుడు దిగను; వివరములుగావలసినవారు పై గ్రంథములను పరిశీలింపవచ్చును. మనమిప్పుడు విచారింపవలసిన యంశమేమనగ:— వేదసూక్తములు—అనగ, వానిలోనిమాటలేగాక, అందు స్పష్టియు, [illegible]సూచింపబడినట్టియు మతపద్ధతులుకూడ— ఋషులచే రచింపబడెను. ఏసూక్తము నేఋషి రచించెనో వేదానుక్రమణికలలో చెప్పబడియున్నది. అయితే, ఫలాని ఋషి ఫలానిసూక్తమును రచించెననగ అర్థమేమి? కాళిదాసు శకుంతలా నాటకమును రచించెనని చెప్పినట్లే యర్థమా? లేక, దీనికింక నేమైన గూఢార్థమున్నదా? లేక, యీసూక్తములు అనాదినుండియు ఉండనేయున్నావా? అనగ, వీనికి "ఆది" యనునది లేక శాశ్వతముగ—నిత్యముగ—నున్నవా? ఈప్రశ్నలకు సమాధానము చెప్పుటకు ఆసూక్తములకంటె యెక్కువ ప్రమాణములు మనకు లేవు. కనుక,

యీప్రశ్నల కాసూక్తములే సమాధానము చెప్పవలెను. కాని, డాక్టరు మ్యూయిరుగారు చెప్పినట్లు వైదికఋషుల వాక్యము లీవిషయమై యేకాభిప్రాయమును కనుపరుపలేదు. అనేకఋషు లనేకరీతులుగ చెప్పుచున్నారు. కొన్నిచోట్ల వైదికఋషులు తమ ఆశలను, ఉత్సాహములను, భయము లను, మానసోద్రేకములను వెలిబుచ్చిరి; ప్రాపంచిక సౌఖ్య ములకై దేవతలను ప్రార్థించిరి; శత్రుజయమునకై దేవతలను ప్రార్థించిరి; జూదము మొదలగు దుర్వ్యసనములను ఖండించిరి. (X, 34); తమయెదుట ప్రత్యక్షముగ జరుగుచున్నట్లు గన్పట్టు చున్న కొన్నికొన్ని వ్యవహారములను వర్ణించిరి; వడ్రంగి రథమునుకట్టినరీతిగ తామును నూతన స్తోత్రసూక్తములను (నవ్యాని, అపూర్వాణి) చేసితి (మి)మనియు, పుట్టించితి (మి) మనియు, కల్పించితి (మి) మనియు, వైదికఋషులు చెప్పు చున్నారు. [I, 47, 2; 62; 13; II, 19, 8; IV, 16, 24; VIII, 95, 5; X, 23, 6; 39; 14; 54, 6; 160, 5. Etc.]

ఋగ్వేదమునందు మఱికొన్నిచోట్ల ఫలానాఋషికుమారుడు ఫలానా ఋషిచే ఫలానాఋషికుమారునిచే రచింపబడినదని యున్నది.(I, 60, 5; X, 68, 17; 67, 1 Etc.) ఇదిగాక మఱి కొన్నిచోట్ల కొందరు ఋషులు తాము గానముచేయుచున్న యీసూక్తములు ఇంద్ర, మిత్ర వరుణాది దేవతలచే ప్రేరేపింప బడినవని చెప్పియున్నారు. వేదఋక్కులు (ఋచః) ప్రత్యేక

ముగ కేవలము పరమపురుషునుండిగాని, భగవత్ప్రేరణచే గాని యుత్పన్నమయ్యెనని మరికొన్నిచోట్లగలదు. ఈఋక్కులు "దేవదత్త" ములనియు (దేవతలచే ననుగ్రహింపబడినవనియు) (లేక) దేవతలచే సృజింపబడినవనియు, వాని నిటీవలకొందరు ఋషులు జ్ఞానదృష్టిచే చూచిరనియు (పశ్యాత్) మరికొన్ని చోట్లగలదు. [I, 37, 4; II, 23, 2; VII, 66, 11; VIII, 59, 6; X, 72, 1; 88, 8; 90, 9; Etc.] వచస్సు (వాచ్) నిత్యమని [VIII, 75, 6; X, 125] మరికొన్ని స్థలములందు చెప్పబడియున్నది. దేవతలు దివ్యవాణిని(వాచ్), సూక్తములను సృజించిరట. [VIII, 100, 10; 101, 16; X, ౮౮, ౮] ఇట్టి భిన్నరీతులుగనున్న వేదసూక్త ప్రమాణములనుబట్టి యీసమస్యను యిదమిత్థమని నిర్ణయించుట కవకాశము లేకున్నది. ఈ సూక్తములరచన మనుష్యప్రయత్నము చేతనే జరిగినదని కొన్నిచోట్లను, భగవత్ప్రేరణచేతను, లేక, కేవలము భగవంతునిచేతనే జరిగినదని మరికొన్నితావులలోను చెప్పబడియున్నది. ఇట్టివిషయము రెండువిధములుగ వర్ణింపబడియుండుటచే యీసూక్తములు మొట్టమొదట భగవత్ప్రేరణచే గానమొనర్ప బడెననిగాని, లేక, వాఙ్మయముఖమునుండియే ప్రత్యక్షముగ నుత్పన్నమయ్యెనని గాని ప్రాచీన ఋషీశ్వరులలో తుదకు కొందరైనను తలంచి యుండిరనుట స్పష్టము. భగవత్ప్రేరణచే గానమొనర్పబడెనని చెప్పబడిన ఋక్కులను మానవయత్నముచే రచింపబడె

నని చెప్పబడిన ఋక్కులతో సరిపోలవచ్చును. ఏలనన:— ఈఋక్కులను గాన మొనర్చిన ఋషీశ్వరులు తాము భగవత్ప్రేరణచేతనే యీఋక్కుల నిట్లుగాన మొనర్చుచున్నామని వారు భావించి యుండవచ్చును. కాని, పలానిఋక్కు లేక యజుస్, సామన్ — కేవలము పరమాత్మునియొక్క ముఖము నుండియో, లేక దేవతల ముఖమునుండియో, యుత్పన్న మయ్యెనని చెప్పుటకర్థమేమి? బ్రాహ్మణ వేదములు వ్రాసిన నైనదో, యీ వేదముల నిత్యత్వమును నొప్పినట్టియు, దివ్యోత్పత్తినిగూర్చినట్టియు పరంపరకూడ నాటి ప్రారంభమైనదో యని మనము తెలిసికొనవలెను. ఇదే ప్రకారముగ, బ్రాహ్మణములను, ఉపనిషత్తులను, పరిశీలించి చూచినను కూడ నిస్సంశయముగ యీభావముతో గన్పట్టుచున్నవి. ఋగ్వేదము అగ్ని నుండియు, యజుర్వేదము వాయువునుండియు, సామవేదము సూర్యునుండియు, యుత్పన్నమాయెనని యీ గ్రంథములు చెప్పుచున్నవి. వేదోత్పత్తికై ప్రజాపతి తపస్సుచేయగ, ఆ తపోవేడిమినుండి యీముగ్గురు దేవతలును ప్రోత్సహింపబడి యీ వేదములనుత్పన్న మొనర్చిరట. [శత. బ్రా. XI, 5, 8, 1; ఐ. బ్రా. V, 32, 34; ఛాం. ఉ. IV, 17, 1] పరమపురుషుని ఉచ్ఛ్వాసమే వేదములయ్యెనట. [బృ. ఉ. II, 4, 10] "నిత్యవచస్సు" నుండి ప్రజాపతి వేదములను ప్రపంచమందలి సమస్తమును సృజించెనట. మన్వాది స్మృతులును (I, 21, 23) పురాణములునుకూడ యీభావమునే

తెలుపుచున్నవి... కల్పాంతమందు సంభవించు ప్రళయములో సమస్తపదార్థములతో పాటు యీ వేదములుకూడ నశించునని యీ గ్రంథములు ఒప్పుకొనుచున్నవి. కాని, అంతమాత్రముచే వేదముల నిత్యత్వమునకు భంగము రాజాలదట. ఏలననగ:— నూతన కల్పారంభమందీ వేదములు మరల బ్రహ్మచేతనే ప్రవర్తింపచేయబడుచున్నవి. చిన్న చిన్న ప్రళయములు గడచినపిదప అప్పటికి మిగిలియున్న ఋషీశ్వరులు వేదములను తిరిగి ప్రవర్తింపచేయుచుందురు. దీనికి ప్రమాణము మహాభారతము [శాంతి: అ. 210; 5, 19] నుండి యుదాహరింపబడుచున్నది. [యుగాన్తేఽన్తర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతా స్స్వయంభువా ॥ భవభూతిః ఉత్తర: I, 15:— బ్రహ్మర్షయో బ్రహ్మహితాయ తప్త్వా । పరః సహస్రాః శరద స్తపాంసి । ఏతా న్యపశ్యన్ గురవః పురాణాః । స్వాన్యేవ తేజాంసి తపోమయాని ॥] “మహర్షులు స్వయంభువుచే ననుజ్ఞాతులై, యుగాంతమందంతర్హితమైన వేదములను, యితిహాసములను, పూర్వమందు తపస్సుచే సంపాదించిరి”— కావున, మహర్షులు వేదసూక్తములను చూచినవారేగాని, చేసినవారుగారు. దీనినిబట్టి తైత్తిరీయ, కాఠ కాపిశాఖల పేర్లకును, ఫలానిఋషి ఫలాని సూక్తము “రచించె” “సృజించె” నని చెప్పువాక్యములకును అర్థము తెలుపుచున్నదన్నగ:— ఫలానిశాఖ, లేక ఫలాని సూక్తము ఫలానిఋషిచే చూడబడెనని —— కేవలము చూడ

బడియున్న మాత్రము — [illegible] వేద భావము. ఇటీవల వివిధములగు వేదానువాదములు (భాష్యములు) ప్రబలినప్పటి [illegible] గూర్చి బహుసూక్ష్మముగ చర్చించియున్నారు. [illegible] బయలుదేరునవరకు యూరోపియనులు [illegible] పరిశీలించినవారు లేరు. ఈ మధ్య [illegible] చర్చించి పరిశీలించి చూచి "వారి తర్కములోని [illegible] ప్రతివాదముల [illegible] బద్ధతయు, [illegible] మానములఁ జూపుటలో వారికున్న చతురతయు, [illegible] మన కాశ్చర్యము గలిగించుచున్నవ"ని [illegible] గారు చెప్పుచున్నారు. ఈ చర్చలను [illegible] మనకు ప్రధానముగ గాన్పించు సారాంశ మేమనగా:— [illegible] ప్రాచీనకాలమునుండియు అవిచ్ఛిన్నముగ [illegible] పరంపరలవెంట [illegible] చూచినచో [illegible] ఫలాని మనుష్యునిచే రచియింపబడినవని [illegible] ములు (లేక [illegible]) [illegible] లేదు. ఈచర్చల నొనర్చిన [illegible] అసాధారణప్రజ్ఞాశాలురు గాని సామాన్యులుగారు. వీరి పాండిత్యమును, ధర్మనిష్ఠాపరతయు ననుపమానము లనుసంగతిని మనము [illegible] కొన్నచో, క్రీస్తుశకమునకు పూర్వ [illegible] టనే బహుప్రాచీనమైనదని యెంచబడిన [illegible] రొకటి యుండెనని ఋజువుచేయుట [illegible] లిచ్చియున్న

సాహిత్యమే సర్వవాద్యమైన పరమప్రమాణముగ మన మంగీకరించినవారము. ఈ పరంపరయొక్క యతిప్రాచీనత నిట్లు స్పష్టముగ నిశ్చయింపవచ్చును. వేదముల స్వరూపస్వభావముల పరిశీలింపదలచిన యీ సందర్భమునం దిట్టి పరంపరనుగూర్చ మనము బహుసూక్ష్మముగ పరిశీలింపవలసిన యావసరమున్నమాట వాస్తవమే. కాని, దీని నెంత పరిశీలించినను తుదకు మనకు గలుగుఫలితమేమి? ఈప్రాచీనఋషీశ్వరుల మేథాశక్తి పోయిపారజూడగలిగినంతవరకు నెచ్చటను వేదములకు కర్తయనదగిన మానవు డెవడును గానవచ్చుట లేదు. ఇంతియేగాని, మన కీపరంపరవలన నెక్కువ ఫలితమేమియుగనబడదు. ఇది కేవలము అభావార్థకమైన ప్రమాణమేగాని దీనివలన మనము గట్టిగ నిశ్చయింపదగినదేదియు లేదు. కావున, మీమాంససూత్రకర్తయైన జైమినులవారు వేదనిత్యత్వము ననేకవిధముగ సమర్థించుచున్నారు. వేదములోని శబ్దమునకును భావమునకునుగల సంబంధము శాశ్వతమే (ఔత్పత్తికమే) గాని సాంకేతికముగాదని జైమినులవారి సిద్ధాంతము. ఒకానొక నిర్దిష్టక్రమమం దమర్పబడియున్న అక్షరసమూహమునకే శబ్దమనిపేరు. ఈయక్షరములొకదాని వెంట మరియొకటి యీనిర్దిష్టక్రమమందు ఉచ్చరింపబడుట చేతనే యీ శబ్దమందిమిడియున్న భావము వ్యక్తమగుచున్నది. కాని, వైయాకరణులుమాత్ర మీయభిప్రాయమున కనేకీభవించుటలేదు. అక్షరము లక్షరములగుటచే, కేవల మక్షర

సమూహము చేతనే శబ్దములోని భావము వ్యక్తముగాదు. అక్షరసమూహము నుచ్చరింపగనే " స్ఫోట " యను నొకా నొక యింద్రియాతీతవ్యక్తి వచ్చి దానిపై యావేశించి, అం దుండు భావమును పైకివ్యక్తపరుచునని వైయాకరణులు చెప్పు చున్నారు. నశ్వర (అస్థిర) పదార్థములను దెల్పుశబ్దములు వేదమందు లేనేలేవని జైమినులవారు గట్టిగ చెప్పుచున్నారు. వేదశబ్దములును అందలి భావములును నిత్యములగుటచే వేద ములు స్వప్రకాశములైనవని జైమినులవారి మతము. అనగ, సూర్యునివలె వేదములు తమంతట తామే వెలుంగుచుండు ననియు, అందుచే నవి అనూహ్యమైనవనియు, దోషరహితమైన వనియు జైమినులవారు చెప్పుచున్నారు. వేదములో కొన్ని భాగములకు ఋషులపేర్లు చేర్చబడియున్నను, అవి యాఋషు లచే రచింపబడెనని యర్థముగాదు. ఆఋషులా భాగములను చదివి పారంపర్యముగ వానిని ప్రసరింపజేసిరని యర్థము. ఇది జైమినులవారిమతము. వేదాంతమతకర్తలగు శ్రీశంకరా చార్యులవారి వ్యాఖ్యప్రకారము, బాదరాయణులవారు శబ్దము (లేక ధ్వని) యొక్క నిత్యత్వము నంగీకరించియున్నారు. కాని, ఆశబ్ద మేజాతికి చెందినదో ఆజాతియొక్క నామము నిత్యమైనదిగాని కేవల మాశబ్దమే నిత్యమైనదిగాదని బాద రాయణులవారింకొకవిశేషము చెప్పియున్నారు. సృష్టిలయ ములకు బద్ధులైన యింద్రాదిదేవతలపేర్లు వేదమందు చెప్ప బడియున్నను, యింతమాత్రముచే, వేదముయొక్క నిత్యత్వ

మారదు భాగమురాదు. ఏలననగ:- ఈయింద్రాదిదేవత లేయుటకి వాటిలో ఆజాతిబీజనుమాత్ర మెప్పుడును నశింపక శాశ్వతముగ నిలిచిపోయియుండును. వేయేల, వేదమందు పేర్కొనబడినపేర్లును, జాతిరూపములును నిత్యములు; ఇట్లు నిత్యములుగ నిలిచియున్న వీనిని జ్ఞప్తికి తెచ్చుకొనియే ప్రతి యుగారంభమందును బ్రహ్మ మరల జగత్తును సృష్టించుచుండును. [శా. భా. VI, 22] కావున, సమస్త జగత్తునకు కారణభూతమైన అధిష్ఠానము వేదము. కావున, వేదము నిత్యమనియు చెప్పవలెను. ఈసిద్ధాంతమును పాశ్చాత్యులగు అలెగ్జాండ్రియాకు నాగస్టుల "డివైన్ లోగాస్" అనుసిద్ధాంతమునకు పోల్చవచ్చునని మాక్సిముల్లరుపండితుడు చెప్పుచున్నాడు. నైయాయికులు శబ్దము (లేకధ్వని) యొక్క నిత్యత్వమును అంగీకరించలేదు. సమాజజ్ఞాన ప్రేరితమైన ధర్మదృష్టిగలట్టియు -(మామాంసులవారు చెప్పినట్లు "సాక్షాత్కృత-ధర్మాణః") - సమర్థులైనట్టియు - (ఆప్త) - పురుషుల నుండి వేదము లుత్పన్నములగుటచే నవి పరమప్రామాణ్యములుగ నంగీకరింపబడుచున్నవని నైయాయికులు తలంచుచున్నారు. ఐహికవ్యవహారముల నడవడికై వేదము లేర్పరచియున్న వస్తువులు మనకిప్పుడు పరమప్రయోజనకారులుగ నున్నవి. దీనిని మనస్వానుభవముచేతనే పరీక్షింపవచ్చును. కనుక, ఐహికములగు విషయములలో నింతటి యమోఘవస్తువుల నిర్మించిన యాపురుషుల సమర్థత దీనివలననే

పూర్తిగ బయలువడుచున్నది. ఇదియట్లుండగ, వేదములకు యీశ్వరుడే కర్తయని వైశేషికసూత్రకర్త చెప్పుచున్నాడు. (I, 1, 3,) శబ్దమునకును అందలి భావమునకును గలసంబంధము నిత్యమైనదనుమాటను (నైయాయికులవలెనే) సాంఖ్యులుకూడ త్రోసివేయుచున్నారు. (సాంఖ్యసూత్రములు V, 40, 51) వేదము “పౌరుషేయము” కాదనగ, ఆదిపురుషు నుండి యుత్పన్నమైనది – అని సాంఖ్యులు చెప్పుచున్నారు. అయినను, ఆయాదిపురుషుడు కావలెనని బుద్ధిపూర్వకముగ చేసినయత్నముచే యీ వేదములు పుట్టలేదట. కాని, ఆతని యుచ్ఛ్వాసనిశ్శ్వాసములవలెనే యీ వేదములుకూడ ఆతని నుండి వానియంతట నవియే (యాతనియిచ్ఛలేకుండ) బయటికి వచ్చినవని సాంఖ్యులు చెప్పుచున్నారు. కాబట్టి మాంది నచో మీమాంసకులు చెప్పిన నిత్యత్వమునకును యీ సాంఖ్యులు చెప్పిన నిత్యత్వమునకును చాల భేదము గన్పట్టును. కనుక, వేదనిత్యత్వమును ప్రతిపాదించు వాక్యములు కేవలము సజాతీయ పరంపరలయొక్క యవిచ్ఛిన్నధారను మాత్రమే సూచించుచున్నవని సాంఖ్యుల మతము (వేద–నిత్యతా–వాక్యానిచ సజాతీయానుపూర్వీ – ప్రవాహానుచ్ఛేదపరాణి) [వేదాంతపరిభాషా, ఆగమపరిచ్ఛేద :– మహామహోపాధ్యాయ ఝలకీకరుగారి న్యాయకోశము 2 వ ముద్రణము 786 వ పుటనుండి:– వేదః – సర్గాద్యకాలే పరమేశ్వరః పూర్వసర్గసిద్ధవేదానుపూర్వీసమానానుపూర్వీకం వేదం విర

[illegible] వేదమ్॥ వైయాకరణ పండితుడగు పతంజలి గారు పాణినివ్యాఖ్యయం దీసమస్య నింకొక విధముగ పరిష్కరించుచున్నాడు. వేదములలోనుండు శబ్దజాలమునకును (వర్ణానుపూర్వి), వాని 'యర్థ' మునకును చాల భేదముగలదని పతంజలి చెప్పుచున్నాడు. వేదములకు చెప్పబడిన నిత్యత్వ మీయర్థమునకు వర్తించునుగాని, అందలి యక్షరక్రమమునకు వర్తింపదని వారియభిప్రాయము. [అర్థో నిత్యః, వర్ణానుపూర్వీ అనిత్యా] అర్థము నిత్యముగ నుండనే గాని, అందలి యక్షరక్రమముమాత్ర మెల్లప్పుడు ఒకేవిధముగ నుండక మారుచువచ్చెను. అక్షరక్రమమిట్లు మార్పు జెందుట చేతనే మన కిప్పుడు కాఠకములు, కలాపములు, మౌదకములు, పిప్పలాదములు — లోనుగాగల పాఠభేదములు గన్పట్టుచున్నవని వారి యభిప్రాయము. ఇది "అక్షరక్రమమును, అందలి యర్థమునుకూడ నిత్యములే" యని చెప్పు మీమాంసకమతమునకు విరుద్ధముగనున్నది. అక్షరక్రమముయొక్క నిత్యత్వమును పతంజలి యంగీకరింపక పోవుటకు కారణ మేమనగ:— దీనినంగీకరించినచో, ఒకేవేదమున కనేకశాఖలు, పాఠభేదములు నుండుటకు కారణము గన్పట్టదు. దీనిలో ప్రతి శాఖయు, ప్రతిపాఠమును, సమానమైన ప్రామాణ్యము గలవిగనే యంగీకరింపబడుచున్నవి. వేదములం దిట్లు పాఠభేదములుండుట కొక కారణమును పతంజలి — (కైయట, నాగోజీభట్టుల వ్యాఖ్యప్రకారము) — చెప్పుచున్నాడు.

ఈప్రపంచము దక్షిణపశ్చిమ సంచరించుచు ప్రళయములచే వేదపాఠములు నశించెను. ప్రతియుగాంతరమునందు సంప్రాప్తి యున్న మహాత్ములీవేదములను తమకు జ్ఞాపకమున్నంతవరకు పునరుద్ధరించుచుందురు. [పతంజలిః- నను చోక్తం న హిచ్ఛందాంసి క్రియన్తే నిత్యానిచ్ఛందాంసీతి। యద్యప్యర్థో నిత్యో యాత్వసౌ వర్ణానుపూర్వీ సా-నిత్యా। తద్భేదాచ్చైతద్భవతి కాఠకం కాలాపకం మౌదకం పైప్పలాదకమితి॥ నాగేశభట్టః:- ప్రతిమన్వాంతరం చైషా శ్రుతిరన్యాఽభిధీయతే; సాయణః:- ధాతా యథాపూర్వమకల్పయత్ (ఋ. X, 190, 3) అనుచు, ప్రతిమన్వంతరమందు కొంత క్రొత్తవేదము వెలయుచుండును; ఇందలి అక్షరక్రమము తత్పూర్వవేదమందలి యక్షరక్రమమునకంటె భిన్నముగనుండును. కాని, యిందలి యర్థము మాత్రము యెప్పటివలెనే నిత్యముగ నిలిచియుండును. పూర్వకల్పమునుండి వంశపారంపర్యముగ తమకు వచ్చుచున్న యీపవిత్రజ్ఞానసంపదను ఋషీశ్వరులు ప్రతిమన్వంతరప్రారంభమందును, తమకు జ్ఞాపకమున్నంతవరకు, యింకొక మందు మరల ప్రవర్తింపజేయుచుందురు. ఒకేవేదమునందు సమానాధికారములగల భిన్నశాఖలు భిన్నఋషీశ్వరుల పేరట నున్నవి. దీనికి కారణమేమనగ:- ఆయాఋషులకెవరికి జ్ఞాపకమున్నదానిని వారువ్రాసిరి. ఋషీశ్వరుల జ్ఞాపకములోనున్న భేదమునుబట్టి శాఖలలోకూడ భేదముగలిగెను. ఈయభిప్రాయము మన యిదివరకు మహాభారతమునుండి యుదాహ

రించిన వ్యాసులవారి యభిప్రాయముతో పూర్తిగ నేకీభవించుచున్నది. సూత్రకారుల యీయభిప్రాయములనే యిటీవల ప్రబలిన భిన్న వేదాంతమతములవారు భిన్నరీతులుగ వివరణ మొనర్చియున్నారు. వీరిలో కొందరు వేదముయొక్క శబ్ద ప్రమాణమును నంగీకరించిరి; కొందరంగీకరింపక త్రోసివేసిరి. ఈచర్చలన్నింటిలోనికి మన మిప్పుడు దిగజాలము. అదిగాక, ఇవి మన కిప్పు డవసరముకూడ కాదు. ఏలననగ:— వేదములు ప్రతి ప్రళయమునందు నశించిపోవుచు, ప్రతి ప్రళయానంతరమందు పునరుద్ధారణ మొనర్పబడుచు వచ్చెననుమాట నిజమే యైనచో, మనము తుదకు వ్యాసపతంజలుల యభిప్రాయములనే యాధారముగ గైకొనక తప్పదు.

వేదముల యుత్పత్తినిగూర్చియు, స్వరూపస్వభావములనుగూర్చియు, ప్రామాణ్యమునుగూర్చియు హిందూ వేదాంతశాస్త్రజ్ఞుల యభిప్రాయముల నిట క్లుప్తముగ వివరించియున్నాము. వేదముల నిత్యత్వయనాదిత్వములనుగూర్చి వ్యాసపతంజలులు తెలిపియున్న యభిప్రాయములు మన మిదివరకే గ్రంథమందు భౌతికశాస్త్రాధారముచేతను ఐతిహాసిక ప్రమాణములచేతను ఋజువుపరుప యత్నించిన ధ్రువసిద్ధాంతములతో చాలవర కేకీభవించుచున్నవి. వేదమతమును, తదుపాసనావిధానములను — దేశమును — హిమప్రళయమునకు పూర్వమందే ప్రబలియుండెనని మనమిదివరకు ఋజువుపరచియున్నాము. అవి యెప్పుడు పుట్టెనో మన మంతనిశ్చయ

ముగ నిర్ణయింపలేకపోయినను వైదికదేవతల ధ్రువలక్షణ ములను బట్టిచూడగ, వానిచే సూచింపబడుచున్న ప్రకృతి శక్తుల కన్నిటికిని అంతకుపూర్వము చాలకాలముక్రిందటనే ధ్రువ(మేరు)నివాసులగు ప్రాచీనార్యులు దేవత్వపదవు నొసంగి యుండిరని పూర్తిగ ఋజువగుచున్నది. ప్రళయముచే ధ్రువ నిలయము పాడైపోయినప్పుడు చావగ మిగిలిన యార్యులు కొందరు తమకు ప్రియమైనంత ప్రాచీనమతమును, ఉపాసనా పద్ధతిని, తమవెంట గొనివచ్చిరి. ఈరీతిగ ప్రళయమాదు కొట్టుకొనిపోగా శేషించిన యీభాగమునే ప్రళయానంతర యుగమం దార్యమతమునకు పునాదియాయెను. ఈసిద్ధాంత ప్రకారము హిమప్రళయానంతరయుగమునుండి బుద్ధావ తారమువరకుగల కాలమునంతను యీక్రిందివిధముగ విభ జింపవచ్చును.

క్రీ॥ పూ॥ ౧౧,౦౦౦ లేక ౮౦౦౦:—క్రిందటి హిమ ప్రళయమందు ప్రాచీనధ్రువనిలయము నశించుటయు, తదనం తరయుగ మారంభమగుటయు; —

క్రీ॥ పూ॥ ౮౦౦౦ – ౬౦౦౦:– ఆర్యులు తమమూల స్థానమును విడిచి నూతననివాసములకై తిరుగాడుట; ప్రళయ మందు నశింపగ మిగిలిన యార్యులు తగిన నివాసస్థానము తెచ్చుటకైన దొరుకునాయని ఆశయా, ఐరోపాఖండముల యొక్క యుత్తరపార్శ్వములందు తిరుగాడుట; ఈకాలమందు వసంతవిషువత్ పునర్వసునందుండెను. పునర్వసునకు అదితి

[illegible]చే యీయుగమునకు "అదితియుగ" మని నేను "మృగశీర్ష" గ్రంథమందు నామకరణ మొనర్చియున్నాను.

క్రీ॥ పూ॥ ౪౦౦౦ – ౩౦౦౦:– ఇది మృగశీర్షాయుగము; అనగ వసంతవిషువత్ మృగశీర్షలో నున్నదని యర్థము. వేదసూక్తములలో చాలభాగ మీయుగముయొక్క ప్రథమభాగమందే రచింపబడినట్లు గన్పట్టుచున్నది. ధ్రువనివాసమును గూర్చి చెప్పు ప్రాచీనపరంపరలయొక్క నిజభావము లీయుగమువారి ఋషు లింక నిప్పటికి మరచిపోయినట్లు గాన్పించదు. ప్రాతపంచాంగపద్ధతిని, కర్మకాండను తమ యాకాలపుపరిస్థితుల కనుగుణముగ మార్చుకొనుటకై మొట్టమొదట యీయుగమునందే సక్రమప్రయత్నములు జరిగినట్లు గన్పట్టుచున్నది.

క్రీ॥ పూ॥ ౩౦౦౦–౧౪౦౦:– ఇది కృత్తికాయుగము: అనగ, వసంతవిషువత్ కృత్తికలలో నుండెను. నక్షత్రమాలను కృత్తికలతో ప్రారంభించు తైత్తిరీయసంహితా బ్రాహ్మణము లీయుగమునందే రచింపబడెనని స్పష్టముగ తెలియుచున్నది. వేదసూక్తములను సంహితలక్రింద విభాగించుపనికూడ యీయుగారంభమందే జరిగియుండును. ఇప్పటికి ప్రాచీన ధ్రువనివాసమును గూర్చిన పరంపరలు అగ్రాహ్యములుగాజొచ్చెను. ప్రజలు వీనికి తప్పుడర్థములను చెప్పుచువచ్చిరి. అందుచే వేదసూక్తములు మరింత యగమ్యగోచరములై రాను రాను

దుర్గ్రాహ్యములైపోయెను. కర్మకాండయు, దీనిని గూర్చి బ్రాహ్మణములందు గానవచ్చుచున్న అసంఖ్యాకములగు వివరములును యీకాలమందే ప్రబలియుండును. ఈ యుగము యొక్క చివరి భాగమందే వేదాంగజ్యోతిషము మొట్టమొదటగ రచింపబడెను, లేక అందుచెప్పబడిన విషువత్ స్థానములు ప్రజలచే చూడబడెను; లేక నిర్ణయింపబడెను.

క్రీ॥ పూ॥ ౧౪౦౦-౫౦౦ :- ఇది బుద్ధునకు పూర్వ యుగము. ఈకాలమందే సూత్రములును, వివిధ వేదాంగ మతములును పొడసూపినవి.

నే నిదివరకు "మృగశీర్షా" గ్రంథములో చెప్పిన కాల విభాగమునకును దీనికిని కొద్దిగ భేదమున్నది. కాని, ప్రధాన సిద్ధాంతముచే యీ మార్పు ఆవశ్యకమాయెను. ఏలాగనగ :- ఈసిద్ధాంతముచే అదితియుగమును తీసికొనిపోయి ప్రళయానంతర యుగారంభముగా పెట్టవలసివచ్చెను. దీనిని పౌరాణిక పరిభాషలో చెప్పినచో, ప్రళయానంతర ప్రథమయుగమునకు 'కృత'యుగమని పేరుపెట్టవచ్చును. కృతయుగ మనగ (ఐతరేయబ్రాహ్మణము VII, 15 చెప్పినట్లు) "సంచార మొనర్చు" యుగమని భావము. అనగ, యీ కృతయుగమందు హిమ ప్రళయములో చావగ మిగిన యార్యులు నూతన నివాసస్థానముల వెదకికొనుచు ఆశియా ఐరోపాఖండములయొక్క యుత్తరపార్శ్వములందు తిరుగాడుచుండిరి. 'కృత'యుగమనగ సంచారమొనర్చు యుగమని బ్రాహ్మణగ్రంథములు చెప్పి

వచ్చుచుండు బహుశః వానిభావ మిదియే యగునో కాదో మన మిప్పుడు నిశ్చయముగ చెప్పజాలము. అయినను బ్రాహ్మణ గ్రంథములలో వర్ణింపబడిన చతుర్యుగ లక్షణముల కిప్పుడు మన ధ్రువసిద్ధాంతముచే నూతనవికాసము గలుగుచున్నది. ఐ. బ్రా. VII, 15 లో నిట్లని వర్ణించిరి:— "కలి శయనించు చున్నది; ద్వాపరము నెమ్మదిగ జరుగుచున్నది; త్రేతాయుగము లేచుచున్నది; కృతయుగము చరించుచున్నది" [కలిః శయానో భవతి సంజిహానస్తు ద్వాపరః। ఉత్తిష్ఠ స్త్రేతా భవతి కృతం సంపద్యతే చరన్॥ ఈవర్ణనము పాచికలాటను సూచించుచున్నదని డాక్టరు హాగుగారు తలంచుచున్నారు. మరికొందరింకొక విధముగ దీనిని సమన్వయింపజూచిరి. కాని, మన ధ్రువసిద్ధాంతదృష్టితో చూచినచో యీవర్ణనము ధ్రువనిలయము నుండి లేచివచ్చిన ఆర్యులు నూతననివాసములను వెదకికొనుటకై బయలువెడలిన పర్యటనావస్థలను దెల్పుచున్నదని మన మూహింపవచ్చును. భగవంతుడు క్రమముగ పదునారు భూములను సృజించుటయు, వానిని అంగ్రమైన్యుడను రాక్షసుడు వచ్చి పాడుచేయుటయు మొదలుగాగల పారశీకగ్రంథ వర్ణనమువలెనే యిచ్చటకూడ ఆర్యులు హిమప్రళయానంతరము తమ ధ్రువనిలయమునుండి లేచివచ్చి నూతననివాసస్థానములను వెదకికొనుటకై తిరుగాడుట మొదలుకొని తుదకు తమ మనస్సులకు వచ్చిన భూములలో స్థిరముగ కాపురము నుండువరకుగల ఆర్యుల యవస్థాభేదములే బ్రాహ్మణగ్రంథమం

దీచతుర్యుగ లక్షణములుగ వర్ణింపబడియున్నవి. పో
యీబ్రాహ్మణగ్రంథవర్ణనము నంగీకరించిన మనకేమి
గన్పట్టుచున్నది? ధ్రువనిలయమునుండి లేచినప్పుడు ప్రాచీనా
యుగ్మమును వారికి యిప్పుడు వారిప్పుడు లేని దాని నారాపుత్రా
నాలతో నటునిటు తిరుగాడుచుండిరి. వారా నాప్రదేశములలో
కొద్దికాలముండుచు, అటనుండి లేచుచు, నాగరికస్థానములలో
మరికొంతకాలముండుచు, నాగిలయములనుండి లేచిపోవుచు —
యీరీతిగ అనేకచోట్ల యనేకకాలములుండుచు లేచిపోవుచు —
తుట్టతుదకు తమకు మిక్కిలి యనుకూలమైన స్థానములు
దొరుకగనే వారచ్చట స్థిరముగనిలిచిపోయిరి. ఆర్యమతమును
తదుపాసనాపద్ధతులును . యీ రెండును . హిమప్రళయమున
నకు పూర్వమందే ప్రబలియుండెనని నేనిదివరకు చెప్పియుం
టిని. మరియు హిమప్రళయమందు నశింపగ మిగిలిన ప్రాచీన
మతశేషములనుండియే తదనంతర వైదికమతమును, బ్రాహ్మణా
డయు పుట్టి వృద్ధినొందెననికూడ పైన వివరించియుంటిని. దీని
నాధారముగ జేసికొన్నచో మన యీ గ్రంథమందు ధ్రువ
సిద్ధాంత దృష్టితో చేసియున్న కాలశోధనా ఫలితములును
వేదాంతశాస్త్రజ్ఞుల యభిప్రాయములతో సరిపోల్చుటకు
మిక్కిలి యనుకూలముగ నుండును. ఋగ్వేదములోని ప్రతి
యొక్క సూక్తము ఫలానికాలమందు రచింపబడెనని మనము
ఖండితముగ నిర్ధారణ చేయలేకపోవచ్చును. హిమప్రళయము
నుండి బ్రతికి బయటపడినవారో, లేక వారి సన్నిహిత సంతతి

వారో తమకు వంశపారంపర్యముగ సంక్రమించుచు వచ్చిన ... తమకవకాశము దొరికిన తత్క్షణమే-అనగ, ... తాత్కాలిక నివాసములనైన యేర్పరచు ... సూత్రరూపములుగ బొందుపరచియుందురు. ..., యీ సూక్తములందలి మతము క్రొత్తదికాదు. ... ప్రళయానంతరమం దార్యులు మధ్యా... నుండగ, యిదివరకులేని క్రొత్తమతమును ... సూక్తములను వారు బుద్ధిపూర్వకముగనో, భగ... నో, రచించిరని చెప్పుటకు వీలులేదు. వైదిక ... ధ్రువలక్షణములే యీయంశముపై గల ... ములనన్నిటిని బాపుచున్నవి. మనకిప్పుడు వేదసూక్త... చున్న, భావమును, ప్రళయాత్పూర్వమందలి ... లేక, యొట్టిభేదములుగలవో ... సిద్ధ్ధయింపవలసిన పనిలేదు. అది ప్రత్యేక ... వ్యాసపతంజలులు చెప్పినట్లు వేద ... మనకిప్పుడంతగ పనిలేదు. ... లేదు. ఈసూక్తములందు వివరింప ... మనమిప్పుడు పరిశీలింపవలెను. హిమ ... ప్రళయాత్పూర్వమందు వసించిన తమపూర్వజులనుండి కుల ... తమకు సంక్రమించిన యీపవిత్ర జ్ఞాన ... భద్రపరచి దానిని భావిసంత... పారంపర్యముగ, అవిచ్ఛిన్న

ముగ, ప్రసరింపఁజేయుటకై వైదికఋషులు జ్ఞానసంపదను సూత్రరూపములుగ బొందుపరచి యుంచిరి. ఈ కార్యమును వారు ధర్మ్యమును, పరమపవిత్రమునైన పనిగ భావించుకొనిరి. ఇట్టి ధర్మనిర్వహణమునకుఁబూనిన వారికిగల యోగ్యతనుగాని, సమర్థతనుగాని, మనము శంకింపవలసిన కారణము గన్పట్టదు. వారిధర్మమును సత్యముగ నెఱవేర్చిరనియు మనము గట్టిగ విశ్వసింపవలెను. ఇట్లు విశ్వసింపకపోవుటకును మనకు కారణము గన్పట్టదు. ఇట్టియుపాయములచేతనే అధమపక్షము మిప్పటికి 3, ౪ వేల సంవత్సరములనుండికూడ వేదసూక్తములన్నియు - ఒక్క-స్వరమైనను తప్పకుండ -భద్రపరుపఁబడుచు వచ్చినవి. ఇటీవలివారు చేసిన యీపనిచే ప్రాచీనకాలమందు- అనగ, ధ్రువనిలయమునుగూర్చియు, నక్షత్రమండలి గతిక్రమునుగూర్చియు చెప్పు ప్రాచీనపరంపరలయొక్క భావార్థమింకను పూర్తిగ నెరుగఁబడకయున్న కాలమందే - నానాప్రశ్నజాలగు ఋషీశ్వరులుకూడ చేసియుండిరనుట కింతమాత్రమును సందేహములేదు. ఈసూక్తములు బహిరంగసమావేశములలోను, బహుజనులచే నిండియున్న సమాజములలోను గానమొనర్పబడుచుండెననికూడ మనము తెలిసికొనవలెను. తమప్రాచీనమతమును, ఉపాసనాపద్ధతులను తరతర కర్మకాండను చెడకుండ కాపాడి భద్రపరుపవలెనను గట్టికోరిక ప్రజలలో ప్రతివారికినుండెను. కావున, యీఋషీశ్వరుల ముఖద్వారమునుండి వెడలివచ్చు వాక్యములను వారు బహు

శ్రద్ధాధర్ములలో నాలకించుచుండిరనికూడ మనము తలంప వచ్చును. కావున, ధ్రువనివాసమునాటి ప్రాచీనమతము పరంపరలరూపముగ నుట్టనుదట కొంతకాలమువరకు సక్రమశిక్షణ నొందిన ఋషీశ్వరుల ధారణాశక్తిచే నొంత మాత్రము చెడకుండ సరిగ భద్రపరుపబడెననియు మనము గట్టిగ చెప్పవచ్చును. అటుపిమ్మట నవి అపరిష్కృతమైన ఋక్కులుగ ఋగ్వేదమందు బొందుపరుపబడెను. మృగశీర్ష యుగమందు వీనికి మెరుగుపెట్టుటచే నివి సూక్తము (సు - ఉక్తము) లయ్యెను. పిమ్మట కొంతకాలమున నీసూక్తములు మండలములుగ విభజింపబడెను. కృత్తికాయుగమందీసూక్తములన్నియు సంహితలక్రింద విభజింపబడెను. ఉక్తము మీద యీసూక్తములలో చెప్పబడిన విషయము లన్నియు హిమప్రళయపూర్వమునాటివే యని మనము నిశ్చయముగ చెప్పవచ్చును. ఇందు వివరింపబడిన విషయములు ఋక్కుల యుత్పత్తి యెంతకాలముక్రిందట జరిగెనో మన మూహించుటకు వీలు కలిగియున్నది. వీనియుత్పత్తి కాలగణనము దంతకథాపథము పోయెను. వేదాంతశాస్త్రజ్ఞుల ఋక్కులయు, ఐతిహాసికుల ఋక్కులయు అభిప్రాయము లిట యీ ప్రశ్నవిషయమునందలి సిద్ధాంతములవలన విరళముగ గాన్పించగలవు :-

వేదాంత మతము.

(౧) వేదములు నిత్యములు; వానికి ఆదిలేదు (అనాది); అవి అపౌరుషేయములు (అనగ, మానవులచే నిర్మింపబడలేదు)

(౨) క్రిందటి కల్పాంతమందు తటస్థించిన ప్రళయములో వేదములు నశించెను.

(3) ప్రస్తుతకల్పాదియందు ఋషీశ్వరులు భగవదనుగ్రహముచే తమ ధారణాశక్తియందు పట్టియుంచియున్న ప్రళయాత్పూర్వమునాటి వేదములను—కేవల మాస్వరూపముతోడనే గాకపోయినను వాని సారాంశము నంతను చాలవరకు—తమ తపశ్శక్తిచే పునరుద్ధారణ మొనర్చిరి.

ఐతిహాసిక మతము.

([illegible])

(౧) వైదిక లేక ఆర్యమతము హిమప్రళయమునకు పూర్వమందే ప్రబలియుండెనని ఋజువు చేయగలము. కాని, దాని యొక్క అసలు మూలగ్రంథము మాత్రము కాలగర్భమున నష్టమై పోయెను.

(౨) ఆర్యుల ప్రాచీన ధ్రువనిలయమందు తటస్థించిన క్రిందటి హిమప్రళయముచే ఆర్యమతమును, సభ్యతయు నశించెను.

(3) ప్రళయపూర్వమునాడు నివసించియున్న తమ పూర్వులనుండి నేటివరకు అవిచ్ఛిన్న ధారగ తమకు సంక్రమించుచు వచ్చిన జ్ఞానమును ప్రళయానంతరమందలి ఋషీశ్వరులు వేదసూక్తరూపములుగ గానమొనర్చియుండిరి.

ఈ పై శ్లోకమును పరిశీలించి చూచినచో వేదముల యొక్క నాశనమును గూర్చియు, తత్పునరుద్ధరణమును గూర్చియు, వ్యాసులవారు మహాభారతమందు చెప్పిన వాక్యము కేవలము సత్యమైన చరిత్రాంశముపైననే యాధారపడి యున్నట్లు స్పష్టమగుచున్నది. ప్రస్తుతకల్ప మారంభమై యిప్పటికి నన్నియో వేలసంవత్సరములయ్యెనని పురాణములు చెప్పుచున్నమాట వాస్తవమే. కాని, దీనిలో నాశ్చర్య మేమియు లేదు. ఏలనగ:— క్రిందటి హిమప్రళయము గతించి యిప్పటికి ౮౦ వేల సంవత్సరము లయ్యెనని చెప్పు భూగర్భ శాస్త్రవేత్తలే కొంద రీకాలమందుండగ, పౌరాణికులు చేసిన విపరీతఅంచనాలను చూచి మనమంతగ ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఇంకొకవిశేషమేమనగ:— కృత, త్రేతా, ద్వాపర కలియుగములు కలిసి మొత్తము పదివేల సంవత్సరము లనియు, క్రిందటి ప్రళయానంతర మారంభమైన నూతన కల్పములోదనే (అనగ, భూగర్భశాస్త్రరీత్యా హిమప్రళయా నంతరమే) కృతయుగ మారంభమయ్యెననియు తెల్పు సత్య మగు చరిత్రాంశ మొకటి ప్రాచీనకర్ణాకర్ణిరూపముగ నీ పురాణములందే స్పష్టముగ గన్పట్టుచున్నది. కావున, యిక వల పౌరాణికులు చేసిన విపరీతఅంచనాలను మనమంతగ పాటించి ఆశ్చర్యపడవలసిన యావసరము లేదు. పరిశోధకుల కును వేదాంతులకును వేదముల యనాదిత్వవిషయమున భేద మేమున్నదని చెప్పవచ్చును. వేదమతములకును, ఉపాసనా

పద్ధతులకును అసలు "ఆది" యనునదియే లేదని చెప్పుట భౌతికశాస్త్రరీత్యా ఐతిహాసికదృష్టితో అసంభవము. కాని, మనమింతవరకుమాత్రము చెప్పవచ్చును. ఏమనగ, వీనియొక్క-మూలము కాలగర్భమందంతర్థానమై పోయెనని చెప్పవచ్చును. లేదా, ఆర్యమానవుడు, ఆర్యభాష, యెంతకాలము క్రిందట పుట్టెనో ఆర్యమతముకూడ నంతకాలముక్రిందటనే పుట్టెనని చెప్పవచ్చును. వేదముల యనాదిత్వమును గూర్చిన తమ యభిప్రాయమునకు బలము నిచ్చుచున్న యీ భౌతికశాస్త్రప్రమాణములతో వేదాంతులు తృప్తినొందకపోయిన యెడల యీ భౌతిక వేదాంత మతముల రెంటికిని సంధి కుదురజాలదు. వీనియందవలంబింపబడు పరిశీలనాపద్ధతులు భిన్నములుగనుంటచే, యీ రెండును రెండు ప్రత్యేకమతములుగనే నిలిచిపోవలసివచ్చును. యీ కారణముచేతనే నేను పైన యీ రెంటిని రెండు ప్రత్యేకశాఖలుగ విడదీసి కోష్టకరూపమున ప్రదర్శించియుంటిని. ఈజగత్తంతయు ఆకాశమునుండియే (లేక "డిస్సార్గానిగస్" నుండియు) పుట్టెనా యను సంశయము ఐతిహాసిక దృష్టియందు నశించజాలదు. కావున, యీయంశముపై యాధారపడియున్న సిద్ధాంతములను మనమిట చర్చింపజాలము. అయినను, కేవల భౌతికశాస్త్ర దృష్టితో జూచినప్పటికిని వేదమతమునకాదియనునది యున్నట్లొప్పుటను గానవచ్చుట లేదని మనము సత్యాధారముగ చెప్పుకొనవచ్చును.

కావున గాన మొదట నున్న సూక్తములలోని మాటలు తమ స్వంతమాటలే యనుట యందలి విషయములు మాత్రము బహు పురాతనమైనవని — [illegible] వైదిక ఋషులకు పూర్తిగ తెలియును. ఋగ్వేదసూక్తములను మనము జాగ్రతగా పరిశీలించిచూచినచో, ఋగ్వేదకాలమున వైదిక ఋషులకే పూర్తిగ తెలియునని స్పష్టముగా గలదు. పైన మన మిదివరకు రెండుతరగతుల సూక్తములను వివరించితిమి. ఆయా ఋషులపేరులనున్న సూక్తముల నాయా ఋషులు — [illegible] చేసినట్లు — చేసిరి, స్తుతించిరి, [illegible], అని స్పష్టముగ చెప్పుడి సూక్తము లొకతరగతి క్రిందికివచ్చును. మరియు, యీసూక్తములు దేవతలచే "ప్రసంగింపబడినవి" "ప్రేరేపింపబడినవి," "స్ఫురింపబడినవి" అని ఋషి స్పష్టముగనే చెప్పిన సూక్తములు రెండవతరగతి క్రిందికి వచ్చును. ఈ రెండుతరగతుల యభిప్రాయములను సమన్వయించుటకై శాస్త్రజ్ఞులు ముఖ్యముగా రెండు యుపాయములను చెప్పిరి. ఏమనగ;— (౧) [illegible] యభిప్రాయభేదము [illegible]. (౨) లేదా, యీ రెండభిప్రాయముల [illegible] చెప్పినచో, [illegible] మొదటి యభిప్రాయము తన మనస్సునకు గల్గిన [illegible] యా యభిప్రాయమును చెప్పుట [illegible]. (౩) లేక, ఈశ్వరప్రేరణ [illegible] వైదిక ఋషులకు స్పష్టముగ తెలిసియుండెనని చెప్పవచ్చును; [illegible]

తమ రచన కీశ్వరప్రేరణయున్నదని వారికి తెలిసినప్పటికి, అంత మాత్రముచే నా సూక్తములు తముచే రచింపబడినవి కాకుండ పోవని వారు తలంచియుండవలెను. సారాంశ మేమనగా:— ఈసూక్తరచనయందు పురుషయత్నముతో పాటు దైవప్రేరణ కూడ నుండియుండవచ్చుననియు, దీనియందసంగతమేమియు లేదనియు డాక్టరు మ్యూయిరు గారి యభిప్రాయము. కాని, డాక్టరు మ్యూయిరుగారు చెప్పిన యీ పైసమాధాన మంత దృఢముగ గన్పట్టుటలేదు; ఇది యంత తృప్తికరముగ లేదు. పరస్పరవిరుద్ధములుగ గన్పట్టుచున్న యీయుభయుల యభిప్రాయ ములకు యింతకంటె సంతృప్తికరమైన సమాధాన మింకొకటి గానవచ్చుచున్నది. ఎట్లనగా:— సూక్తముల స్వరూపమును అనగ భావను, శబ్దజాలమును, ఒక తరగతిగ భావింపుము; మరియు ఆ సూక్తములందలి విషయములను, లేక సారాంశ ములను మరియొక తరగతిగ భావింపుము. ఇట్లీ రెంటిని రెండు తరగతులుగ విభజించి చూచినచో అందు మొదటి తరగతియైన "శబ్దజాలము" మానవనిర్మితమైనదిగ భావింపబడెను; రెండవ తరగతియైన "సారాంశము" బహుపురాతనమైనదిగను, మానవాతీతమైనదిగను (అ-పౌరుషేయమైనదిగను) వైదిక ఋషులచే భావింపబడెనని మనము నిర్ణయింపవచ్చును. వైదిక ఋషులు తమకు పూర్వకాలమందున్న పురాతన ఋషీశ్వరు లను (పూర్వే ఋషయః) గూర్చియు, పురాతనసూక్తములను గూర్చియు ప్రశంసించు వాక్యము లనేకములు ఋగ్వేదమందు

[illegible] [I, 1, 2; VI, 44, 13; VII, 29, 4;
[illegible], 40, 121; X, 14, 15, Etc.] [illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible] [VI, 22,
[illegible]2, 4; X, 91,13; Etc.] [illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]

పెద్దలచే విన్నవానినే తామిప్పు డీసూక్తములలోని కీర్తించుచున్నామనియు భావము. ఉదాహరణము:— ఋగ్వేదము, I వ మండలము, 32 వ సూక్తము, మొదటిఋక్కును ప్రారంభించుచు ఆఋషి యేమిచెప్పుచున్నాడు ? "ఆదికాలమందు (ప్రథమాని) యింద్రుఁడొనర్చిన మహాకార్యములను గూర్చి నేనిప్పుడు గానమొనర్పఁబోవుచున్నాను" అని స్పష్టముగ ప్రారంభమందే యాఋషి చెప్పుచున్నాడు. ఇంద్రుఁడొనర్చిన మహాకార్యములకు "పూర్వ్యాణి" "పూర్వ్యా"— యను విశేషణములు ప్రయోగింపఁబడియున్నవి. (I, 11, 3; I, 61, 13) ఇదేరీతిగ అశ్వినులొనర్చిన కార్యములుకూడ "పూర్వ్యాణి" యని I, 117, 25 లో చెప్పఁబడియున్నది. అశ్వినులొనర్చిన మహాకార్యములయొక్క పెద్దజాబితా యొకటి యీసూక్తమందు గానవచ్చుచున్నది. దీనిబట్టి చూడఁగ, ఆఋషి తనకు పారంపర్యముగ తెలియవచ్చిన మహాకార్యముల నన్నింటిని సంక్షేపముగ నొకచోట వివరించుచున్నట్లు గన్పట్టుచున్నదే గాని, కేవలము తానో లేక తన తాతతండ్రులో బహుకొలఁదికాలముక్రిందట కన్నారఁ జూచిన వానిని వర్ణించుచున్నట్లు గన్పట్టదు. ఈయభిప్రాయమును బలపరుచుట కింకొక నిదర్శనముగలదు. ఋగ్వేదమందు పేర్కొనఁబడిన అంగిరస, వశిష్ఠాది ప్రాచీన ఋషీశ్వరులకు మానవాతీతశక్తి గలదనియు (VII, 33, 7-13), వారు దేవతలతో కలసిమెలసి సంచరించుచు వారితోపాటు సోముగ

సుఖించుచుండిరనియు (దేవానాం సధమాదః VII, 76, 4) వైదికఋషులు నమ్మిరి. వారు భవిష్యత్సంతతులవారికి మొట్టమొదటి మార్గదర్శకులట (పథికృత్ X, 14, 15) బహుకాలదికాలముక్రిందటనే గతించిన తమ తాతతండ్రుల కిట్టి దేవలోకసుఖముల నొసగును అంటగట్టిరి. కావున, యిట్టి దేవలోకసుఖముల నంటగట్టదగినవారు వైదికఋషులకు బహు ప్రాచీనకాలమునాటి వారై యుండవలెను. కావున వేదమందు పేర్కొనబడిన ప్రాచీనఋషీశ్వరులు హిమప్రళయాపూర్వమందు ఉత్తరధ్రువమండలములో ౯, ౧౦, మాసములలో తమ యాజ్ఞికసత్రములను ముగించిన "నః పూర్వే పితరః" — "మనపూర్వపితరు" లై యుండవలెను. ఈ ప్రాచీన ఋషీశ్వరులనుగూర్చి చెప్పిన సమాధానమే వేదసూక్తములందలి ప్రాచీన దేవతలకుకూడ వర్తించును. అదితిగాథ పూర్వయుగమునాటి (పూర్వ్యం యుగం) గాథయని వేదమే స్పష్టముగ చెప్పుచున్నది. ఈయంశమును మనమిది వరకే చూచియున్నాము. ఇంద్రుడు అశ్వినులు మొదలుగాగల దేవతలనుగూర్చిన గాథలన్నియుకూడ నట్టివిగ పూర్వయుగమునాటివే యని చెప్పవచ్చును. ఏలనగా: వీరు చేసిన మహాకార్యములన్నియు "పూర్వ్యాణి" "ప్రథమాని" యని ఋగ్వేదమే స్పష్టముగ వర్ణించుచున్నది. వేదములు, ఋగ్వేదమందు పేర్కొనబడిన ప్రాచీనసూక్తములు, ప్రాచీన ఋషీశ్వరులు, ప్రాచీన దేవతలు—వీరందరు—హిమా

ప్రళయమునకు పూర్వమునాటివారేగాని యిటీవలివారుగారు. ఇదిగాక, యిట్లయిననే గాని, లేనిచో, యీదేవతలకున్న ధ్రువలక్షణములను సమర్థించుట కసలు వీలేయుండదు. వైదిక ఋషులు క్రొత్తసూక్తములను రచించియుండవచ్చును; కాని, వీరీక్రొత్తసూక్తములలో నేవిషయములనుగూర్చి వర్ణించిరి? వీరేమైన క్రొత్తవిషయములను సృష్టించి వ్రాసిరా? లేక తమ తాతతండ్రులనాటినుండి పారంపర్యముగ వచ్చుచున్న ప్రాతయంశములనే యీక్రొత్తసూక్తములలోని కెక్కించిరా? తామీసూక్తములలో వర్ణించు దేవతలు ప్రాతవారనియు, తాము వారికి కల్పించు యీసూక్తములు మాత్రము క్రొత్తవనియు ఋ VI, 62, 4– స్పష్టముగ విడదీసి చెప్పుచున్నది. మరియు, వారీప్రాతదేవతలను ధ్రువలక్షణములతో నలంకరించి వర్ణించిరి. కావున, మనమిక సందేహింపవలసిన పనిలేదు. సూక్తములలోని శబ్దజాలము క్రొత్తదగునుగాని అందలి విషయములు మాత్రము ప్రాతవి—అనగా, బహుపురాతనకాలమునుండి తమకు పారంపర్యముగ సంక్రమించుచు వచ్చినవి—అని తాత్పర్యము. దేవతల పుట్టుకనుగూర్చి స్తుతించుచు X, 72, 1, 2–లో ఆ ఋషి యిట్లు ప్రారంభించుచున్నాడు:– "దేవతల పుట్టుకనుగూర్చి సూక్తపఠనములతో మనము యీ యుత్తరయుగములో వానిని చూడగలిగిన వార మెవరమైనను సరే స్తుతింతుముగాక ...... (యః పశ్యాత్ ఉత్తరే యుగే)" ఇచ్చట మన కొకవైపున దేవతలపుట్టుకయు, రెండవవైపున

ఆ స్తోత్రయుగమందు సూక్తములను రచించిన ఋషియు— గాన్పించుచున్నాడు. ఇవి రెండును రెండు భిన్నవిషయములు. ఎట్లన, వేదసూక్తములందు చెప్పబడిన విషయము (దేవతల స్తుతి) ప్రాతది, పూర్వకాలమునాటిది — కాని, ఆ ప్రాత విషయమును ఆ స్తోత్రయుగమందున్న ఋషి తనకు గాన్పించిన రీతిగ స్తుతించుచున్నాడు. వైదిక ఋషులు వేదసూక్తములను— కాని, ఆ దలి విషయములను—మాదిరిగాని చేయలేదను వారి ప్రవాక్యము చాల బలము నిచ్చుచున్నది. ఇట్టి వాక్యమే ఋగ్వేదమున ఋ VIII, 59, 6 లో గలదు. ఇంద్రావరుణా యదృషిభ్యో మనీషాం వాచో మతిం శ్రుతమదత్తమగ్రే। యాని స్థానాన్యసృజంత ధీరా యజ్ఞం తన్వానాస్తపసాభ్యపశ్యమ్॥ "ఓ ఇంద్రవరుణులారా! మీరు పూర్వము ఋషులకిచ్చిన మనీషా, వాచో, మతి, శ్రుతమ్, యజ్ఞాంగాల ననుసరించి ఋషులు సృజించిన స్థానములను—వీని నన్నిటిని నేను తపస్సుచే చూచుచుంటిని [అభ్యపశ్యమ్] వేదసూక్తములందు వివరింపబడిన విషయములు వైదిక ఋషులచే చూడబడినను భావము వ్యాసులవారు మహాభారతవాక్యమందు వ్యక్తపరచి యున్నరీతిగనే ఇచ్చట ఈ ఋగ్వేదవాక్యమందు కూడ వ్యక్తపరచబడియున్నది. ఇట్టి ప్రత్యక్ష వాక్యములు మనకున్నప్పుడు వేదసూక్తములు పౌరుషేయములా అపౌరుషేయములా యను సమస్యను పరిష్కరించుట కొంత సులభముగను ఉండును.

[illegible]:— [illegible] ఋషులు [illegible] సూక్తములు [illegible],

వేదసూక్తములలోని శబ్దజాలము పౌరుషేయము; అందలి విషయములు మాత్రము అపౌరుషేయములు — అని విడదీసి నిర్ణయింపవచ్చును. డాక్టరు మ్యూయరుగా రింకొక వేదవాక్యమును (VIII, 95, 4-5) నుదహరించిరి. ఆ ఋషి "ఇంద్రుని కొరకై సరి క్రొత్తయైనట్టియు, ఉల్లాసకరమైనట్టియు, నొక సూక్తమును (నవీయసీం మంద్రాం గిరం) పుట్టించెను (అజీజనత్). ఇది యొకసూక్ష్మబుద్ధినుండి యుద్భవించెను. ఇది యొకపురాతనమగు ధీశక్తియుక్త ఫలితము (ధియం ప్రత్నాం). ఇది పరమపావనమగు సత్యముతో నిండియున్నది". ఈసూక్తమిచ్చట ప్రాతదనియు, క్రొత్తదనియునుండ — యేకకాలమందే వర్ణింపబడియున్నది. ఈవాక్యమందు "గిర్"(=శబ్దము), "ధీ" (=బుద్ధి) కంటె భిన్నమైనదిగ చెప్పబడినది. అనగ, ప్రాత తలంపొకటి (ప్రత్నాధీః) క్రొత్తశబ్దములతో (నవీయసీ గీః) వర్ణింపబడెనని స్పష్టమగుచున్నది. అనగ ఋక్సూక్తము విషయములో ప్రాతది; శబ్దములలో క్రొత్తది. ఈ సారాంశమునే మన మిదివర కింకొక విధముగ తెల్పియున్నాము. ఈ సందర్భమం దింకొక యంశము నిట చేర్చుట మంచిది. బ్రాహ్మణ గ్రంథములలోని విషయముల నన్నిటిని మన వేదాంతు లనేక శీర్షికల క్రింద విభజించిరి. వానిలో నొకదానికి "పురా-కల్ప" యని పేరిడిరి. ఈ శీర్షికక్రింద ప్రాచీనకాలమందలి కర్మలును, పరంపరలును, చేర్చబడినవి. అనగ, బ్రాహ్మణ గ్రంథములలో కూడ ప్రళయపూర్వమునాటి గాథలును, పరంపర

లును నున్నట్లు మన వేదాంతులు తలంచిరని దీనివలన స్పష్ట ముగ తెలియుచున్నది. "పూర్వ యుగమందు యాజ్ఞికులు ఉషఃకాలము పూర్తిగ వికసించి సూర్యబింబము పైకిరాదేమో యని భయపడి" నట్లు తైత్తిరీయ సంహిత చెప్పుచున్నది. సాయనాచార్యులవారీ వాక్యమును "పురాకల్ప" శీర్షిక క్రిందికివచ్చు వంశములలో నొకటిగ నుదాహరించి యుండిరి. ఈ బ్రాహ్మణ వాక్యము ఉత్తరధ్రువమందలి మొదటి దీర్ఘ యుషస్సునే సూచించుచున్నదని మన మిదివరకు విశదీకరించి యుంటిమి. కావున దీనిని సంస్కారమొందిన మనుష్యులు తప్పక హిమప్రళయాత్పూర్వమునాటివారై యుండవలెను. ఇటీవల పుట్టిన బ్రాహ్మణములందే యిట్టి ప్రాచీన పరంపర యున్నప్పుడు ఋగ్వేదములందెట్టి పరంపర యుండుట కాశ్చర్యమేమున్నది! ఈరీతిగ మన మీదృష్టితో, యీవైపునుండి చూచినను మన కొకటే సారాంశము ఖండితముగ తేలుచున్నది:— వేదసూక్తములలోని విషయము బహుపురాతనమును, హిమప్రళయాత్పూర్వమునాటిదియు నై యున్నది. ఆవిషయము అప్పటినుండి అవిచ్ఛిన్నధారగ, పారంపర్యముగ వచ్చివచ్చి తుదకు ప్రళయానంతరయుగమందు వైదిక ఋషులచే వేదసూక్తములలో పొందుపరచబడెను.

ధ్రువసిద్ధాంతమునే యుక్తియుక్తమగునని, సహేతుకముగను, అపూర్వరీతిగను నిరూపించుటకై కావ్యయుగమునవిశదీకరింపబడిన యంశము లింక నిప్పుడు వేదభాష్యమందును

వైదిక పౌరాణికగాథలందును గలవు. ఉదాహరణము :— పాశ్చాత్య పండితులు మొట్టమొదట మన వేదములను చూచినప్పుడు తమకు వానియందు ఆర్యసభ్యతయును, పురాణాలు గన్పట్టవచ్చునని — పాపము! — వారెంతయో ముచ్చటపడిరి. ప్రకృతిశక్తుల యనంత లీలలను, తచ్చమత్కారములను, ఆర్యులు మొట్టమొదట భక్తిభయాక్రాంతులై కన్నులార వీక్షించి వానిని దేవతాస్వరూపములుగ నెంచుకొని, తమ మనఃకోశములను విప్పి యేరీతిగ వానిపై తమ స్తోత్రపాఠములను కురిపించిరో తెలిసికొందమని పాశ్చాత్య పండితు లెంతయో యుబ్బురపడిరి. కాని, — పాపము! — వారి కాశాభంగమయ్యెను. వారి కిట్లుల యాశాభంగమయ్యెనో మన మిప్పు డతిసులభముగ గ్రహింపవచ్చును. మన ధ్రువ సిద్ధాంతము వలన తేలిన సారాంశమేమనగ :— ఆర్యులకు వేదములే యతిప్రాచీన గ్రంథములు; వీనికంటె పురాతన గ్రంథములు గానరావు. అయినను, వానియందు వర్ణింపబడిన నాగరికతయు, దేవతాపూజనములును, తదితర విషయములును, యీ గ్రంథములను రచించిన ఋషులు క్రొత్తగ సృజింపలేదు. ఈ విషయము లన్నియు వారికి హిమప్రళయా త్పూర్వమందు నివసించిన తమ పూర్వజులనుండియే పారంపర్యముగ లభించినవి. తమ కిట్లు పారంపర్యముగ లభించినవానిని యీ ఋషులు సూక్తములుగ రచించి, భావిసంతతుల ప్రయోజనార్థమై శిథిలము

గాకుండ భద్రపరచిరి. కనుక, అసలు ఆర్యసభ్యతయొక్క-
పునాదులను కనిపెట్టదలచిన వారు యీ వేదములను చూచిన
ప్రయోజనము లేదు. ఇంక నంతకంటెను వెనుకకు పోవలెను;
అనగ, హిమప్రళయమును గడచి వెనుకకు బహుదూరము
పోయి, ప్రాచీనార్యులు తమ మూలస్థానమైన ధ్రువనిలయ
మందున్నట్లు సంచరించుచుండిరో చూడవలెను. కాని మన దుర
దృష్టవశమున, యీ ధ్రువనిలయమం దా కాలమున వారెంతటి
నాగరికతను సంపాదించిరో తెలిసికొనుటకు మన కాధారము
లేమియు గన్పట్టుట లేదు. అయినను, హిమప్రళయాత్పూర్వము
నాటి ఆర్యసభ్యత సాధారణముగ మన మిదివరకు కనుగొన్న
దానికంటె చాల యున్నతమైనదేయని మన మీయధ్యాయ
మందు వివరించియుంటిమి. సభ్యతయుండేమి, నాగరికతయుం
డేమి మనప్రాచీనార్యులు ఇతిహాసపూర్వకాలమందు నివసించిన
ఐగుప్తీయుల కంటె యేమాత్రమును తీసిపోరు. కావున, మనప్రాచీ
నార్యులకు ఐగుప్తీయులతోపాటు సమానస్థానము నొసంగక
పోవుటకు కారణము గన్పట్టదు. ఆర్యులు ఉత్తరధ్రువమును
విడిచి, నూతననివాసస్థానములను వెదకికొనుచు భూమధ్యరేఖ
వరకు—యింక క్రిందికూడ — వచ్చియుండిరి. వీరికి మధ్య
త్రోవలో ననేక యనార్యజాతులతో సంపర్కము గలిగెను.
ఈ యనార్యజాతులతో వీరనేక యుద్ధములు చేసి జయించిరి.
కొన్నిజాతులను వీరు పూర్తిగ రూపుమాపిరి. మరి కొందరిని
తమలో కలుపుకొనిరి. ఈ యనార్యజాతులపై మన యార్య

జాతి యిట్లు సర్వవిధముల యాధిపత్యమును వహించెను. దీనిని బట్టి ఆర్యజాతి చాల వీర్యవంతమైనదని తప్పక తెలియుచున్నది. ఇట్లు స్పష్టముగ ప్రదర్శితమగుచున్న ఆర్యజాతియొక్క యాధిక్యమును, వీర్యమును, సమర్థించు టెట్లు? ధ్రువమండలమందు నివసించిన ప్రాచీనార్యజాతి మిక్కిలి మహోన్నత నాగరికత యందున్ననే గాని యిట్టి వీర్యవంతములగు కార్యము లొనర్చి యుండజాలదు. మరియు, మన ధ్రువసిద్ధాంతముచే క్రొత్తగ ప్రసరింపుచున్న నూతనవిజ్ఞానము నాధారముగ చేసికొని, వేదములను మరియొకపర్యాయము విపులముగ పరిశీలన చేసి చూచినచో, యీ పైయభిప్రాయమును బలపరుచు విశేషాంశములింకను మన కెక్కువగ లభింపగలవు. కాని, యివన్నియు మనకిప్పుడు కానరాక మరుగుపడియున్నవి. కారణమేమనగ:— హిమప్రళయమునకు పూర్వముత్తరధ్రువమండలమం దున్న వైదికఋషులపూర్వజు లెట్టి సాంఘిక, భౌతిక, పరిస్థితులలో నివసించియుండిరో సంపూర్ణముగ తెలిసికొనుట కిప్పుడవకాశములు లేమిచే మనకనేకాంశములింకను పైకిరాక మరుగుపడియేయున్నవి. అధునిక భౌతికశాస్త్రజ్ఞు లిప్పుడు ఉత్తరధ్రువమండలమునకుపోయి, దానినంతను విపులముగ పరిశోధన చేసి చూచుచున్నారు. ఈపరిశోధనవలన మనకిక ముందు ఆర్యసభ్యతయొక్క పునాదులను కనిపెట్టుట కవకాశములు దొరకవచ్చును. కాని, యీపనికి మనమిప్పుడు పూనజాలము. దీనిని భవిష్యత్పరిశోధకులకే వదలివేయవలెను. కాని, దీనికి

[illegible], [illegible] శాస్త్ర [illegible] సిద్ధాంతము [illegible] [illegible] [illegible] సార్వసాధారణముగ [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible], [illegible] [illegible] [illegible] [illegible]. ప్రస్తుత [illegible] [illegible] [illegible] [illegible]:— [illegible]. [illegible], [illegible], [illegible], [illegible] [illegible] [illegible] శాస్త్రము [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]

మును తెలిసికొనక మానరు. వేదముల, ధ్రువనిలయప్రతిపాదనకై వేదమందు దేనిని ప్రమాణములుగ దొరకునేమో చూతమనుతలంపు అసలు మొట్టమొదట మనస్సునకు కలుగజేసిన దీర్ఘాధునిక భౌతికశాస్త్రపరిశోధనలే యని చెప్పవచ్చును. ఈ సిద్ధాంతప్రతిపాదనకై మన మీగ్రంథమునం దవలంబించిన పద్ధతి కేవలము నియమబద్ధముగనే యున్నదిగాని యొంతమాత్రమును వదులుగ లేదు. మొట్టమొదట భారత నైరుక్తులు వేదభాష్యమును వ్రాయుపద్ధతిని స్థాపించి యున్నట్టి కొన్నిరూఢశబ్దములు గలిగించినవి. కాని, యింతకాలము నుండియు వేదములందు ధ్రువనిలయచిహ్నము లెవరికిని గాన్పించియుండకపోవుట బహుశః వీనిచేతనని స్పష్టమగును. అయినను, యిట్టి విషయములలో నెవరు నాశ్చర్యపడవలసిన పనిలేదు. ఏలననగ, జ్ఞానతేజస్సు విరివిగ ప్రసరించుచున్న కొలది కేవల నియమబద్ధముగ నొనర్పబడు పరిశోధనలచే ననేకములగు నూతనాంశములు బయలుపడుచుండును. వానిని జూచి మనము ఆశ్చర్యపడనక్కరలేదు. నియమబద్ధములగు పద్ధతులచే వెలువరింపబడిన యిట్టి నూతనాంశములను మన మంగీకరించుటకు సదా సంసిద్ధులమై యుండవలెను. శాస్త్రపరిశోధకుల కందరకును మాన్యములైన యిట్టి నియమముల నాధారముగ గైకొనియే మే మీగ్రంథమందు మా ధ్రువసిద్ధాంతమును స్థాపింప యత్నించితిమి. ఈనియమములను ప్రమాణముగ గైకొని మే మీగ్రంథమందు తెల్పిన సారాంశ

ములయొక్క బలము నెవ్వరైనను పరీక్షింపవచ్చును. ఇంత కాలమునుండియు పండితులచే దుర్గ్రాహ్యములుగ నెంచబడి వదలి వేయబడినట్టియు, అప్రాముఖ్యములైనవని త్రోసివేయ బడినట్టియు, అపార్థముల గల్పింపబడినట్టియు, పెక్కు వేద వాక్యములనేమి, గాథలనేమి, సరళముగ సమన్వయింప సామర్థ్యమునిచ్చు సత్యమైన కీలకమును ఈ గ్రంథమందు కనుగొనన గలిగితిమని పాఠకులు గ్రహింపగలరు. ప్రకారము నా [illegible] ముల ప్రవర్తమాన మైయున్న యీ దినములలో ప్రాచీన మానవసభ్యతను స్థాపించుటకై యజ్ఞాదికర్మముల కొరకుగా జరుగుచున్న యీ కాలములో వేదవాక్య [illegible] గలదా? సదా వేదములయొక్క [illegible], [illegible] మాత్రమే [illegible] దొరకబడి యుండినగలదా? ఆర్యులకు ప్రాచీనతమములైన గ్రంథము లందు ధర్మమనబడియున్న ప్రాచీనపరంపరలను, ఇప్పటి కాలపు శాస్త్రముల యొక్క ఫలితములతో సమన్వయించుటకై మీ గ్రంథమందు చేసిన ప్రయత్నము దేశకాలపరిస్థితుల ననుసరించియే యున్నదిగాని వేరుగ లేదు. కనుక, మీ రీవిష యములో దేశకాలపరిస్థితుల ననుసరించియు పోయిరిగాని అందుకు భిన్నముగ వర్తింపలేదు. ఇట్టి గ్రంథములను మన ప్రాచీన లక్ష్యాల ధర్మశ్రద్ధలతో పూరింపుమని కోరుదుము

యొంతయు సమంజసముగనే యున్నది. కావున నీ [illegible] పూర్ణ
నియాగ్రంథములుగ పరిగణింపబడినవే యనుటకు సందేహ
మేమియు లేదు. మన పూర్వు[illegible] [illegible] గదా
కొన్ని యనివార్యములగు [illegible] [illegible] [illegible]
లక్ష్యమొసర్పగ ఈ పూర్వ[illegible]గ్రంథములను [illegible] [illegible]
దలంచెదను, [illegible] [illegible] [illegible] [illegible]
కొనుచున్నది.

సర్వము సంపూర్ణము

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

శ్రీ [illegible] [illegible]

బ్రహ్మార్పణ మస్తు.

చంద్రికా ముద్రాక్షరశాల, గుంటూరు.

తయారగుచున్న గ్రంథములు:—



౧. ఆంధ్ర సామ్రాజ్యము,
(నడింపల్లి జగన్నాథరావుగారు)

౨. అళియ రామరాయలు,
(భావరాజు వేంకట కృష్ణారావుగారు, బి. ఏ., బి. ఎల్.)

3. లక్ష్మణరాయ వ్యాసావళి,
(ప్రకీర్ణభాగము)

౪. శ్రీభాగవతము,
(సి. వి. ఎల్. నరసింహారావుగారు, బి. ఏ., ఎల్. టి.)

౫. "గారిబాల్డి" మహాశయుని చరిత్రము.
(మాడపాటి హనుమంతరావుగారు.)

౬. అమరావతి స్తూపము,
([illegible] వేంకటేశ్వరరావుగారు, బి. ఏ., ఎల్. టి.)

౭. విద్యార్థి.
(కె. లక్ష్మణరావుగారు, ఎం. ఏ., [illegible])

౮. మహారాష్ట్రోద్యమము.
(వేమవరపు రామదాసుగారు, బి. ఏ., బి. ఎల్.)

౯. ఐర్లాండు చరిత్ర,
(రావు [illegible] రావుగారు, బార్. ఎట్. [illegible])

౧౦. భాషాశాస్త్రము (Phylology)
(చిలుకూరి నారాయణరావుగారు, బి. ఏ., ఎల్. టి.)